# ప్రస్థానం

అక్టోబరు-డిసెంబర్
2003

సమగ్ర సాహిత్యపత్రిక

వెల: రు. 15/-






సాహితీ స్రవంతి

ప్రస్థానం
అక్టోబర్-డిసెంబర్ 2003
సమగ్ర సాహిత్యపత్రిక

సంపుటి :2 సంచిక : 1

# ప్రయత్నాలు, ప్రభావాలు

ప్రస్థానం ద్వితీయ సంవత్సరంలో ప్రథమ సంచిక. ముగిసి పోయే 2003 సంవత్సరంలో ఇదే ఆఖరి సంచిక కూడా. అందుకే ఈ సంచికను అదనపు పేజీలతో, ఎక్కువ సమాచారంతో తీసుకురావడానికి ప్రయత్నించాము. విశాల ప్రాతిపదికన సాహిత్య సృజనను, చర్చను ప్రోత్సహించడమే ప్రస్థానం లక్ష్యమని అనేకసార్లు పేర్కొన్నాము. సమకాలీన సాహిత్య చర్చ, సృజన అంటే నిర్దిష్ట రచనల చుట్టూ తిరగకతప్పదు. అందుకే ఈ ప్రత్యేక సంచికలో ఎక్కువ కథలు, కవితలు, పుస్తక పరిశీలనలు వున్నాయి.వేరు వేరు శీర్షికలలో వేరు వేరు పద్ధతులలో జరిగినా వీటన్నిటి పరమార్థం మాత్రం ఇప్పటి సాహిత్య ధోరణులను పరామర్శించడమే. అందుబాటు రీత్యానూ, ఆర్థిక కారణాల రీత్యానూ, కూడా అందరూ అన్నీ చూసే అవకాశం వుండదు కనక ఈ ప్రయత్నం ఉపయోగపడుతుందని ఆశించవచ్చు.

ఇందులోని రచనలలో అడిగి తెప్పించుకున్నవి, వెంటపడి రాయించినవి దాదాపు లేవు. అనుభవజ్ఞులు, అధ్యయన శీలుల ఆలోచనలకు చోటు కల్పించడం తప్ప ఏవీ నిర్దేశిత రచనలు కావు. విషయ వైవిధ్యమే ఆ సంగతి స్పష్టం చేస్తున్నా బాధ్యతగా చెబుతున్న మాట ఇది. కావాలని కొత్తవారి కథలకు చోటు కల్పించాం.

గత చరిత్రకు సంబంధించిన అంశాలను లేదా కొటేషన్లను, కొన్ని ఘట్టాలను ఇస్తే ఆకర్షణగా, ఆసక్తిగా వుంటుందనే మాట నిజమే అయినా స్వచ్ఛందంగా వస్తున్న నూతన రచనలకు చోటు కల్పించే ప్రయత్నంలో అది సాధ్యం కావడం లేదు. అలాగే వాగ్దానం చేసిన మరికొన్ని అంశాలు కూడా మిగిలేవున్నాయి.నూతన సంవత్సరంలో వాటిని ప్రవేశపెట్టగలమని ఆశిస్తున్నాం.

మనకు దూరమైన ప్రగతిశీల రచయితలను, మేధావులను సంస్మరించుకోవడం ప్రస్థానం ప్రారంభం నుంచి పాటిస్తున్న సంప్రదాయం. ఆ రీతిలోనే ఈ సంచికలో సుభాష్ ముఖోపాధ్యాయతో జ్వాలాముఖి ఇంటర్వ్యూ పునర్ముద్రణ వుంది. ఎడ్వర్డ్ సయిద్‌పై ప్రత్యేక వ్యాసం ఆయన కృషికి నివాళి. సంచిక చివరలో ఉండగా కన్నుమూసిన ఇస్మాయిల్‌పైనా వ్యాసాలున్నాయి. ఆయన మృతికి ప్రస్థానం సంతాపం తెల్పుతోంది.

F F F

ఈ కాలంలోనే రాష్ట్రంలో చాలా తీవ్ర పరిణామాలు జరిగాయి. సాహిత్యానికి సమాజానికి వున్న సంబంధాన్ని గుర్తించేవారెవరైనా వీటిని విస్మరించలేరు. అందులో ప్రధానమైంది ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుపై తిరుమలలో జరిగిన హత్యాప్రయత్నం. వ్యక్తిగత హత్యాకాండతో సమాజం ఎప్పుడూ మారదు. లెనిన్ అన్నయ్య జారు చక్రవర్తిపై హత్యాప్రయత్నం చేసిన ఘటనతోసహా ఈ పరమ సత్యం రుజువవుతూనే వుంది. వ్యక్తిగత హత్యలు, హత్యాప్రయత్నాలు ఖండనార్హమైనవి. ఈ ఘటనల తర్వాత చంద్రబాబు నాయుడు అసెంబ్లీని రద్దు చేసి శాసనసభ ఎన్నికలకు తెరలేపారు. మరోవైపున ఈ ఘటన తర్వాత పోలీసులు బూటకపు ఎన్‌కౌంటర్లను తీవ్రం చేశారు. ఈ పేరిట కవులు, రచయితలను కూడా కొన్నిసార్లు పోలీసులు వేధించడాన్ని సాహితీ స్రవంతి

→

సాహితీ స్రవంతి ప్రచురణ

## ఈ సంచికలో...

అభినందనలు-అభిప్రాయాలు ............ 3
ఒంటరి గుడిసె (కథ) ............ 6
'మనది' కాని మన (కవిత) .......... 10
నూతన ఆలోచన జనకథాలోచన ........... 11
కవిత్వంపై ప్రేమతోపాటు పట్టు పెంచుకోవాలి. .......... 12
ఫొటోలు .......... 13
కథలు చదవడం, రాయడం, చర్చించడం ఒక అనుభవం .......... 16
చిత్తడి నేలలు (కవిత) .......... 18
చలివేంద్రం (కథ) .......... 19
నిన్ను నువ్వు వెతుక్కుంటూ (కవిత) .......... 24
కవితావతరణం .......... 25
ప్రతిస్పందనలు .......... 28
ఏది (కవిత) .......... 29
ఎడ్వర్డ్ సయిద్ ఓరియంటలిజం .......... 30
తీర్పు (కథ) .......... 33
అంగారక 'దర్శనం' (కవిత), హైకూలు .......... 36
నేటి తమిళ సాహిత్యంలో వివిధ ధోరణులు .......... 37
చిట్లిన పదాలు .......... 39
విప్లవ కవిత్వం ఒక విమర్శనాత్మక పరిశీలన .......... 40
రజాక్‌మియా సేద్యం (కథ) .......... 44
తలుపుదెగ్గర అమ్మప్రతిముంటది (కవిత) .......... 48
సినిమా .......... 49
కోటి స్వగతాలు పోరాడందే ఉన్నత సమాజం ఆవిర్భవించదు .......... 51
ఎంతదూరం బారజూసినా (కవిత) .......... 54
నిర్మాణవాద భాషాశాస్త్ర అంశాలు .......... 55
జయమాతంగ తనయే (కవిత) .......... 60
ఓ... పాలబుగ్గల చిన్ని రైతా (కథ) .......... 61
కథల్లో 'చెర' .......... 65
కథలంటే లోతుగా చూడటం .......... 68
పాటకు పదును .......... 69
పూలు పూయనీ, మాననీ నేడు నిండు వసంతం .......... 70
విశ్లేషణ .......... 72
తెలుగులో స్త్రీల సాహిత్యం .......... 76
'అనంత' పుత్రుల కరువు కవితా ఘోష .......... 80
బగారా (కథ) .......... 82
సమీక్షా పర్వం .......... 84
చిత్ర చలనం .......... 93
స్వీకారం .......... 94
ఈ చెట్టు నీడన మనసెంత చల్లన .......... 95
అమృతం పంచిన కవి ఇస్మాయిల్ .......... 97
డైరీ .......... 98
చెక్‌పోస్ట్ ........ 100

సంపాదకుడు
**తెలకపల్లి రవి**

ముద్రాపకులు, ప్రచురణకర్త
**వి. కృష్ణయ్య**

మేనేజర్
**కె. లక్ష్మయ్య**

అడ్రస్ :
**ప్రస్థానం**
1-1-187/1/2,
వివేక్‌నగర్, చిక్కడపల్లి,
హైదరాబాద్-500 020
ఫోన్లు : 27660013, 27635136

Untitled-2 1 6/11/2002, 3:51 PM

ఖండిస్తోంది.

F F F

సెప్టెంబరు 21, 22 తేదీలలో హైదరాబాదులో సాహితీస్రవంతి నిర్వహించిన జనసాహిత్యసమ్మేళనం విశేషాలపై చాలా అంశాలున్నాయి. ప్రధాన ప్రసంగాలలో కొన్ని వున్నాయి. మరికొన్ని రానున్న సంచికలో వుంటాయి. అలాగే దానిపై పత్రికలలో వచ్చిన కొన్ని నివేదికలను పొందుపరచాము. ఈ ప్రయత్నాన్ని అందరూ అనేక విధాల హర్షించిన తీరును అవి విదితం చేస్తాయి. వినవచ్చిన ఒక విమర్శను, దానిపై స్రవంతి స్పందనను కూడా ఇచ్చాము. ఏమైనా మిత్రుల మధ్య నివారణీయ వివాదాలు తగవనేదే మా అభిప్రాయం. అందుకు మారుగా ఇలాటి విశాల కార్యక్రమాలు ఇంకా ఎక్కువగా అమలు జరపడానికి ప్రయత్నించాల్సి వుంటుంది. సీనియర్లు, ఔత్సాహికులు అనే తేడాలు, అభిప్రాయాలకు సంబంధించిన వివాదాలు పక్కనబెట్టి ఆరోగ్యకరమైన సాహిత్యాభిరుచి గల మిత్రులు పరస్పరం చర్చించుకోవడానికి సంసిద్ధం కావాలి. ప్రజాస్వామిక విలువలు కోరేవారు సాహిత్యం విషయంలో అలాటి చర్చద్వారా అభిప్రాయాలు పరస్పరం తెలియజేసుకుంటేనే నూతన శక్తులు పెరుగుతాయి. నూతన సృజన జరుగుతుంది. వ్యక్తిగత కోణాల నుంచి సాహిత్య సామాజిక అంశాలను పరిశీలించడం తీరానికి చేర్చదనేది మాత్రం స్పష్టం. సాహితీ స్రవంతి అలాటి పోకడలను ఆదరించదు. ప్రపంచీకరణ, మతోన్మాదం టెర్రరిజంలను వ్యతిరేకించే వారంతా కలసి రావాలని అంటే అయితే కులతత్వాన్ని వ్యతిరేకించనవసరం లేదా అని ఒకరిద్దరు అడిగారు. పై మూల సూత్రాలను చూసిన తర్వాత వారికి ఆ సందేహం రానవసరమే లేదు. అయినా వచ్చింది కనక చెప్పాలంటే, కులతత్వాన్నేకాదు– లింగవివక్షను, అన్ని విధాలైన అసమానతలను, అన్యాయాలను, అమానుషాలను సాహితీస్రవంతి ఖండించి నిలబడుతుందని దాని కార్యక్రమాలే చెబుతాయి. ప్రస్థానంలో వచ్చిన రచనలూ సాక్ష్యమిస్తాయి.

F F F

విశాఖపట్టణంలో పుస్తక ప్రదర్శన ముగిసింది. హైదరాబాదులో ఈ నెలాఖరున జరుగనుంది. విజయవాడలో ఎప్పటిలానే నూతన సంవత్సరం మొదటి తేదీ నుంచి ప్రారంభమవుతుంది. సహజంగానే ఇవన్నీ పుస్తక ప్రియులకు ఆనంద కారణాలు. ఇదిగాక ఇటీవల విశాఖపట్టణంలో కవులు, రచయితలు తమకు తామే సాహిత్య గ్రంథాల ఎగ్జిబిషన్ నిర్వహించుకున్నట్లు వార్తలువచ్చాయి. దానికి స్పందన ఏ మేరకు వున్నదో తెలియదు. రచనలు ప్రచురించుకోవడంతో పాటు జనంలోకి తీసుకెళ్లడానికి, దానిపై చర్చకు ప్రయత్నం జరగాలని ప్రస్థానం తొలిసంచికలోనే సూచించాము. పశ్చిమబెంగాల్‌లోవలె సాహిత్య పుస్తకాలకు ప్రత్యేక ఎగ్జిబిషన్లు జరపాల్సిన అవసరం కూడా వుంది. పెట్టుబడి సమకూర్చలేకపోయినా పుస్తకాలు హేతుబద్ధమైన ఖర్చుతో అచ్చు వేసుకోవడంలోనూ, మార్కెటింగ్ చేసుకోవడంలోనూ రచయితలకు ప్రస్థానం సహకరిస్తుంది. త్వరలో ఈ అంశాలపై రచయితల ఇష్టాగోష్ఠి జరపాలనే ఆలోచన కూడా వుంది. కవులు, రచయితలే కాక చిత్రకారులను, బాల సాహిత్యకారులను, బాలకవులురచయితలను కూడా సమీకరించగలిగితే మరీ మంచిది.

**-తె.ర.**

ముఖ చిత్రం : **పోరాడేందుకు స్వేచ్ఛ**

చిత్రకారుడు : **కెఎస్. రాధాకృష్ణన్**

టైటిల్ డిజైన్ : **కారంకి శ్రీరాం**

లోపలి చిత్రాలు : **ఏలే లక్ష్మణ్, అక్బర్, రమణజీవి, శేఖర్, బి. నరసింగరావు (సౌజన్యం), శ్రీరాం**

## సాహిత్య మిత్రులకు ఎగ్జిబిషన్ ఫోటోలు

జనసాహిత్య సమ్మేళనం ఎగ్జిబిషన్‌లో ప్రదర్శించిన ఫోటోలను సాహితీ స్రవంతి సరఫరా చేస్తుంది. సాధారణంగా అందుబాటులో వుండని అరుదైన ఫోటోలు అది కూడా ఒకే సైజులో రంగులతో లభిస్తాయి. కేవలం సాహిత్య దృష్టితోనే సాహితీ స్రవంతి వీటిని అందరికీ అందించాలని తలపెట్టింది. ఒకో సెట్టు రు.2500 అవుతుంది. సుమారు 100 13"X19" సైజు పోటోలు వుంటాయి. వీటిని ఎవరైనా ఎక్కడైనా దానికదే ఒక ఆకర్షణగా ఏర్పాటు చేసుకోవచ్చు. సాహితీ సంస్థలు, సంఘాలు మాత్రమే కాక విద్యా సంస్థలు, కళా సాంస్కృతిక బృందాలు, మీడియా సంస్థలుస కూడా వీటిని దగ్గర పెట్టుకోవడం చాలా ఉపయోగంగా వుంటుంది. కావలసిన వారు ప్రస్థానం మేనేజర్‌ను సంప్రదించాలి.





Untitled-2 2 6/11/2002, 3:51 PM

## అభి నందనలు ప్రాయాలు

### సంస్కృతి-వక్రీకరణ




"ప్రస్థానం' జులై-సెప్టెంబర్-03 సంచికలో కాలువ మల్లయ్య రాసిన వ్యాసం లాంటి కథ "సంస్కృతి" చదివిన తర్వాత దక్కలి కళారూపం జాంబపురాణాన్ని, వాళ్ళ సంస్కృతిని అధ్యయనం చేసిన నేపథ్యం నుంచి ఇది రాయకుండా ఉండలేకపోతున్నాను.

ఇంతకీ రచయిత ఈ కథ ద్వారా ఏం చెప్పదల్చుకున్నట్లు? దళితులు న్యూనతాభావం విడిచి దళిత సంస్కృతిని ఉన్నతీకరించు కోవాలనే సందేశాన్ని ఇవ్వడం. తీసుకున్న ఇతి వృత్తానికి అనుగుణమైన సమాచార సేకరణ లోపంవల్ల కథకుడిలో ఏర్పడిన అయోమయాన్ని పాఠకుడి మీద రుద్దగలిగాడు. ముఖ్యంగా ఏ మనుషుల గురించి కథ రాయదలుచుకున్నాడో ఆ మనుషులతోగానీ, వారి జీవిత విధానంతో కానీ పరిచయం లేకపోవటం వలన కథలో వాస్తవికత లోపించి కృతకంగా తయారయింది.

కథ చెప్పే క్రమంలో ముందుగా బొందాలు అనే దక్కలోడి పరిచయం. పెంటకుప్పల మీద కుక్కలతో కలియబడి తింటూ, దీనంగా, హీనాతిహీనంగా అడుక్కునే బొందాలు దక్కలోడని రచయితే ఇతర పాత్రల ద్వారా పరిచయం చేస్తారు. రచయిత చెప్పడం దక్కలోడని. కాని నిజానికి ఆ పాత్ర సంభాషణలు, ప్రవర్తన 'మొండివాడు' అనే దళిత ఆశ్రిత కులాలకు చెందినవి. నిజానికి దక్కలోడు మాదిగ ఆశ్రిత కులానికి చెందిన వాడు. దక్కలోడు బిచ్చగాడు కాదు. కళాకారుడు. వాడు తన కళను ప్రదర్శించి కేవలం మాదిగ వాళ్ళ దగ్గరే యాచిస్తాడు. అది అతని కుల హక్కు. మాదిగ వారు తనుకు లేకపోయినా దక్కలోణ్ని పోషించాలి. అది వారి ధర్మం. శతాబ్దాలుగా కొనసాగుతున్న సాంప్రదాయం అది. 'జాంబపురాణం' లాంటి సాంస్కృతిక ప్రదర్శనలతో మాదిగవాణ్ని రంజింపచేసి పొట్ట పోషించుకుంటాడు. ఇతర కులాల వారిని యాచించడం, దేబిరించడం దక్కలోడు చేయడు. దళితుల ఆత్మగౌరవానికి దక్కలి కళాకారుడు గొప్ప ప్రతీక. చెత్తకుప్పల మీద కుక్కలతో కలియబడి, హీనంగా అడుక్కోవడమే దక్కలి సంస్కృతి అనే భ్రమలో రచయిత ఉండటం దారుణమైన విషయం.

"మాదింత హీన సంస్కృతి మాది మోటుభాష, మా కళలు గివని డప్పు చాటింపు చేసి చెప్పన్నా? దాంతో మనకొచ్చేది ఆత్మన్యూనతే తప్ప ఏముంది?"

"దక్కలి సంస్కృతి నెందుకున్నతీకరించుదు? అండ్లుంది దళితుల హీన దీన స్థితిగతులే కదా!" అని పదే పదే కథ నిండా రచయిత తన తప్పుడు అభిప్రాయాలను తెలియజేయడం చిరాకెత్తిస్తుంది.

ఇక పరస్పర విరుద్ధ అభిప్రాయాల సంగతి సరేసరి.

"మీ యూనివర్సిటోళ్ళు గిసోంటి దక్కలి, చిందు ప్రదర్శనలియ్యవల్సిన పన్లేదు. గంద్లేముందని చాటుకొనటానికి?" అని 17వ పేజీలో తెలియజేసిన రచయిత "చిందు కళా భాగోతులు ఎంత అద్భుతమైన కళాకారులలో మనకు తెలియదా?" అని 18వ పేజీలో ప్రొఫెసర్‌తో అనిపిస్తాడే తప్ప ఆ కళ గురించి తెలిసినట్లుగా మాత్రం కాదు. ఆశ్రిత కులాల కళలు – సంస్కృతి పట్ల ఏ మాత్రం అవగాహన లేని రచయిత ప్రొఫెసర్‌తో పలికించిన మాటలు ఆయన అజ్ఞానాన్ని తెలియజేస్తాయి. "దళిత ఇతర శ్రామిక కళలన్నీ దక్కలి కళల్లాగే లేవు. ఆయా కళల్లో ఎంతో ఔన్నత్యముంది. నేర్పరితనముంది…" అంటాడు. అంటే దళిత కళలు, ఇతర శ్రామిక కళలు (?) గొప్పవి. దక్కలి కళ నీచమైనదనే అభిప్రాయమే కనిపిస్తుంది.

ఇక ఇతర కళల గురించి రచయిత పాండిత్యం చూద్దాం. "మిత్తిరయ్యావార్ల నాటక కళానైపుణ్యం మనం చూసిందే కదా!" అంటున్నారు. మిత్తుల అయ్యావార్లు ఎక్కడ నాటకాలు వేస్తారో చెబితే మేం కూడా చూసి తరిస్తాం కదా! అసలు రచయిత చూశాడా అన్నది సందేహమే. ఎందుకంటే వారు నాటకాలు వేయరు. వారు గాయక శ్రేణులకు చెందినవారు. తంత్ర వాద్యంపైన పాడుతూ, పురాణ పఠనం చేస్తారు. "డప్పుకొట్టడంలో డప్పుకొడుతూ కిందపడ్డ నాణాన్ని నొసల్తోని తీయడం ఎంత కళాత్మకత ఇమిడి వుంది" అంటారు. కాని ఈ ప్రదర్శన ఒగ్గు కథలో భాగంగా, ఒగ్గు కళాకారులు చేసేది. దాన్ని మిత్తుల అయ్యవార్లకు అంటకట్టడం అవగాహన రాహిత్యమే. "చెప్పులు కుట్టడం మాత్రం తక్కువ కళనా" అని ప్రశ్నిస్తున్నారు. నిజమే. కాని అది కళలో భాగం కాదు. బ్రతుకు తెరువులోని ఒక భాగం "శారదకాళ్ళు-సాధనాసురులు ఇతర జానపద కళాకారుల పనితనాన్ని ఉన్నతీకరించడం మనల్ని మనం తక్కువ చేసుకొనుడైతదా?" ఇక్కడ వాళ్ళ ప్రసక్తి అనవసరం. ఒక వేళ అవసరమే అయితే వారి కళలేమిటో, వాటిని ఎలా ఎవరు ఉన్నతీకరిస్తారో తెలియదు. ఇలా కథనిండా రచయిత పొరబాటు అవగాహన కొట్టొచ్చినట్లు కనబడుతుంది. దళితులను, దళిత కళలను ఉన్నతీకరించే పని మానేసి రచయిత ముందుగా వారు ఎవరో, వారి కళలు ఏమిటో, వాటిలో వున్న గొప్పతనమేమిటో తెలుసుకోవాలి. దళితులపట్ల దళితేతరులకున్న అవగాహన ఇలాంటి మేధావుల ద్వారానే లోకానికి తెలుస్తుంది. దాదాపు అయిదు వందల కథలు రాసిన ఒక సీనియర్ కథకుడు-కథలో చెప్పదల్చుకున్న అంశానికి, పాత్ర చిత్రీకరణకు కావల్సిన సమాచారాన్ని సేకరించడం మానేసి ఊహాత్మక కబుర్లతో కథను నింపేయడం బాధ్యతా రహితం. దళితుడు ఎమ్మార్వో అయినంత మాత్రాన వాళ్ళ పిల్లలు చదువుకున్నంత మాత్రాన "వాళ్ళు దొర పిల్లలు మీద చేతులేసి తిరుగుతుండ్రు.. వాళ్ళతోని రారా పోరా అనుకుంటు తిరుగుతుండ్రు'' అంటూ వాళ్ళ సామాజిక స్థాయి పెరిగినట్లు తెలియజేయడాన్ని చూస్తుంటే రచయితకున్న అవగాహనపట్ల జాలి వేస్తుంది. "మాదిగ అంటే ఎరికేనా సార్…? ఛండాలుడని అర్థం" అటని చెప్పడం చూస్తుంటే కోపం వస్తుంది. ఇంత వరకు తెలుగులో వచ్చిన దళిత సాహిత్యాన్ని కానీ, అంబేద్కర్ రచనలు కనీసం తెలుగు అనువాదాలు కూడా చదవలేని స్థితిలో ఇలాంటి అర్థరహితమైన కథలు రాసి పాఠకులను బాధించే హక్కు రచయిత కెక్కడిది? దళితులను ఉన్నతీకరించడం అనే మిషతో దళితులను అవమానించే కథ తప్ప ఇది మరొకటి కాదు.

**– కె.పి. అశోక్‌కుమార్, హైదరాబాద్**

### 'సాఫ్ట్‌వార్' బాగుంది, సంస్కృతిపై సందేహం

సాహిత్య పత్రికల మనుగడ ప్రశ్నార్థకమైన ఈ రోజుల్లో ఇంత మంచి గెటప్‌తో 'ప్రస్థానం' ప్రస్థానం చేయటం ఎంతో సాహసంతో కూడిన పని. మీ ప్రయత్నం కలకాలం విజయవంతం కావాలని ఆశిస్తున్నాను. నాల్గవ సంచికలో సాఫ్ట్‌వార్ కథానిక చాలా బాగుంది. ఈనాడు మనిషిలో అర్థపిపాస ఆత్మ సౌందర్యాన్ని మింగివేస్తోంది. రచయిత్రి మీనాక్షీ శ్రీనివాస్ మంచి వస్తువును గ్రహించి చక్కగా నిర్వహించారు. వారికి నా అభినందనలు. కాలువ మల్లయ్య 'సంస్కృతి'



Untitled-2 3 6/11/2002, 3:51 PM

## అభి నందనలు ప్రాయాలు

కథానికలో 'గంగయ్య' పాత్రను ఆత్మగతం చేసుకొంటే అతని ప్రశ్నకు సంతృప్తికరమైన సమాధానం నాకు దొరకలేదు. దళిత, జానపద శ్రామిక సంస్కృతుల్లో డక్కలోళ్ళ ఆనాటి దయనీయ స్థితి ఒక భాగం ఎలా అవుతుందీ ఎంతగా తల బద్దలుకొట్టుకున్నా అర్థం కాలేదు. ఈ కథ వర్గపోరాటాలకు ఆజ్యం పోసే ఒక చారిత్రక సత్యం కావచ్చు. కాని, సంస్కృతి మాత్రం కాబోదు. అనేక సాహిత్యాంశాలతో రూపు దిద్దుకొంటున్న ప్రస్థానం పత్రిక సాహిత్య ప్రియులందరిని అలరిస్తోంది. ఈ కృషి ఇలాగే కొనసాగించండి.

***–చింతలపూడి వెంకటేశ్వర్లు, చర్ల మండలం.***

### పుష్కరాల అనుభూతి

'ప్రస్థానం' (జులై–సెప్టెంబర్ 2003) చూశాను. 17 కవితలు, 17 హైకూలు, 8 వ్యాసాలు, 5 కథలతో సాహితీ పుష్కరాల అనుభూతిని పుష్కలంగా కలిగించింది. ఉద్యమం (శ్రీనివాసగౌడ్), వెన్నెల రాత్రికి ఆహ్వానం (చిరికి స్వామిదయానంద) కవితలు చాలా బాగున్నాయి. మీనాక్షి శ్రీనివాస్ 'సాఫ్ట్‌వార్' సంచికకు హైలైట్‌గా ఉండి పాశ్చ్యాతీకరణపైన పరోక్షంగాను, పట్టణీకరణపైన ప్రత్యక్షంగా విసిరిన అస్త్రంలా అన్పించింది. సాఫ్ట్‌వేర్‌తో జరిగే సాఫ్ట్‌వార్‌లో చిక్కుకొన్న మౌస్ పొటాటో (కంప్యూటర్ ప్రియులు)ను విడిపించడం ప్రతీ సామ్రాజ్యవాద వ్యతిరేకి కర్తవ్యం అని ఈ కథ ద్వారా గుర్తించగలిగాను. ప్రతి సంచికలోను ఒక ఇతర భాషా కథ ప్రచురిస్తే బాగుంది. బోయ జంగయ్య సాహిత్యం గురించిన వ్యాసం చాలా బాగుంది.

**–వి. సంతోష్, నెల్లూరు**

### అన్ని బావున్నాయి

'ప్రస్థానం' నాలుగవ సంచిక చదివాను. నేను ఆశించిన స్థాయికి తగ్గకుండా మరిన్ని హంగులతో, విలువైన సమాచారంతో ప్రస్థానం పాఠకులను అలరించింది. నిర్వాహకులకు ప్రజాసాహిత్యం–అభ్యుదయ ప్రగతిశీల భావాలపట్ల గల అంకిత భావం ప్రజాసాహిత్య విస్తృతి వికాసాలపట్లగల లక్ష్యసిద్ధి పత్రికలో ప్రతి పుటలోనూ వ్యక్తమవుతున్నాయి. 'సాఫ్ట్‌వార్' కథలో హైటెక్ యుగంలో పట్టణాల్లో స్థిరపడిన కుటుంబాలు ఏ రకమైన కృత్రిమ జీవితాలకు అలవాటుపడి, ప్రశాంత రహిత జీవనం కొనసాగిస్తూ వారు పుట్టి పెరిగిన గ్రామాల్లోని నిర్మల, నిష్కల్మష వాతావరణాన్ని విస్తరించి వ్యతిరేకించవలసి వస్తుంది. చక్కగా వివరింపబడినది. బోయ జంగయ్య సాహిత్యం గురించి కె. లక్ష్మీనారాయణ రచనా వ్యాసం, కొలకలూరి మధుజ్యోతి అడవిబాపిరాజు భావకవిత్వంపై ఉర్దు ప్రభావం గూర్చి రాసిన పరిశీలనా వ్యాసం వున్నత స్థాయిలో వుండి అందరి అభిమానాల్ని, రచనలను పొందేలా వున్నాయి. దళితుల జీవన వ్యవస్థ, వారి పేర్ల చివర ఆయా కులాల పేరు తగిలించుకోవడంపట్ల వారికిగల ఆత్మన్యూనతా భావాన్ని భయాందోళనను తొలగించే భావంతో కొనసాగిన కాలువ మల్లయ్య కథ 'సంస్కృతి' గ్లోబలైజేషన్ మూలంగా పరిశ్రమాధిపతుల్లో పెరిగిన విష సంస్కృతి, ప్రభుత్వాలు సరళీకరణ పేరుతో బహుళజాతి కంపెనీల కౌగిళ్ళలో చిక్కుకోవడం వాటివల్ల వుత్పన్నమవుతున్న దుష్ఫలితాల గురించి అద్దేపల్లి ప్రభు అందించిన 'డబ్బుల సముద్రం' కథ, భూమిపై హక్కులులేని నిరుపేదలు దయాదాక్షిణ్యంలేని అధికార దోపిడీకి, లంచాలకి గురై ఎంతటి దుర్భర జీవితం గడుపుతున్నారో ఇవి చాలవా అన్నట్లు క్రూరమృగాల బారికి ఏ విధంగా బలవుతున్నారో చక్కటి రాయలసీమ యాసలో కె.ఎన్. పలమనేరు బాలాజీ హృద్యంగా రచించిన ఏనుగుల రాజ్యం కథ, ఎం.ఆర్. అరుణ కుమారి కథ 'తొలిబలి', మానవ శరీర అవయవాల అమ్మకాల అమానుష,పైశాచిక వ్యవహారాల గురించి కర్లపాలెం హనుమంతరావు రాసిన గల్పిక భావస్ఫోరకంగా వుండటమే కాక సామాజిక వాస్తవికతకి, ప్రస్తుతం విస్తృత స్థాయిలో ఎదుగుతున్న సామాజిక రుగ్మతలకు దర్పణం పట్టేలా వున్నాయి. పత్రికలో ప్రచురింపబడిన వివిధ కవితలు, సాహిత్య చర్చ, కె.వి. రమణారెడ్డి సాహిత్య విమర్శపై వచ్చిన డా. కొల్లు వెంకటేశ్వరరావు పరిశోధనా వ్యాసం, 'దర్శనం' పేరుతో ప్రచురించిన 'ఏది కవిత్వం' వ్యాసం, ప్రజా కళాకారుడు కీ.శే. భీష్మసహానికి నివాళి వ్యాసం ప్రశంసనీయమైనరీతిలో అందించి రచయితలందరూ మిక్కిలి అభినందనీయులు. తెలకపల్లి రవి సమీక్ష హైలైట్. విస్తృత ప్రగతిశీల సాహిత్య వికాసానికి అవసరమైన అన్ని లక్షణాలతో, అలంకరణలతో ప్రస్థానం పత్రిక మరింత పురోభివృద్ధి చెందాలని, పాఠక హృదయాల్లో స్థిరమైన స్థానాన్ని పొందే పరిపుష్టిని సాధించుకోవాలని ఆకాంక్షిస్తున్నాను.

***–సువారపు రామచంద్రరావు, తిరువూరు***

మీరు 'ప్రస్థానం' సాహిత్య పత్రిక ద్వారా సాహిత్యాభివృద్ధి చేస్తున్న ఎనలేని కృషి చాలా ప్రశంసనీయమైనది. అది కాకుండా ప్రోత్సాహం నిమిత్తమై ఆయా జిల్లాల్లో జరిగే సాహితీ స్రవంతిని కూడా ప్రస్థానంలో ప్రముఖంగా చేర్చడం బాగుంది. ఇది కాక యుద్ధ వ్యతిరేక కవితాగానాలు ప్రచురించడం గొప్ప విశేషం. బాణాల శ్రీనివాసరావు 'శ్మశాన సంగీతం' కవిత చాలా భావుకంగా వుంది. హోవర్డ్ ఫాస్ట్ గూర్చి గుడిపూడి విజయరావు నివాళి అభినందనీయం. అద్దేపల్లి వారి సమీక్షా వ్యాసం, కవిత్వంలో 'సరిహద్దురేఖలు' తెలుగు సాహిత్యంలో 'అస్తిత్వ వేదనాత్మకమైన కవిత్వపు పాయను' ప్రస్తావించడం చాలా, సాహిత్య మూల్యాన్ని కలిగి ఉంది. వీరందరికీ మీకు నా హృదయపూర్వక అభినందనమాలలు.

***–డా. జి. సుధాకర్‌రావు, నల్గొండ***

### ఆగంతుకుని స్వప్నం-భాషలేకుంటే?

ప్రస్థానం జులై–సెప్టెంబరు 2003 సంచికలోని గుడిపాటి ఆగంతకుని స్వప్నం కవిత చదివి నా అభిప్రాయం రాస్తున్నాను. కవిత్వ విలువల గురించి నాకు తెలియదు. అయితే ఈ కవిత అనేక ఆలోచనలను రేకెత్తిస్తోంది. భాషనేది లేకుండా పోయిన భయంకర పరిస్థితిని వివరించడం ద్వారా భాష ప్రాధాన్యాన్ని నొక్కి చెబుతోంది. మానవుల ఉమ్మడి కార్యకలాపాల నుండి పుట్టి పెరిగిన భాష అందరికీ సమానంగా అలవడలేదు. సంపదలాగానే అసమానంగా పోగుబడుతోంది. శాస్త్ర, సాంకేతిక రంగాలకవసరమైన భాష విపరీతంగా అభివృద్ధి చెందింది. అలాగే కవుల, రచయితల భాష కూడా అభివృద్ధి చెందింది. సామాన్యుని భాషా పరిజ్ఞానం అతని బతుకు లాగా హీనంగా ఉంటున్నది. మధ్యతరగతి విద్యావంతులు వృత్తిపరమైన భాషనేగాని సాంస్కృతిక, భావ సంపదలను పెంపొందించే భాషను అలవర్చుకోవడంలేదు. వీరికి సజీవమైన గ్రామ్యభాష రాదు. వివిధ భాషల మధ్య అంతరాలు కూడా చాలా ఎక్కువ వున్నాయి. కొన్ని భాషలు కృశించిపోతున్నాయి. అన్ని భాషలను అణగదొక్కుతున్న ఇంగ్లీషు కూడా అలవడుతోందని చెప్పలేం! ఎగ్జిక్యూటివ్ ఇంగ్లీష్ రాజ్యమేలుతున్నది.

ఈ పరిస్థితుల మీద కోపమొచ్చిందేమో! భాష అంతరిస్తే ఏమవుతుందో ఆలోచించమంటున్నారు కవిగారు. "కాకి కావు కావు మంటుంది. పిల్లి మ్యావ్ అంటుంది... మరి మనిషి ఏమంటాడు?" అని ప్రశ్నిస్తున్నారు. దీనికి సమాధానంలేదు. మానవ సమష్టి శ్రమ నుండి పుట్టి పెరిగిన భాష మానవాభ్యుదయానికి కారణమయ్యి జంతుజాలం నుండి మనిషిని వేరు చేసింది. అటువంటి భాష హఠాత్తుగా అంతరిస్తే జంతువులకుండే సహజ లక్షణాలను ఏనాడో కోల్పోయిన మనిషి ప్రకృతిపై పోరాటంలో సమైక్యం కాలేక అంతరించకతప్పదేమో! భాషలేని భావం



Untitled-2 4 6/11/2002, 3:51 PM

## అభినందనలు / అభిప్రాయాలు

ఉండదు. భావాలూ, క్రమబద్ధమైన ఆలోచన లేనినాడు మానవుడు 'నరజంతువు'గానే మిగులుతాడు. లక్షల సంవత్సరాల మానవ కృషి ఒక్క దెబ్బతోపోతుంది. "భాషలేని ఆలోచనల క్రమం ఎలా వుంటుందో/మొదటి సారిగా మనిషికి తెలిసి వచ్చింది" భాషలేని ఆలోచనా క్రమం, అదెలా వుంటుందో తెలియడం సాధ్యమేనా? "ఇక అంతటా భాషలేని గణాల సముదాయాలే! హద్దుల సరిహద్దుల గొడవలేని సమూహాలే" అన్న కవిగారి అభిప్రాయంతో ఏకీభవించలేను. ఆదిమ ఆటవిక జీవితం చాలా విధాలుగా దుర్భరమైనది. ఆధునిక సమాజంలో ఎన్నిలోపాలున్నా గత సమాజాలకంటే మేలైనవే. మహా అయితే గతజీవితంలో పరాయీకరణ ఉండదు అంతే!

మొత్తం మీద కవిగారికి కొన్ని భాషల పెత్తనం పట్ల, భాషాదురభిమానాలపట్ల, భాషను నిర్లక్ష్యం చేయడంపట్ల, ఆంగ్ల భాషపై మోజుపట్ల తీవ్ర ఆగ్రహముందనిపిస్తోంది. ఇది ధర్మాగ్రహమే. వీటన్నిటికి విరుగుడుగా భాషలేని పరిస్థితిని స్వప్నించి మనకు చూపి భయపెట్టి బుద్ధి తెచ్చుకోమంటున్నారనిపిస్తోంది. అలాగే కవిగారికి అభివృద్ధితోపాటు వచ్చిన అనర్థాలపట్ల కూడా తీవ్ర ఆగ్రహమున్నట్లుంది. అయితే అనర్థాలను చూసి ఆగ్రహించి అభివృద్ధిని తిరస్కరించడం సబబేనా?

**–రావుకృష్ణారావు, కాకినాడ**

### కథలు, కవితలు బాగున్నాయి

ప్రస్థానం జులై–సెప్టెంబర్ సంచిక చాలా బాగుంది. మీనాక్షి శ్రీనివాస్ రాసిన 'సాఫ్ట్‌వార్'కు నా అభినందనలు. కథను చాలా బాగా రాశారు. 'ఏనుగుల రాజ్యం' కథ కూడా చాలా బాగుంది. వారికికూడా నా అభినందనలు ఉద్యమంపై రాసిన కవిత, లాఠీల మీద రాసిన కవిత చాలా బాగున్నాయి. ఇటువంటి సాహిత్య లక్షణాలున్న ప్రస్థానంకు మంచి ఆదరణ ఉండి తీరుతుంది. ఆరుద్ర సమగ్రాంధ్ర సాహిత్యం వంటి వాటిపై సీరియల్‌గా వివరిస్తే బావుంటుంది. ఇక అప్పుడప్పుడు ప్రత్యేక సంచిక సందర్భానుసారం తీస్తే బాగుంటుందని నా అభిప్రాయం. ప్రస్తుతం శ్రీశ్రీపై, జాషువాపై సృష్టిస్తున్న అలజడిని అందరూ వ్యతిరేకించాలి. మహాకవులు కాలేని వారందరూ మహాకవుల మీద అసూయతో చేస్తున్న పని అని సాహిత్యలోకం గుర్తించాలి. సంపాదక పేజీలో మీరు చాలా బాగా రాశారు.

**–పైడిపల్లి చైతన్య, ఖమ్మం జిల్లా**

మీరింత వరకు ప్రచురించిన నాలుగు సంచికలను చదివి ఆనందించినాను. మొదటి సంచికను చూడగానే 'భారతి' పత్రికకు ప్రతిబింబమనిపించినది. ఆ భావనను వరుసగా వచ్చిన సంచికలు ఇంకా బలపరిచాయి. సాహిత్యానికి సంబంధించిన ప్రక్రియలన్నీ సాహిత్య అభిమానులను ఆకట్టుకునే విధంగా ఉన్నాయి. సంచికలన్నీ భద్రపరచుకునే స్థాయి కల్గి వున్నవి.

**–వి. నర్సయ్య, ఎం.ఎ. హన్మకొండ**

"ప్రస్థానం" నాల్గవ సంచిక చూసాను. ఇంత కాలం ఈ పత్రిక నా దృష్టికి రానందుకు బాధపడ్డాను. సాహితీ విలువలతో చాలా బాగుంది. దాదాపుగా అన్ని శీర్షికలు నచ్చాయి.

**–సయ్యిద్ కుర్షీద్, మహబూబ్‌నగర్**

సాహితీ ప్రపంచంలో ఎన్నో మార్పులు జరుగుతున్నాయి. టి.వి. వచ్చి పాఠకులను తగ్గించింది. అన్నవాదం నిజం కాదనిపిస్తోంది. ఈ రోజుల్లో కొత్తగా విడుదల అయిన ఏ నవల అయినా కనీసం రు.50కి తక్కువ వుండడంలేదు. అలాంటి నవలలను తెలుగు పాఠకులు కొని చదువుతున్నారు. ప్రస్థానం వంటి పత్రికలు వచ్చినంత కాలం తెలుగు పాఠకులకు కొరత లేదు. మంచి పుస్తకాన్ని తెలుగు పాఠకులు తప్పక ఆదరిస్తారు. మీ కృషి అభినందనీయం. కాలానుగుణంగా మాసపత్రికగా కూడా వచ్చి తెలుగు పాఠకులకు భారతి లేని చోటు ప్రస్థానం తీరుస్తుందని ఆశిస్తాను.

**–భళ్ళమూడి నాగరాజు, రాయగడ్, ఒరిస్సా**

ఇవాళ సాహిత్యంలోకి కొత్త పదాలు కొన్ని అనివార్యంగా వచ్చిపడ్డాయి. ప్రపంచీకరణ, పోస్ట్ మోడర్నిజం, ఫెమినిజం, దళితవాదం... ఇట్లా!

ఆరడుగుల రాజశేఖరాలూ, పడవలాంటి ఇంపాలా కార్లూ... వచ్చినంత వేగంగానే చచ్చిపోయాయి!!

కడప జిల్లా, వేంపల్లె నుంచి ఒక రచయిత టెర్మినేటర్ విత్తనాల మాయాజాలాన్ని గురించి కథకడితే అది పరిశీలించి వేసుకునే పత్రిక ఏదీ? ఇప్పటి కొన్ని వారపత్రికలు మనమెవరం పండుగ పూట కూడా చూడలేని స్థితికి చేరుకున్నాయి.

అడపా దడపా మంచి కథలు కొన్ని వేసుకునే ఆదివారం అనుబంధాలకు, స్థలాభావం సమస్య వుంటుంది. ఇవాళ మంచి భావజాలంతో, ఒక రచయిత కథరాస్తే, అతను నిశ్చింతగా 'ప్రస్థానం పత్రిక వుందిగదా' అని ధైర్యంగా పంపించే పరిస్థితి వుంది.

ఈ రోజు ఒక మంచి విమర్శకుడు విశ్లేషణ వ్యాసం రాస్తే దాన్ని గౌరవించి అచ్చువేసుకునే పత్రిక మన ముందుంది.

అమెరికన్ యుద్ధోన్మాదాన్ని కైగట్టిన కవులకు ఈ రోజు సమస్యలేదు. ఇదంతా ప్రస్థానం పుణ్యమే. సాహిత్యంలో, సాహిత్యలోకంలో వుండాల్సింది ఈ వాతావరణమే.

ఉదాహరణకు, మూడు నాలుగో సంచికల్నే తీసుకోండి. ఓల్గా, కేతు విశ్వనాథరెడ్డి, లెనిన్ ధనిశెట్టి, బాలాజీ, మల్లయ్య.... అందరూ అభ్యుదయవాదులే, అన్ని కథలూ గట్టిగింజలే!

ఇప్పుడు మార్కెట్‌లో వున్న ఏ పత్రికలో అయినా, 3 కథలూ, 3 వ్యాసాలూ, 3 కవితలూ... సీరియస్‌గా వున్నవి. ఒకే సంచికలో అచ్చవుతాయా?

వ్యాపార పత్రికలు అలా చెయ్యవు. సామాజిక ప్రయోజనాన్ని ఆశించే పత్రికలే చేస్తాయి. అదిగో ఆ పని ప్రస్థానం చేస్తోంది.

అందుకే, ప్రస్థానం మన పత్రిక. దీన్ని మనందరం చదివి, చదివించి... తరతరాలు కాపాడుకోవాలి.

మంచి పత్రిక అయిన భారతి మూతపడింది. 'ప్రస్థానం' ఎప్పటికీ 'మహాప్రస్థానం'లా కొనసాగేలా చూసుకోవాల్సిన బాధ్యత మనదే....

**–సాకం నాగరాజు, తిరుపతి**

### లేఖలు-సూచనలు

ప్రస్థానంలో ప్రచురితమయ్యే కథలు, కవితలు, వ్యాసాలు, విశ్లేషణలు దేనిపైనైనా పాఠకులు, సాహితీ మిత్రులు లేఖలు రాయవచ్చు. ఆ విధంగా వచ్చిన లేఖలు ఈ సంచికలో చూడవచ్చు. విమర్శ ఎంత నిశితంగా వున్నా ఫర్వాలేదు గాని అకారణ వివాదాలకు దారితీసే భాష, పదాలు దొర్లకుండా జాగ్రత్త తీసుకోవాలి. వ్యక్తులను, సంస్థలను, వివిధ వర్గాలను బాధపెట్లే సంచలనశీలమైన పదజాలానికి ప్రస్థానంలో చోటు వుండదు. వ్యక్తిగత దాడి చేసే అంశాలు కూడదు. చాలా మంది పత్రిక బాగుందని రాసి, దాని వెంట ఏదైనా రచన ప్రచురించమని జత చేస్తున్నారు. ఇలా రచనలతో జత పరచిన కాంప్లిమెంట్లను లేఖల శీర్షికకు తీసుకోవడం జరగదు.



Untitled-2 5 6/11/2002, 3:51 PM

## కథ

పుప్పాల కృష్ణమూర్తి



# ఒంటరి గుడిసె

***"కా**యమేనా?" నోటికాడ్నించి రేక దీసి చేతిలో పట్టుకున్నాడు.*

*"వారి....? నా దగ్గర బాస తప్పుడు యవ్వారవ్వుందా? మా తాన రాశోల్లంటే నిప్పు. గొంతుకాయ తెగ్గోసినా మాట దప్పరు. నే నాడే అల్లిరాణి మీదొట్టు. మాటంటేమాటే." అని మీసాలు రెండూ మెలేశాడు సైదులు. ఎత్తుగా, బక్కపలచగా ఉంటాడు. వయసు నలభైదాకా ఉంటుంది.*

"నన్నాగం జెయ్యవుగా బావా! పోయినేడు పిల్లనిప్పిస్తననే, ఆ మట్టిగాడు, ఎండాకాలవంతా ఎయ్యి రూపాలకల్లు దాగిండు. తీరా వానలు బడ్డాక 'పిల్ల పెద్దమడిసి గాంది యియ్యరంట' అని సావు కబురు సల్లంగ జెప్పిండు. గాముక్క ముంగల్నే సెప్తే, మరక పిల్ల నమ్మిన ఎయ్యి మిగిలేయిగా, సాటి కులపోడు యింత మోసం జేస్తడా బావా? నువ్వు చెప్పు?" ఎదురుగా కూర్చున్న వాడల్లా... మోకాళ్ళ మీద లేచి రెండు చేతులూ పట్టుకుని, కంటనీరు పెట్టుకున్నాడు.

"అందుకేరా వాడ్నందరూ బోల్తల మట్టిగాడనేది. పొద్దుగూకే తలికి ఎవడ్నో ఒకడ్ని బోల్తేస్తాడు. వాడి డబ్బుల్తోటి ఈడు జెల్సా జేస్తాడు. నువ్వెట్ల నమ్మినవురా ఆ కొన్రాసోడ్ని. వాడడుగు బెడితేనే, అప్పటి దాకా పిల్లనిస్తనన్నోడు గూడా ఎనక్కు పీక్కుంటడు తూ... వట్టి బోల్తల్నాకొడుకు" అని నేల మీద ఊశాడు.

"మడిసిగాబట్టి నమ్మిన తాగితె తాగిండనుకుంట నా పెండ్లం ఉచ్చ. పోపిచ్చినోడు సెడిపోడుగా, నా గొర్రెలు సల్లంగుండాలెగాని, ఏటా ఏడుగురికి బోపిస్త" అన్నాడు బింకంగా బిక్షం.

"నువ్వేం పికర్ జెయ్యకు. మా అన్న బిడ్డనిప్పిస్తనన్నగా మాటంటే మాటే" దగ్గరకు జరిగి మెల్లగా "పిల్లదొరక్క దొరక్క దొరికిందిగ దాని, యిజరాయి మజరాయి వాడకు, లేత పొల్ల, ఉత్తగనే అదురుబోద్ది" అన్నాడు.

"ఛ....!" అని సిగ్గుపడిపోయి, "గింత గల్లు, గంత బొల్లు లేకుండ సూసుకోకుంటే, నీ సెప్పుకు పియ్యరాసి సెంపమీంచి గొట్టు. నీ మాట నిలబెట్టే జిమ్మెదారి నాది" అన్నాడు చేయిలాక్కురి, చేతిలో చేయివేసి ప్రమాణం జేస్తూ.

"అదే అనేది పెద్ద పెద్దోలల్ల దిరిగెటోడ్ని నన్ను పలవ జేయెద్దు. మనం యింటికి బోకుంటే, నర్సిరెడ్డి సర్పంచ్ అడుగు బైట పెట్టడం. పోలీస్‌స్టేషన్‌కు బోతే, "సైదులూ, కుందేలు కూర ఎప్పుడు దినిపిస్తవ్?" అని పేరు బెట్టి ఎస్సైగారడుగుతాడు. యింక జమ్దార్లు కాని స్టేబుల్లయితే, జేబిల సెయ్యిబెట్టి, సిగరేట్ దీసుకుంటరు" అన్నాడు గర్వంగా.

"నీ మాట లింటుంటెనే, నాకు పెళ్ళయినట్లు గొడ్తుంది బావా. ఏదేదైనా యింగ ఆగదల్చుకోలేదు. మా అడివికి లగ్గం జేస్తే, ఆ రేకులోడు పలుకోడాయె. కంటికి, మంటికి వలపోసుకుంట నా సెల్లెనా గుడిసెకొచ్చె... దాని బతుకట్టా బుగ్గయిపాయె" అన్నాడు తలదించుకుని. నాలుగు కన్నీటి బొట్లు నేలమీద రాలాయి.

"దేవుడట్ల రాసి పెట్టిండు. నువ్వేం జేస్తవ్? పోదాం. మరో పట్టుబడతావా?" అన్నాడు సైదులు.

"యింగ సయించట్లేదు బావా. నీ మాటలినంగనే నాకు కడుపు నిండిపోయింది. ఆ అర్జున్లోరికి సీకుష్టుడు దొరికినట్టు దొరికినవ్.



Untitled-2 6 6/11/2002, 3:51 PM

నా బలుపు, బారవంతా  నీదే" అన్నాడు రెండు చేతులూ పట్టుకుని కళ్ళకద్దుకుంటూ.

గౌండ్ల గుర్వయ్య బింకందుకోగానే సైదులు రేక పెదాల కానించుకున్నాడుకల్లు లూగేందుకు.

D D D

పొద్దుపొడవకముందే ముగ్గురూ జెర్రిపోతుల గూడెం నుంచి లింగగిరి దారి పట్టారు. తల్లి బూదేవమ్మ గుడిసెకర్రల్ని కట్ట గట్టుకుని, దాని మీద చాప చుట్టలు బెట్టుకుని ముందు నడుస్తోంది. ఆమెకు యాభయ్యైద్వాకా వయసుంటుంది. చాపలు అల్లుకుని అమ్ముకోవడం, గొర్ల గాయడం తప్ప వేరే లోకం తెలీదు. బిడ్డా, కొడుకే ఆమెకు పంచప్రాణాలు. అడివమ్మ ఒక జోలె సంకకు తగిలించుకుని, ఈ లూకు ఎడమ చేతితో పట్టుకుని, కుడి, ఎడమ వేళ్ళతో చాప నల్లుకుంటూ నడవ సాగింది. ఆమెకు ఇరవై, ఇరవై రెండు సంవత్సరాల మధ్య ఉంటుంది వయసు. మొగుడు వదిలేశాక రెండేళ్ళ నుంచీ అన్నదగ్గరే ఉంటోంది. పెళ్ళవక ముందు అందరితో కలుపుకుని మాట్లాడేది. పెళ్ళయి, మొగుడితో మూడేళ్ళు సంసారం చేశాక, మనుషులంటేనే అసహ్యమేర్పడింది. తను అనుకున్న వాళ్ళతో తప్ప, పరాయి వాళ్ళతో పలకరించినా మాట్లాడదు.

బిక్షానికి ఇరవై ఐద్దాకా వయసుంటుంది. ఎవర్నైనా యిట్టే నమ్మేస్తాడు. ఎత్తులు, జిత్తులు తెలీవు. కులం సముద్రమంతున్నా, పిల్లనిచ్చే వాళ్ళు లేక అవమానంగా బతుకుతున్నాడు. జంగాలల్ల పిల్లవాడికి పదిహేడు, పద్దెనిమిది; అమ్మాయికి రజస్వల కాగానే పెళ్ళి చేస్తుంటారు. వీళ్ళ కులంలో బాల్య వివాహాలు చాలా సాధారణమైన విషయం. చెల్లెలికి పెళ్ళి చేసి, తాను చేసుకుందామని నాలుగేళ్ళ కిందే చేశాడు. అప్పట్నుంచి కలిసిన కులపోడ్నల్లా అడిగాడు. కాని పిల్లనెవరూ యివ్వడానికి ముందుకు రాలేదు. లింగగిరి సైదులు బాగోతం అడ్డానికి జెర్రిపోతుల గూడెం వచ్చి, అన్న బిడ్డ అక్కమ్మను యిప్పిస్తానని చెప్పడంతో గుడిసె, గుడారం తలకెత్తుకుని లింగగిరి దారి పట్టారు. వేపపుల్ల లేసుకుని కదిలిన వాళ్ళల్లా, పదకొండయ్యేసరికి, గోపాలపురం వాగు దగ్గర ఆగారు. ముఖాలు కడుక్కుని సద్దిబువ్వదిని, మళ్ళీ బయలుదేరారు. గొర్రెల్ని మేపుకుంటూ మెల్లగా సాయంత్రం నాలుగ్గంటలకు చేరారు.



"గింతసేపైంది? పగులే వస్తరనుకున్న" అని పలకరించాడు ఎదురు చూస్తున్న సైదులు యంటవలబోను సరి చేస్తూ

"నాలుగు శాల్తీల పిల్లల తల్లులున్నై బావ. ఆట్నితోలుకుంటు, మేపుకుంట వచ్చే తలికి గీ ఏలైంది" అన్నాడు బిక్షం, తల్లి నెత్తిమీది కర్రలు, చాపచుట్ట దింపుతూ.

"మా అన్నగుడిసెగా ఏనెకర్రెంబడి ఉందిగని, నువ్విడే ఏసుకో, ఇస్లాంతి గుంటది. గటు గొర్ల దొడ్డి బెట్టుకోవచ్చు. గాపక్కనే పెంట బోసుకోవచ్చు. అన్నాడు లేచి.

"గట్లనేలే" అని కొడవలి దీసుకుని పరేశకపు మండల్ని బిక్షం కోయసాగాడు. పారదీసుకుని గడ్డిచెక్కసాగాడు సైదులు.

"తమ్ముడూ, గిక్కడ పొయ్యిబెట్టేదా?" అంది భూదేవమ్మ మూడు రాళ్ళను పేరుస్తూ

"యియ్యాలేం పండుతవక్కా. ఊళ్ళెరెండు పెళ్ళిళ్ళయితున్నై. మీరిద్దరు బువ్వకు బొయ్యిరాండి. పక్కన మా పాపమ్మను బంపుత" అన్నాడు.

కోసివేసిన మండను పట్టుకుని, నరికివేసిన తుమ్మచెట్టు మొద్దు మీద కూర్చుని, వడ్డెరోళ్ళ పిల్లల్తో కలిసి బస్సాట ఆడుకుంటున్న నాలుగేళ్ళ పిల్లను గద్దించి పిలిచాడు.

"ఎందుకయ్యా, చెప్పు" అని మొద్దు మీద ఊగసాగింది రావడం యిష్టం లేనట్లు.

"మనిషి పిలవంగనే రావేందే?" అని దగ్గరకు వెళ్ళి, చేతిలో మండతో వీపు మీంచి ఒక్కటేశాడు.

"అమ్మా..." అని ఏడుస్తూ, మొద్దుమీంచి దూకి, వీపును రాసుకుంటూ గుడిసె వైపు పరిగెత్తింది.

మండనలాగే పట్టుకుని, వెళుతున్న పాపమ్మ చేయి పట్టుకుని, గుడిసె వైపు లాక్కుపోయాడు. మొలకో జానెడంత లంగా గుడ్డ మాత్రమే వుంది. అది కూడా మాసినల్లగా, అక్కడక&కడా చిరిగి వుంది. తల రాగి రంగులో దుమ్ముకొట్టుకుని వుంది. కొన్ని రోజులుగా స్నానం చేయించనట్లుగా కన్పిస్తోంది.

"నేనేంబోను" అని ఏడుస్తున్న పాపమ్మ కొత్త వాళ్ళను చూసి, స్థాయి తగ్గించి, సన్నగా ఏడవసాగింది.

"ఎందుగ్గొడితివి తమ్మీ. పిల్ల ముద్దుగుంది. నేను నచ్చజెప్పే దాన్నిగా. నీకు తినే గోలీలు కొని పెడతగని ఏడవకు" అంది పాపమ్మను దగ్గరకు తీసుకుని తల నిమురుతూ. దాంతో ఏడుపు పూర్తిగా ఆపేసి ' ఈ కొత్త వాళ్ళెవరోగాని, మంచి వాళ్ళలాగే ఉన్నారే' అనుకుంటూ వాళ్ళిద్దరివైపు ఎగాదిగా చూడసాగింది. గుడిసెలోంచి అల్యూమినియం గిన్నెతెచ్చి పాపమ్మకివ్వబోగా అందుకోలేదు. 'ఇటుతే' అని భూదేవమ్మ అందుకుంది.

"యాటలు గోసింరంటనే పులుసు బోస్తరుగని, నాలుగు ముక్కలు ఎయ్యవని అడుగు" అన్నాడు బిడ్డతో.

"నేను జెపుతలే తమ్మీ ఊరు జూపుదువు పా" అంది పాపమ్మతో.

పాపమ్మ ముందుకు కదలగానే, తల్లీబిడ్డలు చెరోగిన్నె తీసుకుని వెనకాలే వెళ్ళసాగారు.

నేలంతా శుభ్రమయ్యాక, నాలుగు 'యు' ఆకారంలోని కర్రలు వరుసగా పాతి, దాని మీద ఈతాకు చాపలు కప్పి, ఈతాకుతో కుట్లు వేశారు. రేగుకంప చెట్లు కొట్టి, పడుకుని వున్న గొర్రెల చుట్టూ వేసి, దొడ్డి తయారు చేశారు. యింటిలో నాటుకుపోయిన అన్నమ్మ వచ్చి గుడిసె ముందు కూలబడ్డది. ముసలమ్మ కోడల్ని చూసి, చేతులున్న యిద్దరు పిల్లల్ని వదిలేయగానే, పాలకోసం తల్లి మీదకు ఎగబడ్డారు. చిన్న పిల్ల వాడికి నాలుగు నెల్ల వయసు. అంతకన్న పెద్ద వాడికి పదమూడు నెల్లు. వాళ్ళకంటే పెద్ద పిల్లకు రెండున్నర ఏళ్ళ వయసుంటుంది. సరైన ఆహారం లేక పిల్లలు ముగ్గురూ ఎముకల గూడులా, దారిద్ర్యానికి ప్రతీకల్లా ఉన్నారు. తల్లిగాలికి కూలిపోయే చెట్టులా వుంది. చెంపలు పీక్కుపోయి, కండ్లు లోపలికి పోయి లంఖనాల రోగిలా వుంది.

"గట్ల శారమ్మ యింటి దాకాబోయొస్తంగని, గుడిసె దిక్కు జూస్తుండు. గొర్రెపిల్లలెటన్నా బొయ్యేను" భార్యను హెచ్చరించి, బిక్షాన్ని తీసుకుని ఊళ్ళోకి నడిచాడు సైదులు.

"అబ్బ, పొరగా, రొమ్ముగొరికి సంపితివి గదరా" అని పెద్ద పిల్లగాడ్నో దెబ్బవేసి, మీద నుంచి ఈడ్చి అరవయ్యేళ్ళ ముసలమ్మ మీద పడేసింది. వాడు లబ్బుమని ఏడవసాగాడు. చంటి పిల్లవాడు ఒక రొమ్ము వదిలి మరో రొమ్ము అందుకున్నాడు.

D D D



Untitled-2 7 6/11/2002, 3:51 PM

మూడు గిన్నెలనిండా అన్నాలతో వచ్చారు ముగ్గురూ. అప్పుడు రాత్రి తొమ్మిదవుతోంది. వెన్నెలకు గుడిసెముందు అంతా గుండ్రంగా కూర్చున్నారు. సైదులు, తెచ్చిన సీసా సార, తలో గిద్దెడు గ్లాసులో పోసి అందిచ్చాడు. వద్దనకుండా ప్రీతిగా తాగేశారంతా. తర్వాత కబుర్లు, పెట్టుకుంటూ అన్నం తినేశారు. అప్పటికి అన్నమ్మకు వచ్చింది ఎవరో, పూర్తిగా అర్థమైంది. యింత కాలం పక్కనో తోడు లేక, ఒంటరి బాధ ననుభవించింది. పక్కనే ఒడ్డెర ఆడవాళ్ళు ఉన్నారు కాని, తమ కులంతో ఎలాంటి కంచం, మంచం పొత్తు లేనందువల్ల అంటీ ముట్టనట్టుగానే ఉండేవాళ్ళు. కింది బజారులో తోటి కోడలు ఉంది కాని, పెంటదిబ్బ తగాదా కాడ్నించి మాట్లాడ్డం లేదు. మాది గ్గూడెం రోడ్డు పక్క ఎల్లావుల గోవిందు కుటుంబం ఉంది. కాని మావ గోపాలానికి, గోవిందుకు బాగోతాలు ఆడే కాడ తగాదాలైకొట్టుకున్నారు. కొన్నేళ్ళుగా వానరాసోళ్ళకు, ఎల్లావులోళ్ళకూ మాటల్లేవు. ఎక్కువ తాగిన మగాళ్ళిద్దరూ వెంటనే చాపలో గుర్రుకొట్టి నిదురపోతుండగా, తగు మాత్రంగా తాగిన ఆడవాళ్ళు ఉత్సాహంతో ముచ్చట్లు పెట్టుకోసాగారు. కష్టాలు, కన్నీళ్ళు కలబోసుకుంటూ, నవ్వుల్లో మునిగితేలి, ఏ అర్ధరాత్రికో గుడిసె ముందు చాపల్లో కన్నుమలిపారు.

D D D

తెల్లవారు జామున నాలుగ్గంటలకే లేచాడు సైదులు. బిక్షాన్ని లేపుకుని, వలని భుజానికి వేసుకుని, కర్రల్ని చేతబట్టుకుని, నాలుగు కుక్కలు వెంటరాగా జొంగపిల్లుల కోసం పెద్ద గుట్టకు బయలుదేరాడు.

అన్నమ్మ లేస్తూనే అన్నం వండి, కిందటి రోజు కోసుకొచ్చిన బొడ్డు బాయిల కూర పులుసు పెట్టింది. పిల్లలకు అన్నం పెట్టమని, అత్త నాగమ్మకు చెప్పి, విడిచిన బట్టలు మూటగట్టుకుని, అడివమ్మను కేకేసింది. బట్టల మూటలు చంకలో పెట్టుకుని చెరువువైపు బయల్దేరారిద్దరూ.

"అక్కా! బావ బాగ జూసుకుంటడా?" అనడిగింది అడివమ్మ.



"ఎక్కడ సూసుకోవడం సెల్లే. పానం వస్తదా, పోతదా అన్నట్లే వుంది. మనువైన కాడ్నించి గింత సుకంలేదు. ఏడాది కేడాది బాలింతనైతిని, నాలుగేళ్ళ బట్టి. ఒంట్లేం పానముంటది జెప్పు? పాల్లేక రొమ్ములెండి పాయె. పీకి పీకి పోరగాల్లు సంపుతారాయె. గింత కూలికి బోడాయే. లేసింది పొద్దు బలాదూర్‌గా తిరుగుడేనాయె. కల్లాలయ్యేప్పుడు ఆర్మనిపెట్టెను దీస్కోని అడుక్కోడానికి మాత్రం బోతడు. ఆ గింజలేవన్నా యింటికి తెస్తడా అంటే అదీ లేదు. ఆడి తాగుడుకు, తిరుగుడికే సరిపోద్ది. ఈ లంజ ముసల్ది తక్కువది గాదు. ఆడు తాగి యింటికొచ్చే తలికి, తగాదా పెట్టుకుని, నా మీద ఉన్నయి, లేనియి ఎక్కిచ్చి చెప్పుద్ది. ఆనా బట్ట నన్ను సావగొడ్తడు. కళ్ళేకనబడవంటది. పళ్ళెండు బువ్వదింటది. నేనన్నా గంత తిన్లేను సెల్లే. గానడ్మ జెరవొచ్చి అడ్డంబడ్డ గౌరుమెంటు దవాకాన్ల మందులు అడుక్కొచ్చుకున్న. మూడ్రోజులు బువ్వముట్టక చేతగాక గుడిసెల బండిన 'పనికి పోబుద్దని, నీ పెళ్ళం బండిందిరా జెరం లేదేం లేదు' అని కొడుకుతో చెప్పింది. ఆడు కూలికి బోయిందాకా సావగొట్టె, గింత కష్టం జేస్తన్నా గంత కనికరం లేదు. కన్న కష్టాలు బడుతున్న సెల్లే. రేతిరి సుకంగా పండనియ్యడు. బువ్వ దినంగనే పక్కల జేరతడు. వల్లగాదంటున్నా కుల్లబొడుస్తడు. పానం బొయ్యేట్టుగానే వుంటది సెల్లే" చెప్పుకుంటూ కంటనీరు బెట్టుకుంది.

చెరువుకు చేరుకున్నారు. బండ మీద బట్టలు ఉతుక్కుని, తడిబట్టల్ని మూటగట్టుకుని నెత్తిన పెట్టుకుని ఇంటిదారి పట్టారు.

"నీ బతుకు గిట్లెందుకైంది సెల్లే?" అడిగింది అడివమ్మను.

"ఆడుట్టి రేకులోడక్కా, నెత్తికి సవుర్రాసి జెడేస్తే 'ఎవరు రమ్మన్నడే' అంటడు. బొట్టు బెడితే 'బజారు ముండవానే?' అంటడు. అనుంగ చీరగట్టి, పూలుపెట్టుకుంటే ఏమే సోకు జేసినవ్? ఎవడికి సైగజేసినవ్?' అంటడక్కా. అనుంగుంటె అస్సలు ఓరవడక్కా. నవ్వితే తప్పు. నలుగుర్లెకి పోతె తప్పు. గయ్యాల పైటి బువ్వ గూడా దీసకపోలేదక్కా. ఎండాకాలం. మస్తుదప్పికైతంది. మేకలేదో ఒక్కసోట్న కుదురుగ నిలబడేయిగావాయె. బాయికి బొయ్యి తాగొద్ధావన్నా, అంతల్నే గొల్లోల్ల పిల్లగాడు మేకల మేపుకుంట గటు దిక్కొచ్చిండు. సంకన బుర్రకాయుంది. దప్పికైతంది. గిన్ని నీళ్ళు బొయ్యవని అడిగిన' పాపం ఆ పిల్లగాడు నా దోసిట్లె, నీళ్ళు బోసిండు, తాగినక్కా ఏ పిల్లకంప సాట్న నక్కి జూసిండో... ఏదో....?' యిప్పటి దాకా వాడితోటి ఏడ బండినవే?' అని రంకు గట్టిండు. పరాయి మొగోడిముందు నా మానం మీద సెయ్యి బెట్టి పరిచ్చజేసిండు. గప్పుడు నా పానం బోతె బాగుండనుకున్నక్కా. పచ్చనాకు బట్టుకుని 'నాకే పాపం దెల్వదని' పమాణం జేసిన అయినా యిన్లే...' మట్టంతా నెత్తిన బోసుకుని ఒట్టుబెట్టిసెప్పిన, అయినా యిన్లే. మీరు బండిన తావుజూపు' అని మేకల గాసే కర్ర దీసుకుని కొట్టబట్టిండు. ఆ దెబ్బలకు తట్టుకోలేక, తల్లిగారింటికి ఉరుకు జూపిన, సెలకల మీద ఎంటబడి గెదివిచ్చి గొట్టిండక్కా జుట్టుబట్టి ఈడ్చి, తన్ని ఊళ్ళెకి, గుంజక పోతనని యాగిజేసిండు. నేను జచ్చినా, నీ యింటికి రానని మొండికేసిన. అట్నించటే ఏడ్సుకుంటూ అన్న ఊరు జేరిన. నా ఒంటి మీది దెబ్బలు జూసి, మా అన్న, మామయ్య కూడు, నీళ్ళు మానేసి ఏడవ బట్టింరు. మందులిప్పిచ్చినాక పది రోజులకు నొప్పులు తగ్గినయ్. పంచాతప్పటి గ్గాడ ఒంటి మీది దెబ్బలు మాన్లే. పాయె... పన్నెండోనాడు మడిసి రానే వచ్చిండు. 'ఈర లింగంపుల్ల గట్టిండు. కులంల పంచాతి తేల్చుకోనేకి రమ్మనడని'. నాలుగు జీవాల్నమ్మి, పదేలు మూటగట్టుకుని పంచాయితిల గూసుండు నా అన్న. మూడు రోజులు, చెరువెమ్మటి తోట్ల నడిసిందా పంచాతి. మూడు పందులు దెగినయ్. కులానికి తాగినంత కల్లు, సార, ఏజ్జాల మీద నడిసింది. 'నేనే పాపం జెయ్యలే. గుడ్డ గాల్చి అన్నే లంగా మీదేస్తుండు. గడ్డపార దుయ్యవన్నాదూస్త. కుల పెద్దలారా. మీకూ నా అసుంటి బిడ్డలుంరు. నా తప్పేందో నా ఒళ్లేయండి' అని కొంగు జాపిన. 'అడివిల అన్ని బాయిలుండంగ ఆపిలగాడ్నే నీళ్ళెందుకడిగినవ్? నిన్నడుగుతుంటే ఆడెందుకు మాట్లాడకుండ బోయిండు? తప్పు జెయ్యని దానివైతే ఎందుకు పారిపోయినవ్?' అని ఈరలింగం గోరుకున్న పెద్ద మడుసులు అడిగింరు. 'కర్ర యిరిగిందాక కొట్టుడేంది? గడియ గడియకు ఆడదాన్ని తప్పుబడ్తే అది సంసారం జేస్తదా?' అని మా తరుపు పెద్ద మడుసులు అడిగింరు. మొగుడుగాబట్టి యాడ సెయ్యేసినా తప్పులేదు. తిడతడు, కొడతడు, అదే పెడతడు గనక తల్లిగారింటికి తర్లిపోవడం నీ తప్పు. సేసుకున్న దాన్ని ఏలుకోనంటుండు. అది ఆడి తప్పు' అని మూడో నాడు పొద్దు గూకినంక తేల్చింది కులం. మాకు రెండు వేలు, వాళ్ళకు మూడు వేలు దండగేసింరు పెద్దలు. ఆడే ఏలుకోనంటుండు గాబట్టి, పెళ్ళప్పుడు ఓలి కిందిచ్చిన డబ్బులు యియ్యనవసరంలేదు' అని తీర్పు జెప్పింది కులం. అప్పటి సంది మొగుడన్నా, సంసారవన్నా బయవైతందక్కా" అంది కన్నీరు తుడ్చుకుంటూ.

ఒకరి బాధలకు మరొకరు సానుభూతి తెలుపుకుంటూ, ఓదార్చుకుంటూ యింటికొచ్చారు. అన్నాలు తిని, సద్దికట్టుకుని,



Untitled-2 8 6/11/2002, 3:51 PM

నాటుకుపోయారు. అన్నమ్మ, అడివమ్మ మధ్య స్నేహం బాగా పెరిగింది.

D D D

మూడ్నెల్లు తిరిగేసరికి బిక్షానికి సైదులు సంగతి పూర్తిగా అర్థమైంది. ఒళ్ళు అలవనియ్యడు. బట్ట మాయనియ్యడు. వట్టి సోమరిపోతు 'పెద్దోళ్ళలో తిరుగుతున్న' అని చెప్పుకోవడం తప్ప, వాళ్ళు వీసమెత్తు విలువ కూడా యివ్వరని, సిగరెట్లు, సీసాలు మోయడం, మిగిలింది తాగడవే వీడిపనని తెలుసుకున్నాడు. అయినా 'తనకు పిల్ల కావాలి. అన్న బిడ్డ కనుక అడగడానికి సైదులే దానికి తగిన వాడు' అని వారానికోసారి గుర్తు చేస్తూనే వున్నాడు.

'యియ్యాల మంచిది గాదు' అని ఒకనాడు, 'మా అన్నలేడు' అని మరోనాడు, 'నాలుగు నెల్లుబోతే నీ పనితనం జూసి, మన్నే పిల్లనిస్తనని వస్తడు' అని మరో రోజు, ఏడాది సాగదీశాడు. అడిగినప్పుడల్లా మాటలు చెబుతూ, తాగాలనుకున్నప్పుడల్లా బిక్షాన్ని తీసుకపోయి డబ్బు ఖర్చు చేయించసాగాడు. అయినా భరిస్తున్నాడు. ఒకనాడు గొర్లగాసుకుంట తన బాధంతా, నారుమడికి నీళ్ళు పెడుతున్న ఒడ్డెరోళ్ళ కులపెద్ద పిచ్చయ్యకు చెప్పుకున్నాడు.

"వారి నువ్వెంతతిక్కలోడివిరా. యాడాది సంది అడగలేదంటే, యింకెంత కాలవైనా యిట్లనే,నీ జేబుల డబ్బులు తాక్కుంట, నిన్ను ఎంట దిప్పుకుంటడు. యిస్తే యిచ్చిండు. లేకపోతేలేదు. రేపు బేస్తవారం మంచిది. తల్లి ముగ్గురు బొయ్యి అడగండి. తమ్ముడి వరసన మీ అమ్మ అడగొచ్చు. తప్పులేదు" అని చెప్పాడు. ఆ రాత్రే తల్లికి పిచ్చయ్యతో మాట్లాడిన సంగతంతా చెప్పాడు.



మరునాడు ఉదయమే తయారై "యేవే, ఎల్లి అడుగు దామనుకుంటున్నం బావా మీ అన్నని. ఓలి ఎంతైనా ఏంలేదు" అన్నాడు చెప్పకుండా వెళ్ళడం బాగోదని.

"వారి... నేను రానన్ననా? యిప్పిస్తనని పిలసకొచ్చింది నేను. గుడిసేపిచ్చింది నేను. వస్తవా" అన్నాడు. యింక ఆగేట్టు లేరు. ఒప్పుకుంటే తన పెద్దరికం నిలబడుద్ది. లేదంటే పోయేది మాటే గదా' అని ఆలోచించాడు. వెళ్ళేసరికి రాములు అల్లిన ఈతాకు పట్టెల్ని కాళ్ళకింద పెట్టుకుని, ఈతాకుతో కలిపి కుట్టసాగాడు. వచ్చిన విషయం మెల్లగా సైదులు బైట పెట్టాడు.

"నా బిడ్డను సంపనైనా సంపుకుంటగని, ఉత్తరాదోళ్ళకియ్య. రెండో పిల్లను ఆదేసం యిస్తే, కన్న కష్టాలు బెట్టింరు. ఆ నా కొడుకు నా బిడ్డను తీసకపొయ్యి కోంటోళ్ళింట్లెకుదవ బెట్టి, డబ్బుల్దీసుకుని దేశాల మీద బడిపోతే, వడ్డీతోటి గట్టి బిడ్డను దెచ్చుకున్న. మీ ఉత్తరాదోళ్ళను అసలే నమ్మగూడదు. ఓలి పదేలిచ్చినా, ఆ దేశమోళ్ళకియ్య' అని తెగేసి చెప్పాడు.

ఉత్తరం వైపు నున్న జెర్రిపోతుల గూడెం నుంచొచ్చిన బిక్షం. లింగగిరి సంబంధం తప్పిపోయినందుకు చాలా బాధ పడ్డాడు. తల్లి ఈతాక్కుపోయి, ఈదుల్లో కూర్చుని వలవలా ఏడ్చింది. తవ్వేడు కల్లుదాగి, యింటి కొచ్చి "బిడ్డా మనూరు బోదాం పోరాదు. ఈడ ఏం బావుకుంటున్నం?" అంది భూదేవమ్మ ఏడ్చుకుంట.

"ఎందుకే? అంజలిపురంల మనకులపోళ్ళున్నరు. అడిగి సూద్దాం. ఏడ్నోసోట దొరక్కపోదు. గొర్లకు మేత కూడా బాగనే దొరుకుతుందాయె. యిప్పుడెందుకు పోవడం?" అని సముదాయించాడు కొడుకు.

అన్నమ్మ, అడివమ్మ నాట్లకు, కలుపులకు కలిసిపోవడం, కష్టసుఖాలు కలబోసుకోవడం, యింటి కాదున్న నాడు కబుర్లాడుకుంటూ ఊళ్ళో తిరిగి అన్నం అడక్కొచ్చుకోవడం చేయసాగారు. పిల్లలకు స్నానాలు చేయించడం. బట్టలు వేయడం, అప్పుడప్పుడూ అన్నం వండటం వంటి పనుల్లో అన్నమ్మకు చేదోడుగా ఉండసాగింది. దీంతో కాస్త విశ్రాంతి దొరుకుతోంది.

ఒకనాడు చింత చిగురుకు వెళ్తొస్తూ "ఎంత కాలవిట్ల ఉంటవ్ సెల్లే? సూస్తుండంగనే యాడాదాయెమా కాడికొచ్చి. ఈడుబోతే వస్తదా? సక్కటి రూపునీది. అడదైపుట్టినంక, బిడ్డల్లేకుంటే గొడ్డుబోద్దనరా? నువ్వ మళ్ళా లగ్గం జేసుకుంటే నీ కడుపూ పండుద్ది. మీ అన్నా సంతోషపడ్తడు. మీ అన్నకేమో యిప్పట్ల పిల్లకుదిరేట్టు లేదాయె" అంది.

"నాకూ చేసుకోవాలన్నదే ఉందక్కామన్న బాధ జూస్తుంటే. కాని ఎవడు జేసుకుంటడు సెప్పు?" అంది అడివమ్మ.

"ఎవడో ఎందుకే? నా మొగుడ్నే జేసుకో. యిద్దరం యిట్లనే కలిసుండొచ్చు. కలిసి కాపురం జేసుకోవచ్చు. ఎంత మంది లేరు మన కులంల?" అంది అన్నమ్మ. అడివమ్మకు మొగుడు దొరికినట్లుంటది. అది కూలికి బొయ్యి గింజలు దెస్తే, తను చాపలల్లుకుంటూ యింటి పట్టున్నే ఉండొచ్చు. అన్నిటి కంటే ముందే మొగుడు రాత్రి పెట్టే నరక యాతన నుంచి విముక్తి కలుగుద్ది' అని దూరాలోచన చేసింది. మెత్తబడ్డ అడివమ్మ అమాయకంగా ఒప్పుకుంది. బిక్షం గొర్రెలకు, భూదేవమ్మ ఈతాక్కు పోగానే మొగుడ్ని, అడివమ్మను గుడిసెలో తోలి, గుడిసె ముందు కాపలా కూర్చుని, ఈతమట్టల్తో పొరకలు కడుతుండేది.

ఒకనాడు వాంతులయ్యేసరికి తల్లీ, అన్న నిగ్గదీశారు. సైదులు బావ లగ్గం జేసుకుంటనంటే ఒప్పుకున్న. అక్క గ్గూడా ఎరికే" అంది అమాయకంగా.

"టాట్...! అది గూడెంల ఎవడికాడ బండి కడుపు జేసుకుందో? దానికి, నాకూ ఏ సంబంధం లేదు. నన్ను అన్నరంటే, టేసన్‌ల బెట్టి పోలీసుల్తోటి కొట్టిపిస్తా, కచ్చీర్లకి నడిపిస్తా" అని భయపెట్టాడు.

బిక్షం బిక్కచచ్చిపోయాడు. భూదేవమ్మ నెత్తీ, నోరు బాదుకుంటూ గూడెవంతా తిరిగి చెప్పుకుంది. అన్నమ్మ మొగుడి పక్షాన మాట్లాడుతూ "ముందీ గుడిసె బీక్కుని మీ ఊరుబోండి" అని నోరు జేసుకుంది. తల్లీ, కూతుళ్ళు లబలబా మొత్తుకుంటూ వెళ్ళి, ముఠాపనికి పొయ్యే ఒడ్డెరోళ్ళ కాళ్ళు, గడ్డం పట్టుకుని న్యాయం చెప్పమని వేడుకున్నారు. మట్టి పనికి పోయే వాళ్ళంతా ఆగిపోయారు.

"నువ్వు ఆ అమ్మాయి సెయ్యిబట్టుకుని, గుడిసెలకి గుంజకపోంగ, చాలా మంది ఆడోళ్ళు జూసింరు. నీ పెళ్ళవే పండ బెట్టుద్దని గూడెవంతా కోడై కూస్తుంది. మర్యాదగా అమ్మాయికి తాళిగట్టి గుడిసెలోకి తెచ్చుకో. లేదంటవో మేవంతా బిక్షవెమ్మటి టేషన్ కొచ్చి, నీ మీద కేసుబెట్టిచ్చి, నీ ముడ్డి బొక్కిరగ గొట్టిస్తం" అన్నాడు మేస్తిరి కనకయ్య. ఆడోళ్ళు, మగోళ్ళు కూడి తలో మాట అనే సరికి తప్పు ఒప్పుకుని, తాళికట్టి ఆ రాత్రికే గుడిసెలోకి తెచ్చుకుండు.

మరుసట్రోజు అడివమ్మను ఆనందంగా కూలికి పంపి, యింటి వద్దే ఉండిపోయింది. షికారుకు పోదామని వలల కోసం యింటికొచ్చిన సైదులుకు, ఈతాకు చీలుస్తూ పెద్ద పెళ్ళాం గుడిసె ముందు కన్పించింది.

"కూలికి పోలేదేందే?" అనడిగాడు.

"యింగ నాకేంపని. అడివి దెస్తే సాలదా? అందరం తినొచ్చు. సాలకుంటే ఊళ్ళెకి బొయ్యి అడక్కొస్తగా, నా ఒంట్లె బాగుండట్లేదు. అందుకేగా దాన్ని నీ పక్కలకి జేర్చింది." అంది అన్నమ్మ. వెంటనే సైదులుకు

కడుపు మండిపోయి ఎక్కడలేని కోపం వచ్చింది.

“నువ్వు పనికి బోకుండ, ఇంట్లె పండనీకి దొరసానివానె?” అని కావడి బద్ద తీసుకుని ఒక్కటేశాడు. పనికి పోయిందాకా బాదుకుంటూ, అప్పటి కప్పుడు పనివైపు ఉరికించాడు. యిద్దరు భార్యలు కూలికి బొయ్యి తెస్తుంటే, గతంలో కంటే కులాసాగా తిరగసాగాడు.

D D D

బుడిగ జంగాల్లో నూటికి తొంభై ఐదు మందికి చదువురాదు. లింగగిరి జంగాల కసలేరాదు. చదువురాని గోవిందుకు పద్దెనిమిది రకాల భాగవతాలు, పదిహేను రకాల తోలుబొమ్మలాటల పద్యాలు, మాటలు, పాటలూ, కంతలూ వచ్చు. వయసు డెబ్భై ఎనిమిది సంవత్సరాలు. ఆ ఏడాది కూడా ఊరుకు కీడు కలక్కూడదని, ఆడ కూలీల ముఠామేస్త్రి భద్రమ్మ తోలుబొమ్మలాడించేందుకు రెండు బస్తాల ధాన్యమిస్తానని ఏర్పాటు చేసింది. ఆటకోసం గోవిందు పెద్ద కొడుకు ఎల్లయ్యను బొత్తల పాలెం నుంచి పిలిపించాడు. కేతిగాడి మాటలు, బంగారక్క హోయలు తెరమీద చక్కగా పలికిస్తాడు ఎల్లయ్య. పెళ్ళయిన కాడ్నించీ అత్తగారి ఊరికి వెళ్ళిపోయి, బామ్మర్దులతోపాటు బతకసాగాడు. తోలు బొమ్మలాటకు వెళ్ళిన బిక్షం, ఎల్లయ్యను కలిసి పిల్లగురించి అడిగాడు.

“మా బామ్మర్ది బిడ్డుంది. కాలు కాస్త అవుడు. యిస్తడేమో అడుగుత. ఓలి మాత్రం మూడేలియ్యాల్సిందే. లేకుంటే ఒప్పుకునే మడిసిగాదు” అన్నాడు.

“యిస్తన్నా, అవుడయినా ఏం గాదు. ఆడదైతేసాలు. యిప్పటి దాకా పెళ్ళిగాక అందరు నన్ను అటీటు గానోడంటుంరు” అన్నాడు దీనంగా.

D D D

అడివమ్మకు ఐదోనెల. అయినా నాట్లకు, కలుపులకు పోతూనే వుంది. తల్లి, అన్న అక్కడ్నుంచి వెళ్ళిపోతున్నారని లేచిన కాడ్నించి వెక్కివెక్కి ఏడ్వసాగింది.

“గుబులు బడకు బిడ్డా. నువ్వెప్పుడు కబురు జేస్తే అప్పుడొస్తగా, దగ్గరే ఊరు. యిదుగో నీ అరసం కింద ఈ పోతుపిల్లని, ఈ మరకపిల్లని ఉంచేసుకో” అని రెండు గొర్రె పిల్లల్ని మందలోంచి తెచ్చి, గుడిసె ముందు గుంజకు కట్టేసింది భూదేవమ్మ. బిక్షం ఆ చుట్టు పక్కల వాళ్ళందరికీ చెప్పి, కన్నీళ్ళు తుడ్చుకుంటూ, గొర్రెల్ని తోలుకుంటూ ఎల్లయ్య వెనకాలే బొత్తల పాలెం దారి పట్టాడు.

“ఈసారన్నా నా కొడుక్కు పిల్లకుదిరేట్టు సూడుతల్లే. వచ్చే పంటల మీద నీ కాడికొచ్చి. కోడిపుంజును కోస్తా” అని వేడుకుంటూ తూర్పు మళ్ళి, లక్కారం మైసమ్మకు దండం బెట్టుకుని, కట్టగట్టిన ఒంటి గుడిసెను తలకెత్తుకుంది భూదేవమ్మ.

V

# ‘మనది’ కాని ‘మన’

**జనజ్వాల**



అరచేతి వ్రేళ్ళ నాట్యానికి
పురివిప్పిన మనది కానిమన
వాయిదాల టీవి
పాట పాడుతుంది, అర్థమై అర్థం కానట్లు మాట్లాడుతుంది

అరచేతి వ్రేళ్ళ నాట్యానికి
ఆమడ దూరంలో వున్న మనదికాని మన
కారు రెక్కలు విచ్చుకుంటుంది. హంసలా నడుచుకుంటూ వస్తుంది
భూమి పొరల మీద భ్రమల కొవ్వొత్తి స్వప్న గీతానికి
నాయకుడు కాని నాయకని చేస్తుంది

అరచేతి వ్రేళ్ళ నాట్యానికి
‘కీ’ ఇవ్వబడ్డ మనది కాని మన
కొయ్య గుర్రం సప్త సముద్రాలను దాటిస్తుంది.
గుహలో, తొర్రలో, దేవి విగ్రహతలలో దాగి వున్న
మాయల పకీరు ప్రాణ చిలుకతో హలోహలోమని మాట్లాడిస్తుంది

అరచేతి వ్రేళ్ళ నాట్యానికి
రోడ్డు ప్రక్కల మొలచిన మనది కాని మన
ఇనుపచెట్టు డాలర్ల ధార కురిపిస్తుంది
కోర్కెల దాహం తీరుస్తుంది

అరచేతివ్రేళ్ళ నాట్యానికి
కరిగిపోయిన కాగితాల కలాల అదృశ్య దృశ్యాలకు పూచిన
మనది కాని మన ‘కాలుక్యులేటర్’ బ్రతుకు లెక్కల్ని నేర్పిస్తుంది,
చూపిస్తుంది
ఇప్పుడు మనం మన అరచేతుల్ని ముద్దాడుకుందాం
ఇప్పుడు మనం మన అరచేతికి అతికించుకున్న వ్రేళ్ళను
ముద్దాడుకుందాం
అంతేకాదు... వ్రేళ్ళను, జేబుల్లోనో... బీరువాల్లోనో... బ్యాంక్
లాకర్లలోనో...
ఎక్కడో ఒక చోటనో భద్రపరుచుకుందాం
ఇప్పుడు మనకు కావల్సింది వ్రేళ్ళు
నాట్యం నేర్చుకొని మనల్ని నాట్యం చేయిస్తున్న వ్రేళ్ళు
ఇప్పుడు మనకు ఒక తోడు కావాలి.
బుర్రలు భస్మాస్త్రం కింద బూడిదై
‘కంప్యూటర్ల’ బుర్రలు మొలచుకొచ్చినవి కదా
ఇప్పుడు మనకు ఒక తోడు కావాలి
అదే వ్రేళ్ళకు ఒక కంటి చూపు కావాలి
ఇప్పుడు మనమంతా వ్రేళ్ళ నాట్యానికి
ఎవ్వరో వ్రేళ్ళా కంటి చూపు నాట్యానికి, మాటపడిపోయిన
మరమనుష్యులం
ఇప్పుడు మనమంతా మర మనుష్యులం
అవును మనమంతా ఇప్పుడు మనుష్యులం... మర మనుష్యులం...

ఏం జరుగుతుంది తర్వాత?
విక్రమార్క రాజా చెప్పు
తెల్సి సరియైన సమాధానం చెప్పకుంటె
నీ తల సారీ... ‘కంప్యూటర్’ బుర్ర వెయ్యి ముక్కలవుతుంది
నీ మీది మర ‘శరీర’ శవం ఇండియా గేట్‌కు, కాదు
ప్రపంచ ఖడ్గానికి వ్రేలాడుతుంది



Untitled-2 10 6/11/2002, 3:51 PM

# నూతన ఆలోచన... జనకథాలోచన...




సాహితీరంగంలో వినూత్న ప్రక్రియ జనకథాలోచనం ఇటీవల నగరంలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జరిగింది. సాహితీ స్రవంతి ఆధ్వర్యంలో జరిగిన ఈ సదస్సులో కథకు సంబంధించిన సందేహాలను తీర్చుకోవడంతో పాటు తాము రాసిన కథకు సంబంధించిన కథాంశాన్ని వినిపించి అభిప్రాయం కోరడం విశేషం. ఈ కార్యక్రమంలో చంద్రశేఖర్ ఆజాద్, ఓల్గా, ఖదీర్‌బాబు, కేతు విశ్వనాథరెడ్డి, ముక్తవరం పార్థసారధి పాల్గొన్నారు. వక్తల క్లుప్త సందేశాలతోపాటు పాల్గొన్న ఔత్సాహిక కథకులు అనేక ప్రశ్నలు, సందేహాలు వ్యక్తం చేశారు. పూర్తి మాండలికం కాకుండా, పూర్తి వ్యవహారికం కాకుండా కథలు వస్తున్నాయి... వాటిని ఎలా చదవాలి.. ఎలా అర్థం చేసుకోవాలి' అని టి.వి. రావు సందేహం వ్యక్తం చేశారు. 'పత్రికల్లో ప్రచురించడానికిగాను కథలో కొన్ని వాక్యాలను రచయిత అనుమతితోనే తీసివేసినా దాని బలం తగ్గదా' అని రహమతుల్లా అడిగారు. కథను ప్రచురించడం కోసం ఎడిట్ చేయడం సరైన పద్ధతి కాదని ఆర్టిస్టు చంద్ర అభిప్రాయపడ్డారు. 'ఔత్సాహికులు రాసిన కథలను ముందుగానే సీనియర్లకు ఇచ్చి వాటి బాగోగులు ఇలా సభలో చర్చించడం వలన మరింత ప్రయోజనం కలుగుతుంది' అని సిరంశెట్టి కాంతారావు సూచించగా 'కథ ఎలా మొదలు పెట్టాలి. ఎలా ముగించాలో చెప్పాలి' అని కుమారస్వామి అడిగారు. 'ఒక ఇజానికి లోబడినప్పుడు కథ పరిధి తగ్గుతుందా' అని శ్రీరామ్ సందేహం వ్యక్తం చేయగా 'తాను నోటితో చెప్పిన కథలు బాగున్నాయన్న వారే పేపర్ మీద రాసి ఇస్తే బాగోలేదంటున్నారు. దీనికి పరిష్కారం ఏమిటి' అని పసుపులేటి మల్లయ్య అడిగారు.

## ఆంధ్రజ్యోతి

దామోదర్ అనే విద్యార్థి చర్చలో పాల్గొంటూ పాఠకుడిని చదివించేలా కథ రాయాలా...? పాఠకుడు చదివే కథలే రాయాలా అని అంటూ ఇప్పుడు వస్తున్నవి ఏ ప్రక్రియకు చెందినవో చెప్పాలని కోరారు. కథాంశం మాత్రమే కాక కథ పూర్తిగా చెప్పడానికి కూడా సమయం కేటాయిస్తే బాగుండేదని, ఇలాంటి జనకథాలోచనం వార్షిక సమావేశంగా జరపాలని సూచించారు. బాలసాహిత్యంపై చర్చను పెండెం జగదీశ్వర్ లేవనెత్తారు. తాము పిల్లల కథలు రాస్తున్నామని తెలిసి అనేక మంది చిన్నచూపు చూస్తున్నారని, ముఖ్యంగా సైన్స్ కథలు రాస్తుంటే పిల్లల్ని హేతువాదులుగా మారుస్తున్నారనే విమర్శలు వస్తున్నాయని చెప్పారు. సదస్సుకు హాజరైన వారిలో సీనియర్లు, జూనియర్లూ ఉన్నారని, కథ యొక్క కాన్వాస్ ఏమిటో వారికి అర్థమయ్యేలా చెప్పండని అడిగారు. కథలో సంఘర్షణ, పతాకస్థాయి, ముగింపు, టెంపో... ఇలాంటి పదాలన్నింటికీ అర్థాలు చెప్పండని కోరారు.

సీనియర్లలో ముందుగా ఓల్గా ప్రసంగించారు. ఎవరి జీవితం వారికి పూర్తిగా అర్థమవుతుందా అని ప్రశ్నిస్తూనే జీవిత వాస్తవాన్ని వాస్తవికతగా మలచుకోవాలని సూచించారు. ఈ క్రమంలో సామాజిక చలన సూత్రాలను అర్థం చేసుకోవాల్సిన అవసరం కూడా ఉందన్నారు. స్త్రీలకు సంబంధించిన

### అస్పష్టత తొలగాలి...



కథలు రాయడంలో ఒక్కోరికి ఒక్కో శైలి ఉంటుంది. కొన్ని సూత్రాలు ఏర్పరచుకొని కథలు రాయాలా? కథలు రాశాకే సూత్రాలు ఏర్పడతాయా అన్నది స్పష్టమవ్వలేదు. పత్రికల్లో పేరున్న రచయితలు, ప్రముఖులు అని వస్తుంది. పేరుకు ఉన్న ప్రాముఖ్యత వారి కథలకు లేదని అనిపిస్తోంది. పేర్లు చూసి కథలను చదివే పద్ధతి పోవాలి. అలా ఓపిక లేకుంటే చదివే స్థానంలో ఉండకుండా ఉంటే మంచిది.

**–ఐనాల సైదులు, కరీంనగర్**

### తరచూ జరగాలి...



చాలా కాలం తరువాత ఓ మంచి కార్యక్రమానికి హాజరయ్యాను. ఇలాంటి కార్యక్రమాలు తరచూ జరుగుతుండాలి. కొత్త రచయితలు పుట్టుకు రావడానికి ఇలాంటి సదస్సులు ఇలాంటి సదస్సులు దోహదం చేస్తాయి. వర్ధమాన రచయితలకు కావాల్సిన సలహాలు, సూచనల్లో కొన్నయినా లభించాయి. వక్తలు చాలా విషయాలు మాట్లాడారు. అందులో నాకు కావాల్సిన వాటిని నేను గ్రహించాను. ముఖ్యంగా నేను బాలల కథకుడిని. ఆ విషయంపై కొంత సేపయినా చర్చ జరిగినందుకు సంతోషంగా ఉంది.

**–పెండెం జగదీశ్వర్, నల్గొండ**



Untitled-2 11 6/11/2002, 3:51 PM



**పదజాలం తెలుసుకున్నాను...**

నేను ఇప్పుడిప్పుడే చిన్న చిన్న కవితలు రాస్తున్నాను. కథలు రాయాలన్నది నా ఉద్దేశం. ఆ ప్రయత్నంలో ఉన్నాను. ఇక్కడ చాలా మంది పెద్దలు మాట్లాడారు. నాకు ఈ పదజాలం కూడా కొత్తే. అనేక కొత్త సంగతులు తెలిసాయి. ఎటువంటి కథలకు ప్రాధాన్యత ఇవ్వాలి. ఎలా రాయాలనే విషయమై కొత్త విషయాలు తెలుసుకున్నాను.

**-శైలజ, వరంగల్**

ప్రశ్నలను రచయిత్రులను మాత్రమే ఎందుకు అడుగుతారని అంటూ స్త్రీ సమస్యలను స్త్రీలకంటే బాగా చలం, కొ.కు. వంటి వారు రాశారని చెప్పారు. స్త్రీల మీద సానుభూతి లేకుండా రాసే రచయిత్రులు కూడా ఉన్నారని గుర్తు చేశారు. చంద్రశేఖర్ ఆజాద్ మాట్లాడుతూ తప్పకుండా పాఠకులు చదివే కథలే రాయాలని, మంచి రచనలు చదివే పాఠకులను తయారు చేసుకోవాల్సిన బాధ్యత కూడా రచయితలదేనని అన్నారు. ఎవరికోసం కథ రాస్తున్నామన్నది కూడా ముందే స్పష్టంగా నిర్ణయించుకోవాలని కూడా చెప్పారు. ముక్తవరం పార్థసారథి మాట్లాడుతూ కథ ఒక సజీవ జీవన చిత్రణ అనుకున్నప్పుడు ఒక్కో కథకు ఒక్కో శిల్పం, నిర్మాణం అవసరమవుతుందని అన్నారు.

మహ్మద్ ఖదీర్‌బాబు మాట్లాడుతూ ఈ సదస్సును రచయితలు-పత్రికలు, కథా రచన-సమస్యలు, భాషా సమస్యలు-మాండలికాలు.. ఇలా విభజించి నిర్వహిస్తే బాగుండేదని అన్నారు. కథలు రాయడంలో ముస్లింలకు సంబంధించి కొన్ని ప్రత్యేక సమస్యలున్నాయని, వారు తమ భాషలోగల సౌందర్యాత్మక పదజాలాన్ని తెలుగులో చెబితే అంత అందంగా రావడంలేదని అన్నారు. రహమతుల్లా కథను సాటి ముస్లిం రచయితగా ఎడిట్ చేసినట్లు చెప్పారు. కథకునికి తప్పనిసరిగా నిజాయితీ ఉండాలని కేతు విశ్వనాథరెడ్డి అన్నారు. జీవితంలో వ్యక్తిగత అనుభవం కంటే గొప్ప సంగతి మరేమీ ఉండదని చెప్పారు. కొత్త వారు పాత కథలన్నింటినీ క్షుణ్ణంగా చదివి అధ్యయనం చేసి తమ కథల్లో నవ్యతను చూపించాలని సూచించారు. బాలసాహిత్యాన్ని ప్రోత్సహించక పోవడం నిజమైన దుర్మార్గమని అన్నారు.

ప్రశ్న-జవాబుల రూపంలో ఈ కార్యక్రమం జరగనప్పటికీ వక్తలు తాము మాట్లాడే సమయంలోనే పలు సందేహాలకు సమాధానమిచ్చారు. మొత్తం ఈ కార్యక్రమాన్ని సాహితీ స్రవంతి కన్వీనర్ తెలకపల్లి రవి సమన్వయం చేశారు. ఇప్పటి వరకు జరిగిన చర్చ ఔత్సాహికులకు దోహదపడుతుందని ఆశిస్తున్నట్లు చెప్పారు. ఇక్కడ వచ్చిన సలహాలు, సూచనలను దృష్టిలో పెట్టుకొని భవిష్యత్తులో కార్యక్రమాన్ని రూపొందిస్తామని అన్నారు. ఈ కార్యక్రమంపట్ల సాహిత్యాభిమానులకు ఉత్సాహం కలగడం పట్ల సంతోషం వ్యక్తం చేశారు. ఈ విశేషాలన్నింటితో ప్రస్థానం పత్రిక తదుపరి సంచిక వస్తుందని చెప్పారు.

**'ఆంధ్రజ్యోతి' 30 సెప్టెంబరు, 2003**



## 'జనకథాలోచనం' పై సూచన

ఈ రోజు నిర్వహించిన జనకథాలోచనలో వర్ధమాన కథారచయితలకు సంతృప్తి కరమైన సమాచారం లభించక పోయినా కథన రీతులు, కథల్లోని వాదాలు, కథల్లో వాడుతున్న మాండలిక భావాల ద్వారా ఒనగూడుతున్న అస్పష్టతా భావాలు వెల్లడి అయ్యాయి. కథలు నడిపే తీరు, మంచి కథా రచయితగా ఎదగడానికి సూచనలు అంతగా లభించలేదు.

మొదట్లో కథారంగంలో నిష్ణాతులైన ప్రముఖ కథారచయితలు ప్రారంభంలో వారి విధానం, వారు ప్రస్తుత పరిస్థితికి చేరుకోవడానికి వారు ఎలా కృషి చేసారు, వారి కథారచనల్లో వారు ఎదుర్కొన్న అనుభవాలు- అనుభూతులు తెలియజేస్తే అవి నూతన కథకులకు ఆదర్శవంతంగా, స్ఫూర్తిదాయకంగా వుండి ఉపయుక్తంగా వుండేవి. అంశం మరింత అర్థవంతంగా వుండేది.

అలాగే ఒకటి రెండు కథలను ప్రయోగాత్మకంగా వివిధ రకాలుగా ప్రారంభించి- సాగించి- ముగింపులు చెబితే అదొక శిక్షణానుభూతిని కలిగించే విధంగా వుండేది. ప్రస్తుతం పత్రికల స్థితిగతులు, ప్రచురణ తీరులను వివరించి పత్రికలకు రాసే వారికి తగు సూచనలు, సలహాలు అందించాల్సింది. ఎందుకంటే ఈ రోజుల్లో పత్రికల స్థితిగతులు, విధానాలు తెలియక వర్ధమాన రచయితలు పత్రికలకు తమ తమ ధోరణుల్లో రచనలు పంపి అవి ప్రచురించబడక (పత్రికా కట్టుబాట్ల కారణంగా) తను రాసినవి రచనలు కావని పత్రికలో ప్రచురించబడలేదని మనస్తాపంతో క్రమేణా సాహిత్య సేవపైనా అధ్యయనంపైనా అనాసక్తి చూపుతున్నారు. దరిమిలా కొత్త రచయతల కొరత, విలువైన రచనల లేమి ప్రస్తుతం నెలకొని వుంది. ఇలాంటి విషయాల గురించి భవిష్యత్‌లో విరివిగా ఆలోచించి అందరికీ అందుబాటులో వుండే తీరున తగు నిర్ణయాలు ఆచరణాత్మకంగా... కార్యరూపం చేయడం సర్వత్రా శ్రేయస్కరం.

ఇక సాహితీవేత్తల చిత్రపట ప్రదర్శన ప్రయత్నం బాగుంది. రచనలేగాక రచనల సృష్టికర్తల రూపాలను కూడా చూసే భాగ్యం కలిగించిన తీరు బాగుంది. రచయిత సూక్తులే కాకుండా వారి జనన మరణ తేదీలు, జన్మస్థలాల వివరాలు కూడా మరింత విపులంగా ముద్రించి వుండాల్సింది అనిపించింది. ప్రస్తుతం ఉన్న రచయితల ఫొటోలతోపాటు మరికొందరు స్త్రీవాద రచయిత్రులు, స్థానం, బాలగంగాధర్‌తిలక్, తిరుపతి వెంకటకవులు, మొదలైన వారి ఫొటోలకు కూడా స్థానం కల్పించాల్సింది. ఏది ఏమైనా ఇదొక ఆలోచించదగ్గ ఆదర్శనీయ పరిణామం. మీరుచేస్తున్న ఈ కృషికి మావంతు సహాయంగా మాకు దొరికిన చిత్రాలు, పుస్తకాలు (జిరాక్స్ కాపీలైనా)మీకు పంపిస్తాము.

**-అమ్మిన శ్రీనివాసరాజు, చర్ల**
**('ప్రస్థానం'కు లేఖ)**



Untitled-2 12 6/11/2002, 3:51 PM



ప్రసంగిస్తున్న శివారెడ్డి

# కవిత్వంపై ప్రేమతోపాటు పట్టు పెంచుకోవాలి

**వి. ఉదయలక్ష్మి**

కవులు ఎప్పటికప్పుడు అప్ టు డేట్ చేసుకోవాలని, అధ్యయనం చేస్తే తప్ప, కొత్త కోణాలు కలుపుకుంటే తప్ప మంచి కవిత్వం రాయలేరని అన్నారు కె. శివారెడ్డి– "ప్రతి కవికి పోయమ్ చేసే పద్ధతి వుండాలి. మీరే పని చేస్తున్నా మీలో కవి సజీవుడై వుండాలి. ఒక కవిత రాసినప్పుడు మళ్లీ మళ్లీ చూసుకోవాలి. తదేక ధ్యానం లేకపోతే మంచి కవిత్వం రాదు. కవిత్వం చాలా డిమాండ్ చేస్తుంది. దాని పట్ల ప్రేమ పెంచుకోండి. అనుమానాలుంటే సీనియర్ కవులతో ఉత్తర ప్రత్యుత్తరాలు సాగించండి. పదం మీద పట్టు సంపాదించండి."

"కవితావరణం – పరిణామం" గురించి ప్రసంగిస్తూ వీధి కవిత్వం రావాలన్నారు కవి, పరిశోధకులు సీతారామ్. "కవిత్వానికి సంబంధించిన ప్రాథమిక విషయాలపై ఇప్పటికీ పుస్తకాలు రాలేదు. కవితావిర్భావానికి దారి దీపం ఇచ్చిన శ్రీశ్రీ 'కవితా ఓ కవితా'పై ఇప్పటికీ ఒక్క ఎంఫిల్ కూడా రాలేదు" అన్నారాయన. "సెన్సిబిలిటీ లేకపోతే కవిత్వం రాదు. కవి మానసిక భావనా స్థితి, మూడ్ ఇందుకు దోహదం చేస్తాయి. సాధారణ భాషకు విస్తరణరూపమే కవిత్వ భాష. కవితా వస్తువు సామాజికమైనప్పుడు వైవిధ్యం వస్తుంది" అన్నారు సీతారామ్. కవి, పరిశోధకుడు యాకూబ్ మాట్లాడుతూ కవితా చైతన్యం కవిత్వ పుట్టుకను నిర్దేశిస్తుందన్నారు.

సాధారణ వచనం నుండి కవిత్వాన్ని ఏది వేరు చేస్తుందో కవిత్వం రాయాలనుకునేవారు గుర్తించాలన్నారు దేవీప్రియ. "గొప్ప కవుల కవిత్వాన్ని చదవండి. వారు ఎలా రాస్తున్నారు? వారు తీసుకున్న అంశాలేమిటి? వాటిని కవిత్వం చేయడానికి వాడుకున్న టూల్స్ ఏమిటి? – అనే అంశాలను పరిశీలించండి. నిరంతరమూ కవిత్వపుటాలోచనలు వెలుగుతూనే వుండాలి. వ్యక్తీకరణకు అవసరమైన భాష చాలా ముఖ్యం. భాషకు గట్టి పునాది అవసరం. ఇది అధ్యయనం ద్వారా అలవడుతుంది. చదవడం వలన భాషా పరమైన పరిజ్ఞానం పెరుగుతుంది" అని సూచించారు. నిబద్ధంగా, గాఢంగా, సున్నితంగా కవిత్వం చెప్పేందుకు సాధన చేయాల్సిందిగా నాళేశ్వరం శంకరం కోరారు. కవి జింబో కూడా ప్రసంగించారు. ఔత్సాహిక కవులు, రచయితల కోసం ఇలాంటి కార్యక్రమాలు ఇక ముందు కూడా నిర్వహిస్తామన్నారు సాహితీ స్రవంతి కన్వీనర్ తెలకపల్లి కవి. చింతా అప్పల్నాయుడు, శీరంసెట్టి కాంతారావు, వివిఎస్వి ప్రసాద్, ఇందిర, బాల చంద్రశ్యామ్, కె. బ్రహ్మయ్య, నవీన్ తదితరులు కవితా పఠనం చేశారు. శాంతారావు, ఇందిర, కుమారస్వామి, కోడూరు శివ నాగేశ్వరరావు తదితరులు కవితా రచనకు సంబంధించి కొన్ని ప్రశ్నలు లేవనెత్తారు. జ్వాలాముఖి ముగింపు ప్రసంగం చేశారు. మొత్తం మీద ఈ వర్క్‌షాపు కవిత్వ సృజనకు సంబంధించి కొన్ని మార్గదర్శక సూత్రాలను అందివ్వడంలో... కవితా వ్యాసంగాన్ని సీరియస్‌గా తీసుకుని కృషి చేయవలసిన అవసరాన్ని ఎత్తిచూపడంలో కృతకృత్యమైంది.

**ప్రజాశక్తి**

**అక్టోబర్ 10, 2003**

## సమీక్షల శీర్షికకు...

1. ఈ శీర్షికలో సమీక్షకు రెండు ప్రతులు ఇవ్వాలి.
2. వ్యక్తుల పేరుమీద రాయనవసరం లేదు.
3. ఆరు నెలల కన్నా ముందు ప్రచురితమైన పుస్తకాలను దయచేసి పంపకండి. పంపినా సమీక్షించడం జరగదు. పంపిన వెనువెంటనే కంటే ఆ తర్వాతి సంచికలో సమీక్షించే అవకాశం ఎక్కువ.
4. సమీక్షలు రాయించి పంపడం, సమీక్షకులను రచయితలే తీసుకుని రావడం మంచి పద్ధతులు కావు.
5. సమీక్షలు చేయాలన్న ఆసక్తి వున్నవారు రాస్తే అవకాశాన్ని బట్టి ఇవ్వగలము. అయితే తీసుకున్న వారు సకాలంలో ఇవ్వలేకపోతే రచయితలకు, పాఠకులకు నిరుత్సాహం కలుగుతుంది.
6. ఇది వరకే వెలువడిన పుస్తకాలపై ఏదైనా రాయదలుచుకుంటే అది 'నచ్చిన రచనలు' శీర్షికకు పంపొచ్చు.


## అధ్యయనానికి, అభిరుచికి

| | | |
|---|---|---|
| సాహిత్య సంఘాలు–ధోరణలు | సం:తెలకపల్లి రవి | 75.00 |
| జన కవనం–2002 (కవితా సంకలనం) | | 75.00 |
| దర్పణం–సాహిత్య ప్రత్యేక సంచిక–2000 | | 35.00 |
| గమనం–సాహిత్య ప్రత్యేక సంచిక–2001 | | 40.00 |
| ప్రస్థానం–సాహిత్య ప్రత్యేక సంచిక–2002 | | 40.00 |
| వీక్షణ–సమీక్షణ (సారస్వత పరామర్శ) | తెలకపల్లి రవి | 40.00 |
| నవీన సాహితి | తెలకపల్లి రవి | 10.00 |
| శ్రీశ్రీ సాహిత్యం, సమకాలీనత | తెలకపల్లి రవి | 8.00 |
| ప్రచారరంగంలో వర్గపోరాటం | తెలకపల్లి రవి | 10.00 |
| సాహిత్యోద్యమం మార్క్సిస్టు అవగాహన | మోటూరు హనుమంతరావు | 9.00 |
| ప్రేమ్‌చంద్ సాహిత్యంలో వర్గదృక్పథం | రాంవిలాస్ శర్మ | 10.00 |
| కవిత్వం–సమాజం | కేతవరపు రామకోటి శాస్త్రి | 10.00 |
| భాషా సాహిత్య సమస్యలు– రాజ్యాంగ సవరణలు | పి. సుందరయ్య | 10.00 |
| ఆశయపథం | తెలకపల్లి రవి | 20.00 |

ప్రతులకు

ప్రజాశక్తి బుక్‌హౌస్

1-1-187/1, చిక్కడపల్లి, హైదరాబాద్–20, ఫోన్ : 276600123





Untitled-2 13 6/11/2002, 3:51 PM



కథాలోచనం అధ్యక్షులు రుక్మిణి










జనకవనం అధ్యక్షులు ఆనందాచారి







ప్రసంగిస్తున్న ముక్తవరం పార్థసారథి :వేదికపై చంద్రశేకర్ ఆజాద్, ఓల్గా, ఖదీర్‌బాబు, రుక్మిణి






జనకవనంలో ఆనందాచారి, శివారెడ్డి, జింబో, జ్వాలాముఖి, సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జరిగిన జనసాహిత్య సమ్మేళన దృశ్యాలు



Untitled-2 14 6/11/2002, 3:51 PM






ప్రసంగిస్తున్న రాచపాళెం చంద్రశేఖర్‌రెడ్డి, సభాధ్యక్షులు చలపతి, నాళేశ్వర శంకరం, ఖదీర్‌బాబు




దేవీప్రియ

చర్చలో
పాల్గొంటున్న
పలువురు
సాహితీ మిత్రులు













Untitled-2 15 6/11/2002, 3:51 PM

ప్రసంగం

# కథలు చదవడం, రాయడం, చర్చించడం ఒక అనుభవం

***రచయితల అనుభవాలు తను నివసిస్తున్న సమాజ జీవితానికి సంబంధించినవి. సమాజ కాలానికి, స్థలానికి సంబంధించినవి. అంటే సమాజానికి ఒక భౌగోళిక లక్షణం ఉంటుంది. ఒక చరిత్ర ఉంటుంది. ఒక సంస్కృతి ఉంటుంది. ఒక భాష, భాషా భేదంతో ఉంటుంది. ఇవన్నీ రచయిత అనుభవ సంపుటిలో భాగంగా ఏర్పడతాయి. వీటికి తోడు రచయిత జీవిత అవగాహన కోసం ఏర్పర్చుకున్న సిద్ధాంతాల, భావాల ప్రభావాలు ఉంటాయి. ఇవి అనుభవానికి గీటురాళ్ళుగా పని చేస్తాయి. అప్పుడు జీవితాన్ని అర్థం చేసుకునే, చేయించే శక్తులు అలవడతాయి. అయితే అనుభవాలకు హద్దులుంటాయి.***

**ముం**దుగా సాహితీ స్రవంతి మిత్రులకు, నా అభినందనలు తెలపాలి. ఇటువంటి ముఖాముఖి సమావేశాల్లో సమాన స్థాయిలో ఒకరితో ఒకరు మాట్లాడుకోవడానికి వీలుగా ఏర్పాటు ఉండివుంటే మరింత బాగుండేదని కొందరు మిత్రులు సూచించారు. ఆ సూచన సరైనదే అని నా అభిప్రాయం కూడా. శిక్షణా శిబిరాల్లో సమావేశాల్లో ఎత్తైన ప్రదేశం నుంచి ఒకరో, ఇద్దరో, ముగ్గురో మాట్లాడుతూ పోవడం మరి చాలా మంది వింటూ కూర్చోవడం ఏదో ఇబ్బందిగానే ఉంటుంది. అందులోనూ ఇటువంటి సందర్భాల్లో. ఈసారి మరింత సమయం తీసుకొని మరింత ఎక్కువ భాగస్వామ్యానికి– ప్రసంగకర్తలు, పాఠకులు, రచయితలు, సభికులు అనే తేడా లేకుండా ఉండే భాగస్వామ్యానికి– అవకాశం ఉండేలా చేస్తారని ఆశిస్తాను.

సాహితీ స్రవంతి మిత్రులు జన సాహిత్య సమ్మేళనం ఏర్పాటు చేసిన సందర్భంలో ఉపన్యాసకులు, శిక్షణా శిబిరానికి వచ్చిన రచయితలు, పాఠకులు చాలా విషయాల్ని చర్చకు పెట్టారు. వాటిలో ముఖ్యమైనవి :

1. రచయిత వ్యక్తిగత జీవితానికి రచనకు ఉండే సంబంధం
2. కథలో చిత్రించే జీవితం, అనుభవాలు.
3. సంభావ్యతకు, వాస్తవికతకు ఉండే సంబంధం.
4. నిడివి, క్లుప్తత
5. భాషా శైలులు.
6. స్పందింపచేసే గుణం.

ఈ అంశాలమీద సుదీర్ఘమైన చర్చలు జరిగాయి. కొందరు యువ రచయితలు తమ కథల్ని చదివారు. ఆ కథల నేపథ్యంలో పై అంశాలను గురించిన సుదీర్ఘ చర్చలు జరిగాయి. ఈ అంశాలన్ని రచయితలు తప్పనిసరిగా మనస్సుకు పట్టించుకోవలసినవే.



**1. రచయిత వ్యక్తిగత జీవితానికి రచనకు ఉండే సంబంధం :** జీవితాన్ని నైతిక దృష్టితో చూడటంవేరు, వాస్తవికంగా పరిశీలించడం వేరు. రచనల్లో పెట్టుబడిదారీ వ్యవస్థతో సంపూర్ణంగా విభేదిసస్తూ, దాన్ని ఉపయోగించుకొని బతుకుతూ రాయడం వంటి దాన్ని లేదా ఇంట్లో స్త్రీల హింసిస్తూ బయట మాత్రం మహిళా విముక్తి గురించి రాయడం దాన్ని ఏ విధంగా చూడాలి? శ్రీశ్రీ తాగడం, విశ్వనాథ సత్యనారాయణ బ్రాకెట్ ఆడటంవంటి విషయాలను ఏ విధంగా పట్టించుకోవాలి? ఇటువంటి ప్రశ్నలు మనిషి వ్యక్తిగత జీవితానికి, సాహిత్య సృష్టికి పోటీ పెడతాయి. ఈ సందర్భంలో కేవలం పరిమితమైన, సాపేక్షమైన నైతిక దృష్టితో రచయితలను, వారి రచనలను పరిశీలించడంవల్ల చాలా సమస్యలు ఉత్పన్నమవుతాయి. కానీ రచయితకు నిజాయితీ ఉండటం అవసరమనే విషయంలో భిన్నాభిప్రాయాలకు తావులేదు. నిజాయితీ అంటే తాను నమ్మిన సిద్ధాంతాలకు,భావాలకు, విశ్వాసాలకు వాటితో సంబంధమున్న ఉద్యమాలకు కట్టుబడి ఉండటం. వాటికి వ్యతిరేకంగా జీవితాన్ని జీవించకపోవడం.

**2. కథలో చిత్రించే జీవితం, అనుభవాలు :** రచయితల అనుభవాలు తను నివసిస్తున్న సమాజ జీవితానికి సంబంధించినవి. సమాజ కాలానికి, స్థలానికి సంబంధించినవి. అంటే సమాజానికి ఒక భౌగోళిక లక్షణం ఉంటుంది. ఒక చరిత్ర ఉంటుంది. ఒక సంస్కృతి ఉంటుంది. ఒక భాష, భాషా భేదంతో ఉంటుంది. ఇవన్నీ రచయిత అనుభవ సంపుటిలో భాగంగా ఏర్పడతాయి. వీటికి తోడు రచయిత జీవిత అవగాహన కోసం ఏర్పర్చుకున్న సిద్ధాంతాల, భావాల ప్రభావాలు ఉంటాయి. ఇవి అనుభవానికి గీటురాళ్ళుగా పని చేస్తాయి. అప్పుడు జీవితాన్ని అర్థం చేసుకునే, చేయించే శక్తులు అలవడతాయి. అయితే అనుభవాలకు హద్దులుంటాయి. ఒక వ్యక్తి తన రచనా కాలం నాటికి ఎన్ని సంఘటనల్లో, ఎన్ని సన్నివేశాల్లో, ఎన్ని ఉద్యమాల్లో, ఎన్ని క్రియా కార్యకలాపాల్లో ప్రత్యక్షంగా పాల్గొన్నాడు లేదా పరోక్షంగా ప్రభావితుడయ్యాడు అనే అంశాలు ఈ హద్దులను నిర్ణయిస్తాయి. ఏమైనా కేవలం పుస్తక జ్ఞానం నుంచి కాకుండా రచయిత తన జీవితం నుంచి తన అనుభవం నుంచి కథలు రాయడంవల్ల వాటికి వాస్తవికత అబ్బుతుంది. ఎక్కువ అబ్బుతుంది కూడా.

**3. సంభావ్యతకు, వాస్తవికతకు ఉండే సంబంధం :** శిక్షణా శిబిరంలో పాల్గొన్న మల్లయ్యగారు ఒక కథ చదివారు. ఆ కథలో ఒక ఇంగ్లీష్ దొర ఒకప్పుడు వేటాడి చంపలేకపోయిన పులి సర్కస్‌లో కన్పిస్తుంది. కానీ కథలో ఆ పులి సర్కస్‌లో ఎందుకుంది అనే ప్రశ్నకు సమాధానం దొరకదు. పులి సర్కస్‌లో ఉండడానికి ఒకప్పటి వేటకు మధ్య ఉండే సంబంధం పర్యావరణ సమస్యలు స్పృశించి వుంటే ఆ కథలో సంభావ్యత/ విశ్వసనీయత ఉండేది. అలాగే సాల్మన్



Untitled-2 16 6/11/2002, 3:51 PM

రాజుగారు విచిత్రమైన ఒక కథ చెప్పారు. ముగింపు ఎలా ఉండాలని శిక్షణా శిబిరంలో పాల్గొన్న వారిని అడిగారు. ఏదో ఒక భూమిలో నత్తగుల్లల్ని బతుకుదెరువు కోసం పది మంది వ్యవసాయ కార్మికులు ఏరుకున్నారు. అది సహించలేని పెద్ద రైతులు వారి మీద కేసు పెట్టారు. అరెస్టు చేయించారు. ఈ కథలో వదిలి వేసిన వివరాలు కొన్ని మన దృష్టికి రావాలి. అది ఏ రకమైన పొలం, గ్రామ కంఠమా? ఏ రైతుకో సంబంధించిన సొంత పొలమా? ఆ పొలంలో నత్తగుల్లలు ఏరుకుంటూ ఉంటే దాన్ని వ్యతిరేకించిన వర్గం ఎందువల్ల వ్యతిరేకించింది? వర్గ స్వభావంతో వ్యతిరేకించిందా? ఏదైనా లాభం కోసం వ్యతిరేకించిందా? ఈ లింకులు కథ ద్వారా స్పష్టం కావాలి.

మరొక అమ్మాయి చేనేత కార్మికుని ఆత్మహత్యకు సంబంధించిన కథను చదివింది. చేనేత కార్మికుని ఆత్మహత్యను రైతు చూశాడు. మరొక చేనేత కార్మికుడు కూడా చూశాడు. ఎందువల్ల ప్రతిస్పందన ఒకేలా లేదు? చేనేత కార్మికుని ఆకలి గురించి రాసిన అతనున్న స్థితినిబట్టి దొంగతనం చేస్తాడు అనుకోలేము. తాగిన పురుగుమందు డబ్బా ఎర్రదా? నల్లదా? రైతులు మామూలుగా వాడేదా? ఇలాంటి సందేహాలన్నీ కథ చదివాక కలిగినాయంటే దాని అర్థం విశ్వసనీయత కథలో లోపించిందన్నమాట. కథ వాస్తవంగా జరిగిందని రచయిత చెప్పింది. వాస్తవం వేరు, యథార్థం వేరు. వాస్తవంలో లేదా జీవిత వాస్తవికతలో ప్రతి అంశానికి మరొక అంశంతో కార్యకారణ సంబంధం ఉంటుంది. ఈ యథార్థంలో ఉన్నది ఉన్నట్లుగా, ఒక్కొక్కసారి అర్థరహితంగా ఉంటుంది. కేవలం సన్నివేశాలు, సందర్భాలు, సంఘటనల వరుసక్రమం ఉంటుంది. రచయిత ఇటువంటి సమస్యలమీద కథలు రాసేటప్పుడు ఎవరిమీద సానుభూతో, కోపమో కల్గించాలనుకున్నాడో అవి తప్పనిసరిగా పాఠకుల్లో కల్గించవల్సి ఉంటుంది. కలిగించాలంటే సంభావ్యత ద్వారా వాస్తవికతను కాపాడుకోవాలి. మనం ఉదహరించుకొన్న మూడు కథల్లో ముగింపుల సమస్యే కాదు ఈ విశ్వసనీయతను బలంగా చిత్రించలేకపోవడం కూడా కన్పిస్తుంది.

..............  O  ..............

**నిజమో కాదో కానీ గురజాడ కన్యాశుల్కంలోని సారా సీనును రాస్తున్నప్పుడు ఆయన స్వయంగా ఎవరు చూడకుండా సారా దుకాణానికి వెళ్ళి అక్కడి మనుషుల్ని, వారి భాషను పరిశీలించాడని అంటారు. ఈ ఓర్పు, నేర్పు లేకపోవడంవల్లనే చాలా మంది రచయితలు భాషను ఒక సమర్థమైన కథా వాహికగా గుర్తించలేక పోతున్నారు. అంతేకాదు ప్రతి భాషాభేదాన్ని అమాయకంగా ఒక భాషగా భ్రమపడుతున్నారు.**



..............  O  ..............

వాస్తవికత సాధించడానికి జీవితానికి, రచయిత ఎన్నుకొనే వస్తువుకు సంబంధం ఉండేలా చూసుకోవాలి. కథా వస్తువు లక్ష్యం కథ ద్వారా చెప్పదల్చుకున్నది అది రచయిత యోచనా, ఉద్దేశం. దాని వెనుక రచయిత జీవిత అవగాహన ద్వారా, అనుభవాల ద్వారా ఏర్పర్చుకున్న ప్రాపంచిక దృష్టి ఉంటుంది. వాస్తవికత మూలాలు పట్టుకున్నప్పుడు నిరాశామయంగా ఉన్న స్థితి ఆశామయంగా చేయడానికి రచయిత ప్రయత్నిస్తాడు. వాస్తవికతలో చాలా భేదాలున్నాయి. సవిమర్శనాత్మక వాస్తవికత, సోషలిస్టు వాస్తవికత, సంస్కరణ వాస్తవికత, కాల్పనిక వాస్తవికత లాంటి అనేక భేదాల్ని విమర్శకులు చూపుతున్నారు. వాటిని ఈ సందర్భంలో చర్చించడం సాధ్యం కాదు.

వస్తువును ఇతివృత్తం, కథాసంవిధానం అని కూడా అంటుంటారు. ఇది కథ నిర్మాణ వ్యూహానికి సంబంధించినది. కథలో జరిగే సంఘటనలు, సన్నివేశాలు, పాత్రల చర్యలు, వాటి మనస్తత్వాలు వీటి మధ్య అన్యోన్య సంబంధాలుంటాయి. పాత్రలు కథాచరణానికి తోడ్పడే సమాజ జీవులు. సంఘటనలతో, సన్నివేశాలతో సంబంధముండే మనుషులు. పాత్రల ప్రవర్తన వెనుక ఉండే సామాజిక, సాంస్కృతిక నేపథ్యాలు వాటి చర్యలను, ఘర్షణలను నిర్ణయిస్తాయి. ఇతివృత్తంలో పాల్గొనే పాత్రలకు ఒక నేపథ్యం ఉంటుంది. అది స్థల కాలాలకు సంబంధించిన నేపథ్యం. ఈ నేపథ్యం అత్యంత భౌతికమైంది. కథకుడు కథను ప్రథమ పురుషంలో చెప్తున్నాడా, ఉత్తమ పురుషంలో చెప్తున్నాడా, దినచర్య రూపంలో చెప్తున్నాడా, లేఖల రూపంలో చెప్తున్నాడా, చైతన్యస్రవంతిలో చెప్తున్నాడా, ఊహా కల్పన చేస్తున్నాడా, శాస్త్ర విజ్ఞాన కల్పన చేస్తున్నాడా, అంతరార్థ విధానంలో చెప్తున్నాడా, పురాణ నీతి కథల పద్ధతిలో చెప్తున్నాడా అనే అంశాలు కథనాన్ని నిర్ణయిస్తాయి. కథను కేవలం తటస్థంగా చెప్తున్నాడా, ఆత్మీయంగా చెప్తున్నాడా, స్నేహపూర్వకంగా చెప్తున్నాడా, వ్యంగ్యంగా చెప్తున్నాడా, హాస్యస్ఫోరకంగా చెప్తున్నాడా, ప్రవక్త పోజులో చెప్తున్నాడా అనే అంశాలు రచయిత కథలో భాషా ప్రయోగం ద్వారా ధ్వనింపచేసే కంఠ స్వరంలో వ్యక్తమవుతాయి. వీటినన్నింటినీ ఒకదానితో మరొకదానికి సంబంధమున్న అంశాలుగా గుర్తించి కథను నిర్మించినప్పుడు మరొక ప్రశ్న తలెత్తుతుంది. అది కథ ద్వారా మనం స్పందన పొందుతున్నామా? లేదా? అని. స్పందన పొందితే తప్ప రచయిత కథ ద్వారా ఉద్దేశించిన సంస్కార మార్పు పాఠకుడిలో కలగదు.

**4. నిడివి, క్లుప్తత :** కథ నిడివి ఎంత ఉండాలనేది. కథకు క్లుప్తత ప్రాణం కావచ్చు. కానీ నిడివి అవసరమైతే కథల్లో ఉండటం చూడవచ్చు. కుటుంబరావు కథలు చాలా వరకు క్లుప్తంగా ఉంటాయి. శ్రీపాద కథల నిడివి పెద్దది. అంటే రచయిత కథా శిల్పాన్ని కేవలం క్లుప్తత, నిడివే నిర్ణయిస్తాయి అనుకోవడం పొరపాటు. కథకు అవసరమైన అంశాల మధ్య, కథాంగాల మధ్య సంబంధం సాధించగల్గినప్పుడు రచయిత నిడివిని గురించి, క్లుప్తతను గురించి పట్టించుకోవల్సిన అవసరం ఉండదు. రాసినటువంటిది కథా, నవలిక, నవల అనే స్పృహ రచయితకు ఉంటే చాలు.

**5. భాషా శైలులు :** కథలో వాడే భాషాభేదాలు, శైలులు – వీటికి సంబంధించి ఇటీవల చాలా చర్చలు జరిగాయి, జరుగుతున్నాయి. కథలో ఒకే రకమైన భాషా భేదం ఉండదు. కథకుడు ఉపయోగించే భాషాభేదం ఒక రకంగా ఉంటుంది. పాత్రలు ఉపయోగించే భాషాభేదాలు మరొక రకంగా ఉంటాయి. రచయిత నేపథ్యం, పాత్రల నేపథ్యం ఈ భాషాభేదాలకు కారణంగా ఉంటాయి. భాషపట్ల పరిశీలన, శాస్త్రీయమైన అవగాహన రచయితకు ఉండటమే కాకుండా అనుభవ పరిధి కూడా ఉంటుందనేది గుర్తుంచుకోవాలి. ఉదాహరణకు రాయలసీమకు సంబంధించిన రచయిత తను రాసే కథలో తెలంగాణా పాత్రను ప్రవేశపెట్టవలసి వస్తే ఆ తెలంగాణా పాత్ర ఉపయోగించే భాషాశైలిని పట్టుకోవాల్సి ఉంటుంది. ఆ పాత్ర ప్రాంతీయతనే కాకుండా సామాజిక వర్గ గుణాల్ని కూడా గమనించవలసి ఉంటుంది. ముస్లిం పాత్రలు మాట్లాడే భాష మీద కూడా చర్చ జరిగింది. ఆ ముస్లిం పాత్రల ప్రాంతీయ, సామాజిక నేపథ్యం కూడా భాషాభేదాల్ని నిర్ణయిస్తాయనేది గమనిస్తే భాష విషయంలో అనవసరమైన వివాదాలు ఉండవు. పరిశీలన అధ్యయనం రచయితకు ఉంటే తప్ప భాషాశైలుల్ని సమర్థంగా



Untitled-2 17 6/11/2002, 3:51 PM

ఉపయోగించలేదు. నిజమో కాదో కానీ గురజాడ కన్యాశుల్కంలోని సారా సీనును రాస్తున్నప్పుడు ఆయన స్వయంగా ఎవరూ చూడకుండా సారా దుకాణానికి వెళ్ళి అక్కడి మనుషుల్ని, వారి భాషను పరిశీలించాడని అంటారు. ఈ ఓర్పు, నేర్పు లేకపోవడంవల్లనే చాలా మంది రచయితలు భాషను ఒక సమర్థమైన కథా వాహికగా గుర్తించలేకపోతున్నారు. అంతేకాదు ప్రతి భాషాభేదాన్ని అమాయకంగా ఒక భాషగా భ్రమపడుతున్నారు. భాషాభేదాన్ని భాష అని ఆషామాషీగా అనవచ్చుగానీ శాస్త్రీయంగా అనటం కుదరదు. మన పల్లెటూర్లలో తూర్పువాళ్ళ భాష, పడమటి వాళ్ళ భాష అంటుంటారు. ఆ మాటలు భాషాభేదాన్ని సూచించేవే. అయినా ఒకరికొకరికి అర్థంకాని భాష మాత్రం కాదు. భాషాభేదాన్నే భాషాశాస్త్రజ్ఞులు మాండలికం అంటున్నారు. ప్రమాణ భాషగా రూపొందుతున్న ఒక మాండలికాన్ని కూడా ప్రమాణమాండలికం అంటున్నారు. కథా రచయితలు భాషాశాస్త్ర పాఠాలు విద్యార్థుల్లాగా చదవనక్కర్లేదు. కానీ భాషను గురించిన అవగాహన అమాయకంగానో, మూర్ఖంగానో ఉండకూడదు. ప్రాంతీయ ఉద్యమాల నేపథ్యంలోని తర్జనభర్జనలు ఏ విధంగా ఉన్నా ఏ ప్రాంతానికి, ఏ వర్గానికి సంబంధించిన రచయిత అయినా ఆ ప్రాంతపు, ఆ వర్గపు జీవితాన్ని కథలో చిత్రించేటప్పుడు భాషాశైలుల నిర్మాణ వ్యూహాన్ని అనుసరించకతప్పదు.

**6. స్పందింపచేసే గుణం :** కథ ఖండకావ్యం లాంటిది. నేటి కవిత లాంటిది. కథ చదివాక ఒకే ఒక స్పందన కల్గుతుందా! అనేక సంవేదనలు కల్గుతాయా? నిజానికి కథా లక్ష్యం ఏకైక గాఢ సంవేదన. రావిశాస్త్రి ఆరు సారా కథల్ని చదివినప్పుడు అనేక రసాలు మనలో పుడతాయని శ్రీశ్రీ అంటూ దానికి రసన అని ఒక పేరు పెట్టాడు. రసదృష్టితో చూసినప్పుడు శ్రీశ్రీ ప్రతిపాదన సమంజసంగానే కన్పిస్తుంది. కానీ ఆరు సారా కథలు చదివిన తరువాత పాఠకుడిలో కలిగే ఏకైక గాఢమైన స్పందన ఇంత బీభత్సంగా తయారైన సమాజం మీద కోపం.

విరివిగా కథలు చదవకుండా వాటి మీద వివేచనా పూర్వకమైన చర్చలు చేయకుండా కథా రచనకు పూనుకోవడం సమంజసం కాదు. విరివిగా కథలు చదవడమంటే ఒక్క తెలుగు భాషలోని కథలు మాత్రమే చదవడం అని కాదు. మన చుట్టూ ఉన్న భారతీయ భాషల్లోని కథలను, యూరోపియన్, అమెరికన్, ఆఫ్రికన్, లాటిన్ అమెరికన్ కథలను అనువాదాల ద్వారా చదవడం రచయితల ఆరోగ్యానికి మంచిదని నా దృఢమైన విశ్వాసం. మంచి కథలు చదవాలా? చెడ్డ కథలు చదవాలా అనే ప్రశ్న తరచూ యువతీయువకులు వేస్తూ ఉంటారు. మంచివి కానీ, చెడ్డవి కానీ చేతికందినవి విరివిగా చదవాలి. పురుషులందు పుణ్యపురుషులు వేరయా అన్నట్లు మంచి కథలేవో, చెడ్డకథలేవో వివేచిస్తే తెలిసివస్తాయి. చదువుతున్న కొద్దీ కథా నిర్మాణానికి, శైలులకు సంబంధించిన వివిధ విషయాలు బోధపడతాయి. ముందు జీవితాన్ని చదవండి. సిద్ధాంతాల్లోంచి జీవితంలోకి, జీవితంలోంచి సిద్ధాంతాల్లోకి, అనుభవ జ్ఞానం, పుస్తక జ్ఞానం ద్వారా పయనించండి అనేదే ఈనాడు రచయితలు, పాఠకుల కర్తవ్యం.

చివరిగా శిక్షణా శిబిరంలో తలెత్తిన ఒక అంశాన్ని ప్రస్తావించుకుందాం. అది పత్రికలో రచన ప్రచురితమయ్యేటప్పుడు పత్రికలో పని చేసే వాళ్ళు మార్చవచ్చునా అనే అంశం. లేఖన దోషాలు, విరామ చిహ్నాల్లోని లోపాలు-ఇటువంటి సాంకేతికమైన అంశాలు ఉన్నప్పుడు వాటిని దిద్దుబాటు చేయవచ్చు. విషయాన్ని, రచయిత ఉద్దేశపూర్వకంగా వాడిన ప్రయోగాలను మార్చాలంటే రచయితతో చర్చించి ఆ మార్పు చేయడం మర్యాద. సంపన్న దేశాల్లోలాగా మన దేశంలో కాపీ ఎడిటర్లు ఇంకా రాలేదు. వచ్చినప్పటి విషయం వేరు.

V

# చిత్తడి నేలలు... ఆవిరి చినుకులు...

**మంచికంటి**



ఈ బండిపరం
పొయిలో పెట్టండి
గతాన్నంతా తవ్విపోస్తుంది

కాసిని పాటల్నియ్యండి
పనినెవరో!
దోచుకుతింటున్నారు

ఎంతలోతుగాదించావ్!
నాగేటికర్రును
ఎండుదుక్కి గుండెల్లో

విత్తనాలకేం!
కొల్లలు బోయాయి
కంకులే రాలవుగానీ!

ఏడ్చినంతసేపు పట్టలేదు!
మొలకెత్తడానికీ,
పసతెలియడానికీ

ఈ విత్తనాల్ని నమ్మొద్దు
అవొక
సిఐఏ ఏజెంట్లు

కాపు కాస్తేగా
కాపలా కాయడానికి

అన్నీ వొరిమొక్కలే
మడినిండా నీళ్ళేవీ?

ఎవరి కన్న బిడ్డవో!
రైతువై
ఈటుబోయావ్
సూర్యుడి కేం తెలుసు
భూమి పడే
పురుటి నెప్పులు

అయ్యలారా! అమ్మలారా!!
ఊళ్ళనించి లేవండి
ఇక్కడ వలస వ్యవసాయం
చేయబడును

వాన చుక్కే చిన్నబోయింది
భూమిని కమ్మిన
ఆవిర్లు చూసి

తల్లీ బిడ్డకీ
పేగు బంధం
రైతూ నేలా!

ఈ కన్నీటి చినుకులు
ఎండిన నేలకేం
దావాద్రి తీరుస్తాయి

ఆలోచనలేంది
కాసిని కాసిని
రేపటెత్తు చినుకుల్లా రాల్తున్నాయి

ఎన్ని చినుకులు రాలినా
పై గుడ్డయినా తడవదే!

ఎంత విసుక్కున్నా
ఒక్క తుఫానైనా
వొచ్చివాలదే!
నాయన్నాయనా
ఈ ఏల్టప్పుడు ఏవూరని వెల్తావ్
ఎక్కడ జూసినా
కొల్లబోయిన వొలుకులే



Untitled-2 18 6/11/2002, 3:51 PM

కథ

జాతశ్రీ

# చలివేంద్రం



*పొడుపుచుక్క ఇంకా పొడవనే లేదు.*

*చీకటి దట్టంగా, ముదరకాలిన కుండ తీరునున్నది.*

*ఊరు - ఊరంతా పోలీసోళ్ళకు భయపడి నక్కిన బుడతల తీరున గుట్టు చప్పుడు కాకుండా ఉంది.*

*వసారాలో కునుకేసిన కుమ్మరెంకన్న ఉలికిపాటుతో ముసుగు తంతూ దిగ్గున లేచాడు. కళ్ళు చిట్లిస్తూ బయటకు చూశాడు. వాకిలిలో సారెకు కట్టేసి వున్న మేకపిల్ల కళ్ళు పసుపురంగు రేడియంలా మెరుస్తున్నాయి.*

అతను వాకిలిలో కొచ్చి మబ్బుకేసి చూశాడు. "గురకోళ్ళు సుత కనబట్టంలే... శాన పొద్దున్నట్టుంది" అనుకొంటూ చుట్టూ పారజూశాడు. కొద్ది దూరంలో కుండలబట్టీ నుంచి పచ్చని మంట తన్నుకొస్తుంది. "కుండ కాలినట్టుంది. రేపన్నా బట్టీ దియ్యాల... దీని సిగదరగ, ఎంత జేసినా తరగదీ కుమ్మరిపని" లోలో గొణుక్కొన్నాడు.

చీకటిలో తచ్చాడుతూ, చుట్టు గుడిసె మొగదలలో ఉన్న గోడగూటిని తాకి, అందులో సగం తాగి దాచుకొన్న మోదుగాకు చుట్ట అందుకొని పెదాలపై ఉంచుకొన్నాడు. ఆ పక్కనే దీపం దగ్గరున్న అగ్గిపెట్టెతో దీపాన్ని వెలిగించి, అదే పుల్లతో చుట్ట కాల్చుకొన్నాడు. నాలుగయిదు దమ్ములు లాగి, నోటిలో ఊరిన ఉమ్మిని దడికేసి ఉమ్మేసి, గుడిసెలోకి చూశాడు. నిట్టాడు దాపులో చాపమీద పడుకొన్న పిల్లల మొహాల మీద దీపం నీడ తారాడుతోంది.

నలుగురు పిల్లలు, తిండికే తప్ప పనికి లెక్కకొచ్చే వయసు కాదు. జంగిలి గొడ్లోళ్లతో జత కలిసి పెద్దోడు యిప్పుడిప్పుడే పనికి అలవాటు పడుతున్నాడు. నడిపి పిల్లలిద్దర్నీ 'సార్లు' బళ్లోకి లాక్కుపోతున్నారు. చంటి దానివల్ల భార్య యిల్లు కదల్లేకపోవడం అతనికి ఓ చెయ్యి విరిగినట్టుగా వుంది. 'యింటిది కూడా ఏ కూలినాలికో పోకపోతే బతుకు సాగేట్టు లేదు' అనుకొన్నాడు కుమ్మరెంకన్న.

"ఏమేవ్..."

చాప మీద నలుగురు పిల్లల మధ్య తానూ ఓ పిల్లదానిలా ముడుచుకొన్న ముత్తమ్మకు భర్త పిలుపుతో తెలివొచ్చిందిగాని, కన్ను విప్పలేకపోయింది.

రాత్రి - సందేళ చంటిది జ్వరంలో చేసిన తొందరవల్ల ఆమెకు నడిఝాము దాకా కన్ను మలగలేదు. మాతర్లిచ్చే ఖాదర్సాయిబు యింటి పట్టున లేకపోవడంతో, బిడ్డ కేమయిందో తెలీక కాలుగాలిన పిల్లిలా తిరిగింది. అప్పటికీ వామునూరి తులిసాకు రసంతో కలిపి తాపించినా పిల్లది ఏడుపు గోస తగ్గలె. ఏం చెయ్యాలో తోచక పిల్దాన్ని భుజానేసుకుని యింటి వాకిట్లో నిల్చుంటే, ఎదురింటి సాముల కోటమ్మత్త కస్తూరి మాత్ర తెచ్చిచ్చి, చనుబాలతో రంగరించి తాపించమంది.

మాత్రబడిన కూసేపటికే పిల్లది కునుకు తీసింది. ముత్తమ్మకు కూడా అలసటనిపించింది. ఆకలేసినా పెట్టుక తినేంత ఓపిక లేక ముంతెడు నీళ్లు తాగి, పిల్ల పక్కనే వొరిగింది.

"కోడి సుతకూయలె... ఏందా తొందర, యీ సీకట్లబడి యాడబోతవ్?" కళ్లు తెరవకుండానే అన్నది ముత్తమ్మ.

"ఆరు కోసులు నడవొద్దానె? పొద్దెక్కితే సంతలసోటు సుత దొరకదు. జెనానికి పనుల్లేక అడివిన దిరిగి దొరికిందేదో



Untitled-2 19 6/11/2002, 3:51 PM

తేవటం, అమ్ముకోవటం... ఎపుడు జూడు, ఏదో వొక బేరం" అన్నాడు కుమ్మరెంకన్న

ముత్తమ్మ మారు మాటెత్తలె.

అతను తడిక మీాదున్న కావిడితీసి, తాళ్లు లాగి చూసుకొన్నాడు. గట్టిగానే ఉన్నాయి. దాన్నో పక్క నుంచి, పొయ్యిలో కెలికి ఓ బొగ్గు ముక్కందుకొని, నోట్లో వేసుకొని నములుతూ గాబు దగ్గరికెళ్ళాడు.

ఎదురింటి ముక్కయ్య తాత – ముదిరిన దగ్గురోగపు బాధతో పేగులు కదిలేలా దగ్గుతున్నాడు. కూతవేటు దూరంలో కుంటపొంటె కోయోళ్ల గుంపులోంచి సినిమా పాట వినిపిస్తుంది. "కోయోళ్ల – రేలపాట లేమానయో... ఆ కోలాటా లెటు బోయనయో... యిట్టయి పోయినయేంది రోజులు?" అనుకుంటూ, నోరు కడుక్కొని, తలగుడ్డతో మొహం తుడుచుకుంటూ వసారాలో కొచ్చాడు.

అప్పటికే నిద్రలేచిన ముత్తమ్మ దీపం వెలుగులో గుడిసెలో ఉన్న కుండలు ఒక్కొక్కటే తెచ్చి వసారాలో వరుసగా పెడుతోంది.

"అవ్, పచ్చికుండ సరవడమయిందానె?" అన్నాడు కుమ్మరెంకన్న

"ఇంకా సగం దాకున్నాయి. యాడ... పిల్లది సంకొదిలితేనా?"

"కానియ్, ఎండలు ముదురుతున్నయి."



"ఊకున్నానా.. కుండని ఎండకీ నీడకీ తిప్పటం, మద్దెమద్దెన సరవడం... ఇటు పిల్దాన్ని అర్సుకోటం, నాకు తెల్వదా?" ముత్తమ్మ నీళ్లకుండను వరసలో ఉంచుతూ అన్నది.

"అగ్గో, అన్నీ నీళ్లకుండలేనా, బువ్వకుండలూ, కూరపిడతలూ ముంతలూ, మూకుళ్లు సుత బయటపెట్టు" అన్నాడు.

"ఎండాకాలవాయె! నీళ్ల బానలు నాలుగెక్కువ కొంచక పోరాదూ?" అంది ముత్తమ్మ

"నేనేం లంబాడోళ్ల తండక్కాదు పోయ్యేది. కొత్తగూడెం సంతకి" చిరుకోపంతో అన్నాడు కుమ్మరెంకన్న.

"ఏం, కొత్తగూడెపోళ్లు నీల్తాగరా?" అంది ముత్తమ్మ.

"నీకు తిరగజెప్పటం నా వల్లగాదె తల్లా... ఇయ్యాల్రేపూ బస్తీలోళ్లు కుండల నీళ్లేడ తాగుతున్రు?... మిషన్నీళ్లే... నేనోపాలి తాగిన, నీతల్లి నరాలు జివ్వుమన్నయనుకో... మంచు తీర్న ఉన్నయ్" అన్నాడు.

"ఇగాగు... అందరయ్యే తాగుతరాయేంది?... కుండగిరాకీ కుండ కుంటది. అని, వరసలో ఉంచిన కుండల్ని లెక్కేసి, "యిగ చాల్లే..." అంది ముత్తమ్మ.

కుమ్మరెంకన్న కావిడిని భూమి కుదురుగా ఉన్నచోట ఉంచి, చిలక్కొయ్యకున్న పగ్గాన్ని అందుకొన్నాడు. భార్య ఒక్కొక్క కుండనీ అందిస్తుంటే కుండ మూతికి పగ్గంతో ఉచ్చేసి బిగిస్తూ, కావిడి రెండు ప్రక్కలా బరువు సరిపోను కట్టుకొన్నాడు.

"పాయె... పొద్దు సుక్క సుత పొడిసె! ఆరుకోసులు... నా దుంపదెగుద్ది." లోలో అనుకొని, భార్యకేసి చూస్తూ, "సద్దిబువ్వేం లేదా? ఎండలాయె... ఓ ముద్దతింటె గాబరెత్తదు" అన్నాడు నెమ్మదిగా.

రాత్రి తను అన్నం తినకపోవడమే మేలయిందని పించిందామెకు. "ఉంది... చెయి కడుక్కో, పెడత." అంటూ ఉట్టి మీద నుంచి అన్నకుండ దింపి, ఓ పట్టెడన్నం కంచంలో ఉంచింది. మిగతాది పిల్లల కోసమని, మళ్లీ కుండను ఉట్టిన ఉంచింది. పిడతలో అడుగంటిన గోంగూర పచ్చడిని వ్రేలితో తుడిచి, పళ్ళెంలో వేసి, అందించి, ముంతతో నీళ్లు పట్టుకొని దగ్గరగా కూచుంది.

"రేత్రి నువ్తిననట్టుగుంది" ముద్ద కలుపుతూ అన్నాడు కుమ్మరెంకన్న

"మా తిన్నలే నువ్ కానియ్" అంటి ముత్తమ్మ.

"అవ్, పెద్దోడ్ని బోడగుట్టకెళ్లి పోనియ్యమాక. యిటు కుంట పొంటె పొమ్మను. పోలీసోళ్లు గుట్ట సుట్టుముట్టిన్రంట" అన్నాడు.

"ఏవయింది?"

"ఏవయితే మనకెందుకే?.. నువ్వాడ్ని పోనియ్యమాక... నిన్నంత తుపాకుల మోతేనాయె! నువ్ సుతయింటివిగదా! యింగా అడుగుడేంది?" అన్నాడు.

"అట్టనే, పెద్దోడ్ని నే నర్సుకుంటాలేగాని, కస్తూరి మాత్రలు మరవబాక" అంది ముత్తమ్మ.

"ఊ... నువ్వట్ట పిల్దాన్ని సంకనేసుకొని, మిల్లుకెళ్లి పోరాదూ?... నీడ పట్టున పని, మానెడు నూకలు దొరికినా మా బాగె" అన్నాడు.

"యాడ?... మిల్లేడ నడుస్తుంది. యీ యేడు కాలవేడయింది? పొలాలున్నోళ్లే ఊర్లపొంటె పనులకి పోతన్రుగాదూ... నీకు తెల్వదా?"

"ప్చ్... జెనవెట్టనో, ఏవో... పంటల్లేక, పనుల్లేక, తిండి కరువై తల్లడిల్లుతున్రు. మనకి నల్లమట్టి తోలే కాపోళ్ల బసవయ్య లేడూ.. బండెద్దులకి మేతలేక, పోయిన సంతల ఎద్దుల్ని బేరానికి బెట్టిండు. సంతల నను వాటేసుకొని, బోరు నేడ్సిండు. నా సిన్నప్పటి నుంచి మనకి మట్టి తోలిండాయె! 'యింకెవురన్నా జూసుకోరా ఎంకన్నా...' అనే సరికి నాకు సుత కళ్ల నీళ్లాగలె" కుమ్మరెంకన్న బాధగా అన్నాడు.

కాలమిట్టనే వుంటె... రాన్రాను డొక్కల కరువొస్తదేవో..." ముత్తమ్మ.

"అట్ట సచ్చినా మా బాగె. ఈ శెరలు పడలేక దినాం సస్తన్నం.." అంటూ భార్య చేతిలోని ముంతందుకొని నీళ్లుతాగి, "సర్లే యింటి పట్టునుండి కుండల పని గానియ్" అంటూ కంచాన్ని భార్య కందించి లేచి, కావిడిబద్ద భుజానేసుకొంటూ, "పొయ్యొస్త పిలగాళ్లు భద్రం" అని వీధిలో కొచ్చాడు.

కోళ్లు కూస్తున్నాయి. నిన్నటి శ్రమను మర్చిపోయిన పల్లె – కొత్త ఆశల ఆరాటంతో మేల్కొంటూంది. ఎవరైనా తోడు దొరుకు తారేమోనని, కొద్దిసేపు అటూ, ఇటూ చూశాడు. ఎవరూ కనపడలేదు. ఆలస్యమయితే సంతలో చోటు దొరకదనే తలంపుతో పరుగులాటి నడకందుకున్నాడు కుమ్మరెంకన్న.

ఇలా వెళ్లడం అతనికి కొత్తేం కాదు. వారానికోసారి ఆదివారం కొత్తగూడెం సంతలో అయినకాడికి కుండలమ్ముకొని, వారానికి సరిపడా సరుకులు తెచ్చుకోవడం అలవాటే! అదీ... నిన్నామొన్నటి అలవాటేంకాదు. తాతల కాలం నుంచీ ఉన్నదే! ఇప్పటిలా ఆ రోజుల్లో బొగ్గుబావి కార్మికులకు నెలవారీ జీతాలుండేవి కావు. వారానికోసారి శనివారం బట్వాడా. ఆదివారం బాయికి సెలవు. అదే రోజు సంత. కార్మికులు వారానికి సరిపడా సరుకులు సంతలోనే కొనేవారు. నగదు బేరం. సరుకు నాణ్యత తప్ప మరొకటి చూసేవాళ్లు కాదు. చదువు రాకపోయినా లెక్కల్లో తేడాలుండేవి కావు. కూలీనాలీలంటే జాలుండేది. మాట మీద బతికిన రోజులవి. కుండధర చెపితే 'బతకనీ... పనోడు' అని దయచూపారే తప్ప ఇప్పటిలా గీసి గీసి కొసరేవాళ్లు కాదు. మాయదారి కాలమయింది. మనిషి కంటే పైసాకే గిరాకెక్కువయింది.

తన చిన్నతనం రోజుల్లో కుంటకెళ్లి ఎంత మట్టి తెచ్చుకున్నా



Untitled-2 20 6/11/2002, 3:51 PM

ఎవరూ కాదనే వాళ్లు కాదు. ఇప్పుడు!... మట్టి క్కూడా మండిపోయేరేటు. అప్పట్లో బోడగుట్టకు పోతే కావల్సినన్ని కట్టెలు! ఇప్పుడవీ కొనటమే! కాదనుకోలేక చెయ్యడవే తప్ప కులంపనికి రోజులు కావివి! ధరలెంత పెరుగుతున్నా కుండ కాడికొచ్చేసరికి 'స్టీలుదా?.. యిత్తడిదా?' అంటూ వెక్కిరిస్తారు. 'పావలాకిస్తవా? పరక్కిస్తవా? అంటారే తప్ప, కుండ జెయ్యడానికి కుమ్మరోడి కాల్చేతులెంత శెరబడతయో ఎవరూ చూడరు. మనిషి పనితనానికి నూకలు పుట్టని రోజులయినై.

కావిడి భుజం మార్చుకుంటూ కుమ్మరెంకన్న అటూ, ఇటూ చూశాడు. అటు తార్రోడ్డు, ఇటు బండ్లబాట. తార్రోడ్డున పోతే దూరమెక్కువయినా కాలు బాగా సాగుద్ది. తేలికగా నడవొచ్చు. బండ్ల బాటయితే ముర్రేడు వాగు లోంచి పోవాల. యిసుక కోసం లారీలూ, ట్రాక్టర్లూ తిరగడంవల్ల బాట బాగా నలిగింది. రోడ్డుకంటే ఓ కోసెడు దూరం తక్కువేగాని, యిసుకలో కాలుసాగదు. పైగా కావిడి బరువు. అయినా అతను బండ్లబాటకే తిరిగాడు. రోడ్డున పోతే పాల్వంచ-కోయగూడెం తిరిగే బొగ్గు లారీలు గుద్దితే కుండే పగులుద్దో, గుండే పగులుద్దో ఎవడికెరక?

ఇసుకలో కాళ్లు దిగబడి పోతున్నాయి. బాట కిరుప్రక్కలా ఉన్న ముళ్లపొదల్లోంచి కీచురాళ్లు 'ఘీ..' పెడుతున్నాయి.

కూటికి రానిదీ కుమ్మరోడి బతుకని పెద్దలు ఊరికె అనలె! కుంట నుంచి మట్టి కొనక్కొచ్చిన లగాయితు యింటిల్లాదులు చెమటోడ్చిస్తే, యిరవై దినాల పైగా శెరబడితే కుండ చేతికొస్తది. ఇంతా జేసి అమ్మకానికి కొంచకపోతే, ఖర్సట్టబోనీ... దినం కూలన్నా పడదు. దీని సిగదరగ... కుమ్మరోడి పనికంటే కూలోడి పనే సుకం. పొద్దుగూకితే అంతో, ఇంతో చేతిల పడుద్ది. ఆ పూటకి బెంగుండదు. అనుకున్నాడు కుమ్మరెంకన్న.



ముర్రేడు వాగొడ్డుకొచ్చి, కావిడి భుజం మార్చుకుంటూ ఆగి, వాగుకేసి చూశాడు. వాగు చాలా వెడల్పుగా ఉంది. ఓ ప్రక్క నుంచి లారీ లోతున యిసుక తోడుకుంటూ వస్తున్నారు "ఇసుక తోడకండిరా.. జెనానికి నీళ్లకరువొస్తది. అసలే బొగ్గు బాయిల పున్నేన బావుల్ల నీళ్లూ, బోరింగుల్ల ఊటలూ దారి తప్పి వొట్టి పోతన్నయి. ఈ వాగు నీళ్లయినా దొరక్కుంటే ఎండాకాలం... జెనం, అంతకు ముందు నోరులేని జీవాలు చస్తయిరా.." అని ఊరి జనం ఎంత మొత్తుకున్నా పంచాయితీ వాళ్లు యిసుక వేలంపాట ఆపలేదు. గవర్నమెంటు ఆర్డరిచ్చిందట! పంచాయితీకి డబ్బు కావాలట! చుట్టుపక్కల కట్టుబడులన్నిటికీ యిక్కడిదే ఇసుక! తెల్లవారితే లారీలూ, ట్రాక్టర్లూ... యిసుక ఎత్తే కూలీలతో సందడిగా ఉంటుంది. ఆ సందడిని చూసే కులవృత్తి మానేసిన కంసాలి వీరాచారి వాగొడ్డున కానుగ చెట్టునీడలో పందిరేసి టీకొట్టు పెట్టుకొన్నాడు. ఆ సందడి మీద నమ్మకంతోనే ఎకరం పొలముండీ ఎందుకూ కొరగాక, వాంక్‌డోత్ భీమ కొంచెందూరంలో పొదలమాటున 'దొంగగుడంబా' అమ్ముకుంటున్నాడు.

కుమ్మరెంకన్న వాగు మధ్యలో కొచ్చాడు. పగలంతా రొదతో దద్దరిల్లే వాగు అలసటతో కన్ను మలిగినట్టుగా ఉంది. అల్లంత దూరంలో బ్రిడ్జి మీద దీపాల వెలుగులు విరజిమ్ముతున్నాయి.

"ఠయిరో..."

వాగులోతట్టునుంచి విన్పించిన స్వరానికి కుమ్మరెంకన్న ఉలికిపాటుతో అటుచూశాడు. రెండు నల్లని ఆకారాలు!... పోల్చుకునేలా లేవు, తనకేసి వస్తూ కనిపించాయి. అతని గుండె దడదడలాడింది. కాళ్లలో వణుకు ఆరంభమయింది.

ఆకారాలు దగ్గరగా వచ్చాయి. పోలీసులు!!! యిద్దరి చేతుల్లోనూ తుపాకులున్నాయి. తలకు యినుపటోపీలున్నాయి.

"ఏ ఊర్రా?" అన్నాడో పోలీస్.

కుమ్మరెంకన్నకు వెంటనే గొంతు పెగిలింది కాదు. భయంగా చూస్తుంటే దూరాన్నుంచి "చల్నేదో.." అంటూ కంచుకంఠం విన్పించింది.

కుమ్మరెంకన్న అయోమయంగా కంచుకంఠం విన్పించిన వైపు చూశాడు. చాలా మంది యిసుకలో కూర్చొని ఉన్నారు.

"పోరా...పో..." అంటూ పోలీసులిద్దరూ వెనుదిరిగారు.

అతను వణుకుతున్న కాళ్లను అదుపులోకి తెచ్చుకుంటూ, "బతికేన్రా భగవంతుడా..." లోలో అనుకొని, సత్తువ కొద్దీ కాలాడించి వాగు దాటాడు. కొత్తగూడెం చేరేంత వరకు అతని నడకవేగంతో గుండె వేగమూ పోటీ పడింది.

"వామ్మో... పొద్దెక్కిపాయె... సంతల సోటుంటదో, లేదో..." అంటూ యింకా నడక వేగం పెంచాడు.

చిన్న బజారు దాటి మెయిన్ రోడ్ దాపుకొచ్చేసరికి పోలీస్ స్టేషన్ ముందు స్తంభానికి కట్టిన మైక్ నుండి పాటలు విన్పిస్తున్నాయి. టీస్టాల్ ముందు సందడిగా వుంది. జనాన్ని తప్పించుకొంటూ ఎదురొచ్చే ఆటోలను గమనిస్తూ అతను సూపర్ బజార్ దాకా వచ్చాడు.

"ఏయ్, కుమ్మరోడా..."

కుమ్మరెంకన్న ఆగి వెనుదిరిగి చూశాడు. ఓ పోలీసతను ఆగమంటూ చేతినాడిస్తూ, దగ్గరగా వచ్చాడు. "ఆగవేంద్రా... చెవుడా?" అన్నాడు.

"ఇనపల్లేదు బాంచన్.."

"సర్‌సర్లే... స్టేషన్‌కి పద." అన్నాడు పోలీసతను.

కుమ్మరెంకన్న ఉలికిపాటుతో భయంగా చూశాడు "టేసన్‌కా, నేనెందుక్కుబాంచన్?" ఎద కదిలించే దైన్యం అతని స్వరంలో కదలాడింది.

కుమ్మరెంకన్న మొహంలో దైన్యాన్ని చూస్తూ పోలీసతను గర్వంగా గలగల నవ్వి, "చలివేంద్రానికి కుండలు కావాలి. పద, యస్సయిగారు పిలుస్తున్రు" అన్నాడు.

కుమ్మరెంకన్న నరాలన్నీ చచ్చుబడిన వానిలా, బేలగా చూస్తూ, కావిడినో పక్కగా దించి, "గరీబోన్ని, పిల్లలు గలోన్ని, నన్నొదిలెయ్... బాంచన్, మీ కాళ్ళు మొక్కుత" అంటూ పోలీసతని పాదాలు తాకాడు.

"రేయ్.. దిమాకేవన్న చెడిందా!... కుండలు అమ్మేటందుకు కాదా? యస్సయి సాబ్ పైసలిస్తడురా..." అన్నాడు పోలీసతను కాళ్లు వెనక్కి తీసుకుంటూ.

కుమ్మరెంకన్న నమ్మనట్టుగా చూశాడు. అతని మనసేదో అపశకునాన్ని సూచించింది. "వద్దులే, బాంచన్... నన్ను పోనియ్యండి" వంగి, కాళ్లు మొక్కుతూ అన్నాడు.

"దెహె... వొల్లేవన్న బలిసిందార... అరె, డబ్బులిస్తమంటుంటే వినవేం, పేదోడివి, పొద్దున్నే నీ నోరుకొడ్తాంరా... పద, పద..." అంటూ స్టేషన్ కేసి దారి తీశాడు పోలీసతను.

"ఇదెక్కడి పితలాటకంరా భగవంతుడా..." అనుకొంటూ కావిడెత్తుకొని పోలీసతన్ని అనుసరించాడతను.

మారిన భద్రతా పరిస్థితులను బట్టి యీ మధ్యనే మూడు అంచెలుగా పటిష్టంగా నిర్మించిన భవనమది. ముందు పెద్ద యినుపగేటు. గేట్ కావల రోడ్డును సగం ఆక్రమిస్తూ టెంట్ వేసి ఉంది. టెంట్‌లో కుర్చీలు బారులు తీర్చి ఉన్నాయి. టెంట్‌కు కుడి పక్కన గాంధీజీ విగ్రహముంది. విగ్రహం కిందుగా, విగ్రహం ఎత్తున ఉన్న పాతరాతిపై



Untitled-2 21 6/11/2002, 3:51 PM

ఆ విగ్రహస్థాపన సభ్యుల పేర్లు ఉన్నాయి. దాని పక్కగా వెదురు తడికలతో కట్టిన పందిరి ఉంది. పందిరి ముందు 'చలివేంద్రం-నిర్వహణ... మైత్రీ సంఘం' అని రాసిన బేనర్ కట్టబడి వుంది. దాని ముందు రంగు కాగితాలంటిస్తూ యిద్దరు పోలీసులున్నారు.

కుమ్మరెంకన్న గేటు దాపుకొస్తూనే, లోని కెళ్ళమన్నట్టు సైగ చేస్తూ సెంట్రీ గేటు తెరిచాడు.

సింహాల బోనులోని బలవంతంగా నెట్టబడే గొర్రెపిల్లలా, బితుకుబితుకుమంటూ అతను లోనికి అడుగు పెట్టాడు.

స్టేషన్ ఆవరణలో పోలీసులతోపాటు పెద్దపెద్దలు కూడా కొందరున్నారు. అందరి మొహాల్లోనూ ఆనందమూ, దాంతోపాటు హడావుడీ వుంది.

"అటు నిల్చో..." లోనికొచ్చిన కుమ్మరెంకన్నతో మొరటుగా అన్నాడో చిన్న పోలీస్.

కుమ్మరెంకన్న ప్రహరీ పక్కగా కావిడి దించి, చేతులు కట్టుక నిలుచున్నాడు.

"క్యా, సాబ్... ఎనిమిద్దాటింది. ఎస్.పి.గారొస్తరా, లేదా... నాకు పనులున్నాయి. ఖమ్మం పోవాల" ఖద్దరు కండువా మెడచుట్టూ తిప్పుకున్నతను యస్సయి దగ్గరగా వస్తూ అన్నాడు.

ఆ పక్కనే వున్న ఓ రంగుచొక్కా మనిషి, "సెల్ కొట్టండి సార్.. అవతల పార్టీ మీటింగుంది. టయిమయితాంది" అన్నాడు.

"వస్తున్నారండీ... తల్లాడ దాటారు. ప్రజల కోసం పోలీస్‌స్టేషన్‌ల ముందు చలివేంద్రాలు పెట్టాలని ఆర్డర్స్ వచ్చాయి. ప్రారంభోత్సవాలన్నీ యీ రోజే... కాస్త వోపిక... ఏయ్, సెవెన్ జీరో... సార్లకి మరోసారి స్ట్రాంగ్ టీ చెప్పు." అన్నాడు యస్సయి.



"మీ రూల్స్ బాగా మారినయ్ సాబ్, వైద్య శిబిరాలు బెడుతున్రు... మైత్రీ సంఘాలు బెట్టిన్రు... కేసు పెడితే రశీదుస్తున్రు... స్టేషన్ కొస్తే కుర్చీ చూపిస్తున్రు." అన్నాడో రకరకాల రంగుటద్దాలు వాడే మనిషి.

"అయినా జనానికి భయం పోలె" మరొకతను నెమ్మదిగా అన్నాడు.

ఆ మాటలేవీ కుమ్మరెంకన్నకు పట్టడంలేదు. వాళ్ల హడావుడీ నచ్చడంలేదు "ఇక్కడికొచ్చి యిరుక్కున్నేంద్రా...భగవంతుడా.." అనుకుంటూ తలపట్టుకొని ముంగాళ్ల మీద కూచోబోతుంటే...

"రేయ్, పది కుండలు తియ్‌రా..." అన్నాడు యస్సయి. అతని స్వరం సాఫీగా కాకుండా బొంగురు పోయినట్టుగా ఉంది. అతని మొహం సాదాగా కాకుండా చెదలు పట్టినట్టుగా ఉంది. అతని చూపు సీదాగా కాకుండా దొంగదెబ్బ తీసే 'వాడి చూపు'లా ఉంది. అతని నడుమున వ్రేలాడేపిస్తోలు పుట్టలోంచి తల బయటపెట్టిన నల్లత్రాచు లా ఉంది.

"సిత్తం, బాంచను" అని టక్కున పగ్గాన్ని విప్పి చిన్నచిన్న కుండల్ని పక్క నుంచి పది పెద్దకుండలు ఎదురుగా ఉంచి, చేతులు కట్టుక నిలుచున్నాడు కుమ్మరెంకన్న.

"ఏయ్, ట్వంటీ సెవెన్' యివి లోనపెట్టు" కుండల్ని చూస్తూ అన్నాడు యస్సయి.

'ట్వంటీ సెవెన్' కుండల్ని లోనికి తీసుకవెళుతుంటే, తనకే వినపడనంత చిన్నగా "పైసలిస్తరా, బాంచన్" అన్నాడు. అదీ భయం భయంగా కుమ్మరెంకన్న

కుండలు తీయమన్న యస్సయిగానీ, తీసి లోనపెట్టుకొన్న తనుగానీ, తనకేసి చూడటం లేదు. అతనికేం చెయ్యాలో తోచక తలగొక్కున్నాడు. అందర్నీ మార్చిమార్చి చూడసాగేడు.

యస్సయి గారి చేతిలో ఉన్న సెల్ మ్రోగింది. చెవి దగ్గరుంచుకొని, అవతలి నుంచి చెప్పేదంతా విని, 'యస్సర్...' అంటూ సెల్ 'ఆఫ్' చేశాడు. కంగారుతో "సాబ్ అయిదు నిముషాల్లో వస్తారు. పదండి, కూర్చోండి.." అంటూ అటు ఇటూ తిరగసాగాడు.

"కుండల పైసలు బాంచన్"

యస్సయి తలతిప్పి చూశాడు. "ఊ... మీటింగయినంక యిస్తరులే నోర్మూయ్" అన్నాడు యస్సయి.

"సంతకు బోవాల, పొద్దెక్కింది బాంచన్" అన్నాడు కుమ్మరెంకన్న

యస్సయి వినలేదు. అతని వెనుకనున్న పోలీసతను విన్నాడు. "రేయ్, కుమ్మరోడా... నీ పైసలెటూ పోవుగాని, యిప్పుడు పెద్దోరొస్తుండు చలివేంద్రం మీటింగుంది. నువ్ సంతల కుండలమ్ముకొని గమ్మునొచ్చెయ్, ఎంతన్నవ్?" అన్నాడు.

"పది కుండలు, తవరి దయ... గరీబోన్ని బాంచన్"

"సర్లే, నువ్ గమ్మునొచ్చెయ్, పో... పో..." అని పోలీసతను లోనికెళ్ళాడు.

కుమ్మరెంకన్నకు కూడా కుండలమ్ముకొని వస్తే మంచిదనిపించింది. మిగిలిన కుండలన్నీ పగ్గంతో బిగించి, కావిడి నెత్తుకొని బయటపడ్డాడు.

ఎండ చుర్రుమంటూంది. తార్రోడ్డు అప్పటికే కాకెక్కింది 'సోటుందో, ఎవురన్నా కొట్టేసిన్రో...' అనుకుంటూ పరుగులా నడక సాగించాడు.

సంత దగ్గరకొచ్చేసరికి దమ్మొచ్చింది. చెమట పట్టింది. తను కుండలు పెట్టుకొనే చోటు ఖాళీగా కన్పించడంతో కొండెక్కినంత సంబరమేసింది. కావిడి దించి కండువాతో మొహం తుడుచుకొంటుంటే "ఆలిసెవయిందేరా తమ్మీ" కుడిపక్కన అడవి ఉసిరికాయలు అమ్ముకుంటున్న పడిగె సమ్మక్క అంది.

"టేసన్ల బేరవయిందక్కా..." అని, పగ్గం విప్పి కుండలన్నీ వరసన పేర్చి చుట్టూ చూశాడు.

జనం అప్పటికే కిక్కిరిసి ఉన్నారు. ఎండాకాలం అయినందున పొద్దుటి పూటే ఎక్కువ సందడిగా ఉంటుంది. కేకలు, అరుపులు, పరుగులు, పలకరింపులతో సంత సంతలా ఉంది.

కుమ్మరెంకన్న కుండల వెనుక గుండురాయి మీద కూచున్నాడు. తన కుండల కేసి ఎవరన్నా చూస్తుంటే అతనిలో ఆశ మిణుక్కుమంటుంది. కాని కుండకొనమని ఎవర్నీ అడగడు. మొదట్లో అడిగేవాడే! "కుండలోయ్, కుండలు... కుండుల కొనండమ్మా... అయ్యా కొనండి..." అంటూ గొంతు చించుకునే వాడు. ఒకరిద్దరు అడ్డం తిరిగేసరికి చెంపలేసుకొన్నాడు.

"కుండలు కనపడతన్నయిగా... మళ్ళీ, నీ అడుగుడేంది?.. అడిగినంతలో కొంటరా..? కావాల్సొస్తే ఊకుంటరా?.. నువ్వేం అడమాక" అంది పడిగెసమ్మక్క. అప్పట్నుంచీ గమ్మునుంటూ వచ్చే పొయ్యే వాళ్ళను ఆశగా చూడటం అలవాటు చేసుకొన్నాడు.

"నీళ్ళకుండలున్నయా?" కూరగాయల సంచితో వచ్చినతను కుండల్ని చూస్తూ అన్నాడు.

"ఆ... ఉన్నయి సారూ.." అంటూ గుండురాయి మించి లేచి, ముందుకొచ్చి, ఓ కుండ నందుకొని, మరో చేత్తో కొట్టి చూయించాడు. కుండ పగులుడుంటే వచ్చే శబ్దానికీ, లేకుంటే వచ్చే శబ్దానికీ గల భేదం



Untitled-2 22 6/11/2002, 3:51 PM

అతనికి తెలుసు!

"మీకు 'ఫ్రిజ్' ఉందిగా" కూరగాయలతని పక్కగా నున్నతను అన్నాడు.

"ఆ... ఉంది... దాంతోపాటు తొమ్మిగంటల 'కరెంట్ కట్' కూడా ఉంది" తేలికగా నవ్వేస్తూ, జనానికీ ఎండాకాలం కుండలేగతి" అన్నాడు.

''ఆ నీళ్లయినా మూడ్రోజులకోసారి వస్తున్నాయి.'' ప్రక్కనున్నతను.

కూరగాయల సంచీ అతను తలూపుతూ, కుమ్మరెంకన్న చేతిలోని కుండనందుకొని, "ఎంత?" అన్నాడు.

"ముప్పయి.."

"మట్టికుండరా... మైనంతో చేసిందేం కాదు. ఏందారేటు" వెక్కిరింతగా, కోపంగానూ అన్నాడు పక్కనున్నతను.

"కాదన్నానా బాంచన్... ధరలెట్ట మండుతున్నయో... చదువుకొన్న సాములు... తవరికి తెల్వదా... పోనీ, పాతికియ్యండి" అన్నాడు కుమ్మరెంకన్న.

"పదిహేను చేసుకో..."

"ఇంకో అయిదు... ఇరవయ్యన్నాయియ్యుండి... మట్టి రేటు మా మండి పోతాంది, బాంచన్" అన్నాడు కుమ్మరెంకన్న.

"నీళ్ళు కారితే వాపసిస్త" అని ఇరవై రూపాయలిచ్చాడు. కూరగాయలతను ఆ పక్కనున్నతను అదే ధరకు మరొకొటి తీసుకొన్నాడు.

.....



పొద్దు తిరిగింది. ఎండమొహం మీద పడుతోంది. కుండలు చాలా వరకు అమ్ముడు పోయాయి. బేరం బాగా సాగినందుకు అతనికి సంతోషంగా ఉంది. గుండురాయి మీద కూచొని, బొడ్లో దోపుకున్న గుడ్డసంచీలోని డబ్బులన్నీ కండువాలో పోసి, నెమ్మదిగా లెక్కపెట్టుకొన్నాడు. మళ్లీ సంచీలో ఉంచి, జాగర్తగా బొడ్లో దోపుకున్నాడు. పై నుంచి పంచె బిగించాడు.

"బోనీ బేరం మంచిదే రబ్బీ..." తన యింటి పెరటిలో కాసిన బొప్పాయి కాయల్ని, తన పిల్లలు తినేందుకు ఒకటి అడిగినా, యివ్వకుండా సంతకు తెచ్చి అమ్ముకుంటున్న దూదేకుల హుస్సేన్ నవ్వుతూ అన్నాడు. నమ్మక్కసుత నవ్వింది. కుమ్మరెంకన్న గుండెల్లోనూ నవ్వింది. కాని నవ్వలేదు.

"పోలీసాయన బోణీ... మా రాజు సల్లగుండాల... ఇక బోత నక్కా... టేసన్ల పైసలడుక్కునే సరికి ఏ యాళయిద్దో.. పిల్దానికి మాతర్లు సుత కొంచకపోవాల... మీ మర్దలసలే కంగారు మన్సి." అంటూ లేచి, మిగిలిన కుండల్ని పగ్గంతో కావిడికి కట్టుకొని, వెనుదిరిగి రోడ్డెక్కాడు కుమ్మరెంకన్న.

పోలీస్‌స్టేషన్ దాపుకొచ్చేసరికి పొద్దు పూర్తిగా వాలిపోయింది. పొద్దున వేసి వున్న టెంట్ తీసేశారు. చలివేంద్రంలో ఒకతను నీళ్లు పోస్తూ కనిపించాడు. తానిచ్చిన కుండలు వరసలో నిలుచున్న పెద్దమ్మ తల్లుల్లా కనిపించాయి. దగ్గరగా వెళ్లి గ్లాసందుకొని, నీళ్ల పడుతూ, "నీళ్లు సల్లగుండయి గదూ?... కుండలు నేనే యిచ్చిన..." అంటూ నీళ్లు తాగి స్టేషన్‌లోకి నడిచాడు.

ఆవరణలో నలుగురైదుగురు పోలీసులు మాట్లాడుకొంటున్నారు. లోపల ఎవరో పెడబొబ్బలు పెడుతూ ఏడుస్తున్నారు. ఎవర్నో కొడుతున్నట్టుగా ఉంది.

"కాల్మొక్త బాంచన్" అంటూ కావిడినో పక్కగా ఉంచి, తలగుడ్డ తీసి నడుముకు బిగించి, చేతులు కట్టుక నిలుచున్నాడు కుమ్మరెంకన్న

"ఏంట్రా.. ఎందుకొచ్చినవ్?" ఓ పోలీసతను పోతూ అడిగాడు.

"పొద్గాల కుండలిచ్చిన బాంచన్"

స్టేషన్ ముందు గదిలో పొడవాటి బల్లముందు కూచొని, రాసుకునే రైటర్ తలెత్తి చూశాడు. "రేయ్, కుమ్మరోడా... యిటురా..." అంటూ సైగ చేశాడు.

కుమ్మరెంకన్న ఆశగా లోనికెళ్ళి బల్ల పక్కగా నిలుచున్నాడు. రైటర్ కుర్చీకి ఎదురుగా ఉన్న పొడవాటి బెంచీ మీద కూచున్న నలుగురు పోలీసులు ముచ్చట్లు చెప్పుకుంటున్నారు. బల్లమీదున్న టేప్‌రికార్డర్ లోంచి, ఉదయం చలివేంద్రం ప్రారంభోత్సవ సభలో ఎస్.పి. గారిచ్చిన ఉపన్యాసం వినిపిస్తుంది.

"... పోలీస్ ఒక చలివేంద్రం లాటివాడు. దాహం తీర్చే నీటి చెలమ. ప్రజాక్షేమమే అతని ఉద్యోగధర్మం. శాంతి భద్రతల పరిరక్షణలో ప్రాణాల్ని ఫణంగా పెడుతున్నావాడు. న్యాయాన్ని తన రెక్కల నీడలో...." రైటర్ టక్కున టేప్ రికార్డర్ నాపుచేసి, కుమ్మరెంకన్న కేసి చూస్తూ కనుబొమ్మ లెగరేశాడు.

"కుమ్మరోణ్ణి బాంచన్... పొద్గాల కుండలిచ్చిన... పది"

"ఎంతరా..."

"పెద్దకుండలు పది సారూ... బయటయితే మూడొందలు ఎటూ బోవు... యిగ తవరి దయ బాంచన్" అన్నాడు కుమ్మరెంకన్న.

రైటర్ బల్ల సొరుగులాగి, తెల్లకాగితం తీసి, రశీదు రాసి, "పైసలు ముట్టినట్టు ముద్రేయరా..." అన్నాడు.

"నా పేర్రాస్త, బాంచన్.. రేత్రి బడిల నేర్సుకున్న" అన్నాడు కుమ్మరెంకన్న

"దెహె... చెప్పింది చెయ్, ఏలు ముద్రేయ్" అంటూ తానే కుమ్మరెంకన్న బొటన ్రవేలందుకొని ముద్రేయించాడు రైటర్.

"పేరేందిరా?"

"కుమ్మరెంకన్న అంటరు బాంచన్"

రైటర్ రశీదు మీద పేరు రాసి, "ఏ ఊరు?" అన్నాడు.

కుమ్మరెంకన్న చెప్పాడు.

ఆ ఊరి పేరు వింటూనే అక్కడున్న పోలీసులంతా ఒక్కసారిగా ఉలిక్కి పడ్డారు. రైటర్ చేతిలోకి కలం ఆగిపోయింది. అనుమానంగా, బెదురుగా కుమ్మరెంకన్న కేసి దొంగచూపులు చూశాడు. వ్రేలి కంటిన సిరా మరకను తలవెంట్రుకలకు తుడుచుకుంటూ కుమ్మరెంకన్న అదేమీ గమనించలేదు.

"బయట కూచో, పిలుస్తా" అన్నాడు రైటర్.

"సిత్తం, బాంచను, సీకటి పడతాంది... ఆరుకోసలు బోవాల" అన్నాడు కుమ్మరెంకన్న.

"దెహె పో... బయటుండ పో... యస్సయి సాబొచ్చినంత పైసలిస్తడు పో...." కోపంగా చూస్తూ కసిరాడు రైటర్.

కుమ్మరెంకన్న అమాయకంగానూ, భయంగానూ చూశాడందరికేసి, ఇప్పటి దాకా చల్లగా మాట్లాడినతను యిప్పటికిప్పుడే ఎందుకు కోపగించుకుంటున్నాడో తెలీక, దీనంగా చూస్తూ... "అట్టనే బాంచన్" అంటూ బయటికొచ్చి, ప్రహరీగోడ పక్క తన కావిడి దగ్గరగా నిలుచున్నాడు.

పొద్దున తిన్న పట్టెడు మెతుకులు. అతనికి నీరసంగా ఉంది.



Untitled-2 23 6/11/2002, 3:51 PM

ఖాళీ కడుపున నాలుగయిదుసార్లు నీళ్లు తాగడంవల్ల కడుపులో తెములుతోంది. డోకొచ్చినట్టుగా ఉంది. ఎంత త్వరగా డబ్బులిస్తే, అంత త్వరగా ఆ చోటు నుంచి దాటుకోవాలని తప్ప మరో ఆలోచన అతనిలో లేదు. కొద్దిసేపు అటూ, ఇటూ చూసి, మనసాగక, దాపులో నిలుచున్న పోలీసతనికేసి చూస్తూ, చేతులు జోడించి, "దొరెప్పుడొస్తడు, బాంచన్" అన్నాడు.

పోలీసతను ఆదోలా, కాటేసేలా చూసి "నీకూ, నాకూ చెప్పొస్తాడ్రా సాబ్... ఆగమంటే మా గీర్వానం పోతన్న వేంది?...ఆ అసలేంది?" కరిచేలా అన్నాడు.

కుమ్మరెంకన్నకు వెన్నులో వణుకొచ్చింది "ఎవర్ని మెదిపినా కరుస్తున్రేంది?.. లోలోనే గొణుక్కొని, గేటు కేసి చూస్తుంటే జీప్ వచ్చిగేటు ముందాగింది.

జీప్‌లోంచి దిగిన యస్సయిని చూసే సరికి, కుమ్మరెంకన్నకు మనసు తేలికయినట్టపించింది. పైసలు చేతిలో పడినంత సంబరమేసింది.

యస్సయి సెంట్రీ సెల్యూట్ అందుకొని, గదిలోకి నడిచాడు. ఆ వెంట యిద్దరు పోలీసులు లోనికెళ్ళారు. కొద్ది సేపటికే వారిద్దరితోపాటు యస్సయి బయటికొచ్చాడు.

"దొరా... బాంచను," కుమ్మరెంకన్న ఓ అడుగు ముందుకేసి, వంగి చేతులు జోడిస్తూ అన్నాడు.

"ఎవడ్రా..." అంటూ కుమ్మరెంకన్నను చూస్తూ, "ఆ... ఏంటి బే..." అన్నాడు యస్సయి.

"కుమ్మరోడ్ని బాంచన్.. కుండల..."

పైసలివ్వలేదా?... ఏయ్, ఖాసిం... వీడి పైసలివ్వలేదా?... యిచ్చేయ్" అని యస్సయి అంటుంటే, ఖాసిం అనబడే రైటర్, పరుగులా వచ్చి యస్సయి చెవిలో ఏదో చెప్పాడు.

ఆ మరుక్షణమే... యస్సయి మొహంలో రంగులు మారాయి. ఓ మాదిరిగా వున్న అతని కళ్ళలోకి రక్తపు జీరలొచ్చాయి.

"రేయ్, కుమ్మరోడా... ఏ ఊర్రా నీది?" అన్నాడు.

చెప్పాడు కుమ్మరెంకన్న

"ఏయ్ 'ఒన్ ఫోర్ టూ' వీడ్ని లోపల పడేయ్" అన్నాడు యస్సయి.

కుమ్మరెంకన్న ఉలిక్కిపడ్డాడు. బెదురుగొడ్డులా చూశాడు. కాళ్ల కింద నేల కదులుతున్న రీతి... దడ... వణుకు... "బాంచ...నేను, నేను... పొద్గాల... కుండ... కుండలిచ్చిన కుమ్మరోన్ని... కాల్మొక్త బాంచన్" తడారి పోతున్న గొంతుతో వణుకుతూ అన్నాడు.

"ఏయ్ చుప్" అని కసిరిలోనికెళ్ళాడు యస్సయి.

ఆ కసిరింపుకు కుమ్మరెంకన్న ఒల్లు ఝల్లుమంది రాయిలా, చలన రహితంగా నిలుచుండి పోయాడు. చూపులు ఎక్కడో... శూన్యంలో... శూన్యంగా...

అతన్ని చూసే సరికి 'ఒన్ పోర్ టూ' కి జాలేసింది. దగ్గరగా చ్చి, "రేయ్, కుమ్మరోడా..." అంటూ రెక్కపట్టుకలాగాడు. అయినా కుమ్మరెంకన్న శూన్యావస్థలోంచి బయటకు రాలేదు. 'ఒన్ ఫోర్ టూ' మరోసారి లాగి, పిల్చి, కదల్చి, చిరాకేసి చెంప చెళ్ మనిపించాడు.

కుమ్మరెంకన్న ఉలిక్కిపడి తెలివిన బడ్డాడు.

"ఏంద్రా, ఏందట్టయినవ్?... పానం బాగలేదా, భయమేసిందా? అంటూ భూమ్మీద నున్న కావిడిని తీసి, కుమ్మరెంకన్న చేతి కందిస్తూ, "ఇగ్లో... పొద్దున మీ ఊరి బోడగుట్టన కాల్పులైనయి. మీ ఊర్లె అన్నలకి బువ్వలు పెడ్తరటగా... సాబ్ కోపం మీదున్నడు. మీ ఊరోళ్లు దొరికితే బొక్కలేసి కుళ్లబొడవమని ఆర్డరొచ్చింది. పో...పో... బలుసాకు తినైనా బతకొచ్చు. పిల్లలు గల్లోడివి... పో... సి.ఐ. సాబొస్తే చావగొడతడు. నేసర్దిజెపుతగాని, నువ్ జల్దెల్లు... ఈ సుట్టుపక్కల కనపడబాక్... పో... ఉరుకు..." అంటూ గేటుకేసి నెట్టేశాడు. అలా నెట్టేస్తూనే కుమ్మరెంకన్న బొడ్లో జాగర్తగా దోపుకున్న గుడ్డ సంచీ వడుపుగా లాగేశాడు 'ఒన్ ఫోర్ టూ' అనబడే పోలీస్.

ఆ నెట్టుడుకు తూలిపడే వాడల్లా... గేటు పట్టుక నిల్చొని, కుమ్మరెంకన్న బొడ్లో తడుముకొంటూ, మిడిగుడ్లేసుకొని, పోలీసతని కేసి చూస్తూ, "నా పైసలు.. పైసలు బాంచను, మీ కాళ్లమొక్కుత, నా పైసలు..." అంటుంటే...

గేటులో ఉన్న సెంట్రీకి లోనుంచి ఓ కనుసైగ అందింది.

అంతే!

గేటు పట్టుక నిల్చొన్న కుమ్మరెంకన్న రెక్కపట్టుక లాగి, రోడ్ కేసి ఈడ్చి గిరాటేశాడు సెంట్రీ!

(2003 తానా కథాసాహితి కథల పోటీలో రెండవ బహుమతి పొందిన మూడు కథల్లో ఒకటని రచయిత తెలిపారు)

V

# నిన్ను నువ్వు వెతుక్కుంటూ

## అడిగోపుల వెంకటరత్నమ్



చినుకు కురిసింది
బీజం మొలకెత్తింది
ప్రపంచీకరణ చుట్టుముట్టింది
అక్షరం శ్రీకారం
ఆమని పాడింది
ప్రైవేటీకరణ కమ్ముకుంది
గర్భం పండింది
శిశువు జన్మించింది
సరళీకరణ తిష్టవేసింది!
ఉపాధి అవకాశాల కుదింపు
ప్రభుత్వరంగ సంస్థల అమ్మకం
సబ్సిడీల కోత
బడ్జెట్టుల రూపకల్పన
ఒక దేశపు అంతరంగం
పరదేశపు ఆధిపత్యం!
మనుషులు ఎంతెంత దూరం...
రెండు చేతుల కరచాలనం
మధ్య
రెండు ఖండాల అంతరం
హక్కులు మాడిపోతున్నాయి
ఆశలు వాడిపోతున్నాయి!
కుంగిన రథాల్ని కర్ణులు ఎత్తుకునే
యత్నంలో వున్నారు
అర్జునులకు సైగజేసి పార్థసారథులు
అదను యిదే అంటున్నారు
అధర్మం ధర్మమై
భగవద్గీత ఇంటింటా బోధిస్తుంది!
ఆపదలో ధర్మనందనులు అబద్ధం సై
అంటున్నారు
ద్రోణులు అర్ధాంతరంగా
అస్తమిస్తున్నారు
అసత్యం సత్యమై
అగ్రజులు అజాత శత్రువులై
వెలుగుతున్నారు!
రెండు దేశాల మధ్య సరిహద్దు రేఖ
ఏనాటికీ ఇరుదేశాలకు ఆమోదం కాకుండా వుంది
రెండు రాష్ట్రాల మధ్య జీవనది
ఎప్పుడూ యుద్ధభేరి మోగిస్తూ వుంది
రెండు ఇళ్ళ మధ్య ప్రహరీ
నిరంతరం హద్దు సమస్యపై నిద్రమాని వుంది!
ఇంట్లో దీపం వుంది ఇంధనం వుంది
ఇంటి యజమాన్యం వుంది
వెలిగించే వాడి కోసం వెతుకుతూ వుంది!


Untitled-2 24 6/11/2002, 3:51 PM

ప్రసంగం



# కవితావతరణం

**డా. సీతారామ్**

**ఈ** సభలో నాకు తోచిన మాటలేవో చెప్పి పోవడానికి రాలేదు. నాకు తెలియనిదంతా చెప్పేయడానికి రాలేదు. నాకు ఎంతో తెలుసని ఎరుక చేయడానికీ రాలేదు.

నాలుగు కవితల్లాంటివి రాసిన ఆపరాధానికి నన్నొక ప్రముఖ కవిని, పరిశోధకుడ్నీ చేసి మీకు వొప్పజెప్పారు సాహితీ స్రవంతి సహృదయులు. నాకు ఇచ్చిన అంశానికి విధేయులుగా ఉంటూ 'కవితావతరణం' గురించి మాట్లాడతాను.

మనకు కవిత్వ నిర్వచనాలు చాలానే ఉన్నాయి. వివిధ వాదాలు, ధోరణులు ఉద్యమాలు దేశీయమైనవీ, వైదేశికమైనవీ ఉన్నాయి. కవిత్వ ఆవిర్భావ వికాసాలకు సంబంధించిన సమగ్ర అధ్యయనాలున్నాయి. వాటి జోలికి కనీసంగా కూడా పోవడం లేదు నేను.

'వర్క్‌షాప్' అన్నారు కనుకనే పెద్దపెద్ద నిర్వచనాలకి నేను పూనుకోవడం లేదు. మరి కవితావరణం – పరిణామ, వికాసాలను ఎట్లా చెప్పాలన్నదే సమస్య.

ప్రాచీన కవులని వదిలేస్తే, ఆధునిక కవులు కవితావరణం గురించి ఎక్కువగా చెప్పినట్లు లేరు. నీ నుంచి కవిత్వమెలా పుడుతుందని ఏ కవిని అడిగినా సమాధానం వెంటనే చెప్పలేరు. గొప్ప కవులకు కూడా ఇది వర్తిస్తుందనుకుంటా. కవిత్వమెలా పుడుతుందో చెప్పలేకపోవడం ఆయా కవుల అశక్తతో, అసమర్థతో, వైముఖ్యమో కారణం కాదు. చెప్పడం, సమగ్రంగా వివరించడం కష్టమే. దీనికి మినహాయింపుగా ఒకరిద్దరు కవులు ఉంటే ఉండవచ్చు.

కవితావరణం గురించి మాట్లాడటానికి ప్రాథమిక ఆధారం కొంత నా దగ్గర ఉండాలి. నాకు సమీపంలో లేని రచనలను, ఖండికలను, కవుల నుంచి తీసుకుని వాటిని పరిశీలించి 'అవతరణం' గురించి చెప్పాలనుకోవటం సాహసం.

ఈ సాహసం చేయదలచుకోక, ఒక చిన్న దారిని వెతుక్కున్నాను.

అదేమంటే –

నేను జూనియర్ లెక్చరర్‌గా ఎర్రుపాలెం మండలం, బనిగండ్లపాడు జూనియర్ కళాశాలలో పని చేస్తున్నాను. మా కాలేజీ పిల్లలకు ఈ సభ గురించి ముందే చెప్పాను. నేను ఇచ్చిన అంశం మీద కవిత్వం రాస్తే నా ప్రసంగం అంతా విద్యార్థులు రాసిన కవితల ఆధారంగానే సాగుతుందని చెప్పాను. సరే, రాస్తాం విషయం చెప్పండని అడిగారు. నేనొక శీర్షిక బ్లాక్ బోర్డు మీద రాశాను. ఆ శీర్షిక ఇది 'ఖాళీ ఊయెల'

ఈ ఖాళీ ఊయెల గురించి వాళ్ళు రాయాలి. 'కవిత్వం' రాయాలి వాళ్ళు. ఆ పిల్లలకి ఏది కవిత్వమో తెలియదు. ఎట్లా రాస్తే కవిత్వమంటారో తెలీదు. ఏది కవిత్వం కాదో తెలియదు. మొత్తం ఇంటర్ మొదటి సంవత్సరం విద్యార్థులకే అప్పగించిన పని ఇది. వారం రోజుల సమయం వాళ్ళకిచ్చాను.

ఒక వారం తర్వాత 80 మంది ఉన్న క్లాసులో 9 మంది విద్యార్థులు రాసి తీసుకొచ్చారు. వాటినిక్కడ ప్రస్తావించడం ద్వారా కవితావరణం ఎట్లా జరుగుతుందో నాక్కూడా తెలిసే అవకాశం వస్తుంది.

రాసిన తొమ్మిది మందిలో ఇద్దరే ఆడపిల్లలు. బ్లాక్ బోర్డు మీద నే రాసిన శీర్షిక 'ఖాళీ ఊయెల' శీలం గోపాలరెడ్డి ఈ శీర్షికను 'ఖాళీ ఊయల'గా మార్చాడు. ఏం రాశాడో చూద్దాం.

**"ఇప్పుడే తమ్ముడు అమ్మవడిలోంచి నిద్రలేచి**
**ఆటకు పోయాడు**
**మా అమ్మవడి చల్లని వెన్నలంటిది**
**తియ్యని తేనె లాంటిది**

ఇట్లా మొదలయింది కవిత. ఈ చివరి రెండు పంక్తుల దగ్గర చిన్న గమనిక బ్రాకెట్లో రాశాడు (ఆ గమనిక ఇది : ఇక్కడ వడి అనగా ఊయల)

మిగతా కవితను చూద్దాం

**ఎందరినో పసిపిల్ల వాళ్ళను తన వడిలో తన**
**జోలపాటతో పెద్దవాళ్లను చేసింది కాని**
**తనకేమీ ఎవ్వరు ఇవ్వరు**
**ఖాళీ ఊయాలలా వదులుతారు**
**పెద్దలు సరదాగా పిల్లలు ఆటవస్తువుగా**
**పసిపిల్లలు అమ్మవడిగా ఊగుతారు**
**ఊయాల ఖాళీగా ఉంటే**
**ఎవరైన వచ్చి నాపై సేద తీర్చుకొండిరా**
**అంటుంది.**
**ఊయాల ఖాళీగా ఉంటే పసితనంలోనే**
**కుమారున్ని కోల్పోయిన తల్లిలాగా ఉంటుంది**
**మొదలు లేని చెట్టు వంటిది**
**వడ్డించని కంచం లాంటిది**
**జంతువులు లేని అరణ్యం లాంటిది**
**అక్షరం లేని పుస్తకం వంటిది**
**నీళ్ళు లేని బావి లాంటిది**

ఈ కవితను మరోసారి పరిశీలించి చదవండి. ఇచ్చిన శీర్షికతో కవితను మొదలు పెట్టడానికి ఈ కవి ఏ ఎత్తుగడని అనుసరించాడో తెలుస్తుంది. అయితే ఈ కవితలో భాషాదోషాలు కవివి కావు. విద్యా వ్యవస్థవి. ఇప్పటి దాకా తెలుగు నేర్పిన పంతుళ్ళవి. ఈ భాషాదోషాలు ఇలాగే కొనసాగనిస్తే ఆ తప్పు నాది కూడా అవుతుంది. ఈ కొసరు విషయం మాటెందుగ్గాని, అసలు విషయానికొస్తాను.

ఇచ్చిన వస్తువు (శీర్షిక) 'ఖాళీ ఊయల' ఈ 'ఖాళీ'ని ఎట్లా పూరించాలో ముందు తెలిసుండదు. రాసే వత్తిడి, రాయాల్సిన అనివార్యత వచ్చేటప్పటికి ఊయల



Untitled-2 25 6/11/2002, 3:51 PM

= అమ్మవడిగా మార్చుకున్నాడు. 'ఖాళీ ఊయల'గా దానిని చూపే ప్రయత్నంలో నిద్రలేచిన తమ్ముడు ఆటకు వెళ్ళాడు అని చెప్పడంతో గోపాలరెడ్డికి ఒక సౌలభ్యం దొరికింది. ఊయెల ఊయెలగా ఉంచలేదు. అమ్మవడిగా బదలాయించాడు. ఈ ఊయలను పర్సానిఫై చేస్తే తప్ప రాయలేకపోయాడు. అమ్మవడి=ఊయల అనుకున్నప్పటికీ 'ఊయల' గురించి కూడా రాయాలి కాబట్టి ఊయల 'అటువంటిది', 'ఇటువంటిది' అనే పోలికలు వెతుక్కున్నాడు. ఈ కవిత చివరి 8 పంక్తుల్లో 'వంటిది' అన్న పదం తీసేస్తే మరింత బలం వచ్చేది. ఏ మహాకవి వాక్యం కన్నా తక్కువ కాని వాక్యాల్నే ఈ పిల్లాడు రాశాడని మనం అనక తప్పదు.

రెండో విద్యార్థి కె. నరసింహారెడ్డి. సైన్సు విద్యార్థి 'ఖాళీ ఊయల' అని రాశాడు 'య' 'మ'కి తేడా పాటించడం పట్ల పెద్ద పట్టింపు లేదు ఈ విద్యార్థికి.

కవితను చూడండి :

**నన్ను చూస్తే పిల్లలు పర్వసించిపోతారు**
**మారాం చేసే పిల్లలు నా వడిలో కూర్చుంటే**
**మారాం చేయడం మానేస్తారు**
**నా వడిలో కూర్చున్న పిల్లల ముఖంలో**
**విరజల్లును సంతోషం**
**నా కోసం పిల్లలు పోటీ పడతారు**
**నా నిర్మాణం ఎంతో సామాన్యమైనది**
**నేనంటే పిల్లలకు ప్రాణం**
**నా వడి కూర్చున్న పిల్లలకు**
**నేను చూపిస్తాను భూలోకం మొత్తం**
**నా వడిలో కూర్చోని పిల్లలు పొందే**
**ఆనందం వర్ణించలేనిది**
**నాకు అవసరంలేదు ఎంతో ప్రదేశం**
**నా ప్రతి కదలిక పిల్లల గుండెల్లో ఓ ప్రతీక.**

నరసింహారెడ్డిని ఈ కవిత చదివాక ఒక ప్రశ్న అడిగాను. 'ప్రతీక' అంటే ఏమిటి? అని. వెంటనే 'గుర్తు' అని చెప్పాడు. ఈ కవితలో ఊయల తానయ్యాడు. వస్తువును విస్తరించడం వివరించడం చేస్తున్నాడు. వస్తువు అనుభవాన్ని చెబుతున్నాడు. ఇందులో 'నా నిర్మాణం ఎంతో సామాన్యమైనది' అన్న వాక్యం అదనపు వాక్యం. ఇంకా ఏదో చెప్పాలనుకున్నాడు. కానీ భావన తెగిపోయింది. ప్రయత్నించి ఉంటే మరికొంత రాసేవాడు. ఈ కవితలో కూడా బదలాయింపు ఉంది.

మూడో విద్యార్థి శీర్షిక రాయకుండానే ఇలా మొదలు పెట్టాడు.

**నాకు పక్షిలా వున్నా, ఎగరలేను**
**ఎందుకంటే నాకు రెక్కలు లేవు**
**అలా ఒక వేళ ఎగిరినా నాకు సంతోసం లేదు**
**ఎగరటంవల్ల నా మీద పిల్లల్ని**
**కూర్చోబెట్టుకుని జోలపాట పాడలేను**
**మారం చేసి అన్నం తినని పిల్లల్ని**
**అన్నం తినేలా చేయలేను**

వి. నరేష్ బాబు రాసిన కవితలో ఊయల ఆకాంక్ష ఉంది. దీన్లోనూ జోలపాట, మారాం, అన్నం తినిపించటం లాంటివి ఉన్నాయి. మధ్యలో ఒక చోట 'ఆకాశంలో ఎగిరే పక్షిలా అటూ ఇటూ తిరుగుతూ ఉంటాను' అని రాశాడు. ఒక పోలిక తెచ్చాడు గమనించండి.

ఎం. గౌతమ్ రాజు రాసిన కవిత

**ఊయల చిరుగాలితో పలకరిస్తుంది**
**బహుశ చిరుగాలి ఊయలలు నేస్తాలు కావొచ్చు**
**ఊయలకు మాట్లాడు రాదు అనుకోవద్దు**
**మాటలు రానిది కాదు ఊయల. ఊయలకు అందరూ నేస్తాలే సుమా**
**....　　....　　....　　....　　....**
**తల్లి తరువాత ఎంతో చక్కగా మాతృహృదయాన్ని**
**కల్గి వుండేది ఈ ఊయల**
**తన ఒడిలో అమ్మలా లాలించేది ఊయల"** అన్నాడు.

ఒంటరితనాన్ని, ఆలోచనను, ఊహలను పంచుకుంటుంది అంటాడు. కవితను ముగిస్తూ" మన బాల్యంలో ఊయల అనేది లేకుండా బహుశ బాల్యం వుండేది కాదు" ఊయలను మరచిపోతే బాల్యాన్ని మరిచిపోయినట్లే అన్నాడు. బాల్యానికి చిరస్మరణీయ జ్ఞాపకంగా ఊయలను ఉదాత్తీకరించాడు.

ఎం. రవీంద్ర అనే విద్యార్థి ఊయల గురించి రాసిన ఇంకొన్ని వాక్యాలను చూద్దాం. ఈ కవి తన పేరుకు ముందు 'తేజ' అని రాసుకున్నాడు. తనని తేజ అనే దర్శకుడిలో చూసుకుంటున్నాడు అది తేజ ప్రభావం.

మొదట ఈ కవి చిన్న ఊపోద్ఘాతం రాశాడు. "ప్రతి స్త్రీ జీవితంలో మాతృత్వం ఓ మధురమైన అనుభూతి. అటువంటి మధురానుభూతులు పొందుటలో తమ చిన్నారితో అవ్యక్తమైన ఆనందమును పొందుటలో వారి చేష్టలే కాక తమ బిడ్డ శారీరక విశ్రాంతి నొందే ఊయలతో ఎంతో అవినాభావ సంబంధం ఉంటుంది. అటువంటి ఊయల ఖాళీగా ఉండటంవలన ఒక మాతృమూర్తి పడే వేదనకు దర్పణం ఈ కవిత" ఒక 'ఖాళీ ఊయెల' అన్న శీర్షికతో కవిత్వం రాయవలసి వస్తే ఏం రాయాలన్నది కవి ఆలోచన. తనకు తాను చెప్పుకున్న విషయాన్ని వచనంలో మనకూ చెప్పేశాడు. ఈ విద్యార్థులెవరూ ఇంతకు ముందు కవిత్వం రాసిన వాళ్ళు కాదు. ఈ సంగతిని మీకు మళ్ళీ గుర్తు చేస్తున్నాను.

రవీంద్ర అనే కవి ఏం రాశాడో చూద్దాం

**"చిరునవ్వుల వెన్నెలలు కురిపిస్తూ**
**ముద్దు ముద్దు మాటలతో ఆనందపరుస్తూ**
**తడబడే అడుగులతో, బోసి నవ్వులతో**
**ఇంటిని నందన వనంగా మార్చే చిన్నారుల**
**ప్రియనేస్తం – ఊయల**
**తరతరాల వారసుల సంతానాన్ని, తల్లి కన్నా మిన్నగా లాలిస్తూ**
**తల్లి ఒడి కన్నా వెచ్చగా**
**జాబిలి తెల్లదనం కన్నామిన్నగా ప్రేమను పంచుతూ**
**అలసటను మరచి ఆదమరచి నిదురించుటలో**
**చిన్నారులకు ఆలంబనగా నిలిచేది ఊయల**
**అనురాగపు మల్లెలు పూయిస్తూ**
**ఆనందపు చిరుజల్లులతో తడుస్తూ**
**బిడ్డే సర్వస్వంగా భావించే మాతృమూర్తికి**
**అవ్యక్తానుభూతిని కల్గించే అపురూప నేస్తం – ఊయల**
**నట్టింట రాజసంగా ఊగిన ఊయల**
**ఎందరో పసిపాపలను తన గుండెల్లో దాచుకున్న ఊయల**
**పసిపాపలు లేని ఇంట**
**పాత సామానుల గదిలోకి మార్చబడింది**
**స్తబ్దంగా నిశ్చలంగా నిస్తేజంగా మారింది**
**దానితో ఉన్న బంధం నెమరు వేసుకోగా**
**విషాదం ఎదనిండి గుండె పాత్ర పొర్లింది**
**కంటి చివర నీటి చుక్క చెంప మీద రాలింది**

ఒక ఊయలతో ఉన్న అనుబంధం అటు పసిపిల్లలకి, ఇటు తల్లులకీ ఎంత గాఢమైందో ఇందులో చెప్పే ప్రయత్నం చేశాడు. కదలిక



Untitled-2 26 6/11/2002, 3:51 PM

లేని ఊయల, పసిపాపలు లేని ఇల్లు అని 'ఖాళీ' ఊయలను గుర్తు చేసుకుని ఓ మాతృమూర్తి రాల్చిన జ్ఞాపకాల కన్నీటి చుక్కతో కవిత ముగించాడు. ఇందులో 'అనురాగపు మల్లెలు', ఆనందపు చిరుజల్లులు చిరునవ్వుల వెన్నెలలు ఒక పక్క, పాత సామానుల గదిలోకి మారిన ఊయల స్థితి మరో పక్క తనకు తోచినంతలో బాగానే చెప్పాడు.

ఊయలను 'షోభాయమాన'మైనదిగా (ఈ దోషం నాదికాదు) పేర్కొంటూ, ఊయల పనితనాలను పేర్కొన్నాడు మరో విద్యార్థి 'సమాజంలో అభివృద్ధివల్ల ఊయలలు నేడు కనుమరుగయ్యాయి' అంటాడు పేరు తెలపడానికిష్టపడలేదు.

ఎస్. కృష్ణారెడ్డి అనే మరో కవి రాసిన కవిత చూద్దాం

**నీవే మా ప్రథమ స్నేహితుడవు ఊయెల**
**నీవు నన్ను కవ్వించాలి ఊయెల**
**తల్లివలే లాలించేది ఊయెల**
**స్నేహితుడవలే చోటు యిచ్చేది ఊయెల**
**ఉగ్రూతలు ఊగించేది ఊయెల/ఉత్సాహాన్ని కల్గించేది ఊయెల**
**ప్రియురాలు వలే ప్రేమించేది ఊయెల"** అని రాశాడు.

ఈ కవిని అగౌరవ పరుస్తున్నానని అనుకోకపోతే, సినిమా కవి అవుతాడని అనవచ్చు. ఊయలని తొలి స్నేహితుడు అనడం నాకైతే గొప్పే. ఊయలను మూడు రూపాల్లో చూడటానికి ప్రయత్నించాడు.

ఇక మిగిలింది విద్యార్థినులు ఇద్దరు. ఆర్. మాధవి అనే అమ్మాయి రాసిన కవిత చూడండి.

**ప్రశాంత వాతావరణంలో**
**రమణీయమైన ధ్వనులగాలి**
**పచ్చనైన చెట్టుకొమ్మకు అటు ఇటు**
**ఊయెల వలె కదులుతు గూడు కట్టుకున్న**
**ఒక గిజిగాడు!**
**ఆ గూడు గడ్డిపోసలతో అల్లుకొని ఎంత**
**అందంగా వుందో**
**ఒక రోజు గిజిగాడు నిద్రపోతు వుంటే**
**రానే వచ్చింది ఆ రాత్రి వర్షం**
**పాపం ! ఆ గిజిగాడు గాలికి, వర్షానికి, క్రింద**
**పడిపోయి వర్షపు నీటిలో కొట్టుకొని చనిపోయింది**
**ఇపుడు ఆ గూడు ఖాళీ ఊయెల**

తుమ్మచెట్లకు ఖాళీగా వేళ్ళాడే పిచ్చుక గూళ్ళు ఎన్ని చూసిందో గిజిగాడు గూళ్ళను ఎన్నిటిని అపురూపంగా గుర్తుంచుకుందో ఖాళీ ఊయెలను గిజిగాడు గూటిగా అనువదించుకుంది. ఆ 'ఖాళీ'లో మృత్యువుని చూసింది. సెన్స్ ఆఫ్ లాస్‌ని ఈ పది వాక్యాల్లో పట్టుకునేందుకు ప్రయత్నించింది.

వి. నాగలక్ష్మి రాసిన కవిత. శీర్షికను 'ఖాళీ ఊయెల'గా రాయడం ఆ అమ్మాయి తప్పుకాదు. కవిత చివర ఈ అమ్మాయి ఒక వివరణ ఇచ్చింది "బాల్యం గొప్పవరం. మనిషి బాల్య జీవితంలో అమాయకత్వాన్నే ప్రదర్శిస్తాడు. కొత్త ప్రపంచంలో అడుగుపెట్టిన శిశువు మొదటి అనుబంధం తల్లితో అయితే, రెండవ అనుబంధం ఊయెలతో ఏర్పరచుకుంటాడు. అదే ఒడిలాగా నిద్రపుచ్చుతుంది. అటువంటి ఊయెల ఖాళీగా వుంటే దిగులుగా వున్నది అని నా భావన. ఆ ఊయెలకు ఒక మనసు వుంటే తనను తను తల్లిగా భావించుకుంటే ఇలా శోకిస్తుంది అని నా భావన" అంటూ వివరించింది. నాగలక్ష్మి కవిత ఈ విధంగా సాగుతుంది :

**"ఊయెల ఏమిటి ఖాళీగా వున్నావా?**
**పసికూన లేత పాదాలు నీ హృదయాన్ని తాకాలని లేదా?**
**పసికూన ఆటలకు నీకు మురవాలని లేదా?**
**తల్లి ఒడిలాంటి నీ ఒడిలో నిద్రిస్తూ**
**అమ్మ అమృత హస్తంతో ఊపుతూ వుంటే**
**ఏ పసిపాప నిద్రించాలని కోరుకోదు?**
**బేబీ కేర్ సెంటర్ల వలన అమ్మ అమృత హస్తం**
**స్పర్శను అనుభవించడం లేదా?**
**బాధగా వుందా?**
**లేక నా ఊయలలో పెరిగిన కూనలు, మతోన్మాదులుగా**
**దేశద్రోహులుగా మారుతున్నారని శోకిస్తున్నావా?**
**శోకించకు శోకించకు ఓ ఊయెల**
**సోకంలో మునగకు ఓ ఊయెల**
**అమృతం పంచిన కూనలను, ఆణిముత్యాల లాంటి**
**కూనలను నీ ఒడిలో నిద్రపుచ్చావు**
**సోకించకు, సోకించకు ఓ ఊయెల**
**సోకంలో మునగమాకు ఓ ఊయెల**
**గొప్ప గొప్ప వాళ్ళు నీ ఒడిలో నిద్రించారు**
**నీ ఒడిలో నిద్రించాకే గొప్ప గొప్ప వాళ్ళు అయ్యారు**
**సోకించకు సోకించకు ఓ ఊయెల**
**సోకంలో మునగమాకు ఓ ఊయెల"**

ఈ నవజాత శిశువుల్లాంటి కవితలను కొంత సుదీర్ఘంగానే ఉన్నా ఉదహరించాను. ముందే చెప్పినట్లుగా భాషాదోషాలు సరిచేయలేదు నేను. వాచకాన్ని గౌరవించటం నా ముందున్న ప్రాథమిక విధి. పదవ తరగతిలో వచన కవిత్వంలో భాగంగా మహేజబీన్ రాసిన 'స్ట్రీట్ చిల్డ్రన్' తప్ప మరో కవితంటూ ఎరగని పిల్లలు రాసిన దాంట్లో అక్షరాలా కవిత్వమే కనిపిస్తుందంటే ఏదో ప్రత్యేకత ఉండి ఉండాలి.

ఈ ప్రత్యేకత భాష ద్వారానే సిద్ధిస్తున్నది. భాషకి సహజంగా ఉండే బదలాయింపు గుణం వల్లనే కవిత్వంగా మారుతున్నది.

కవిత్వానికి సంవేదన ఎంతో ముఖ్యం. అయితే ఆ సంవేదనలు వ్యక్తం కావడానికి కవికి భాషను మించిన పని ముట్టు మరొకటి లేదు. భాషకి సహజంగానే ఉన్న 'బదలాయింపు' సామర్థ్యాన్ని శక్తిమంతం చేసినప్పుడు కవిత్వంగా పరిణమిస్తున్నది. ఈ బదలాయింపు ప్రక్రియనే మనం 'అలంకారం' అని పేరు పెట్టి విస్తృతిని కుదించాం. ఈ బదలాయింపే కవితావతరణం. ప్రధానంగా నాలుగు విధాలుగా సాగుతుంది. మొదటిది పోలిక. రెండోది రూపకం మూడు : సినెక్‌డొకే, నాలుగు మెటానమీ.

పోలిక బదలాయింపుని స్పష్టంగా ప్రతిపాదిస్తుంది. వివరిస్తుంది. రూపకం బదలాయింపు సాధ్యమేనన్న అంశాన్ని సూచిస్తుంది. అంతర్లీనంగా ఉంటుంది. మూడవది. బదలాయింపుని సంయుక్తంగా స్వీకరిస్తుంది. ఒక సకలాన్ని సూచించే నిమిత్తం శకలం ప్రయోగంలో ఉండి అర్థాన్నిస్తుంటుంది. 'ఖాళీ ఊయెల' బాల్యాన్ని సూచించినట్లుగా ఒక్క బాల్యమే కాదు. పసితనం నుంచి మృత్యువు దాకా.

నాలుగవది మెటానమీ ఒక వస్తువుకి వాడుకలో ఉన్న శబ్దసంకేతాన్ని కాకుండా ఆ వస్తువును లేదా, విషయాన్ని సూచించే పేరు/పదం వాడుతుంటాడు కవి. ఆధునిక కవిత్వంగా ఈ నాలుగు పద్ధతుల్లో అభివ్యక్తమవుతూ ఉంటుంది.

V



Untitled-2 27 6/11/2002, 3:51 PM

## ప్రతిస్పందన

# అవగాహన విస్తృతికి 'జనకవనం'

సాహిత్యంలో పది మందికి ఉపకరించే విధంగా సభలు, సదస్సులు జరగాలి. కొత్తగా రాస్తున్న వారికి మార్గదర్శకత్వాన్ని అందించగలగాలి. వాళ్ళలో ఒక నూతన ప్రేరణను ప్రోది చేయాలి. రాయాలన్న ఆకాంక్షను పెంచాలి. ఉద్విగ్నభరితమైన ఆలోచనల్ని స్పష్టమైన అవగాహనతో వ్యక్తం చేయడానికి ఉపకరించాలి. ఇలాంటి విస్తృతమైన ప్రాతిపదికన సాహిత్య సదస్సులు జరగడం అరుదయిపోయిన కాలమిది. ఇలాంటి నేపథ్యంలో గత నెలలో 'సాహితీ స్రవంతి' ఆధ్వర్యాన హైదరాబాద్ 'జనకవనం' శీర్షికన జరిగిన సాహితీ సదస్సు విలక్షణమైంది. రెండు రోజులపాటు జరిగిన ఈ సదస్సులో వందల మంది కవులు, రచయితలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కవిత్వ, కథా ప్రక్రియలకు సంబంధించిన ప్రసంగాల్లో సృజనాత్మకత వెల్లివిరియడానికి దోహదం చేసిన అంశాలు కొత్తగా రాస్తున్న వారికి ఎంతో తోడ్పాటుని ఇచ్చే విధంగా ఉన్నాయి. సాహిత్య సమావేశాలు ఎలా జరగాలో ఒక దశానిర్దేశాన్ని ఇచ్చిందీ సదస్సు. అందరూ సరైన అవగాహనను అందించారని చెప్పలేంగానీ, ఆలోచనలకు పురిగొల్పే ప్రతిపాదనలయితే చేశారు. వాదాలు, సిద్ధాంతాలు ఏవైనా విభేదిస్తూనే చర్చించడానికి అనువైనవిధంగా ఈ సదస్సు జరగడం ముదావహం.

ఇదివరలోనూ, ఇప్పుడు కూడా సాహిత్య సభలు, సమావేశాలు జరగకపోవడం లేదు. కానీ తమ ముద్రకు ఆమోదయోగ్యులైన వారికి మాత్రమే ఆహ్వానాలుంటాయి. తాము గీసిన రేఖకు ఆవల ఉండి మాట్లాడే వారికి అందులో చోటు ఉండదు. మరోమాటలో చెప్పాలంటే తమ ఆలోచనావిధానాన్ని అంగీకరించి వచ్చే వారికి మాత్రమే సాహిత్య తరగతులు, వర్క్‌షాప్‌లు నిర్వహిస్తారు. అంటే అంతా ఏకపక్షమే. చర్చకు ఆస్కారం ఉండదు. కొన్ని సంస్థలు, సంఘాలు దశాబ్దాల తరబడి ఈ రీతినే సాహిత్య తరగతులు నిర్వహిస్తున్నాయి. అవి ఎందరికి స్ఫూర్తినిస్తున్నాయో అందరికీ తెలిసిందే. అంటే భావజాలాల సంఘర్షణకు, విభేదించడానికి హక్కు ఉండే ప్రజాస్వామిక వాతావరణం లేకపోతే ఏ సభలు, సమావేశాలయినా ఏకపక్షంగానే నిర్వహించిన జనకవనం సదస్సు ప్రజాస్వామిక వాతావరణంలో విభిన్న దృక్పథాల వారికి వేదికగా నిలిచింది. చర్చలవల్ల ఎవరు ఏమిటో తెలిసింది. తద్వారా సభకు హాజరయినవారు తమ అవగాహన పరిధిని విస్తృతం చేసుకోడానికి తోడ్పడింది.

**'వార్త' నుంచి**

లబ్ధ ప్రతిష్టులైన వారు చెప్పే ప్రతిమాటని శిరసా వహించక్కర్లేదు. ప్రశ్నించి, తగిన సమాధానాలు రాబట్టి, సహేతుకంగా అనిపించినప్పుడు మాత్రమే ఆమోదించాలి. ఇలాంటి అవగాహన ఏర్పడేందుకు 'జనకవనం'లో రెండు రోజులపాటు సాహిత్యకారుల మధ్య జరిగిన సంభాషణ ఉపకరించింది. తమ దృక్పథాన్ని, విశ్వాసాల్ని ప్రశ్నించకుండా ఆమోదించే వారిని మాత్రమేగాక తమతో విభేదిస్తూ చర్చించడానికి ముందుకు వచ్చే వారిని సైతం ఆహ్వానిస్తూ సభలు, సమావేశాలు ఏర్పాటు చేయడం అవసరమని 'జనకవనం' రుజువు చేసింది. సంస్థల దృక్పథాలు ఎలా ఉన్నా ఔత్సాహిక రచయితలకు, కవులకు ఉపకరించే సమావేశాలు ఎలా ఉండాలో తెలియజెప్పింది. ముమ్ముందు ఇలాంటి సభలు మరిన్ని జరగాలని ఆశిద్దాం.

–జి.ఎస్.

**అక్టోబర్ 12, 2003**

# దళిత జనాలు లేని 'జనకవనం'

ఈ నెల 12న ఆదివారం 'వార్త'లో అచ్చయిన "అవగాహన విస్తృతికి జనకవనం" వ్యాసంలోని కొన్ని అవాస్తవాలను పాఠకుల ముందు ఉంచాలని ఈ ప్రయత్నం. ఆ వ్యాసంలో సాహిత్యంలో పది మందికి ఉపకరించే విధంగా సభలూ సమావేశాలు జరగాలనీ, విస్తృతమైన ప్రాతిపదికన సాహిత్య సదస్సులు జరగడం అరుదైపోయిన కాలంలో సాహితీ స్రవంతి ఆధ్వర్యాన జరిగిన 'జనకవనం' సాహిత్య సదస్సు విలక్షణమైందనీ వ్యాసకర్త కితాబు ఇచ్చారు. అయితే ఆ పదిమందిలో దళితులుగానీ, దళిత సాహిత్యంగానీ లేకపోవడం విస్తృత ప్రాతిపదిక ఎలా అవుతుందో వ్యాసకర్తకే తెలియాలి.

"తరచూ జరిగే సభలు సమావేశాల్లో తమ ముద్రకు ఆమోద యోగ్యులైన వారికి మాత్రమే ఆహ్వానాలుంటాయి. తాము గీసిన రేఖకు ఆవల వుండి మాట్లాడేవారికి అందులో చోటు వుండదు. మరోమాటలో చెప్పాలంటే తమ ఆలోచనా విధానాన్ని అంగీకరించి వచ్చినవారికి మాత్రమే సాహిత్య తరగతులు, వర్క్‌షాపులు నిర్వహిస్తారు. అంటే అంతా ఏకపక్షమే" – "వీటికి భిన్నంగా సాహితీ స్రవంతి నిర్వహించిన జనకవనం సదస్సు ప్రజాస్వామిక వాతావరణంలో విభిన్న దృక్పథాల వారికి వేదికగా నిలిచింది" అని కూడా రాసారు వ్యాసకర్త. అయితే కార్యాచరణలో 'జనకవనం'లో దళిత సాహిత్యానికిగానీ, దళిత సాహిత్య ప్రతినిధులకుగానీ చోటు లభించలేదు. బహుశా దళితులు లేకపోవడమే ప్రజాస్వామిక వాతావరణంగా సాహితీ స్రవంతి వారు భావించి వుంటారు. దళితులపట్ల ఇతర సాహితీ సంస్థలు వ్యవహరించినట్లుగానే సాహితీ స్రవంతి కూడా వ్యవహరించిందని జనకవనం రుజువు చేసింది. తాము గీసిన రేఖకు ఆవల వుండి మాట్లాడే దళితులకు జనకవనంలో ప్రాతినిధ్యం లభించలేదు. జనకవనంలో పాల్గొన్న ప్రముఖులు చాలా మంది ప్రత్యక్షంగానో, పరోక్షంగానో మార్క్సిస్టు భావజాలాన్ని ఆమోదించిన వారూ, సమర్థించిన వారూ కాకపోతే సానుభూతిపరులు. ఇతర ప్రాంతాల నుండి కూడా వక్తలను ఆహ్వానించిన సాహితీ స్రవంతికి కనీసం హైదరాబాద్ నగరంలో వున్న దళిత సాహిత్యకారులు ఒక్కరు కూడా కనిపించకపోవడం ఆశ్చర్యకరమైన విషయం.

సాహితీ స్రవంతి ఇటీవలనే జాషువాని స్మరిస్తూ సభ నిర్వహించింది. కానీ జనకవనం సభలకు మాత్రం దళితుల్ని ఎవర్నీ పిలవలేదు. అంటే జాషువాని మాత్రం గుర్తిస్తాం గానీ, ఇప్పటి దళిత సాహిత్యాన్ని గుర్తించబోమని చెప్పడమే దీని సారాంశమా? తెలుగు సాహిత్యానికి దళితవాదం అందిస్తున్న కంట్రిబ్యూషన్‌ని చూడ నిరాకరించడమే సాహితీ



Untitled-2 28 6/11/2002, 3:51 PM

స్రవంతి ఉద్దేశం కావచ్చు. అందుకే భిన్న ప్రక్రియల్లో సాహిత్య సమ్మేళనం నిర్వహించిన సాహితీ స్రవంతి వారు ఏ ఒక్క దళిత రచయితనీ, కవినీ ఆహ్వానించలేదు. దళిత సాహిత్య ప్రస్తావన లేకుండా, దళిత సాహిత్యకారులకు చోటు లేకుండా ఇది ప్రజాస్వామిక వేదిక ఎలా అవుతుందన్నది ప్రశ్న.

దళితులు లేకుండా, దళిత సాహిత్యాంశాలు లేకుండా, దళిత సాహిత్య ప్రతినిధులు లేకుండా జరిగిన జనకవనం అవగాహనా విస్తృతికి ఏ రకంగా, ఏ మేరకు దోహదం చేస్తుందో నిర్వాహకులు ఒకసారి ఆత్మపరిశీలన చేసుకోవాలి!

**– దళిత సాహితీ మిత్రులు,**
**అక్టోబరు 26, 2003**

# 'స్రవంతి' ఒక విశాల వేదిక

సెప్టెంబరు 20, 21 తేదీలో హైదరాబాద్‌లో సాహితీ స్రవంతి ఆధ్వర్యంలో జరిగిన జనసాహిత్య సమ్మేళనం (జనకవనంతో సహా) గురించి వార్త ఆదివారం అనుబంధంలో అక్టోబరు 12, 26 తేదీలలో రెండు స్పందనలు వెలువడ్డాయి. జి.ఎస్. 12న రాసిన దానిలో సాహితీ స్రవంతి ప్రజాస్వామిక చర్చకు అవకాశం కలిగించడాన్ని అభినందించారు. సాధారణంగా సాహిత్య వర్గాలన్నిటిలో వెలువడిన స్పందనకు ఇది ప్రతిబింబంగా వుంది. ఆ సభకు హాజరు, పత్రికలలో వచ్చిన విశ్లేషణలు అన్ని కూడా అదే విధమైన రీతిలో వున్నాయి. నేటి సంక్లిష్ట సామాజిక పరిస్థితులలో ప్రపంచీకరణను, మతోన్మాదాన్ని, టెర్రరిజాన్ని వ్యతిరేకించే సాహిత్యకారుల మధ్య సాధ్యమైనంత విశాల స్థాయిలో చర్చకు, సృజనకు అవకాశం కలిగించేందుకే సాహితీ స్రవంతి కృషి చేస్తోంది. దాని కార్యక్రమాలు, అది నిర్వహించే పత్రిక కూడా ఆ దిశలోనే నడుస్తున్నాయి. ఎందరో పెద్దలు, సాహితీ మిత్రులూ దాన్ని ప్రోత్సహిస్తున్నారు. ఈ క్రమంలో జరిగిన ఒక పెద్ద కార్యక్రమం జనసాహిత్య సమ్మేళనం. దీనిలో అన్ని ధోరణులకు చెందిన వారూ అన్ని వయోబృందాలకు చెందిన వారు సీనియర్లు, ఔత్సాహికులు పాల్గొన్నారు. ఇదో మంచి ప్రయత్నమని వెన్నుతట్టారు. 'వార్త'లో జి.ఎస్.గారి వ్యాఖ్య కూడా ఆ సద్భావననే వ్యక్తపరచడం యాదృచ్ఛికం కాదు.

ఇక అక్టోబరు 26వ తేదీన దళిత సాహితీ మిత్రుల పేరుతో వచ్చిన వ్యాఖ్యలో జనకవనంలో దళిత సాహిత్యానికి ప్రాతినిధ్యంలేదని పేర్కొనడంపై కొంత వివరణ అవసరమవుతున్నది. ఆ లేఖ రాసిన మిత్రుల భావాలను గౌరవిస్తూనే వాస్తవాన్ని తెలియజేయవలసిన బాధ్యత దృష్ట్యా ఇది రాయాల్సి వస్తోంది. ఎవరెవరి చిరునామాలు, సామాజిక నేపథ్యాలు వివరంగా ఏకరువు పెట్టనవసరంలేదుగాని జనసాహిత్య సమ్మేళనంలో అన్ని స్రవంతులకూ, భావాలకూ చెందిన వారు పాల్గొన్నారనేది నిర్వివాదాంశం. ఆ సందర్భంలోనూ ఇతరత్రానూ ప్రస్థానంలోనూ దళిత వర్గాల సమస్యలు, సాహిత్యం పుష్కలంగా ప్రాతినిధ్యం పొందాయి. పై వ్యాఖ్యలో పొందుపరచినట్టుగా జాషువా వర్ధంతి సభలో పాల్గొన్న శిఖామణి వంటి మిత్రులు ఈ సంగతి మాకంటే బాగా చెప్పగలరు.

ఆ రోజున ఆయన ఇందుకు ప్రత్యేకంగా అభినందించారు కూడా. ఆయన రాసివ్వగానే నాటి ప్రసంగ పాఠాన్ని ఈ సంస్థ పత్రిక ప్రచురిస్తుంది. అప్పుడు ఇలాంటి సందేహాలకు మరింత సమగ్రమైన సమాధానాలు లభిస్తాయి. ఏమైనా ఒక స్థూలమైన, సున్నితమైన అవగాహనతో సాగాల్సిన సందర్భాలు ఇవి. జాషువాను గౌరవించడమంటే నేటితరం దళిత సాహిత్యకారులను పట్టించుకోకపోవడమని భావించడం, హైదరాబాద్‌లో దళిత సాహిత్యకారులు, బయటవారు అని తేడాలు చూడడం అవసరంలేదని మా భావన.

అన్ని రకాల భావాలు ప్రతిధ్వనింపచేయడం తప్ప దేనికీ ఎవరినీ అధికార ప్రతినిధులుగా ఆహ్వానించలేదు. హైదరాబాద్‌లో వారిని పిలిచినా ఫలానా యూనివర్శిటీ వారిని పిలవలేదని ఫలానా విభాగం వారిని పిలవలేదని అనే అవకాశం వుంటుందని చెప్పనవసరం లేదు. ఎలాంటి అవాంఛనీయ వివాదాలూ లేకుండా ప్రగతిశీల సాహిత్యకారులు కలనికట్టుగా ముందుకుపోవాలనేది సాహితీ స్రవంతి లక్ష్యం, జనసాహిత్య సమ్మేళనం ఉద్దేశం. సాహితీ మిత్రులు ఈ సహేతుక వైఖరిని ఇకముందు కూడా ఆదరిస్తారని విశ్వసిస్తున్నాం.

**–తెలకపల్లి రవి**
**కన్వీనర్, సాహితీ స్రవంతి (నవంబర్ 9 2003)**

# ఏది?

**పురిమళ్ళ సునంద**



ఏది బాల్యం?
అమ్మను అడిగాను
        మసిబారిన గిన్నెల్లో ఉందేమో
వెతుక్కోమంది
మంచినీళ్ళబాయి కాడుందేమో
        కనుక్కోమంది
తమ్ముని అల్లరిలో చూడమని
        పురమాయించింది
అయ్యను అడిగాను
        వరిచేల పరిగెలో ఏరుకోమన్నాడు
పత్తిచేల పూలల్లో చూసుకోమన్నాడు
        మిరప తోట కాయల్లో దాగుందన్నాడు
అవ్వను తాతను అడిగాను
        బర్లకాడ, గొర్లకాడ
        పెదకాపు దొడ్డికాడ
తప్పక దొరుకుతుందని
        గట్టిగా చెప్పారు
దొరకని నా బాల్యం కోపం
        దారి పొడవున వెతుకులాట
కాలం వెక్కిరించింది
        కనుమరుగై పోయింది



Untitled-2 29 6/11/2002, 3:51 PM

## నివాళి

# ఎడ్వర్డ్ సయిద్ ఓరియంటలిజం



**గుడిపూడి విజయరావు**

*"పాలస్తీనా ప్రజల హక్కుల కోసం నిలబడ్డ ప్రముఖ వ్యక్తిగా ఎడ్వర్డ్ సయిద్ పేరుగాంచారు. అత్యంత క్లిష్ట పరిస్థితుల్లో సైతం ఆయన ఈ పోరాటంలో వెనక్కి తగ్గలేదు. కాని ఆయన జీవితంలో ఇది ఒక పార్శ్వం మాత్రమే. ఆయన వ్యక్తిత్వం దీన్నిమించినది. ఆయన 'గొంతులేని వారికి గొంతునిచ్చారు.' ఎంతో ప్రతిభావంతంగాను, రాజీ లేకుండాను న్యాయం కోసం, స్వేచ్ఛ కోసం అంకితమయ్యారు. ఆధునిక ప్రపంచాన్ని మనం వ్యాఖ్యానించే తీరును ఆయన అద్భుత పాండిత్యం అక్షరాలా మార్చివేసింది. ప్రపంచంపై ఆయన లాంటి ముద్ర వేయకలిగిన వారు కొద్ది మంది మాత్రమే ఉంటారు. అసమాన సాహసం, స్థిరమైన వ్యక్తిత్వం కల్గిన సయిద్ స్థానం భర్తీ చేయడం నిజంగా అసాధ్యం."*

**–నోమ్ చోమ్‌స్కీ**

ఎడ్వర్డ్ విలియమ్స్ సయిద్ పేరు దేశ దేశాల ప్రగతిశీల మేధావులకు చిరపరిచితం. పన్నెండేళ్ళపాటు క్యాన్సర్ వ్యాధితో పోరాడి గత సెప్టెంబరు 25వ తేదీన సయిద్ కన్నుమూశారు. న్యూయార్క్‌లోని కొలంబియా విశ్వవిద్యాలయంలో ఇంగ్లీషు, కంపేరిటివ్ లిటరేచర్ ప్రొఫెసర్‌గా పని చేసిన సయిద్ కేవలం మేధావిగానే మిగిలిపోలేదు. అమెరికా గడ్డపై ఉంటూనే సామ్రాజ్యవాద ఆధిపత్యాన్ని ఆయన ప్రశ్నించారు. దాని కోసం ఆయన పాశ్చాత్య గ్రంథాలనే సాధనంగా చేసుకున్నారు. ఆంగ్లభాషపై తనకున్న పట్టుతో పాశ్చాత్య సాహిత్యాన్ని ఔపోసన పట్టారు. దాని ఆధారంగానే ఆయన ప్రాచ్య ప్రపంచంపట్ల పాశ్చాత్య ప్రపంచం ఎటువంటి వైఖరిని ప్రదర్శించిందీ, ఆ వైఖరి ప్రాచ్య ప్రపంచంపై ఆధిపత్యం సంపాదించడంలో ఎలా భాగమయ్యిందీ సాధికారికంగా విశ్లేషించారు. ఈ విశ్లేషణ ద్వారా లభించిన అవగాహనను విశ్వవిద్యాలయ ప్రాంగణాలకే ఆయన పరిమితం చేయలేదు. స్వంతగడ్డపైనే పరాయివారిగా బతుకుతున్న తన జాతీయులు పాలస్తీనీయుల కోసం తన కలాన్ని, గళాన్ని వినియోగించారు. దేశ దేశాల్లో పర్యటించి ప్రచారం చేశారు. పాలస్తీనా విమోచన సంస్థలో స్వయంగా పాల్గొన్నారు. ఆయన మరణించిన మరు నిముషంలోనే ఆ వార్త ఇంటర్‌నెట్‌లోకి ఎక్కిందంటే ఆయన పేరు ప్రతిష్టలు అర్థం చేసుకోవచ్చు. మరికొద్ది సేపటికే వివిధ సైట్లలో చోటు చేసుకున్న ఆ వార్త ప్రపంచమంతా వ్యాపించింది. ఆ తర్వాత ఆయనకు శ్రద్ధాంజలి ఘటిస్తూ ఒకటి రెండు రోజుల్లోనే పలు దేశాల్లో వందకుపైగా పత్రికలు వ్యాసాలు ప్రచురించాయి.

సయిద్ అరవై ఏడేళ్ళ క్రితం జెరుసలేంలో ఒక సంపన్న పాలస్తీనా కుటుంబంలో జన్మించారు. ఆయన తండ్రి పేరు వాడీ. క్రైస్తవ మతస్తుడు. మొదటి ప్రపంచ యుద్ధానికి ముందుగానే ఆయన అమెరికాకు వలస వెళ్ళాడు. స్వచ్ఛందంగా సైన్యంలో చేరి ఫ్రాన్స్‌లో యుద్ధంలో పాల్గొన్నాడు. ఆ తర్వాత అమెరికా పౌరసత్వంతో గౌరవప్రదమైన వాణిజ్యవేత్తగా ప్రాచ్యానికి తిరిగి వచ్చాడు. సయిద్ తండ్రి వాడీ తాను అమెరికా దేశస్థుడనని చెప్పుకోవడానికి తన పేరుతో విలియమ్స్ అనే పదాన్ని తప్పనిసరిగా జోడించేవాడు. వాడీ తన పిల్లల్ని ఎలాంటి లోటూ లేకుండా పెంచి పెద్ద చేశాడు. విందులు, వినోదాలు, విహారాలతో ఎంతో విలాస వంతమైన బాల్యాన్ని సయిద్ గడిపారు. పిల్లలకు ఇలాంటి జీవితాన్ని అందించిన వాడీ పిల్లలు తనపట్ల ఎంతో భయభక్తులతో మసలుకునేలా కూడా వ్యవహరించేవాడు. జెరుసలేంలోని సెయింట్ జార్జ్ స్కూలులో ఎడ్వర్డ్ సయిద్ చదువుకున్నాడు. ఆ తర్వాత కైరోలోని విక్టోరియా కాలేజీలో చేరాడు. అనంతరం సయిద్ విద్య అమెరికాలో కొనసాగింది. మసాచుసెట్స్‌లో మౌంట్ హెర్మన్ అనే ప్రైవేట్ స్కూలులో ప్రవేశించాడు. ప్రతిభావంతుడైన విద్యార్థిగా పేరు తెచ్చుకున్నాడు. ఉన్నత విద్యను ముగించి అధ్యాపక వృత్తిలో ప్రవేశించాడు.

సయిద్ మొదటి రచన 'జోసెఫ్ కాన్‌రాడ్ అండ్ ది ఫిక్షన్ ఆఫ్ ఆటో బయోగ్రఫీ' 1966లో వెలువడింది. అది ఆయన పి.హెచ్.డి. సిద్ధాంత పత్రం కూడ. రచయిత కావడమంటే ఒక కెరీర్ కాదు. అది ఒక ప్రాజెక్టు అనే భావనను సయిద్ ఈ గ్రంథంలో వివరిస్తారు. నీ అంతట నీవు వరుసగా రచనలు చేసుకుంటూ పోతుంటే నీవెవరివో అవే తెలియజేస్తాయి అని సయిద్ దీనిలో చెబుతారు. సయిద్ రెండవ రచన 'బిగినింగ్స్' 1975లో వెలువడింది. ఆధునిక ప్రామాణిక రచనలను ఈ గ్రంథం విశ్లేషిస్తుంది. ఆవిర్భావానికి, ఆరంభానికి మధ్య ఉన్న మెథడలాజికల్ సంబంధాన్ని, సైద్ధాంతిక సంబంధాన్ని దీనిలో ఆయన వివరిస్తారు. ఈ రెండు గ్రంథాలు సయిద్‌కు మంచి పేరు ప్రతిష్టలు తెచ్చిపెట్టాయి. ఒక అధ్యాపకునిగా తన కెరీర్‌ను స్థిరపరుచుకోవడానికి ఈ రచనలు సరిపోతాయి. కడుపులో చల్లకదలకుండా



Untitled-2 30 6/11/2002, 3:51 PM

జీవితాన్ని కొనసాగించవచ్చు. కాని సయిద్ ఇంతటితో ఆగలేదు. తన మేధాశక్తిని ఒక ప్రయోజనం కోసం వినియోగించడానికి పూనుకున్నాడు.

అత్యంత ప్రభావం చూపిన ఆయన మూడవ రచన 'ఓరియంటలిజమ్' ఈ క్రమంలోనే 1978లో వెలువడింది. పాశ్చాత్య మేధో ప్రపంచంలో ఆ గ్రంథం ఒక సంచలనం సృష్టించింది. ప్రాచీన కాలం నుండి ప్రధానంగా 18వ శతాబ్దం నుండి, నేటి వరకు పాశ్చాత్య ప్రపంచం, ప్రాచ్య ప్రపంచాన్ని ఏ దృష్టితో చూసిందన్నదే ఈ గ్రంథంలోని ప్రధానాంశం. ఈ పుస్తకం రాస్తున్నప్పుడే ప్రచురణ కర్త కోసం సయిద్ అన్వేషణ ఆరంభించారు. పుస్తకం సారాంశాన్ని విన్న పబ్లిషర్లు అనేక మంది దాన్ని ప్రచురించడానికి సిద్ధపడలేదు. చివరకు ఓ ప్రచురణ కర్త అర్ధమనస్కంగానే ఈ సాహసానికి పూనుకున్నాడు. కాని ఈ పుస్తకానికి వచ్చిన ప్రతిస్పందన ప్రతి ఒక్కరినీ ఆశ్చర్యచకితులను చేసింది. ఆ మరుసటి సంవత్సరమే ఇంగ్లండులో ప్రత్యేక ప్రతి వెలువడటమే కాకుండా ఆ తర్వాత వరుసగా అనేక భాషల్లోకి అనువదించబడింది. 1980లో ఫ్రెంచి అనువాదం వెలువడింది. ఆ తర్వాత జపనీస్, జర్మన్, పోర్చుగీస్, ఇటాలియన్, పోలిష్, స్పానిష్, కటలన్, టర్కిష్, సెర్బోక్రోట్, స్వీడిష్, గ్రీక్, రష్యన్, నార్వీజియన్, చైనీస్ మొదలైన భాషల్లో అనువాదాలు ప్రచురిత మయ్యాయి. 1993లో 'ఓరియంటలిజమ్' స్వీడన్‌లో బెస్ట్ సెల్లర్‌గా ఎంపికయింది. ఒక అనువాద గ్రంథం బెస్ట్ సెల్లర్‌గా ఎంపిక కావడం ఆ పబ్లిషర్‌ను ఆశ్చర్యంలో ముంచెత్తింది.




**అత్యంత ప్రభావం చూపిన ఆయన మూడవ రచన 'ఓరియంటలిజమ్' 1978లో వెలువడింది. పాశ్చాత్య మేధో ప్రపంచంలో ఆ గ్రంథం ఒక సంచలనం సృష్టించింది. ప్రాచీన కాలం నుండి ప్రధానంగా 18వ శతాబ్దం నుండి, నేటి వరకు పాశ్చాత్య ప్రపంచం, ప్రాచ్య ప్రపంచాన్ని ఏ దృష్టితో చూసిందన్నదే ఈ గ్రంథంలోని ప్రధానాంశం.**

ఐరోపా అనుభవం పరిధిలో ప్రాచ్య ప్రపంచం ఈ పుస్తక సారాంశం. ఈ అనుభవం ప్రాచ్య ప్రపంచంపట్ల ఒక అవగాహనను కల్పిస్తుంది. అగ్రస్థానం/హీనస్థానం, ఆధిపత్యం/లొంగుబాటు, అధికారం/అధికారలేమి, పాశ్చాత్యం/ప్రాచ్యం, సహేతుకత/అహేతుకత, వికాసం/మూఢత్వం లాంటి భావనలపై ఈ అవగాహన ఆధారపడింది. ప్రాచ్య ప్రపంచాన్ని తక్కువ చేసి, వారు శక్తిసామర్థ్యాలు లేని వారని, విజ్ఞాన రహితులని చిత్రిస్తూ తమను తాము గొప్పవారిగా చెప్పుకునేందుకు ప్రాచ్యమేధావులు ఎలా ప్రయత్నించిందీ ఈ గ్రంథం వివరిస్తుంది. ప్రాచ్య ప్రపంచాన్ని ఉద్ధరించే 'మహత్తర కర్తవ్యాన్ని' తమ మీదేసుకున్నామని చెప్పుకోవడానికి పాశ్చాత్య రచయితలు ఎలా తంటాలు పడిందీ వారి రచనల ఆధారంగానే ఈ గ్రంథంలో ఎంతో ప్రతిభావంతంగా ఆయన నిరూపించారు. పాశ్చాత్య మూల గ్రంథాలపై సయిద్‌కున్న పట్టు ఈ గ్రంథంలో వెల్లడయింది. ఇది పాశ్చాత్య రచయితలను సైతం ముక్కు మీద వేలేసుకునేలా చేసింది.

పాశ్చాత్య ప్రపంచంలో ఫ్రెంచి తత్వవేత్త ఫోకా ప్రతిపాదించిన పోస్ట్ స్ట్రక్చరలిజం ఒక సంప్రదాయంగా రూపుదిద్దుకుంటున్న సమయంలో, పాశ్చాత్య మేధావుల్లో మార్క్సిజంపట్ల ఆకర్షణ తగ్గుతున్న సమయంలో, మితవాద శక్తులు పైచేయి సాధిస్తున్న దశలో సయిద్ తన 'ఓరియంటలిజం' రచనకు పూనుకున్నాడు. ఓరియంటలిజంను అర్థం చేసుకోవడానికి ఈ నేపథ్యం కూడా అవసరమవుతుంది.

సంస్కృతి గురించి గ్రామ్‌సీ వైఖరిని అంగీకరిస్తూ సయిద్ తన అధ్యయనాన్ని కొనసాగిస్తాడు. పౌర సమాజంలో సంస్కృతి ఒక భాగం. సంస్కృతి ఆ సమాజంలోని అభిప్రాయాలను, వ్యవస్థలను, వ్యక్తులను ఆధిపత్యం ద్వారా కాకుండా అంగీకారం ద్వారా ప్రభావితం చేస్తుంది. ఏ సమాజంలోనైనా కొన్ని రకాల సంస్కృతీ రూపాలది పైచేయిగా ఉంటుంది. దీన్నే గ్రామ్‌సీ 'సాంస్కృతిక ఆధిపత్యం' అనిపిలుస్తారు. 'ఈ సాంస్కృతిక ఆధిపత్యమే ఓరియంటలిజమ్‌కు బలాన్ని, మన్నికను అందిస్తుంది. ఓరియంటలిజమ్ అనేది ఐరోపావాసులమైన 'మనం', ఐరోపాయేతరులైన 'వారు' అన్న సమష్టి అవగాహనే. ఐరోపా వాసులు అయి ఉండటం అనేది ఐరోపాయేతర ప్రజలకన్నా సంస్కృతి కన్నా ఉన్నతమైనది అన్నభావన.' అని సయిద్ చెబుతారు. ఓరియంటలిజం అనేది సాంస్కృతిక పరమైన, రాజకీయపరమైన విషయం అని ఆయన పేర్కొంటారు.

"విమర్శనాయుత వివరణకు ఆరంభం తానెవరినన్న చైతన్యమే. నీ నెవరో తెలుసుకోవడం ఇప్పటి వరకు కొనసాగిన చారిత్రక క్రమ ఫలితమే. ఈ చారిత్రక క్రమపు ఆనవాళ్ళు నీలో అసంఖ్యాకంగా నిక్షిప్తమై ఉంటాయి. అవి నిర్దిష్ట రూపాలతో కనిపించవు."

అటువంటి నిర్దిష్ట రూపాలను సమీకరించడం అనివార్యం అని గ్రామ్‌సీని సయిద్ ఉటంకిస్తారు. అలాంటి నిర్దిష్ట రూపాలను సమీకరించడమే తాను మొదటగా చేయతలపెట్టిన పని అని సయిద్ చెబుతారు. ఆ కర్తవ్యాన్ని తానెంత వరకు నెరవేర్చిందీ తీర్పు చెప్పాల్సింది పాఠకులే అని పేర్కొంటారు.

గ్రామ్‌సీ భావనలతో ఆరంభమయిన ఈ రచనలో ఫోకా పదజాలాలు, ప్రయోగాలు అత్యధికం కనిపిస్తాయి. అయినప్పటికీ ఫోకా భావాలను సయిద్ పూర్తిగా అంగీకరించరు. అదే సమయంలో గ్రామ్‌సీని ఇంతగా ఉటంకించినప్పటికీ మార్క్సిజాన్నీ ఆయన అంగీకరించరు. పైపెచ్చు మార్క్స్‌ను పాశ్చాత్య ప్రాచ్యవాదుల సరసన చేరుస్తారు.

ఓరియంటలిజం అనేది ప్రాచ్య ప్రపంచం గురించి పాశ్చాత్యులు సముపార్జించిన జ్ఞానం. ఎక్కడయినా శుద్ధమయిన జ్ఞానం ఉండదని, ఆ జ్ఞానాన్ని సముపార్జించడంపై చుట్టూ ఉన్న పరిస్థితులు ప్రభావం చూపుతాయని సయిద్ చెబుతారు. పాశ్చాత్య ప్రపంచం ప్రాచ్య ప్రపంచంపై ఆధిపత్యం సంపాదించడానికి ఓరియంటలిస్టుల జ్ఞానం ప్రత్యక్షంగానో, పరోక్షంగానో ఉపయోగపడిందని సయిద్ విపులంగా వివరిస్తారు.

'ఓరియంటలిజం' గ్రంథం ఒక మేధావిగా సయిద్‌కు తిరుగులేని గుర్తింపు నిచ్చిందన్నది వాస్తవమే అయినప్పటికీ రాజకీయపరంగా చూసుకుంటే దానికి లభించిన ప్రతిస్పందన ఆయనను ఒకింత అసంతృప్తికి గురి చేసిందనిపిస్తుంది. 'ఓరియంటలిజం' వెలువడిన తర్వాత ప్రాచ్య ప్రపంచం గురించి తమకు వివరించాల్సిందిగా అమెరికా గూఢచారి సంస్థ సి.ఐ.ఎ. నుండి సయిద్‌కు ఆహ్వానం అందింది. ఇదే సమయంలో ఓరియంటలిజం గ్రంథంలో ఇస్లాంకు వ్యతిరేకమైన వ్యాఖ్యలున్నాయని కొన్ని అరబ్ దేశాలు ఆ గ్రంథాన్ని నిషేధించాయి. కారల్ మార్క్స్ అప్పటికి తనకు అందుబాటులో ఉన్న సమాచారం, రచనల ఆధారంగా ప్రాచ్య ప్రపంచం స్తంభించిపోయిందని, ఐరోపా వాసుల రాక ఫలితంగా అక్కడ కదలిక ఏర్పడిందని చేసిన వ్యాఖ్యను ప్రధానంగా తీసుకొని సయిద్ ఆయనను కూడా ఓరియంటలిస్టుల సరసన చేర్చడం



Untitled-2 31 6/11/2002, 3:51 PM

............ O ............

**సయిద్ తృతీయ ప్రపంచ దేశాల దృష్టితో, లేదంటే తాను తృతీయ ప్రపంచ దేశాల దృష్టి అని భావించిన దానితో సామ్రాజ్యవాదాన్ని వ్యతిరేకించాడు. తనకు ప్రావీణ్యం ఉన్న సంస్కృతి, నాగరికతల అధ్యయనాన్ని ఆయన దీనికి సాధనంగా ఉపయోగించారు. ఈ అధ్యయనం, దాని ద్వారా రూపొందించుకున్న వైఖరి ఆయనను ఒక రకమైన మానవతా వాదం వైపుకు తీసుకువెళ్ళింది.**

............ O ............

మార్క్సిస్టులకు ఆగ్రహం తెప్పించింది. వలస పాలనను, దాని దుష్ఫలితాలను మార్క్స తీవ్రంగా వ్యతిరేకించిన విషయాన్నిగాని, వలసపాలనకు వ్యతిరేకంగా ప్రాచ్య దేశాలలో జరుగుతున్న పోరాటాలకు ఆయన పూర్తి సంఘీభావం తెలపడాన్ని కాని, వలస దేశాల ప్రజలు తమను తాము విముక్తి చేసుకోవడం ఒక్కటే వారి నిజమైన ప్రగతికి మార్గం అని ఆయన చెప్పిన విషయాన్నిగాని సయిద్ పరిగణనలోకి తీసుకోలేదని మార్క్సిస్టులు విమర్శించారు. సయిద్ పాశ్చాత్య సమాజాలలోగాని, ప్రాచ్య సమాజాలలోగాని వర్గాలను పరిగణనలోకి తీసుకోలేదు. కేవలం ప్రాచ్య, పాశ్చాత్య అనే విభజనను మాత్రమే ఆయన గుర్తించారు. శ్వేతజాతీయులు, రంగు జాతీయులు, నల్లజాతీయులు లాంటి తేడాలను మాత్రమే ఆయన గమనించారు. ఈ రకమైన అవగాహన సహజంగానే ఆయనను పోస్ట్‌కలోనియల్, పోస్ట్ మోడర్న్, సబాల్టర్న్ లాంటి ధోరణులను ప్రశంసించి, ప్రోత్సహించేలా చేసింది.

ఏదేమైనప్పటికీ సయిద్ తృతీయ ప్రపంచ దేశాల దృష్టితో, లేదంటే తాను తృతీయ ప్రపంచ దేశాల దృష్టి అని భావించిన దానితో సామ్రాజ్యవాదాన్ని వ్యతిరేకించాడు. తనకు ప్రావీణ్యం ఉన్న సంస్కృతి, నాగరికతల అధ్యయనాన్ని ఆయన దీనికి సాధనంగా ఉపయోగించారు. ఈ అధ్యయనం, దాని ద్వారా రూపొందించుకున్న వైఖరి ఆయనను ఒక రకమైన మానవతా వాదం వైపుకు తీసుకువెళ్ళింది. చనిపోవడానికి కొద్ది వారాల ముందు ఈజిప్టుకు చెందిన ఆల్ అహ్రమ్ పత్రికకు రాసిన వ్యాసంలో ఆయన ఇలా పేర్కొన్నారు. "పోరాటానికి దారి చూపే విధంగా మానవతావాద విమర్శ చేయాలన్నది 'ఓరియంటలిజం'లో నా ఉద్దేశం.... మానవతా వాదం ఇతర వ్యాఖ్యాతలు, ఇతర సమాజాలు, ఇతర కాలాలతో కూడిన ఒక సమష్టి భావనగా అభివృద్ధి చెందింది. ఇతర అంశాలతో సంబంధం లేకుండా ఏకాకిగా ఏ మానవతా వాదమూ ఉండదు.

"ప్రతి రంగము ఇతర ప్రతి రంగంతోను సంబంధం కలిగి వుంటుంది. బాహ్య ప్రభావానికి లోనుకాని శుద్ధమైన, ఏకాకిగా ఉండే రంగం ఏదీ లేదు. అన్యాయం గురించి, బాధల గురించి ఒక సందర్భంలో మాట్లాడుతాము. ఆ సందర్భానికి చారిత్రకంగాను సాంస్కృతికంగాను, సామాజికంగాను, ఆర్థికంగాను ఒక స్థానం ఉంటుంది. చర్చ విస్తృతిని పెంచడంలో మనం పాలుపంచుకోవాలి. గత 35 ఏళ్ళ నా జీవితంలో పాలస్తీనా ప్రజలను జాతీయ స్వయం నిర్ణయాధికారం లభించాలని నేను కోరుతూ వచ్చాను. అయితే యూదుజాతి ప్రజలు దారుణమైన అణచివేతకు, మారణకాండకు గురైనారన్న సంగతి మాత్రం నేను ఎన్నడూ మర్చిపోలేదు. పాలస్తీనా/ఇజ్రాయిల్‌లో సమానత్వం కోసం పోరాటం ఈ విధమైన మానవత్వం దిశగా జరగాలన్నది ప్రధానాంశం. అణచివేతను, హక్కుల నిరాకరణను మరింత అధికం చేయడం కాదు, సహజీవనం వైపుగా అది సాగాలి. నేను చెప్పినట్లుగా ఓరియంటలిజంకు ఆధునిక యూదు వ్యతిరేకతకు మూలాలు ఒకే విధమైనవన్నది యాదృచ్ఛికం కాదు. అందువల్ల మధ్య ప్రాచ్యంలోగాని, ఇతర ప్రాంతాలలోగాని దీర్ఘకాలంగా కొనసాగుతున్న పరస్పర వైషమ్యాల పరిష్కారానికి ప్రత్యామ్నాయ నమూనాలను స్వతంత్ర మేధావులు కనుగొనడం ప్రధాన ఆవశ్యకతగా కనిపిస్తున్నది."

సయిద్ సామ్రాజ్యవాదాన్ని తీవ్రంగా వ్యతిరేకించాడు. అయితే సామ్రాజవాదపు ఆర్థిక పునాది గురించి ఆయనకు సంపూర్ణమైన అవగాహన లేదు. ఈ ప్రభావం ఆయన ఆలోచనా ధోరణిలో కూడా ప్రతిబింబిస్తుంది. ఆయన స్వేచ్ఛను, ప్రజలందరికీ స్వేచ్ఛను బలంగా కోరుకున్నప్పటికీ ఆ స్వేచ్ఛ ఎలా లభిస్తుందో మాత్రం స్పష్టంగా చెప్పలేకపోయారు. 'ఓరియంటలిజం' గ్రంథంలోని కొన్ని లోపాలను ఆయన తర్వాత కొంత సరిదిద్దుకున్నారు. అయినప్పటికీ 'ఓరియంటలిజం'లోని సైద్ధాంతిక నైశిత్యం అదే రీతిలో కొనసాగింది. 'ది వరల్డ్, ది టెక్స్ట్ అండ్ ది క్రిటిక్' గ్రంథం 1984లోను, 'ఇంపీరియలిజం అండ్ కల్చర్' అనే గ్రంథం 1993లోను వెలువడ్డాయి. ఇవిగాకుండా ఆయన వివిధ సందర్భాలలో రాసిన వ్యాసాలు సంకలనాల రూపంలో వెలువడ్డాయి. 'ది కొశ్చన్ ఆఫ్ పాలస్తైన్' 1980లోను, 'ఆఫ్టర్‌ది లాస్ట్‌స్కై' 1986లోను 'పీస్ అండ్ ఇట్స్ డిస్‌కాంటెంట్స్' 1995లోను ఈ విధంగా వెలువడినవే. 'ది ఎండ్ ఆఫ్ పీస్ ప్రాసెస్' అనే పేరులో 50 వ్యాసాల సంకలనం 2000లో వెలువడింది. ఓస్లో ఒప్పందంపై యాసర్ అరాఫత్ సంతకం చేయడం పాలస్తీనా ప్రజల ప్రయోజనాలకు తిలోదకాలిచ్చి లొంగిపోవడమేనని తీవ్రంగా ఆగ్రహించిన సయిద్ పి.ఎల్.ఓ. జాతీయ కౌన్సిల్ నుండి వైదొలగారు. 1999లో 'ఔట్ ఆఫ్ ప్లేస్' అనే పేరుతో వెలువడిన గ్రంథంలో ఆయన తన జీవితం గురించి చెప్పుకున్నారు.

చివరిగానే అయినప్పటికీ సయిద్ గురించి మరొక ముఖ్యమైన విషయాన్ని చెప్పుకోవాలి. ఆయనకు సాహిత్యంపట్ల సంగీతంపట్ల విపరీతమైన మక్కువ. పాశ్చాత్య శాస్త్రీయ సంగీతంపై ఆయనకు లోతైన అవగాహన ఉంది. ఆయన మంచి పియానో విద్వాంసుడు. చివరి రోజుల్లో ఆయన ఇజ్రాయిల్ జాతీయుడైన తన మిత్రునితో కలసి సంగీత కచేరీలు నిర్వహించారు. సంస్కృతి, సాహిత్యాలపై ఆయన రాసిన వ్యాసాలతో 2000లో 'రిఫ్లెక్షన్స్ ఆన్ ఎగ్జయిల్' అనే గ్రంథం వెలువడింది. కేవలం మేధావుల కోసమే కాకుండా, విశాలమైన ప్రజానీకం కోసం, వారికి అవసరమైన విషయాలను, వారికి అర్థమయ్యేరీతిలో రాయాలని దానికి ప్రత్యేకంగా సమయం కేటాయించాలని సయిద్ తోటి అధ్యాపకులకు చెబుతుండేవారు. ఆయన స్వయంగా దాన్ని ఆచరించబట్టే ఉద్గ్రంథాలతోపాటు అనేక అంశాలపై అసంఖ్యాకంగా వ్యాసాలు కూడా రాయకలిగారు.

సయిద్ అవగాహనలో ఎన్ని పరిమితులు, పొరపాట్లు ఉన్నప్పటికీ ప్రజలందరికీ స్వేచ్ఛ కావాలన్న ఆయన చిత్తశుద్ధిని ఏ మాత్రం సందేహించజాలం. అందువల్లనే ఆయన సామ్రాజ్యవాదాన్ని అంత తీవ్రంగా వ్యతిరేకించ కలిగారు. నేడు అమెరికా ఇరాక్ లాంటి దేశాలపై నేరుగా దాడి చేసి ఆక్రమించుకొని ప్రజల స్వేచ్ఛా స్వాతంత్ర్యాలను బాహాటంగా హరిస్తున్నది. తనకిష్టంలేని ఏ దేశంపైనైనా ధూర్త రాజ్యమని ముద్రవేసి ఇరాక్‌తో మాదిరి వ్యవహరించడానికి కాలు దువ్వుతున్నది. మరోవైపున ప్రపంచీకరణ పేరుతో ప్రపంచ ప్రజల జీవన ప్రమాణాలపై అన్ని వైపుల నుండి దాడి జరుగుతున్నది. ప్రపంచీకరణ అంటే నూతన రూపంలో సామ్రాజ్యవాద దోపిడీ తప్పమరేమీ కాదు. సామ్రాజ్యవాదంపై విస్తృతమైన, విభిన్నమైన పోరాటాలు నేటి తక్షణావసరం. కొన్ని సూత్రాలకు, విలువలకు కట్టుబడి, నిష్కర్షగా, నిర్భీతిగా వ్యవహరించే సయిద్‌లాంటి మేధావుల అవసరం నేడు ఎంతైనా ఉంది. ఇలాంటి సమయంలో సయిద్ మరణం ప్రపంచపురోగామి శక్తులకు, స్వేచ్ఛా కాముకులకు తీరని లోటు.

V



Untitled-2 32 6/11/2002, 3:51 PM

కథ

**డా॥ వి.ఆర్. రాసాని**

# తీర్పు



***"ఎలావుందో ఏమో? ఎక్కడ చేర్చారో ఏమో? యిప్పుడెవరైనా కనిపిస్తే బాగుండు! రాజు సంగతి తెలియ చేస్తే బాగుండు!" హడావుడిగా పేటలో బస్సు దిగిన సూర్యం మనసులోనే అనుకుంటూ, తీవ్రంగా ఆలోచించసాగాడు. మరోవైపు రాజుతో తనకు పరిచయమైనప్పటి నుంచీ జరిగిన అనేక సంఘటనలు అతని మనోఫలకంపైన స్పష్టాస్పష్టంగా ముద్రితం కాసాగాయి.***

రాజు సూర్యానికి చిన్న నాటి స్నేహితుడు. పైగా దూరపు బంధువు సూర్యం నాన్న అప్పట్లో పేట స్కూల్లో టీచర్‌గా పని చేసేవాడు. అందువల్లా రెండు కుటుంబాల మధ్య రాకపోకలు, ఇచ్చిపుచ్చుకోవడాలు కూడా జరుగుతూ వుండేది. రాజు సూర్యం ఒకే క్లాసులో చదువుకునేవారు. అక్కడే యిద్దరికీ మంచి నేస్తం కుదిరింది. ఒకరింట్లో మరొకరు కుటుంబ సభ్యుల్లా కలిసి పోయారు. అప్పుడప్పుడూ సురేంద్రుడూ వాళ్ళతో నేస్తం కట్టేవాడు. ఆ యిద్దరి స్నేహంతో, ఆటపాటలతో సూర్యం పదిలోకొచ్చాడు. ఆ సమయంలోనే సూర్యం తండ్రికి పట్నానికి బదిలీ అయింది. అయినా వాళ్ళ స్నేహం మాత్రం అలాగే సాగుతూ వచ్చింది. తను కాలేజీలో చేరి పై చదువులు చదివి ఇటీవలే ఉద్యోగంలో కూడా చేరాడు. రాజూ సురేంద్రులు మాత్రం హైస్కూలు చదువుతో ఆగిపోయి వ్యవసాయం పనుల్లో కుదిరిపోయారు.

రాజుకు ఇంకా పెళ్ళికాలేదు. ఏవో సంబంధాలు చూస్తున్నారని ఆ మధ్య పట్నం వచ్చినప్పుడు చెప్పాడు. కానీ హఠాత్తుగా ఇలా జరిగిపోయింది. ఎందుకు జరిగిందో, ఎలా జరిగిందో తెలియడం లేదు. పల్లె నుంచీ నిన్ననే టెలిగ్రాం వచ్చింది. ఇక అప్పటి నుంచీ ఒకటే టెన్షన్.

బయలుదేరింది మొదలు మెదడులో రాజు గురించిన ఆలోచనలే. ఏం జరిగిందో తెలుసుకోవడానికి కూడా ఎవరూ కనిపించడంలేదు. సూర్యానికి ఏమీ పాలుపోవడంలేదు' ఇంతకీ రాజు ఎక్కడున్నాడు? పల్లెలోనా? పేటలోనా? పల్లె రెండు కిలో మీటర్ల దూరంలో వుంది. మరిప్పుడు ఎక్కడికి వెళ్ళాలి? పల్లెకు వెళితే ఆ కుటుంబాన్ని ఎలా ఓదార్చాలి?' ఆలోచిస్తూనే వున్నాడు.

ఏ దేవుడో వరమిచ్చినట్టుగా ఆతనికి అప్పుడే ఎదురుపడ్డాడు సురేంద్రుడు. వచ్చీరాగానే 'ఓ సూర్యం నువ్వా. ఎప్పుడొస్తివి? పల్లెకేనా?" రెండు ప్రశ్నలు ఒకేసారి వేశాడు.

"ఇప్పుడే పల్లెకే బయలుదేరా" చెప్పాడు సూర్యం. "బాగుండావా? అమ్మానాయనా బాగుండారా?" మళ్ళీ ప్రశ్నించాడు సురేంద్రుడు.

"మేం బాగుండాంగానీ, రాజుకు సీరియస్ అని టెలిగ్రాం యిచ్చారుగదా. ఇంతకీ రాజుకేమైంది?" ఆదుర్దాగా అడిగాడు సూర్యం.

రాజు ప్రసక్తిరాగానే సురేంద్రుడి ముఖం వివర్ణమై పోయింది. అతని ముఖ కవళికలు మారిపోయాయి.

"టెలిగ్రాం యిచ్చింది నేనే, అన్నీ చెప్తా రా" అంటూ పేట వైపు నడిచాడు సురేంద్రుడు.

"ఇటెక్కడికి?" అడిగాడు సూర్యం.

"అదే రాజు దగ్గరికి" అన్నాడు సురేంద్రుడు

"ఇంతకీ ఏం జరిగింది. రాజు యిప్పుడెక్కడున్నాడు?" అతృతను ఆపుకోలేక గట్టిగా స్వరం పెంచి అడిగాడు సూర్యం.



Untitled-2 33 6/11/2002, 3:51 PM

"ఏం లేదు సూర్యం! మనోడు రాశింటోళ్ళ కోడలితో చాలా దినాలుగా వ్యవహారం నడుపుతున్నాడు. ఆ వ్యవహారమే... వాడిని ఈ స్థితికి తెచ్చింది" దుఃఖంతో అతని కంఠం పూడుకుపోయింది.

"రాజు మంచోడేనే. అలాంటి పని ఎందుకు చేశాడు?"

"మనోడు మంచోడేగానీ, ఎదుటోళ్ళు మంచోళ్ళుగావాలని లేదుగదా. అందుకే అంతపంచేసినారు." తెపరాయించుకొని చెప్పాడు సురేంద్రుడు.

"ఏం జేశారు? కొట్టారా?"

"లేదు"

"మరేం జేసినారు?"

"శాతాలం జేసేసినారు." దుఃఖం ఆపుకోలేక ఏడ్చేశాడు సురేంద్రుడు. సూర్యంకు ఏమ్మామాడాలో అర్థం కాలేదు. పైగా రాజుకేమైందో కూడా తెలియడంలేదు. అంతా అయోమయంగా వుందే అనుకున్నాడు. రెండు క్షణాలు గడిచింతర్వాత తనే అడిగాడు.

"శాతాలమంటే..."

"చేతబడి సూర్యం.. చేతబడి"అదేదో తిరుగులేని రోగంగా భయపడుతూ చెప్పాడు సురేంద్రుడు.

"ఏంది సురేంద్రా నువ్వా అంతో ఇంతో చదువుకున్నోడివేగరా. ఈ కాలంలోను శాతాలాలూ, చేతబడులూ..." అంటూ ఏదో చెప్పబోయాడు సూర్యం.



"అట్టనొద్దు సూర్యం శాతాలంతో సచ్చినోళ్ళు శ్యానామందే వుండారు. ఈ మద్దెన వారానికొకసారైనా రాశింటోళ్ళింటికి పొరుగూరి మంత్రగాడు వస్తాపోతా వున్నాడు. వాడి చేతనే ఈ పంజేయించింటారు. రాజు అన్నగారు. త్వరగా యింకో మంత్రగాన్ని పిల్చకొచ్చి శాతాలం తీయించేయాలంటా వుండారు"

సూర్యం మాటలకు అడ్డుపడి మరీ చెప్పాడు సురేంద్రుడు.

ఆ మాటలు విన్న సూర్యం ఒక క్షణం నిర్ఘాంతపోయాడు.

"వీళ్ళు మంత్రాలు తంత్రాలు అనీ రాజును స్వయంగా కైలాసానికి పంపేసేట్టుగా వున్నారు. యింతకీ రాజుకేమైందో" అని కూడా అనుకున్నాడు.

"మనమిప్పుడు ఎక్కడికి వెళుతున్నాం?" అడిగాడు సూర్యం.

"రాజు దగ్గరికే..." అన్నాడు సురేంద్రుడు.

"ఇంతకీ వాడికేమైందీ. ఎట్లుందీ?"

"వుండేదేముందీ. నిన్నటిదాంకా మాటాపలుకులే. ఈ దినం పొద్దుట్నుంచీ కండ్లు తెరిచి మాట్లాడతావుండాడు. నిన్న రేత్తిరి వీళ్ళన్న పాకాలకు బోయి గురువు దెగ్గిర్నించి బండారు మంత్రించుకోనొచ్చి పెట్నాడు. అయినా ఏమి లాభం?" నిరుత్సాహంగా చెప్పాడు సురేంద్రుడు.

"ఏం?" అన్నాడు సూర్యం.

"కదల్లేడు, మెదల్లేడు గదా" అన్నాడు సురేంద్రుడు.

ఆ మాటతో ఏదో బలమైన ప్రమాదమే జరిగిందనుకున్నాడు సూర్యం. సురేంద్రుడు ఇంకా చెప్పుకుపోతూనే మన్నాడు.

"వాడికి సెరుపు చేయించినందుకు రాజు అన్నగారు రాశింటోళ్ళమిందబడినారు. మొగోళ్ళను చితగ్గొట్నారు. ఊర్లో పెద్ద మనుషులొచ్చి ఎందుకు కొట్టుకుంటారు. పంచాయితీ జేసుకోండ్రా అంజెప్పి ఆపేసినారు. లేకుంటే ఖూనీలే జరిగిపోవును. రేత్తిరికే పంచాయితా! రాజు పరిస్థితి చూసి అందరూ వీళ్ళ పక్కనే మాట్లాడతా వుండారు."

వివరించాడు సురేంద్రుడు.

అసలు రాజుకు నడుములు పోవడమేమిటో, దానికీ రాశింటోళ్ళ కోడలికీ సంబంధమేమిటో ఎంత ఆలోచించినా అర్థం కాలేదు సూర్యానికి. ఎంత ప్రయత్నించినా వీడని చిక్కుముడిలాగాను, అంతుబట్టని మాయలాగాను అనిపించింది ఇద్దరూ అలా మాటాడుకుంటూ కొద్ది క్షణాల్లోనే గవర్నమెంటు హాస్పిటల్‌కి చేరుకుని రాజు వున్న గదిలో అడుగుపెట్టారు.

వీళ్ళని చూడగానే అంత వరకూ అక్కడున్న రాజు పెద్దన్న రమణ సూర్యాన్ని పలకరించి గది బయటకొచ్చేశాడు.

అక్కడ బెడ్‌పైన కదలలేని స్థితిలో పక్కనే వున్న ఒకస్టూలు మీద కూర్చున్నాడు. ఆ అలికిడి విని కళ్ళు తెరచి, అతన్ని చూసి బరస్టయిపోయాడు. వలవలా ఏడ్చేశాడు. తనను చూడడానికి ఎవరొచ్చినా వాళ్ళని చూసి ఏడుస్తూనే వున్నాడు రాజు. సూర్యం చేతులు పట్టుకుని మరీ ఏడవసాగాడు. మరోవైపు కదలలేక ఆయాసపడుతున్నాడు."ఎందుకిలా అయిపోయావ్? ఏం జరిగింది. రాశింటోళ్ళేమైనా నడుము లిరగ్గొట్టారా?" రాజును ప్రశ్నించాడు సూర్యం.

ఆ మాటతో ఇంకా దుఃఖం పొంగుకొచ్చింది రాజుకు. దుఃఖావేశంలో ఏమీ చెప్పలేకపోయాడు. కానీ 'ఇదంతా నా కర్మ' అని మాత్రం అనగలిగాడు.

వాళ్ళు అలా మాట్లాడుకుంటూ వుండగానే గదిలోకి దూసుకు వచ్చింది నర్సు. మందుసీసాను చేతిలోకి తీసుకొని దాన్ని అటూ ఇటూ ఊపి, అందులోకి సిరంజి గుచ్చింది. మెల్లగా, మందు సిరంజిలోకి లోడ్ చేసుకుంటూ వుండిపోయింది. అది చూసి ఇద్దరూ గది వెలుపలికి వచ్చారు.

"నేను పల్లెదాకా పోయొస్తా. సురేంద్రా కొంత సేపు ఇక్కడే వుండండి" అని చెప్పి అక్కడి నుంచీ వెళ్ళిపోయాడు రమణ.

"అలా పోదాం రారా సురేంద్రా" అంటూ సూర్యం సురేంద్రని పిల్చుకుని ఆసుపత్రి భవనం ముందుకొచ్చాడు. 'ఏంటిదంతా ఎట్లా జరిగింది?' అంటూ అడిగాడు.

"నీ దెగ్గిర దాపరికమేముండాది సూరీ." అంటూ మొదలెట్టాడు సురేంద్రుడు.

వికలమైన మనసుతో, ఆతృతగా వినగాడు సూర్యం.

"రాశింటోళ్ళు, రాజూ వాళ్ళు పక్కపక్క పొలాల వాళ్ళు. గెనాల దెగ్గిర్నో, గొడ్డూ గోదా దెగ్గిర్నో అప్పుడప్పుడూ కొట్లాడుకుంటూ వుండే వాళ్ళు. ఆ కారణంగా రెండు కుటుంబాల వాళ్ళు మాట్లాడుకునే వాళ్ళుగాదు. ఇద్దరి మధ్యా పచ్చగడ్డి పడినా భగ్గుమనకుండానే మండి పోతుందనుకో... వాళ్ళిద్దర్లో రాశింటోళ్ళదే పై చెయ్యిగా వుండేది. అది భరించలేక పోయాడు రాజు. వాళ్ళనేమీ చేయలేక రాత్తిర్లో వాళ్ళ బాయికాడికి పోయి టెంకాయలుకోసకొస్తావున్నాడు. అది అందరికీ తెలిసిన విషయమే. కానీ రాశింటోళ్ళు రాజును ఏమీ చేసుకోలేకపోయినారు. వొగ దినం పట్టపగలే ఎవురూ లేనప్పుడు చెట్టెక్కి కాయలు తోస్తావుంటే రాశింటోళ్ళ కోడలు గౌరమ్మ కనుక్కునేసింది. ఆయమ్మకు పెండ్లయి రెండేండ్లయిందంతేలే. ఆయమ్మ ఏమీ అనకుండా బుద్ధి మాటలు చెప్పి వదిలేసిందంట. ఇంక అప్పట్నుంచీ రాజు ఆమె మంచితనానికి మెచ్చుకోని కనిపిచ్చినప్పుడంతా ఆమెతో మాట్లాడేవోడంట. గౌరమ్మ ఎంత మంచి బిడ్డో అంటా ఊర్లో వాళ్ళతో చెప్పుకోని మెచ్చుకుంటావుండేవోడంట. అది గమనించిన రాశింటోళ్ళు అనుమానపడి వాడికీ గౌరమ్మకూ అక్రమ



Untitled-2 34 6/11/2002, 3:51 PM

సంబంధముండాదని వొగదినం ఆయమ్మను నిలదీసి అడిగినారంట. నేనట్లాంటిదాన్ని కాదయ్యా అంటా గౌరమ్మ ఎంత చెప్పినా ఆ మొగుడూ వినలా. అత్త మామలూ నమ్మలా. ఆమెను రాచి రంపాన పెడతా వచ్చినారు. ఈ మధ్యనే ఈ విషయంగా రెండు కుటుంబాల మధ్య రగడ జరిగింది. ఈసారిగనక మళ్ళా గౌరమ్మతో మాట్లాడితే మీ వాణ్ణి 'శాతాలం' చేసి సంపించేస్తామన్నారు రాశింటోళ్ళు. ఈ రగడతో యవ్వారం రచ్చకెక్కింది. ఈ రగడ జరిగి వారం తిరక్కనే రాజు యిట్లయిపొయినాడు." అన్నాడు సురేంద్రుడు.

"అసలు రాజుకు నడుములు ఎట్లపోయినాయి. ఎక్కడ పోయినాయో చెప్పనేలేదే." అన్నాడు సూర్యం.

"మొన్న సందేళకాడ రాజు రాశింటోళ్ళ బాయికాడ సోరకం లేకండా పడున్నాడంట. ఎవురో కనుక్కోని ఇంటికి చేర్చితే ఆసుపత్రికి చేర్పించినారు." అన్నాడు సురేంద్రుడు.

"ఏం జరిగింటిందంటావ్?" అంటూ అడిగాడు సూర్యం.

"శాతాలం చేసింటారంటా వుండారు."

"సరే. సందేళకాడ రాజు అక్కడికి ఎందుకు పోయింటాడంటావ్."

"అదే ఎవురికీ అర్థం కాలా."

ఈ సంభాషణ తర్వాత సూర్యానికి అంతా అర్థమైపోయింది.

"టెంకాయలు దొంగలించడానికి వెళ్ళిన రాజు చెట్టెక్కి కాలుజారి కిందపడిపోయి నడుములు పోగొట్టుకోనుంటాడు. చేతబడి చేసి వుంటారని వీళ్ళు అనుకున్నారు" అనుకున్నాడు.



"ఇప్పుడు డాక్టరేమంటాడు" అంటూ తిరిగి అడిగాడు సూర్యం.

"వెన్నెముకలో పూసలు నలిగిపోయి నడుములు పడిపోయాయన్నాడంట. వాడి పరిస్థితి ఇంక మంచానికే అని కూడా అన్నాడంటలే" చెప్పాడు సురేంద్రుడు.

టెంకాయల కోసం పోయే ఇట్లయిపోయినాడన్న విషయం సూర్యానికి నిర్ధారణ అయిపోయింది.

"ఈ విషయం చెప్పినా వీడర్థం చేసుకోడులే" అనుకున్నాడు.

కొంతసేపు హాస్పిటల్లోనే వుండి ఆ తర్వాత పల్లె కొచ్చేశారిద్దరూ.

× × ×

పట్నానికి బస్సుల్లేక ఆ రాత్రి అక్కడే భోంచేసి పల్లెలోనే వుండిపోయాడు సూర్యం. ఆ రాత్రి... తొమ్మిది గంటలకు రచ్చబండ దగ్గర జనం కూడి వున్నారు. రచ్చబండ మీద పెద్ద మనుషులు కూర్చొని వుంటే, కొందరు వీధిలో వున్న బండలపైనా, నేలపైనా కూర్చొని వింటున్నారు. ఒకవైపున రాజు అన్నగారు నిలబడివుంటే, వాళ్ళకెదురుగా రాశింటోళ్ళు నిలబడి వున్నారు. వాళ్ళ మధ్యనే చీరపైటను భుజాలనిండా కప్పుకొని గౌరమ్మ నిలబడి వుంది. ఆమె వెనకే ఆమె తండ్రి జయరామయ్య నిలబడి బిక్కుబిక్కుమని చూస్తున్నాడు.

సూర్యం, సురేంద్రులు భోం చేసుకుని అక్కడికి వెళ్ళే సరికి పంచాయితీ ప్రారంభమై చాలా సేపై పోయింది. వారం క్రితం ఇరువర్గాల వారికీ రగడ జరిగినప్పుడు రాశింటోళ్ళు 'శాతాలం' జేసి సంపేస్తామన్న మాటల్ని పట్టుకొని, అదే నిజమని నమ్మి రాశింటోళ్ళదే తప్పుగా నిర్ణయంచారు పెద్దలు. అదయిపోగానే గౌరమ్మను పిలిచి రాజుతో అక్రమ సంబందం ఎందుకు పెట్టుకున్నావని ప్రశ్నిస్తున్నారు. సూర్యం సురేంద్రులు వెళ్ళి ఓ ప్రక్కన బండపైన కూర్చున్నారు. సూర్యం ఎప్పుడూ పంచాయితీలు చూసి ఎరుగడు. అందుకే చాలా ఉత్సాహంగా వినసాగాడు.

గౌరమ్మ తనకే పాపం తెలీదంది. కొందరు ఆమె శీలాన్ని గురించీ, ఆమె గురించీ నీచంగా మాట్లాడారు. ఆ మాటలు వింటుంటే గౌరమ్మకు అలనాడు కౌరవ సభలో ద్రౌపదికి జరిగిన అవమానం తనకూ జరుగుతున్నట్లనిపించింది. అక్కడ ఆమెకు వస్త్రాపహరణం జరిగిపోతున్నట్లు, మాటలతోనే మానభంగం జరుగుతున్నట్లు అనిపించింది.

పెద్దలు మళ్ళీ అడిగారు. చెప్తావా లేదా కులానికి వెలేద్దుమా అన్నారు. అయినా ఆమె నోరు తెరవలేదు. ఆమె వాలకం చూసి గౌరమ్మ భర్తకు కోపం పొంగుకొచ్చింది.

"చెప్పేలమ్మో నలుగుర్లో తలవంపులు తెస్తివే. ఈ రోజుతో నిన్ను చంపేస్తాను. నోరు తెరు." అంటూ జుట్టు పట్టుకొని వంగదీసి అందరి ముందర వీపున నాలుగు గుద్దులు గుద్దేశాడు. ఆమె తండ్రి జయరామయ్య ఏమీ చేయలేక అసహాయంగా చూస్తూ వుండిపోయాడు. అందరూ పకపకా నవ్వారు.

"అయిందిగదా. మంగళారతి. యింకన్నా నోరు తెరు." అన్నాడో పెద్దమనిషి.

అయినా ఆమె పెదవి విప్పలేదు.

మళ్ళీ కొట్టడానికి ముందుకొచ్చాడు ఆమె భర్త.

"ఆగవయ్యా!" గట్టిగా అరచింది గౌరమ్మ

అతనలాగే ఆగిపోయాడు. ఒక చోట కొలువుదీరిన శిలా ప్రతిమల్లా అందరూ మౌనంగా చూస్తున్నారు. ఆమె నోరు విప్పింది. "వొగ ఆడదాన్ని కొట్టే దానికి నీకు సిగ్గులేదా. పెండ్లాన్ని కొట్టేది వీరత్వం అనుకుంటివా. ఇంక నిలు చాలుగానీ..." అంది.

"ఆడది మాట్లాడనంత వరకే స్త్రీపైన మగాడి ఆధిపత్యం సాగుతుంది. ఇక ప్రశ్నించడం ప్రారంభించిందంటే, ఆనాటితో పురుషుడు పునరాలోచింపక తప్పదు. తరతరాల పురుషాధిక్యం పూడ్చుబడకా తప్పదు" అనుకున్నాడు సూర్యం.

గౌరమ్మ మాట్లాడ్డం ప్రారంభించింది.

"మీరందరూ పెద్దమనుషులే. మీకూ ఆడపిల్లలున్నారు. ఒక ఆడపిల్లపైన ఇట్లా అపనిందలేసి నడీదిలో నిలబెట్టడం మీకు న్యాయంగా వుండాదా? చెప్పండి" నిలదీసింది.

ఎవ్వరూ నోరు మెదపలేదు.

"ఏమయ్యా, నేను రాజుతో రంకుపని చేసేటప్పుడు ఎవురయినా చూసినారా?"

అందర్నీ అడిగింది.

"ఇట్లాంటివాటికి సాక్షాలుండవు" మరో పెద్ద మనిషి సెలవిచ్చాడు.

"కోర్టులోనైనా సాక్షాలేగదా ముఖ్యం. మరి సాక్షం లేకనే పదివేలు తప్పు ఎట్లాయేస్తారు? నాది తప్పని యెట్లా నిర్ణయిస్తారు?"

"నీ గురించి అందరికీ తెలుసులే. దినొమ్మూ మీయింట్లో వోళ్ళే ఈ విషయంగా నిన్ను కొడతా వుండారు నీ మొగుడే నిన్ను తంతావుండాడు గదా."

"అంతకంటే సాక్షం ఏంగావాలి"

తలావొక మాట అనసాగారు.

"నోర్లుముయ్యండయ్యా, సాక్షం చెప్పించడయ్యా అంటే, యింట్లో గలాటాల గురించి చెప్తారు. వొగ మొగోడు, వొగ ఆడది మాట్లాడుకుంటానే రంకు అంట కడతారా. కులానికి యేలేస్తారా" ధైర్యంగా అంది గౌరమ్మ.

"వసే నిన్ను..." అంటూ మరోసారి మీదపడబోయాడు



Untitled-2 35 6/11/2002, 3:51 PM



# అంగారక 'దర్శనం'

**వి.ఎస్.వి. ప్రసాద్**

అరవై వేల కోట్ల సంవత్సరాల తర్వాత పరామర్శకు వచ్చాడు, మార్స్!
ప్రజలంతా తమ యింటికి వచ్చిన దేశాధినేతను ఆదరించినట్లు ఆదరించారు ఈ అపురూప అతిథిని,
గతంలో అతను వచ్చినపుడు అనాగరిక వ్యవస్థలో పచ్చిమాంసమే తిన్నాడు
ఒంటినిండా బట్టలులేని సమాజాన్ని చూచి బాధపడ్డాడు
నాగరిక సమాజ ద్రష్టయై వెనుదిరిగిపోయాడు
సుదీర్ఘ కాలానికి వచ్చిన ఈ అతిథికి మనం కూల్‌డ్రింక్స్ ఇస్తే
పురుగుమందులు కలిశాయని భయపడి "థాంక్స్ నో!" అన్నాడు
హాట్ డ్రింక్స్ ఇస్తే చీప్ లిక్కర్ మరణ వార్తల్ని తలచుకొని వణికిపోయి
"సారీ!!' అన్నాడు
విందు భోజనం ఏర్పాటు చేస్తే కలుషితాహారంతిని మృత్యువుతో దొమ్మి
యుద్ధం సాగించిన బడిపిల్లల సమాచారం తెలుసుకొని, తన "కాకలిగా లేద"న్నాడు
ఏది చూపించినా కలుషితమేననుకొని గజగజవణికిపోయాడు
అనాగరికమైనా, కలుషితంగాని ఆనాటి ఆటవిక యుగమే నయమనుకున్నాడు
నేటి పులిరాజులకు కూడా ఎయిడ్స్ సంక్రమించడం చూసి,
నాటి పులులే నయమనుకున్నాడు
టివీల్నీ, సినిమాల్నీ, ఫేషన్ షోల్నీ చూపించినపుడు
కట్టుకోవడం నేర్చి కూడా, ఒంటినిండా బట్టలులేని నటీమణులను, అందాల రాణులను చూచి, "ఇదా నాగరికత?" అని ఏవగించుకున్నాడు
రాజకీయవాదులతో కరచాలనం చెయ్యడానికి స్కాముల పాములని భయపడి వెనుకంజవేశాడు.
తన భూభాగంపై నివేశన స్థలాల కొనుగోలుకు అప్పుడే పోటీ పడుతున్న భూలోక భూకబ్జాదారుల్ని చూచి, తన ఉనికిని గూర్చి కలవరపడి నిష్క్రమించాడు,
అసంతృప్తితో వెనుదిరిగిపోయిన అంగారక మిత్రమా!
నీవిచ్చిన వ్యంగ్య సందేశానికి నా కృతజ్ఞతాభివందనాల్ని అందుకొనుమా!

# హైకులు

**పానుగోటి రవికుమార్**

'బ్రతుకు వాన
సూర్యుడు మబ్బుల
గుడిసెలో తడ్చిపోయాడు'

'మబ్బుల ధర్నా
ఆకాశం నల్లబ్యాడ్జీలు
భూమంతా రక్తం'



'ఆకాశాన్ని
తాకాలనే చిగుళ్ళకి
చినుకులు సాయం చేశాయి'

'పార్టీ జెండాలు
మందుసీసాలు మాట్లాడుకున్నై'
ఎన్నికలు కాబోలు'

'కాళ్ళకింద చెప్పులు
కిర్రు కిర్రుమని
గుండె పగిలి అరుస్తున్నై'

'ఎండకాలం
వేపచెట్టు దళితుల
జీవిత చిత్రం లాగుంది'

'హాస్టల్లో అన్నం
అమ్మగుర్తొచ్చింది
ఆకలి చచ్చిపోయింది'

ఊరేంబడి
బతుకుల్లో ఉప్పెన
ఊరి మధ్య లేచింది

---

మొగుడు.

"య్యోవ్! ఆగవయ్యా, భలే ఎగిరెగిరి పడతావుండావే.. ఎవురో ఏదో చెప్పినారని బతుకును పంచుకున్న పెండ్లాన్ని అందరిముందర అగుడుజేస్తావా. అడుగడుగునా అనుమానించి కొడతావా. నీలాంటోడితో కాపరం నరకమే గదా. మంచీ చెడు తెలుసుకోకుండానే పంతాలకుపోయి, కోడల్ని అవమానించి, ఆడిపోసుకునే మీమద్దెన బతకడమంటే రాకాసుల మద్దెన వుండడమే... ఇంక నీతో నేను కాపరం చెయ్యలేను. నీవాళ్ళూ వద్దు. ఈ మనుషులూ వద్దు. పో" ఆవేశం అణుచుకుంటూనే చెప్పింది.

అంత వరకూ మౌనంగా వున్న జయరామయ్య ముందుకొచ్చాడు.

అందరికీ వొగసారి నమస్కారం చేశాడు.

"భలే న్యాయమయ్యా మీది. నేనంతా తెలుసుకున్నానులే. ఎవుడో టెంకాయల దొంగ చెట్టెక్కి కిందపడిపోయి నడుములు పోగొట్టుకుంటే, అంత కూడా కనికరామూ, జాలీ లేకుండా వొగ ఆడబిడ్డను, వొంటి దాన్ని జేసి, కాకులు పొడిచినట్టు పొడుస్తారా. దానికెవురూ ఎనకాముందూ లేరనుకుంటిరా. చెట్టుకు కాయలేమీ బరువుగాదు. కన్నోళ్ళకు బిడ్డలూ బరువుగాదు. కనీ, పెంచీ యిట్టాంటి పూర్లో బిడ్డనిచ్చినందుకు ఆ జన్మాంతం గుర్తుండి పోయే విధంగా బుద్ధొచ్చిందిగానీ... మీకూ మీ వూరికీ వొగ నమస్కారం. ఇంక రామ్మాపోదాం" అన్నాడు.

"పదనాయనా" అంటూ తండ్రి వెంట అలాగే పోయింది గౌరమ్మ. సూర్యం పైకి లేచాడు. ఒక్కసారి ఆకాశంలోకి చూశాడు. మానవుడి మేధస్సులోని అజ్ఞానంలా చిక్కగా లోకమంతా వ్యాపించి వుంది చీకటి. రెండడుగులు ముందుకేశాడు. అందరి వైపు చూశాడు. "థుఁ" అంటూ ఒక్కసారి నేలపైన ఉమ్మి, వాళ్ళ వెంట తనూ వెళ్ళిపోయాడు. అప్పుడే పడమటి దిక్కున ఓ ధృవనక్షత్రం మిణుకు మిణుకుమంటూ మెరుస్తూ కనిపించింది.

V



Untitled-2 36 6/11/2002, 3:51 PM

# నేటి తమిళ సాహిత్యంలో వివిధ ధోరణులు

**అత్యంత పాపులర్ పత్రికలుగా చెలామణి అవుతున్న 'కుముదం', 'కుంకుమం' 'కల్కి'లలో ప్రచురితమవుతున్న కథానికలు, సీరియల్ నవలలు గురించి మనం ప్రత్యేకంగా చెప్పుకొనేందుకేమీ లేదు. కథానికల పేరుతో మలినమైన రాతలే కుప్పతెప్పలుగా వచ్చిపడి అమాయక చదువరులను వుక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. మహిళలను కించపరచటం, శ్రామిక జన పోరాటాలపై బురద చల్లటం, మూఢ నమ్మకాలను పెంచి పోషించటమే వాటి ప్రధాన వుద్దేశంగా వుంటున్నాయి.**

**ఎ.జి. యతిరాజులు**

నేటి తమిళ సాహిత్యం ఎలా ఉందని ఒక విహంగమ దృష్టితో వీక్షిస్తే అందులో ముఖ్యంగా నాలుగు విభాగాలు మనకు గోచరిస్తాయి.

1. ప్రధానమైన వార, మాస పత్రికలు
2. ఆధునికానంతర వాదులు
3. తమిళ తీవ్రవాదులు
4. అభ్యుదయ వాదులు

ప్రముఖ తమిళ టీ.వీ. ఛానళ్ళు సన్, జయ, రాజ్, విజయ్‌ల జనరంజకత్వం, కంప్యూటర్ ప్రాధాన్యత పెరిగిన పరిస్థితిలో సైతం వాణిజ్యపరమైన తమిళవార, ద్వైవార, పక్ష, మాస పత్రికలైన 'కుముదం', 'ఆనంద వికటన్', 'కల్కి', 'కుంకుమం' లాంటి పత్రికల అమ్మకాలు ఏ మాత్రం తగ్గకపోగా లక్షల సంఖ్యలోనే కొనసాగుతున్నాయి. తమిళుల సాంస్కృతిక జీవనంలో ఈ పత్రికల పాత్ర విశిష్టంగానే కొనసాగుతున్నది. ఈ ప్రముఖ మేగజైన్లలో ప్రతి ఒక్కటీ తాను ప్రచురించే విభిన్న సంచికల ద్వారా కుటుంబ సభ్యులందరినీ తనతోనే కట్టి పడవేయటానికి ప్రయత్నిస్తున్నది. బాలలకై 'చిట్టి వికటన్' యువతకై 'జూనియర్ వికటన్' నడి వయస్సువారికి ఒరిజినల్ 'ఆనంద వికటన్', మహిళలకు ప్రత్యేకంగా 'ఆమె వికటన్', భక్త జనం కొరకు ప్రత్యేక భక్తి మేగజైన్ ప్రచురింపబడుతున్నాయి. ఇలాగే ఇతర తమిళ పత్రికలు కూడా తమిళ ప్రజలను తమ తమ సామ్రాజ్యాలలో ఇరికించుకొంటున్నాయి. మరో రెండు ప్రసిద్ధ పత్రికలు 'కల్కి', 'కుంకుమం'లు 'ఆనంద వికటన్', 'కుముదం'లతో పోటీ చేయలేకపోయినా వాటి స్థాయికి చేరుకోవాలని నిరంతరం ప్రయత్నం చేస్తున్నాయి. వీటికి దగ్గరగానూ, దూరంగానూ ఉన్నట్టు కనపడటానికి 'ఇండియా టుడే' తాపత్రయపడుతూ వుంటుంది.

అత్యంత పాపులర్ పత్రికలుగా చెలామణి అవుతున్న 'కుముదం', 'కుంకుమం' 'కల్కి'లలో ప్రచురితమవుతున్న కథానికలు, సీరియల్ నవలలు గురించి మనం ప్రత్యేకంగా చెప్పుకొనేందుకేమీ లేదు. కథానికల పేరుతో మలినమైన రాతలే కుప్పతెప్పలుగా వచ్చిపడి అమాయక చదువరులను వుక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. మహిళలను కించపరచటం, శ్రామిక జన పోరాటాలపై బురద చల్లటం, మూఢ నమ్మకాలను పెంచి పోషించటమే వాటి ప్రధాన వుద్దేశంగా వుంటున్నాయి. ఈ పత్రికల మరో ముఖ్యమైన అంశం సినిమా టీవీ నటీనటుల సెక్సీ చిత్రాలు, వారి వ్యక్తిగత జీవితాల గుసగుసలు. వీటిని అవి అత్యంత జాతీయ స్థాయి కలిగిన సమాచారంగా బాగా మసాలా కూర్చి ప్రచురిస్తూ వుంటాయి. గత కాలంలో తమిళ సీరియల్ నవలలు ఎంతో గొప్పగా చర్చింపబడ్డాయి. అయితే నేడు అలాంటి స్థితి లేకపోవటమే ఈ పత్రికల నాణ్యతా పతనాన్ని పట్టి చూపెడుతోంది. అప్పుడప్పుడూ అరుదుగా కొన్ని ఉత్తమ కథానికలు, సీరియళ్ళూ ఈ మేగజైన్లలో ప్రచురింపబడుతుంటాయి. కానీ ఆ రచనలన్నీ అభ్యుదయ రచయితల పనే విషయం ఇక్కడ పేర్కొనదగ్గది.




'ఆనంద వికటన్' మాత్రం ఈ పత్రికలకు కొంత భిన్నంగా వ్యవహరిస్తోంది. ప్రగతిశీల సాహితీకారులను కోరి వారి నుంచి కథానికలు, కవితలు, నవలలు పొంది గణనీయంగా, ప్రచురిస్తోంది. వారికి పెద్ద పారితోషికాలు కూడా ఇస్తోంది.

'ఇండియా టుడే'లో ప్రచురింపబడే రచనలు శైలి, నిర్మాణాల రీత్యా ఆధునికమైనవిగా వుంటాయిగానీ, వాటిలో గంభీరమైన ఆలోచనలకూ, సామాజిక చింతనకూ తావుండదు. అది ప్రచురిస్తున్న వార్షిక సాహిత్య సంచికలు వర్తమాన తమిళ సాహితీ ప్రవృత్తులకు అద్దం పట్టేవిగా వుంటాయి గానీ, వాటిలోనూ అభ్యుదయ రచయితలకు పెద్దగా చోటుండదు.

ఈ ప్రధాన పత్రికల పై పోకడలను తమిళనాట ఒక ప్రధాన స్రవంతిగా వున్న అభ్యుదయ రచయితలు గమనిస్తూనే వున్నారు. అవకాశం వచ్చినప్పుడల్లా ప్రజా న్యాయస్థానంలో వాటిని ఎండగడుతూనే వున్నారు. ఎందుకంటే లక్షలాదిగా పాఠకులు కలిగిన ఆ పత్రికలనునిర్లక్ష్యం చేయరాదు కదా!

ఈ పత్రికలు కథానికలు, కవితలు, వ్యాసాలు, ఇంటర్వ్యూలు, బాక్స్ వార్తల ద్వారా అసంఖ్యాక పాఠకుల మనసుల్లో మంచీ, చెడూ రెండింటినీ నిరంతరాయంగా నింపుతున్నాయి. వీటిలో మానవత, మత సామరస్యం పూర్తిగా లేవని చెప్పలేకపోయినా పలు సందర్భాల్లో యుద్ధోన్మాదాన్నీ, మతోన్మాదాన్నీ కీర్తించే ఛాయలు సైతం



Untitled-2 37 6/11/2002, 3:51 PM

తరచుగా కనబడుతూనే వుంటాయి. ఇటీవల అయోధ్య వివాదంలో కంచి శంకరాచార్య అనుచిత జోక్యాన్ని స్వాగతిస్తూ ఈ పత్రికలు తెగరాశాయి. మన దేశంలో బహుళజాతి కంపెనీల దోపిడీకి ద్వారాలు బార్లా తెరవడం, ప్రభుత్వరంగ సంస్థల విక్రయం, మూసివేత, సామాన్య ప్రజలకిచ్చే సబ్సిడీల్లో కోత, విద్యావైద్యరంగాల వ్యాపారీకరణ, ఇటీవల తమిళనాడు ప్రభుత్యోద్యోగులను జయలలిత అణచివేసిన తీరునూ సమర్థిస్తూ, ప్రశంసిస్తూ ఈ పత్రికలు నేటికీ శరపరంపరగా రచనలు ప్రచురిస్తూనే వున్నాయి. నిస్సిగ్గుగా, నిస్సంకోచంగా! వీటన్నిటినీ సూత్రబద్ధంగా వ్యతిరేకిస్తున్న వామపక్షీయులనూ, ప్రగతిశీలురను కూడా ఈ పత్రికలు పనిలో పనిగా నిరాధారంగా విమర్శిస్తూ, పరిహసిస్తూ వుంటాయి.

**తమిళనాట చిన్నచిన్న సాహిత్య పత్రికలు అసంఖ్యకంగా వెలువడుతున్నాయి. ఇప్పుడు ఈ ఆధునికానంతర రచయితలకు కుముదం తీరానది' అనే బడా గొలుసుకట్టు సాహితీ పత్రిక బాగా ఆశ్రయం కల్పిస్తోంది. ఇంత క్రితం పెద్ద పత్రికల్లో రాస్తున్న అభ్యుదయ రచయితలను కడుపు మంటతో విమర్శిస్తూ వచ్చిన ఈ మహానుభావులు ఇప్పుడు సౌకర్యంగా పెద్ద పత్రికల్లో తలదాచుకొంటున్నారు.**

### ఆధునికానంతరవాదులు

'తమిళ సాహిత్యంలో నేటి ఆధునికానంతర వాదులు' అని మనం పేర్కొన్నప్పుడు అది ఒక సామాన్య అర్థంలోనే గానీ' 'పోస్ట్ మోడర్నిస్టు'ల్లో వున్న పలు రకాల వారిని విడివిడిగా పేర్కొన్నట్టు కాదు. ఇంత వరకు వీరి రచనలు ప్రధానంగా 'కాలచ్చువాడు' (కాలాల జాడలు) 'కణైయాళి' (అంగులీయకం) వంటి చిన్న పత్రికల్లోనే ప్రచురింపబడుతూ వచ్చాయి. తమిళనాట చిన్నచిన్న సాహిత్య పత్రికలు అసంఖ్యకంగా వెలువడుతున్నాయి. ఇప్పుడు ఈ ఆధునికానంతర రచయితలకు కుముదం తీరానది' అనే బడా గొలుసుకట్టు సాహితీ పత్రిక బాగా ఆశ్రయం కల్పిస్తోంది. ఇంత క్రితం పెద్ద పత్రికల్లో రాస్తున్న అభ్యుదయ రచయితలను కడుపు మంటతో విమర్శిస్తూ వచ్చిన ఈ మహానుభావులు ఇప్పుడు సౌకర్యంగా పెద్ద పత్రికల్లో తలదాచు కొంటున్నారు. ఆధునికానంతర వాదపు కొన్ని లక్షణాలైన అస్పష్టతలు, గందరగోళాలు వీరి రాతలలోనూ నిండి వుంటాయి. కాకపోతే భాషా సౌందర్యం, విశిష్ట శైలీ ప్రత్యేకంగా వుంటాయి. వారి రచనల మార్మికతను, విద్వత్తును సాధారణ పాఠకుడు తట్టుకోలేడు.

తమిళ 'పోస్ట్ మోడర్నిస్ట్' రచయితల్లో కోణంగి, సుందర రామస్వామి, జయమోహన్‌లు ముఖ్యులుగా భావింపబడు తున్నారు. వీరి కథానికలు, కవితల కన్నా నవలలే చదువరులలో ఆసక్తిని కలిగిస్తాయి. అయితే ఇటీవల వెలువడిన వారి నవలలు తమ ఆకర్షణనూ, గాంభీర్యాన్నీ కోల్పోయాయి. ఉదాహరణకు కోణంగి నవల 'పాళి' కేవలం పదాడంబరంతో నిండి వుందేగానీ, సాధారణ పఠనానికి సైతం అనువుగా లేదు.

మరో ప్రసిద్ధ రచయిత సుందర రామస్వామి తన పూర్వరచనలలో గావించిన భాషా చమత్కారాలు తమ ఆకర్షణను పోగొట్టుకొన్న కాలమిది. ఆయన పూర్వ నవల 'జె.జె. కొన్ని వ్యాఖ్యలు' తమిళ పాఠకలోకంలో సంచలనం కలిగించినా ఆయన సరికొత్త నవల 'పిల్లలు–స్త్రీలు–పురుషులు' సామాజిక వాస్తవికతను పరిగణనలోకి తీసుకోక తప్పలేదు.

మరో రచయిత జయమోహన్ గతంలో 'విష్ణుపురం' అనే నవల రచించారు. సులభంగా బోధపడని సైద్ధాంతిక పదాలతో 'విష్ణుపురా'న్ని నింపి చదువరుల మీదికి వదలిన ఆయన, ప్రస్తుతం "వెంటాడే నీడ పిలుపు" నవలను ప్రచురించారు. కమ్యూనిస్టు ఉద్యమంపై బురద చల్లడమే ధ్యేయంగా ఈ నవల మొత్తం సాగింది. ఈ మహత్కార్య నిర్వహణా క్రమంలో పాపం జయమోహన్ తన ఆధునికానంతర వాదాన్ని సైతం పక్కన పెట్టేశారు. నిస్సిగ్గుగా యథాతథవాద శైలి శరణుజొచ్చారు.

అంతర్జాతీయంగా అమెరికన్ సామ్రాజ్యవాదులూ, భారత రాజకీయ రంగంలో మతోన్మాద శక్తులూ, మన ఆర్థిక వనరులను పీల్చి పిప్పి చేస్తున్న బహుళజాతి కంపెనీ జయపతాకాన్నెగుర వేస్తున్న ఈ సమయంలో జయమోహన్ ఇలాంటి నవల వెలువరించటం గమనించదగ్గది. రాజకీయ, ఆర్థిక, సాంస్కృతిక రంగాలలో పాలక వర్గాలు సమైక్యంగా పని చేస్తాయనటానికి ఇదో వుదాహరణ! ఏడు వందల పేజీలతో అతి పెద్ద నవలగా రూపొందిన 'వెంటాడే నీడ పిలుపు'లో కళాత్మకత మచ్చుకైనా కానరాదు. తన దార్శనికత పేరుతో కమ్యూనిస్టు వ్యతిరేక ప్రచారం మాత్రమే జయమోహన్ చేశారు. అభ్యుదయ రచయితల రచనలలో ప్రచారం మాత్రమే వుంటుందని ఆరోపించిన ఈయనగారి నవల మొత్తం ప్రచారంతో అదీ వెగటు కలిగించే అసత్య ప్రచారంతో నిండి వుంది. దీని తర్వాత వచ్చిన ఆయన నవల 'కన్యాకుమారి'ని ఎవరూ పట్టించుకోలేదు.

ఆధునికానంతర వాదులలోనే సుందర రామస్వామి –జయమోహన్ బృందాల మధ్య కూడా ముఠా తగాదాలు జరుగుతున్నాయి. ఒకరికొకరు వ్యక్తిగత నిందారోపణలు చేసుకొంటున్నారు. దీనిని బట్టి వారి వాదంలోని డొల్లతనం సైతం వెల్లడవుతోంది. అయితే అదే సమయంలో వీరిద్దరూ ఒక్కటై ఆధునిక తమిళ సాహిత్యంలో విప్లవాత్మక మార్పులు తెచ్చిన ద్రావిడోద్యమ రచయితలపై, అభ్యుదయ రచయితలపై నిరాధార నిందలువేయటంలో మాత్రం తీసిపోని విధంగా వున్నారు.

### తమిళ తీవ్రవాద రచయితలు

ఇక తమిళ తీవ్రవాద రచయితలు నక్సలిజంతోనూ, శ్రీలంకలోని ఎల్.టి.టి.ఇ. వేర్పాటు ఉద్యమంతోనూ ప్రభావితులైన వారు. వీరు 'నందన్' అనే పక్షపత్రిక చుట్టూ కేంద్రీకృతమై వున్నారు. నందన్ అనే దళిత పాలేరు– చిదంబరం నటరాజస్వామి భక్తుడు కూడా ఆనాటి బ్రాహ్మణాధిక్యతకు బలియైనవాడు. ఈ రచయితలు ఒక ప్రత్యేక రచయితల సంఘాన్ని నిర్మించటానికీ ప్రయత్నించారు. వారి విధాన ప్రకటనలో ఇలా చెప్పుకొన్నారు. "ఎందరో విదేశీ దురాక్రమణదారుల దాడులకు గురియైన మన మాతృభూమి (తమిళనాడు) చివరిగా ఆంగ్లేయుల పాదాక్రాంతమైంది. భారతదేశం స్వతంత్రమైన తర్వాత ఢిల్లీలోని కేంద్ర ప్రభుత్వానికి బానిసై మనుగడ సాగిస్తోంది." ప్రస్తుతం అమలవుతున్న ఫెడరల్ విధానాలలో లోపాలున్నాయనవచ్చు కానీ ఒక రాష్ట్రం మొత్తం ఇంకా బానిసగా వుందనడం సబబు కాదు. అందువల్లే వీరి వేర్పాటువాద రాజకీయాలు సాహితీకారులను సమైక్యపరచటానికో, ప్రజానీకాన్ని ఆకట్టుకోవటానికో పనికి రావటం లేదు.

కర్కశత్వమూ, అశ్లీలమూ వేర్పాటువాదం తోబుట్టువులు కాబోలు! ఇటీవల ఈ తీవ్రవాద ధోరణికి చెందిన తిరువారూర్ తంగరాసు అనే ప్రసిద్ధ రచయిత 'తిరుజ్ఞాన సంబంధర్' అనే నవల రాశారు. శైవులకు ఆరాధ్యులైన 'నాయన్నార్లు' అనబడే తమిళ శివభక్తుల్లో ముఖ్యుడు



Untitled-2 38 6/11/2002, 3:51 PM

తిరుజ్ఞాన సంబంధర్, ఆ భక్తుని జీవితాన్ని తన నవల్లో చిత్రిస్తూ, జ్ఞాన సంబంధర్ దొంగ భక్తుడనీ, వ్యభిచారి అనీ, మరో ప్రసిద్ధ శైవ భక్తురాలైన మంగయర్‌కరసితో అక్రమ సంబంధం కొనసాగించాడనీ చిలవలు పలవలతో వర్ణించాడు. తంగరాసు పురాణేతిహాసాల పునరధ్యాయనం ఎలా వుండరాదనేందుకు ఈ నవల ఒక ఉదాహరణ. కళానైపుణ్యం లేని రచనలు చేస్తున్న వీరే అభ్యుదయ రచయితలు తమ సాహితీ స్థాయిని పెంచుకోవాలని 'బోధనలు' చేయపూనుకోవటం విడ్డూరం.

### నేటి తమిళ సాహిత్యంలో అభ్యుదయ రచయితల పాత్ర

నేటి తమిళ సాహితీ రంగంలో అభ్యుదయ రచయితల పాత్ర తక్కువైనదేమీ కాదు. పరిమాణంలోనూ, పరిణతిలోనూ వారెంతో అభివృద్ధి సాధించారు. ఈనాడు తమిళనాట అభ్యుదయ రచయితలను నిర్లక్ష్యం చేసే పరిస్థితి లేదు. కథానికలు, నవలలు, కవితలు, నాటకాలు, బాల సాహిత్యం అనువాదాలు, వ్యాస సంకలనాలు, జీవిత చరిత్రలు మొదలగు అన్ని ప్రక్రియలలోనూ వారు మంచి ఖ్యాతినార్జించుకొంటున్నారు. వీరందరూ ప్రధానంగా తమిళనాడు అభ్యుదయ రచయితల సంఘం'లో సంఘటితమై వున్నారు. అంచనా ప్రకారం గత మూడేళ్ళలో తమిళ అభ్యుదయ రచయితలు 30 కవితా సంకలనాలు, 20 కథా సంపుటాలు, 6 నవలలు, 2 సీరియల్ నవలలు రాసి ప్రచురించారు. వివిధ తమిళ పత్రికల్లో వీరి రచనలు పుంఖానుపుంఖాలుగా ప్రచురితమవుతూనే వున్నాయి. పాఠకుల వాటి ప్రత్యేకతను గుర్తించి, ప్రశంసిస్తూనే వున్నారు.

అభ్యుదయ రచయితలు తమ రచనలలో మానవ జీవితంలోని అన్ని పార్శ్వాలనూ స్పృశిస్తున్నారు. గ్రామీణ జీవితానికి సంబంధించిన ప్రత్యేకాంశాలు, దళితుల సమస్యలు, మహిళలపట్ల వివక్ష, కష్టజీవుల జీవన పోరాటాలు, మధ్యతరగతి వారి ఊగిసలాట, నూతనార్థిక విధానాల దుష్ఫలితాలు, నైరాశ్య–వైరాగ్య భావనలలోని నిరర్థకత, అమర వీరుల సంస్మరణలు, రామాయణ, మహాభారత పాత్రలలో కొత్త కోణాల ఆవిష్కరణలు, సంఘ సంస్కరణోద్యమాల నేపథ్యాలు, కుల–మత ఘర్షణలు, అయోధ్య–గుజరాత్ మారణకాండలు, మానవ సంబంధాల ఆర్ద్రతలు, పిల్లల కలల లోకాలు మొదలగు అన్ని అంశాలపై అభ్యుదయ రచయితలు తమ కలాలను పరుగులెత్తిస్తున్నారనే చెప్పాలి.

ఎక్కడైనా అభ్యుదయ రచనలకు ఆధారం 'వాస్తవికత' అది రచయితలు మానవ జీవితంలోని అన్ని లోతులనూ తరచి సత్యాన్వేషణ చేయటానికి దోహదపడుతుంది. ఇలాంటి అన్వేషణ తమిళ సాహిత్యంలోనూ కొనసాగుతూనే వుంది. అయితే నేటి ప్రజల జీవితాల కేంద్ర బిందువులుగా మారిపోయిన పేదరికానికీ, సామాజిక అన్యాయాలకు వ్యతిరేకమైన పోరాటాలను సాహిత్యం తప్పనిసరిగా సమర్థవంతంగా ప్రతిబింబించాలి. ఇతర ధోరణులకు చెందిన రచయితలు ఇక్కడే సౌకర్యంగా జారుకొంటారు. అయితే తమిళ అభ్యుదయ రచయితలు ఈ అంశాలను తమ రచనలలో ఆత్మీయంగాను వుద్వేగపూరితంగానూ చిత్రిస్తున్నారు. ఇందులోనే వారి విశిష్టత సైతం వ్యక్తమవుతోంది.

వారు పలు విధాలైన విషయాలను తమ రచనలకుపయోగించుకోవటమేగాక, వాటి వ్యక్తీకరణకు వివిధ శైలులను కూడా వాడుకొంటున్నారు. ఉత్తరాల శైలి, స్వీయ చరిత్ర శైలి, అచేతన వస్తువులను కేంద్రబిందువులుగా చేసుకొని మానవ జీవితం వివరించే శైలి, అధివాస్తవికతతో వాస్తవికతను జోడించి వర్ణించే శైలి, స్వప్నావస్థను కలుపుకు వచ్చే శైలి ఇలా అన్ని విధాలుగా తమ రచనలకు మెరుగుపెట్టి ముందుకు తెస్తున్నారు. రానురాను వారి రచనలలో కృత్రిమత్వం తగ్గుతూ సహజత్వం, మృదుత్వం చోటు చేసుకొంటున్నాయి. కొన్ని నాటకాలైతే అద్భుతమైన వ్యంగ్యాత్మకతతో నిండి వున్నాయి.

తమిళనాడు అభ్యుదయ రచయితలు మరో మంచి పని కూడా చేస్తున్నారు. తమిళనాట విస్తృతంగా 'పాఠకులతో ముఖాముఖి' కార్యక్రమాలు ఏర్పాటు చేసి తమ కొత్త రచనలు చదివి వినిపిస్తారు. విజ్ఞులైన పాఠకుల సూచనల మేరకు తమ రచనలలో మార్పులు కూడా చేసుకొంటారు. ఇందువల్ల మరిన్ని మంచి రచనలు వెలువడే అవకాశాలు కలుగుతున్నాయి.

ద్రావిడ ఉద్యమం ఒకనాడు తమిళ సాహిత్యంపై చెరగని ముద్రవేసింది. ఉత్తమ రచనలలో, కవితలతో ఎందరో ప్రజలను చైతన్యవంతులు గావించారు. ఈనాడు ఆ పరిస్థితి లేదు. ద్రావిడ రాజకీయ పార్టీలు ఒకదానితో నొకటి పోటీపడుతూ పచ్చి అవకాశవాదంతో అభివృద్ధి నిరోధకులకూ, మతోన్మాదులకూ కొమ్ము కాయనారంభించినప్పటి నుంచి ఆ ఉద్యమానికి చెందిన కవులు, రచయితలు తమ పదునును, ప్రభావాన్నీ కోల్పోతున్నారు. ఆధునిక తమిళ సాహిత్యంలో వారు నామమాత్రావశిష్టులుగా మారిపోయే దృశ్యం కూడా సాక్షాత్కరిస్తోంది.

V

## చిట్లిన పదాలు

**దాట్ల దేవదానం రాజు**



కొన్ని పరిచయాల్ని
ముఖం ముందు
ముఖం వెనుకగా
అరగదీసుకోవడం

ఎదురుగా కనిపిస్తున్నా
మాయతెరలు కప్పుకుంటూ
చూడనట్టు నటించడం

సొంత అస్తిత్వాల్ని
నిర్లజ్జగా తాకట్టుపెట్టడం
లేదా తగలబెట్టడం

నిప్పుల్లో కాలుతున్నా
గొంతు పెగలకుండా
స్వర నాళాల్ని తెంపుకోవడం

గొప్ప కల కనడానికి
రెప్పలు పెరికివేసుకుని
ఎదురు చూడటం

అహాల్ని
ఒళ్ళంతా పులుముకుని
కనుబొమలు ఎగరేస్తూ
నిట్రాడలా నిలబడటం

నిశివీధిలో
రంగుల్ని పోల్చుకుంటూ
నడవడం

ఎక్కడికెళ్ళాలో
తెలియని చారలంటా
పయనించడం

ఎవరు నిమిత్తమాత్రులో
ఎప్పటికీ తేలకపోవడం

ఇహమూ పరమూ
కలిసొచ్చేలా
జోలె పట్టడం

ఇదంతా తాత్విక చింతన కాదు
దగ్గరవన్నీ
దూరంగా కనిపించే
కొన్ని ధర్మాలు, అంతే



Untitled-2 39 6/11/2002, 3:51 PM

## పరిశీలన

# విప్లవ కవిత్వం ఒక విమర్శనాత్మక పరిశీలన

*సమగ్రమైన విప్లవ పోరాటం ప్రజాపరంగా కొనసాగితే అంతే నిజాయితీగా బాధ్యతగా పరిపక్వమైన విప్లవ కవిత్వం వెలువడేది. కానీ ఈ రోజు ఒక విప్లవ లక్ష్యమున్నా, రాజకీయంగా ప్రజానుకూలమైన విప్లవ మార్గాన్ని (పంథాని) అనుసరించకపోవడంతో "విప్లవ కవిత్వం" కొంత ప్రాసంగికతను కోల్పోయింది. కేవలం 'విప్లవ కాల్పనికత'కే కట్టుబడి రాజకీయ పరిణామాలను విస్మరించింది.*

**నిఖిలేశ్వర్**

సామాజిక సమస్యల మూలాన జన జీవితం అతలాకుతలమవుతున్నపుడు ప్రజలు మౌలికమైన మార్పును కోరుకుంటారు. ఈ మార్పుకు రాజకీయ ఆర్థిక పరిష్కారాలు సమకూరినప్పుడే ఒక కొత్త పరిణామం నెలకొనే అవకాశాలుంటాయి. అలాంటి నూతన సామాజిక పరిణామాలను పసిగట్టి ముందు మేల్కొనేవాడు కవి. ప్రజల నాడిని పసికట్టి ప్రతిస్పందించే యుగద్రష్టగా కలంతో–గళంతో కవి పిలుపునిస్తాడు. ఆ పిలుపు విప్లవోద్యమంతో మమేకం కాగానే కవితాక్షరాలకు సార్థకత సమకూరుతుంది. పీడితుల గుండె సవ్వడిని పాటగా గానం చేయగానే సమష్టి పోరాటాలకు ఉద్రేకం–ఉత్సాహాలు తోడవుతాయి.

ఆధునిక తెలుగు కవిత్వంలో విప్లవోద్యమం ఒక సమగ్రమైన రూపంలో ప్రవేశించిక ముందే కొందరు తిరుగుబాటు బావుటాలను ఎగరవేసిన సాహిత్య వాస్తవాన్ని విస్మరించలేము.

అభ్యుదయ సాహిత్యోద్యమం శిథిలమవుతున్న దశలో స్తబ్ధతను చీలుస్తూ షాక్ ట్రీట్‌మెంట్‌గా తన అభివ్యక్తితో తిరుగుబాటు తత్వాన్ని ప్రబోధించింది. 1965 నుంచి 1968 మధ్య వెలువడిన మూడు సంపుటాలతోనే దిగంబరకవులు తెలుగు కవిత్వంలో నూతన అధ్యాయాన్ని లిఖించారు. రావలసిన సామాజిక–రాజకీయ విప్లవం కోసం సాహిత్య నేపథ్యాన్ని సృష్టించారు.

అప్పుడే "తిరగబడు" అనే పేరుతో మరింత స్పష్టంగా వరంగల్ కవులు కొందరు రాజకీయ కవిత్వంతో ముందుకొచ్చారు.

ఈలోగా 1967–69ల మధ్య శ్రీకాకుళం జిల్లాలోని గిరిజనులు కామ్రేడ్ వెంపాటపు సత్యం నాయకత్వాన గిరిజన రైతాంగ పోరాటాన్ని ప్రారంభించారు. నగ్సల్బరీ పోరాట పంథాలో ఈ గిరిజన ఉద్యమాన్ని విప్లవంగా మలిచే సాయుధ చర్య ఇందులో ముఖ్యమైన అంశం.

అంతకు పూర్వమే శ్రీకాకుళంలో పూజారిగా జీవితాన్ని ప్రారంభించిన సుబ్బారావు పాణిగ్రాహీ ఒడియా, తెలుగు భాషల్లో కమ్యూనిస్టు ఉద్యమాల ప్రేరణతో కవిత్వం రాస్తున్నాడు. స్కూలు మేష్టారుగా ఉద్యోగం చేస్తున్న వెంపటాపు సత్యం మార్క్సిస్టు–లెనినిస్టు–మావో ఆలోచనా విధానంతో చారు మజుందార్ పంథాలో సూటిగా సూటుగా "కొండజాతి పేద రైతా" అని పిలుపునిస్తూ సాయుధ పోరాట కవిత్వాన్ని రచించాడు. పేద రైతులు రాజ్యాధికారాన్ని హస్తగతం చేసుకోవడానికి భూస్వాముల నిర్మూలన తప్పదని నమ్ముతూ ఇలా అంటాడు.

ఆ రక్తపు మడుగులోన
నిజ శక్తితో రాజ్యము స్థాపించవోయి
రాజ్యము లేనిదే నీ బ్రతుకున కిక
లేదు లేదు సుఖము
పోరుసల్పి నీరాజ్యము దెచ్చి
పొందవయ్యు సుఖము
ఖతం ఖతంబను నినాదమ్ముతో
కదలర రైతన్నా
కసితోడుగ భూస్వాములందరిని
ఖతం చేయరన్న
ఆ ఖతమే నీ ముక్తికి బాట
ఖతమే నీ ముక్తికి బాటని
తెలుసుకొమ్ము రైతా..."

కమ్యూనిజంలోకి వచ్చి, కమ్యూనిస్టు విప్లవ కవిగా ప్రజల సమస్యల నుంచి మారిన ఉదంతమిది. అయితే విప్లవ నిర్మాణ క్రమంలో వ్యక్తివాద ఖతం కార్యక్రమానికి ప్రాధాన్యతనిచ్చి తాత్కాలిక ఫలితాలను ఆశించి విస్తృత ప్రజాపోరాటాన్ని విస్మరించాడు. దుస్సాహసిక చర్యలతో ప్రజలను దూరం చేసుకున్నారు.

ఇదే క్రమంలో అదే పంథాను అవలంబించిన సుబ్బారావు పాణిగ్రాహి సాహిత్య సంస్కారం భిన్నమైనది. శ్రీకాకుళ గిరిజన రైతాంగ పోరాటంతో తొలిదశ (1967 పూర్వం) చూసి ఇక సంస్కరణలతో ప్రయోజనం లేదని భావించి సాయుధదశ తప్ప మరో మార్గంలేదనే నిర్ణయానికి చేరుకున్నాను. మలిదశలో ''జముకల కథ'' అనే ప్రజాకళారూపం ద్వారా రాజకీయాలు బోధించి ప్రదర్శించి కళాకారుడైనాడు. "ఎరుపు" గీతం రాసి తెలుగులో కలకాలం నిలిచే విప్లవ కవితాత్మతో అమరుడైనాడు.

"ఎరుపంటే కొందరికి
భయం భయం
పసి పిల్లలు వారికన్న
నయం నయం
సూర్యునిలో తొలికాంతి
ఎరుపుమయం
ఎరుపులోని ఆనందం
అతిరమ్యం
ప్రకృతిలో పూలు
ఎరుపు మందారం
స్త్రీలనుదుటి తిలకం
ఎర్రని సింధూరం
ఎరుపురంగు ఎన్నటికీ
కాదు అపాయం
అపాయాన్ని తప్పించే
ఒక సదుపాయం
మనలోనె ఎరుపున్నది
మరచిపోకుమా
మన రక్తం ఎరుపు ఎరుపు
తీసి చూడుమా
ఎరుపులోనే మెరుపుంది
పోరాడే శక్తుంది
శ్రమ జీవుల హక్కులకై
ఎలుగెత్తే అరుపుంది

– పాణిగ్రాహి



Untitled-2 40 6/11/2002, 3:51 PM

విప్లవ కార్యాచరణకు ప్రత్యక్షంగా దోహదం చేసే పాటలు-గేయాలు రచించిన సత్య-పాణిగ్రాహీలు వర్గదృక్పథాన్ని సూటిగా రాజకీయ పదజాలంతో వ్యక్తం చేశారు. తెలుగు కవిత్వంలోకి పోరాటతత్వం ఒక నూతన అభివ్యక్తితో దూసుకొచ్చింది. ఈ సమాజాన్ని సమూలంగా మార్చే దిశలో ప్రారంభమైన అభ్యుదయ సాహిత్యోద్యమం నీరసించినపుడు సమకాలీన దోపిడిని అవతం చేసే క్రమంలో ఆవేశంతో కవిత్వాన్ని ఒక పోరాట సాధనంగా ఉపయోగించుకున్న ప్రత్యేకత ఈ విప్లవోద్యమానికి వుంది.

"భూస్వాముల అప్పునబడి కదలలేని వాడా
భూమంతా నాదేనని ఎదురించగలేవా
ధనవంతుల బందీవై మూగబోయినోడా
శ్రమజీవుల హక్కులకై పోరాడగలేవా
ఈ పీడన మనకెందుకు? ఈ పాలన మనకెందుకు
భవిష్యత్తు మనదేనోయ్
ఈ విపత్తు ఇకరాదోయ్" అంటూ

ఒక చారిత్రక ఆశావాదంతో పాణిగ్రాహి గీత రచన సాగింది. శ్రమజీవుల రాజకీయాధికారం కోసం ఆయన కవితా రచన కొనసాగింది.

తెలుగు కవితా రంగంలో 1970లో విప్లవ రచయితల సంఘం (విరసం) స్థాపించే నాటికి ముందే సాయుధ పోరాటమే పరిష్కారమని "మార్చ్" కవితా సంకలనం వెలువడింది. "ప్రజలను సాయుధం చేస్తున్న రివల్యూషనరీ నేడు కవి" అనే కవితా నినాదంతో భావావేశంతో క్రాంతి పతాకాన్ని ఎగురవేసింది.

అయితే భూమి, భుక్తి విముక్తి కోసం ఒక వైపు పునాది వర్గాల ప్రజల ఆకాంక్షను ప్రతిఫలింపచేసిన శ్రీకాకుళ ఉద్యమ కవిత్వం సాహిత్యపరంగా అంతగా గుర్తింపు పొందలేదు.

మధ్య తరగతికి చెందిన కవులు భాషాపరంగా శిల్పపరంగా వచన కవితా రూపంలో తమ భావాలను వ్యక్తం చేసి, ఉద్యమంలో విప్లవకారులే కవులుగా, కవులే విప్లవకారులుగా పరిణతి చెందాలని ఉద్బోధించి సాహిత్య గౌరవం సాధించారు కొంత వరకు!

ఈ పరిణామక్రమంలోనే నగ్జల్బరీ- శ్రీకాకుళం పోరాట స్ఫూర్తితో 'విరసం' 1970 ప్రారంభంలోనే తన ప్రణాళికను ఇలా వివరించింది.

"సంస్కరణ వాదానికి కాలం చెల్లిపోయింది. సాంస్కృతిక వ్యవహారాల్లో నిస్తబ్దత పేరుకొని వుంది... అన్ని జీవిత రంగాల్లోలాగానే సాహిత్యంలో కూడా విప్లవానుకూల్యం సనసన్నగా చొచ్చుకవచ్చి బలపడుతున్న ప్రస్తుత చారిత్రక దశలో శ్రామికవర్గ విప్లవ చైతన్యానికి పీడిత ప్రజల పోరాట పటిమను పెంపొందించేందుకు సాంస్కృతిక విప్లవకర శక్తుల ఆవిర్భావం చారిత్రకావసరమే అవుతుంది".

"సాహిత్యంలో భావవాద, ఆధ్యాత్మిక ధోరణులు, మార్మిక వాదచ్ఛాయలను ఎదుర్కొని హేతువాద, భౌతికవాద దృక్పథాలను బలపర్చాలి."

''అనర్థకమైన విశృంఖలతనుగాని, నిరర్థకమైన శృంఖలాబద్ధతనుగాని నిరాకరించి వస్తువుకి, రీతికి ఉజ్వలమైన సమ్మేళన కలిగేట్లు విప్లవ సాహిత్యం విస్తరించాలి"

సాహిత్యపరమైన ఈ మార్గదర్శక సూత్రాల ద్వారా 'విరసం' తనదైన పద్ధతిలో విప్లవోద్యమాన్ని కవితా ప్రక్రియలో ప్రతిధ్వనింపచేసింది.

............ O ............

**మధ్య తరగతికి చెందిన కవులు భాషాపరంగా శిల్పపరంగా వచన కవితా రూపంలో తమ భావాలను వ్యక్తం చేసి, ఉద్యమంలో విప్లవకారులే కవులుగా, కవులే విప్లవకారులుగా పరిణతి చెందాలని ఉద్బోధించి సాహిత్య గౌరవం సాధించారు కొంత వరకు!**

............ O ............

రాజకీయాలకు సాహిత్యం అతీతం కాదని గాఢంగా విశ్వసించి 1976 నాటికి మార్క్సిజం లెనినిజంతోపాటు మావో ఆలోచనా విధానాన్ని తన ప్రణాళికలో చేర్చుకున్నది. అనుభవాల నుంచి భౌతిక పరిస్థితుల నుంచి గుణపాఠాలు స్వీకరిస్తూ మార్క్సిజాన్ని క్రియాశీలమైన చలన సిద్ధాంతంగా అభివృద్ధి చేయాలని నమ్మినా ఆచరణలో విరుద్ధంగా ప్రవర్తించారు. ఆ తర్వాత వచ్చిన చారిత్రక పరిణామక్రమంలో కమ్యూనిస్టు విప్లవ సిద్ధాంతాన్ని అన్వయించే ప్రక్రియలో కేవలం "విప్లవ కాల్పనికత"కు బలై ప్రజల భావాలను యథార్థ జీవన పరిస్థితులను రాజకీయంగా అంచనా వేయడంలో విఫలమైనారు.

అభ్యుదయ సాహిత్యోద్యమం నాటి మహాకవి శ్రీశ్రీ 1970లోనే "విరసం" అధ్యక్షుడిగా తన చారిత్రక పాత్రను నిర్వహించారు. అప్పుడే వెలువడిన "ఝంఝ" కవితా సంకలనం ఆనాటి తెలుగు కవితా రంగాన్ని ఝంఝూ మారుతంగా ఊపి, పాలక వర్గాన్ని కలవర పెట్టింది. ఫలితంగా ప్రభుత్వం ఆ సంకలనాన్ని నిషేధించింది. ఆ తర్వాత కవులను అరెస్టు చేసి జైల్లో నిర్బంధించింది.

ఆ సంకలనంలోనే మహాకవి శ్రీశ్రీ "ఝంఝ"లా ఘోషిస్తూ

"... గతాన్ని నెమరేసుకోవడం
మానేసుకొమ్మన్నాను
మొరపెట్టాను
మొత్తుకున్నాను
మెత్తగా బతిమాలుకున్నాను
విన్నారు కారు
వేళాడుతున్నారు
భూతకాలం చూరుపట్టుకొని
విలువలకి వింత వ్యాఖ్యానాలు చేస్తున్నారు
పాతని బతికించడానికి
కొత్త చిట్కాలు వెతుకుతున్నారు
కొత్తవి హతమార్చడానికి
పాత కత్తులు నూరుతున్నారు"

అని ఉవ్వెత్తుగా లేచి ఉద్రేక తరంగాల తురంగాలతో శ్రీశ్రీ తనదైన శైలిలో

ఆగ్రహం కొరడాని చేబూని
సాయుధ విప్లవ బీభత్సుని సారథినై
భారత కురుక్షేత్రంలో
నవయుగ భగవద్గీతా ఝంఝుని ప్రసరిస్తాను
మంటల చేత మాట్లాడించి
రక్తంచేత రాగాలాపన చేయిస్తాను

అనే రాజకీయ కవితాశయంతో విప్లవ జెండాను ఎగురవేశాడు. అయితే శ్రీశ్రీ మహాభారతంలోని సారథి-భగవద్గీత లాంటి సాంప్రదాయకమైన ప్రతీకలే వాడినా 'మంటల చేత మాట్లాడించి రక్తం చేత రాగాలాపన చేయిస్తాను'' అనే కవితాభివ్యక్తి విలక్షణంగా నిలిచిపోయింది.

20 మందికి పైగా కవులు విభిన్న శైలీ సంవిధానాలతో విప్లవ కవితా ప్రమాణాలను నెలకొల్పారు. కొత్త గుండెల చప్పుడు వింటారా అనే ముందు మాటతో కె.వి. రమణారెడ్డిగారు 'శ్రామిక విప్లవ విజయానికి సాహిత్యాన్ని కూడా ఒక ఆయుధ విశేషంగా చేసుకున్నారని



Untitled-2 41 6/11/2002, 3:51 PM

చెబుతూ ఈ కవితాలన్నీ "చరిత్రగర్భంలోని పరిణామ శిశువు హృదయ స్పందనల్లాంటివి అని అభివర్ణించారు.

ఇదే సంకలనంతో "భయం" శీర్షికన నిఖిలేశ్వర్ విప్లవ పోరాటక్రమంలో 'భయం' ఏయే కోణాల్లో మనిషి శాసించి నడుపుతుందో వెల్లడిస్తాడు.

భయం చావులాంటిది
వచ్చే ఉపద్రవాన్ని
ఊరించి ఊరించి
నరాలలో నీరు పారిస్తుంది

అని భయం స్వభావాన్ని చావుతో ముడిపెట్టి వివరిస్తాడు. కొల్లగొట్టే శక్తులనే భయం సమూలంగా పెకిలించివేయగలదనే విశ్వాసంతో

"రోజూ ఎందరో చస్తారు
కొందరు అమాయకంగా
కొందరు అనామకంగా
మరికొందరు భయంకరంగా
ఇంకా కొందరు యాంత్రికమైన
చిత్రహింసలకులోనై
తుపాకి గుండ్లు భరిస్తారు..."

సి. విజయలక్ష్మీ, వరవరరావు, జ్వాలాముఖి, శివుడు, లోచన్ తదితరులున్న ఈ సంకలనంలో ప్రత్యేకించి వెంపటాపు సత్యం బలిదానాన్ని పంచాది నిర్మల కృష్ణమూర్తి అమరత్వాన్ని తమదైన బాణిలో భాషలో కవిత్వీకరించిన కవులు ఇద్దరు జ్వాలాముఖి ఆకాశం ఎఱ్ఱబడుతుంది. ఆ త్యాగధనులంతా/నిర్మల నక్షత్రాలు/సంపూర్ణ మానవతా మూర్తులు చీకటిని ఛేదిస్తున్న రాత్రి భాస్కరులు/ పామరగణాలను పదిలపరుస్తున్న గణపతులు లక్ష నక్షత్రాలు రాలందే/ఉజ్వల ఉదయం ప్రవహించదు ఉజ్వల ఉదయానికి/నక్షత్రాలకు వంతెన వేద్దాం.శివుడి రచన "సత్యం చావదు(డు)" ఈ దేశంలోని వర్తమానాకాశం ఉదయిస్తోన్న నూతన మానవునికి మహోజ్వల సంకేతం "భాస్కరుడు" అనే వివరణతో కవి శివుడు అనే 'శివసాగర్' తెలంగాణా జానపద గీతాన్ని అనుసరించి పీర్ల పండుగనాటి 'ధూల' బాణిలో 'నరుడో! భాస్కరుడా!' అనే పాటను శ్రీకాకుళ సాయుధ పోరాటం'లో అమరులైన కామ్రేడ్ చాగంటి భాస్కరరావు తదితరులను ఆదర్శంగా కీర్తించాడు.

ఇక ఇదే వొరవడిలో 1971లో తిరుపతి నుంచి వచ్చిన "లే" కవితా సంకలనం కూడా స్వల్ప కాలంలోనే రెండు ముద్రణలు పొంది సర్కారు వారి నిషేధానికి గురైంది.

"లే! సమయమిదేలే అనే శ్రీశ్రీ పిలుపుతో ఇదే కవితా సంకలనానికి "విప్లవ కవిత్వం ఎలా వుండాలి" అనే విమర్శనాత్మక విశ్లేషణతో త్రిపురనేని మధుసూదనరావు ముందుమాట రాశారు.

విప్లవ రచన అనగానే సాంఘిక దృక్పథం, సాహిత్య దృక్పథం రెండూ వుంటాయని ఆయన విపులీకరిస్తూ చివరగా విప్లవ కవికి వుండవలసిన లక్షణం ఏమిటో విస్పష్టంగా ఇలా అంటారు.

"ప్రిస్క్రిప్షన్ ఇచ్చినంత మాత్రాన ఎవడూ మంచి డాక్టరు కాలేదు. దాని ఫలితాన్ని కూడా గ్రహించినపుడే, పరిశీలించినపుడే సరైన పద్ధతవుతుంది. సాహిత్య దృష్టితో రచన ఎంత కళాఖండమైనా సాంఘిక దృక్పథంలేనపుడు అది అధమ రచనే అవుతుంది. సాంఘిక కళాత్మక విలువలు ఏకమై సామాన్య జనాన్ని విప్లవ ప్రభావంతో ప్రభావితం చేయగలిగిందే విప్లవ రచన అవుతుంది"

............ O ............

**సామాజిక కళాత్మక విలువల సమన్వయాన్ని ఆశించిన విప్లవ కవిత్వంలో చెరబండరాజు, శివసాగర్, గద్దర్, వంగపండు ప్రసాదరావు తదితరులు జన సామాన్యాన్ని ఆకట్టుకోడానికి ప్రజల భాషలో ఆయా జానపద బాణీలకనుగుణంగా గీతాలు అల్లి ఆడి పాడి విప్లవోద్యమ కర్తవ్యాన్ని తమ పద్ధతిలో నిర్వహించారు.**

............ O ............

సామాజిక కళాత్మక విలువల సమన్వయాన్ని ఆశించిన విప్లవ కవిత్వంలో చెరబండరాజు, శివసాగర్, గద్దర్, వంగపండు ప్రసాదరావు తదితరులు జన సామాన్యాన్ని ఆకట్టుకోడానికి ప్రజల భాషలో ఆయా జానపద బాణీలకనుగుణంగా గీతాలు అల్లి ఆడి పాడి విప్లవోద్యమ కర్తవ్యాన్ని తమ పద్ధతిలో నిర్వహించారు. ప్రజా కళారూపాలను మలచుకున్నారు.

"ఉద్యమ నెలబాలుడు"గా ప్రసిద్ధికెక్కిన శివుడు 'శివసాగర్'గా తెలుగు విప్లవ కవిత్వంలో తనదైన ప్రత్యేక స్థానాన్ని స్థిరపరచుకున్న విప్లవకారుడైన కె.జి. సత్యమూర్తి కలంపేరు. "మార్చ్" కవితా సంకలనం నుంచి పరిణతి పొందుతూ తన విప్లవోద్యమ రహస్య జీవితంలోని అనుభవాలను రంగరించి జానపద బాణీలలోని సజీవ లక్షణాన్ని కళాత్మకంగా, సమన్వయించగలిగారు.

ఐదు అరణ్యాలు దాటి
ఐదు శత్రు శిబిరాలు దాటి
రేచుకుక్కల్లాంటి అవరోధాలను దాటి
పది వసంతాల కోసం
పది శిశిరాలను దాటి
సదలని దీక్షతో..."

"శివసాగర్" గత మూడు దశాబ్దాల కాలంలో కమ్యూనిస్టు విప్లవకారుడిగా అనేక రకాల దశలు దాటి మలుపులు తిరిగినా తన మౌలికమైన "విప్లవ కాల్పనికతను" కవిత్వంలో మరచిపోలేదు. ఆయన మలిదశ మాత్రం వివాదాస్పదమైన పరిణామం!

"ఉరికంబం మీద నిలిచి ఊహాగానం చేసెద
నా ఊహల ఉయ్యాలలోనే మరో జగతి వూసులాడు"

అంటూ ఉరికంబమెక్కిన విప్లవకారుడి మనోగతాన్ని అనంతమైన విప్లవ ఆశావాదాన్ని ఉరిపాటగా రచించారు. శిల్పగతంగా ఈ పాటలూ చివర ఉరితీస్తుండగా "వీడ్కోలు... వీడ్కోలు అంటూ అంతిమ శ్వాసను విడిచే క్రమంలో నాటకీయత వుంది.

"మృత్యువుముఖాన నిలిచి
జీవన గీతిక పాడెద
నవజీవన గీతిక పాడెద
వీడ్కోలు! వీడ్కోలు
వీడ్కోలు ఉరికొయ్యకు
ఉరితాళ్ళకు వీడ్కోలు
జైలు గోడ వీడ్కోలు
పాము పడగ వీడ్కోలు"

అనే పంక్తుల్లో భిన్నమైన స్వగతంలోని 'ఎలిజీ' ధ్వనించింది.

సాహిత్యపరంగా కవిత్వం ఒక విప్లవ వాహికగా శబ్దాయుధంగా పరిణతి చెందిన క్రమాన్ని మనం గత మూడు దశాబ్దాల కాలంలో మరీ ముఖ్యంగా 1970 నుంచి 1980 దాకా ఆ తర్వాత 1990 వరకు గమనించ వచ్చు.

శ్రీశ్రీ "మరో ప్రస్థానం", చెరబండరాజు "పల్లవి", వరవరరావు "స్వేచ్ఛ","భవిష్యత్తు చిత్రపటం", నిఖిలేశ్వర్ "మండుతున్నతరం, అజ్ఞాత సూరీడు", "పాట వెన్నెల మీద నడుస్తుంది" మొదలైన కవితా సంపుటాలను



Untitled-2 42 6/11/2002, 3:51 PM

విమర్శనాత్మకంగా పరిశీలిస్తే కవితా వైవిధ్యంతోపాటు విప్లవ వాస్తవికత బోధపడుతుంది.

“బొట్టు బొట్టుగా నా నెత్తుటిని
ఈ నేల విముక్తి కోసం విత్తనంగా చల్లుతాను
బందీనైనా బానిసనుగాను
నన్ను కదిపినా ఖండించినా
మళ్ళీ మళ్ళీ అలలా పుట్టుకొస్తూనే ఉంటాను”

చెరబండరాజు ఈ కవితా ఖండికలో తన అపారమైన ఆత్మ విశ్వాసాన్ని వెలిబుచ్చి విప్లవ నిబద్ధతను నిరూపించుకున్నాడు.

.............. O ..............

**విప్లవ కాల్పనికత అవసరమే అయినా అది చివరికి ప్రజల జీవన స్థితిగతులను, మానిసక సంసిద్ధతను విస్మరించి నేలవిడిచి సాము చేస్తూ కవితాకాశంలో దారి తప్పిపోయింది.**

.............. O ..............

ఇక 1980వ దశకంలో విప్లవ కవిత స్వరూప స్వభావాలు మారిపోయిన క్రమాన్ని “విరసం” ప్రచురించిన “కవిత్వంపై ఎర్రజెండా” సంకలనం ముందుకు తెచ్చింది.

“మాయమైన గుండె స్థానంలో
మండుతున్న సూర్యుణ్ణి ప్రతిష్టించుకొని”

గన్ను పట్టిన చేత్తోనే పెన్ను పట్టి తమ ప్రత్యక్ష అనుభవసారాన్ని కవిత్వంగా చెప్పిన విప్లవకారులు... జ్ఞానేశ్వర కీర్తి, తిరుపాల్, రిక్కల సహదేవారెడ్డి ఎం.ఎస్.ఆర్., సముద్రుడు, అజ్ఞాత సూరీడు తదితరులంతా “విప్లవయంత్రానికి సాహిత్యం కళలు పళ్ళ చక్రాల్లాంటివని (లెనిన్) కవిత్వం ద్వారా నిరూపించారు. ఇదే సంకలనంలో విప్లవ కవులు రూపాన్ని, శిల్పాన్ని నిర్లక్ష్యం చేయలేదు అనే వ్యాఖ్యానానికి నిదర్శనం. ఈ కవితాత్మక చరణాలను పేర్కొనవచ్చు.

“నడిరేయికి ఉదయానికి తేడా మనిషి శవమై వేలాడటమేనని స్తంభం రుజువు చూపుతోంది”

“ఖాళీ అయిన రోడ్ల నిండా వాడు ఆకలై ప్రవహిస్తాడు”

“మా గోదావరి పోరు గల గల ముందు నీ బూటకపు ఎన్‌కౌంటర్ల మోత వెలవెల బోతుంది”

“శ్రీకాకుళం” అనే శీర్షికన ఛాయారాజ్ శ్రీకాకుళ గిరిజన ఉద్యమాన్ని మొదటి ఆ తర్వాతి దశలను సూచిస్తూ ఉద్యమ కథా కావ్యంగా మలచాడు.

“ఆకు మాటున అడవి నిశ్శబ్దంగా వుంది
అక్కడ ఈనెల నుండి ఈటెల నందుకొనే ఆందోళన వుంది.
బయటవున్న బతుకు అడవి
అడవి బాంబును అందుకొనే రాయబారంలా వుంది
ఆకు అద్దం రేపటి యుద్ధ బింబాన్ని పట్టుకొంది

ఛాయారాజ్ కావ్యం ఇలా కవితాత్మతో ప్రారంభమై “విరసం” కంటే భిన్నమైన రాజకీయ దృక్పథంతో శ్రీకాకుళ పోరాట చరిత్రను రికార్డు చేసే ప్రయత్నం చేసింది. అయితే ఆసాంతం కావ్యాత్మను పోషించలేక ఇది కొంత వచనంగా తేలిపోయింది.

ఇక్కడే ఒక అంశాన్ని స్పష్టం చేసుకోవాలి. ‘కాల్పనికత’ లేకుండా కవిత్వం సాధ్యంకాదు. అందులో విప్లవకాల్పనికత” అనేది విప్లవ కవిత్వానికి జీవం పోస్తుంది. అయితే విప్లవ బాధ్యతను విస్మరిస్తే అదే కవిత్వం ‘వీరోచిత చర్యల’ను కీర్తిస్తూ కేవలం రొమాంటిసిజానికి బలైపోతుంది.

గత మూడు దశాబ్దాల విప్లవ కవితోద్యమం అనేక రకాల ఆటుపోట్లకు గురైన యధార్థాన్ని మనం గమనించాలి. మౌలికంగా విప్లవమనేది అత్యంత శక్తివంతమైన రాజకీయ ప్రక్రియ. ప్రపంచాన్ని ఇదే ఒక క్రమానుగతిలో సజీవంగా వుంచే శక్తి అనే వాస్తవాన్ని గత శతాబ్దంలో చరితార్థమైన వివిధ విప్లవాలు చూపుతున్నాయి. ఈ విప్లవ శక్తి సామాన్య జనానికి ప్రాణం లాంటిది. దారుణమైన వ్యత్యాసాలతో నలిగిపోతున్నామన్న అసమ సామాజిక వ్యవస్థకు ఈ విప్లవ చైతన్యమే ఆశాదీపం! ఈ చైతన్యంలోనే వ్యక్తి అనుభవాలు-అనుభూతులు రూపుదిద్దుకుంటాయి. కళా ప్రయోజనానికి, శిల్పానికి ఈ చైతన్యమే ప్రాణాధారం.

ఇలాంటి ప్రాణాధారమైన విప్లవ స్ఫూర్తిని స్థూలంగా ఆధునిక తెలుగు కవిత్వం క్రాంతి పతాకంగా ఎర్రజెండా ఎగురేసినా రాజకీయంగా-సాంస్కృతికంగా విభిన్న శిబిరాలుగా విడిపోయింది. విప్లవ పోరాటాన్ని శ్రామికుల రైతుల గిరిజనుల ఆయుధంగానే గ్రహించినా, సమగ్రమైన సమైక్య ప్రజా విప్లవ పంథాను దర్శించలేకపోయింది.

సాహస చర్యలను కీర్తిస్తూ, అమరవీరుల త్యాగాలకు ఎలిజాలు, విషాదగీతాలు ఆలపిస్తూ ఒక్కో దశలోఆయా గ్రూపు రాజకీయాలకు బలైపోయింది. విప్లవ కాల్పనికత అవసరమే అయినా అది చివరికి ప్రజల జీవన స్థితిగతులను, మానిసక సంసిద్ధతను విస్మరించి నేలవిడిచి సాము చేస్తూ కవితాకాశంలో దారి తప్పిపోయింది.

ఇక సాహిత్యపరంగా ఒక అతిముఖ్యమైన అంశాన్ని వస్తుపరం(objective)గా పరిశీలించవలసి వుంది.

కవులు విప్లవోద్యమ నిర్మాణం తొలి నాళ్ళలో భావావేశంతో ఉత్తేజంతో రచనలు చేశారు. కానీ ఒక స్థిరమైన విప్లవ కమ్యూనిస్టు పార్టీ నిర్మాణం తొలి దశలోనే ఆగిపోవడంతో ఎత్తుగడలు, వ్యూహాలు చర్చల్లో రాజ్యస్వభావ నిర్ణయంలో విప్లవకారులు ఆయా గ్రూపులుగా విడిపోయారు. అవగాహన విషయంలో తీవ్రమైన భేదాభిప్రాయాలు చోటు చేసుకోగా, వాటి ప్రభావం విప్లవ రచయితలపై కూడా ప్రసరించింది.

అసలు కొన్ని సాహస చర్యలు, చెదురుమదురు సంఘటనలతోనే విప్లవోద్యమం ప్రజాబలంగా పురోగమించగలదనుకుంటే ఈపాటికి గడచిన మూడు దశాబ్దాల కాలంలో ఒక పటిష్టమైన విప్లవ పార్టీ ఏర్పడేది. కానీ వివిధ రాజకీయ-ఆర్థిక పరిణామాల మూలంగా ఈ దేశంలో ఈనాటికీ విప్లవోద్యమం ఆ తొలి దశలోనే వుంది. విప్లవ అనుభూతితో రచనలు చేస్తూ వచ్చిన కవులు తమ కాల్పనికతను, భావుకతను వదులుకోలేక, దుస్సాహసిక చర్యలను కీర్తిస్తూ యదార్థాన్ని విస్మరించారు.

విప్లవోద్యమ నిర్మాణంలో రాజకీయంగా కాలానుగుణంగా వ్యూహం, ఎత్తుగడలు వుంటాయి. టెర్రరిజానికి తావుండదు. టెర్రరిజాన్ని ఆశ్రయిస్తే పోరాడవలసిన ప్రజలకు దూరమై కేవలం వార్‌గా నిరర్థక విధ్వంసకాండగా మిగిలిపోతున్నదనే చేదు నిజాన్ని కొందరు “విప్లవ కవులు” ఇప్పటికే అంగీకరించే స్థితిలో లేరు. సమగ్రమైన విప్లవ పోరాటం ప్రజాపరంగా కొనసాగితే అంతే నిజాయితీగా బాధ్యతగా పరిపక్వమైన విప్లవ కవిత్వం వెలువడేది. కానీ ఈ రోజు ఒక విప్లవ లక్ష్యమున్నా, రాజకీయంగా ప్రజానుకూలమైన విప్లవ మార్గాన్ని (పంథాని) అనుసరించకపోవడంతో “విప్లవ కవిత్వం” కొంత ప్రాసంగికతను కోల్పోయింది. కేవలం ‘విప్లవ కాల్పనికత’కే కట్టుబడి రాజకీయ పరిణామాలను విస్మరించింది.

విగ్రహ విధ్వంసం, అతివాదం ‘రొమాంటిక్’గా సాహసమే కావచ్చు కానీ విప్లవ పోరాటం కాదు. విజయాలు కనుమరుగైనా, ప్రజలు దూరమైనా, వైఫల్యాలే మిగిలినా అనుభూతి దీర్ఘకాలికం కావాలనుకోవడం ‘కాల్పనికత’లోని నిస్సహాయస్థితి!!

V



Untitled-2 43 6/11/2002, 3:51 PM

కథ

వేంపల్లె షరీఫ్



# రజాక్‌మియా సేద్యం

***"మన్న మొలిచినట్టు లేదు అప్పుడే సెనిక్కట్టె ఎండకు ఎఱ్రగా మలమలా మాడిపోతాండాది. నిన్న తెచ్చినట్టు లేదు అప్పుడే ఇంట్లో నూకల మూటె దినదినానికి కరిగిపోతాండాది... ఏందిరా ఈ బతుకు?" అనుకున్నాడు రజాక్‌మియా నడిపొలంలో కూర్చోని సరస్వతి బీడి తాగతా.***

అతనికి మనసంతా ఇంట్లో అయిపోవచ్చిన నూకలమూటె మీద, సావుకొచ్చి తన కండ్ల ముందు కనబడుతున్న సెనిక్కట్టె మీద ఉంది. పంటను కాపాడుకోవాల – అప్పులోల్ల దగ్గర మానం నిలబెట్టుకోవాల. నూకల మూటె తెచ్చుకోవాల – ప్రాణాలు నిలబెట్టుకోవాల. ఇదే ఆలోచన అతనికి.

ఎండకు నూనెపూసిన నెత్తి చరచరా అంది. లేచి నీడ కోసం చూసాడు. చలమాడ్డి (చలమారెడ్డి) తోట్లో పొద్దు తిరుగుడు పంట ఇంతింత పూలతో హాయిగా ఊగతా పచ్చగా ఎలిగిపోతా ఉంది. రెడ్డికి మోటారుంది. ఆ పంట అలా ఉండడంలో ఆశ్చర్యమనిపించలేదు. రజాక్ మియాకి. మన్ననే బోరెత్తి పోతే మల్లా ఏయించాడు. భూముల మీద పెట్టుబడి పిచ్చపిచ్చగా పెడుతున్నాడు. వంద ట్రాక్టర్ల ఇసుక తోలించాడు. రాజకీయంగా మంచి పలుకుబడుతంది.

"అంత లెక్కనా దగ్గరుంటేనా? సొంత కష్టంతో నా ఐదెకరాల పొలాన్ని రెడ్డి కన్నా బాగా బొమ్మను చేద్దు." ఆ ఆలోచనకి మనసులోనే ముసిముసిగా నవ్వుకున్నాడు రజాక్ మియా.

చలమాడ్డి పొలానికి గట్టునే పెద్ద యాపచెట్టు. అది విశాలమైన నీడతో తనని రమ్మని పిలుస్తున్నట్లుంది. ప్రేమగా దాని వైపు చూస్తా కదిలాడు. అసలు ఆ చెట్టు బాగా గమనిస్తే ఒకప్పుడు రజాక్ మియా పొలంలో ఉండేది. చలమాడ్డి రోజురోజుకు తన కూలోళ్ళతో సరిహద్దు గెనాన్ని జరుపుకుంటా వచ్చి సిన్నగా సెట్టు తన పొలంలోకి వచ్చేట్టు చేసుకున్నాడు. ఇప్పుడైనా సర్వేరును పిలిపించి కొలతలు ఏపిస్తే సెట్టు తనకు రాకుండా పోదు. కాని దాని మూలంగా శానా గొడవలవుతాయి.

"ఇప్పుడు రెడ్లతో ఎందుకులే" అని ఎప్పటికప్పుడు సరిపెట్టుకుంటా వస్తున్నాడు రజాక్‌మియా. యాపసెట్టు కిందికి సేరుకునే సరికి గొర్లోల్ల పిల్లోడు అంజిగాడు అక్కడే కూసోనున్నాడు. వాడు చలమాడ్డి పొలానికి కాపలా.

"ఏం మామా. ఎండ పొద్దున యిట్టా ఎల్లబారినావు." కులమతాలతో సంబంధం లేకుండా (ఒక్క రెడ్డోళ్లను తప్పితే) అందర్నీ వరసలు పెట్టి పిలిచే అంజిగాడంటే అందరికీ ఇష్టం.

ఆ ఇష్టమే రజాక్‌మియాకు ఆ క్షణం కలిగింది. అంజిగాడి పలకరింపు యాపసెట్టు నీడ కన్నా సల్లగా అనిపించింది. తన గోడు ఆ పసివాన్తోనైనా కాసేపు పంచుకుందామనుకున్నాడు.

"లేలేత మొలకఱ్ఱా అంజిగా, కళ్ళముందే నీండ్లు ల్యాకసచ్చిపోతాన్నాయిరా. చలమాడ్డి తోట్లో ఉన్నట్లు ఉండాల్సింది పంట. సివరికి ఎల్టీన్ తాగాల్నో ఏమో" దీనంగా అన్నాడు రజాక్‌మియా.

అంజిగాడు కాసేపుండి నిట్టూర్చి "సాయిబులు మీకెందుకు మామా. సేద్యం అమ్మి పారేసి ఏ దుబాయికో, కోయిటుకో



Untitled-2 44 6/11/2002, 3:51 PM

పోకండా" అన్నాడు.

రజాక్ మియాకి బొటబొటా కన్నీళ్ళొచ్చేసినాయి. "అవును కరెక్టే. దుబాయికి పోవాల. కనీసం నా కొడుకునన్నా అంపాలా. పంటొస్తే అదే చేద్దామనుకుంటాండాను."

"పంటొస్తే కాదు మామా పంటలొస్తే దుబాయికి ఎందుకు ఓవాల సెప్పు. బూమమ్మేయ్ మామ. నువ్వెట్టా బోరేయలేవు. పంట తీలేవు. ఎందుకు దీన్నినమ్ముకుంటావు చెప్పు కాపోళ్ళంటే యాడాడ్నో తిప్పలు పడుకుంటా ఉంటారు."

"నిజమేరా సిన్నా. కాకపోతే భూమమ్మాలంటేనే ఇదిగా ఉందిరా. ఇది మా నాయన సంపాదించింది.

మా నాయనా, మలకోలపల్లి రెడ్డి భలే సవాసగాళ్ళు. మా నాయన అప్పుడు కుట్టుకుని చేసేటోడు. ఆడోళ్ళ రైగ్గుడ్డలు కుట్టుకున్నా మా నాయన వొడి రకరకాల తిండి గింజలతో నిండిపోయేదంటా.

ఒకనాడు మా నాయన్ను మలకోలపల్లి రెడ్డి పిలుసకపోయి "పిల్లల గల్లోనివి ఎందుకురా కష్టపడతావు. బతుక్కోఫో.." అని ఉత్తపుణ్యానికే నాలుగెకరాల పొలం రాయించినాడంటా. ఆ పొలమే రా ఇది. ఆ పొలంలోనే రా సెనిక్కాయ ఎండగాలి పోతాండేది. ఏమంటే దీనికి ఒక ఎకరా ఎగాస్టా చేసి మా నాయన నా సేతిలో పెట్టి సచ్చిపోయినాడు.

మా నాయన నన్ను ఎప్పుడూ దండిచ్చేటోడు. "ఆ మలకోలపల్లి రెడ్డి లాకపోతే నీకు బతుకెక్కడిదిరా నా కొడకా అని."

"మహానుబావుడు ఏ కల్మషం లేనోడు కాబట్టే మా ఇంట్లో దీపం పెట్టినాడు." అని మా నాయన ఇరవై నాలుగ్గంటలూ ఆ రెడ్డిని పొగుడుకుంటూ ఉంటే మాక్కూడా ఆ మహానుభావుడు దేవుడిలా కనిపిస్తాండె. ఇప్పుడు ఆ రెడ్లు లేరులే.

ఆడికి మా నాయనా అన్నాడంటా. "సాయిబూని, నాకెందుకు రెడ్డీ భూమి. చేసుకోను సేతైతదా, పాడా." అని.

"భూములు రెడ్లు, కాపోళ్లే సేయల్లని యాడన్నా రాసిపెట్నారా ఏంది." అని గదురుకున్నాడంటా ఆ రెడ్డి.

"ఈ బూమమ్మ తల్లికి అలాంటి బేదాలుండవురా. నాల్రోజులు మదక పట్నావంటే అన్ని పనులూ నీకే సేతవుతాయి" అన్నాడంటా.

మా నాయన మల్లా ఎప్పుడు కుట్టుపనికి పోలా. రైతైపోయినాడు ఎప్పుడూ ఆలోసన్లు. ఏ అదునుకు ఏదెయ్యాల అని ఆలోసించుకుంటా, పక్క రైతులతో తర్కించుకుంటా, రెడ్డితో సలహాలు తీసుకుంటా గడుపుతాండె. అప్పుడి రైతులు ఇప్పుడు లేరులే. సిన్నగా ఆ పనీ నేను కూడా నేర్సుకుంటి. ఇప్పుడు నేను దీన్ని అమ్మలేనురా. దుబాయిగ్గాదుకదా. మక్కాకు పోవాలన్నా అమ్మనురా. అదీగాకా ఇది నా సొమ్ము కాదురా" సివరిగా అన్నాడు రజాక్‌మియా.

"నువ్వలాగే అనుకుంటా అప్పులు జేస్తా ఉండు మామా. ఎప్పుడో ఒకసారి అప్పులోల్లొచ్చి దీన్ని రాయించుకొని పోతారు" అప్పుడు తెలుస్తాది నీకు.

సిన్నవాడైనా గొప్పమాటన్నాడు అంజిగాడు. యింగేం మాటాల్యాక పోయాడు రజాక్ మియా. సివరిసారి తన ఎండిపోయిన సెనిగిసెట్లను నిరాసగా చూసుకుంటా "ఇంటిగన్నా పోదాంరా. ఈడుండి ఏం జేయాల" అంటాకదిల్నాడు.

అంతలో అంజిగాడి దేవున్లా ఒక్కమాటన్నాడు.

"మారెడ్డిని అడక్కపోయినావా... ఒక తడవ నీళ్లిస్తాడేమో."



అంతే రజాక్ మియాకి కాళ్లు నిలవాల.

"మంచి ఐడియా ఇచ్చినావురా..." అంటా అంజిగాని పొగుడుకుంటా తన పంట పచ్చగైనట్టు ఊహించుకుంటా ఊర్లోకి పరుగందుకున్నాడు.

చలమారెడ్డి అంటే ఎవరురు? మధురెడ్డి బావ. ఇంట్లో నూకలైపోతే రజాక్ మియా ముందు మధురెడ్డి కాళ్లనే పడేది.

పరుగెత్తుతున్నవాడల్లా ఆగిపోయి నడవడం మొదలుపెట్టాడు. రజాక్‌మియా. అతనితోపాటు ఆలోచనలు కూడా సిన్నగా నడకందుకున్నాయి. నూకల మూటె అయిపోయినపుడు మధురెడ్డి అతనికి పెట్టే బాధలు తలుచుకుంటే వొళ్లు గుగుర్పొడుస్తుంది.

D D D

ఉదయానేపోయి మధురెడ్డి ఇంటి పంచలో కాపలా కూచ్చుంటాడు రజాక్ మియా. మధురెడ్డికి కొత్తగా పెళ్ళయింది. పెండ్లాంతో కలిసి పడుకున్నాడంటే ఎప్పటికి నిద్రలేస్తాడో తెలీదు. నిద్ర లేసినా ఏమూడులో ఉంటాడో.

'ఏందిరా నీ గోల. నీ ఇంట్లో బియ్యం అయిపోతే నన్నేం చేయమంటావు?' అని కసురుకుంటాడు బయటికొచ్చి.

'అది కాదురెడ్డీ...' అని నసుగుతాడు రజాక్‌మియా.

"ఏది కాదు. నీది పెద్ద పీకులాటైపోయిందేనాకు..." మధురెడ్డి గొంతు గయ్యిమంటాది.

రజాక్‌మియా చిన్నగా నోరువిప్పుతాడు. ఈసారి కూడా "అది కాదు రెడ్డీ..." అంటా మొదలు పెడతాడు.

"ముందు పంట బాగొచ్చేదనుకుంటే రాకుండా బాయా. సరిగా రాలా. నువ్వు కూడా చెప్పివిగదా పంట చూసి, యిసారి నూరు మూటెలకు తక్కువగావు శెనిక్కాయలు అని. సాయిబుగాడు లక్షాధికారైపోయినట్లే అని పరాసికాలు కూడా ఆడితివి. ఏంజేయాల రెడ్డీ నా ఖరమ అట్టుండాది. తీరా నోటికాడికొచ్చినాక వరదలొచ్చా. నా కొంప ముంచిపాయ. బిడ్డలు గలోన్ని అన్నీ తెలిసిన నువ్వు కూడా నన్ను దయజూపకపోతే ఏం తినాల రెడ్డీ. మా వోడా బడి నుంచి వచ్చానే అన్నం లాకుంటే తట్టుకోలేడు. ఎట్టోకట్టా ఈ నాన్నాళ్ళు ఆదుకున్నా వంటే ఈసారి పంటలో అంతా ఇచ్చేత్తా నీ రుణం ఉంచుకోను."

"అబ్బబ్బా చెబితే వినవుగదా. నీ గోడు నీదే. సాయంత్రం రోడ్డు పైకొచ్చాఫో. పులివెందులరోడ్డులో ఉందు." అంటా గుభిల్లున వాకిలేసుకొని మల్లా పెండ్లాం పక్కలోకెళ్ళి పండుకుంటాడు మధురెడ్డి.

రజాక్ మియా ఊపిరిపీల్చుకొని సాయంత్రం పులివెందుల రోడ్డులోకెళ్ళి అర్ధరాత్రి వరకూ ఎదురుచూస్తా కూచుంటాడు. మధురెడ్డి ఎప్పటికీ రాడు.

తెల్లారికండ్లు ఎర్రగా పెట్టుకొని రజాక్‌మియా మల్లా మధురెడ్డి ఇంటి ముందుకెళ్ళి నిలబడుతాడు.

"అబ్బా మర్సిపోయినా సాయిబు" అంటాడు సులభంగా మదురెడ్డి. ఆ మాటలకు రజాక్ మియా కండ్లల్లో నీళ్లూరిపోతాయి. అది మధురెడ్డి పసిగట్టకుండా తలకాయ నేలకు వంచుకుంటాడు.

"ఈ రోజు ఎట్టతిరిగి వచ్చా ఉండుపో" అని మల్లా ఇంట్లోకెళ్ళి వాకిలేసుకుంటాడు మధురెడ్డి.

ఆ రోజు సాయంత్రం మల్లా పులివెందుల రోడ్డులో పడి పడిగాపులు కాస్తాడు. చాలా పొద్దుపోయాక బండి మీద డుగ్ డుగ్ అనుకుంటా వచ్చి కనపడి మధురెడ్డి "ఇప్పుడు పోతే సెట్టిగాడు



Untitled-2 45 6/11/2002, 3:51 PM

యాడుంటాడు. అంగడి మూసేసుంటాడు. రేపు ఉదయానే పోదాం పో. చెప్తాను తీసుకెల్దువుగానీ." అనేసి ఎళ్ళిపోతాడు.

అక్కడ్నుంచి ఇంటికి తిరిగి రాబుద్దికాదు రజాక్‌మియాకి. అక్కడ్నుంచి అట్నే ఎక్కడికైనా ఎళ్లిపోదామనిపిస్తాది. మధురెడ్డి బియ్యం ఇప్పించినాకే ఇంటికి తిరిగొస్తామనిపిస్తాది. కాని ఎక్కడికెళ్తాడు. ఎన్నాళ్లెంది జేబులో డబ్బులు పెట్టుకొని.

మౌనంగా ఏవేవో ఆలోసించుకుంటా వచ్చి ఇంట్లో పెండ్లాం నూరుక్కూడా విషయం చెప్పకుండా ఆరుబయటే వున్న నులకమంచాన్ని వాల్చుకొని ఎల్లిలికల పడుకొని ఆకలి కడుపు పైకేసుకుంటాడు. విషయం అర్థమైన నూరు బయటిక్కూడా రాదు. కొడుకు షాబీర్‌ని తీసుకొని దేవుని మూల ముడుక్కోనుండిపోతాది.

మల్లా తెల్లారి కాళ్లీడ్చుకుంటా మధురెడ్డి ఇంటి పంచకు పోయి కూచ్చుంటే చాలా సేపటికి అతని పెండ్లాం బయటికొచ్చి "అరే! ఇప్పుడే పనుందని కడపకు పోయాడే!" అంటాది.

ఆ దెబ్బకు మళ్లీ లేవబుద్ది కాదు రజాక్‌మియాకి. "ఆ అరుగుమీదే పడుకోనుండిపోతే ఎప్పుడో ఒకసారి ఇంటికి వచ్చిన మధురెడ్డి తనని చూసి అయ్యోపాపమని లేపి బియ్యం మూటె ఇప్పించకపోడుకదా." అనుకుంటాడు. కాని అభిమానం అడ్డొస్తుంది. ముష్టోడికి తనకి పెద్ద తేడా ఉండదనిపించి అతికష్టం మీద అక్కడ్నుంచి లేచొచ్చి ఇంట్లో పడతాడు.



ఇంట్లో ఇనుపసామాన్లుంటే ఇనుపసామాన్లు, పాత వస్తువులుంటే పాత వస్తువులు అప్పటికి ఏవి అక్కరకు రాకుండా ఉంటే వాటిని ఎంతకు పడితే అంతకు అమ్ముకొని ఓ రెండు మూడు కేజీలు నూకలు కొనుక్కోని ఇంట్లో పడేస్తాడు.

నూరు చిటికెల మీద వాట్నందుకొని పొయ్యి మండిస్తుంది. నూకలు ఎప్పుడెప్పుడు దుకుతాయా గెలికేద్దామా అని ఎదురుచూస్తా గిన్నెలో ఒట్టి చాపల కారం పిసికేస్తాది. నూకలవగానే గబగబా గెలికేసి రేకుల్లో పడితే రేకుల్లో, మూతల్లోపడితే మూతల్లో రాగిపిండి కూడా వేయకుండా గెలికి ముద్దలు చేసి ఏసేస్తాది. ఆ పూట అందరూ ఆవురావురంటా పాణాలు నిలబెట్టుకుంటారు.

అది తిని హాయిగా చాన్నాళ్ళుంచి లేని కునుకు ఒకటి తీసి సాయంత్రంగా మల్లా మధురెడ్డి వేటలో పడతాడు రజాక్ మియా. ఏ దుకాణంలోనో బాతాఖానీ కొడతా, యవ్వారాలు చేస్తా మధ్య మధ్యలో "అ...హ్హా..హ్హా.." అంటా పెదపెద్దగా నవ్వుతా కనిపిస్తాడు మధురెడ్డి.

ఎళ్లి మధ్యలో డిస్టర్బ్ చేస్తే యాడ మల్లా అసలుకే ఎసరొస్తాదోనని బిక్కుబిక్కుమంటూ ముందుకెళ్ళి నిలబడుతాడు రజాక్‌మియా.

మధురెడ్డి గమనించి "ఎక్కడికిపోయావయ్యా. ఇప్పుడే నీ కోసం రోడ్డంతా తిరిగి వస్తాన్నా" అంటాడు ఊరికల్లా.

"ఆ శెట్టిగానికి చెప్పినా గానీ ఎళ్లి ఒక మూటె తెచ్చుకోపో." అంటాడు మల్లా సివరిగా.

"హమ్మయ్య మధురెడ్డి మదికాలాలు సల్లగా ఉండాలా" ఆ మాటలకి అంత వరకు అతను పెట్టిన కష్టాలన్నీ మర్చిపోయి అనుకుంటా ఇంటికొచ్చి షాబీర్ను తన ఫ్రెండుది సైకిల్ తీసుకురమ్మని చెప్పి పురమాయిస్తాడు రజాక్‌మియా.

చిటికెల్లో షాబీర్ సైకిల్‌తో రెడీ అయిపోతాడు. ఇద్దరూ ఆ సైకిల్‌ని దొబ్బుకుంటా పోయి అడ్డరోడ్డులో వెంకటేశ్వర హాలు దగ్గరున్న సెట్టి అంగడి ముందర ఆగుతారు.

రజాక్ మియా గబాగబా వచ్చిపోయే మనుషులతో బిజీగా ఉన్న సెట్టి దగ్గరికెళ్ళి సిన్నంగా "సెట్టీ! మధురెడ్డి చెప్పినాడు ఒక మూటె నూకల బియ్యం గావల్లా."

సెట్టి యాపారం రద్దీలో వినుకోడో, కావాలనే అలా చేస్తాడో వినసట్టే ఉంటాడు. అలా ఒక పదిసార్ల వరకూ రజాక్‌మియా చెవి దగ్గర మొత్తుకుంటే సెట్టిగాడు "ఆ...ఆ... చెప్పినాడు లేవయ్యా. కాసేపుందరాదా. ఉద్దరక్కూడా తొందరే" అంటాడు.

"ఉంటాను. నీవు విన్నావో లేదో అని" గొనుక్కుంటా ఎళ్ళి అంగడికి ఒక పక్కగా అంటరానివాడిలా నిల్చుంటాడు రజాక్‌మియా.

ఎప్పుడు తీరికైతే అప్పుడు సెట్టి "యింగరా" అంటా గోడౌన్లోకి తీసుకెళ్ళి మూటె జూపిస్తే షాబీర్, రజాక్ మియా జాగ్రత్తగా దాన్ని ఎత్తుకోనొచ్చి సైకిల్ బార్లో పెట్టుకుంటారు.

"సెట్టిగాని అంగిట్లో ఎన్ని బియ్యం మూటెలు...!" అని ఒకరి ముఖాలు ఒకరు చూసుకుంటా...

"ఇంగ వచ్చాం సెట్టీ" అంటా అక్కడ్నుంచి బయటపడతారు.

ఆ మాటకు సెట్టిగాడూ ఉలుకదు పలకదు.

D D D

అదీ కథ. ఇదంతా గుర్తొచ్చి రజాక్ మియాకు వొళ్ళంతా తేళ్లూ, జర్రులు పాకినట్లయింది. "ఏంది రా ఈ ముష్టి బతుకు" అనుకున్నాడు.

ఒకేసారి నాలుగైదు నూకల మూటెలు వేసుకుందామంటే మధురెడ్డి ఒప్పుకోడు.

సెట్టిగాడు అప్పివ్వడని దొంగ మాటలు చెబుతాడు. సెట్టిగాడు మధురెడ్డి ఇద్దరూ ఒక్కటే. మధురెడ్డి చెబితే చాలు. సెట్టిగాడు ఎన్ని బియ్యం అయినా అప్పు యిస్తాడు. వారిద్దరి మధ్య వున్న లింకు రజాక్‌మియాకు తెలియంది కాదు. కాని నోరు మెదపలేని పరిస్థితి. ఊరుకుండిపోతాడు.

ఇప్పుడు మధురెడ్డి బావ చలమాడ్డి దగ్గరికి నీళ్ళు కావాలా అని ఎళితే ఉత్తపుణ్యానికే వేసుకోమంటాడా. ఎంతో కొంత వెలడుగుతాడు. తన దగ్గరేముంది. వాళ్ళనాయన కుట్టె మిషను కూడా యిన్నాళ్లు గుర్తుగా పెట్టుకొని ఈ మధ్యే తిండి గింజలకు నకనకలాడతా అమ్ముకున్నాడు.

నీరుగారిపోయాడు రజాక్ మియా. అతనికి దారి నడవ బుద్ది కావడంలేదు. ఎండకు నీరసంగా అడుగులు పడుతున్నాయి. అన్నం తినే యాలైంది. ఆకలి దారిలో ఆడుతున్న ఒక మోటారు దగ్గర ఆగి నీళ్లు తాగినాడు.

ఒక వేళ చలమాడ్డి మధురెడ్డి అంత జాచ్చొడు గాదేమోలే. అదృష్టం బాగుండి "ఏసుకోపోరా సాయిబూగా" అంటే నా కష్టాలు తీరినట్టే.

"యా అల్లా. శత్రువు మనసైనా మనం కష్టాల్లో ఉన్నప్పుడు మారుతుందంటారు. కనుకరించు తండ్రీ..." అని ధైర్యం తీసుకున్నాడో లేదో అతను నీళ్ళు తాగిన మోటారు దగ్గరికే ఒక ట్రాక్టరు పెద్దగా శబ్దం చేసుకుంటా వచ్చి ఆగింది. అది చలమారెడ్డిదే. ఆ రూట్లో ఎవరికన్నా బాడక్కెళ్లిందేమో అనుకున్నాడు.

అందులోంచి కూలోళ్లు వచ్చి మోటారు దగ్గరే నీళ్లు తాగుతుంటే "ఈ ట్రాక్టర్ చలమారెడ్డిదే కదా'' అన్నాడు అనుమానాన్ని సరిచేసుకుందామని.

వాళ్లు "అవును" అన్నారు.

రజాక్ మియా "అన్నన్నా.. నేనొస్తాన్నా అయితే. రెడ్డితో రోంత



Untitled-2 46 6/11/2002, 3:51 PM

పనుండాది" అంటా ట్రాక్టర్ ఎక్కి కూర్చున్నాడు. డ్రైవరు ఏమన్లేదు.

అరగంటలో కాపుటీదిలో ఉన్న చలమాడ్డి ఇంటి ముందు ఆగింది ట్రాక్టరు. రజాక్ మియా ట్రాక్టర్ దిగాడు. గుండె డబ్‌డబ్ మంటూ కొట్టుకుంటాంది. ఆ శబ్దం అతనికి బాగా వినపడతాంది.

చలమారెడ్డి ఇళ్ళు విశాలంగా ఉంది. తన దిగిన ట్రాక్టరును డ్రైవరు సైడుగా పెట్టుకుంటున్నాడు. ఆ శబ్దం కూడా వినపడతాంది.

రెడ్డి ఇంటి ముందు ఇంకా నలుగురు మనుషులున్నారు. వాళ్లూ రైతులన్నట్లే ఉన్నారు. రెడ్డితో వాళ్ళకూ్కడా ఏమైనా పని పడిందేమో అనుకున్నాడు.

బిక్కుబిక్కుమంటా రెండడుగులు ముందుకేశాడు.

ఏదో కొంపలంటుకుంటున్నట్టు, పిచ్చికుక్క ఏదో ఇంట్లోకి జొరబడుతున్న ప్రమాదాన్ని పసిగట్టినట్టు ఎక్కడ్నుంచో ఒక మనిషి పరుగెత్తుకుంటా వచ్చి "ఎవరు కావల్ల" అంటూ గడప దగ్గరే అడ్డుకున్నాడు.

"రెడ్డి..."

"రెడ్డి అన్నం తింటాండాడు. కాసేపుండు. బయటికే వస్తాడు."

రజాక్ మియా కూడా అక్కడున్న రైతుల్లో కల్సి రెడ్డి కోసం ఎదురుచూడసాగాడు. అతనికూ్కడా అన్నం తినాలని ఉంది. రెడ్డితో మాట్లాడ్డం అయిపోయాక ఇంటికెళ్ళి తిందాంలే అనుకున్నాడు.

D D D



కాసేపటికి బనీను మీదున్న రెడ్డి చెయ్యి టవలుకు తుడుచుకుంటా "బ్రేవ్"మని తేన్పుకుంటా బయటికొచ్చాడు. చేతినిండా ఉంగరాలే. మెల్లో చైను. మీసాలు పెంచి గంభీరంగా ఉన్నాడు. అక్కడే విశాలంగా ఉన్న అరుగుమీద కూర్చున్నాడు.

అంతదాకా అక్కడున్న నలుగురు రైతులు పరుగెత్తుకుంటా వెళ్ళి తమ గోడేదో విన్నవించుకున్నారు. నిల్చున్న చోటు నుంచే వాళ్ళను గమనిస్తాండాడు రజాక్‌మియా, కాసేపటికి వాళ్ళ పనైందేమో వాళ్ళు సంతోషంగా ఒకర్నొకరు మాట్లాడుకుంటా, నవ్వుకుంటా అక్కడ్నుంచి వెళ్ళిపోయారు.

చలమారెడ్డి దృష్టి ఇక మిగులున్న రజాక్ మియాపై పడింది. రజాక్ మియా చేతులు కట్టుకున్నాడు. వినయంగా ముందుకెళ్ళి "నేను రెడ్డి. రజాక్‌ని. నీ పొలం పక్కనే నా పొలం."

తెలుసన్నట్టు టకటకా తలూపాడు చలమారెడ్డి, తర్వాత రజాక్ మియా చెప్పబోయే మాటలేంటో అని.

రజాక్‌మియా "ఏడేండ్లయితాంది రెడ్డీ మా నాయన సచ్చిపోయి. అప్పుడు చూసిందే కండ్లనిండా సేన్లో పంట. మల్లెప్పుడూ సూల్లా. ఆ పొలం కూడా ఏదో మీ లాంటోళ్లు మా నాయనకు దానం చేసిందే. దాన్ని నమ్ముకొని బతుకుతాండాను రెడ్డీ నేను.

ఈసారి ఇత్తనాలు సెరివాళ్ళకు తీసుకొని సెనిక్కాయ విత్తినా రెడ్డీ. ఏదో నాలుగు సినుకులు రాలి, అందరూ ఆశగా పదునైందని విత్తులు విత్తున్నారు చూడు. అప్పుడు రెడ్డీ నీకు తెలీందేముండాది ఇంత వరకూ ఒక్క వాన లేదు.

నీవు జూసినావో లేదో రెడ్డీ సేన్లో సన్నబిడ్డల్లేక్క సెనిక్కాయ సెట్లు ప్రాణాలు అరసేతిలో పెట్టుకోనుండాయి రెడ్డీ. ఇంగ నాన్నాళ్లు ఇట్టాగే ఉంటే నా పెళ్లాం బిడ్డల కష్టమంతా నాశనమైతాది రెడ్డీ."

రజాక్ మియా గొంతు గద్గదమైంది.

"రెండ్రోజులు... రెండే రోండు రోజులు... నీ మోటారు నీళ్లు ఇచ్చినావంటే ఇప్పుడే ఎళ్లి నీ తోట్లోంచి కాలువ లాక్కుంటా. నా సెనిక్కాయ సెట్లను బతికించుకుంటా. యియ్యి చేతులు కావు రెడ్డీ, కాదనొద్దు. నాకు నుయ్యే గొయ్యే తప్పితే ఏరే దారి లేదు."

కాసేపు ఏం అనలేదు చలమారెడ్డి. మౌనంగా ఉన్నాడు. రజాక్ మియాలో ఆవేదన తగ్గింది.

అప్పుడు భుజం మీద చెయ్యేసి చెప్పడం మొదలుపెట్టాడు చలమారెడ్డి. "చూడు రజాక్‌మియా. ఇలా బాధపడ్డంవల్ల లాభం ఏంది చెప్పు. ఇప్పుడు నీ బాధను చూసి నేను కాదనకుండా నా మోటారు నీళ్లను యిస్తానే అనుకో. నువ్వు పారగొట్టుకుంటావు. బయట పడతావు. అబ్బా అంటే ఏ యాభై మూటలో సెనిక్కాయలైతాయి. దాంతో నీవు నా బామ్మర్ది దగ్గర చేసిన అప్పు తీర్చడానికే సరిపోతుంది.

మల్లా పంటేస్తావ్. ఇప్పుడు పడని వర్షాలు అప్పుడు మాత్రం పడతాయా. అప్పుడు నువ్వు మల్లా నా దగ్గర కొస్తావ్. నీకు ఇక చుట్టుపక్కల నీళ్లున్న బూములు ఎవరివీ లేవు. ఎందుకొచ్చిన కష్టాలు చెప్పు. నీకున్న పొలానికి వెలకడదాం. పెద్ద మనుషులతో కూర్చోని పంచాయతీ పెడతాం. నా బామ్మర్ది అప్పుపోను నీకెంతొస్తే అంత నీకు నేనిస్తా. బాండు మీద సంతకాలు పడడమే ఆలస్యం.

లేదు నా సావు నేను సస్తానంటావా. నా బామ్మర్దిగానికి చెప్పినా. వాడు ఇంగ నీకు ఒక్కపైసా కూడా అప్పివ్వడు. పైగా ఉన్న బాకీ ఎట్టగైనా ఇప్పుడే కట్టమంటాడు. ఇంగ ఇంతకన్నా మంచిగా నీకు చెప్పేటోళ్ళు లేరు. నీ కోసమే చెప్తాండా. నా మాటిని ఇంటికెళ్ళి బాగా ఆలోసించుకో. యా మాట మల్లా నాకు వారంలో చెప్పాలా. ఆ తర్వాత నీ పొలాన్ని ఉత్త పుణ్యానికే ఇస్తానన్నా నేను తీసుకోను. ఇది గుడా ముందే చెప్తాండా"

రజాక్ మియాకు గుండెలో పిడుగు పడ్డట్టయ్యింది. యింత విషం దాసుకొని బావ, బావమరుదులు నాటకమాడతాండారా. యింత కుట్ర పెట్టుకొని మధురెడ్డి తనకు నూకల మూటె ఇప్పిస్తాన్నాడా. పోయి పోయి తురుకోని బూమ్మీద వాళ్ల కన్ను పడిందా. ఇంగెట్ట చేసేది దేవుడా! ముఖమంతా నల్లగా చేసుకొని రజాక్ మియా అక్కడ్నుంచి ఇంటి దారి పట్టాడు.

ఇక తన పరిస్థితి పిల్లినోటికి చెక్కిన ఎలకలా అయిపోయింది. పొద్దన ఆ గొర్లోల్ల అంజిగాడన్నట్టు అతనిక ఊరిడ్సాల్సిందే. దుబాయికి, కోయిటుకు కాదు. ఏ బాయిలోనన్నా దూకి కాటికి పోవాల్సిందే.

నీళ్లు లేవని, ఎందుకూ పనికీ రాదని, ఏవేవో సాకులు పెట్టి, నన్ను ఇరుకులో నెట్టి ఏ అనా పైసాకో భూమిని బేరం చేసి అప్పులోకే సరిపోయిందంటే ఏంటి పరిస్థితి. కాగితాలపై సంతకాలు చేసేసి ఒట్టి చేతల్తో తిరిగి రావాల్సిందేనా. మా నాయన సంపాదించింది నా పిల్లలకు ప్రాప్తం లేదా.

నడుసుకుంటా నలుగు రోడ్ల కూడలిలోకి వచ్చాడు రజాక్ మియా. అక్కడ ఒకటే జనం. అంతా డాక్టర్ భాష హాస్పిటల్లోకి పరుగెత్తుతున్నారు.

"నంది మండలం కాడ యాక్సిడెంట్ అయ్యిందంటా. సాయిబూలాయమ ఎవరో ట్యాక్సీ నుంచి కింద పడిపోయిందంటా. నెత్తంతా ఒక పక్క చీలిపోయింది. చూల్లేకున్నాం సామి"

ఆ వార్త వినగానే రజాక్ మియాకు మనసంతా మరింత చేదైపోయింది. హాస్పిటల్లోకి వెళ్లాలనుకొని మల్లా వెనక్కు వచ్చాడు. తను కూడా రేపో మాపో అలా కాకపోతే ఇంకోలా... అనుకుంటూ మెల్లగా ఇంటి వైపుకు అడుగులు వేస్తున్నాడు.

దారిలో జనం మాటలు అతని చెవుల్లో పడుతూనే వున్నాయి.



Untitled-2 47 6/11/2002, 3:51 PM

## కవిత

# తలుపు దెగ్గర అమ్మ ప్రతిముంటది

హనీఫ్



అమ్మకు జ్వరమొచ్చింది
రాత్రంతా కుంపటిలా కాగిపోయింది
పొద్దున్నే వెల్తి
నాన్న మొఖంలో అమ్మ లేవలేని వెల్తి
ఫజర్ నమాజ్‌కు గైర్‌హాజర్ అవడం
అమ్మకు అనారోగ్యం చేసినప్పుడల్లా మామూలే
ఫజర్‌కు మేం మేల్కొనడంతోపాటు
సూర్యుణ్ణి తట్టిలేపేది అమ్మే
సూర్యుడి ప్రతి ఎదుగుదల అమ్మ కనుసన్నల్లోనే
అమ్మని లేపిన రోజు ఒక్కటైనా
తన డైరీలో ఉందేమో చూపమండి
మేం యంత్రాల కోరల్లోకి
సూర్యుడు పడమరకి ప్రయాణం
సైకిల్ షాపుకో, దర్జీ కొట్టుకో
లారీ క్లీనర్‌గానో, 'పరకల పట్టేతురుకల పోరలు'గాను మారిపోతాం
ఉదయం చెట్టును ఖాళీ చేసిన కాకులమల్లే
సాయంత్రానికి ఇంటినిండా చేరిపోతాం
చీమలు చేరేసినట్లు
ఒక్కొక్క వస్తువు అమ్మ కిచెన్‌లోకి చేరిపోతుంది
దస్తర్‌ఖాన్ చుట్టూ చేరిన ఖాన్‌దాన్
కడుపు నిండిన తల్లిచూపులు
ఇళ్ళు ఎవరివైనా
తలుపు దెగ్గర అమ్మ ప్రతిముంటది
మగరిబ్ కా 'అజా' చిన్న పిల్లలకు ఆకలిని గుర్తు చేసే
సైరన్‌లా వినిపిస్తుంది
కూలిన మసీదు గోడల శిథిలాల నుంచి
పీడిత జాతి ఆక్రందనలా వినిపిస్తుంది
మసీదులు బాంబుల కార్ఖానాలు కావు
పావురాలు ప్రేమ కబుర్లు చెప్పుకునే గోపురాలు
మేం కసాయిబులమని
మనిషిని మాంసపు ముద్దలుగానే చూస్తామని
కాఠిన్యం నిండిన కుండలన్న దెవరు?
ఇనుముకు వేడి తగిలితే కరిగినట్లు
మనసుకు తడితగిలితే చెమ్మ ఊరే చెలమలం
కుండలు కాలిన దేహాలు కావు
చెమర్చే దుఃఖపు కళ్ళు

మా ప్రార్థనల్లో ఏ భావముంటుందో
ఇక్కడ తచ్చాడుతున్న పావురాల జంటల్ని
ఇంటరాగేట్ చేయండి
మేం చాపిన దోసిలి దువా అంతరంగం
తల్లికి ఆరోగ్యం ప్రసాదించమని
దేశం నలుచెరుగులా వర్షాలు కురవాలని
చీడపీడల నుండి పంటల్ని కాపాడమని
సమస్త ప్రజలకు శాంతి కలగాలని

మా ప్రతివాద శ్రమ పనిముట్ల కార్ఖానా
చెమట సుగంధం వీచే నైట్‌క్వీన్ పొద
నన్నుకని పెంచిన
తల్లి పాదాల చెంతే స్వర్గం

---

"పనికి పోయి సాయంత్రం తిరిగొచ్చేటప్పుడు ట్యాక్సీలో స్థలం లేదంటా. మొగోళ్లంతా పైకెక్కినారు. ఆడోళ్లందరూ ముందే ఎక్కి కూర్చున్నారు. ఇంకా కొందరు ఆడోళ్లు డోర్లో కడ్డీలు పట్టుకొని యాలాడుతాండారంటా. ఈ సాయిబూలాయమ కూడా యాలబడిందంటా.

యిళ్ళకు దుప్పట్లుంటాయి కదా అంటి పెట్టుకొని యాడికిపోయినా. ఆడికి ఒకాయమ అనిందంటా. దుప్పటి నా చేతికిచ్చేయమ్మా అని. ఆమె వినలేదంటా. అట్టనే యాలబడుకోనుంది. ట్యాక్సీ జోరందుకున్నాక దుప్పటి గాలికి బోతాందాదని రెండు చేతులు వదిలేసిందంటా. ఇంగేముండాది.

నెత్తంతా రక్తం. "వాయమ్మ! పడిపాయనే" అంటా కూలోల్లంతా అరుపులు, కేకలు పెట్టేసరికి ట్యాక్సీ అరకిలో మీటరు దూరం వెళ్ళి ఆగిందంట కొనూపిరిలో ఉంటే కూలోళ్లు తలా ఒక చెయ్యి వేసి ఆయిమను భాష హాస్పిటల్‌కు తీసుకొచ్చినారు. అప్పటికే సచ్చిపోయింది."

ఇంటి కొచ్చాడు రజాక్ మియా, ఏవేవో ఆలోచనలు అతని మనసును తొలిచేస్తున్నాయి. అతని ఎడమ కన్ను అదురుతాందాది. వాతావరణం చూస్తుంటే రజాక్ మియా క్కూడా ఏదో అనుమానం వస్తోంది. రజాక్‌మియా దర్గా పటాలున్న గూడు పక్కకు దృష్టి సారించాడు. అక్కడేదో వెలితి కనిపించింది.

"ఒరే షాబీరా!" అంటా గట్టిగా అరిచాడు.

"ఏంది నాయనా." అంటూ షాబీర్ ఉలిక్కిపడ్డాడు.

"యాడ నూకల మూటె ఉండాల్నే ఏమైందిరా."

"ఇంగా యాడిదబ్బా. రాత్రే అయిపాయనే."

"అప్పుడే ఎట్టా అయిపోతాయిరా... నిన్ననే కదరా చూస్తాండాను. ఇంగా రెండ్రోజులొచ్చాయని కూడా అనుకుంటే."

"రేతిరి సిన్నమ్మోళ్లు వొచ్చిండ్లేదేమబ్బా"

"ఇంతకీ నీ అమ్మేదిరా" దాదాపు ఏడుస్తున్న గొంతుతో అన్నాడు రజాక్ మియా. అతనిలో ఏదో చిరాకు. అసహనం. దుఃఖం.

"మగోళ్లెవరూ ఉండరు. అందరూ ఆడోళ్లే అని, ఏ రోజు లెక్క ఆ రోజే ఇచ్చేస్తారని గుట్టమీద మల్లమ్మ ఒగటేమైన బంగపోతాంటే ట్యాక్సీలో నంది మండలానికి పనికి బోయిందబ్బా..." షాబీర్ యింగా ఏదో చెబుతుండగానే రజాక్ మియా కుప్పకూలిపోయాడు. V



Untitled-2 48 6/11/2002, 3:51 PM

# అతిథ్యం బాగానే వుంది ఉత్తమ చిత్రాల నిర్మాణం ఎప్పుడు?

***పాల్గొన్న మూడు తెలుగు చిత్రాలు కూడా ఈ చిత్రోత్సవంలో అంతర్జాతీయ చలనచిత్రాల ప్రేక్షకుల దృష్టికి ఆనలేదు. కోట్లాది రూపాయల ఇండస్ట్రీగా రూపుదాల్చి ప్రతి సంవత్సరం వంద దాకా సినిమాలను విడుదల చేస్తున్న తెలుగు సినిమా పరిశ్రమ మన రాష్ట్రంలో ఐదు బాలల చలనచిత్రోత్సవాల నాటికి కూడా పెద్దగా గుణపాఠాలు నేర్చుకోకపోవడం ఎంతో చింతించాల్సిన విషయం.***

**చెమికల రాజశేఖరరెడ్డి**

ఈసారి కూడా అంతర్జాతీయ బాలల చలన చిత్రోత్సవం నవంబరు 14 నుంచి 20 దాకా హైదరాబాదులో జరిగింది. పిల్లలకు పెద్దగా ఉపయోగపడకుండా పెద్దలకు మాత్రం బాగానే ఉపయోగపడింది. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చలన చిత్రోత్సవ ప్రారంభ, ముగింపు వేడుకల్లో పిల్లలే నా ఆశ, ఆకాంక్ష, వాళ్ళే స్వర్ణాంధ్ర వారసులు అంటూ తనదైన శైలిలో ఉపన్యాసం ముగించారు. తన మార్కు విక్టరీ సింబల్ చూపించారు. కానీ ఈసారి ఎందుకోగాని పిల్లలు అనుకున్న స్థాయిలో చంద్రబాబు అంకుల్ మాటలకు సరిగా స్పందించలేదు. ఈ విషయాన్ని అలా ఉంచితే 1995 నుంచి హైదరాబాద్ శాశ్వత వేదికగా మారి మన రాష్ట్రంలో అంతర్జాతీయ బాలల చలన చిత్రోత్సవాలు ప్రతి రెండు సంవత్సరాలకు జరుగుతున్నాయి. కేంద్ర ప్రభుత్వ అధీనంలోని చిల్డ్రన్స్ ఫిలిం సొసైటీ, మన రాష్ట్ర ప్రభుత్వ సహకారంతో ఈ చిత్రోత్సవాన్ని నిర్వహిస్తున్న ముంబాయిలోని చిల్డ్రన్స్ సొసైటీ (బాలల చలనచిత్ర సమితి) బాలల చలన చిత్రాల తయారీ, మార్కెటింగ్ తదితర విషయాలలో విజయాలు సాధించినప్పటికీ అవి అనుకున్న స్థాయిలో లేవు. కోట్లాది రూపాయల ప్రజాధనం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మొక్కుబడిగా ఖర్చు పెట్టడంవల్ల ఇటు చలన చిత్రోత్సవాలు, అటు బాలల చిత్రాల నిర్మాణం ఆశించిన ఫలితాలను ఇవ్వడంలేదు.

ప్రభుత్వ దృష్టిలో అంతర్జాతీయ బాలల చలనచిత్రోత్సవం ఐదవ సారి కూడా విజయవంతమయింది. కానీ ఈ విజయం వాపే తప్ప బలుపు కాదనే విషయాన్ని ప్రభుత్వ అధికారులు, తెలుగు సినిమా రంగం గుర్తించడం లేదు. చక్కటి అతిథ్యంతోనే చిత్రోత్సవం విజయవంతం అవుతుందనుకుంటే అంతకు మించిన పొరపాటు మరొకటి ఉండదు. ఈసారి చిత్రోత్సవంలో మన తెలుగు వారి చిత్రాలు మూడు మాత్రమే ప్రదర్శనకు మాత్రమే నోచుకున్నాయి. అంతర్జాతీయ పోటీలు విభాగంలో మన చిత్రం ఒకటి కూడా లేదు. ఆసియన్ పనోరమాలో 'కుచ్చి కుచ్చి కూనమ్మ' (నిర్మాత సానా యాదిరెడ్డి, దర్శకుడు : అశోక్‌కుమార్) పోటీ పడినప్పటికి జ్యూరీని ఆకర్షించలేకపోయింది. ఆసియన్ పనోరమాలోని రెండు అవార్డులు ఇరాన్, చైనా చిత్రాలు కైవసం చేసుకున్నాయి. ఇరాన్ చిత్రం 'జీప్సీ' ఆసియన్ పనోరమాలో ఉత్తమ చిత్రంగా, చైనా చిత్రం 'టచ్‌డ్ బై లవ్' ద్వితీయ చిత్రంగా నిలిచాయి. అవార్డు ప్రకటించే సమయంలో జ్యూరీ అవార్డు ఇవ్వకపోయినప్పటికీ కొన్ని చిత్రాలను ప్రత్యేకంగా పేర్కొంటుంది. అంటే ఆ ప్రత్యేక చిత్రాలు దాదాపు అవార్డుకు దగ్గరగా నిలిచినవన్నమాట. ఆసియన్ పనోరమాలో ఈసారి 'టెంత్ ఎఫ్' మరాఠీ చిత్రం ప్రత్యేక ప్రశంస పొందింది. మన కుచ్చి కుచ్చి కూనమ్మకు జ్యూరీ సభ్యుల నుంచిగానీ, ఇతర రాష్ట్రాల ప్రతినిధుల నుంచి ఎలాంటి ప్రశంసలూ రాలేదు. ఈ చలనచిత్రోత్సవంలో ప్రదర్శనకు నోచుకున్న మిగతా రెండు చిత్రాలు ప్రత్యేక దర్శకుడు బి. నర్సింగరావు దర్శకత్వంలో మరో ప్రత్యేక నిర్మాత రామానాయుడు నిర్మించిన 'హరివిల్లు' చిత్రం. ఈ చిత్రం కూడా నర్సింగరావు కాలిబర్‌ను దృష్టిలో పెట్టుకుంటే అనుకున్న స్థాయిలో విజయం సాధించలేదు. మేధస్సుగల దర్శకుడిగా ఇప్పటికే తనను తాను నిరూపించుకున్న నర్సింగరావు ఈ 'హరివిల్లు' చిత్రకథా విషయంలో ఎక్కడో తప్పు చేశారనిపిస్తుంది. అంత వరకూ ఆనందంగా ఉన్న కుటుంబంలో ఉన్నట్టుండి ఓ విషాదం మొదలవుతుంది. ధనవంతులైన తల్లితండ్రులకు రవి ఒకే సంతానం. రవి క్యాన్సర్ బారిన పడతాడు. ఆ తరువాత ఆ కుటుంబంలో పలు మార్పులు చోటు చేసుకుంటాయి. కొన్ని డీప్ సింబల్స్‌తో సాగిన ఈ చిత్రాన్ని చిల్డ్రన్స్ విభాగంలో ప్రదర్శించారు. చిత్రకారుడిగా, స్టిల్ ఫొటోగ్రాఫర్‌గా, కవిగా, రచయితగా, దర్శకునిగా విశేష ప్రతిభగల నర్సింగరావు ఈ చిత్రాన్ని మొదటి నుంచి ఒకే మూడ్‌లో నిలపడానికి చక్కటి ప్రయత్నం చేశారు. బహుశా ఈ మూడ్‌వల్ల ఈ చిత్రం పిల్లలున్నప్పటికీ పెద్దల చిత్రంగా నిలిచిందని విమర్శకులు అంటున్నారు. చిల్డ్రన్ వరల్డ్‌లో ప్రదర్శించబడ్డ మరో తెలుగు చిత్రం హీరో. పాల్గొన్న మూడు చిత్రాలు కూడా అంతర్జాతీయ చలనచిత్రాల ప్రేక్షకుల దృష్టికి ఆనలేదు. కోట్లాది రూపాయల ఇండస్ట్రీగా రూపుదాల్చి ప్రతి సంవత్సరం వంద దాకా సినిమాలను విడుదల చేస్తున్న తెలుగు సినిమా పరిశ్రమ మన రాష్ట్రంలో ఐదు బాలల చలనచిత్రోత్సవాల నాటికి కూడా పెద్దగా గుణపాఠాలు నేర్చుకోకపోవడం ఎంతో చింతించాల్సిన విషయం.



హెడా హోడా

ఆంధ్రప్రదేశ్ ఫిల్మ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ బాలల చలనచిత్రాల



Untitled-2 49 6/11/2002, 3:51 PM



నిర్మాణాన్ని ప్రోత్సహించడానికి సబ్సిడీల రూపంలో 35 లక్షల రూపాయల వరకు నిర్మాతకు అందిస్తుందని చెబుతున్నప్పటికీ అక్కడి నిమయనిబంధనలు, అధికారులకు బాలల చలన చిత్రాలపట్ల ఉన్న చిన్నచూపు తదితర కారణాలవల్ల ఎఫ్.డి.సి. విమర్శలను ఎదుర్కొంటుందే తప్ప బాలల చిత్రాల నిర్మాణం, ప్రదర్శన, మార్కెటింగ్ విషయంలో ఎలాంటి విజయాలను సాధించడంలేదు. ఇరాన్‌లోనూ, చైనా, జర్మనీ దేశాలలో బాలల చిత్రాల నిర్మాణ విషయంలో విప్లవాత్మకమైన మార్పులు చోటు చేసుకున్నాయి. వీటిని నిజాయితీగల అధికారులు అధ్యయనం చేసి ఎఫ్.డి.సి.ని సరైన ట్రాక్‌లో పెట్టగల్గితే మన పరిస్థితులకు అనుగుణంగా మన రాష్ట్ర, దేశ సమస్యల ఆధారంగా ఆలోచనాత్మకమైన, సున్నితమైన, సృజనాత్మకమైన భావాలను కల్గించే బాలల సినిమాలను మనం కూడా నిర్మించవచ్చు. మన రాష్ట్ర ఫిల్మ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ బాలల చిత్రాల విషయంలో చేస్తున్న కృషి కంటే వేదకుమార్ ఆధ్వర్యంలో చిల్డ్రన్ ఫిల్మ్ సొసైటీ చేస్తున్న కృషియే అధికమని పలువురు చిత్రోత్సవ ప్రతినిధులు అభిప్రాయపడ్డారు. ఫిల్మ్ అప్రిషియేషన్ కోర్సుల ద్వారా, చిత్రాల ప్రదర్శన ద్వారా, పిల్లల చేత లఘుచిత్రాలను నిర్మింపచేయడం ద్వారా ఆంధ్రప్రదేశ్ ఫిల్మ్ సొసైటీ  ఇతోధికంగా కృషి చేస్తూ ఒక చక్కటి వాతావరణం ఏర్పడటానికి కృషి చేస్తుంది. కానీ ఈ సంస్థ ఒక స్వచ్ఛంద సేవా సంస్థ మాత్రమేనని విషయం మర్చిపోరాదు. గత సంవత్సరం ఈ సంస్థ హైదరాబాద్‌లో మొదటి ఆసియా బాలల చలనచిత్రోత్సవాన్ని ఉన్నంతలో ఘనంగా నిర్వహించింది.

ఇక అంతర్జాతీయ పోటీ విభాగంలో బంగారు ఏనుగును, 'యాన్ ఏంజెల్ ఫర్ మే' (బ్రిటన్) చిత్రం గెలుచుకుంది. ఈ అవార్డు అన్ని అవార్డులకంటే పెద్దది. ఉత్తమ దర్శకుని అవార్డును చైనా చిత్రం 'టు గెదర్' గెల్చుకుంది. కొడుకుని వయొలిన్ విద్వాంసునిగా చేయడానికి తండ్రి పడే తపనే ఈ చిత్రం. ఇదే చిత్రం ఇంటర్నేషనల్ క్రిటిక్స్ జ్యూరీ అవార్డును కూడా పొందింది. క్రిటిక్స్ జ్యూరీ సారధి ప్రముఖ సినిమా జర్నలిస్ట్ మైథిలీ రావు. ప్రత్యేక భాషను కల్గిన సినిమాను అర్థం చేసుకోవడానికి పిల్లలకు అకాడమిక్  స్థాయిలో ఫిల్మ్ అప్రిషియేషన్‌పై పాఠాలుండాలని మైథిలీ రావు అంటారు. ఇక ఉత్తమ బాల నటీ/నటులకిచ్చే అవార్డును ఇద్దరు పిల్లలు పంచుకున్నారు. ఇజ్రాయిల్ చిత్రం అండర్ వాటర్ (హిబ్రూ భాషా చిత్రం)లో చక్కగా నటించినందుకు ఉత్తమ బాలనటి అవార్డును ఆగమ్ రుడ్‌బెర్గ్ గెలుచుకుంది. తల్లి నుంచి విడిపోయి వేరొక కాపురాన్ని ప్రారంభించిన తండ్రికి దగ్గర కావడానికి మీఛల్ చేసిన ప్రయత్నమే అండర్ వాటర్. టీనేజ్‌లో ఉండే రాగద్వేషాలను ప్రదర్శించడంలో ఆగమ్ రుడ్‌బెర్గ్ సఫలమయ్యింది. తల్లి కార్డుల ద్వారా జోతిష్యం చెబుతుంటుంది. తండ్రి యూదుమత ఛాందసుడు. తన కూతురు ఎదగడానికి తనదైన పద్ధతిలో సహాయం చేయాలనుకుంటాడు తండ్రి. ఈత క్రీడాకారిణిగా ఎదగడంలో కూతురుకు వీలయినప్పుడల్లా సహకరిస్తాడు. సున్నితమైన అనేక మత, కుటుంబ సమస్యల మధ్యన మీఛల్ ఒక బాయ్ ఫ్రెండ్‌తో సన్నిహితంగా మెలుగుతుంది. 'సెక్స్ ద్వారా నీలోని మూడ్స్‌లో తేడా వస్తుందం'టూ ఆ బాయ్ ఫ్రెండ్ మీఛల్‌ను ప్రేరేపించడానికి ప్రయత్నించినప్పటికీ మీఛల్ అతనికి లొంగదు. కథకు అవసరమయ్యేలా మగ, ఆడ సంబంధాలకు చెందిన దృశ్యాలు, డైలాగులు కొన్ని ఉండడంతో ఈ సినిమాను పెద్దల సినిమాగా పేర్కొంటూ  పత్రికలు చిత్రోత్సవ సమయంలో రాశాయి. ఆ వివాదాన్ని పక్కనపెడితే మీఛల్ సహజ నటన చక్కగా ఉంది. ఉత్తమ బాల నటుడి అవార్డును 'డే ఆఫ్ ది రిజల్ట్'లో నటించిన మెహదీ హషెమీ చేజిక్కించుకున్నాడు. మార్కులు తక్కువ రావడంతో ఆత్మహత్య చేసుకుందామని ప్రయత్నించిన ఓ బాలుడు ఆ ప్రయత్నంలో ఉండగా జైలు నుంచి విడుదలైన ఒక క్రిమినల్‌ను కలవడం, ఆ పిల్లవాని ప్రవర్తన వలన క్రిమినల్ జీవితంలో మార్పు రావడం ఈ ఇరాన్ చిత్రంలో చూడొచ్చు. వైవిధ్యమైన కథలను ఎప్పటికప్పుడు తెరకెక్కిస్తున్న ఇరాన్ చిత్ర పరిశ్రమ ప్రతి చిత్రోత్సవంలో విజయాలను సాధిస్తూ ఉంది. ఒకేఒక సంవత్సరం వంద దాకా అంతర్జాతీయ అవార్డులను, ప్రశంసలను పొందిన ఘనత ఇరాన్ చిత్రాలది. సంస్కృతిని, సాంప్రదాయాలకు విలువ ఇస్తూనే మానవత్వ విలువలను, సున్నితమైన ఆలోచనలను కలుగజేయడానికి ఇరాన్ చిత్రాలు దోహదం చేస్తున్నాయి. మన దేశ చిత్రాలలో మన దేశ సంస్కృతి, సాంప్రదాయాలకు విలువలేకుండా పోతుంది. పాశ్చాత్య ఆలోచనలు, భావలనే ఎక్కువగా కనిపిస్తున్నాయని అంతర్జాతీయ జ్యూరీ చైర్‌పర్సన్ ఆశాపరేఖ్ చిత్రోత్సవ సందర్భంగా చేసిన వ్యాఖ్యాన్ని ఇక్కడ గుర్తు పెట్టుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

ఇక అంతర్జాతీయ జ్యూరీ ప్రత్యేక అవార్డును 'హెడా హోడా' గెల్చుకుంది. ఇది హిందీ, కచ్చి భాషలలో నిర్మితమైంది. పాకిస్తాన్, ఇండియా సరిహద్దుల్లో ఉండే ఒక గ్రామం నేపథ్యంగా, అమాయకంగా సరిహద్దును దాటి పాకిస్తాన్‌లో ప్రవేశించిన ఒక బాలుడి పరిస్థితి ఆధారంగా నిర్మితమైన చిత్రమిది. దీనిని చిల్డ్రన్స్ ఫిల్మ్ సొసైటీ నిర్మించింది. దర్శకుడు వినోద్ గణత్ర. 1955లో ప్రారంభమయినప్పటి నుంచి ఇంతదాకా వివిధ భాషల్లో పిల్లలకు సంబంధించిన అనేక చిత్రాలను ఫిల్మ్ సొసైటీ నిర్మించింది. ఈ సొసైటీ ప్రస్తుత చైర్‌పర్సన్ సినిమా నటి రవీనా టాండన్. టాండన్  ఎంపిక ఇప్పటికే వివాదాస్పదమైంది. ఈమె నేతృత్వంలో సొసైటీ పెద్దగా అభివృద్ధి సాధించలేకపోవచ్చని విమర్శకులు అంటున్నారు. చిల్డ్రన్స్ ఫిల్మ్ సొసైటీ ఒకప్పటి సారథులైన శాంతారాం, షబానా అజ్మీ, జయాబచ్చన్, సాయిపరంజిపేల స్థాయిలో రవీనా టాండన్‌కు సామర్థ్యంలేదనేది విమర్శకుల వాదన. పిల్లల సినిమాలో ఫీజు లేకుండానే నటిస్తానని రవీనా అంటున్నారు. ఇది రాజకీయ నాయకుల ప్రకటనలాగే ఉంది తప్ప ఆమె నిజంగా ఈ పని చేస్తుందా అనేది ప్రస్తుతం ప్రశ్నగానే ఉంది. ఇది వరకు బాలల చిత్రాలలో నటించిన అనుభవంగానీ, బాలల చిత్రోత్సవాల్లో పాల్గొన్న అనుభవంగానీ ఆమెకు లేవు. కమర్షియల్ సినిమాలతో బిజీగా ఉండే ఈ నటి పిల్లల సినిమా అభివృద్ధికి ఏమాత్రం సహాయం చేస్తుందో కాలమే నిర్ణయించాలి.

ఎన్నో సెమినార్‌లలో, ఫోరంలలో మాట్లాడుకుంటున్నప్పటికీ కమర్షియల్ సినిమా హేమాహేమీలకు బాలల సినిమాల నిర్మాణ విషయంలో ఏ మాత్రం కనికరం లేకుండా పోతుంది. వ్యాపారాత్మకంగా లాభాలను విపరీతంగా మూటకట్టుకుంటున్న చిత్ర నిర్మాణ సంస్థలు అప్పుడప్పుడు సీరియస్‌గా చిన్నపిల్లల సినిమాలవైపు కూడా దృష్టిపెడితే అంతర్జాతీయ కీర్తిని మన తెలుగు సినిమా పరిశ్రమకూడా మూటకట్టుకుంటుందనడంలో సందేహం లేదు. కాకపోతే దీనికి కావాల్సింది చిత్తశుద్ధి తప్ప డబ్బు కాదు. మనసు ఉంటే మార్గాలు తప్పకుండా ఉంటాయి.

V



Untitled-2 50 6/11/2002, 3:51 PM

ప్రసంగం

# "కోటి స్వగతాలు పోరాడందే ఉన్నత సమాజం ఆవిర్భవించదు"

**సమాజంలో ఒక "అభ్యుదయాంశ" చాలా కష్టపడి, ఎన్నో త్యాగాలు చేసి ఒక గుణాత్మకమైన మార్పును సాధిస్తుంది. ఈ సాధనలో ఎన్నో అవాంఛనీయ వారసత్వాలు దొర్లుతాయి. అంత మాత్రాన "అభ్యుదయాంశ" సాధించిన గుణాత్మకమైన మార్పు (సోషలిస్టు చింతన)ను హేళనగా చమత్కరించి పూర్వపక్షం చేయడం ఆయన హక్కు కావచ్చుకాని, సామాజిక అభ్యుదయ శక్తులు సాధించిన విజయాన్ని హేళన చేయడమే అవుతుంది.**

**జ్వాలాముఖి**

**"అసలే మార్గం దుర్గమంగా వుంది**
**ఆపై మెళ్లో ఇదొాహటి!"**
**- ఇస్మాయిల్**

**చా**లా కాలం క్రితం ఇస్మాయిల్ 'మేకు' శీర్షికన పై కవిత రాశారు. "నిబద్ధత"పైన చర్చలు జరుగుతున్న రోజులు - విప్లవ సాహిత్యోద్యమం బలంగా సాగుతున్న కాలం.

పై కవితా పంక్తుల్లో కాస్త మాటలు అటు ఇటు వుండవచ్చు. సారాంశం మాత్రం అదే - చాలా చమత్కారంగా ప్రధానమైన ప్రజాసంబంధ విషయాన్ని తోసివేయడమో, హేళన చేయడమో ఇస్మాయిల్ తలపెట్టిన చమత్కార మినీ కవితా కాని ఖండకవిత.

"మేకు" మెళ్లో ఏదో ఒక ఒక చిత్రం, లేక పటం వుండవచ్చు. అందుకే మేకును గోడకు దిగేస్తారు. అది దేవుని పటమూ కావచ్చు దేశ పటమూ కావొచ్చు. లేక ఇష్టమైన వ్యక్తి లేక నాయకుని లేక రచయిత చిత్రమూ కావచ్చు. కాకినాడ ఇస్మాయిల్‌కి చాలా ఇష్టమైన చలన చిత్రమో, కృష్ణశాస్త్రి చిత్రమో కావచ్చు. అలా వేలాడే చిత్రమో, పటమో "మేకు" ముందుకు దూసుకుపోవడానికి 'ఇబ్బంది"గా ఇంకా చెప్పాలంటే 'అడ్డంకి"గా వుండవచ్చునని ఇస్మాయిల్ వ్యంగ్యం లేక శ్లేష=తాత్పర్యం మేకు మెళ్లో వుండే చిత్రం (గోడ) దుర్గమ మార్గాన్ని దూసుకుపోవడానికి "ఆటంకం" వుందని ఇస్మాయిల్‌గారి అభిప్రాయం - అలా అభిప్రాయం కలిగి వుండే హక్కు వారికి వుంది. కాని ఆయనకు తట్టిన చమత్కారంలో, ఎన్నో సామాజికాంశాలు ముడివడి వున్నాయి. "ఆ! అదంతా ఎవడికి కావాలి? తోచింది చెప్పకపోవడమే కవి హక్కు" అనవచ్చు.

సమాజంలో ఒక "అభ్యుదయాంశ" చాలా కష్టపడి, ఎన్నో త్యాగాలు చేసి ఒక గుణాత్మకమైన మార్పును సాధిస్తుంది. ఈ సాధనలో ఎన్నో అవాంఛనీయ వారసత్వాలు దొర్లుతాయి. అంత మాత్రాన "అభ్యుదయాంశ" సాధించిన గుణాత్మకమైన మార్పు (సోషలిస్టు చింతన)ను హేళనగా చమత్కరించి పూర్వపక్షం చేయడం ఆయన హక్కు కావచ్చు కాని, సామాజిక అభ్యుదయ శక్తులు సాధించిన విజయాన్ని హేళన చేయడమే అవుతుంది. ఆయన అంతలోతుగా ఆలోచించి వుండక పోవచ్చు (అలా అనుకుందాం) కాని ఆ 'మేకు" కవిత, "అభిప్రాయాల సంఘర్షణ"లో ఒక "పక్షాన్ని" తెలిసో తెలియకో సమర్థిస్తుంది. అది ప్రజా ప్రయోజనాల చింతన వ్యతిరేకపక్షమై మిగులుతుంది.

"మేకు" ప్రయోజకత్వం, ఏదో ఒకటి ఆ యింటి వారి అవసరం. విశ్వాసము, గౌరవమూ వహించడంలోనే తీరుతుంది. అలా "మెళ్లో వేలాడే విశ్వాసం" వల్ల "మేకు" విశ్వాసానికి ఆలంబన అవుతుంది. మేకు పైన చొక్కానో చీరనో సంచినో కూడా వేలాడతీయడం సహజం. కానీ "మెళ్లో ఇదొాహటి!!" అనడంలోనే ఏదో కానిది భారంగా వుందని కవి అభిప్రాయం.

నిజానికి "మేకు", గోడ అవతలి వైపును చేరడం అవసరంలేని పని. అలాంటి పనిని "మేకు" కాక, "చువ్వ", "పైపు" చేయవచ్చు. మరింత భారాన్ని అది మోయవచ్చు. అది వేరే విషయం.

మేకు గోడకు కొంచం దిగితే చాలు దానికి "మార్గం" అనేది లేదు. అది "ఆధారమే" - 'మార్గం' లేనప్పుడు "దుర్గమత్వం" వుండదు - వున్నా ఆ దుర్గమత్వాన్ని "మేకు"ను దిగేసే వాడు లేక ఆమె "బలప్రయోగం" అధిగమిస్తుంది.

ఆ రెండు పంక్తుల్ని తిరగేసి రాస్తే అవగాహన మారిపోతుంది.

"మార్గం దుర్గమంగా లేదు
బలప్రయోగం నాకు నిలకడనిచ్చింది
ఆపై మెళ్లో వేలాడే బాధ్యత
నా నిబద్ధతను చరితార్థం చేసింది"

ఇస్మాయిల్ "మేకు" కర్తవ్యం'గా మారింది ప్యారడీలో

కవిత్వంలో శబ్దాలంకారాల కన్నా అర్థాలంకారాలకే ఎక్కువ ప్రయోజనం వుంది. భారవి "అర్థగౌరవాన్ని" ఆదరించిన వారు అనుసరించిన వారు చాలా వున్నారు. శబ్దాలంకారాలు ''లయ''ను ఇస్తే "అర్థాలంకారాలు" చింతనను పెంచాయి - సంస్కారాన్ని అభివృద్ధి చేశాయి. కాళిదాసు ఉపమాలంకారాలకు సాహిత్య ప్రపంచం ఎంతగా మురిసిపోయిందో, భారవి అర్థగౌరవానికి అంతే ప్రభావితమైంది - "శతక కవులు" అర్థగౌరవాన్ని అభివృద్ధి చేసి జీవితానికి సమాజానికి గల బింబ ప్రతిబింబ భావాన్ని రుజువు చేశారు. భారతీయ సాహిత్యంలో ''ప్రబంధకవులు'' పతిత సమాజానికి ప్రతీకలవుతే "శతక కవులు" "ప్రత్యామ్నాయ సంస్కృతి"కి పతాకలయ్యారు.

భారతీయ సాహిత్యం, కవిత్వం ఎలా వుండాలో ఎలా వుండ కూడదో బాగా చర్చించి ఫ్యూడల్ ప్రయోజనాల్ని కాపాడడానికి విఫలప్రయత్నం చేసింది. శతక కవులు వచ్చి భారతీయ సాహిత్యానికి "బతుకునీతి"ని వ్యక్తిపరంగా చెప్పారు.

ఉత్పత్తి సాధనాల్లో మార్పు వచ్చినప్పుడల్లా ఉత్పత్తి సంబంధాల్లో మార్పు వస్తూనే వుంది. ఆ ప్రభావంలో మానవ సంబంధాలు మారాయి. మానవ సంబంధాలు మారే సందర్భంలో "కవితా వస్తువు" మారక తప్పలేదు. ''వస్తువు'' మారినప్పుడల్లా కళారూపాలు, భాషా శైలులు, శిల్ప సౌష్టవాలు మారాయి.

తెలుగు కవిత్వంలో "ముత్యాల



Untitled-2 51 6/11/2002, 3:51 PM

సరాలు" రావడం ఒక సామాజిక అనివార్యత –సమకాలీన విచ్ఛిన్న జీవితాన్ని సాంద్రంగా బొమ్మకట్టించాల్సిన అవసరం ఏర్పడింది. కవిత్వానికి ప్రాసంగికత సామాజిక ప్రయోజనమైంది. కవిత్వం సామాజిక ప్రయోజనమైనప్పుడు, ఫ్యూడల్ డాంబికాల భాష మారక తప్పలేదు. "వాడుక భాష" కావ్యభాషగా రూపొందక తప్పలేదు. మెప్పుల కోసమో, గొప్పలకోసమో కవిత్వం రాజాస్థానాల్లో వినిపించే "కొలువు సరదా" మారి జన ప్రయోజనం, జీవన యథార్థం వాటిలో కనిపించే "ఘర్షణ" కవి కర్తవ్యంగా ముందుకు వచ్చింది.

ఫ్యూడల్ సమాజంలో పేరుకొని పోయిన ఒక్కొక్క భ్రమను కవి సందర్భోచితంగానే పూర్వ పక్షం చేస్తూ పోయాడు.

పూజారింట్లో పుట్టినా, ఏయే రుతువులో పూసే పూవులతో ఆయా వేళల్లో కొలిచినా, "ముదసలి మొగడే" "పూర్ణమ్మ"కు శాపం అయ్యాడు. భక్తితో కొలిచినా "దుర్గమ్మ" పూర్ణమ్మను కాపాడలేకపోయింది. దేవతాభావన జీవన వాస్తవికతలో చెల్లని భ్రమగా మిగిలిపోయింది. "కాసు"కు లోనైన "తండ్రి" పరాధీనుడైపోయాడు. ఆ–అశక్తతను నిర్దాక్షిణ్య కాలంలో ఎత్తి చూపడానికి గురజాడ చెప్పిన తీరు మానవత్వానికి మకుటమైంది.

ముదసలి మొగుడుతో వెళ్ళిపోయే సందర్భంలో అన్నలు వదినల్ని చేరదీసి "తల్లితండ్రిని కానండి" అంటుంది పూర్ణమ్మ –నలుగురు కూచొని నవ్వే వేళలో తన పేరును తలవమనేగాక, వారి పిల్లలకు "తన పేరు" పెట్టమంటుంది పూర్ణమ్మ –పూర్ణమ్మలో ప్రతీకారవాంఛ లేదు జరగబోయే విషయం జరిగే సందర్భంలో తొంగిచూస్తుంది సంస్కారంలా.

"కాసు" బలంగా మానవ సంబంధాల్ని నిర్ణయించగలుగుతున్నప్పుడు, తండ్రి తండ్రిగా వుండలేని పరాధీనత – ఈ విషయాలన్నీ "ఆర్థిక వాస్తవికత"లో దృశ్యీకరించి, మానవతను కాపాడాడు కాబట్టే గురజాడ "ప్రజాస్వామిక యుగ" చింతనకు "యుగకర్త"

"కన్యక"లో నేరుగా "రాజ్యం" దౌష్ట్యంగా ముందుకు వచ్చినప్పుడు, తిరిగి "ఆరాధ్యదేవత" ఎదుటే రాజ్యాన్ని ప్రశ్నించి అగ్నికి ఆహుతవుంది. చూస్తున్న లోకం, రాజుకుంటున్న చైతన్యం ప్రేక్షకులుగా వుండిపోక, కోటలు పేటలు కుక్కలకు, నక్కలకు ఆలవాలమయ్యే కాలం వచ్చినట్లు గురజాడ "భరత వాక్యం" పలుకుతాడు చివర–

అలాగే "దేశభక్తి"ని "ఈసురోమని మనుషులుండే దేశం"లో పునర్నిర్వచిస్తాడు. దేశమంటే మనుషులనే సంస్కారాన్ని, నాటుతాడు.

ఈ భావాలన్నీ, సంస్థానాలు పతనమవుతున్న రాజకీయ దృశ్యంలో, వలస రాజ్యంలో, ముందుకు వస్తాయి. మానవ సంబంధాల్ని ప్రశ్నిస్తాయి. వలస రాజ్యం కారణంగా "ఆధునిక సౌకర్యాలు" ఏర్పడి, ఉత్పత్తి సాధనాల్లో మార్పులు వస్తున్నాయి. "తండ్రి" కూతుళ్ళ అంతఃకరణలు ఇచ్చిపుచ్చుకోవడమనే అనివార్యతలో వేగిపోతాయి. ఈ మానవీయ పాత్రల పరాధీనతను సామాజిక చర్చలోకి తేవాలంటే తప్పనిసరిగా, కవితా రూపం ముత్యాలసరంగా మారక తప్పలేదు. పాత్రల మధ్య "నాటకీయత" తప్పలేదు.

కాబట్టి "వస్తువు" మారాల్సిన అవసరంలో, "రూపం" మారింది– "అభ్యుదయ కవిత్వం" (1935–1955) నాటికి "సామ్రాజ్యవాదం" బలంగా ముందుకు వచ్చి ప్రజల జీవిత విధానాన్ని శాసించే దశకు వచ్చేసింది.

ప్రపంచమొక పద్మవ్యూహం
కవిత్వమొక తీరని దాహం


.............. O ..............

**ఇప్పుడు "పునర్మూల్యాంకన" ప్రమాణాలు ఏర్పడుతున్నాయి కవిత్వం "ప్రైవేటు సెక్టార్"గా వుండలేదు. అది "పబ్లిక్ సెక్టార్"గా అభివృద్ధి చెందగలిగినప్పుడే ప్రాసంగికతను సంతరించుకుంటుంది.**

.............. O ..............


మానవ సంబంధాలు "మార్కెటు రాజకీయాలు"గా మారిన సందర్భంలో అంగళ్లలో ఆగమైన స్వగతాలు తెలిసీ తెలియని "సంస్కార దాహం"తో కొట్టుమిట్టాడింది. ఉత్పత్తి సాధనాల్ని స్వాధీనం చేసుకున్న వారు, ఇటు జీవితాన్ని అటు సమాజాన్ని మొత్తంగా దేశాన్ని కలిసికట్టుగా ప్రపంచాన్ని పిడికిట పట్టుకోగలిగారు.

సామ్రాజ్యవాదుల్ని ఎదుర్కొనే సందర్భం దళారుల్ని పసికట్టే సంఘటన అన్ని విశ్వాసాలు పటాపంచలైన కాలం మనిషి "బాటసారి"గా వలస పోక తప్పని కలల దుమారం జీవితాన్ని 'సమష్టి చింతన'లోకి నెట్టింది.

అందువల్ల కవిత్వం (సాహిత్యం కూడా) కదిలే చైతన్యంగా కదిలించే స్ఫూర్తిగా, మారే కర్తవ్యంగా, మార్పించే ప్రభావంగా పాడే ఆలాపనగా పాడించే ప్రేరణగా, పెను నిద్దుర వదిలించే యుగ సందర్భంగా, పరిపూర్ణపు బతుకిచ్చే సామాజిక (నిర్మాణ) సంస్కారంగా దగాపడిన తమ్ముళ్ళ సంఘీంభావంగా ఆమూలాగ్రం మారిపోయింది(మెటమార్ఫసిస్)

సమాజంలో వర్గవిభజన వున్నట్లుగానే, కవిత్వంలోనూ సాహిత్యంలో "పోలరైజేషన్" జరిగింది. కొనసాగుతూ వుంది.

ఇప్పుడు "పునర్మూల్యాంకన" ప్రమాణాలు ఏర్పడుతున్నాయి కవిత్వం "ప్రైవేటు సెక్టార్"గా వుండలేదు. అది "పబ్లిక్ సెక్టార్"గా అభివృద్ధి చెందగలిగినప్పుడే ప్రాసంగికతను సంతరించుకుంటుంది.

'ప్రపంచీకరణ' సందర్భంలో కవిత్వం ఇంకా ఇంకా "సమష్టి చింతన"గా సంఘటిత పడాల్సిన అవసరం ఏర్పడింది. అయితే "సామ్రాజ్యవాద సంస్కృతి" ముందుకు తెచ్చిన "వ్యష్టి ప్రయోజనం" (Subaltern Movement= ఉపజాతుల ఉద్యమం లేక అధీన తరగతుల ఆందోళన) కుల, మత, ప్రాంత, లింగ, వివక్షలతో "వేరు కుంపట్ల"ను స్వచ్ఛంద సంస్థల ద్వారా ప్రోత్సహిస్తూ వుంది.

అది వారి ప్రయత్నం– మన ప్రయత్నం ఏం కావాలి? కవిత్వంలో "సంక్లిష్టత" లేదు. ఉందని కొందరి భావన – సమస్య తెలుసు, పరిష్కారం తెలుసు కర్తవ్యం దగ్గర ముఖ్యంగా నిబద్ధత, నిర్మాణం దగ్గర వచ్చిన మీనమేషాలేలేని "సంక్లిష్టత"ను సృష్టిస్తూ వుంది మధ్య తరగతి మేధావివర్గం.

అమెరికా సామ్రాజ్యవాదం, ప్రపంచ శత్రువు–మతోన్మాదం ప్రజాస్వామ్య శత్రువు – మీరు శాసిస్తున్న జీవితం "మార్కెటెకానమీ"లో దివాలా తీస్తున్న సామాన్యుల కలల ప్రపంచం –చెదిరిన కలల్ని చేరదీయడంలోనే "కలిసమయం" పండాలి – మన ఇష్టానిష్టాలపరంగా సమాజం వుండదు. దాని వైరుధ్యాల్లోకి వెళ్ళడంలో "అవగాహన – అభివ్యక్తి" ప్రజాస్వామిక కర్తవ్యంగా అభివృద్ధి చెందాలి. ప్రపంచానికి వెలుగు ఆఫ్రికా ఆసియా సంస్కారాలే అవి సంఘటిత పడాలి. ఉద్యమించాలి. ఆ ఉద్యమ వికాసానికి సాహిత్యం దోహదపడాలి" సొంత కుంపట్లు" త్వరగానే చల్లారుతాయి. కాగడాలు చల్లారవు–చల్లారగానే వెలిగించాలనే స్పృహ, నిబద్ధత కాగడాల్ని ఎత్తి పట్టుకునేట్లు చేస్తాయి. కాగడాలు ఉద్యమాలు – అవి చల్లారవు. ఆరవు.

చిక్కల్లా "వైరుధ్యాల్ని" అర్థం చేసుకోవడంలో వుంది. అశేష ప్రజానీకానికీ, చావని ఫ్యూడలిజానికీ వైరుధ్యం చరమస్థాయికి వచ్చేసింది. మానవ సంబంధాలు ఆ కారణంగా విచ్ఛిన్నం అవుతున్నాయి. – జీవితాలు వలసలై రాలిపోతున్నాయి. ఇక్కడ కవిత్వం ధైర్యం ఈయాలి.




Untitled-2 52 6/11/2002, 3:51 PM

పతితులార భ్రష్టులార
బాధాసర్ప దష్టులార
శనిదేవత రథచక్రపుటిరుసులలో
పడినలిగిన హీనులార దీనులార
మీ బాధలు మా గాథలు నెనెరుగుదు
ఏడ్వకండి ఏడ్వకండి ఏడ్వకండి"

అంటూ కవిత్వం (వివిధ సాహిత్య ప్రక్రియలు) పీడితులతో మమేకం చెందాలి. (ఈ ప్రక్రియలో సంక్లిష్టత వుండదు) అహంకారం వదలాలి – అనిశ్చితత్వం వదలాలి – నమ్మేదానితో మమేకం చెందాలి.


**నాటకం థియేట్రికల్ దశ దాటి రాలేదు. 'కన్యాశుల్కం' జ్ఞానం కాని, "మా భూమి" కర్తవ్యం కాని నేటి నాటకానికి లేకుండాపోయింది. అమెచూర్ అభినయం పరిషత్తు పోటీల్లో తప్పిపోయింది.**


పెట్టుబడిదారీ సంస్కృతి ప్రభావంలో తప్పనిసరిగా వ్యక్తి సుఖవాదుల్లో "వస్తువు"కూ రూపానికీ వైరుధ్యం వస్తుంది. వీరికి దిశానిర్దేశం వుండదు. సామాజిక దశలు తెలియవు – సంక్షోభాలు అర్థం కావు – అశాంతి బోధపడదు "మేకు"లా బిగించుకపోవడం ప్రత్యేకత అనుకుంటారు "శిల్ప" (మనే భ్రమ) "వస్తువై" కూచుంటుంది. "చితి", చితిగా కాక "చింత"గా కాలిపోతుంది.

"ధనస్వామ్యానికి" పర్యాయపదంగా 'ప్రజాస్వామ్యం' చెలామణి అవుతున్న సందర్భంలో అన్ని జీవన ప్రమాణాలు సంక్షోభానికి బలవుతాయి. కవిత్వం, "క్యాలెండర్ కవిత్వం" అవుతుంది. చమత్కారంగా రాణించాలని చూస్తుంది. "రూపాల కత్తిరింపులు మొదలవుతాయి. కవిత్వాం దిశాహీనం కావడం ప్రత్యేకత అవుతుంది. కవి లౌక్యుడవుతాడు. రోజువారీ సంఘటనలు దృశ్యాలు కావు – యాదృచ్ఛిక విశేషాలు అంతకన్నా కావు. అవి తప్పించుకు తిరిగే కర్తవ్య విహీనతల విస్ఫోటనలు, విస్ఫోటనల్ని ఆపలేని దశ. వాటి ప్రతి క్రియల్నైనా ప్రతిఘటించగలిగే చైతన్యాన్ని సమీకరించాలి.

మితవాదంవల్ల సంస్కరణవాదం దగ్గర చింతన ఆగిపోయింది. అతివాదంవల్ల శూన్యం ఆవహించి కర్తవ్యం ప్రతిష్టంభనకు గురైంది. ఈ వైరుధ్యాల మధ్య "అభివ్యక్తి" "ప్రదక్షిణం" చేస్తూ వుంది "ఆత్మాశ్రయతత్వం" కవికి గ్రహణంలా పట్టిపీడిస్తూ వుంది. భావ కవిత్వా కాలంలో వచ్చిన ఆత్మాశ్రయతత్వం అభ్యుదయ కవిత్వ కాలంలో ఆత్మాశ్రయతత్వం సామాజీకరింపబడింది.

భూతాన్ని
యజ్ఞోపవీతాన్ని
వైప్లవ్యగీతాన్ని నేను
స్మరిస్తే పద్యం
అరిస్తే వాద్యం
అనల వేదికముందు అస్త్రనైవేద్యం

ఇక్కడ "యజ్ఞోపవీతం" (సాంప్రదాయవారసత్వం) జన్మస్థానం – గమ్యస్థానం "వైప్లవ్యగీతం" అయింది. రెండింటి మధ్య క్రమ వికాసం వుంది. ఫ్యూడల్ స్పృహ వైప్లవ్య "శంఖారావం" అయింది. "యజ్ఞోపవీతం" దగ్గరే ఆగిపోతే కులస్పృహ గొంతుకు పట్టుకుంటుంది– "వైప్లవ్యగీతం" దాకా సాగిపోతే వికాసం "అనలవేదిక ముందు అస్త్రనైవేద్యం" అవుతుంది– "లోకాలు" చూసే "ఐ" భవభూతి శ్లోకాలు (ఏకోరసఃకరణ ఏవ వీర రసంగామారి) విరాట్ రూపం ధరించి ''వైప్లవ్యగీతం''గా రెపరెపలాడుతుంది. Subaltern భావజాలంనిన్నటి విప్లవకారుని నేటి "విప్లవ ప్రతీఘాతుక శిబిరం"లోకి నెడుతుంది. ప్రతీకల క్రమ వికాసాన్ని సామాజిక సందర్భంలో చూడాలి. జన్మస్థానాలు ముఖ్యం కాదు – గమ్యస్థానాలు లక్ష్యం కావాలి. జన్మస్థానాల్ని ముఖ్యం చేసే "ఉపజాతుల ప్రత్యేకవాదం" విప్లవ ప్రతీఘాతుక పాత్రనే నిర్వహిస్తుంది నేటి

"ప్రపంచీకరణ" సంక్షోభంలో–
మన ఆలోచన మన చుట్టే తిరగరాదు
మన అవగాహన మనతోనే ముగిసిపోరాదు
మన జన్మస్థానం ఒక సామాజిక సందర్భం
మన గమ్యస్థానం ఒక చారిత్రక కర్తవ్యం

పునర్మూల్యాంకనానికి సామాజిక దశే గీటు రాయి కావాలి. ప్రజాస్వామిక సమాజానికి సాహిత్య ప్రమాణాలు ఏర్పడాలి. "వస్తువు" ఎన్నికలో "రూప" నిర్ధారణలో సామాజిక చింతనే సందర్భం కావాలి. అధిక సంఖ్యాకుల ప్రజల ప్రయోజనం అనివార్యం 'సంఘటిత శక్తి నిర్మాణం' తక్షణ కర్తవ్యం – జీవితం పునాది – సమాజం శీర్షిక – వైరుధ్యాల మధ్య ఈ దడమే నేటి కళారూపం – అలా ఈదే వారిని గుర్తించి రాయడమే సాహిత్యం బాధ్యత – విజ్ఞత కూడా–

కవిత్వం ఊహా సుందరి
ఆమెను నేల మీదకు తేవాలి
కథ కూతురులాంటిది
ఆమెను పెంచి పెద్ద చేసి ఇల్లాలును చేయాలి
నవల తల్లిలాంటిది
వైరుధ్యాల మధ్యవేగే బాధ్యత కావాలి
నాటకం ఇల్లొదిలిపోయిన కొడుకులాంటి వాడు
వాణ్ణి వెతికి పట్టుకోవాలి ఇంటిని సమాజాన్ని ఏకం చేయాలి
విమర్శ బరువులు మోసే తండ్రి లాంటివాడు
విజ్ఞత బాధ్యతల్లో వివేకం పండించే సామాజిక దశ కావాలి

ఇది వరకు రష్యా నవల అంతర్జాతీయంగా ప్రపంచాన్ని ఆవహించింది. ఫ్యూడల్ సమాజంలో నలిగిపోయే మానవ విలువల్ని నవల ఎత్తి చూపింది. గోర్కీ వచ్చి నవల రూపురేఖల్ని మార్చేశాడు. (అమ్మ) ఇంటిని సామాజిక వికాసం చేశాడు. బెంగాలీ నవల "రివైవలిజం" (బంకిం) నుండి "రినైజన్సు" (టాగూరు) వైపు మళ్ళడానికి "అంతఃకరణ" (శరత్‌బాబు) వండించడానికి చాలా కష్టపడింది. విశ్వనాథ (వేయిపడగలు) తిరోగమనవాదాన్ని ప్రవేశపెడితే ఉన్నవ లక్ష్మీనారాయణ (మాలపల్లి = "సంఘవిజయం") సంస్కరణవాదాన్ని చర్చనీయాంశం చేసి ప్రజాస్వామ్యానికి పునాదులు వేశాడు. ఫ్యూడల్ సమాజం, పగుళ్ళలో కొన ఊపిరి పీలుస్తూ వుంది. అందువల్ల నవల ప్రయోజకత్వం వెనుకపడింది. దానికి సాంఘిక రూపం రావాలి.

కథ వీలైనంతగా ఆత్మాశ్రయం దారిపట్టి, ప్రాంతీయ నైశనిగ్యమై సమష్టి బాధ్యతను దూరం చేసుకోవడానికి అన్ని ప్రయత్నాలు చేస్తూ వుంది.

నాటకం థియేట్రికల్ దశ దాటి రాలేదు. 'కన్యాశుల్కం' జ్ఞానం కాని, "మా భూమి" కర్తవ్యం కాని నేటి నాటకానికి లేకుండాపోయింది. అమెచూర్ అభినయం పరిషత్తు పోటీల్లో తప్పిపోయింది. సినిమాకి, టీవీకి మొదటి మెట్టుగా నాటకం వుండిపోయింది. అంతటా అభినయ చమత్కారమే మిగిలింది.

విమర్శ – రాగద్వేషాల కతీతంగా వుండలేకపోతూ వుంది. "లాబీల" సృష్టికి పూర్వరంగమవుతూ వుంది. "పొలిటికల్ ఎకానమీ" ఆధారంగా సాహిత్య విమర్శ అభివృద్ధి చెందాలి.

కవిత్వం – ఆత్మ ప్రదక్షిణంలో సామాజిక విచక్షణను కోల్పోతూ శిల్పాన్ని వస్తువు చేసుకుంటూ వుంది.

వీటన్నిటికి భిన్నంగా ఉద్యమాల్లో ఉన్న వారు, ప్రజలకు సమాజానికి కట్టుబడిన వారు నిబద్ధతతో అన్ని ఆటంకాల్ని అధిగమిస్తూ



Untitled-2 53 6/11/2002, 3:51 PM

ప్రజల్ని చేరడానికి, సామాజిక సందర్భాల్ని ముందుకు తేవడానికి ప్రయత్నిస్తూనే వున్నారు. లోనా బయటా పోరాడుతూనే వున్నారు. పాట పతాక స్థాయిలో వుంది.

ప్రజాతంత్ర విప్లవానికి తగిన ఆలోచనలు చర్చలోకి రావాలి – "రచన ప్రయోజనం కోసం" అనేది సుస్పష్టం – వైయక్తిక అనుభూతులు సామాజిక చింతనలో సమష్టి చైతన్యాలు కావాలి. నిత్య కవులు కావడం కన్నా సత్య కవులు కావాలి. భావ దారిద్ర్యంలో అశ్లీలాలు చోటు చేసుకోరాదు.

"రాజ్యాన్ని" దాని క్రూరమైన అణచివేతను ప్రజల ముందుకు తేవాలి. నిర్బంధాన్ని ప్రజలు ప్రతిఘటించేట్లు "నిర్మాణాన్ని" చేపట్టేటట్లు చూడాలి.

ప్రజల మధ్య పాలక వర్గాల కారణంగా వచ్చే వైరుధ్యాల్ని చాలా జాగ్రత్తగా పరిష్కార మార్గం వైపు మళ్లేట్టు ప్రజల అవగాహనను, సమష్టితత్వాన్ని "ప్రపంచీకరణ" నేపథ్యంలో అభివృద్ధి చేయాలి. ప్రజలే అంతిమ నిర్ణాయక శక్తులు.

కుల, మత, ప్రాంత, లింగ, భాషా వివక్షతల కారణంగా ప్రజల్లో పెరిగే వైరుధ్యాల్ని, పాలక వర్గాల కుట్రలుగా బహిర్గతం చేయాలి. సామ్రాజ్యవాద జోక్యం వారీ విధానాల్ని ఎదుర్కొనేట్లు చేయాలి.

అనుభూతులు–అనుభవాలు పరస్పర పూరకాలు – ఈ సంక్షుభిత సమాజంలో ఎవరూ తమ సమస్యల్ని తామే ఒంటరిగా పరిష్కరించుకోలేరు. అలా అనుకొని కుల సంఘాలు పాలక వర్గాల పావుకాయలయ్యాయి. వివక్ష ఉద్యమాలు సామ్రాజ్య వాదుల ప్రయోజనాల్ని కాపాడేదిశలో స్వచ్ఛంద సంస్థలయ్యాయి. మానవ హక్కులూ శేష ప్రశ్నలయ్యాయి.

అంతర్జాతీయంగా అమెరికా, ఐరోపా సమాజం ఆర్థిక ప్రపంచాన్ని గుప్పిట పెట్టుకుంటాయి. సైనిక కూటములు ఒప్పందాలు, ప్రాదేశిక యుద్ధాలు, అణ్వాయుధ పోటీలు, దళారీ ప్రభుత్వాలు "మనిషి"ని "సరుకు" చేసి లొంగదీసుకొని పనికి రాకుండా చేస్తాయి. "యుద్ధ భయం" బడుగు దేశాల్ని వణికిస్తాయి. సామ్రాజ్యవాదుల శిబిరాలుగా నయా వలస దేశాల ప్రభుత్వాలు కుట్రలు కూహకాలు చేస్తాయి.

ఎక్కడ ఎప్పుడు పాలస్తీనా, ఆఫ్ఘనిస్తాన్, ఇరాక్ లాంటి సంక్షోభాలేర్పడుతాయో! వణికించే కాలం వ్యాపిస్తుంది.

ప్రపంచ శాంతి సంస్థలు, ఐక్యరాజ్య సమితి, అలీనోద్యమం ప్రపంచవాణిజ్య సంస్థలు (డబ్ల్యుటిఒ), ప్రపంచ బ్యాంకు, ప్రపంచ ద్రవ్య సంస్థ(ఐఎంఎఫ్)మున్నగు సంస్థలన్నీ సామ్రాజ్యవాదుల దుర్మార్గాల కేంద్రాలవుతాయి. పెట్రోడాలర్ల సంక్షోభం పెరుగుతుంది. స్థానియద్ధాలు అనివార్యం అవుతాయి. నాటో కూటమి అంతటా శాసించాలని చూస్తుంది.

అయితే సామ్రాజ్యవాదుల మధ్య వైరుధ్యాలు మార్కెట్ల పోటీ, బహుళజాతి సంస్థల బరితెగింపు దురాశ వారి ఆటలు వారినే కట్టిపడేస్తాయి.

"కాంకున్"లో ఎదురైనట్లు ఎదురుసవాళ్ళు బలహీనంగానైనా ఎదురవుతాయి. ప్రజల అసంతృప్తిని ప్రభుత్వాలు దాటవేయలేవు.

వ్యవసాయాన్ని కార్పొరేట్ సెక్టారుకు అప్పగించచూస్తున్న మన ప్రభుత్వాల్ని ప్రజలు ఎదిరిస్తారు. మతోన్మాదం రెచ్చినా రాజకీయాల్ని శాసించలేవు. ఆర్థిక దిగ్బంధంలో వున్న సామాన్యులు శ్రమజీవులు ఆర్థికేతరంగా ప్రవర్తించరు. ఆర్థిక సంక్షోభం రాజకీయ అశాంతికి దారితీస్తుంది.

ఈ సంక్షోభంలో కవిత్వం కనువిప్పు కవిత్వం ఊరటక కవిత్వం ఆత్మవిశ్వాసం కవిత్వం సంఘటిత శక్తికి కవిత్వం సంస్కారయుద్ధం – అన్నీ సాహిత్య ప్రక్రియలకు వర్తించే చైతన్యం ప్రజాస్వామిక చింతనను, పెంచాలి.

సామ్రాజ్యవాద ప్రతిఘటన అనివార్యం
సంఘటిత శక్తుల జైత్రయాత్ర తక్షణ కర్తవ్యం
నిన్నటి దుఃఖం నేడు కనువిప్పు
నేటి వెలుగుల ఆత్మవిశ్వాసం
రేపటి స్వప్నసాక్షాత్కారం
సాహిత్యం సామాజిక చైతన్యం
కవిత్వం సంఘటితపరిచే సంస్కారం

గతం నుండి గుణపాఠాలు అన్ని విషయాల్లోనూ తీసుకోవాలి. కవిత్వాన్ని చెక్కడంలో సామాజిక బాధ్యతను విస్మరిస్తే "వస్తువు" లేని కవిత్వం దిశాహీనం అవుతుంది. ఈనాటి సామాజిక సందర్భం, సమాజాన్నే సంబోధించాల్సిన బాధ్యతను తెచ్చిపెట్టింది. వస్తు శిల్పాల సమన్వయంలో ప్రయోజనం కావ్యమై వెలుగుతుంది.

అభివ్యక్తికి అవగాహన చాలా ముఖ్యం. అందుకు అధ్యయనం తప్పనిసరి. వైరుధ్యాల అధ్యయనం అవగాహనను పెంచుతుంది. జీవితాన్ని స్పష్టం చేస్తుంది. జీవితం స్పష్టం అవుతే జీవనయాత్ర సామాజికం అవుతుంది.

ఎవరి స్వగతాల్లో వారు చిక్కుకొనిపోయే వైరుధ్యాల్లో కవిత్వం (సాహిత్యం) స్వగతాల్ని సామాజీకరించాలి.

"లక్ష నక్షత్రాలు రాలందే ఉజ్వల ఉదయం ప్రభవించదు
కోటి స్వగతాలు పోరాడందే ఉన్నత సమాజం ఆవిష్కరించదు"

V

# ఎంతదూరం బారజూసినా!

**మంచికంటి**



నీళ్ళు నిండిన కళ్ళు
బారజూసే చూపు
చేతిలో ములుగర్ర
పామైకరుస్తోంది

ఆశ చావని చూపుల్నిండా
అందని ఆరుతడి నీళ్ళు
ఎండుతున్న పైరెనక
ఎన్ని చావులు నెమరేసుకుంటున్నాయో!

ఎన్ని యోజనాలు నడిచినా
కానరాని వాగ్దానాలు
సాగుతున్న మాటలనిండా
పారలేని సాగునీరు

వలస బతుకులకు
వలపులుండవు
ఎక్కే బస్సు దిగే బస్సులకు
తెంపులుండవు
పొద్దు ఏరోజెక్కడ పొడుస్తుందో
తెలియనే తెలియదు

ఆకలి పంటల్నుండి
ఆశల మంటల దాకా
ఈడ్చుకెళ్ళిన ఎవరో
చూరుకింద కూర్చుని
లెక్కలు జూసుకుంటున్నారు
కాయక్కాయ దిగమింగి
తృప్తిగా తేపుతున్నారు

కోతలు కోతలుగా సాగిన
ఊబిలోంచి
నవ నాగరికత
క్రాప్ హాలిడే ప్రకటించుకుంది



Untitled-2 54 6/11/2002, 3:51 PM

# నిర్మాణవాద భాషాశాస్త్ర అంశాలు

**తెలుగులో భాషాశాస్త్రరంగంలో పని చేసిన చేరా, భద్రిరాజు, బూదరాజు వంటి భాషా శాస్త్రజ్ఞులకు Saussurian linguistics పరిచయం లేదని వారి రచనలవల్ల తెలుస్తుంది. వారి గ్రంథాల్లో ఎక్కడా ససూరే పేరు రెఫరెన్స్‌గానైనా కన్పించదు. చేరా భాషాశాస్త్ర అంశాల్ని కవిత్వానికి అన్వయించి చేసిన విమర్శ భాషా విమర్శే కాని నిర్మాణవాద సాహిత్య విమర్శకాదు. ఆధునికానంతరవాదం, వినిర్మాణవాదం, స్త్రీవాదం వంటి సిద్ధాంతాలన్నీ దాదాపు ఒకే కాలంలో ఉద్భవించినవి. నిర్మాణవాదం, వినిర్మాణవాదాలు రెండూ భాషాశాస్త్ర జ్ఞానంతో అధ్యయనం చేయాల్సినవి.**

**జిలుకర శ్రీనివాస్**

సాహిత్య సిద్ధాంతాల్లో శాస్త్ర ప్రతిపత్తిని సాధించింది నిర్మాణవాదం. భాషావేత్త అయిన ఫెర్డినాండ్ ది ససూరే (Ferdinand de Saussure) భాషాశాస్త్రంలో ప్రతిపాదించిన నూతన అంశాలు ఇతర శాస్త్రాల్ని కూడా ప్రభావితం చేశాయి. Roland Barthes, Gennete, Reffetare, Julie Kristeva, Todorove, Jackobson, Jonadhan culler వంటి ప్రసిద్ధులు ససూరే ప్రతిపాదిత అంశాల్ని సాహిత్యానికి సృజనాత్మకంగా అన్వయించి చూపారు. తెలుగులో భాషాశాస్త్రరంగంలో పని చేసిన చేరా, భద్రిరాజు, పి.యెస్, బూదరాజు వంటి భాషా శాస్త్రజ్ఞులకు Saussurian linguistics పరిచయం లేదని వారి రచనలవల్ల తెలుస్తుంది. వారి గ్రంథాల్లో ఎక్కడా ససూరే పేరు రెఫరెన్స్‌గానైనా కన్పించదు.

చేరా భాషాశాస్త్ర అంశాల్ని కవిత్వానికి అన్వయించి చేసిన విమర్శ భాషా విమర్శే కాని నిర్మాణవాద సాహిత్య విమర్శకాదు. ఆధునికానంతరవాదం, వినిర్మాణవాదం, స్త్రీవాదం వంటి సిద్ధాంతాలన్నీ దాదాపు ఒకే కాలంలో ఉద్భవించినవి. నిర్మాణవాదం, వినిర్మాణవాదాలు రెండూ భాషాశాస్త్ర జ్ఞానంతో అధ్యయనం చేయాల్సినవి. విమర్శలో వీటికి సంబంధించిన సిద్ధాంత అంశాల్ని అన్వయించటం కష్టంతో కూడింది కావడంవల్ల తెలుగు భాషా సాహిత్యంలో వీటి మీద తగినంత అధ్యయనం, పరిశోధన, చర్చ జరగలేదనిపిస్తుంది.

నిర్మాణవాద సాహిత్య సిద్ధాంత పునాదైన నిర్మాణవాద భాషాశాస్త్ర అంశాల్ని ప్రాథమికంగా పరిచయం చేయడం వ్యాసోద్దేశం.

ససూరే బోధించిన భాషాశాస్త్ర పాఠాల్ని ఆయన విద్యార్థులు course in General Linguistics పేరుతో ప్రచురించారు.

ఆయన భాష-భాషణాలను విడదీసాడు. సమాజం-వ్యక్తి రెండిట్నీ విడదీసి సంబంధాన్ని విశ్లేషించాడు. భాష అనేది వక్తృక్రియ కాదు. సామాజికోత్పత్తి అయిన భాషను వ్యక్తి నేర్చుకుంటాడు. వాగ్వ్యవహారం వైయక్తికమైంది. వక్తబుద్ధి, ఇష్టం వాగ్వ్యవహారంలో కన్పిస్తాయి. భాషా సంకేతాల ద్వారా ఆలోచనల్ని వ్యక్తీకరించడానికి తోడ్పడుతున్న సంయోజనాలను అనుమతిస్తున్న మనోవ్యాపారం ఎలాంటిదో స్పష్టపరుచు కోవాల్సిన అవసరాన్ని ససూరే గుర్తించాడు.

భాష గురించి ఆయన చెప్పిన అంశాలివి. "వివిధ సమూహాలు మాట్లాడుకునే యథార్థంగా భాష నిర్వచించబడింది. భావంతో శబ్దచిత్రం సాంగత్యం పొందిన వాగ్వృత్తి పరిమిత అంశంగా కూడా చెప్పవచ్చు. సమూహం అంగీకారంతో ఏర్పాటు చేసుకున్న యథార్థం భాష. వ్యక్తి దాన్ని సృష్టించలేడు. మార్చలేడు. ఇది భాషణానికున్న సామాజిక కోణం. వ్యక్తి భాషా ప్రవృత్తిని నేర్చుకునేందుకు ఎప్పుడూ కృషి చేస్తూ, సేవ చేస్తూ ఉండాలి. పిల్లలు నెమ్మదిగా నేర్చుకుంటారు. అలా నేర్చుకోవాల్సి రావడమే దాని ప్రత్యేకత (course in General Linguistics :1910-11)

అయితే భాషాశాస్త్ర నిర్మాణం భాషేతర అంశాల్ని విడిచిపెట్టడం వల్లనే సాధ్యం అవుతుందంటాడు. భాషణం వివిధమైంది. భాష ఏకవిధమైంది. భాష అనేది అర్థవంతమైన సంకేతాల వ్యవస్థ. శబ్దచిత్రం, అర్థం అనే రెండు మనో అంశాల సాంగత్యంవల్ల ఏర్పడిందంటాడు.

భాష నిర్దిష్టమైంది. భాషణం కన్న నిమ్నమైంది కాదు. భాషా సంకేతాలు మౌలికంగా మానసికమైనవే అయినప్పటికీ అస్పష్టమైనవికావు. సమష్టి ఆమోదం పొందిన సాంగత్యాలు. వాటి సంయోజనవల్ల భాష ఏర్పడుతుంది. అవి మనసులో నిక్షిప్తమైన వాస్తవాలు.

భాష సామాజిక వ్యవస్థ అయినప్పటికీ అనేక లక్షణాలవల్ల రాజకీయ, న్యాయ తదితర వ్యవస్థలకు భిన్నమైంది. ఈ క్రమంలో "Language is a system of signs that express ideas, and is therefore comparable to a system of writing, the alphabet of deaf-mutes, symbolic rites, polite formulas, military signals, etc. But it is the most important of all the systems" అనే నిర్వచనం ఇచ్చాడు.

అర్థవ్యక్తీకరణ సంకేతాల వ్యవస్థ భాష. అందువల్ల లేఖనం, బధిరుల సైగల అక్షరాలు, ప్రతీకాత్మక ఆచారాలు, మర్యాదా పద్ధతులు, మిలిటరీ చిహ్నాలు వంటి వాటితో పోల్చదగింది. కాని, అన్నిటికీ సంకేత వ్యవస్థ ప్రధానమైంది. సంకేతాల అధ్యయన శాస్త్రం ఊహించదగ్గది. అది సామాజిక మనస్తత్వంలో భాగంగా ఉంటుంది. అదే క్రమంలో సాధారణ మనస్తత్వ భాగమవుతుంది. దీనికే Semiology అని పేరు పెట్టాడు. సంజ్ఞాశాస్త్రం (Semiology) ఏది సంజ్ఞను ఏర్పర్చిందో, ఏ సూత్రాలు దాన్ని నడిపిస్తున్నాయో చూపిస్తుంది.

ససూరే రెండు కీలకమైన పారిభాషిక పదాల్ని ప్రయోగించాడు. అవి Lalangue, Parole. భాషా వ్యవస్థను langue అని, వైయక్తిక భాషణాన్ని Parole అని స్పష్టపర్చాడు. ఈ రెండిటి గతితర్క విభజన భాషాశాస్త్రం, నిర్మాణవాదంలో కీలకమైంది.

ప్రతీ భాష కొన్ని నియమాలు, పద్ధతులు, ఆనవాయితీలను కలిగి ఉంటుంది. శైశవదశ నుండి పిల్లలు తల్లిదండ్రులు, చుట్టూ వున్న వారు మాట్లాడుకునే ధ్వనుల్ని, అర్థాల్ని గ్రహించి పెద్దవారయ్యేటప్పటికి వ్యాకరణ



Untitled-2 55 6/11/2002, 3:51 PM

యుక్తంగా మాట్లాడుతారు. ఇదీ వ్యాకరణం, వాక్యనిర్మాణం, ఉచ్చారణ అని ప్రత్యేకంగా బోధించకుండానే సహజ గ్రహణవల్ల మాట్లాడతారు. Jameson సమాజ ఉత్పత్తి అయిన వాగ్శక్తిని వినియోగించడానికి వ్యక్తిని అనుమతించే ఖచ్చితమైన నియమాలు, ఆనవాయితీలను langue అని, సముద్రంలో పైకి కన్పించే మంచుకొండ శిఖరం Parole అని చెప్పాడు.

ఇంకా స్పష్టపర్చడానికి ససూరే చెస్‌ని ఉదాహరణగా తీసుకున్నాడు. భాషా వ్యవస్థ, చెస్‌ల మధ్య సారూప్యతని చెప్తూ A game of chess is like an artificial realization of what language offers in a natural form" అంటాడు. భాష, చెస్ ఆటల ప్రవృత్తిని చెప్తూ "మొదట చెస్ ఆటగాళ్ళ స్థితి భాషా స్థితికి చాలా దగ్గరగా ఉంటుంది. పదం విలువ మిగతా పదాలతోగల భిన్నస్థానంపై ఆధారపడి ఉన్నట్టు చెస్ పావుల విలువ చెస్‌బోర్డుపై వాటి స్థానాన్ని బట్టి ఆధారపడి ఉంటుంది.

రెండు, వ్యవస్థ ఎల్లప్పుడూ చలనశీలమైంది. ఒక స్థితి నుండి మరో స్థితికి మారుతుంది. మార్పులేని నియమాలపై విలువలు ఆధారపడి ఉంటాయనేది కూడా వాస్తవం. ఆట ప్రారంభానికి ముందు, పావు కదలిక తర్వాత నియమాలుంటాయి. ఒక్కసారి వాటిని అంగీకరించిన తర్వాత భాషలో కూడా మనుతాయి. అవే సంజ్ఞాశాస్త్ర స్థిర సూత్రాలు.

చివరగా, ఒక సమతౌల్య స్థితి నుంచి మరో స్థితికి మారడానికి, లేదా – మన పరిభాష ప్రకారం – ఏకకాలికత నుండి తర్వాతి దానికి ఒక్కపావు మాత్రమే కదులుతుంది. అన్ని పావులు కదిలే అవకాశం లేదు" అంటాడు.

Jonadhan culler, లాంగ్, పెరోల్ అనే వాటి పరిధిలోకి యే అంశాలు చెందుతాయనే దానిలో భాషా శాస్త్రంలో ఏకాభిప్రాయం లేదంటాడు. దీనితో నిర్మాణ వాదానికి సంబంధం లేదంటూ "...what does concern him is a fair way of distinctions which the differentiation of langue from parole is designed to cover : between rule and behaviour and between the functional and the non-functional" (structuralist poetics, P.8) నియమం–ప్రవర్తన, ప్రవృత్తి–అప్రవృత్తిల మధ్య తేడా నిర్మాణవాదికి కావాల్సిందంటాడు. ఇక్కడ అర్థబోధలోని నియమం, ప్రవృత్తిల విభజన ముఖ్యమైంది.

Langue, parole లకు Noam Chomsky competence, performence అనే పారిభాషిక పదాలు వాడాడు. చేరా తెలుగులో ప్రతిభ, ప్రవృత్తి అన్నారు.

'ప్రతిభ' అనే పదాన్నిక్కడ langue ఇచ్చే అర్థస్ఫూర్తినించే జ్ఞాపకం ఉంచుకోవాలి. కావ్యహేతువుల్లోని 'ప్రతిభా వ్యుత్పత్తి అభ్యాసాల్లోని ఒకటిగా గ్రహించకూడదు.

ప్రతిభ వ్యవహర్త ప్రవృత్తిని నియంత్రిస్తుంది. అయితే కొన్నిసార్లు ప్రవృత్తి ప్రతిభ నుండి విభేదించవచ్చు. culler దీన్ని వివరిస్తూ "ప్రవృత్తి ప్రతిభ నుండి విభేదించవచ్చు. అనుకోకుండా ఒకరి ఆలోచన మారటంవల్లగానీ, ప్రత్యేక ఫలితం ఉద్దేశించిగాని వ్యాకరణవిరుద్ధ ప్రయోగం చేస్తే వెంటనే గుర్తించవచ్చు. ఆ ఉచ్చారణపై నిర్ణయ ప్రకటన చేసేటప్పుడు వక్త 'ఎఫెక్టు'ను సాధించడానికి చేసిన నియమోల్లంఘనగా భావించాలి" అంటాడు.

నిజానికి ప్రతిభ నియమాల్ని గ్రహించడంలో, వాటికి లోబడి ప్రవర్తించేలా చూట్టంలోనూ సహజ గ్రహణగా పని చేస్తుంది. అర్థం చేసుకోవడం, వ్యాకరణ సహితంగా అర్థవంతంగా మాట్లాడ్డంలోనూ అదృశ్యంగా వ్యవహరిస్తుంది. ఇది అచేతనమైంది. వాగ్ప్రవృత్తి వక్త భాషా పరిజ్ఞానాన్ని డిమాండ్ చేస్తుంది.

............. O .............

**ఇంతకీ భాషా సంజ్ఞ అంటేమిటి? చాలా మంది వస్తువుల్ని సూచించేది అనుకుంటారు. ససూర్ భాష సంజ్ఞ పై చక్కని విశ్లేషణ చేశాడు. భాషా సంజ్ఞ వస్తువు, పేరుని కలిపేదే కాదని భావం, శబ్దచిత్రంలను కలిపి ఉంచేదంటాడు.**

............. O .............

ప్రవృత్తి, అప్రవృత్తిల మధ్య విభజనలో కీలకమైంది భేదకత. 'గోడలు ఎత్తైనవి' అనే వాక్యాన్ని భిన్న వయసు, లింగ, ప్రాంతాల వారు మాట్లాడేప్పుడు ధ్వని ఉచ్చారణలో తేడా ఉండొచ్చు. ఆ తేడాలు ప్రవృత్తిపరమైనవి. 'కోడలు ఎత్తైనవి' అని ఎవరూ అనరు. ।గో।డలు–।కో।డలు,ఈ రెండు పదాలు భిన్నార్థాలిస్తాయి. ।గో। ।కో। వర్ణాల అర్థభేదకతవల్ల వాక్యం వ్యాకరణవిరుద్ధమైంది. 'ఎత్తైనవి' అనే పదబంధంవల్ల 'కోడలు' అనే పదం ఈ వాక్యంలో అప్రవృత్తి అవుతుంది. అందువల్ల ఏవి ప్రవృత్తి గలవో నిర్ణయించటం సంకేతాల్ని స్పష్టపర్చటం అవుతుంది.

ఇంతకీ భాషా సంజ్ఞ అంటేమిటి? చాలా మంది వస్తువుల్ని సూచించేది అనుకుంటారు. ససూరే భాష సంజ్ఞ పై చక్కని విశ్లేషణ చేశాడు. భాషా సంజ్ఞ వస్తువు, పేరుని కలిపేదే కాదని భావం, శబ్దచిత్రంలను కలిపి ఉంచేదంటాడు. శబ్దం భౌతికమైందే అయినా దాని ముద్ర ఇంద్రియాలపై ప్రభావం చూపుతుంది. అందువల్ల శబ్దచిత్రం ఇంద్రియాత్మకమైంది. భాషను శబ్దచిత్రాలుగా ఏర్పర్చుకోవడంవల్ల పెదవులు కదల్చకుండా మనసులో మాట్లాడుకోగల్గుతున్నాం. అందువల్ల భాషా సంజ్ఞ రెండు పార్శ్వాలున్న మనోగతాంశం. దీన్నిలా చూపించవచ్చు.




ఈ రెండూ అవిభాజ్య అంశాలుగా కల్సిపోయాయి.

సంస్కృత పదం 'గౌః' అర్థం 'ఆవు'. గౌః అన్నది కేవలం సంజ్ఞ మాత్రమే కాదు. అది ఆవు అనే భావాన్ని మోస్తూ ఉండటంవల్ల ఉద్దేశిత అంశాన్ని స్ఫురింప చేస్తుంది.







సంజ్ఞ, సంకేతం, సంకేతితాలను స్పష్టపర్చవచ్చు.

సంజ్ఞ, భావం, శబ్ద చిత్రాలను సూచిస్తుంది. అలాగే సంకేతం, సంకేతితాలను కూడా సూచిస్తుంది.






Untitled-2 56 6/11/2002, 3:51 PM

ఈ మూడూ పరస్పర ఆధారితాలు. అదే విధంగా భిన్నమైనవి. ఒకటి మరోదాన్నించి భేదిస్తుంది. అయితే మొత్తంలో ఇవన్నీ భాగాలన్న సంగతి మరవద్దు. సంకేతితం (భావం) మారినప్పుడల్లా సంకేతం మారుతుంది.

ససూరే చెప్పిన మరో కీలకాంశం 'నిర్వ్యాజకత', 'భాషా సంజ్ఞ నిర్వ్యాజమైంది అంటాడు. 'పులి' అన్న సంజ్ఞలో పులి దంతాలు, గోర్లు, రాజసం కన్పించవు. కాని పులి స్వభావాన్ని రూపాన్ని, స్ఫురింపచేస్తుంది. ఇది సమాజం ఏర్పర్చిన నిర్వ్యాజకత. వ్యక్తి ఏర్పర్చింది కాదు.

............. O .............

**చిలుకమ్మ కవిత్వం రాస్తూ ఉంది అనే వాక్యంలోని పదాల మధ్య సంబంధం వల్ల అర్థవంతమైన వాక్యం ఐంది. ఈ వాక్యంలోని పదాలు ఒక్కదానికి ఒకటి భిన్నమైనవి. చిలుకమ్మ, కవిత్వం ఒక్కటి కాదు. కవిత్వం, రాయటం (క్రియ) ఒకటి కాదు.**

............. O .............

నిర్మాణవాద భాషాశాస్త్రంలో సంబంధం పరిశీలించదగ్గది. భాషా వ్యవస్థలో ధ్వని వర్ణాల అర్థనిర్ణయం వాటి భేదక సంబంధం (Oppositional Relation)పై ఆధారపడి ఉంటుంది. రాముడు-భీముడు, రెండు పదాల్లోని ।రా। ।భీ।లు ఒక్కటి కావు. ఒకటి రేఫం (రా), మరోటి ఓష్ఠ్యం (భీ) ఈ నాద ధ్వనుల భేదకత అర్థభేదకతకు కారణమవుతుంది. రాముడు, భీముడులలో ముడు=ముడుల మధ్య సమసంబంధం ఉంది. ।రా।=।భీ। ఇది విషమ సంబంధం.

చిలుకమ్మ కవిత్వం రాస్తూ ఉంది అనే వాక్యంలోని పదాల మధ్య సంబంధం వల్ల అర్థవంతమైన వాక్యమయింది. ఈ వాక్యంలోని పదాలు ఒక దానికి ఒకటి భిన్నమైనవి. చిలుకమ్మ, కవిత్వం ఒక్కటి కాదు. కవిత్వం, రాయటం (క్రియ) ఒకటి కాదు. ఉద్దేశనామం, విధేయనామం, క్రియ... ఇలా భిన్న పదాల సంయోజనలోని సంబంధంవల్ల వాక్యం ఏర్పడుతుంది. అందుకే culler భాష అనేది "system of inter-related items and the value and identity of these items is defined by their place in the system of relations rather than by their history" (structural poetics, P.11) అంటాడు. భాష అనేది అంతస్సంబంధ అంశాల వ్యవస్థ. ఆయా అంశాల విలువ, గుర్తింపు సంబంధాల వ్యవస్థలో వాటి స్థానాన్ని బట్టి నిర్వహించబడ్తాయి కాని, వాటి చరిత్రవల్లకాదు.

ఈ సంబంధాలు రెండు రకాలు. ఒకటి, ఒకే స్థాయి అంశాల మధ్య సంబంధం వ్యాపక సంబంధం (Distributional). భిన్నస్థాయి అంశాల మధ్య సంబంధం సమగ్ర సంబంధం (Intigrative). ధ్వనులు పదాంశాల్ని ఏర్పర్చటంలో, పదాంశాలు వాక్య స్థాపనలో వాటి సంబంధం, విలువ గుర్తించవచ్చు.

Benevenste కనిష్ఠాంశ రూపాన్ని, కనిష్ఠ స్థాయిలో దాని స్థానాన్ని ఉచ్చస్థాయి దాని అర్థనిర్ధాయక శక్తిని బట్టి నిర్వచించాడు. భాషా వ్యవస్థలో వాక్యం గరిష్ఠాంశం. పదాంశాల సంయోజనవల్ల వాక్యం ఏర్పడుతుంది. అందువల్ల నిర్మాణవాద విశ్లేషణ గరిష్ఠ అంశాన్ని కనిష్ఠ అంశాలుగా విడగొడుతుంది. ఇది వ్యాపక సంబంధం. గరిష్ఠాంశ నిర్మాణం సమగ్ర సంబంధంగా అర్థం చేసుకోవాలి.

మళ్లీ వ్యాపక సంబంధం రెండు రకాలు. ఒకటి విన్యాసక్రమ సంబంధం. రెండు అంశాల సంయోజనా సంభావ్యత ఈ సంబంధంలో ముఖ్యమైంది. ఆ సంయోజనా సంభావ్యత రెండు పారస్పర్యాల మధ్య లేదా అపరస్పర్యాల మధ్య, అనుగుణ్య-అననుగుణ్యతల మధ్య కావచ్చు.

రెండవది రూపావళి సంబంధం. ఇది ప్రతిక్షేప సంభావ్యతని నిర్దేశిస్తుంది. వ్యవస్థ విశ్లేషణలో కీలకమైంది.

భాషా వ్యవస్థల్ని బట్టి పదాలు భిన్న విలువ, అర్థాల్ని కల్గి ఉండవచ్చు. అందువల్ల యే వ్యవస్థనైనా విశ్లేషించాలంటే ఈ రెండు సంబంధాలు సాధనాలుగా అవసరమవుతాయి.

అయితే భాషాశాస్త్రంలో యాంత్రికంగా సంబంధాల్ని పరిశీలించే సంకుచిత పద్ధతిని Saussure నిరసించాడు. నిర్మాణ వాదంలో విరుద్ధాలను పరిగణనలోకి తీసుకోవడం ప్రధానమైంది. Culler నిర్మాణవాద విశ్లేషణలో సంబంధాల్ని విరుద్ధాల మధ్య సంబంధాలుగా చూడాలంటే ద్వైదీ విరుద్ధాలు(binary oppositons) గా విడగొట్టాలంటాడు. అలా చూడ్డం వల్లనే ప్రవృత్తిని అప్రవృత్తినించి వేరుచేయ వచ్చుంటాడు.

Jackobson ద్వైదీ విరుద్ధాలు భాషలో వారసత్వంగా వస్తాయంటాడు. పిల్లలు భాష నేర్చుకునే క్రమంలోనే వీటిని గ్రహిస్తారని, భాషా జ్ఞానం పొందుతారంటాడు. వెలుగు-చీకటి, ఆడ-మగ, ధ్వని-లిపి, మానవత్వం-క్రూరత్వం, పాలకులు-పాలితులు ఇలా ద్వైదీ విరుద్ధాలుగా విభజించుకుంటే విశ్లేషణ సులువు అవుతుంది. భాషా శాస్త్ర పరిభాషలో క-గ, పదం-వాక్యం, ప-బ వంటి విభజన చేయాలి.

ద్వైదీ విరుద్ధాలు ఒకే కోవకు చెందినవి కాకపోతే వాటి ఆధారంగా చేసే విశ్లేషణ తప్పుడు ఫలితాలు ఇస్తాయంటాడు culler. సంకేతాలుగా ప్రవృత్తికి తోడ్పడే సంగత నిర్మాణాలనే తీసుకోవాలి.

ససూరే నిర్మాణవాద భాషా శాస్త్రాన్ని తరగతి గదిలో బోధిస్తున్న కాలంలోనే కెల్లీ, ఛామ్‌స్కీ వంటి గొప్ప భాషావేత్తలు భాషా శాస్త్రంలో పరిశోధనలు చేశారు. చారిత్రాత్మక భాషాశాస్త్ర అధ్యయన స్థితి నుంచి వర్ణనాత్మక భాషాశాస్త్ర అధ్యయనానికి మార్గం సుగమం చేశాడు. Saussure భాషా శాస్త్ర అధ్యయనాన్ని భిన్న కాలిక అధ్యయనం నుండి ఏకకాలిక అధ్యయనానికి నడిపించాడు. అదే ఆయన గొప్ప విజయం. శాస్త్ర పరిశీలనలో సాధించిన స్పష్టతవల్ల anthropology, Sociology, సాహిత్యం, ఆర్థికశాస్త్రం వంటి అన్ని శాస్త్ర రంగాలకు ససూరే సిద్ధాంతాంశాలు కరదీపికలైనాయి.

V

## హైకులు

**రాజా**

సబ్సిడీపై సప్లై
రైతులందరికి
కూల్ డ్రింక్స్

కారు రేసుల్లో ఫాస్ట్
స్టాంపు కేసుల్లో ఫస్ట్
తెలుగు వెలుగు
ప్రతిదీ వ్యాపారమయమన్నావుగా
మమ్మీ 5 స్టార్ ఇస్తేనే...
ముద్దు

హైదరాబాద్‌లో స్కూళ్ళ అమ్మకం
పంతుళ్ళూ...
జాగో...

ఇజ్రాయిల్‌లోపత్తి బాగుంది
ఇండియాలో రైతుకు
చిప్పమిగిలింది.





Untitled-2 57 6/11/2002, 3:51 PM

# నచ్చిన రచనలు

# డా॥ ఎండ్లూరి దళిత కవితా ఝురి

దళిత కవిత్వం రాస్తున్న ఆధునిక కవులలో డా॥ ఎండ్లూరి సుధాకర్‌ది విలక్షణమైన శైలి. తన జీవితానుభవంలో లేనిదేదీ ఆయన కవిత్వంలో కనిపించదు. తాను చిన్న నాటి నుండి విన్నది. కన్నది అనుభవించింది. అక్షరీకరించడంలో ఆయనిది అందెవేసిన చేయి. "Poets Teach In Verse What They Learn From Suffering" (కావ్య సృష్టిలో కవులు ఉపదేశించునది వారు శోక సంతప్తులై లోకంలో అనుభూతి వలన నేర్చుకున్నదే...) అంటాడు షెల్లీ కవి. ఇది సుధాకర్ విషయంలో అక్షర సత్యం అన్పిస్తుంది. కసి, ద్వేషం, పగ, పరుష పదజాలం, ఆయన రచనల్లో ఎక్కడా మచ్చుకు కూడా కన్పించవు.

ఇదీ మా సంస్కృతి. ఇవీ మా అనుభవాలు. మా బతుకులు, మా బాధలు, మా కన్నీళ్ళు అని ఈ సమాజానికి ఎత్తిచూపే ప్రయత్నమే సుధాకర్ కవిత్వం. "వర్తమానం" (1992), "కొత్తగబ్బిలం" (1998) "నల్లద్రాక్ష పందిరి" (2002, "మామాయణం" (అముద్రితం) ఆయన రాసిన కవితా సంపుటాలు. "మల్లెమొగ్గల గొడుగు" (1999) కథా సంపుటి.

**నేనింకా నిషిద్ధ మానవుణ్నే**
**నాది బహిష్కృత శ్వాస**
**నా మొలకు తాటాకు చుట్టి**
**నా నోటికి ఉమ్మిముంతకట్టి**
**నన్ను నలుగురిలో**
**అసహ్యమానవ జంతువునిగా చేసిన మనువు**
**నా నల్లని నుదుటి మీద బలవంతంగా**
**నిషిద్ధ ముద్ర వేసినప్పుడే**
**నా జాతంతా**
**క్రమక్రమంగా హత్య చేయబడింది.** (నెత్తుటి ప్రశ్న)

అంటూ అనాదిగా దళితులపై రుద్దబడుతున్న అనాచారాలను వేదనా భరిత హృదయంతో ఆవిష్కరిస్తాడు కవి. ఇప్పుడు దళితుల్లో వచ్చిన చైతన్యం గురించి "పాద ముద్రలు" అనే కవితా ఖండికలో

**నేను బద్ధలవుతున్న అగ్ని పర్వతాన్ని**
**నన్నెవరూ ఆర్పలేరు**
**నావి అగ్ని పాదాలు**
**నా కాళ్ళను ఏ తాళ్ళూ కట్టి పడెయ్యలేవు.**
**నా శిరస్సు సగర్వపతాక**
**నన్నెవరూ అవనతం చెయ్యలేరు.**

అని నిండైన విశ్వాసంతో పలకడం సుధాకర్‌కే చెల్లింది.

"వర్తమానం" సంపుటిలో ఉన్న కవితలలో అంతర్లీనంగా దళిత ప్రస్తావన కనిపిస్తుంది. "వర్తమానం" "వర్ధమాన కవులకు పెద్ద బాలశిక్ష వంటిది" అని విమర్శకుల చేత కితాబులందుకుంది. అంతేకాదు. రెండు మూడు యూనివర్శిటీల్లో ఎం.ఎ. సాహిత్య విద్యార్థులకు పాఠ్యాంశంగా పెట్టారంటే ఆ కవితలలోని సాహిత్య ప్రమాణం ఏ స్థాయిలో ఉందో అవగతమవుతుంది.

సుధాకర్‌కు జాతి అన్నా, దానిలోని యాసన్నా దళిత సంస్కృతి అన్నా గుండె నిండుగా శ్వాసిస్తాడు. అంతకన్నా మిన్నగా ప్రేమిస్తాడు. అందుకు ఆయన వాడిన మాండలికమే ప్రత్యక్ష తార్కాణంగా చెప్పవచ్చు. సుధాకర్ కవిత్వం చదువుతుంటే కళ్ళు చెమ్మగిల్లుతాయి. కంఠం జీరాడుతుంది. మనసంతా భారంగా మారిపోతుంది.

దళిత తల్లుల అమాయకత్వాన్ని, అనుభవిస్తున్న అవమానాల్ని "నల్లతల్లి" కవితలో

**నల్లరంగేకదా/నిన్ను పేరంటాలకు/ పెళ్ళిళ్ళకు రాకుండా చేసింది.**

**నీనల్లని పాదాలు చూసి/తెల్లకళ్ళు వాంతులు చేసుకునేవి** అంటూ వర్ణ వ్యవస్థలోని అసమానతలను ఆవిష్కరిస్తాడు. "దాసును జూడాల" కవితలో

**ఎర్రని నాగజెముడు పళ్ళు/మా చిరుతిళ్ళు**
**ఊరిబావులు మా పాలిట ఎండమావులు**

అని అనడంలో బాల్యంలో నాలుగు మెతుకులు కరువైనవైనాన్ని, కనీసం గుక్కెడు నీరైనా తాగి కడుపు నింపుకుందామంటే, ఊరిబావుల దగ్గరకు రానివ్వని అంటరానితనాన్ని కట్టెదుట నిలుపుతాడు కవి.

**ఆకలి యుద్ధంలో క్షతగాత్రులమైనవాళ్ళం**
**గాయాలతోనే కడుపు నింపుకున్నం.**

లాంటి పంక్తులు చదువుతుంటే కడుపులో చేయిపెట్టి కెలికినట్లు బాధా భరిత హృదయంతో ఉంగలు చుట్టుకుపోతాం.

అలాగే "డక్కలి పిల్ల" ఈ కవి మలచిన అద్భుత కవితా కళాఖండం. డక్కలి పిల్లలోని అందాన్ని, ఆ వెనుక అమాయకత్వాన్ని, జాతి జీవన విధానాన్ని, సంస్కృతి సాంప్రదాయాన్ని, కుక్కలు, గాడిద సమేతంగా ఈత చాపలల్లుకుంటూ చేసే దేశ సంచారాన్ని బొమ్మకట్టించి చూపడంలో కృతకృత్యుడయ్యాడు కవి. మంచి వస్తువు తలుచుకుంటే ఇదొక దీర్ఘ కవితగా రాసెయ్యవచ్చు కానీ, కారణాంతరాల వలన దీనిని అసందర్భంగా ముగించినట్టు కనబడుతుంది.

**అలాగే "నిలువెత్తు నిప్పు" కవితలో**
**నేనిప్పుడు రెండు ఖడ్గాల మధ్య వేళ్ళాడుతున్నతలను**
**అడకత్తెరలో ముక్కలవుతున్న నల్లవక్కను**
**ఇద్దరు శత్రువుల నడుమ**
**చచ్చి బ్రతుకుతున్న చదరంగం పావును**
**ఎవరు ఏ మెట్టు మీదున్నా**
**నేను మాత్రం కాలిమెట్టుగానే మిగిలి పోతున్నాను"**

(నల్లద్రాక్ష పందిరి)

అంటూ తన చుట్టూ ఉన్న సమాజంపై అనుమానం ప్రకటిస్తున్నాడు. కాలిమెట్టుగా మిగిలిపోవడం అనడంలో ఇప్పుడు దళితులు ఏ స్థితిలో వుంది ప్రస్ఫుటంగా చెప్పేసాడు.

"నిమ్నలిపి" కవితలో దళిత క్రైస్తవులపై జరుగుతున్న అమానుష దాడులను నిరసిస్తూ అగ్రవర్ణాల ఆధిపత్యం ఇకపై కొనసాగదని, ఆత్మగౌరవం కలిగిన దళితులు ఇది సహించరని చెబుతూ

**ఆధిపత్యానికి అంతిమ సమాధి**
**ఆత్మగౌరవం నా జాతి పునాది**

అని సగర్వంగా చెప్పగలగడం సుధాకర్ రక్తగుణం. సుధాకర్ నిబద్ధత కలిగిన కవి. దళిత బహుజనుల గురించి, వారి బాగోగుల గురించి బహు బాధ్యతలుగా? శ్రమైక జీవన సౌందర్యానికి పులకించిపోతాడు. శ్రమజీవుల పక్షాన తాను నిలబడతాడు. తన బాల్యంలో తమ వీధిని శుభ్రం చేసే బల్దియా



Untitled-2 58 6/11/2002, 3:51 PM

మైసమ్మ మరణించినప్పుడు "మైసమ్మమరణం" అనే ఎలిజీలో
**నీకూ నాకూ ఏ బంధం లేకున్నా**
**కొంత నా చెత్తని ఎత్తిపోసిన నీలో**
**అమ్మను చూస్తున్నా మైసమ్మా!**

అంటూ రోడ్లూడ్చే బల్దియాలో అమ్మను దర్శించడం ఆయనకు మాత్రమే చెల్లింది. అన్నింటికి మించి సుధాకర్ గొప్ప భావుకుడు. "అరకువరకూ" కవిత చదివితే ఇది అక్షర సత్యమన్పిస్తుంది.

**నువ్వు నగర వాసివా/ఒక్కసారి అరకు వరకూ వెళ్ళిరాకూడదూ.**
**........... ........... ...........**
**కొత్తగాలి తీగలపైన**
**నీ సర్వేంద్రియాలు తేనెపిట్టలై పల్టీలు కొడతాయి.**
**.......... ............ ...........**
**ఎక్కడో గిరిజన గూడెంలోంచి లేచిన పాట**
**నీ కలల్ని జాగృతం చేస్తుంది.**
**తెరలు తెరలుగా గూడుకట్టిన పొగమబ్బుల్ని**
**సూర్యకిరణాలు కత్తిపీటలై కోసుకుపోతుంటాయి.**
**పొద్దున్నే రాలిపడ్డ మంచుబిందువులు**
**ఇంకా మిగిలి వున్న మంచితనపు గుర్తుల్లా**
**మెరుస్తుంటాయి.**

ఈ కవిత చదువుతున్నంత సేపు, అరకులోయ అందాల నడుమ విహరిస్తున్న మధురానుభూతి కలుగుతుంది.

**ఆకాశం చిలక్కొయ్యకు/జిలుగు దుస్తుల్ని వేలాడదీసి**
**తారలు రహస్యంగా/గోదాట్లో స్నానమాడిపోతాయి. (గోదారి)**
**లాంటి పంక్తులు పఠిత హృదయాలకు గిలిగింతలు**
**పెట్టి ఒకరసైక పారవశ్యంలో మునక వేయిస్తాయి.**

దళితుల తరుపున సామాజిక బాధ్యత కలిగిన ప్రతినిధిగా జాషువా గారి సాహిత్యానికి కొనసాగింపుగా తన కలాన్ని–గళాన్ని బలంగా వాడుతున్న కవి సుధాకర్.

**రాక్షస చీకట్లను తునాతునకలు చేసే**
**ప్రభాత సౌందర్య ప్రకృతి సన్నివేశాన్ని స్వప్నిస్తున్నాను**
**(వర్తమానం)**
**దళితుల చుట్టూ అల్లుకున్న వర్ణాంధకారం తొలగిపోయి**
**సమాజంలో సమాన గౌరవం పొందడాన్ని కవి స్వప్నిస్తున్నాడు**
**డా॥ ఎండ్లూరి సుధాకర్ గురించి ప్రముఖ కథకుడు**
**డా॥ వి. చంద్రశేఖర్‌రావు అన్నమాటలలో**
**అతని కవితలు గొప్ప మార్దవంతో శక్తితో**
**ఆత్మను చీల్చగల చురకత్తులు**
**దళిత సౌందర్యగీతికలు**
**అని అనడంలో అతిశయోక్తి కాదు**

దళితుల ఆత్మకథలను అంతర్జాతీయ వేదిక మీద ఆవిష్కరించిన అసమాన ధీశాలి – ప్రతిభాశాలి డా॥ ఎండ్లూరి సుధాకర్ రచయిత?

## నంబూరి పరిపూర్ణ కథలు

'ఉంటాయి మాకుషస్సులు' – నంబూరి పరిపూర్ణ రాసిన కథల సంపుటి. శీర్షిక పెట్టడంలోనే ఆమె ఆత్మవిశ్వాస, ఆశావాద ప్రకటనలు కన్పిస్తున్నాయి.

చదివిన వారిని ఆలోచింపజేసే కథలివి. రచయిత్రికిగల సామాజిక అవగాహన, సమాజంపట్లగల ప్రేమ, సామాజిక బాధ్యతలు ఇందులో ఉన్నాయి. 'ఉంటాయి మాకుషస్సులు' పెద్ద కథ ఇది. ఇది ఎప్పుడో 80'ల్లో రాసినప్పటికీ, నేటికీ పిల్లల మనస్తత్వ చిత్రణకి రిలవెంట్‌గానే వుంది. తల్లితండ్రుల ఒత్తిడి జీవితాలు, ఆర్థిక సంపాదనల యావగేషన్ల మధ్య పిల్లలకు దొరికే అతిస్వేచ్ఛ, టీవీ, మీడియాల ప్రభావాలు, చదువుల ఒత్తిడి ఇలాంటి అనేకానేక ఘర్షణల మధ్య పుట్టే 'చైతన్య' లాంటి పిల్లల భవిష్యత్తు గురించి రచయిత్రి ఆందోళన వెలిబుచ్చుతూ, సమసమాజ స్థాపనలో ఎలా భాగస్వామ్యం వాళ్ళు కావాలో చక్కగా వివరించారు. ఒక సమస్యను ప్రదర్శించి వదిలేయడం కాకుండా, దానికో మార్గాన్ని చూపే ధోరణి ఈమె కథలన్నింటా కన్పించే ప్రత్యేకత. అయితే ఆమె అభిప్రాయాలతో, కథానిర్దేశంతో అందరూ ఏకీభవించాలని కాదుకానీ, ఆమె తన రచనా బాధ్యతను విస్మరించలేదన్నది గమనార్హం.

చాలా వరకు స్త్రీలు రచయిత్రులుగా ఎదగడానికి, నిలబడడానికి చాలా అంతర్యుద్ధం చేయాల్సి ఉంటుంది. ఎంతో తపన పడితే తప్ప, పెనుగులాడితేగాని ఆమె ఈ రంగంలో స్థిరపడలేదు. వృత్తిరీత్యా ఉన్నత పదవుల్లో వుండి క్షణం తీరికలేని ఒత్తిడుల మధ్య, కుటుంబ బరువు బాధ్యతలు సుడిగుండంలా లాక్కెళ్ళి పోతున్నా తాను రాయాలి రాయాలి అనే తీవ్రమైన తపనే 'పరిపూర్ణ'గార్ని కథల రూపంలో నిలబెట్టింది. అంతర్లీనంగా ఆమె రచనలన్నింటా ఆ ధోరణి కనబడుతోంది. అందువల్లనే చాలా కథలో ఆమె ప్రవేశించి మాట్లాడేస్తున్నట్లుంటుంది. సాధారణంగా కథా విమర్శకులందరూ, రచనా స్రష్టలు రచనలో కనబడకూడదు. పాత్రల ద్వారా చెప్పించాలి. నిర్మాణం, శైలి దెబ్బతింటుంటాయి అంటుంటారు. కానీ ఇక్కడ, పరిపూర్ణ తాను చెప్పదలచుకున్న కథా విషయంలో పూర్తి మమేకత్వాన్ని పొందడంవల్ల ఆమెకు తెలీకుండానే ఆమె ఆ రచనోద్వేగ ప్రవాహంలో అలా 'అల'లా కన్పిస్తూ ఉంటుందనిపించింది. ఆమె రచనాలక్షణమది.

'బంగారులేడి' కథలో తేలికగా డబ్బు సంపాదించాలనే, వడ్డీ డబ్బు బహురుచిగా ఉంటుందనుకునే ఆశపోతుల స్వభావాన్ని చూపిస్తూ, 'పెరుగుట విరుగుట కొరకే' అనే వాస్తవాన్ని వెల్లడించింది.

పరిపూర్ణగారు విజయవాడ, మద్రాసు, రాజమండ్రిల్లో పాఠశాల విద్యను, కాకినాడ పి.ఆర్ కాలేజీలో బి.ఎ. కళాశాల విద్యను కొనసాగించారు. విద్యార్థి దశలో నిర్మాణాత్మకమైన పనులు చేశారు. వేసవి, ఇతర శలవుల్లో మహిళా ఉద్యమాల్లో పాల్గొనేవారు. రాజకీయ చైతన్యంగల కుటుంబంలో పుట్టారు. ఆమె సోదరుడైన నంబూరి శ్రీనివాసరావు ప్రభావం ఈమెపై ఎక్కువ. మార్క్సిస్టు భావజాలంతో తనను చైతన్యపరిచారని స్త్రీల అణచివేత, సాంఘిక అసమానత, వారికి సంబంధించిన సాంఘిక, ఆర్థిక రాజకీయ వైజ్ఞానిక సమస్యల్ని గురించి అవగాహనను, ఆలోచనను కల్పించారని ఆమె అభిప్రాయం. అందుకే ఈ కథల సంపుటిని కూడా ఆయన అంకితమిచ్చారు.

ఈమె కుమారుడు దాసరి అమరేంద్ర, (శేఫాలిక) కుమార్తె దాసరి శిరీషలు మంచి రచనాకారులు. ఈమెకుగల సాహిత్యాభిలాషకు మచ్చుతునకలు వాళ్ళిద్దరు.

ఇక, మళ్ళీ కథల్లోకి వస్తే, 'కథలు వాస్తవ జీవితాలకు సన్నిహితంగా ఉండాలనీ, వర్తమాన సామాజిక పరిస్థితులు కథల్లో ప్రతిబింబించాలనీ, సమాజంలోని లోపాలను సరిదిద్దేదిశలో పాఠకులను ఆలోచింపచేయాలనీ నమ్మేవారిలో ఈమె ఒకరని' అబ్బూరి ఛాయాదేవిగారు ముందుమాటలో అభిప్రాయపడ్డారు. పరిణత వయస్సులో రచన ప్రారంభించడంవల్ల పరిపూర్ణత దిశగా పయనించగలిగారు.

పురుషాధిపత్యాన్ని ప్రశ్నించి, ధిక్కరించిన పాత్రమస్తానమ్మది, అలాగే దిగజారిన నైతిక విలువల్నీ నేటి సినిమాల వైనాన్ని 'ప్రారబ్ధకర్మం' కథలో చూపించారు.

'ఎర్రలచ్చుప్ప' కథలో స్త్రీ అద్భుతమైన స్త్రీ పాత్ర ఒక స్వతంత్ర



Untitled-2 59 6/11/2002, 3:51 PM

# కవిత

## జయమాతంగ తనయే!

సూరేపల్లి మనోహర్



మాతా! పాదాభివందనం నీకు
ఎల్లమ్మా! పాదాభివందనం నీకు
మాతంగీ! పాదాభివందనం నీకు
జోగమ్మ తల్లీ! కాల్మొక్కుతా నీకు

మాతా!
జాబాలి తల్లివి నువ్వు
రేణుక అవతారానివి నువ్వు
కొడుకు గొడ్డలి వేటుకు
కోటలా కూలిన
జోగయ్య చెల్లివి నువ్వు
జాముండేశ్వరిని నువ్వు
అంటరాని వాడి ఆడపడుచువు నువ్వు
శిశూదయం నాడే
జీవితం శిశిరమైపోవటానికి
ప్రతీకవు నువ్వు

మాతా! పాదాభివందనం నీకు
యవ్వన కాలమంతా
గ్రీష్మము ఒకే ఒక్క రుతువు నీకు
ఆకాశం భూమి అగ్నిగోళాలు నీకు
జీవితమంతా కన్యగా ఉన్న సంతానవతివి
ఈవు
ఫలభరిత సంఘవృక్షానివినువ్వు
'సంఘానికి లేని సిగ్గునాకెందుకూ?'
నర్మగర్భంగా నవ్వుకున్న పూర్ణగర్భిణివి
నువ్వు

మాతా!పాదాభివందనం నీకు!
తల్లే క్షేత్రం
తల్లే వృక్షం
తల్లే వంశం
ఇదే నీ సిద్ధాంతం
మాతంగీ!

నీ గజ్జెల సవ్వడి
అంతటా అలజడి
జీవితం నిండా జడివాన
నీవు
పిల్లల్ని సంతోషంగా పెంచావో
దుఃఖంలో సాకావో
ధైర్యంగా పెంచావో
దీనంగా సాకావో
అమ్మా!
నీ సాహసానికి పాదాభివందనం
తల్లీ
ఈ లోకంలో ఆవేదనను గుండెల్లో
రగిలిస్తున్న
అశోకానివి నువ్వు

మహాభారతంలో కుంతిని మించిన యింతివి
నువ్వు
అంతులేని విషాదనిశీధిలో
అనంత కాంతి నక్షత్రానివి నువ్వు
అరుంధతి తోబుట్టువు నువ్వు
దళిత క్షతగాత్రివి నువ్వు
రక్తసిక్త గేయానివి నువ్వు
తల్లీ!
పాదాభివందనం నీకు
మాతా
పాతాభివందనం నీకు
జోగమ్మ తల్లీ!
కాల్మొక్కుతా నీకు

---

వ్యక్తిత్వం, ఆత్మగౌరవం వున్న స్త్రీ. ఆమె జీవితంలో వచ్చిన అనేకానేక మలుపుల్లో రాటుదేలిన విధానాన్ని బాగా చిత్రీకరించారు. స్త్రీ పురుష సంబంధాలలోని అసమాన నీతిని, ప్రేమను పొందాలనుకునే స్త్రీల వైఫల్యాల్నీ, పురుషుడిలో ఎప్పటికీ ఒకేలా వుండే మగబుద్ధినీ చాలా నిజాయితీగా నిరూపించారు. అత్యంత బలహీనమైన జీవితాన్ని ఆరంభించిన దళిత స్త్రీ లచ్చుప్ప, తన జీవన పరిణామక్రమంలో ఎలాంటి పరిణతి పొందిందో గమనించాక, ఆమెపట్ల పాఠకులకు అభిమానం కలగకమానదు.

స్త్రీని లైంగిక వస్తువుగానే పరిగణించే వైఖరి తీవ్రంగా విమర్శించింది 'వీలుదొరికితే…' అనే కథలో.

ప్రవాసాంధ్రుల జీవితాల్లోని ఆత్మీయతా పరిమళాల్నీ, సొంత స్థలాల్లోని పరాయితనపు బతుకుల్నీ దృశ్యపటం చేశారొక కథలో.

అనాధ జీవితంలోంచి ఆత్మీయతను వెతుక్కుంటూ శ్యామల జీవితంలో ఎన్ని ఆటుపోట్లకు గురైందో 'మాకు రావు సూర్యోదయాలు' కథ వివరిస్తుంది. పరిపూర్ణ స్త్రీ పాత్రలు విలక్షణమైనవి. స్త్రీల జీవితాల్లోని రకరకాల పార్శ్వాల్నీ, మానసిక సంఘర్షణల్నీ, వర్తమాన సంక్లిష్టదశలో ఎదుర్కొంటున్న వైఫల్యాల్నీ, వ్యక్తిత్వ నిరూపణకీ, అస్తిత్వ ఘర్షణకీ మధ్య పెనుగులాడుతున్న వైఖరుల్నీ చూపించారు. చర్చించారు. 'తార' లాంటి ప్రత్యేక పాత్రలు స్త్రీ సమస్యల మూలాల్లోకి తీసుకొని వెళ్ళి ఆలోచించేట్లు చేస్తాయి.

మొత్తమ్మీద ఎప్పుడో 80'ల్లో వచ్చిన కథలైనప్పటికీ, ఇప్పటికీ అవే సమస్యలు, జీవితాలు కన్పిస్తున్నందువల్ల ఇప్పటి కథలుగానే పరిగణించొచ్చు. కథలు చూడడానికి సాధారణంగా కన్పిస్తున్నా, లోతుగా, చదివినకొద్దీ అసాధారణ కథలుగా మిగిలిపోయే పరిపూర్ణ కథలు విస్మరించలేనివి.

**–శిలాలోలిత**



Untitled-2 60 6/11/2002, 3:51 PM

కథ

ఉమా

# ఓ... పాల బుగ్గలా చిన్ని రైతా...



***గు**వ్వలా ఎగిరి పోవాలీ.... ఆ తల్లి గూటికే చేరుకోవాలీ.... మంచును చీల్చుకుంటూ ఆ స్వరం ఆ కొండల నడుమనున్న పల్లె పొలిమేరల్లో ప్రతిధ్వనిస్తున్నది. చిక్కని చీకటింకా చెదిరిపోనేలేదు. ముసురుకున్న మంచు పొగలు కరిగిపోనేలేదు. చలినీ చీకటినీ లెక్కచేయక మధు హుషారుగా నడుస్తునే ఉన్నాడు. రాత్రి చేను కాపలా కాసి ప్రొద్దున్నే ఆ చీకట్లో ఇల్లు చేరే చాలా మంది ప్రతి వారి చేతిలో టార్చిలైట్లో లాంతర్లో ఉంటాయి.*

మధు మాత్రం ఏ దీపం అక్కరలేకుండానే బిరా బిరా నడుస్తున్నాడు. వాడి అడుగుల సవ్వడికి ఎండుపుల్లలు విరిగి లేచి పడ్తున్నాయి. వాడి స్వరానికి పక్షులు ఉలిక్కిపడిలేస్తున్నాయి. వాడి అలికిడికి కోడి పుంజుకు కూత గుర్తుకు వచ్చి రెక్కలు విదిల్చి గళం విప్పింది. మధు సందడిగా పాడుకుంటూ రావడం విని పక్క మీద నుంచి లేచే వాళ్ళెందరో ఆ పల్లెలో ఉన్నారు. ఇళ్ళ ముందు కళ్ళాపి చల్లుతున్న ఊరి ఆడవాళ్ళందర్నీ వరుసలు పెట్టి పిలుస్తూ పలుకరిస్తూ, తనిల్లు చేరుకున్నాడు. అప్పటికే మధు తల్లి పొయ్యి ముందు అలుకుతున్నది. మధు పుల్లల చీపిరి తీసుకుని పెరడంతా ఊడ్చాడు. కొట్టంలోకెళ్ళి పేడకళ్ళు తీసాడు. నీళ్ళు తోడాడు పెరడంతా కళ్ళాపి చల్లాడు. ఇత్తడి చెంబులు తెచ్చి పాలు పితికాడు. అవి అమ్మ చేతికందించి “ఐదు నిముషాల్లో వస్తాను టీ పెట్టమని చెప్పాడు” అమ్మకాచిన కుండెడు వేడి నీళ్ళతో, రాత్రి నిదుర కాచి చేను కాపలా కాచిన అలసటనంతా తీరేలా స్నానం ముగించాడు. తూర్పు వైపుకు తిరిగి ఇంకా ఉదయించని సూర్యునికి ఆదరా బాదరా దండం పెట్టి లాగు చొక్కా తొడుక్కుని పొయ్యి ముందు కూర్చున్నాడు.

“అమ్మా.... ఇవ్వాల మాత్రం నీ మాట యిననమ్మా... ఇయ్యాల బడికి కొత్త టీచర్లొస్తున్నారంట... నేనియ్యాలిటి నుంచి బడికి పోతా...” వాడి గొంతులో ఆశా ఆరాటం.

“మా అయ్యే... మా నాయనే... నీకు చదువంటే ఎంత పానమో...” తల్లి మురిసిపోయింది. అంతలోనే చిన్నబుచ్చుకుని దిగులుగా అన్నది. “పిచ్చి తండ్రి... ఇయ్యల పొలానికి మందు కొట్టాలి నాయనా... మీ నాయనకేమో వంట్లో బాగోలేదాయె... లేత మొక్కలు గదయ్యా... అప్పుడే పురుగు పడితే... పంట ఎందుకూ పనికిరాదుగదరా...”

“అమ్మా బడి మొదలైనప్పుడు... తొలకరి కురిసింది కదలా అరక దున్నాలన్నావు.. అట్లనే అని అరక సేతబట్టినా... అదయినంక ఇత్తులు చల్లాలన్నావు.. అట్లనే ఇత్తు చల్లినాకే వచ్చినా... అదయినంక నీరు పెట్టాలన్నావు... అట్లనే అని అరక సేతబట్టినా... అదయినంక ఇత్తులు చల్లాలన్నావు... అట్లనే ఇత్తు చల్లినాకే వచ్చినా... అదయినంక నీరు పెట్టాలన్నావు... కలుపుదియ్యాలన్నావు... జూన్ నుంచి మొదలు పెడ్తే ఇయ్యాల్టిదాకా నడుమ నడుమ ఏరెండు మూడు దినాలో నేను బడికి పోయింది. అది కూడా బియ్యం పంచేనాడు పంపుతావు... అందుకే పొయిన్నెల ఆ రాజారాంసార్... ముఖం మీద కొట్టినట్లు చెప్పి పంపాడు... మూడు నెలల మొత్తం మీద రెండు మూడు రోజులు బడికి రాకున్నా బియ్యమిస్తాంగాని నెలకు రెండు మూడు రోజులే బడికి వచ్చే వాళ్ళకి బియ్యం ఎక్కడి నుంచి వస్తాయి.” అని

“అమ్మా బియ్యం కోసం బడికి పోవడం కాదమ్మా నాకు



Untitled-2 61 6/11/2002, 3:51 PM

చదువుకోవాలనుందమ్మా... రాజారాంసార్ లాగా మంచి ఇస్త్రీ బట్టలేసుకుని పెద్ద ఉద్యోగం చెయ్యాలనుందమ్మా... ఎప్పటికేదో పని చెప్పి నన్ను బడికెళ్ళకుండా చేస్తున్నావు. ఇవ్వాల నీ మాట ఇననే ఇనను ఇవ్వాలనేను బడికెళ్ళేతీర్తాను." స్థిరంగా చెప్పాడు.

"ఒరే... ఒరే మీ చిన్నాన మందు కలిపిరెడీ చేసిండు... మధ్యాహ్నం దాకమందు గొట్టి... ఇంటికొచ్చి హాయిగా పండుకో..."

"అవునవును... రాత్రి మళ్ళీ చేను కాపలా కాయడానికి ఎల్లాలిగా... అందుకే మధ్యాహ్నం పండుకోమంటున్నావు. పాపం కొడుకంటే ఎంత పేమో..." దెప్పాడువాడు.

రాధమ్మ కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి.

"వోరే మధూ... నువ్వు నమ్మినా నమ్మకున్నా నాకు కొడుకంటే ప్రేమేరా మనదరిద్రానికి నిన్ను బడికి పంపట్లేదుగాని సదువు ఇలువ నాకు తెలుసురా..... ఆ పత్తి ఇత్తనాలకి మీ అయ్య ఎంత అప్పు చేసిండో... ఆ పైని పురుగు మందుకు ఎంత అప్పు చేసిండో నీకు తెలియంది కాదు... మీ అయ్యేయో మంచాన పడ్డాడు... చేన్లో పనంటే ఒక్కరితో అయ్యేది కాదు.... మీ చిన్నానలకు, పెద్దనాయనకు వాళ్ళపొంతం పనులు వాళ్ళకున్నాయి. తమ్ముళ్ళిద్దరూ నీకంటే సిన్నోళ్ళాయే... అయినా నీకు తోడు రఘుని కూడా పంపిస్తా..."

"వద్దమ్మా వద్దు... నా చదువెట్ల మన్నులో కలిసింది. ఆడి చదువులెందుకు పాడు చెయ్యడం. నేను చేనుకు బోతానుగాని రఘును బడికి పంపు...'' మెత్తబడిపోయాడు... మధు.



దిగులుగా బడివంకే చూస్తూ చేసుకెళ్ళాడు. మందుకొట్టాడు గుండెలోని గుబులు మరిచేందుకు వాడు పాడే పాటలంటే చేలో పని చేసుకునే పల్లెవారందరికి ప్రాణం... వాడితో అడిగడిగి పాడించుకుంటారు. అలుపెరుగకుండా పాడి వారి అలసట తీరుస్తుంటాడు.

D D D

"అమ్మా... కొత్త టీచర్లు వచ్చింద్రు గదా బడి ఇప్పుడు మంచిగ నడుస్తున్నాదంట... వాళ్ళు టీచర్ల లెక్క కుర్చీలల్ల కూర్చుంటలేరంట. పిల్లల నడుమ దిరుక్కుంటా మస్తు ఆటలూ, పాటలూ నేర్పింస్తున్నారంటా... ఎప్పుడు చూసిన పిల్లగాళ్ళని, ఊర్లో బడికి రాని పిల్లలందరిని బడికి దీస్కరమ్మని చెప్పి పంపుతున్నారంట. అమ్మా ఇయాల్టి నుంచి నేను గూడా రోజు బడికి పోతానమ్మా..."

"మధూ... నీకు జెప్పలేక పోతున్నానురా.. ఇప్పుడిప్పుడే పత్తికాయలు పగులుతున్నాయి.. ప్రానం బాగున్న బాగోకున్న మీ నాయన చేనుకోస్తున్నాడు. ముసల్దయి పోయిన మీ నాయనమ్మ చేనుకొస్తున్నది. వారందినాల సంది బడిమానిపించి రఘుతో, రాముతో కూడా పత్తి తీపిస్తున్న. ఆళ్ళందరూ ఒకెత్తు నీవొకడివే ఒకెత్తు... నీ పనితనం వాళ్ళ కెట్లవస్తదిరా..."

"నాకు దెల్వదమ్మా... ఎవరైన కూలోల్లను పెట్టుకో..."

"ఒరే అయ్యా... మనశక్తి నీ దెల్వదా... అయినా ఒక్కర్నీ ఇద్దర్నీ పెట్టుకుంటనే ఉన్నంగదా... ఆడోళ్ళైతే ఫర్వాలేదు. ఇరవైతో, ముప్పైతో పోతది. మొగోళ్ళకైతే యాభైలు అరవైలు పొయ్యాలెగదా... రెండు రోజులు ఆలస్యమైనా మనమే జేసుకుందం అంటుండు మీ అయ్య..."

"అవ్ మనం దినాం మెల్లంగ పత్తి దీస్కుంట కూసుందం ఆడ నా పాఠాలన్నీ బోతున్నాయి. మొన్నటికి మొన్న ఆనపకాయ ఇచ్చి రానుపోతే... ఉషాటీచర్... మిగతా పాఠాలన్ని ఎప్పుడంటే అపుడు జెప్తంగాని... లెక్కలు రోజూ చెయ్యలెగద..." అని అన్నది. ఆ టీచర్లిద్దరు నువ్ మస్తు తెలివికలోడివి దినాం బడికొచ్చి చదువుకోమ్మని... ఎంత బతిమిలాడ్తరనుకున్నవ్... ఆళ్ళకేం దెల్సు నాకు చదువంటే ఎంత పాణమో..." వాడి బుగ్గల పైకి కన్నీరు జారింది.

రాధమ్మ తల్లడిల్లిపోయింది.

"పోనిలేరా అయ్య ఏడ్వకు... నువ్వు బడికిపో... ఎట్లనో అట్ల మేమే తిప్పలుబడ్తంగాని... నువ్వట్ల మనసు కష్టపెట్టుకోకు... ఏడ్వకు రేపటి సంది బడికిబో...' వప్పుకున్నది.

వెన్నెల్లో పత్తిచేనులా వాడి ముఖం సంతోషంతో విప్పారింది. మర్నాడు ఉదయం బడివేళకు రివ్వున పరుగెత్తుకెళ్ళాడు.

వాడు చదివేబడే అయినా వాడు రోజూ రాక పోవడంవల్ల బిడియపడ్తూ వెళ్ళాడు. వాడలా ముడుచుకుపోయి కూర్చోవడం చూసి ఉషా టీచర్లు జ్యోతి టీచరు... చనువుగా మాట్లాడి పిల్లలందరితో మామూలుగా కలిసి పోయెలా చేసారు. దాంతో మధూకు కాస్త ధైర్యం వచ్చింది.

"ఈ బడిలో పిల్లలను జట్లుగా చేసాం" అంటే పిల్లలగోళ్ళు, పళ్ళు, దుస్తులు, జట్టూ, అన్నం పరీక్షించడానికి ఒక జట్టూ...

మంచి నీళ్ళు తెచ్చిపెట్టి తరగతి గదులు, కాంపౌండు ఊడ్చి శుభ్రం చెయ్యడానికి ఓ జట్టూ...

పిల్లలందరరూ ప్రతీరోజూ బడికి వచ్చేలా చూడడం, రానివాళ్ళ ఇళ్ళకు వెళ్ళి ఎందుకు రావడంలేదో వాకబు చేసి బడికి వచ్చేలా నచ్చజెప్పడానికి ఒక జట్టూ...

పిల్లలను ప్రార్థనలో ఉదయం సాయంత్రం వరుసలో నిలబెట్టి ప్రార్థన చేయించడం, ఇళ్ళకు వెళ్ళేటప్పుడు వరుసలో పంపడానికి మరో జట్టు.

బడి ఆవరణలో మొక్కలు పెంచడానికి మరో జట్టూ ఉన్నాయి... అని చెప్పారు. జట్టు లీడర్లని సభ్యులను పరిచయం చేసి "నీవు ఏ జట్టులో చేర్తావని" అడిగారు...

మధు చెట్లు నాటే జట్టులో చేరాడు. ఆ సాయంత్రం ఆనందంగా చేనుకెళ్ళి... ఆ చుట్టు పక్కల ఉన్న నేరేడు, జామ, పొన్న, మామిడి మొక్కలు చిన్న చిన్నవి తవ్వి తీసుకువచ్చాడు. ఉదయాన్నే బడికి వెళ్ళి నేల బాగా తవ్వి మొక్కలు నాటి నీళ్ళు పోసాడు. ఆ చెట్లని చూసి ఉషా టీచరు, జ్యోతి టీచరు తెగ మురిసిపోయారు.

మధు చురుకుగా చదవడం ప్రారంభించాడు. రెండు రోజుల్లో మూడు అభ్యాసాల లెక్కలు నేర్చుకున్నాడు. పద్యాలైతే పుస్తకాల్లో ఉన్న వాటి కన్నా వాడికే బోలెడు వచ్చు.

ఒక్కో సబ్జెక్టే నేర్చుకుంటున్నాడో లేదో నాలుగో రోజున "మీ నాయనకు వాతం కమ్మింది పట్నం తీసుకెల్తున్నారు త్వరగా రమ్మనమ"ని బాబాయి కబురు మోసుకువచ్చాడు. మధు పరుగుపరుగున ఇల్లు చేరాడు. ఊరి పెద్దలెవరో బండికట్టారు. బస్తీలో డాక్టరు వారం రోజులు హాస్పిటల్లో ఉంచుకుని "ప్రమాదం తప్పింది. మంచి ఆహారం, విశ్రాంతి చాలా అవసరం" అని చెప్పి రెండు వేల బిల్లు చేతిలో పెట్టాడు. రాధమ్మ గాజులు తాకట్టు పెట్టి బిల్లు కట్టింది. అయ్యమంచాన పడ్డాడు. పుస్తకాల సంచి అటకెక్కింది. మధు చేనుకు చేరుకున్నాడు.

మబ్బు తునకలు చెట్లకి వేలాడుతున్నట్లుగా విరగకాసిన పత్తికాయలు మధుని పలుకరించాయి.

"నా అసుమంటోడు మంచిగ చదువుకోవాలని కోరుకోవడం కూడా తప్పేనా... మా అయ్యకి తొందరగా నయ్యమయ్యేటట్లు జెయ్యి



Untitled-2 62 6/11/2002, 3:51 PM

దేవుడా... అని మొక్కుకుంటూ పనిలోకి దిగాడు... ఇద్దరు మనుష్యుల పని ఒక్కడు చేస్తున్నాడు...

వాడు వేగంగా పత్తి తియ్యడం... రాధమ్మా... రఘు రాము తీసిన పత్తినంతా సంచుల్లో మూటకట్టడం అందరూ కలిసి వాటిని ఇంటికి జేర్చటం... ఇంటికి చేరిన పత్తి ఆరిన కొద్ది తేలిక పడి తూకం తగ్గిపోకుండా... రాత్రి మంచులో ఆరబొయ్యడం, మంచు బిందువులను పీల్చుకుని బరువెక్కిన పత్తిని ఉదయాన్నే మళ్ళీ గుడిసెలోకి చేర్చడం... స్నానపానాదులు ముగించుకుని చద్దిపట్టుకెళ్ళి... మళ్ళీ చేనుకెళ్ళడం ఎక్కడా నిమిషం తీరిక లేకుండా కష్టపడుతున్నాడు. సాయంత్రాలు చేనుకునీరు పెట్టడం... రాత్రులు కాపలా కాయడం ఈ సందట్లో వాడికి రోజులూ వారాలూ లెక్క తెలియడం లేదు.

గణగణమని బడి గంటలు లీటగా చేలోకి వినిపిస్తున్న కొద్దీ వాడి గుండెల్లో చితుకులు రగులుతుంటాయి. పత్తి ఆకులపై మంచు బిందువులు చేరినట్లు... ఆ చెక్కిళ్ళపై నీటి బిందువులు చేరుతుంటాయి. మంచును పీల్చుకున్న పత్తికాయల్తో కన్నీటిని దిగమింగుకుంటున్న వాడి ముఖాన ఏమీ ఎరుగునట్లు అదేకాంతి, చదువుకోవాలన్న తపనకు... బ్రతుకు అగచాట్లకు మధ్య గుండెల్లో రేగే సంఘర్షణ 'వాడి'నంతా వేళ్ళలో చూసిస్తూ... చకచకా... పత్తి తీస్తున్నాడు. ఈ పత్తి తియ్యడం ఎంత త్వరగా ముగిసిపోతే... అంత త్వరగా బడికి పోవచ్చు... వాడు ఆరాటపడిపోతూనే ఉన్నాడు. ఆరు నెలల పరీక్షలు కూడా వచ్చేసాయి. సంక్రాంతి సెలవలు ముగిసాయి. బడి మళ్ళీ మొదలైంది.



వాడు తీస్తున్న కొద్దీ పత్తికాయలు కాస్తూనే ఉన్నాయి... వాడి చిన్న చేతులకు అవి శ్రమకు మించిన కాయలు. వాళ్ళ పేదరికానికది చాలీచాలని పంట. బడికెళ్లే రోజు కోసం తపించిపోతూ వాడి కళ్ళు పత్తికాయలౌతున్నాయి. అమ్మాకొడుకులు చేలోని పంటను మూటలు మూటలుగా ఇంటికి చేరనుస్తూనే ఉన్నారు. పంట కోసం చేసిన అప్పు నెలనెల వడ్డీ పిల్లలను పెడ్తూనే ఉన్నది. కొత్తగా తల్లిగాజులు, తాడు తాకట్లోకి వెళ్ళాయి.

ఎట్టకేలకు ఊర్లోకి లారీ వచ్చింది పత్తికొనే దళారులు లారీదిగారు. దళారులు చెప్పిన ధరవినగానే... ఊరి వాళ్ళకు నీరసం వచ్చింది. వచ్చే నెల అమ్ముకోవచ్చు... కాని అప్పటికి ధర తగ్గుతుందో పెరుగుతుందో చెప్పలేంగాని ఇంటికి చేరిన పత్తి మాత్రం బాగా ఆరి తూకం తగ్గుతుంది. చేసిన అప్పులకు వడ్డీ మాత్రం రోజురోజుకూ పెరిగి పోతుంటుంది. ఏమీ చెయ్యడానికి పాలుపోక పత్తిరైతులంతా అల్లాడిపోయారు.

తప్పదన్నట్లుగా చాలా మంది... ఏ మాత్రం గిట్టుబాటుగాని ధరకే తలవంచి పత్తి మూటలు తెచ్చి పడేసి... అమ్మేసుకున్నారు. రాధమ్మ కూడా మధు, రఘులతో... పత్తి మూటలు మోయించి తెచ్చి అమ్మింది. అన్ని నెల్లకష్టం రెండుక్వింటాళ్ళను మించలేదు. పత్తి విత్తులకోసం, ఎరువుల కోసంచేసిన అప్పే తీర్చాలా... గాజులే విడిపించుకోవాలా... తిండి గింజలే కొనుక్కోవాలా... అర్థం కాలేదు... తొలికోతే ఇలా ఉంటే... అడుగుబొడుగు కాయలకు ఇంక ఏ మాత్రం పత్తి దిగుబడి ఉంటుంది. రాధమ్మకు దుఃఖంతో గుండెబరువెక్కిపోయింది.

మధుకు మాత్రం ఈ లాభనష్టాల గురించిన చింతలేదు. గుడిసెనంతా ఆక్రమించుకున్న పత్తి అమ్ముడైపోయింది. దాన్ని మంచులో ఆరబొయ్యడం, తెల్లారే గుడిసెలోకి చేర్చేపని తప్పింది. చేలో మిగిలిన కాస్త పత్తి సంగతి అమ్మా చిన్నాన్నలు చూసుకుంటారు. నేనింక బడికి పోవచ్చు. ఈ ఆలోచనలతో వాడి మనసు దూదిపింజలా గాలిలో ఎగురుతున్నది. రాత్రి పడుకునే ముందు పుస్తకాల సంచి చక్కగా సర్దుకుని తెల్లారి వేసుకోవాల్సిన బట్టలు సొరుగులోంచి తీసి దండెం మీద వేసి పక్కపైకి చేరాడు. వాడి చెవులకు బడిగంటలు వినిపిస్తున్నాయి. తెల్లారి స్నానం చేసి సర్దిన పుస్తకాల సంచి భుజానికి వేలాడేసుకున్నాడు. వాడినలా చూసిన రాధమ్మ ముఖం పత్తి తీసిన చెట్టులా వెలవెలబోయింది. మధు లెక్క చెయ్యలేదు.

"మీ పాట్లు మీరు పడండి... ఇన్ని నెలలూ గిట్లనే గడిచిపోయినయి. ఈ ఫిబ్రవరి, మార్చి, ఏప్రిల్ మిగిలిన ఈ మూడ్నెళన్నా నన్ను బడికి పోనియ్యరా..." పెద్దగా అరిచి నిర్లక్ష్యంగా వెళ్ళిపోయాడు. కాయలు పగిలి తెల్లగా విచ్చుకున్న పత్తి పంటపై కుంభవృష్టి కురిసినట్లై రాధమ్మ మనసంతా అయోమయంగా తయారైంది.

D D D

మధు ఆరాటంగా వడివడిగా... బడికి నడిచాడు అపరాధిలా... తరగతి గది గుమ్మం ముందు నిలిచాడు. ఉషా టీచరు భుజంతట్టి లోనికి తీసుకెళ్ళింది."

నాకు తెలుసు నువ్వివాల బడికి వస్తావని" అన్నది జ్యోతి టీచరు కూర్చోబెట్టి లెక్కలు చెప్పిందామె. ఆనంద్, రవీ అందరూ తాము వేసిన బొమ్మలు చూపారు. మధు కలల సామ్రాజ్యమది. వాడి ఆనందం చెప్పనవలవి కాదు. బెల్లయినాక రామయ్య చేనుకు పరుగెత్తికెళ్ళి జేబులు నిండా కందికాయలు కోసుకొచ్చి టీచర్లకిచ్చాడు. పిల్లలకు కొబ్బరాకుల బూరలు చేసి ఇచ్చాడు. వాడికి ఆ బడీ... ఆ పిల్లలూ ఆ సందడీ... ఆ టీచర్ల అప్యాయత... ఆ పుస్తకాలు, ఆ పాఠాలు... ఆ ఆవరణలో పెరుగుతున్న మొక్కలు... ఆ వాతావరణం ఎంతో ప్రేరణ నిస్తుంటాయి. అక్కడి నుంచి మాత్రమే తానేదో గొప్ప గమ్యం చేరుకోగలనని వాడికి గట్టి నమ్మకం.

D D D

సాయంత్రం ఇల్లు చేరే సరికి ఇంటి ముందు మంచంపై పెద్దనాన్న చిన్నన్నలు అందరూ కూర్చొని కనిపించారు. వాళ్ళందరూ మామూలుగా ఈ సమయానికి చేలో పని చేసుకునే పత్తిరైతులే... ఎవరి పనుల్లో వాళ్ళుంటుంటారు. ఈ వేళప్పుడు అక్కడ వారందరిని చూసేసరికి తండ్రికెలా ఉందోనని భయం వేసింది వాడికి. కాని తండ్రి మంచంపై కూర్చుని టీ తాగుతూ కనిపించేసరికి వాడి మనసు కుదుటపడింది. పక్కింటి ముత్తయ్య మామ ఎదురింటి రాజవ్వక్క... కూడా అక్కడే ఉన్నారు. విషయం అర్థంకాక తల్లి అందించిన టీ తాగుతూ మౌనంగా కూర్చున్నాడు.

పత్తినుంచి గింజలు వేరు చేస్తున్న జిన్నింగ్ మిషన్ మోతలా మెల్లమెల్లగా సంభాషణ మొదలై ఊపందుకుంది.

"ఒరే మధూ... మొదట్లో మీ తాత యాభై ఎకరాల ఆసామే మాకున్న నలుగురక్క చెల్లెల పెళ్ళిళ్ళు చేస్తానికి అమ్మినంత అమ్మి మిగిలింది. తలో చెక్కా పంచాడు. ఈ రెండెకరాల చేను దున్నుకోవడానికి మనం కూలీనాలీని పెట్టుకుని పనులు చేయించుకుంటే ఆ వచ్చిన లాభం కూలీలకే సరిపోతుంది." "ఇద్దరు ముగ్గుర్నన్నా పెట్టుకోక తప్పదు. పూర్తిగా కూలీలపై ఆధారపడితే ఆ వచ్చిన లాభం కూలీలకే సరిపోతుంది. నీకు దెల్వందేమున్నదిరా చేతిల చేనైతే ఉన్నదిగాని అండ్ల ఏం పండించాలన్నా మనం ఆ జగన్నాథం బాబుపైనో... నరసింహంబాబుపైనో ఆధారపడక తప్పదు... పంట చేతికొచ్చేసరికి ఆ వడ్డీలు తడిసి మోపడై మన నడ్డి విరిచేస్తున్నదిరా..."



Untitled-2 63 6/11/2002, 3:51 PM

"నీకు సదువంటే ఎంత ప్రాణమో మాకు తెలియంది కాదు, కాని మీ నాయనకు వంట్లోబాగోక మీ అమ్మ తల్లడిల్లిపోతన్నది మొండోడు కాబట్టి మీ నాన్న ఓపిక జేస్కుని కొద్దిగనన్న లేసి తిరుగుతున్నాడు. పంట సగం అమ్ముడైపోయింది. పెట్టుబడికి చాలీచాలనట్లయింది. ఇసోంటి సమయంలో నీవు చేనుకెళ్ళను... బడికేపోతను... అని మొండి పట్టుపడ్తాంటే మీ అమ్మకు చెయ్యి నరుక్కున్నట్లవుతుందిరా... అందునా ఒక్కడివి ఇద్దరి పని చూస్తవేమో... మా అయ్యవుగా... ఒక నాల్గుదినాలుగా బడిసంగతి మర్చిపోయి అమ్మకి అయ్యకి ఇంతసాయం జెయ్యరా... పెద్దోళ్ళం ఎందుకు జెప్తున్నామో జర ఇనుకోరా..."

"నువ్వేం చేనుకెళ్ళుడు మాని గాలి తిరుగుళ్ళు తిరుగత ల్లేవనుకో... బడికిబోవుడు మంచిపనే... కాని మనలాంటి గరీబు గాళ్ళకి సదువులు సదువుకునే రాత ఉండద్దా..."

"ఎందుకురా బడీ... బడీ అనుకుంటూ అటుసదువుకు కాకుండా ఇటు పనులకు కాకుండా తయారవుతావ్ ఈ ఊర్ల ఉన్నంత వరకూ సదివినగాని మళ్ళీ చేన్లల్లకొచ్చి పన్చేసుకొవాల్సిందేగాదరా..."

ఒకరి తరువాత ఒకరు మాట్లాడుతూ... వాడిలో చదువుకోవాలన్న తపనను మొదలంటా నరికెయ్యాలని చూస్తున్నారు. వాడికి వంటరిగా ఎక్కడికైనా పారిపోయి కరువుతీరా ఏడ్వాలని ఉంది...

తల్లివంక విరక్తిగా చూసాడు. ఆమె ముఖం ద్వేషించ వీల్లేనంత దైన్యంగా ఉంది. తమ్ముళ్ళు దిగులుగా నిలబడి మధు వంక చూస్తున్నారు. ముంపుకు గురైన చేనులో పత్తి మొక్కలా దోషుల్లా నిలబడ్డ తల్లీ, తమ్ముళ్ళను వదిలి... తలవంచుకుని అక్కడ నుండి బయటపడి చేలోకి బయలుదేరాడు.

"భగవంతుడా... ప్రపంచంలో ఎంతో మంది మంచిగ సదువుకుని పెద్దపెద్ద ఆఫీసర్లవుతున్నారు... నాకసలు సదువుకునే గీతనేలేదా... గీ పల్లెలో గిట్ల ఓ పత్తిరైతు కడుపున పుట్టించి సదువుగీత గీసుడు మర్సినవా..." పొగిలి పొగిలి ఏడ్చాడు. మోటబావిలో నుంచి నీళ్ళు తోడిపోసినట్లు ఆగి... ఆగి... దుఃఖం పొంగుకువస్తూనే ఉన్నది.

పసుపు ఎరుపు రంగుల్లో పత్తిపూలు అక్కడక్కడా అందంగా పూసి వున్నాయి. చెట్లనిండా వెన్నెల ముద్దల్ని మోస్తూ కొమ్మలు గాలికి ఊగుతున్నాయి. మేఘమేదో నేలకు వరిగినట్లు ఇంటికి చేర్చాల్సిన పత్తి రాశిపోసుకుని ఉంది. ఆ పక్కనే చేనుకు కాపలా కాస్తున్న మధు చిన్నాన్న పద్యాలు పాడ్తున్నాడు.

తనలో రేగిన కసినంతా పత్తిచెట్లపై చూపిస్తూ రెండు గంటలపాటు వేగంగా పత్తి తీశాడు. కొన్నేళ్ళుగా అలవాటైన పని. వాడి చేతుల్లోకి పత్తి గుత్తులు గుత్తులుగా వచ్చి చేర్తున్నది. వాడు కుప్పగా పోసిన పత్తి చిన్న సైజు ఐరావతంలా ఉన్నది. వాడలా ఎంతసేపు పత్తితీసాడో ఆ కుప్ప దగ్గరే పడి నిద్రపోయాడు. మధువాళ్ళ బాబాయి వచ్చి లేపి భోజనానికి ఇంటికెళ్ళమని ఎంత బతిమాలినా వెళ్ళలేదు. తెల్లారే తల్లి చేనుకు పరుగెత్తుకొచ్చింది.

"నా మీద కోపమొచ్చిందా అయ్యా... రాతిరి భోజనానికి రాలేదు నేనెట్లన్నజేసి ఇద్దరు పనోళ్ళని పెట్టుకుంటగాని... నువ్వు బడికెళ్ళరా అయ్యా... మన దరిద్రానికి నిన్ను బడికి పంపుతల్లేను గాని... నిన్ను సదిపించకూడదని కాదురా అయ్య... నా మీద... ఇంటి మీద అలుగకురా నాయనా..." ఏడుస్తూ బతిమాలి ఇంటికి తీసుకెళ్ళింది.

మనసులో సంఘర్షణ పైకి కనపడనీయ్యకుండా.... గంభీరంగా మారిపోయాడు మధు.. ఆ రోజు నుంచి వాడు వంచిన తలెత్తకుండా పత్తితీసే పనిలో లీనమైపోయాడు. పత్తి తియ్యడం బస్తాలకెత్తడం... ఇంటికి చేర్చడం పెట్టుకున్న కూలీలను అదిలించో బతిమాలో పని చేయించుకోవడం చేస్తున్నాడు.... రోజులు గడిచిపోతున్నాయి. ఆ కాస్త పత్తి వలిచేస్తే బడికిపోవాలని వాడి ఆరాటం... ఒంటిపూటబళ్ళు మొదలైన సంగతే వాడికి తెలియదు. పనిలో పడ్డ వాడు... వారాలు, నెలలూ కూడా మరిచిపోయాడు. తనపై మోపిన కర్తవ్యాన్ని దీక్షగా నిర్వర్తిస్తున్నాడు. గుండెల్లోని గుబులెవ్వరికీ తెలియనియ్యకుండా గళమెత్తి పాడుతూనే ఉన్నాడు.

ఎండలు ప్రారంభమై పనిచెయ్యడానికి చిరాకనిపిస్తున్నా వాడి పాటలకందరూ పని అలసట మరిచిపోతున్నారు. ఎవరినీ ఏమీ అనలేని కసితో వాడు ఆఖరి కాయ నుండి కూడా పత్తివలచి ఇంటికి చేర్చి... మర్నాడు ఉదయం బడికి చేరుకున్నాడు.

పిల్లలంతా సందడిగా ఎవరి ముచ్చట్లల్లో వాళ్ళున్నారు. ఉషాటీచర్, జ్యోతిటీచర్ తలవంచుకుని ఏదో రాస్తున్నారు... ఎప్పటిలాగే బిడియంగా బడిలోకి అడుగుపెట్టాడు. తలెత్తిన ఉషాటీచర్ జ్యోతి టీచర్ మధు వంక ఆశ్చర్యంగా చూసారు.

"చేలో పత్తి తియ్యడం పూర్తిగా అయిపోయింది టీచర్... ఇక నుంచి నేను రోజూ బడికి వస్తా"... నమ్మకంగా, దృఢంగా చెప్పాడు.

"మధూ... నిన్నటితో సంవత్సరం పరీక్షలు అయిపోయాయి. ఇవిగో వాళ్ళ పేపర్లు దిద్దుతున్నాం... వచ్చే శుక్రవారం నుంచి పిల్లలకు వేసవి సెలవలు కూడా..." వాడి వంక జాలిగా చూస్తూ చెప్పారు వాళ్ళు.

ఎండిన పత్తిచెట్టులా... నీళ్ళింకిన కన్నులతో మధు నిస్తేజంగా నిలబడిపోయాడు. V

---

# హైకులు

**లకుమ**



కాలం నిజంగా
ముళ్ళబాటే?
వాచీలోనూ ముళ్ళు!?

క్లాస్ రూంలో
విద్యార్థి నిద్రపోతూ?
టీచర్‌కు పాఠం రాలేదు!?

బ్లాక్‌బోర్డుపై
అక్షరమాల
ఓ క్రొత్త పాలపుంతలా!

వాడిన పూలూ
వికసిస్తున్నాయ్!
వృద్ధాశ్రమాలు!?

ఐస్‌ఫ్రూట్స్ అమ్మేవాడికే
పాపం ఎప్పుడూ
వడగళ్ళ దెబ్బ!

తామరాకు మీది నీటి బొట్టు
చలించిపోయింది?
గుజరాత్ గాయం!?

చందమామా రాలేదు
జాబిల్లి రాలేదు
ఇంక 'అమ్మే' దిగి వచ్చింది

'కుడి ఎడమైతే
పొరబాటు లేదోయ్
గొంతు కలిపిన అద్దం!?'

ఒంటి రెక్క మీద
ఆకాశాన్ని ఈడ్చుకొస్తోంది?
ఓ పిట్ట!

మా అమ్మకూ
సీతాకోక చిలుకకూ
ఒక్కటే చీర!



Untitled-2 64 6/11/2002, 3:51 PM

పరామర్శ

# కథల్లో 'చెర'

**ఆయన కథలన్నీ కూడా వ్యధార్త జీవిత యథార్థ దృశ్యాలే... మామూలు మనుషుల గుండెఘోషలు... సంక్షుభిత మవుతున్న గ్రామీణ జీవన స్థితిగతుల్నుండి పొట్టచేత పట్టుకుని, వలసపోక తప్పని వాళ్ళకు ఎదురయ్యే జీవన సమస్యలు, గుమాస్తాల, బడిపంతుళ్ళ అప్పులూసప్పులూ కష్టనష్టాలూ... యింకా బడుగు మనుషుల ఆకలీ, అసహాయుల రోగాలూ, రొష్టులూ అన్నింటినీ కూడా ఆయన కలం గాలం వేసి పట్టి పాఠకుల ముందు పరుస్తుంది...**

**వి. ప్రతిమ**

చెరబండరాజు ప్రజల మనిషి.

ఆయనే చెప్పుకున్నట్లు ఆయన ఆయుధం కలం... ఆయన రంగం ప్రజా సమస్యలు... ఆయన గమ్యం విప్లవం...

సాహిత్యమే జీవితం.. సమాజంలోని అసమానతలపట్ల నిరసన, బడుగుజీవులపట్ల ఆయనకున్న అక్కర.... పేద రైతులూ, వ్యవసాయ కూలీలూ... యింకా వివిధ రకాల శ్రామికులూ సంఘటితం కావాలన్న ఆయన కోరికా.... వారిలో చైతన్యం తీసుకు రావాలన్న ఆలోచనా... వెరసి చెరబండరాజుకు సాహిత్యమూ, జీవితమూ వేరు వేరు కావన్న విషయాలు ఆయన సాహిత్యాన్ని పరికించినప్పుడు మనకర్థమయ్యే నిజాలు...

"పాట నాకు ఆక్సిజన్... పోరాటం నా ఊపిరి..." అన్న ఆయన వాక్యం ఒక నినాదంలా అప్పటి ప్రగతి కాముకుల్ని ఊపేసింది... ఇవ్వాల్టికీ పాఠకుల నోళ్ళలో ఆడుతూనే వుంది...

ఈ నూతన ఆర్థిక విధానాలు, ప్రపంచీకరణ, ప్రపంచ బ్యాంకు... అప్పులు, షరతులు.... అంతర్జాతీయ మార్కెట్టు యిలా యిప్పుడు ఒక పదేళ్ళుగా మనం... చర్చించుకుంటున్నాం, తర్జన భర్జనలు పడుతున్నాం గానీ చెరబండరాజు అన్నేళ్ళ క్రితమే యింత ఘాటయిన విమర్శ చేసి మనందర్నీ చాలా ముందుగా హెచ్చరించాడు.... ఆయన కాలానికి ఎంతో ముందు నడిచిన రచయిత....

నిజానికి చెరబండరాజు గొప్పకవి... ఆయన కవిత్వ ప్రక్రియే మిగిలిన అన్నింటికంటే అద్భుతంగా పాఠకుని ఆకట్టుకున్నదని విజ్ఞుల అభిప్రాయం... అయితే ఆయన యిన్ని రకాల సాహితీ ప్రక్రియల్ని ఎందుకు ఎన్నుకున్నాడు అన్నది మనం పరిశీలించినపుడు

''ఆగస్ట్ పదిహేను ద్రోహం చెప్పకపోతే అన్నం సయించదు నాకు" అంటాడో చోట కవితాత్మకంగా

బావుంది... అయితే క్లుప్తీకరణ స్వభావంగా కలిగిన కవిత్వ ప్రక్రియలో ఈ ఆగస్టు పదిహేను ద్రోహం ఏమిటో చెప్పడానికి ఆయనకి వీలు పడనందున.... వాటి వెనుక, ముందుల్ని సవివరంగా చెప్పడం కోసం బహుశా ఆయన వివిధ వచన ప్రక్రియల్ని ఆశ్రయించి వుండొచ్చు...

ఆ క్రమంలోనే చాలా తక్కువే అయినా చెరబండరాజు కొన్ని మంచి కథల్ని కూడా పాఠకులకి అందించాడు.

ఆయన కథలన్నీ కూడా వ్యధార్త జీవిత యథార్థ దృశ్యాలే... మామూలు మనుషుల గుండెఘోషలు... సంక్షుభిత మవుతున్న గ్రామీణ జీవన స్థితిగతుల్నుండి పొట్టచేత పట్టుకుని, వలసపోక తప్పని వాళ్ళకు ఎదురయ్యే జీవన సమస్యలు, గుమాస్తాల, బడిపంతుళ్ళ అప్పులూసప్పులూ కష్టనష్టాలూ... యింకా బడుగు మనుషుల ఆకలీ, అసహాయుల రోగాలూ, రొష్టులూ అన్నింటినీ కూడా ఆయన కలం గేలం వేసి పట్టి పాఠకుల ముందు పరుస్తుంది...

ముందే అనుకున్నట్టు పేదరికం మీద పోరాడ్డం ఆయన సాహిత్యం.

"పేదవాడికి యజమాని యింటి కుక్క కూడా యజమానే" అన్న విషయాన్ని నిరూపిస్తూ ఆయన వ్రాసిన కథ "దారి పొడుగునా..." యజమాని కోసం మేడల మీద మేడలు లేపుతూ జీవితమంతా ధారపోసిన రాజాలు అదే యజమాని ఘాతుకానికీ, స్వార్థానికీ బలయి భార్యనీ, కాలునీ కూడా పోగొట్టుకుని... కొద్ది సానుభూతికీ, సాయానికీ నోచుకోకపోగా... చేసిన అప్పుకు కొడుకును కుదువపెడ్తాడు... అంతే కాకుండా యజమానిని రక్షించమని కొడుకుని తరుముతాడు... కొడుకు తిరిగి వచ్చేటప్పటికి తన ప్రాణాలే పోగొట్టు కుంటాడు...

తండ్రి జీవితాంతం చేసిన వెట్టిచాకిరీ నుండి చైతన్యాన్ని పొందిన బలీయమైన పాత్ర నారాయణ... చాలా రోజుల దాకా పాఠకుడ్ని వెన్నాడుతూనే వుంటాడు...

"నా తండ్రి చావుకు నువ్వు ఖర్చు పెట్టొద్దు

నీ పాపిష్టి ధనం మాకవసరంలేదు"

అంటూ ఎవరి ఆసరా లేకుండా రాత్రికి రాత్రి తండ్రి శవాన్ని భుజానేసుకుని గట్లు ఒరుసుకుని పారుతోన్న నదిలోకి విసిరేస్తాడు... తండ్రి శవంతోపాటు తండ్రి ఓలిగంజి కోసమా అన్నట్లు తెచ్చిన నిండు సారా సీసానీ, పినతల్లి ఫొటోనీ కూడా నదిలోకి విసురుతాడు. అరవయ్యిల్లోనే యింత శిల్పదృష్టిగల చైతన్యవంతమైన కథలు వ్రాసిన చెరబండరాజు నిజంగా అభినందనీయుడు.

చిన్న చిన్న మాటల్లో పెద్దపెద్ద విషయాలు సునాయాసంగా, తేలిగ్గా అర్థమయ్యేలా చెప్పడం చెరబండరాజు ప్రత్యేకత...

మెకాలే విద్యావిధానం మీద ఈనాడు మన మేధావులు ప్రకటిస్తోన్న అసంతృప్తిని ఆయన ఏనాడో వ్యక్తపరిచాడు....

వాస్తవ జీవితానికి ఏ మాత్రం సంబంధంలేని చదువుల్తో ఏ దృక్పథమూ, అవగాహనా లేకుండా పిండిబొమ్మల్ని తయారు చేసి తరాలకు తరాలను బయటికి పంపిస్తున్నాయి ఈ విద్యాలయాలు అంటా డాయన... ముప్ఫయ్యేళ్ళ తర్వాత యివ్వాల్టికీ ఆ పరిస్థితి మారనందుకు మనం సిగ్గుపడాలో, ఉరివేసుకోవాలో అర్థం కాదు...

"చరిత్ర పాఠాలు" అన్న కథలో ఒక బడిపంతులు చేసిన సామాజిక బోధన ఒక



Untitled-2 65 6/11/2002, 3:51 PM

చిన్న కుర్రవాడ్ని తన తండ్రి మీదే రిపోర్టిచ్చేలా చేస్తుంది.... చివరికి ఆ కుర్రవాడు ఒళ్ళంతా చితక్కొట్టించుకుని చీకటి గదిలోనూ.... ఆ బడిపంతులు నెలకాక ముందే దూరప్రాంతానికి బదిలీతోనూ సత్కరింపబడతారు.... అయినా సరే బట్టీపట్టి వ్రాసే పరీక్ష పాఠాలు కాక నువ్వు నేర్వాల్సిన 'చరిత్రపాఠాలు' వేరే వున్నాయంటూ చివరి పాఠం చెప్తాడా పంతులు... అంతేకాక మాధవరావు వంటి కుహనా దీన బాంధవుల్ని, ఎండగడ్తాడు రచయిత...

ఇలా ప్రతీ కథలోనూ వివిధ కోణాల్లో నుండి ప్రజల్ని చైతన్యపరచడం ఆయన కథల్లో మనకి కన్పిస్తుంది.



..............○..............

**అత్యంత సాధారణమైన శిల్పంలోనే... గొప్ప కథావస్తువుల్నీ, మంచి శైలినీ కూడా చెరబండరాజు కథల్లో మనం గమనిస్తాం...**

..............○..............

"నిరుపేదల బతుకులు శిథిలమైన మైలు రాళ్ళు" అన్న సత్యాన్ని చాటుతూ ఆయన రాసిన మరోకథ 'ఒకే దీపం కింద...'

"మాల మాదిగలకు చదువులు కూడానా రా" అంటూ మల్లేశం చేతిలోని పలక లాక్కుని చప్పున చెప్పుకాలితో తొక్కేస్తాడు భూస్వామి రాజారావు... పలక వెయ్యిముక్కలయితే మల్లేశం మనసు అంతకు రెట్టింపు ముక్కలయింది... ఇక భూస్వామి వద్దకు పనికి పోనంటూ మొండికేసిన కొడుకూ... వెళ్ళక తప్పదని పట్టుబట్టిన తండ్రీ కొన్నాళ్ళు పరస్పరం ముభావంగా వున్నప్పటికీ యిద్దరూ రాత్రిబడిలో ఒకే దీపం కింద కలిపి చదువుకునే సన్నివేశంతో ఆశాజనకంగా కథ ముగుస్తుంది...

అత్యంత సాధారణమైన శిల్పంలోనే... గొప్ప కథావస్తువుల్నీ, మంచి శైలినీ కూడా చెరబండరాజు కథల్లో మనం గమనిస్తాం...

ఒక చోట అంటాడూ

"నిదురలో వున్న చంటిపాప ఒంటి మీద జెర్రి పాకడం చూసిన తల్లికెవ్వుమన్నట్లుగా ఎదురింటి వేపచెట్టు మీద గుడ్లగూబ ఒక్కసారి గట్టిగా అరిచింది..." అంటూ ఆ కథలో అప్పుడే జరిగిన ఒక దురదృష్టకరమైన సంఘటనని సింబాలిక్‌గా చెప్తాడు... మరో చోట 'వరదలో గడ్డిపరకలా కొట్టుకుపోతోందామె మనసు' అంటూ ఆమె మనః పరిస్థితిని వివరిస్తాడు...

జీవితంలో మామూలుగా తారసపడే మనుషుల్ని కథాపాత్రలుగా పరిగణించి, చివరికి మానభంగ ప్రయత్నాన్ని కూడా ఒక కథాఘటనగా ఎంచే భర్తా, తన వ్యక్తిత్వం మీదా, తన ఆలోచనల మీద, తన స్త్రీత్వం మీద ఎంతో పట్టింపు... అభిమానం కలిగిన భార్యా వీరిరువురి మధ్యా ఘర్షణ.. 'దృష్టి' కథలో మనకి కన్పిస్తుంది... స్త్రీ పాత్రల వ్యక్తిత్వం మీద చెరబండరాజు తీసుకున్న ప్రత్యేక శ్రద్ధకు ఈ కథే ఒక ఉదాహరణ...

శ్రామికులలో ఐక్యసంఘటన నిర్మించడం... వారినందరినీ చైతన్యపరచడం చెర స్వప్నం...

కష్టజీవులు తమ లక్ష్యం కోసం ఒకటయినప్పుడు నేలతల్లి పులకిస్తుంది.... చరిత్ర చేతులెత్తి స్వాగతం చెప్తుంది... రక్తం ఏరులయిపారినా, తలలు నేలలో దొర్లినా ఏమైనా ఆశక్తి యింకా బలపడుతుంది అంటాడు. 'చైతన్యం రెక్కవిప్పింది' కథలో.... ఆ కథలోని బాలిగాడు ఒక కథాపాత్ర అంటే ఎంత మాత్రమూ నమ్మబుద్ధికాదు... రక్తమాంసాలున్న మనిషిలా తోస్తుంది...

ఆ బాలిగాడు తప్పకుండా ఎక్కడో వున్నాడనీ, ఇప్పటికీ బతికే వున్నాడనీ అన్పిస్తుంది...

రైతు సంఘ జనోద్ధరణ విషయంలో కుహనా కమ్యూనిస్టుల ద్రోహాన్ని ఎండగట్టి భూస్వాముల అనలు భూములకే ఎసరుపెట్టబూనిన వారి గురించి హెచ్చరించి ఉద్యమానికి బాలిగాడు మెగేదారుగా నిలిచే పరిణామక్రమాన్ని అర్థం చేయిస్తాడీ కథలో...

ఒకసాదా పేద బడిపంతులు ఉదయం లేచింది మొదలూ అప్పుకోసం వెతుక్కోవడం... వడ్డీలు.. .చిట్టాలు.. వడ్డీ లెక్కల్లో మునిగి తేలడం.. చివరికి బిడ్డకి పలకా, బలపం కూడకొనలేని స్థితిలో పడిపోవడం... వంద రూపాయలకి పది రూపాయలు కాక తన స్నేహితుడు ఆదరంగా ఎనిమిది రూపాయల వడ్డీకే యిస్తాననడం.. ఈ కథని 1969లో వ్రాస్తాడు. రచయిత... ఆ రోజుల్లో ఎనిమిది రూపాయల వడ్డీ అంటే ఆశ్చర్యం కలగకమానదు... మొత్తం మీద చిన్నచిన్న ఉద్యోగస్థులకు ఒకటో తారీఖు వధ్యశిల వంటిది అన్న విషయాన్ని తెలుపుతూ 'పలకా–బలపం' కథని ముగిస్తాడు రచయిత.

అయితే ఈ కథల్లో అక్కడక్కడా రచయిత కన్పించడం అనేది మనం చూస్తాం.... సమాజ పురోగతికి ఉపయోగపడే సాహిత్యాన్ని వెలువరించే క్రమంలో యిది అనివార్యమయినదని మనందరికీ తెలుసు... అయినా సాహిత్యంలో కాలం కూడా ప్రముఖ పాత్ర వహిస్తుంది... ఇవన్నీ కూడా ముప్పయ్యయిదేళ్ళ క్రితం వ్రాయబడ్డవన్న విషయం మనం మర్చిపోకూడదు...

'పేదవాడి కోపం పెదవికి చేటు' అన్నట్లు... తన కొడుకు అనారోగ్యంగా వున్నప్పుడు... చూడ్డానికి రమ్మని పిలిచి, బతిమాలి రానంటే రానని మొండికేసిన డాక్టరు బాబుని ఆ ఆవేశంలో ఎడాపెడా తన్నిన యాదగిరి కత ఏమయింది?.... పోలీసుల చేత మక్కెలిరగదన్నించుకుని కొన ప్రాణాలతో యింటికి చేరేసరికి కొడుకు శవం ఎదురొస్తుంది.. ఇంటికి యిల్లూ, ఇల్లాలికి యిల్లాలూ ధ్వంసమైన దృశ్యం.. ఇది యాదగిరి విషాదం మాత్రమే కాదు సమాజం విషాదం అంటాడు రచయిత... అసలు "మందు" కావల్సింది సమాజానికేనని ఆయన ఉద్దేశం...

కాలం ముందుకు జరుగుతున్నప్పుడు వివిధ చారిత్రక దశల్లో గతిశీలతకు అనుగుణమైన అర్థాలనిచ్చి కొత్త కోణాలను దర్శింప జేసేటువంటి రచనలు చెరబండరాజువి.

గొప్పోళ్ళ నాలుకకు రెండంచులా పదునే...

భూస్వామి నారాయణరెడ్డి తన పంటను లాభసాటిగా పట్నం శేటుకు చేర్చాలనే తొందరలో... కూలీలతో బండచాకిరీ చేయించి... అక్కడ వాళ్ళగూడెం కాలిపోతోందన్నా కూడా యిళ్ళకు పంపకుండా చివరకు జడివానలో కూడా పని చేయించి... ఆఖరికి తడి ధాన్యాన్ని వాళ్ళకు కూలిగా కొలుస్తాడు... అదీ కూడా పట్టించుకోకుండా పిల్లలేమైనారో, ఇళ్ళేమయినాయో అనుకుంటూ కూలీలు పరుగెత్తేటప్పటికి ఆ వాన గూడెంలో లేదు... గూడెం మొత్తం కాలిపోయింది... ఊరు మాత్రం పదిలంగానే వుంది.. 'దేవుడు కూడా గొప్పోళ్ళ పక్షమే' ననుకుంటారు కూలిజనం "కట్టడి" అన్న కథలో...

రాజకీయాలకు, సాహిత్యరంగానికీగల పరస్పర సంబంధాన్ని సరయిన కోణంలో సవ్యంగా అర్థం చేసుకున్న వ్యక్తి చెరబండరాజు.

ఈ మొత్తం సంకలనంలో మనల్ని కదిలించి, గుండెల్ని పిండే కథ ఒకటి వుంది.... ఆ కథ చదివినప్పుడు గుండెగొంతుల్లోకి రావడాన్ని



Untitled-2 66 6/11/2002, 3:51 PM

పాఠకుడు అనుభూతిస్తాడు..

"నన్ను చంపగలరు కానీ నా పాటను కాదు... నా సిద్ధాంతాన్ని కాదు కానీయండి మీ పని" అంటూ విప్లవ చైతన్యంతో గుండెలొడ్డి ధైర్యంగా నిలబడ్డ పధ్నాలుగేళ్ళ కుర్రాడు రాంబాబు... అమరవీరుడు అల్లూరిని గుర్తుకు తెస్తాడు.. చనిపోవడానికి ముందు పోలీసులకే బోధచేసిన ఆ కుర్రాడి జ్ఞాన చైతన్యం పాఠకుడి కెప్పటికీ మరుపురాదు... ఆ కుర్రాడి మాటలకి కరిగిపోయిన పోలీసు రామ్మూర్తి చివరికి డి.ఎస్.పి.ని హత్య చేయడంతో కథ ముగుస్తుంది... పోలీసులు కూడా మనలోని మనుషులే అన్న విషయాన్ని చెరబండరాజు సాహిత్యంలో అక్కడక్కడా మనకి తెలియజెప్తూనే వుంటాడు.

ఈ కథ 'చిరంజీవి' సమాజంపట్ల ప్రజల పట్ల ప్రేమవున్న ఎవరికయినా నచ్చే తీరుతుంది... "ఇప్పుడు వీస్తున్న గాలి" కథా సంకలనాన్ని కేవలం ఈ కథ వుండడం మూలంగానే ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం బ్యాన్ చేసిందంటారు...

ఆధునిక కథ ఆధునిక జీవితంలో నుండి వచ్చిన ప్రక్రియేనని మనం యిప్పుడు భావిస్తున్నాం కానీ.. ఈ ఆలోచనలు, కథా శాస్త్రీయ పద్ధతులూ ఏమీ తెలీకుండానే జీవితాల్లోంచే కథలు వ్రాస్తాడు చెరబండరాజు.

ప్రగతిశీల భావాలతో సాహితీ మార్గంలో వున్న వ్యక్తి తన అందమైన భార్యని అనుమానించి... వేధించి... తనను తాను హింసించుకుని... చివరికి ఆమె మరణం తరువాత కూడా ఈ అనుమానం నివృత్తి కాలేదనీ.. అది యింకా సశేషమేనని మిత్రుడుకి ఉత్తరం వ్రాస్తాడతడు.. ఈ కథని చెప్పిన కోణం... అంటే ఆ రచయిత కోణంలో నుండే కథ చెప్పిన వైనం పాఠకుడ్ని ఆకట్టుకుంటుంది...

ఇలా విప్లవ రచయిత చెరబండరాజు సాహిత్యమంతా కూడా సామాన్యుడ్ని చైతన్యపరిచేదీ, సమాజ ప్రగతికి దోహదం చేసేదీ...

ఆయన కలాన్ని ఆయుధంగా చేసుకున్న రచయిత...

ఇక్కడ మనం చెంచయ్యగారు చెప్పిన మూడు రకాల రచయితలనీ ప్రస్తావించుకోవలసి వుంది...

ప్రపంచం మారుతుందనీ, ఆ మార్పు సమాజ పురోగతికి దోహదం చేస్తుందనీ గుర్తించలేని గొప్పరచయితలు కొంత మంది పాఠకుల్ని వెనక్కి నడిపించడానికి ప్రయత్నిస్తే...

ప్రజల అమాయకత్వాన్ని ఆసరా చేసుకుని సాహిత్యాన్ని వ్యాపార సరుకుగా అమ్ముకుని బతికే మరికొందరు రచయితలు... పాఠకుల్ని కొన్నాళ్ళపాటయినా భ్రమల్లో ముంచగలిగారు...

అయితే సమాజ పురోగతి మొత్తం శ్రమజీవి నెత్తుటి బొట్టులోనే యిమిడి వుందనీ.. దోపిడీ, అసమానతలు లేని సమాజాన్ని స్థాపించడానికి సాహిత్యం రచయితకు ఒక ఆయుధమనీ గ్రహించిన గొప్ప రచయిత పాఠకుల్ని చైతన్యవంతుల్ని చేసి వారికి కర్తవ్య బోధ చేస్తాడు.... అందుకు ఉదాహరణ చెరబండరాజు... అటువంటి గొప్ప వ్యక్తి నడి వయసులోనే మరణించకుండా వున్నట్లయితే ప్రజల్ని చైతన్యపరిచే గొప్ప సాహిత్యం మరింత మనకి అంది వుండేది.

అయితే ఆయన మరణించాడని మనం అనుకోవడంలేదు.

ప్రజాచైతన్య రచయితలకీ, కళాకారులకీ మరణముండదు...

చెరబండరాజు ఎప్పుడూ చిరంజీవే...

(ఆవిష్కరణ సభలో చేసిన ప్రసంగం – స్వల్పంగా సంక్షిప్తీకరణ) V

# మినీ కవితలు

**డి. దుర్గాబాయి**

**తుపాను**

సముద్రంలో అల్పపీడనం
తీరాన్ని చేరుతుందో లేదో తుఫాను
సమాజంలో 'అల్ప' జీవులపై పీడనం
తప్పక రేపుతుంది బతుకుల్లో తుఫాను

**మోత**

భుజాల మీద హెర్క్యులస్
భూమిని మోసినట్టు
భూమి మీద చీమ
వేరుశనక్కాయను హాయిగా మోస్తున్నది

**వేగం**

ఫ్యాను గిరగిరా తిరిగితే
నాకు ముచ్చెమటలు పోస్తాయి
నాకే జబ్బూ లేదు
మా మీటరు వేగం ముందు
ఫ్యాను వేగం ఏపాటిది?



**సిగ్గు-సిగ్గు**

నాటి అవమానాల క్షాత్రం
గుడ్డి రాజు సభ
నేటి అత్యాచారాల క్షేత్రం
మన దేశ రాజధాని!

ఆరుద్ర రచన
సమగ్ర ఆంధ్ర సాహిత్యం
సంపుటాలు




ఒక్కొక్కటి
రు. 10లకే

అమూల్యమైన రిఫరెన్స్ సమాచారంతో ఒక్కొక్కటి 400–500 పేజీలుగల ఈ ప్రతిష్ఠాత్మక సంపుటాలు ఒక్కొక్కటి పది రూపాయలకే లభిస్తాయి. మీ సమీపంలోని ప్రజాశక్తి బుక్‌హౌస్‌ను సందర్శించండి. లేదా హెడాఫీసుకు రాయండి.

అందుబాటులో ఉన్న సంపుటాలు :
1, 6, 7, 8, 9, 10, 11, 12, 13



Untitled-2 67 6/11/2002, 3:51 PM

## ప్రసంగం



# కథలంటే లోతుగా చూడటం

**ముక్తవరం పార్థసారథి**

**క**థలు చెప్పే నేర్పు అందరికీ కొద్దో గొప్పో వుంటుంది. ఇది కించిత్తు కూడా లేనివాళ్ళు 'కథలు రాయటమెలా'గో వ్యాసాలు రాస్తారు. కథ రాయటం వెనక ఒక ఫార్ములా వుంటుందనీ, అది తెలుసుకుంటే ఎవరైనా రాయగలరనీ నమ్మించ ప్రయత్నిస్తారు.

టెక్నిక్, శిల్పం అనేవి ఒక స్థిరమైన విషయాలనీ, వాటిని దేనికైనా అన్వయించి కథ రాయచ్చుననీ ఒక అభిప్రాయం వుంది. మంచి కథల్లో టెక్నిక్, వస్తువులకు ఒక అవినాభావ సంబంధం వుంటుంది. అంటే ప్రతి వస్తువుకూ, ప్రతి కథకూ ఒక్కో విలక్షణమైన టెక్నిక్ అవసరమవుతుంది. అది ఫార్ములా కాదు.

కథంటే ఒక పరిపూర్ణ నాటకీయత కలిగిన కథనం. కథలో యాక్షన్ ద్వారా పాత్ర చిత్రణ జరుగుతుంది. పాత్రలు ఎదుర్కొనే నాటకీయత కలిగిన సంఘటనల ఫలితమే కథ.

కొందరు రచయితలు వ్యక్తుల్ని గురించి కాక, సమస్యల గురించి రాయటానికి వుత్సాహం చూపిస్తారు. ప్రత్యేక వ్యక్తులూ, ప్రత్యేక సంఘటనలూ లేనప్పుడు కథ రాయాలనుకొని స్కెచ్ రాస్తాం. లేదా వ్యాసం లేదా రెండూ కలిపిన మరేదో వంటకం.

కథలు రాసేటప్పుడు మన నమ్మకాలు, మన నిబద్ధత, మన నైతిక విలువలు మనకు మార్గదర్శకంగా, కరదీపికలుగా వుండాలి. ఈ విలువలు వెలుగుగా పనికొస్తాయిగాని అనే వస్తువులు మాత్రం కావు. వెలుగు సాయంతో లోకాన్నిచూడాలి. కాని వెలుగే లోకం కాదు. వెలుగు ఒక మీడియం. ఒక శక్తి, ఒకదృష్టి. కళ అంటే అభివ్యక్తీకరణ. అభివ్యక్తీకరణకు పరిశీలన ప్రాణం. కథారచన అనే ప్రక్రియకు మూలం కథ చెప్పటం కాదు. జరిగింది చూపించటం.

రచయిత స్వభావ రీత్యా నిత్య విద్యార్థి. రచన ఎలా చేయాలో తెలుసు కొనటానికి ప్రయత్నించటమే రచన. ఏది సత్యం, ఏదసత్యం అని పరిశోధించటమే రచన. రచయితలో కొంత తెలియనితనం, మూర్ఖత్వం, మూఢత్వం వుండటం తప్పని సరేమో. చెప్పదలచుకున్నది గబగబా చెప్పెయ్యక కాస్త డొంకతిరుగుడుగా చెప్పగలగటం కథాకథన సౌలభ్యానికి మొదటి మెట్టు.

రచన అంటే వాస్తవ జీవితం నుండి పలాయనం కాదు. వాస్తవ జీవితంలోకి మరింత లోతుగా చూడటమే.

ఆధునిక సాహిత్యంలో రచయిత కనిపించడు. కొందరు వ్యక్తులు, కొన్ని సంఘటనలు మాత్రమే వుంటాయి. వ్యక్తుల గురించీ, సంఘటనల గురించీ వ్యాఖ్యానాలు చేయటం ఆధునిక రచయిత వుద్దేశం కాదు. వస్తువును ఎంపిక చేసుకోవటంలోనే, చెప్పటంలోనే రచయిత వుద్దేశం వ్యక్తమవు తుంది.

కళా సృజనకు మూలం స్పందన. అదిలేందే ఏమీ జరగదు.

V

# హైకులు

**వి.ఎస్.వి. మూర్తి**



బడితెరిస్తే
బాల్యం మోత బరువై
చదువులేనా

విత్తు నాటినం
ఎదలో భయాలతో
రైతన్న చూపు

మెరుస్తూ వుంది
దృశ్యం అదృశ్యమైనా
మనోబింబమై

కెమెరా కన్ను
విశ్వంలో ఎన్నందాలో
వీక్షిద్దాం కల్సి

**కె. నవీన్**

నిటారుగా నిలబడ్డ
పచ్చపాముల గుంపు
జొన్న చేను

హోమ్ మేడ్
ఆత్మహత్యించుకుంది
ఇంపోర్టెడ్ తాడుతో

అరచేతికి
అందమైన పైట
గోరింటాకు

అడవిలో
ఆర్కెస్ట్రా
కోకిల

సూర్యుణ్ణి చీకట్లోకి
విసిరేసి తన్నుతాను
నిందించుకుంటోన్న సంధ్య

**గుడిమెట్ల గోపాలకృష్ణ**

కృత్రిమం!
ప్లాస్టిక్ నవ్వు
ఇక దానికి తోడు
ప్రక్రియ మేఘం!



Untitled-2 68 6/11/2002, 3:51 PM



# పాటకు పదును

**శైలి**

పాట

పాట తల్లిలా లాలిస్తుంది. తండ్రిలా నడిపిస్తుంది. గురువులా బోధిస్తుంది. అసలు బతుకు నడిపించేది పాటే అనే విధంగా ప్రజాకవి ముఖ్దూం అభివర్ణించాడు. **"పదపదవే గీతమా! నా ప్రాణమా!''** అంటూ అనుభవించాడు. పలవరించాడు. పనిలో పాట... పనితోపాట... చివరకు పనీ–పాటగా శ్రమైకజీవన సౌందర్యంలో మమేకమైపోయింది.

అందుకే పాటను ప్రాథమిక ప్రజాకళాయుధంగా ప్రజానాట్యమండలి విశ్వశిస్తున్నది. ఆ క్రమంలో పాటకు పదును పెట్టేందుకు నిరంతరం పాటుపడ్తున్నది.

అక్టోబరు 17, 18, 19 తేదీలలో పాటల రచనపై హైదరాబాద్ సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో రచయితల వర్క్‌షాప్ నిర్వహించింది. 25 మంది ప్రజానాట్యమండలి రచయితలు ఈ వర్క్‌షాప్‌లో మూడు రోజులు పాల్గొన్నారు. దశరథ, పుల్లారావు, స్ఫూర్తి, యాదగిరి, దుర్గేష్, రాళ్ళబండి, సత్తెన్న, భాస్కర్ వంటి సీనియర్ రచయితలతోపాటు రవీందర్, రామచంద్ర, రాములు, క్రాంతి, సాదిక్, రమణ, పెన్నార్, వెంకటేష్ వంటి కొత్త రచయితలు ఈ వర్క్‌షాప్‌లో భాగస్వామ్యం పంచుకున్నారు.

సమకాలీన రాజకీయ, ఆర్థిక, సామాజిక అంశాలపై వారు కలాలను సంధించారు.

కార్మికవర్గం సమ్మె హక్కును కాలరాస్తూ సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పుపై ఉద్యోగులు, కార్మికులు ఏకోన్ముఖంగా ప్రతిస్పందిస్తూ ప్రతిఘటిస్తున్న విషయం మనం చూస్తున్నాం. ఈ తీర్పు ప్రజాతంత్ర హక్కులకు కూడా విఘాతం కల్గిస్తుందని వామపక్ష రాజకీయ భీష్ములు జ్యోతిబాసు వక్కాణించిన తీరు అందరికీ గమనార్హం. అందుకే భాస్కర్ అంటాడు...

**"తల్లితో పోట్లాడి పాలు తాగే హక్కు పాపకుంది."** అంటూ పల్లవితోనే మానవ స్వభావాన్ని ఎలుగెత్తి చాటుతాడు. **"సమ్మె హక్కు ఒకడిస్తే వచ్చేది కాదురో. అది వేకువ ఝామున పొడిచే సుక్కరో"** అంటూ సమాజ మార్పుకు వర్గపోరు సత్యాన్ని కుండబద్దలు కొట్టినట్టు చెప్తాడు.

**"రైతు పాట పాడవే ఓ కోయిలా"** అంటూనే దశరథ, పుల్లారావులు... **"ఐక్యంగా నిలిచినట్టే బడుగు దేశాల రైతులు/డబ్ల్యు.టి.ఓ. దుండగాన్ని తిప్పికొట్టే కాంకన్‌లో/భూమి పుత్రుల తొలి విజయం కోయిలా... అది విశ్వమంత వినిపించవె కోయిలా... మన రైతులకాదారి చూపు కోయిలా"** అంటూ వేడుకుంటారు.

ఇకపోతే

**"ఆలిన్ ఒన్ కోలా!/కూల్ డ్రింక్ లీలలు చాలా/**

**యాసిడ్ పురుగు మందుల పోటీలో/డ్రింకులు గెలిచే దూలా..."**

అంటూ సాంబరాజు యాదగిరి రచించిన గీతం వ్యంగ్యంతోపాటు శీతల పానీయాలపై శ్రోతలకు ఏహ్యాభావాన్ని పెంచుతుంది. **"ఫినాయిల్‌తో లెట్రిన్ కంపు/ కూల్ డ్రింక్‌తో లెట్రిన్ సొంపు/ ఇంట్లో దోమల బాధ/ మస్కట్ కాయిల్స్ రీపిల్ వాడిన లాభం లేదోయ్/ కూల్ డ్రింక్‌లను స్ప్రే చేయ్."** మరో వంక కుత్సిత రాజకీయాలను ఎండగడుతుంది.

**"తాగుకు సాగుకు నీరు/ఇవ్వలేదు మనకు సర్కారు/ మన జనాల ప్రాణం కన్నా/ పరదేశ ప్రభువులు మిన్న/ నిత్యదరిద్రం, ఈతి బాధలు అప్పుల బతుకు బరువు/ కూల్ డ్రింక్‌తో మరణం సులువు."**

కాగా, **"తాగునీటి కోసం – తన్నులాటలెన్నో, సాగునీటి కోసం సమరాలెన్నెన్నో కరువు కాదు సుమ్మి – ఇది పాలకుల దొమ్మి"** అంటూ తూమూలూరి వెంకటేశ్వరరావు జలఘర్షణల గురించి చెప్పగా, **"బాబు జమానా అవినీతి ఖజానా/ కోట్ల డబ్బు మింగేసె తానతందానా బ్యాంకు అప్పుల మిగిలిపోయె తందాన తాన"** అంటూ 'పెన్నార్' కుంభకోణాలపై ధ్వజమెత్తారు.

**'విద్యాకుసుమం వికసించేనే విజన్ ట్వంటిలోనా/ స్వర్ణాంధ్ర సాధిస్తానని మురిసేటి బాబు హయంలోనా/** అనే పాటలో సత్తెన్న సందేహాన్ని వ్యక్తపరుస్తూ నానాటికి పేదలు విద్యకు ఎలా దూరమవుతున్నారో విశదపరుస్తాడు.

**తెలుగుదనం మనకు ధనం/ తెలుగు భాష చరితఘనం/ మనసులు కలవోసి మనకు/ మమతలొసుగు సాధనం/ కమ్మనైన తెలుగు భాష కలనైనా మానొద్దు/ అమ్మపాల కమ్మదనం మాతృభాష మరవద్దు/** అంటూ ఓ భాషా ఉద్యమ గీతాన్ని రమణయ్య, రాజేశ్వరరావులు కర్నూలు నుండి పంపించారు.

చివరి రోజు రచయితల మధ్య ఆకర్షణీయమైన చర్చ జరిగింది. పాట రచనా–శిల్పంపై కొత్త రచయితలు అడిగిన అనేక ప్రశ్నలకు సీనియర్‌లు సమాధాన మిచ్చారు. పాటబాణీలు తాము కష్టపడి ఎలా సేకరించుకుంటున్నదీ. ఆ బాణీ కనుగుణంగా ఏ సమస్యను ఏ విధంగా చెబితే జనం రిసీవ్ చేసుకుంటారు! అందుకు ఏకాగ్రతతో చేయవలసిన సాధన, శాస్త్రీయ సంగీతం ఆవశ్యకత వంటి విషయాల్ని తెలుసు కున్నారు.

వస్తువు (అంశం) తత్సంబంధిత సమాచారం ముందుగా ఇస్తే బావుంటుందని కొందరు, అలా అప్పటికప్పుడు తీసుకుని రాస్తే అందులో ఆత్మ ఏముంటుంది? యాంత్రికతకు దారితీయదా? అని కొందరు భిన్నాభిప్రాయాలు వ్యక్తపరిచారు.

కేవలం రచయితల పరిధిలోనే ఆలోచించకుండా ప్రజల కోసం నిబద్ధతతో వ్రాస్తే రచయితలుగా ఎదగాలంటే ప్రజలను చైతన్యంతో ముందుకు నడిపించే దిశలోనే రచయితల గమనం, సాధన, అన్వేషణ ఉండాలని నిర్దేశించుకున్నారు. పాట అచ్చు అవుతుందా? లేక రికార్డింగ్ అవుతుందా? అనేంత వరకే రచయితల ఆగిపోకూడదని, నిత్య విద్యార్థిగా ఎప్పటికప్పుడు కొత్తకొత్త భావచిత్రాలు, పద చిత్రాలతో పాటలను తెలుసుకుంటూ అల్లుకుంటూ నేర్చుకుంటూ ముందుకు పోతుంటే అవి పండిత పామరులను సైతం రంజింపచేస్తూ ఉద్యమగీతాలుగా గణతికెక్కుతాయని తెలుసుకున్నారు. అంటే వర్క్‌షాప్ ఉద్దేశ్యం కేవలం ప్రజా పాటల రచనల సృష్టి కాకుండా ప్రజాపాటల రచయితల సృష్టే కూడాననే, విషయం అర్థమయింది. మోడరేటర్‌గా స్ఫూర్తి వ్యవహరించారు. ప్రజానాట్యమండలి నాయకులు దేవి, జగన్, రమేష్, సోమన్న తదితరులు రచయితలకు తగు సూచన లిచ్చారు.

V



Untitled-2 69 6/11/2002, 3:51 PM

ఇంటర్వ్యూ

# పూలు పూయనీ, మాననీ నేడు నిండు వసంతం

**"ఆధునిక కవిత్వం" పూర్తిగా మేధావుల కవిత్వంగా మారి పోయిందని అతడి అభిప్రాయం - అయితే కవిత్వం చిత్రలేఖనం, సంగీతం లాంటి లలిత కళా రూపాలు అందరికీ ఉన్న పళాన అర్థం కావడం సాధ్యం కాకపోవచ్చునని, టెలిఫోన్ లేనిది ఫోనుకాల్ రానట్లే, అర్థం చేసుకునే ప్రయత్నం లేనిది అర్థం కావడం కష్టమని, జానపద కళారూపాలకు ఆ బాధ ఉండదని, అవి మేధోపరమైన సాముగరిడీలు కావని, ప్రజలతో మమేకం చెందితే ఏదీ సమస్యకాదని 'సందేశం' లేకుండా రచన చేయడంవల్లే ఈ గోచార కవిత వస్తూందని, సందేశం లేకుండా రచనలు ఎందుకు చేయాలని సుభాష్ ముఖోపాధ్యాయ ఎదురు ప్రశ్న!**

**జ్వాలాముఖి**

బతుకుతెరువు కోసం ఆ చేయి కలం పట్టింది. బెంగాల్ కరవు చూసి ఆ కలం కన్నీరు ఒలికింది. పేదల దుర్భర జీవనంతో ఆ రచన తాదాత్మ్యం చెందింది. అలా సాగిన ఆ సాహిత్య కృషి చివరకు అతణ్ణి జ్ఞానపీఠంపై కూర్చోబెట్టింది. ఆ రచయిత సుభాష్ ముఖోపాధ్యాయ.

క్రిందటి నెలలో మూడు రోజుల పాటు భువనేశ్వర్‌లో ఆయనతో గడిపే అవకాశం నాకు లభించింది.

డెబ్భై మూడేళ్ళ వయస్సులో కూడా విసుగు, విరామం ఎరగని వ్యక్తి ఆయన. శ్రీలా సరళుడు, సులభసాధ్యుడు, గ్రంథపఠనాసక్తి కలవాడు. జోనాథన్ బ్లాక్ రాసిన 'ది హౌస్ ఆఫ్ దిహిత్' నవల చదువుతుండగా నేను సంభాషణ ప్రారంభించాను. నవల పక్కన పెట్టి నా ప్రశ్నలకు సమాధానాలు ఇచ్చారు.

ఆయన సాహిత్య సృజనకు ఆకృతి కల్పించిన జీవనరేఖలు ఎటువంటివో తెలుసుకోవడం చాలా ఆసక్తికరం.

ప్రామాణిక వంగభాషకు మూల పురుషుడైన కృష్ణచంద్ర విద్యాసాగర్ జన్మస్థానమైన కృష్ణనగర్‌లో ముఖోపాధ్యాయ 1919లో జన్మించారు. ప్రస్తుతం అది పశ్చిమబెంగాల్ నాడియా జిల్లాలో ఉంది. 19వ శతాబ్దిలోని సంస్కర్తలలో ఒకరైన విద్యాసాగర్ వంగభాషకు భారంగా పరిణమించిన సంస్కృత ప్రభావాన్ని తొలగించారు. ఆ విధంగా ముఖోపాధ్యాయ జన్మస్థానం భాషా ఉద్యమాలకు కేంద్ర స్థానమైంది. చిన్ననాడే వాడుక భాష ఒడుపును, మాండలిక ప్రయోగ నైపుణిని, జీవన భాషలోని నుడికారాన్ని అతడు పట్టుకోగలిగాడు - చిన్ననాటి వాతావరణ ప్రభావంవల్లే అతడి రచనా భాషకు సరళత, స్పష్టత, ప్రభావితం చేయగలిగే సహజానుభూతి సంక్రమించాయి.

ముఖోపాధ్యాయ పట్టభద్రుడైనా ఎన్నడూ ఏ ఉద్యోగమూ చేయలేదు. 1982 దాకా కమ్యూనిస్టు పార్టీలో "పూర్తి కాలపు కార్యకర్త"గా ఉండేవాడు. 1951లో ఒకమారు 1968లో "రెండో ఐక్య సంఘటన ప్రభుత్వం" కూలదోయబడినప్పుడు, అతడికి కారాగారవాసం తప్పలేదు.

స్కూలు టీచరు, కీలుబొమ్మ లాడించే కళాకారిణి, బాల సాహిత్య రచయిత్రి, పాత్రికేయురాలు అయిన గీతాముఖర్జీతో అతడి వివాహం నలభయ్యవ దశకంలో జరిగింది. 1946లో ఐరోపాలో జరిగిన "ప్రపంచ ప్రజాతంత్ర మహిళా సంఘటన" మహాసభలకు గీతా ముఖర్జీ ప్రతినిధిగా వెళ్ళింది. విదేశీ పర్యటన నుండి రాగానే ఉభయులూ కార్మికవాడలో కాపురంపెట్టారు. సుకుమారి, సొగసరి, ఆంగ్ల విద్యావేత్త ఆ విధంగా కార్మికవాడల్లో వచ్చి ఉండడం కొందరికి చోద్యంగా తోచింది. మరి కొందరు కథలూ అల్లకపోలేదు. కాని వారీ విధంగా కార్మికవాడల్లో ఉండడం కార్మికోద్యమానికి, ఎంతో ఊపునిచ్చింది కూడా. భర్త పాటలు రాయడం, భార్యతోలు బొమ్మలాటల ద్వారా ప్రజల్ని చైతన్య వంతుల్ని చేయడం అద్వితీయం.

ఏనాడూ తాను రచయిత కావాలని ముఖోపాధ్యాయ కోరుకోలేదు. బతుకుతెరువు అవసరం, పార్టీకి భారంకారాదనే ఉన్నతాదర్శం ముఖోపాధ్యాయని సాహిత్యంలో శరణుజొచ్చేలా చేసింది. 1943లో సంభవించిన "బెంగాల్ కరవు" అతడిని జలదరించేట్లు చేసింది. కరువు బాధితుల దుర్భర దృశ్యాల్ని అతడు యథాతథంగా పత్రికలకు రాసి పంపేవాడు. అలా రాసే "రిపోర్టుల" ద్వారానే అతడికి నాలుగు రాళ్లు దక్కేవి - ఈనాడు అతిగా చెప్పబడే ఇన్వెస్టిగేటివ్ జరల్నిజాన్ని ముఖోపాధ్యాయ ఆనాడే శోధించి సాధించి ప్రజల దుర్భరజీవన పరిస్థితుల్ని బొమ్మకట్టించాడు. కాలికి బలపం కట్టుకొని వీధులు వాడలు, నిర్విరామంగా తిరిగి వార్తల్ని సేకరించి వ్యాఖ్యల్ని జోడించి వాస్తవాలతో తాదాత్మ్యం చెందేలా అతడు రచనలు చేసేవాడు. అలా కలకత్తా గురించి రాసిన రచన ఇక్కడ గమనార్హం.

కొత్త భావాలతో కొత్త పుంతలతో అప్పుడు కలకత్తానాడి పైస్థాయిలో పలికేది. అతిశయోక్తులు, పులకలు, సౌకుమార్యాలు ఆ రోజుల్లో చెట్టపట్టాలేసుకొని కొత్త భావాలతో కలకత్తాను ముంచెత్తిన వారు ఆ తర్వాత ఆకలితో చచ్చిపోయారు వీధుల్లో. 'స్వరాజ్యం' వచ్చే ఆ సాయంత్రం ఎంతగానో రోదించింది. అంతా పోగొట్టుకున్న మానవతా కెరటం తూర్పు (పాకిస్తాన్) బెంగాల్ నుండి వరదగా వచ్చి కలకత్తా వీధుల్లో కసవుగా మిగిలిపోయేది. మాకు బెంగాలీలో ఓ మంచి సామెత ఉంది. 'నీవు మంచి వాడవయితే చింతాకుపైన కూడా మరో తొమ్మిది మందికి ఆశ్రయం ఇవ్వగలవు' సరిగ్గా అలాగే జరిగింది ఆ నగరంలో. విషాదఘడియల్లో నిజంగా కలకత్తాది బంగారు గుండె. ఆశ్రయం కోరిన ప్రతివారినీ అది అక్కున చేర్చుకుంది.

ఈ మహానగరాన్ని శపించకండి. దాని రుగ్మతలకు వ్యతిరేకంగా విరుచుకుపడండి. దాని గుండె చప్పుడు ఎప్పుడూ ఆగదు... నిజంగా ఆనాటి 'దేశ విభజన' దుర్భర అమానుష దృశ్యం, సోదరుల మధ్య కొనసాగే హత్యలు, మానవతకే అవమానకరం..."

–'నా కలకత్తా' (జ్ఞాపకాలు)

రెక్కాడితేకాని బుక్కాడని ఆ రోజుల్లో ముఖోపాధ్యాయ గ్రామీణ పేదల దుర్భర దారిద్ర్యం గురించి, పారిశ్రామికవాడల్లో దినవెచ్చపు దౌర్భాగ్యుల గురించి, బొగ్గు గనుల్లో బూడిదయిపోయే గని పని మనుషుల గురించి, నిలువు దోపిడీలో నిత్యం రాలిపోయే తేయాకు తోటల కూలి బతుకుల గురించి సరళమైన భాషలో నుడికారంతో "రిపోర్టులు" రాసేవాడు. అతని "రిపోర్టులు" జనవాహినిని కదిలించేవి - కొంత కాలం బాల సాహిత్యంలోనూ క్రియాశీలిగా ఉన్నాడు - సత్యజిత్‌రేతో కలిసి పిల్లల పత్రికకు సహసంపాదకత్వం



Untitled-2 70 6/11/2002, 3:51 PM

వహించాడు.



సుభాష్ ముఖోపాధ్యాయ బెంగాలీ ప్రజాకవి. 1940లో తన పదాతిక్ కవితా సంపుటితో ఆయన విప్లవ భావాలను వెలువరించారు. వాటిని నిశితంగా వ్యక్తీకరించేందుకు బాట వేశారు. పదాడంబరం కన్నా ప్రజల భాషకు ప్రాధాన్యత నివ్వాలనేది ఆయన దృష్టి. కవిత్వంలో వివిధ చందస్సులతో అనేక ప్రయోగాలు చేశారు. చిర్కుట్, అగ్నికోనె, జయ్‌సైతి, కాల్ మధుమాస్, ఎక్కు చలియే భాయ్ వంటి కావ్యాలు రాశారు. నగ్జలైట్ ఉద్యమ నేపథ్యంతో చేల్ గచ్చే బనే కవితా సంపుటి రాశారు. తాను ప్రజలను నిశితంగా పరిశీలించడం వల్లనే ఇలాటి కవితలు రాయగలుగుతున్నానని చెప్పే సుభాష్ కొంత కాలంగా అస్వస్థులుగా వున్నారు. 2003 జులై 8 న తన 84 వ ఏట మరణించారు. ఆయన అంతిమ యాత్రలో వామపక్ష నేతలు, లెఫ్ట్‌ఫ్రంట్ ప్రభుత్వ మంత్రులు, కళాకారులు, రచయితలు పాల్గొన్నారు. "లక్షలాది మంది ప్రజలు ఐక్యమైతే భయపడనక్కర్లేదు ఎవరికి, మన పురోగమనాన్ని ఆపేదెవరు? ఎర్రజండాను అడ్డేదెవరు?" అంటూ ముఖ్యమంత్రి బుద్ధదేవ్ భట్టాచార్య అయనకు కవితాత్మకంగా నివాళులర్పించారు.

సీనియర్ కవి జ్వాలాముఖి పదేళ్ల కిందట 1992 జ్ఞానపీఠ్ అవార్డు లభించినట్లుగా ఆయనతో జరిపిన ఈ ఇంటర్వ్యూలో సుభాష్ భావాలను ప్రత్యక్షంగా చూడొచ్చు. ఇది ఆంధ్రప్రభ దినపత్రిక నుంచి పునర్ముద్రణ.

మిత్రులు వత్తిడి చేయగా 1933లో మొదటి రచన చేశాడు ముఖోపాధ్యాయ. వచన రచన అందర్నీ ఆకట్టుకోగానే ఆ మిత్రులే కవిత్వం రాయమని బలవంతం చేశారు. అలా అతడు రజకునిపై ప్రశంసాగీతం రాశాడు చిన్ననాట. అలా అతడు కవిగా అవతరించాడు. ఆ తర్వాత కమ్యూనిస్టు పార్టీ ఉద్యమంలో విద్యార్థుల పోరాటాలపై ఎన్నో గీతాలు రాశాడు. అతడిది ''నినాదాల కవిత్వ''మని ఎద్దేవా చేసినవారూ లేకపోలేదు. నిజానికి "నిబద్ధత"ను వదిలేశాకే అతడి కవిత్వం పలుచ బడిందనే వారూ ఈనాడు లేకపోలేదు – 'ముఖర్జీ షంగే అలాప్' (ముఖర్జీలతో ఆలాపన) అనే అతడి కవితలో "నిబద్ధత"కు పునరాహ్వానం కనిపిస్తుంది –

**"మంట చల్లారిపోతూంది**
**నిప్పుల్ని ఎగదోయండి**
**పై నుండే కాదుకింది నుండి కూడా**
**సాయుధ వీరుడి పట్ల వుండే**
**నీ ఇదవరకటి ప్రేమను మళ్లీ తెచ్చుకో!**
**నీలో చేరిన ప్రతి అణువునూ లోలోన**
**తినేస్తూన్న కుట్రను వెదకి పట్టుకో!**
**దాన్ని చూపు చివర పెట్టి అదిమి పట్టుకో!"**

నిబద్ధతా జ్వరం ఆవహించిన ఆదర్శాల కాలంలో ముఖోపాధ్యాయ కవిత ఎలా హెచ్చరికగా ఉండేదో ఈ పంక్తులే సాక్ష్యం

**నన్ను కవిగా పిలవకండి.**
**జీవితమంతా భుజం భుజం కలిపి**
**నిశ్చలంగా నడవాలనే నిశ్చయించుకొన్నాను**
**అలా నడిచి ట్రాక్టరు పక్కన కలం వుంచి**
**'నాకు విరామం – వెలుగునీయి సోదరా!'**
**అని ముక్తకంఠంతో అనదలిచాను**

('అమార్‌కాజ్' – నాపని)

'దేశవిభజన' నాటి విషాదకర మానవతా వలసల దుర్భర దృశ్యాల గురించి 'శరణార్థుల పిల్ల' (బాబ్రాలి) అంటూ రాసిన కవిత ప్రతి బెంగాలీ స్మృతిపథంలో ఇంకా మిగిలి ఉంది. 1940, 1950, 1960, ఈ దశకాల్లో తూర్పు (పాకిస్తాన్) బెంగాల్ నుండి వచ్చిన శరణార్థుల దుర్భర విషాద గాథలు అందర్నీ చలింపజేశాయి. 'సాలేమాన్‌గర్ల్'గా పేరొందిన బాబ్రాలి' కవిత ఇప్పటికీ బొమ్మ కట్టిస్తుంది.

**"నీవు ఆ శరణార్థుల అమ్మాయిని ఎక్కడ దాచావు?**
**ఈ అసాధ్య మహానగరంలో ఆ చిన్నారి ఎక్కడ?**
**ఊపిరాడని ఆవేశాల ఆకాశం కింద అనిశ్చితాల మధ్య**
**తలదాచుకునే నీడనెక్కడ దాచావ్?**
**బాబ్రాలీ అమ్మాయి చారెడు కళ్లు**
**చెప్పే కథలాగే ఆ యిల్లూ భద్రమే కదా?"**

– 1971 లో ప్రభాయ్' (ఓ సోదరా!) కవితా సంకలనంలో 'మన చేతుల్లో అనే శీర్షిక నేటికీ ప్రాసంగికం –

**"కళ్లెంత బాగా తెరచి వుంచుతే**
**పిడికిళ్లంత బాగా బలం పుంజుకుంటాయి**
**మనం మన బతుకు నెత్తురునంతా ఓడ్చి**
**సంపాదించిన దాన్ని వారు డాలర్లలో అమ్మజూస్తున్నారు**

దాన్ని వారు నిరుపయోగం చేసి విసిరి పారేశారు. మనం దాన్ని ఎత్తి పట్టుకున్నాం! చూడు మిత్రమా! స్వాతంత్ర్య పతాక ఇప్పుడు మన చేతుల్లో వుంది!"

–1982లో వెలువరించిన "జాల్‌సైతే" (నీటిని పరీక్షించు) అనే కవితా సంపుటి "నిబద్ధత"కు వీడ్కోలు

**"మంటల్లో తగలబడి పోవడం ఇక చాలు**
**అన్నిటికీ దూరంగా లంగరు బరువు తూచాను**
**పడవ ముఖాన్ని నది నుండి సముద్రంలోకి తోశాను**
**ఇప్పుడు నా పడవ ప్రయాణం నిండా గాలి!"**

'జారే కాగజౌర్‌నౌకా" (కాగితపు పడవలో సాగిపో!) అనే పై కవిత (1989) 'ప్రధాన ప్రవాహం' నుండి ఎలా వైదొలగిందీ తెలియ జేస్తుంది.

ముఖోపాధ్యాయ కవితా రంగప్రవేశమే కోపతాపాలతో జరిగింది. మృత్యుశయ్యమీద వున్న రవీంద్రునికి అతడి కవితా ప్రపంచం యథార్థం కాదని చిన్ననాడే పదవ తరగతి చదువుతూ "కవితా లేఖ" రాశాడు.

**"అతి మంచినీకవిత**
**ఈ ప్రపంచానికి ఆసందర్భం**
**ఉపసంహరించుకో – లేదా**
**నీ కవితా ధర్మాని కనుగుణంగా**
**ఈ ప్రపంచాన్ని సాహసించి మార్చు!"**

చిన్ననాడే కవీంద్ర రవీంద్రుని హెచ్చరిస్తూ రాసిన ముఖోపాధ్యాయ, "రవీంద్రానంతరయుగం"లో అగ్రగణ్యుడయ్యాడు. వంద దాకా గ్రంథాలు వెలువరించాడు. 13 దాకా కావ్య సంకలనాలు వచ్చాయి.

"ఆధునిక కవిత్వం" పూర్తిగా మేధావుల కవిత్వంగా మారిపోయిందని అతడి అభిప్రాయం – అయితే కవిత్వం చిత్రలేఖనం, సంగీతం లాంటి లలిత కళా రూపాలు అందరికీ ఉన్న పళాన అర్థం కావడం సాధ్యం కాకపోవచ్చునని, టెలిఫోన్ లేనిది ఫోనుకాల్ రానట్లే, అర్థం చేసుకునే ప్రయత్నం లేనిది అర్థం కావడం కష్టమని, జానపద కళారూపాలకు ఆ బాధ ఉండదని, అవి మేధోపరమైన సాముగరిడీలు



Untitled-2 71 6/11/2002, 3:51 PM

కావని, ప్రజలతో మమేకం చెందితే ఏదీ సమస్యకాదని 'సందేశం' లేకుండా రచన చేయడంవల్లే ఈ గోచార కవిత వస్తూందని, సందేశం లేకుండా రచనలు ఎందుకు చేయాలని ముఖోపాధ్యాయ ఎదురు ప్రశ్న!

రచయిత మొదట మానవతావాది కావడం ముఖ్యం. కవి తన గురించే కాక తన తోటి మానవుల గురించి చెప్పడం ప్రధానం. 'నిబద్ధత' అనేది రచయితల సొంత జీవితం నుండి రావాలని; ఇదేదో మామూలు అనవాయితీ వ్యవహారం కాదని అతడి భావన.

............ O ............

**ముఖోపాధ్యాయ కవితా రంగప్రవేశమే కోపతాపాలతో జరిగింది. మృత్యుశయ్యమీద వున్న రవీంద్రునికి అతడి కవితా ప్రపంచం యధార్థం కాదని చిన్ననాడే పదవ తరగతి చదువుతూ "కవితా లేఖ" రాశాడు.**

............ O ............

### కొంత ఠాగూర్... మరికొంత శరత్

సోషలిస్టు విప్లవం కన్నా ముందున్న రచయితలు టాల్‌స్టాయ్ మున్నగు వారు చాలా ఇష్టమని, పుష్కిన్‌ను ఎక్కువగా చదువలేదని, మైకొవస్కీ చాలా అభిమానమని, బెంగాల్ టెర్రరిస్టులు గోర్కీ రాసిన "అమ్మ" నవలను రహస్యంగా 'చదివేవారని, ముఖోపాధ్యాయ తెలియజేశారు.

తనపై ఠాగూర్ ప్రభావం చాలా ఉందని, శరత్ కూడా కొంత మేరకు ప్రభావితం చేశాడని, సుకాంత్ భట్టాచార్య చిన్న వయస్సు (21)లో మరణించాడనీ, నజ్రుల్ ఇస్లాం గీత రచయిత అని, ప్రేంచంద్ చాలా ఇష్టమని అతడి కుమారుడు అమృత్ రాయ్ చాలా స్నేహితుడని ముఖోపాధ్యాయ వివరించాడు. చక్కని ఆధునిక వచన రచనను అభివృద్ధి చేసిన బంకించంద్రుడు మిశ్రమభావుకుడని, సైన్సును అభిలషిస్తూనే సాంప్రదాయాన్ని కోరేవాడని, ఆంగ్లేయ విరోధి అయినా బయట పడడానికి ఇష్టపడే వాడు కాదని, అతడు పునరుద్ధరణవాది అనడం కన్నా 'జాతీయవాది' అనడం ఉత్తమమని ముఖోపాధ్యాయ వివరించారు.

తిరుగుబాటు భావాలు గల శరత్ బెంగాల్ విప్లవ కారుల సమర్థనలో "పథేర్‌ధాబీ" (భారతి – నవల) ఆనాడు నిషేధింపబడిందని, అయితే శరత్ కాంగ్రెస్‌లో చేరడం వైరుధ్యమని, ఆంగ్లేయుల ప్రోత్సాహంతో విప్లవకారులకు వ్యతిరేకంగా ఠాగూరు "చార్ అధ్యాయ్" నవల రాశాడనడం సరికాదని, "టెర్రరిజం" పరిమితుల్ని తెలియజేసిన నవల అదని, ముఖోపాధ్యాయ వివరించారు.

దేశంలో పునాదులు లేని కేవలం మేధావి అయిన ఎం.ఎన్. రాయ్ పీఠిక రాసి మెచ్చుకున్నంత మాత్రాన శరత్ "శేష ప్రశ్న" నవల కళాఖండం కాదని, బౌద్ధిక వైఫల్యమని ముఖోపాధ్యాయ విశ్లేషణ.

"భ్రమణి కహాని" పేర తన యాత్రాస్మృతుల్ని దేశ విదేశాల గురించి చాలా రాశాడు ముఖోపాధ్యాయ. ఐరోపా, కాంబోడియా, వియత్నాం మున్నగు పర్యటనానుభవాలు రాశాడు. చైనా చూడలేదు, రష్యా గురించి రాసింది తక్కువ.

రచయితకు ఎంతో పేరు తెచ్చిన 'అంతరీప్' వర్గరహిత సమాజం గురించి గీసుకున్న సొంత ఊహా చిత్రం.

కుష్ఠు ఆసుపత్రి చుట్టూ, ఆ రోగం ముదిరినవారూ, బయటి ప్రపంచం తిరస్కృతులు, కుల మత లింగ భాషా భేదం లేకుండా క్రమంగా స్థిర నివాసం ఏర్పరచుకుంటారు. వైద్యులు, నర్సులు నిర్లక్ష్యం చేయడంవల్ల కూడా ఇందరు అవుటు పేషంట్లుగా అక్కడ చేరిపోతారు. అలా 'కుష్ఠు కాలని' ఏర్పడుతుంది. నిజానికి 'కుష్ఠు వారి ఆశ్రమం అంతరీప్.

కుష్ఠు వారు స్థిరపడిన స్థలం అక్కడి పాడి పరిశ్రమ వారిది వారు పాలను తీసి అమ్ముకునే గొల్లలు. వారు తలచుకుంటే కుష్ఠు వారిని తరిమివేసే వారే. కాని కుష్ఠు వారు ఎక్కడ వచ్చి తమ గ్రామాల మీద పడతారేమోనని, వారినలాగే ఉండనిచ్చారు. వారిచేత తమ పొలాల్లో వెట్టి చాకిరీ చేయించుకొని తక్కువ కూలి ఇచ్చేవారు. ఆ కూలితో గడపడం కష్టం అయ్యేది. వారు తెగించి పట్టణాలపైబడి దొంగతనాలు చేసేవారు. వర్తకుల్ని దారిదోపిడీ చేసే వారు. దొంగసారా కాచి అమ్మేవారు. కుష్ఠు కాలనీ వారు చట్టవ్యతిరేక పనులు చేస్తున్నారని తెలిసినా పోలీసులు మిన్నకుండే వారు. వారి వాటా వారికి దొరికేది. వారిని పట్టుకోవాలంటే పోలీసులకూ రోగ భయం.

ఒక సుప్రసిద్ధ కాంగ్రెస్ వాది కుమారుడు, యువకుడు వ్యాధిగ్రస్తుడై ఆసుపత్రి పాలవుతాడు. అతడికి మరో కుష్ఠు యువతి పరిచయమై ప్రేమగా మారుతుంది. తండ్రి ఆ ప్రేమనామోదించి వారికి వివాహం చేసి తన ఇంటి వద్ద ఉంచుకుంటాడు. బంధువులు ఆ యింటిని బహిష్కరించడంవల్ల ఆ కుష్ఠు యువ దంపతులు కుష్ఠు కాలనీలో శరణు పొందుతారు. సంస్కరణోద్యమం చేపట్టి అక్కడ పుట్టుకొస్తున్న అరిష్టాలను దూరం చేయడానికి విశ్వప్రయత్నం చేస్తారు.

ఈలోగా కుష్ఠు కాలనీ జనాభా పెరిగిపోయి ఒక నియోజక వర్గం భవిష్యత్తు నిర్ణయించగలిగే బలానికి చేరుకుంటుంది. అది గమనించి రాజకీయ పార్టీల వారు కుష్ఠు కాలనీలో ప్రవేశించి ప్రచారాన్ని తీవ్రం చేస్తారు. వికృత రూపాలు వచ్చినా వారిని ఓటర్ల జాబితాలోకి ఎక్కిస్తారు. ఈ రాజకీయ పరిణామంవల్ల ఇది వరకు ఏ మాత్రం పరిగణింపబడని కులం, మతం, భాష మున్నగు చీలిక అంశాలు అరిష్టాల్లా జొరబడతాయి. మతోన్మాదం, కులపిచ్చి ఆ కాలనీని అమానుషంగా తయారు చేస్తుంది. అన్నిటికీ అతీతంగా ఉండే ఆ కాలనీ కుళ్లు రాజకీయాలవల్ల క్రూరంగా తయారై బయటి ప్రపంచంలో భాగంగా మారిపోతుంది. కుళ్ళు రాజకీయాలు కుష్ఠు వారిని సైతం వదలలేదనేది సారాంశం.

వర్గరహిత సమాజాన్ని "కుష్ఠుకాలనీ"లో ఊహించడం అందులోకి రాజకీయాలు ప్రవేశించినందువల్లే అది భగ్నమైనట్లుగా భావించడం తర్కానికి లొంగని ఆదర్శంగా తోస్తుంది.

భద్రత లేని సమాజంలో ప్రతి వారూ మనుగడ కోసం ఆరాటపడతారు. సరైన నాయకత్వం లభిస్తే అది హక్కుల పోరాటం అవుతుంది. అది లోపిస్తే నేరాల ప్రపంచం మిగులుతుంది. రాజకీయాలవల్ల దుర్మార్గమూ ఎంతగా వస్తుందో సరైన రాజకీయాలవల్ల దుర్మార్గాన్ని ప్రతిఘటించే 'చైతన్యమూ' అంతగానే వస్తుంది. ఇది మామూలు ప్రపంచానికెంత సత్యమో కుష్ఠుకాలనీకి, వేశ్యలవాడకు, వికలాంగుల వీధికి, గుడ్డి బస్తీకి కూడా అంతే సత్యం.

సంక్షుభిత సమాజంలో తీరస్థ మేధావులకే దిగులు? సముద్రంలోకి నెట్టబడిన వారు బతికి బయటపడాలంటే కెరటాలతో కలియబడక తప్పదు. సముద్ర బీభత్సం ఎంత యథార్థమో సముద్రంలో కెరటాలతో కలియ బడడమూ అంతే యథార్థం – సమాజానికి దూరంగా ఉంటూ సమాజ గత విషయాల గురించి వైయక్తికంగా ఆలోచిస్తూ స్వాప్నిక జగత్తును సృష్టించుకునే భావుకులకు వ్యక్తిగత భంగపాటు తప్పదు. అయితే వారి భావుకతకు కలిగిన భంగపాటును సామాజిక భంగపాటుగా భావించడం క్రాంతదర్శిత్వానికి అపవాదు కాగలదు.

ముగింపు ముచ్చటగా ముఖోపాధ్యాయ రాసిచ్చిన కవితా పంక్తి ఎంతో అర్థవంతమైందే కాదు పూర్తిగా ప్రాసంగికమైనది కూడా అని స్పష్టం అవుతుంది. బాగా ఆలోచిస్తే "పూలు పూయనీ పూయక పోనీ నేడు మాత్రం నిండు వసంతం.".

V



Untitled-2 72 6/11/2002, 3:51 PM

## విశ్లేషణ

# ఉన్నతమైన విలువలు - సాదా సంవిధానం "శేఫాలిక"




**ఆచార్య అత్తలూరి నరసింహారావు**

ఇందులో సుమారు 10 సం॥ల కాలంలో 1992 నుంచి 2002 వరకు రాసిన 19 కథలు వున్నాయి. వీటిల్లో 13 కథలు ఉత్తమ పురుష కథనంలో వున్నాయి. మళ్ళీ వీటిల్లో రెండు కథలు స్త్రీ గొంతుతో వున్నాయి. మిగిలిన ఆరు కథలూ ప్రథమ పురుషలో రాసినవి వున్నాయి. ఇంకా ఫ్లాష్ బాక్ కథనం, లేఖా కథనం కూడా అంతర్గతంగా వున్నాయి.

ఈ కథల్లో కాకినాడ, ఢిల్లీ, బెంగుళూరు, మైసూరు, బెజవాడ, పిలానీ, హైదరాబాదు, అంబాలా, చింతలపల్లి, బందరు, ఫైజలాబాద్, జలంధర్, బాంబే, నూజివీడు, వైజాగ్, మ్యూనిక్, పారిస్, లండన్ లాంటి ఊళ్లూ, రాయలసీమ, గద్వాల్, లాన్స్‌డౌన్ లాంటి ప్రాంతాలూ, అమెరికా, జర్మనీ, ఇంగ్లండ్, ఫ్రాన్స్ లాంటి దేశాలూ వస్తాయి. ఇందులో చింతలపల్లి ఊరు నాలుగు కథల్లో వస్తుంది. ఏ ఊరూ లేని కథలు నాలుగు వున్నాయి.

ఈ మొత్తం కథల్లో ఏడు కథల ముగింపులు, కాస్త అటూ ఇటూగా ఒకే రకంగా వుండటం ఆశ్చర్యాన్ని, ప్రశ్నార్థకాన్ని కలిగిస్తుంది.

1. ఎందుకో ఎంత ఆలోచించినా అర్థం కాదు బతకనేర్వనివాడు.
2. ఎందుకో అర్థం కాలేదు - ఆచరణ
3. తెలియదు - పయనాలు
4. ఎందుకో నాకు తెలియదూ?! - సెలవల్లో
5. తెలిసీ తెలియనట్టనిపించింది - శేఫాలిక
6. అయోమయంలో పడవేస్తూనే వున్నాయి - గురి ఎరుగని బాణం
7. అంతా గందరగోళం. అయోమయం అస్పష్టత - చదువు

అలాగే మరో రెండు కథల ముగింపులు కూడా ఒకే రకంగా వున్నాయి.

1. ఈసారి విజయను చూస్తే నాకు ఆశ్చర్యం కలగలేదు. సంతోషం కలిగింది - విజయ
2. అలా అనిపించటం సంతోషం కలిగించింది - ఉషోదయం

ఈ కథల్లో సామెతలు, లోకోక్తులు, కొటేషన్లు, రచయితలు, రచనలు - అవసరం వున్నా లేకపోయినా కనిపిస్తాయి. ఒక్క బతకనేర్వని వాడు కథలోనే వీటి సంఖ్య 15 దాకా వుందంటే వీటి అనవసరం ఎంతో తెలుస్తుంది.

ఇందులో ఎక్కువగా మధ్యతరగతి పాత్రలు, మధ్య తరగతి విలువలే వున్నాయి. భర్తల్ని వదిలేసి ఆత్మ విశ్వాసంతో నిలబడి, ఆత్మగౌరవంతో వున్న స్త్రీ పాత్రలు కొన్ని కథల్లో కనిపిస్తాయి. తెలుగు కోసం బెంగపడే వాళ్లూ, తెలుగు గాలి మేసేవాళ్లూ మరికొన్ని కథల్లో కనిపిస్తారు. ఈ రచయిత ప్రవాసాంధ్ర బాధే పాత్రల బాధగా వ్యక్తమైనట్టు అనిపిస్తోంది.

ఇక అచ్చుతప్పుల విషయం. ఈ కథకుడు తెలుగు ప్రేమికుడులా కథల్లో కనిపిస్తున్నాడు, తప్పులు వుండవు కాబోలనుకున్నాను. కానీ 37 దాకా వచ్చాయి. చివరి కథలోనయితే సాంబమూర్తి సత్యమూర్తిగా అయిపోయాడు. ఈ విషయంలో వావిళ్ళ వారినే స్ఫూర్తిగా తీసుకోనవసరంలేదు. డబ్బు పెట్టి పుస్తకం కొనుక్కునే వారిపట్ల బాధ్యత, పాఠకులపట్ల గౌరవం, పుస్తకం పట్ల ప్రేమ వుంటే చాలు. పుస్తకం కూడా వస్తువై, పాఠకుడు వినియోగదారుడై ఈ విషయం కన్స్యూమర్ కౌన్సిల్ పరిధిలోకి వెళ్ళకముందే మనం పట్టుదలగా ప్రయత్నించాలి. 'ఇది జరగాలంటే ముందు మనపట్ల మనకి గౌరవం వుండాలి. పనిపట్ల ప్రేమ వుండాలి. శ్రద్ధ వుండాలి. అప్పుడే అచ్చుతప్పుల్లేని పుస్తకం వస్తుంది.

ఒక సందర్భంలో చైనా ప్రస్తావన వచ్చినపుడు "పీతకళ్ల వెధవలు" అని అన్నారు. ఇలాంటివి ఈ సంపుటిలో మరెక్కడా లేవు. సాధారణంగా ఆధిపత్య భావజాల ప్రదర్శనలోనూ లేదా బలహీనుల ఉక్రోషంలోనూ ఇలాంటి వ్యక్తీకరణలు వస్తుంటాయి. కానీ ఫిజికల్ ఫీచర్ ఆధారంగా రచయితల ఇలాంటివి వ్యక్తీకరించటం వారి మానసిక పరిణతిని ప్రశ్నార్థకం చేస్తాయి.

### ఇక కథా విశ్లేషణ

**1. చెదరగూడని స్వప్నాలు :** దీనిలో ఒక స్నేహం, ఒక సినిమా, ఒక ప్రదేశం భిన్న సందర్భాల్లో భిన్నంగా వుండటాన్ని చిత్రించారు. కొన్ని సందర్భాల్లో హేతువాద దృష్టి అంతగా పనికిరాదు అని చెప్పడం ఈ కథ ప్రధాన ఉద్దేశం. ఈ కథలో ఓ అమ్మాయి ఇలా అంటుంది. "చూడబ్బాయ్! నువ్వంటే నాకు గౌరవం. నీ వ్యక్తిత్వం నాకు నచ్చింది. నాలుగేళ్ళ నుంచీ నీకీ విషయం చెబుదామనుకొంటున్నాను గానీ వెధవది సమయం సందర్భం కలిసిరాలేదు. దోస్తీ చేస్తావా" ఈ మాటలు కథా సందర్భంలో చాలా అసహజంగానే వున్నాయి. అలాగే ఓ అబ్బాయి అమ్మాయి కలిసి తిరగటం గురించి జనం "గుసగుసలు పోలేదు. చెవులు కొరుక్కోలేదు" అని రాశారు. ఇప్పటికీ ఈ పరిస్థితి లేదే. 20 ఏళ్ళ కిందట వుందంటే నమ్మబుద్ధవటం లేదు. ఈ కథ పాఠకుడికి అర్థం కాదేమోనన్న భావనతోనో ఏమో, చివర్లో రచయిత ఓ పేజీడు సలహా అమాయకంగా ఇస్తాడు.

"ఇవి ప్రతి మనిషికీ" అన్న దగ్గర నుంచీ "అర్థవంతమైన పని కాదేమో" అన్నంత వరకూ తీసేస్తే ఈ కథ నిర్మాణ రీత్యా అర్థవంతంగా వుంటుంది.

**2. బతకనేర్వని వాడు :** ఈ కథ ఆదర్శాలకి, వాస్తవికతకు మధ్య అంతరాన్ని చూపిస్తుంది. ఆ రెండింటికీ రెండు ప్రతినిధి పాత్రల ద్వారా కథ నడిపిస్తారు. ఈ కథలో కథకుడి గొంతు నెగెటివ్ విలువలకి ప్రాతినిధ్యం వహిస్తుంది. ఈ చిత్రణే ఈ కథకి వున్న బలం. లోకంలో ఆదర్శంగా వుండటమే మంచిదని నెగెటివ్



Untitled-2 73 6/11/2002, 3:51 PM

ధోరణిలో చెప్పిన కథ. ఇందులో స్నేహితుడి లక్ష్యాల గురించి రాస్తూ "పది మందికీ పనికొచ్చేలా బతుకుతాడట. భూమాతను వదులుకోడట. ఉన్న ఊరితో మమతానుబంధాలు తెంచుకోడట. డబ్బు సంపాదన తన ధ్యేయంగాదట. పేరూ కీర్తీ అన్నా తనకు మోజులేదట" అని రాసి "వాడి ధోరణిలో ఎన్ని వైరుధ్యాలో, వాడి ధ్యేయాలు ఎంత లోపభూయిష్టమో" అని అంటారు. ఇందులో ఎన్ని? ఎంత? ఎక్కడున్నాయి? స్నేహితుడి లక్ష్యం స్పష్టంగా వుంటే వైరుధ్యాలు, లోపభూయిష్టాలు రచయితకు ఎక్కడ కనిపించాయో అర్థం కావటం లేదు. (14వ పేజీలో) చూడండీ... అని రాసిన పేరా, చెప్పింది ఎవరో వెంటనే బోధపడదు. చివర్లో అన్నాడు పెళ్లికొడుకు అని రాస్తే స్పష్టత వుండేది. కథ చివర్లో "అవునూ ఏకబిగిన ఈ సోదంతా ఎందుకు చెప్పుకొచ్చినట్లూ?!" అని ఓ అరపేజీడు వివరణ రాస్తాడు రచయిత. కథ రాయటం చేతకాక అని కొంటెగా అనాలనిపిస్తుంది. కానీ చివరి వాక్యం తప్పించి దాదాపు అదంతా తీసేస్తే కథ పటిష్టంగా వుంటుంది.

**3. ఆచరణ :** దీనిలో ఇద్దరూ ఉద్యోగులు, స్నేహితులు, సాహిత్య అభిమానులు. ఇందులో స్త్రీల సమస్యల్ని సానుభూతితో చర్చించుకుంటూనే స్త్రీలకి ఏమీ సహాయం చెయ్యరు. ఆ చెయ్యని అపరాధ భావనతోనే ఈ కథ ముగుస్తుంది. స్త్రీ విషయమై డ్రాయింగ్ రూం కబుర్లకీ, ఆచరణకీ మధ్య ఎంత తేడా వుంటుందో చెప్పటమే ఈ కథ ఉద్దేశం.

**4. జెండా ఊంఛా రహే హమారా :** నేడు ఎక్కువగా జరుగుతున్న ఆధిపత్య రాజకీయాల కథ. ఇది ఒక మేజర్ గ్రామాన్ని కేంద్రంగా చేసుకుని నడుస్తుంది. కథ బలంగా లేదు.

**5. సారే జహాసే అచ్ఛా :** ఇది దేశ విభజన నాటి కాలంలో జరిగిన కథ. మత సామరస్య పరిమళం గుబాళించిన కథ. ఈ మానవత్వం ఈనాటికి కూడా అవసరమైన ఆక్సిజన్ అని గుర్తు చేస్తుంది. మతం కన్నా మానవత్వం, పరమత ద్వేషం కన్నా ప్రేమ ముఖ్యమనీ అవసరమనీ చెప్పిన కథ. ఇది ఆనాడు జరిగిందని ఈనాడు మిత్రుడు చెబితే, రచయిత కల్పించిన కథా రూపం. ఈ సంపుటిలో ఏ కథకూ లేని అద్భుతమైన ముగింపు ఈ కథకు వుంది.

**6. పయనాలు :** ఇందిరా గాంధీ మ్యూజియం సందర్శన సందర్భంగా ఆవిడ జీవితాన్ని ఆధారం చేసుకుని, భిన్న దృక్పథాల్ని, వాటి పర్యవసానాల్ని ఇద్దరు స్త్రీ పురుష స్నేహితుల సంభాషణల ద్వారా వ్యక్తం చెయ్యటం ఈ కథ. ఈ కథలో ఒక చోట "ఆ గదిలో ఆ వాలు కుర్చీలో కూర్చొని చదువుకోగలిగిన ఇందిరాగాంధీ ఎంత అదృష్టవంతురాలో అనిపించింది" అని చక్కగా రాసి పక్క పేజీలోకి వచ్చేసరికి "కాస్తంత కష్టపడితే మామూలు వాళ్ళు కూడా ఇలాంటి వాతావరణాన్ని సృష్టించుకోవచ్చుగదా" అని అమాయకంగా అంటారు. చివర్లో "వాటెవేటుగో..." అనే పేరా మొత్తానికీ, తర్వాత వచ్చే ప్రశ్నకీ అన్వయం కుదరలేదనిపించింది. మొత్తం మీద కథలో స్పష్టత లేదు.

**7. సెలవల్లో :** ఇందులో రాజు, సుజాత, భార్యాభర్తలు. ఇద్దరూ వుద్యోగస్తులే. భర్త, కథకుడు, పాఠకుడు కూడా. భార్య పనిమంతురాలు. ఈ కథలో పనికీ, పఠనానికీ మధ్య అంతరాన్ని చూపించారు. ఇంటి పని ఆనందాన్ని, పఠనం చైతన్యాన్ని ఇస్తుందని సుజాత పాత్ర ద్వారా నిరూపించారు.

**8. శేఫాలిక :** ఇందులో రచయిత బుద్ధి, మనసుతోపాటు మందారం మొదలైన మొక్కలు కూడా ప్రధాన పాత్ర వహిస్తాయి. ఇందులో మనిషిని ప్రకృతికి దూరమైన మనిషి పరవశించి సేదతీరతాడు. రచనా నిర్మాణం రీత్యా ఈ కథ విభిన్నమైంది, విశేషమైంది. అయినా లోపాలు వుండనే వున్నాయి. రచయితను వేపచెట్టుకోప్పడిన సందర్భంలో "వయసులో పెద్దదిగాను మందలింపు పెద్దవాళ్ళందరి సహజ లక్షణంగదా?" అని అనవసరంగా రాస్తాడు. అలాగే రచయిత జామచెట్టుతో "మరేం పర్లేదు పెద్దమ్మా" అంటాడు. ఇక్కడ పెద్దమ్మా పదం ఎబ్బెట్టుగానూ వుంది. అనవసరంగానూ వుంది. మరో చోట "అప్పటిదా ఈ నేరేడూ! పెద్దగా మారినట్టులేదు" అని రాసి వెంటనే "మనుషుల్లో అంటే, పాతికేళ్ళలో ఎన్నో మార్పులు వస్తాయిగానీ మొక్కలకు – ఆ ప్రమాదం తక్కువ గదా" అని వివరణ ఇస్తారు అనాలోచితంగా

**9. కుహూరవం :** ఆరు నెలలు విదేశాలకి వెళ్ళిన ఒక వ్యక్తి తెలుగు బెంగతో సతమతమైపోవటం, ప్రతిసారీ ఆశ, మళ్లీ వెంటనే నిరాశ కలగటం, చివరికి కూడా ఆశాభంగంతోనే ఈ కథ ముగియటం కనిపిస్తుంది. ఈ కథ సమర్థవంతంగా లేదని అనిపిస్తుంది. టెలీ కమ్యూనికేషన్స్ విస్తృతంగా వున్న రోజుల్లో ఇలాంటి కథలకి అవకాశం వుందా అనీ, ఈ వ్యక్తికీ ఓ కుటుంబం, స్నేహితులు వుండి వుంటారు. వాళ్ళతో ఫోన్ చేసి తెలుగు బెంగ తీర్చుకోవచ్చుగదా అనీ అనిపిస్తుంది. అలా అయితే ఇంక కథేం వుంది అని ప్రశ్నించొచ్చు. అయితే ఇలాంటి కథలు రాయకండి అని సమాధానం చెప్పొచ్చు. మరో చోట "ఓ తెలుగు మనిషి ఉన్నా వాళ్ళను ఎక్కడని వెదికి పట్టుకోవడం?" అని వెంటనే "అంతకన్నా గడ్డి వాములో సూది వెదకడం సులభతరంగదూ?! అంటారు అనవసరంగా...

**10. విజయ** : స్వేచ్ఛా, స్వాతంత్ర్యాల మధ్య పెరిగిన ఓ కూతురి జయాపజయాల కథ ఇది. ఇష్టపడి చేసుకున్న భర్తతో అమెరికా వెళ్ళి అక్కడ అతను, అతని కుటుంబ సభ్యుల ప్రవర్తనతో విసిగిపోయిన విజయ అన్నీ ఒదిలేసి ఒంటరిగా వచ్చేస్తుంది. ఓటమిలో కూడా ఆత్మ విశ్వాసాన్ని కోల్పోని, భవిష్యజ్జీవితంపట్ల సరైన దృష్టి వున్న పాత్ర విజయ. ఇలాంటి విజయ చిన్న క్లాసుల్లో వున్నప్పుడు తన స్నేహితులు బెంగపెట్టుకొంటారనీ, వాళ్ళకీ ఫస్టు మార్కులు రావద్దా, అనీ, ఒక బిట్టు లెక్కల పరీక్షలో కావాలని తప్పు చేసి రెండు మార్కులు పోగొట్టుకుందని రాశారు. విజయ పాత్ర చిత్రణలో ఇలాంటి అసహజ అంశాలు రాయకుండానే తన వ్యక్తిత్వాన్నీ, విలువల్ని చిత్రించవచ్చుననిపిస్తుంది. మరోచోట "నాకు కృతకంగా, తెచ్చిపెట్టుకొన్నట్టుగా అనిపిస్తోంది" అని అంటారు. ఆ రెండింటిలో ఏదో ఒకటి సరిపోతుంది. అలాగే "నాకు లేని ఆచరణశీలతా, ఆదర్శాలపట్ల అంకితభావం విజయకు ఎలా అలవడిందీ!" అని తండ్రి కూతురిపట్ల ఆశ్చర్యం ప్రకటించటం సిల్లీగా వుంది.

**11. ముత్యాల హారం :** ఈ కథలో తక్కువ జాతికి చెందిన వ్యక్తిని ఎక్కువ స్థాయికి చెందిన వ్యక్తి అభిమానించి, ప్రోత్సహిస్తాడు. ఒకానొక అనుకోని క్లిష్ట పరిస్థితిలో కూడా అపార్థం చేసుకోకుండా ఉన్నత వ్యక్తిత్వంతో తక్కువ కులానికి చెందిన వ్యక్తిని ఆదరించటం ఈ కథా విషయం.

**12. భద్రత :** మనిషి తన మనుగడ కోసం ప్రపంచంలో ఎక్కడున్నా ఆయా సమాజాల్లో ఒదిగిపోయి, సర్దుకుపోతూ బతకడమే తనకి భద్రత అని ఈ కథ చెబుతుంది. కానీ ఇది మాత్రం భద్రతా? అనే ప్రశ్న ఈ కథ చదివిన తర్వాత కలుగుతుంది.

**13. గురి ఎరుగని బాణం :** ఈ కథలో ఇద్దరు స్నేహితుల మధ్య లక్ష్యాలు, అభిరుచుల్లోని తేడాను చిత్రించారు. ఒకరి లక్ష్యం జీవితంలో ఉన్నత స్థితికి వెళ్ళటం అయితే మరొకరిది జీవితాన్ని పరిపూర్ణంగా అనుభవించటం. ఈ కథ చివర్లో మొదటి వ్యక్తి తను కోల్పోయిందేమిటో గుర్తించటం, స్నేహితుడ్ని నిందిస్తూ వుత్తరం రాయటం ద్వారా తెలుస్తుంది. ఈ కథలో ఒక చోట "పంటలన్నీ వర్షాధారం" అని ఆగకుండా "దైవాధీనం" అంటారు అనవసరంగా. అలాగే "ఈ జాన్ ఆఫ్ ఆల్‌ట్రేడ్స్ ధోరణినిన్నెంతో దూరం తీసుకెళ్ళదు" అని వెంటనే "ఇట్ ఓంట్ టేక్ యూ ఫార్" అని అనిపిస్తారు ఓ పాత్ర చేత. మరో చోట కూడా "ఒక జీవిత కాలంలో పదేళ్ళంటే ఎంతా?" అని సమాధానంగా నాలుగు



Untitled-2 74 6/11/2002, 3:51 PM

వాక్యాలు రాయటం అవసరమా అనిపిస్తుంది. ఎకానమి ఆఫ్ వర్డ్స్ అండ్ థాట్స్ అని చలం రాసింది చదువుతాం కానీ మనకి ఆచరణే అసలు సమస్యని ఈ పుస్తకం కూడా మరోసారి గుర్తుకు తెస్తుంది.

**14. రాజేశ్వరి :** చిన్న వయస్సులోనే పెళ్ళయిన ఈవిడ భర్త సహకరించని పరిస్థితుల్లో, చదువు మీద ఆసక్తితో, తనకాళ్ల మీద తాను నిలబడదామని అతన్ని వదిలేసి, కష్టపడి చదువుకుని ఉద్యోగంలో స్థిరపడుతుంది. ఇలా రాజేశ్వరి విముక్తికి కారణం జానకి విముక్తి నవల అని ఈ కథ ముగుస్తుంది.

**15. మూడు దృశ్యాలు :** ఈ కథలో మహాభారతం, రాయలసీమ, సొంత వూరు అనే మూడింటిని నేపథ్యంగా తీసుకుని, మనిషిలోని పగ, ద్వేషం ఆనాటి నుంచి ఈనాటి వరకూ మానవ జీవితాన్ని ఎలా ఛిద్రం చేస్తున్నాయో దృశ్యాలుగా చిత్రించారు. ముఖ్యంగా గ్రామీణ జీవిత బీభత్సాన్ని ఆవిష్కరించారు. మమత మానవత్వంతో వుండాల్సిన అవసరాన్ని గుర్తు చేస్తోంది. కొంత మేరకు లేఖా రూపంలో కథనం వుంది.

**16. సింహాలు సర్కసుల్లో ఎందుకు చేరాయంటే :** మిగతా జంతువులన్నీ దానికి ఆహారం అవకూడదని ఐక్యంగా వుండటంతో అది సర్కస్‌లో చేరిందని ఈ కథ చెబుతుంది. బలవంతుల మీద బలహీనుల విజయాన్ని జంతువుల రూపంలో, చిన్న పిల్లలు వినటానికి వుద్దేశించి చెప్పిన కథ. టైటిల్తో సహా ఓరల్ ట్రెడిషన్‌లో వుంది.

**17. కాతారామ్ :** ఇందులో కాతారామ్ అనే వుద్యోగి చాకచక్యంగా ఆఫీసులో వచ్చిన సమస్యని పరిష్కరించి అధికారికి ఏ ఇబ్బందీ లేకుండా చెయ్యటం ఇతి వృత్తం. ఇలాంటి ట్రబుల్ షూటర్స్ ప్రభుత్వ వ్యవస్థలోనూ, ఈ తరహా కథల్లోనూ తరచూ కనిపిస్తారు.

**18. ఉషోదయం :** సిటీలో వుంటున్న ఓ స్త్రీ పల్లెటూరు వెళ్లినప్పుడు, అక్కడి వ్యక్తులపట్ల, వాతావరణంపట్ల ఆమెకు అంతకు ముందున్న వ్యతిరేకతపోయి, ఆమెలో పరివర్తన కలగటం ఈ కథలో ముఖ్యాంశం.

**19. చదువు :** చదువు డబ్బు సంపాదనకా? విజ్ఞాన సంపాదనకా? బతకడానికా? బతికించడానికా? ఆయా మనుషుల్ని బట్టి అన్నీనా? కాదని ధ్వని. మళ్లీ అనవసరంగా తికమకతో కథ పూర్తవుతుంది. చదువు సేవ చెయ్యటానికి కూడా అని, పెద్దగా చదువుకోని అటెండరు పాత్ర ద్వారా చెప్పిస్తూ, చివర్లో అతని తలచుట్టూ అక్షరాల కాంతిని చిత్రిస్తూ – మళ్లీ గందరగోళం అయోమయం అని రాయటంలో అర్థం లేదు. ఈ కథ చివర్లో "గభాల్న మెలుకువ వచ్చింది" అన్న దగ్గర ఆపేసి తర్వాత వున్నదంతా తీసేస్తే అర్థవంతంగా వుంటుంది.

ఇక ఈ సంపుటిలో కొన్ని పదబంధాలు, వ్యక్తీకరణలు గుర్తు వుండే విధంగా వున్నాయి.

స్నేహపుటాఫరు – 2
మనసు పూర్తిగా నిండి పొంగి పొరలింది – 4
అచ్చుబోసి బడి మీదకు వదిలేసి – 7
పెళ్లిలో చిరునవ్వులేగానీ సిరినవ్వులు లేనేలేవు – 17
మహా ఎర్రని సాహితీ పిపాసి – 23
ప్రమాదం చేతివాటు దూరాన నిలిచి వుంది – 42
ఉన్మత్తపు పలుగూ పారలు – 42
ఆ కళలతోటల్లో తిరిగితే ఎంతో కొంత పరిమళం అంటకపోతుందా – 49
ఎలుకల్లోకల్లా మహాపెద్ద ఎలుకనయ్యానన్న సంతృప్తి 51
కూర్చుని కాఫీ కబుర్లాడుతుండగా – 56
(మందారపు చెట్టు) బహుశా ప్రేమా అప్యాయతలనూ ఎంకిపాటలనూ పెట్టి పోషించి వుంటారు – 63
లేగప్రేమలు – 65
మనస్సు కెమేరా – జ్ఞాపకాల పొరల ఆల్బం – 66
మూర్తీభవించిన ఏకాగ్రత అయిపోయిందావిడ – 94
జీవితమంటే తెలియని మలుపుల రహదారి – 109
పరుగెత్తి ప్రైవేటు కంపెనీల పాలు తాగటం కన్నా నిలబడి గవర్నమెంటు వారి నీళ్లు తాగడమే మేలనిపించింది – 112
ఊళ్లో వెలుతురు ఇంకా ఒళ్ళు విరుచుకోనేలేదు – 135
ఊపిరితిత్తులు అలసిపోయేలా ఉపన్యాసాలు దంచె – 147

మన తెలుగు ప్రచురణకర్తలకే ప్రొఫెషనల్ ఎడిటర్స్ లేనప్పుడు, ఇక రచయితలు వేసుకునే పుస్తకాలకి ఎలా వుంటారు అని సమర్థించుకోకపోతే, వారి అవసరం మాత్రం వుందని ఈ పుస్తకం కూడా గుర్తు చేస్తోంది. ప్రతి పుస్తకానికీ సరైన ఎడిటింగ్ వుండాలి. ప్రతి పుస్తకం అచ్చు తప్పులు లేకుండా వుండాలి అనేది మన నినాదంగా కాకుండా ఆచరణగా వుండాలి.

అలాగే కొన్ని కథల అనంతరం బ్రాకెట్ చేసిన రాతలు అడక్కడకన్నా ముందు మరెక్కడన్నా వరసగా వుంటే బావుంటాయి.

మొత్తం మీద ఈ కథల్లోని ఇతివృత్తాలు ఉన్నతమైన విలువలతో వున్నాయి. రచనా విధానం మాత్రం సాదాసీదాగా వుంది. ఈ కథల్లోని ప్రకృతి ప్రేమ, ఉన్నత సంస్కారం, ఆరోగ్యకరమైన స్త్రీ పురుష సంబంధాలు, మతాతీత మానవ విలువలు, వస్తు సంస్కృతి కన్నా కళల సంస్కృతి, స్త్రీ చైతన్యం, గ్రామీణ సంస్కృతిపట్ల ప్రేమ అవసరమైనవిగా కనిపిస్తాయి.

చివరిగా, వస్తువు రీత్యా, రచన దృష్ట్యా నాకు నచ్చిన కథలు 1. బ్రతకనేర్వని వాడు, 2. సారే జహాసె అచ్చా, 3. శేఫాలిక. ముందు ముందు మరిన్ని వైవిధ్య భరితమైన, బలమైన ముద్రతో రాయగలరని ఈ మూడు కథల ద్వారా అమరేంద్ర ఆశని కలిగిస్తున్నారు. V


ప్రస్థానం

లభించు చోట్లు

**ప్రజాశక్తి బుక్‌హౌస్**
1-1-187/1, చిక్కడపల్లి,
హైదరాబాద్-20,
ఫోన్ : 27660013

**& రామకృష్ణ న్యూస్ ఏజెన్సీస్**
అబిడ్స్, హైదరాబాద్.
దాని పంపిణీ కేంద్రాలలో,
ఇతర ప్రముఖ బుక్‌షాప్‌లలో

బ్రాంచీలు

| | | | | | | |
|---|---|---|---|---|---|---|
| 27-19-14, వి.ఎన్.ఆర్. కాంప్లెక్స్, దుర్గయ్య వీధి, **విజయవాడ-2.** ఫోన్ :2577533 | సుందరయ్యభవన్, బాలాజీనగర్ **ఖమ్మం-507001** | 140, ప్రకాశం రోడ్, **తిరుపతి-517502** ఫోన్ : 223017 | 6-2-250, విజయటాకీస్‌రోడ్ చౌరస్తా **హన్మకొండ-506001** | సుందరయ్యభవన్ సుభాష్ విగ్రహం (ఎదుట), **నల్గొండ** | షాప్ నెం.47, ఆర్.టి.సి. కాంప్లెక్స్, ద్వారకానగర్, **విశాఖపట్నం** | 2/7, బ్రాడీపేట్ **గుంటూరు** |

**ఇంకా కావలసిన ఏజెంట్లు, సాహితీ మిత్రులు రాయండి**





Untitled-2 75 6/11/2002, 3:51 PM

## సమర్పణ

# 20వ శతాబ్దం : తెలుగులో స్త్రీల సాహిత్యం

**స్త్రీల సాహిత్యంపై కొన్ని ఆలోచనలు ప్రసరింపచేసి – అంచనాలు వేసిన వ్యాసాల సంకలనంగా దీనికి ఒక చారిత్రక ప్రాముఖ్యత వుంది. ఈ తరహా పుస్తకాలలో ఇది మొదటిది.**

**కాత్యాయనీ విద్మహే**

**20వ** శతాబ్ది స్త్రీల కోసం సంస్కరణోద్యమాలు నిర్మించబడిన శతాబ్దం. స్త్రీల సంక్షేమం కోసం, అభివృద్ధి కోసం సాధికారత కోసం వ్యూహాలు, ప్రణాళికలు రూపొందించబడిన కాలం. స్త్రీలలో ఉనికికి సంబంధించిన చలనం, గుర్తింపు, చైతన్యం, ఆత్మగౌరవ దృక్పథం అభివృద్ధి చెందిన కాలం. తత్ఫలితంగా ప్రపంచ తమ కోసం కూడా వుందన్న అవగాహనతో తమ అవసరాలకు, ఆకాంక్షలకు, ప్రయోజనాలకు అనుగుణంగా దానిని పునర్నిర్మించుకోవాలన్న సంకల్పం 20వ శతాబ్ది చివరకు స్త్రీలలో దృఢపడింది. ఆ ఉత్సాహశక్తి నుండే రాగల కాలాన్ని తమదిగా చేసుకొనాలని అనుకొంటున్నారు. 20వ శతాబ్ది ప్రారంభంలో గురజాడ అప్పారావు 'ఆధునిక మహిళ చరిత్రను తిరిగి రాస్తుంది' అని చెప్పిన విషయం 21వ శతాబ్దాన్ని తనదిగా చేసుకొనాలనుకొంటున్న నేటి మహిళ ఆశయంలో, ఆదర్శంలో ఆచరణ వాస్తవం అవుతుందన్న ఆశ కలుగుతున్నది.

ఈ సమకాలీన ఉద్యమ సందర్భం నుండి స్త్రీల ఆశలను, ఆకాంక్షలను ఉత్సాహాలను, ఉద్వేగాలను, ఒంటరి పోరాటాలను, ఓటములను, విజయాలను మదింపు వేయవలసిన అవసరం వుంది. సమష్టి పోరాటాలకు శక్తిని సమకూర్చుకొనటానికి ఈ అనుభవాల సారం కావాలి. అందుకు తగిన ముడిసరుకు సాహిత్యం. గత శతాబ్ది స్త్రీల చైతన్యాన్ని స్త్రీల సాహిత్యం ద్వారా అధ్యయనం చేయటం వలన సమీప గత చరిత్రను మానవ సంబంధాల స్పర్శతో సజీవంగా అర్థం చేసుకొనటానికి వీలవుతుంది. ఈ అవగాహనతోనే కాకతీయ విశ్వవిద్యాలయం ఆర్ట్స్ & సైన్స్ కళాశాల తెలుగు విభాగం "20వ శతాబ్ది రాజకీయార్థిక పరిణామాలు – తెలుగులో స్త్రీల సాహిత్యం" అనే అంశం మీద ఆగస్టు 27, 28 తేదీలలో రెండు రోజుల సదస్సును నిర్వహించింది. ఆ సదస్సులో సమర్పించబడిన ప్రసంగ పత్రాలను పుస్తక రూపంలో తీసుకొని రావాలన్న ఆనాటి సంకల్పం ఈ నాటికి నెరవేరింది. స్త్రీల సాహిత్యంపై కొన్ని ఆలోచనలు ప్రసరింపచేసి – అంచనాలు వేసిన వ్యాసాల సంకలనంగా దీనికి ఒక చారిత్రక ప్రాముఖ్యత వుంది. ఈ తరహా పుస్తకాలలో ఇది మొదటిది.

ఈ పుస్తకం సాధ్యమైనంత సమగ్రంగా వుండాలని చేయవలసిన ప్రయత్నాలన్నీ చేశాను. సెమినారులో పత్రసమర్పణకు అంగీకరించి స్వీయ కారణాలవల్ల సమయానికి రాలేకపోయిన వాళ్ళ పత్రాలను కూడా వీలయినంత వరకు తెచ్చింది ఈ పుస్తకంలో చేర్చటం జరిగింది. సెమినారులో పాల్గొని పత్రసమర్పణ చేసి కూడా ప్రచురణకు వాటిని అందించలేకపోయారు కొందరు మిత్రులు. అందువల్ల ఈ పుస్తకంలో కొన్ని ఖాళీలు కనిపించవచ్చు. సాధ్యమైనంత వరకు ఈ ఖాళీలను పూరించాలని ప్రయత్నించినా అందుకు అన్ని సందర్భాలలోను అవకాశం కలిసిరాలేదు.

మొదటి సమావేశంలో 'తెలంగాణా కవయిత్రులు' వ్యాసం రాలేదు. అది లేకుండా స్వాతంత్ర్య పూర్వకాలమే స్త్రీల కవిత్వం గురించిన సంపూర్ణ అవగాహన కలగదని తెలుసు. ముగింపు సమావేశంలో పాల్గొన్న డా. అనుమాండ్ల భూమయ్యగారు గోలకొండ కవుల సంచికలో కవయిత్రులను ఉదహరిస్తూ మాట్లాడారు. ఆ మాట్లాడినది వ్యాసంగా రాసిమ్మంటే రాసిచ్చారు. ఆ రకంగా ఆ ఖాళీని పూరించే అవకాశం దొరికింది. విప్లవ దళిత మైనారిటీ కవిత్వంపై వ్యాసాన్ని చివరి క్షణంలోనైనా పంపి ఈ పుస్తకంలో విప్లవ మైనారిటీ వర్గాల స్త్రీల సాహిత్యంపై ఒక వ్యాసం కూడా లేదే అన్న నా బాధను కొంత తగ్గించారు. డా. ఎండ్లూరి సుధాకర్. విప్లవ దళిత మైనారిటీ కథకు, నవలకు సంబంధించిన వ్యాసాలు మాత్రం ఎంత ప్రయత్నించినా తెప్పించలేకపోయాను. షాజహానా ముస్లిం స్త్రీల కవిత్వం మీద వ్యాసం రాసి ముందుగానే పంపింది. కవిగా తనకు స్వీయ అనుభవాలు, అభిప్రాయాలు చెప్పటానికి రచయిత్రుల సదస్సులో అవకాశం ఇచ్చాం. కనుక సమయాభావంవల్ల పత్ర సమర్పణకు అవకాశం ఇయ్యలేదు. అయినా సంకలనానికి సమగ్రత నిస్తుందనే ఉద్దేశంతో ఆ వ్యాసాన్ని కూడా ప్రచురిస్తున్నాం. ఎండ్లూరి సుధాకర్ వ్యాసంతో కలిపి చూసినప్పుడు విషయ పునరావృత్తి వున్నట్లనిపించినా ఎవరి దృక్పథం అనుభవకోణం వారివే. కనుక అది పాఠకులకు విసుగు కలిగించదనే భావించాను.

డెబ్బయ్యవ దశకంలో వచ్చిన అత్యంత ప్రధాన ఉద్యమం విప్లవోద్యమం. దళిత మైనారిటీ ఉద్యమాలు తొంభయ్యవ దశకంలోవి. ఈ మూడు ఉద్యమాలు స్త్రీలను ఏ రకంగా కదిలించాయి? స్త్రీల చైతన్యాన్ని, అభివ్యక్తిని ఏ రకంగా ప్రభావితం చేశాయి? అన్న విషయం నిగ్గు తేల్చటానికి విప్లవ దళిత మైనారిటీ కథలపై, నవలపై ప్రత్యేక అధ్యయనాలు జరగటం అవసరం.

ఆ అధ్యయనాలే జరిగితే మనకేమి తెలుస్తుంది? విప్లవోద్యమం ప్రారంభ దశలో రచనా రంగంలోకి వచ్చిన స్త్రీలు చాలా తక్కువ అని తెలుస్తుంది. 'ప్రతి స్త్రీ ఒక నిర్మల కావాలి' అని 1972లో ఓల్గా స్త్రీలకు విప్లవోద్యమంలో భాగస్వామి అయిన పంచాది నిర్మల నమూనాను ఆదర్శంగా చూపిస్తూ రాసిన కవిత స్త్రీలు రాసిన విప్లవ కవిత్వానికి ప్రారంభం అనుకొనాలి. రత్నమాల 'మానవి' వంటి ఒకటి



Untitled-2 76 6/11/2002, 3:51 PM

రెండు కవితలు రాసింది. స్త్రీలుగా ఒక ప్రత్యేక అస్తిత్వ స్పృహతోనే విప్లవోద్యమాన్ని తమదిగా చేసుకొనటం, విప్లవోద్యమ కవిత్వం రాయటం ఈ ఇద్దరి విషయంలోనూ కనిపిస్తుంది. విమల, నల్లూరి రుక్మిణి, డి.ఎల్. సుహాసిని, ఆర్. శశికళ తదితరులు తరువాత తరువాత విప్లవోద్యమ కవిత్వం రాశారు. విప్లవోద్యమం సాయుధ ఉద్యమం, రహస్యోద్యమం కూడా కావటం వలన స్వీయ ఉనికిని మరుగుపరుచుకొంటూ వేరు వేరు పేర్లతో కవిత్వం రాసేవాళ్ళు కూడా వుంటారు. వాళ్ళలో స్త్రీలెవరో, పురుషులెవరో వేరు పరిచి చెప్పటమూ సాధ్యం కాదు. ఏమైనా విప్లవ సాహిత్యంలో కవిత్వానిది ఎంత పెద్ద భాగమైనా అందులో స్త్రీలది మాత్రం చిన్న భాగమే.

విప్లవ కథ విషయానికి వస్తే కూడా వాస్తవం అదే. 1999లోపల వచ్చిన విప్లవ కథలను ఏర్చి కూర్చి విప్లవ రచయితల సంఘం ప్రచురించిన రెండు కథా సంపుటాలలో మొత్తం కథలు 82 అయితే స్త్రీలు రాసినవి పదమూడు పద్నాలుగును మించవు. రుక్మిణి రాసిన గోరంత దీపం కథతో (1975) స్త్రీల విప్లవ కథా రచన ప్రారంభమైందనుకొనవచ్చు. గోరంత దీపం కథతో సహా 1985లోపల స్త్రీలు రాసిన విప్లవ కథలు దాదాపు అన్నీ వర్గ శత్రు నిర్మూలనను, సంఘ చైతన్యాన్ని, బలాన్ని, విప్లవోద్యమ నిబద్ధత నిమగ్నతలను వస్తువుగా చేసుకొన్నవే. స్త్రీలుగా వాళ్ళ అస్తిత్వానికి సంబంధించిన ప్రత్యేక స్పృహ ఆ కథలలో కనబడదు. తరువాత తరువాత స్త్రీలు రాసిన విప్లవోద్యమ కథలో స్త్రీల అనుభవ కోణానికి కొంత ప్రాధాన్యత పెరుగుతూ వచ్చింది. మా బడి దళజీవితానికి సంబంధించిన కథే అయినా భార్యాభర్తల సంబంధానికి సంబంధించిన సున్నిత కోణం అందులో వుండటం గమనించవచ్చు. యిద్దరు తల్లులు కథ విప్లవోద్యమంలో పని చేస్తున్న వాడిని ప్రేమించిన స్త్రీ, కన్నతల్లి – ఈ ఇద్దరి కోణం నుండి రచించబడింది. మోసం, తాయమ్మ, గీతలకావల, అంతా ప్రశాంతం మొదలైన కథలన్నీ స్త్రీల జీవితం చుట్టూ అల్లుకొన్నవే కావటం విశేషం. స్త్రీలు రచయితలుగా విప్లవోద్యమంలో మమేకం అవుతూనే స్త్రీల అనుభవ కోణానికి ప్రాధాన్యతనిస్తూ రచించటం స్త్రీవాద ఉద్యమం యొక్క అనుకూల ప్రభావం కారణంగానే అని చెప్పవచ్చు. విప్లవోద్యమంతో ఏకీభావాన్ని ప్రకటిస్తూ స్త్రీవాద ఉద్యమానికి సమాంతరంగా అభివృద్ధి చెందిన మహిళా ఉద్యమానికి ప్రాతినిధ్యం వహిస్తున్న 'మహిళా మార్గం' పత్రిక స్త్రీల కథలు అనేకం ప్రచురించింది. రుక్మిణి, నిర్మల, మొదలైన వాళ్ళకు తోడుగా విశాఖ అరుణ, టి. అనురాధ, సీత, నవత, నల్లక్క, పద్మ, శేషులత, జీవని, రేణుక, విష్ణుప్రియ మొదలైన వాళ్ళు విప్లవోద్యమ చైతన్యంతో కథారంగంలోకి ప్రవేశించారు. స్త్రీలుగా తమ అనుభవాలను, ఇంట్లోను, పని చేసే చోట ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కొరకు ఎన్నుకొన్న పోరాట మార్గాలను వస్తువుగా చేసుకొన్నాయి వీళ్ళ కథలు. విప్లవోద్యమం సృష్టించిన నవలలే తక్కువ. అంటే స్త్రీలు రాసినవి మరీ తక్కువ. వనజ రాసిన 'అడవి పుత్రిక' నవల ఒక్కటే ప్రస్తుతానికి కనబడుతున్నది. స్త్రీవాద ఉద్యమ ప్రభావం నుండి వచ్చిన స్త్రీల నవలల్లో భాగంగా దీనిని గురించిన చర్చ సజయ వ్యాసంలో వుంది.




వెల : రు.60/-

దళిత అస్తిత్వస్పృహ దళిత సాహిత్య ఉద్యమానికి కారణమైంది. ఆత్మగౌరవ చైతన్యంతో వర్ణాధిక్య వ్యవస్థ మీద ధిక్కారం ప్రకటిస్తూ కొత్త కవిత్వం రాయటం మొదలైంది. అయితే పురుషుల సంఖ్యతో పోల్చినపుడు స్త్రీలు ఈ రంగంలో ఎక్కువ మంది కనబడరు. చల్లపల్లి స్వరూపరాణి, దరిశి శశినిర్మల, విజయ, సుభద్ర, శ్యామల, జాజుల గౌరి ఇట్లా కొంత మంది దళితులుగాను, దళిత స్త్రీలుగాను జీవితంలోని కులపీడనకు, పితృస్వామిక ఆధిపత్యానికి వ్యతిరేకంగా కవిత్వం రాశారు. కథలు రాశారు. అగ్రవర్ణ పురుష పీడననే కాదు స్త్రీ అధికార స్వభావాన్ని కూడా గుర్తించి నిరసించారు వీళ్ళు. స్త్రీలుగా స్త్రీలంతా ఒక్కటే అన్న స్త్రీవాద భావన పట్ల సందేహాలు వీళ్ళ రచనలలో వ్యక్తమయ్యాయి. వీళ్ళతోపాటు దళిత జీవన దృక్పథం నుండి సి. సుజాత, ఓల్గా, ఎస్. జయ మొదలైన వాళ్ళు సాహిత్య సృజన చేయటం కూడా కనబడుతుంది. దళిత ఉద్యమ ప్రభావంతో కవిత్వం, కథలు రాసిన స్త్రీలే వేళ్ళ మీద లెక్కబెట్టగలిగినంతమంది. ఇక నవలలు రాసిన వాళ్ళు ఒకళ్ళిద్దరిని మించి లేరు. 'ఎల్లి', 'నీలి' నవలలను రాసిన అరుణ, 'ఆకాశంలో సగం' నవల రాసిన ఓల్గా ఇక్కడ ప్రస్తావించదగిన వాళ్ళు. ఈ రెండు నవలల ప్రస్తావన సజయ వ్యాసంలో వుంది. ఆ మేరకు విప్లవోద్యమం దళిత నవలలకు సంబంధించిన సమాచారం మరొక మార్గంలో మనకు లభించినట్లే.

విప్లవోద్యమ దళిత సాహిత్యాలతో పోలిస్తే మైనారిటీ సాహిత్య సృజనలో స్త్రీల సంఖ్య మరీ తక్కువ. షెహనాజ్, షాజహానా, మహెజబీన్, రజియాబేగం ఇలా కొద్ది మంది ముస్లిం స్త్రీలుగా స్వీయ జీవితానుభవాల వ్యక్తీకరణకు మాత్రమే కాక సామాజిక జీవితానుభావాల చిత్రణకు కూడా కవిత్వాన్ని సాధనంగా చేసుకున్నారు. మైనారిటీ మానవ సమూహాలలోని స్త్రీలు కవిత్వం రాయటమే ఉద్యమంగా ఇంకా ఊపందుకోలేదు. అటువంటప్పుడు మైనారిటీల నుండి స్త్రీలు నవలలు, కథలు రావటం ఇప్పుడే వూహించలేం. మైనారిటీల పక్షం వహిస్తూ వారి జీవన వ్యధలని వస్తువుగా చేసుకొని రాస్తున్న ఇతర స్త్రీలు ఎవరైనా వున్నారా అని కూడా వెతకాల్సి వుంది.

స్వాతంత్ర్యానంతరం స్త్రీలు ఎక్కువగా కృషి చేసి సమర్థవంతంగా నిర్వహించిన సాహిత్య ప్రక్రియ నవల. స్త్రీల నవలలపై జె. కనకదుర్గ రాసినది తప్ప మరొక వ్యాసం ఇందులో లేదు. శ్రీదేవి, వట్టికొండ విశాలాక్షి, ఇల్లిందల సరస్వతీదేవి మొదలైన మొదటితరం నవలా రచయిత్రులతో కలుపుకొని రంగనాయకమ్మ, వాసిరెడ్డి సీతాదేవి, లత, కె. రామలక్ష్మి, ఐ.వి.ఎస్. అచ్యుతవల్లి, పోల్కంపల్లి శాంతాదేవి, యద్దనపూడి సులోచనారాణి, మాదిరెడ్డి సులోచన, కోడూరి కౌసల్యాదేవి, సి. ఆనందరామం మొదలైన రచయితల నవలా వస్తు చైతన్యాల విశ్లేషణ జరగాల్సి వుంది. ఆ పని ఇంకెవరైనా ఇంకెక్కడయినా ప్రారంభిస్తారన్న ఆశ వుంది. స్వాతంత్ర్యానంతర స్త్రీల కథల మీద రాచపాళెం చంద్రశేఖర రెడ్డిగారి వ్యాసం లేకపోవటం ఒక లోటే. అయినా ఆచంట శారదాదేవి కథల మీద వ్యాసం ఆ లోపాన్ని కొంత పూరిస్తుంది.

ఈ పుస్తకంలో రెండు భాగాలున్నాయి. మొదటిది స్త్రీల రచనల సమీక్షకు, విశ్లేషణకు సంబంధించిన వ్యాసాల సమాహారం. ఆనాటి సెమినారులో మూడు సమావేశాల కింద కాలక్రమ వరుసలో సమర్పించబడిన పత్రాల వరుసక్రమాన్నే ఈ పుస్తకం కూర్పులో పాటించాను. స్వాతంత్ర్యం పూర్వం (1947 వరకు) స్వాతంత్ర్యానంతరం (1975 వరకు) స్త్రీవాద ఉద్యమ కాలం – (1999 వరకు) అన్న మూడు స్థూల విభాగాల క్రింద ఈ వ్యాసాలున్నాయి. మూడు విభాగాల ప్రారంభంలోను మూడు థీమ్ పేపర్లు ఆ కాలపు సామాజికార్థిక రాజకీయ పరిణామాల విశ్లేషణకు సంబంధించినవి వున్నాయి. ఈ థీమ్ పేపర్లు రాసిన ముగ్గురు – డా. గిరిజారాణి, డా. బుర్ర రాములు, డా.



Untitled-2 77 6/11/2002, 3:51 PM

జ్యోతిరాణి అర్థశాస్త్ర విభాగానికి చెందిన వాళ్ళు. మహిళా జీవన అధ్యయనాలను ఆసక్తితో చేస్తున్న వాళ్ళు. సాహిత్యానికి సమాజ శాస్త్రాలతో దగ్గరి సంబంధం వుంటుంది. కనుక స్త్రీల సాహిత్య అధ్యయనానికి ఈ రకమైన సామాజిక జ్ఞానం అవసరం అవుతుంది. ఆ థీమ్ పేపర్ల వెనువెంట ఆ కాలానికి సంబంధించిన స్త్రీల రచనల మీద విశ్లేషణ వ్యాసాలు కవిత్వం, కథ, నవల, వ్యాసం అనే ప్రక్రియల క్రమంలో వున్నాయి. సామాజిక రాజకీయార్థిక పరిణామాల సంబంధంలో స్త్రీల చైతన్యంలో వచ్చిన మార్పులను అంచనా వేయటానికి ఈ పద్ధతి తగినదిగా భావించాను.

ఇక ఈ పుస్తకంలోని రెండవ భాగంలోని రచనలు రచయితల స్వీయ అనుభవాలకు అభిప్రాయాలకు సంబంధించినవి. స్త్రీల సాహిత్యంపై సెమినారు కనుక రచయితలుగా స్త్రీలు తాము ఏ పరిస్థితుల నుంచి ఎదిగివచ్చారో, ఏ పరిస్థితులతో సంఘర్షించారో వాళ్ళ నుండే వినటం బాగుంటుందని కొంత మంది రచయితలతో ప్రత్యేకంగా ఒక సాయంత్రపు సదస్సును ఏర్పాటు చేయటం జరిగింది. అనారోగ్య కారణాలతో కొందరు సీనియర్ రచయితలు రాలేమన్నారు. రాలేకపోయినా తన అనుభవాన్ని రాసి పంపారు వట్టికొండ విశాలాక్షి. ఆమెతో కలిపి పదిహేను మంది రచయితల సాహిత్య జీవితానుభవాలు ఇప్పుడీ రెండవ భాగంలో వున్నాయి.

20వ శతాబ్ది స్త్రీల సాహిత్యంపై విమర్శనాత్మక అంచనాగా వున్న ఈ వ్యాసాలు సెమినారు వ్యాసాలు కనుక ఆనాటి సెమినారు నివేదిక కూడా ఈ పుస్తకంలో చేర్చటం సముచితంగా వుంటుందని భావించాను. ఈ విషయం మీద ప్రారంభ దశలో, ముగింపు సభలో మాట్లాడిన వారి అభిప్రాయాలు, పరిశోధనకు చేసిన సూచనలు ఈ రకంగా ఒక దగ్గర నమోదయి వుంటే భావిపరిశోధకులకు అవి మార్గదర్శకంగా వుండవచ్చు. అలాగే సెమినారులో పాల్గొని ప్రచురణకు వ్యాసాలు ఇయ్యలేక పోయినవాళ్ళు ఏ అంశాల మీద వెలుగులు ప్రసరించారో తెలుసుకోవటానికి కూడా ఈ నివేదిక ఉపయోగపడుతుంది. రెండు రోజులపాటు ఏకబిగిన సాగిన ఒక సెమినారు సారాన్ని, ఉత్తేజాన్ని అనుభవానికి తెచ్చేది నివేదిక కనుక దీనిని ఈ పుస్తకంలో ప్రచురించటం జరుగుతున్నది.

స్త్రీల సాహిత్యంపై జరగవలసిన పరిశోధనలకు ఈ పుస్తకం ఒక ప్రారంభం మాత్రమే. ఇక్కడ్నించి స్త్రీల సాహిత్యసేకరణకు, అధ్యయన పరికరాలను, పద్ధతులను సమకూర్చుకొనటానికి, అంచనాలు వేయటానికి మనం చేయవలసినది ఎంతో వుంది. అందుకు పరిశోధకులను, మహిళా జనజీవన అధ్యయనపరులను ప్రేరేపించటానికే ఈ పుస్తకం. విశ్వవిద్యాలయాలలో స్త్రీల సాహిత్యంపై రోజు రోజుకు ఎక్కువవుతున్న పరిశోధనలకు దిశానిర్దేశం చేయటంలో ఈ పుస్తకంలోని వ్యాసాలు, విశ్లేషణలు ఉపయోగపడతాయని నమ్ముతున్నాను.

**(సంపాదకులు కాత్యాయని విద్మహే, వెల : రు.60, పేజీలు : 286, ప్రతులకు : విశాలాంధ్ర, ప్రజాశక్తి)**

V

# వాడేనా వీడు

## మార్టూరి శ్రీరామ్‌ప్రసాద్

నా గుండెలుపై ఎక్కి
బోసి నవ్వులుతో
ఆడుకొన్న వీడేనా
నేడు ఈ పని చేసింది
స్వచ్ఛమైన నవ్వులుతో
పెరిగిన నా బిడ్డేనా
ఈ ఘోరాన్ని చేసింది



తల్లిచాటు బిడ్డడనుకున్న
నా కొడుకా ఇంత దారుణం చేసింది
తోటి వారితో
కలిసి గెంతిన చేతులా
రక్తాన్ని చూసింది
అడుక్కొనే వాడికి అన్నం ఎందుకులేదో
పేదవాడుగా ఎలా పుడుతాడు
అని అడిగిన నాముదిపాల బిడ్డేనా
తోటి వారిని మతం పేరుతో
ఇన్ని హత్యల్ని చేసింది
దీనికా వీడిని కన్నది
అసలు వాడేనా వీడు
అసలు ఎక్కడ జరిగింది పొరపాటు?

# ఏటేటా



## బి. నరసారెడ్డి

ఏటా ఏటా!
ప్రతి ఏటా!!
బతుకు
అతలాకుతలం
ప్రతి ఏడాదీ పుట్టెడు
కన్నీళ్ళు కష్టాలే దిగుబడి
    ఆకాశ చూపుల్లో
    అప్పుల పోరాటాల్లో
    అలవిగాని నోటీసులు
    స్వప్నాల్లో సైతం
    ఋణదాతల తుది గడువులే!
కళతప్పిన ధాన్యపు 'కళ్ళాలు'
కునుకు తీసిన నాగళ్ళు
వరుని కరుణలో వంకలు, వాగులు
ధాన్యంకై ధర్నాకు దిగిన 'గాదెలు'
నిన్న మొవ్వకుళ్ళు
నేడు ఎర్రగొంగళి

ప్రతి ఏడాదీ 'వేరుశెనగ'పై
మెరుపుదాడి
దీనంగా మౌనంగా
కబేళాల దారిలో
మూగ జీవులు
చాపేచుదుతున్న
వ్యవసాయ కూలీలు
పనిలేని పశువులు
పసలేని కరువు పనులు

    పుస్తెలతో పూట గడిపినా
    పశువులతో పాతప్పు తీరినా
    ఏమీ లేని ఎల్లుండికి ఏమిటి
    సమాధానం
    పశువులమైనా కాకపోతిమే
    "గోరంట్ల" సంతలో బేరానికి
    'అనంత' అభివృద్ధే మా ధ్యేయం
    ఆహా అది ఎంత అందమైన
అబద్ధం
    క్యాప్షన్ పోటీలకు పంపించు
    ఫస్టు ప్రైజు రావచ్చు
కళ తప్పిన రచ్చబండ
కనికరంలేని కరెంటు
కష్టాల్లో రైతులు
కోమాలో పంటలు
తిరిగొచ్చిన నిరుటికూలీ
పలకరింపులేని పల్లెతో
మళ్లీ పరుగో పరుగు



Untitled-2 78 6/11/2002, 3:51 PM

ప్రశంస

# ఇది 'అనంత' పుత్రుల కరువు కవితా ఘోష

*ఈ సంకలనం చదివిన ప్రతిపాఠకుడు రెండు నిమిషాలు తనంతతానే మౌనం పాటిస్తాడు. అనంతపురం నేలను ఎవరూ కాల్చనక్కరలేదు. ప్రతి ఏట తనకుతానే కాలిపోతుంది. కాకపోతే ఎండలు కాలుస్తాయి. కాదంటే పాలక వ్యవస్థ కాలుస్తుంది. ఈ కరువునేల కవిత్వం చదువుతున్నంత సేపు కనుకొనుకుల్లో దుఃఖం జారిపోకుండా నిలబడే ఉంటుంది.*

**నాళేశ్వరం శంకరం**

సాహిత్య పరిణామ చరిత్రకి స్థానిక ఉద్యమ సాహిత్యాలవల్ల కీడు కన్నా మేలే ఎక్కువగా ఉంటుంది. ప్రపంచీకరణ మూలంగానే స్థానిక మూలాల్లోకీ, వృత్తుల్లోకి నిర్దిష్ట జీవన వాస్తవికతల్లోకి ఇప్పుడిప్పుడే కొత్తకొత్త అడుగులు వేస్తున్నారు. వివిధ ప్రాంతాలు తమ తమ స్థానిక జవన అస్థిత్వాలను తమదైన తాత్విక స్వభావంతో వెతుక్కోగలుగుతున్నాయి. ఈ నేపథ్యంలోంచే అనంతపురం భూమి పుత్రుల కరువు కన్నీళ్ళ బాధలగాథల ఆత్మకథాత్మకతలోంచి వచ్చిన కవితా సంకలనమే 'వొరుపు'.

'వొరుపు' అంటే అనంతపురం ప్రజల భాషలో కరువు అని అర్థం. ఇందులో రైతుల ఆత్మఘోషకు అద్దం పట్టే కవిత్వం ఉంది. అనంతపురం నేల ఎదుర్కొనే వికృత కరువు బీభత్సం ఏ ప్రాంతపు నేలా ఎదుర్కోలేదేమో! కరువు రాచపుండై అనంతపురం రైతుల్ని వేధిస్తుంది. ఇటీవల కాలంలో రైతుల ఆత్మహత్యల్ని పరిశీలిస్తే తెలుస్తుంది. వాళ్ళ జీవితం ఎంత సంక్షోభంలో పడిపోయిందో.

రైతు వేదన అనంతపురం నేల మీద పుట్టిన కవుల్ని కలిచివేసింది. రాచపాళెం చంద్రశేఖర్‌రెడ్డిగారు, శాంతి నారాయణగారు వివిధ పత్రికలకు ప్రకటనలిచ్చి కవుల నుంచి కవిత్వాన్ని ఆహ్వానించారు. కవులు అనంతపురంలోని వివిధ ప్రాంతాల రైతుల జీవన దుఃఖాన్ని మూటగట్టుకుని తెచ్చి కవితల రూపేణా పురుడు పోశారు. ఒకే ఒక కవితా వస్తువును స్వీకరించి మొత్తం జిల్లా కవులు సంఘటితంగా తేవటం కరువు సంకలనాలలో మొదటి సంకలనం కావచ్చు.

ప్రస్తుతం అనంతపురంలో తొమ్మిదవ తరగతి చదువుతున్న ముక్తాపురం స్నేహలత కవిత మొదలుకొని వైస్ ఛాన్స్‌లర్‌గా పదవీ విరమణ చేసిన కొలకలూరి ఇనాక్ కవితదాక ఇందులో ఉండటం విశేషణం. మరో విశేషణ మేమంటే పదమూడు మంది కవయిత్రుల కవితలు ఇందులో ఉన్నాయి. ముగ్గురు పద్యకవులు కూడా ఇందులో చోటు చేసుకున్నారు. మరో ముగ్గురు గానానికి అనుకూలమైన వచన కవితలు రాసిన కవులు కూడా యిందులో ఉన్నారు. ప్రతి కవి అనంతపురం రైతుల దుఃఖాన్ని తవ్విపోసిన వారే కావడం ఈ పుస్తకానికి తొడిగిన గొప్ప ఆభరణం. ఈ యాభైనాలుగు కవిత్వాలు ఒకటికి రెండుమార్లు చదివితే ప్రధానంగా పది అంశాల్ని వస్తువుగా స్వీకరించి కవితలుగా సృజించారనిపిస్తుంది. 1) అనంతపురం కరువును వ్యక్తీకరించిన కవిత్వం. 2) రైతుల జీవన దుఃఖాన్ని ప్రతిబింబించే కవిత్వం. 3) నేల-నీరు-నదుల అనుసంధాన కవిత్వం, 4) ప్రపంచీకరణ, సరళీకరణ విధానాల్ని ధిక్కరించే కవిత్వం, 5) మన పాలకుల ఆర్థిక విధానాల్ని ఎండగట్టే కవిత్వం, 6) ఆత్మహత్యలన్నీ హత్యలే అని చాటి చెప్పే కవిత్వం, 7) రైతాంగాన్ని సంఘటితం చేసే కవిత్వం, 8) తిరుగుబాటుకు సమాయత్తం చేసే కవిత్వం, 9) ఉద్యమ స్ఫూర్తికి సమైక్య పరిచే కవిత్వం, 10) కరువువల్ల మానవ సంబంధాలు ఎలా విచ్ఛిన్నమైపోతున్నాయో విప్పి చెప్పే కవిత్వం.

ఇందులోని కవులు కొందరు ఈ పది అంశాల్ని ఒకే కవితలో రాశారు. మరికొందరు రాయలేదు. కవులను బట్టి కాక వస్తువును బట్టి కవితల్ని అధ్యయనం చేస్తే విశ్లేషించడం సముచితంగా ఉంటుంది.

ఈ సంకలనం చదివిన ప్రతిపాఠకుడు రెండు నిమిషాలు తనంతతానే మౌనం పాటిస్తాడు. అనంతపురం నేలను ఎవరూ కాల్చనక్కరలేదు. ప్రతి ఏట తనకుతానే కాలిపోతుంది. కాకపోతే ఎండలు కాలుస్తాయి. కాదంటే పాలక వ్యవస్థ కాలుస్తుంది. ఈ కరువునేల కవిత్వం చదువుతున్నంత సేపు కనుకొనుకుల్లో దుఃఖం జారిపోకుండా నిలబడే ఉంటుంది.

ఈ సంకలనానికి సింగమనేని నారాయణ ఒక వైవిధ్యంగల పీఠిక రాశారు. ఈ పీఠిక పుస్తకానికి వెన్నెముకలా ఉంది. రాబోయే కవితా సంకలనాలకు నూతన మార్గం వేసే స్వభావం ఉంది. ఈ పీఠిక చదివితే చాలు అనంతపురం రైతుల ఆర్తనాదం మన చెవుల్లో గింగురుమనేట్టుగా ఉంది. పీఠిక ముగిస్తూ హెచ్చరించిన వాక్యం అందరూ ఆలోచించేట్లుగా ఉంది. "ఇక్కడి రైతాంగం తన చేతుల్లోని హలాన్ని పక్కకు పెట్టి తుపాకీ చేతికి తీసుకోకముందే ఈ ప్రభుత్వం జాగ్రత్త పడటం మంచిదని ఈ సందర్భంగా హెచ్చరిస్తున్నాను. రైతాంగాన్ని రక్షించుకోలేని ఏ దేశానికి శాంతి కాంతీ మిగలదు" అంటారు ఒక చారిత్రక నగ్నసత్యాన్ని మనముందు ఉంచుతూ...

'వొరుపు' సంకలనానికి ప్రధాన సారథి రాచపాళెం చంద్రశేఖర్ రెడ్డి విమర్శకునిగా స్థిరపడిన వారు. కవిగా ప్రయాణం చేస్తున్నారు. సన్నకారు రైతులు, వ్యవసాయ కూలీలు కరువు రక్కసి కరాళ నృత్యానికి భయపడి వలస వెళ్ళేవాళ్ళ మీద ఒక మంచి కవిత రాశారు. ఇల్లునూ, ఊరునూ పెంచుకున్న పశువుల్ని అన్నింటిని వదిలి సత్యహరిశ్చంద్రుడు సత్యం కోసం రాజ్యాన్ని వొదిలినట్టు రైతు నేలబంధాల్ని వదిలి వలసలు వెళ్ళే వాళ్ళను చూసి 'అదృశ్యమవుతున్న దృశ్యం' అనే కవిత రాశారు. "ఈ సీనులోని కరువు, ఊళ్ళకు ఊళ్ళే ఖాళీ చేయించి, మనుషుల్ని వలస పక్షుల్ని చేయిస్తోంది... మాకు కరువు చావుకన్నా, ఆకలి చావుకన్నా వరద చావు ఎంతో సుఖమనిపిస్తుంది" అంటారు.

ఈ సంకలనానికి సంపాదక సారథ్యం వహించిన మరో కవి శాంతి నారాయణ. నారాయణ కథకునిగా లబ్ధ ప్రతిష్టులు. కథకుడే అయినా ఇందులో బలమైన కవితే రాశారు. "ఈ సీమరైతుకు చినుకే చిరకాల స్వప్నం, ఈ అనంతరైతుకు మెతుకే బంగారు




**వొరుపు కవితా సంపుటి వెల : రు.35. కాని ఎవరు ఏ ధరకైనా కొవనచ్చని సింగమనేని నారాయణ ఆవిష్కరణ సభలో ప్రకటించారు.**

స్వర్గం, కానీ ఇక్కడ చినుకు రాలదు స్వప్నం తీరదు... నీళ్లే దేశ సంపద అని కూస్తున్న పాలకులారా గోదావరి నీళ్ళను సముద్రం పాలు చేస్తున్న దేశ ద్రోహులారా, అని పాలకుల రైతు వ్యతిరేక స్వభావాన్ని, కరువు సంక్షోభాన్ని, ఆత్మహత్యల్నీ, రైతు వేదననీ నిష్టురంగా వ్యంగ్యంగా ధ్వనింప చేశాడు.

జూవల్లి ప్రేమ్‌చంద్ 'కసాయి కరువు' అనంతపురం రైతుల భాషలో సజీవమైంది. నదుల అనుసంధానం ఈ కవి కోరుతున్నాడు. "కష్టాలకు కన్నీళ్ళకు కొదవేంలేదు, కరువులూ కాటకాలు కొత్తకాదు, ధాతకరువు డొక్కల కరువులు, తాతముత్తాతల నుండీ చూసిందాము. రాయలసీమంతా పిలుస్తే పలుకుతాది కరువు, మా రాళ్ళనంతపురంలో పిలువకనే పలుకుతాది....

రాధేయ 'చావులరుతువు' కవితలో ప్రతిఘటనా స్వభావాన్ని రైతులకు నేర్పించే విధంగా రాశారు. రైతుల పక్షాన నిలబడి "మట్టిని ప్రేమించే ఈ మనుషులకు, ఈ నెత్తుటి సేద్యం ఇంకెన్నాళ్ళు?, రెక్కల కష్టాన్ని నమ్ముకున్న ఈ కష్టజీవులకు ఈ దావుల రుతువు ఇంకెన్నాళ్ళు?" అంటూ రైతులకు ఏ ప్రశ్నల కరవాలాల్ని మరీమరీ పదునుగా నూరి అందించారు.

మల్లెల నరసింహమూర్తి 'జలఖడ్గం' అనే కవితలో రైతుల్ని సంఘటిత పరిచేందుకు ఈ కవిత ద్వారా ప్రయత్నించారు. భావుకత బలంగా ఉన్న కవి. "నాగలి ఆకలితో, చచ్చిన పాములా ఓ మూల పడివుంది.... దాహంతో తపించే మాకు ప్రతి వానచినుకు ఓ అమృత బిందువు... వలసపోవటం పరిష్కారం కాదు, కరువు శత్రువుని సంహరించడానికి జలఖడ్గమే మా ఆయుధం" అంటూ రైతు ఉద్యమ స్ఫూర్తితో ముందుకు వచ్చినట్లుగా చిత్రీకరించారు. 'జలఖడ్గం' అనే పదబంధం నాకిష్టమైంది.

బద్వేలి రమేష్ 'కాకి రెక్కంత కరి మబ్బు కోసం" కవితలో "ఆకాశం నోరు విప్పదు, నేలకెంతకీ జలస్పర్శ రాగానుభవం రాదు.... చేను-సొంత స్మశానం, తోట - పెంచిన సర్పం, నాగలి - శిథిలమైన జ్ఞాపకం, కక్ష - కరువుకి ఇంకో రూపం, పల్లె - అనాథ శవం... కాకిరెక్కంత కరిమబ్బు కోసం, అనుక్షణం ఆకాశాన్ని కొలుస్తున్నాయి" అంటాడు. రైతుల జీవన దుఃఖాన్ని తలుచుకుంటూ, చేను-సొంత స్మశానం.... పల్లె అనాథ శవం అంటూ ఊహించిన భావనాత్మక వ్యాఖ్యానం జీవన సత్యాన్నీ 'అనంత' వేదననీ, మానవీయ స్వభావాన్నీ, నిర్వచించే విధంగా ఎత్తిచూపిన కవిత 54 కవితల్లో మనసును బాగా ద్రవీభవించే స్వభావం ఈ కవితకుంది.

అనంతపురానికి 'నిజశత్రువులు' ఇద్దరే అంటారు. రఘుబాబు తన కవితలో "ఒకరు కరువు రక్కసి, మరొకరు రాజకీయ మృగం" ఈ రెండూ భూమి పుత్రులతో జూదమాడుతున్నాయంటాడు. రాజకీయ మృగం అంటే విడమరిచి చెప్పనవసరం ఉండదు కవిత చదివే వారికి సులభంగానే అర్థమవుతుంది.

గుత్తా హరిసర్వోత్తమనాయుడు స్వర్ణాంధ్రకు శవమెత్తు సంతకం' రాస్తూ "రైతు చాకలి బండ, ఎవడైనా రైతును పాలకులు పావుగానే వాడుకుంటున్నారనే విషయాన్ని వ్యక్తీకరించారు.

శ్రీనివాస్ అంకె 'పగిలిన పలుగు'గా రైతును అభివర్ణిస్తూ వ్యాపార క్షిపణిలో రైతు ఎంత నరకయాతన అనుభవిస్తున్నాడో ధ్వనిప్రాయంగా చెప్పారు. "పామాయిలుతో పోటీ పడలేని వేరుశనగ వేళ్లు, ప్రపంచీకరణ కళ్ల చెలిమల్లో ఇంకిపోతున్నాయి" అంటారు.

సింగమనేని నారాయణగారు "ఇక్కడ ఎర్రటి నేలలో నాగలి మొనదించి యుగాలుగా విత్తనాన్ని మొలకెత్తించే ప్రతి రైతు కవిత్వమే!... ఇక్కడ కవిత్వం సిగ్గు విడిచి సానుభూతి కోరదు... ఇక్కడి కవిత్వం మందుపాతరల విస్ఫోటనానికి సానుభూతి ప్రకటించదు" అంటారు. కవిత్వం అంటే ప్రజలనే కదా! ఆ ప్రజల విశ్వాసాల్లో ఉద్యమస్ఫూర్తినీ, రాజకీయ చైతన్యాన్ని రంగరించి తాగిస్తున్నారీ కవిత ద్వారా. ఈ సంకలనంలోని కవితల్లో ఇదొక బలమైన కవిత.

టి. రాజారామ్ ఉద్యమ స్ఫూర్తితో రైతుల్లో చైతన్యం నింపేటట్లు రాసిన కవిత 'రేపటి సూర్యులై మండుతారు" అనేది. ఒక విభిన్న వ్యక్తీకరణకు ఇదొక నిలువుటద్దంలా ఉంది" ఎంతో కోల్పోయింది ఈ నేల, మానాన్ని అభిమానాన్ని చివరకు ప్రాణాన్ని కూడా ఇప్పుడిక్కడ నాగలిపట్టే రైతులు లేరు, ఈ నేల నిఘంటువులో ఆ పదం తప్ప, ఆత్మహత్యల గాయమైన వాళ్ళు రేపటి సూర్యులై మండకపోరు" అంటారు.

రైతుల్ని సంఘటిత పరిచే స్వభావంతో డి. శిరీష 'బదులు చెప్పేదాక' అనే కవిత రాశారు. "నా, నీ, ఈ కరువునేలను, శపించ వద్దు, శాసించద్దు, నెర్రెలు బారిన నేలలో ఇంకుతున్న చెమటకు బదులు చెప్పమని - జవాబు చెప్పేదాకా - నిలేసి - నీ తలరాతను నీవే మార్చే, సరికొత్త శిలాశాసనాన్ని రాయి" అని ప్రబోధిస్తారు. ఇది ఒక రకంగా నిలదీసే కవిత్వం. నిలదీసే ధైర్యం, సాహసం రైతుకు అవసరంగా గుర్తించి ఈ కవితను రాశారు.

దస్తగిరి 'ఈ యుద్ధం ఆపొద్దు' అనే కవితలో ఆత్మహత్యలన్నీ హత్యలే అంటూ రైతుల ఆత్మగౌరవాన్ని నిలబెట్టారు. పాలకుల విధానాన్ని దుయ్యబట్టారు. తనదైన శైలిలో రాసిన కవిత ఇది. వై. శ్రీరాములు కరువుతో... రణం చేద్దామంటారు. అమరనాధరెడ్డి అనంతరైతన్నా, ఐక్యంగా తిరగబడరన్నా అని పిలుపునిచ్చారు. గుత్తాహరి సర్వోత్తమనాయుడు స్వర్ణాంధ్రకు శవమెత్తు సంతకం చేస్తూ "రైతు చాకలి బండ, ఎవడైనా బాధవచ్చు, పంచాయితీ నుండి ప్రపంచ బ్యాంకు దాకా, ప్రతివాడికీ రైతొక ఫిలాసఫీ" అంటూ వ్యంగ్యంగా ఎత్తిపొడుస్తున్నాడీ కవితలో. రాజకీయ జూదంలో రైతు పావు కావద్దని తపన పడుతున్నాడు. ఆకుల రఘురామయ్య జీవంలేని ఉగాదులను నిరసించాడు. వి. చంద్రశేఖర శాస్త్రి అనంతపురం మీద గద్దలాడుతున్న కరువు దృశ్యాన్ని కళ్ళ ముందుంచారు. సడ్లపల్లె చిదంబరరెడ్డి పెన్నేటి పదాల్ని ఆలపించారు. కెరె జగదీష్ ఆకలి నేలను కవన దుఃఖంతో ఆలింగనం చేసుకున్నారు. నందవరం కేశవరెడ్డి క్రూర స్పర్శ ఏదో కాదు కరువే అంటున్నారు. ఉద్దండం చంద్రశేఖర్ రైతుల చితికిన బతుకుల్ని తలపోశారు. కరువు సహాయం కోసం ఎదురు చూసే రైతన్నను బలంగా ఓదార్చారు. జి.వి. సాయిప్రసాద్ హృదయ విదారకమైన ఆకలిగానం వినిపించారు. నారాయణస్వామి శిథిలమైన రైతుల బతుకుల్ని తలుచుకుని తన కవితలో ఆవేదన చెందారు. సిద్దగిరి శ్రీనివాస్ మళ్ళీ అనంతపురం చిగురించకపోదనే భావనతో ఎదురు చూపులు చూస్తున్న ఆశ ఆయన కవిత్వంలో చిగురించే వుంది. బి.నాగిరెడ్డి రైతుల దీనస్థితి, వారి పిల్లల చదువులు, రుణభారం, అప్పులు ఇలా రైతును వెంటాడుతున్న సమస్యలు ఎన్నాళ్ళు, ఇంకెన్నాళ్ళు ఉంటాయని కవిత్వం ద్వారా ప్రశ్నిస్తున్నారు. ఎన్. నాగేశ్వరరావు రైతును ఆవహించిన సమస్యలన్నింటినీ స్మరించుకుంటూ పాడుకొనడానికి వీలుగానే రాశారు. "ప్రపంచ బ్యాంకు పాదపద్మాల ముందు, అనంతరైతు శిరస్సు అవనతమవుతున్నది... వేయితలల ప్రైవేట్ రాక్షసిని సహస్రబాహువులతో బంధించినప్పుడే" విముక్తంటారు డి. కృష్ణమూర్తి. నిషిద్ధరైతుని 'బతికించుకోవాలనే తపన బలంగా ఉంది ఈ కవితలో. క్రాంతికుమార్ ఆత్మహత్యల సాక్షిగా కవిత రాశారు. మోనోక్రోటోఫాస్ తాగి మరణించిన వెంకట రమణప్ప సాక్షిగా, ధర్మవరం లాడ్జిలో ఉరేసుకున్న కృష్ణారెడ్డి సాక్షిగా మంచి కవిత



Untitled-2 80 6/11/2002, 3:51 PM

## సామాజిక స్పృహ కలిగిన ఇతివృత్తాలు

# కథకు ప్రాణాధారం లాంటివి



కథ అయినా, కవితైనా వాటికి లక్ష్యం తప్పకుండా ఉండాలని, లేదంటే సామాజిక స్పృహ కలిగే ఇతివృత్తాలను తీసుకుంటే అవి రక్తికడతాయని ఆ రంగంలోని పేరొందిన సాహితీవేత్తలు సూచనలు చేశారు. రెండు రోజుల పాటు సాహితీస్రవంతి సంస్థ సుందరయ్య కళా నిలయంలో నిర్వహించిన వర్క్ షాప్‌లో కవిత, కథానిక ప్రక్రియల్లో ఈ అంశాలలో పేరొందిన వారు తమ సలహాలు, సూచనలు, అనుభవాలను వివరించారు. లక్ష్యాలు ఉండడం అవసరమని, ప్రజలను ఆలోచింపజేసే సాహిత్యం సమాజ వికాసానికి తోడ్పడుతుందని చెప్పారు. ఆదివారం ఉదయం 'జనకథాలోచనం'లో కథా రచయితలు ఓల్గా, కేతు విశ్వనాథరెడ్డి, ముక్తవరం పార్థసారధి, చంద్రశేఖర్ ఆజాద్, మహ్మద్ ఖాదిర్‌బాబు, హరిపురుషోత్తమరావు, రుక్మిణి తదితరులు పాల్గొన్నారు. ఇందులో వర్ధమాన రచయితలు కథారచనలో తమకు ఎదురైన సమస్యలను సభ దృష్టికి తీసుకువచ్చారు. ఒకే రచనలో నాలుగు మాండలికాలతో రచనలు చేయడంవల్ల అందరికీ అర్థమయ్యే వీలుందా అని, కథలకు అర్ధవంతమైన ముగింపు ఎలా ఇవ్వాలి, నిజ జీవితంలో ఎదురయ్యే సంఘటనలతో కథలను ఎలా మలచవచ్చు అనే సందేహాలను కథకులు పరిష్కరిస్తూ సూచనలు చేశారు. మధ్యాహ్నం జరిగిన జనకవనంలో ప్రసిద్ధ కవులు జ్వాలాముఖి, కె. శివారెడ్డి, ఏటుకూరి ప్రసాద్, దేవీప్రియ, ఘంటసాల నిర్మల, జింబో, యాకూబ్ వంటి వారు పాల్గొన్నారు. సాయంత్రం గురజాడ జయంతి సభను నిర్వహించారు.

**ఈనాడు**

### అలరించిన ఫొటో ప్రదర్శన

జన సాహిత్య సమ్మేళనంలో భాగంగా ఆదివారం పలువురు ప్రసిద్ధ రచయితల ఫొటో ఎగ్జిబిషన్‌ను సాహితీవేత్త హరిపురుషోత్తమరావు ప్రారంభించారు. సుందరయ్య విజ్ఞాన కేంద్రంలోని సెల్లార్‌లో ఏర్పాటు చేసిన ఈ ప్రదర్శనలో దేశ విదేశాలకు చెందిన ప్రసిద్ధ రచయితల ఫొటోలకు స్థానం కల్పించారు. ఫయిజ్ మహ్మద్ ఫయిజ్ (పాకిస్తాన్), మైఖెల్ షొలొకోవ్ (రష్యా), బెర్నార్డ్‌షా, టాల్ స్టాయ్, జాక్ లండన్, రోమోరోలా వంటి వారితోపాటు ఆదిభట్ల, జాషువా, త్రిపురనేని రామస్వామి చౌదరి, ఆరుద్ర, పింగళి, దాశరథి, చలం, మల్లాది రామకృష్ణశాస్త్రి, బుచ్చిబాబు, చెరబండరాజు, దేవులపల్లి, కాళోజి, గురజాడ, కందుకూరి వంటి వారి చిత్రపటాలు ఇందులో ఉన్నాయి.

**సెప్టెంబర్ 22, 2003**

రాశారు. నువ్వల నరేంద్రకుమార్ ఆకలి దప్పుల అంచున ఉన్న అనంతపురం గురించే రాస్తే, గాదిరాజు మధుసూదనరాజు 'ఏకరువు' కరువు కన్నీళ్ళను జ్ఞాపకం తెప్పించారు. కంబదూరు షేక్ నబీరసూల్ కరువు రక్కసి కాలనాగై కసిదీరా కాటేసిందని రోధిస్తున్నాడు. దుఃఖిస్తున్నాడు. ఆక్రోషిస్తున్నాడు. నాయకుల స్వభావాన్ని ఎత్తిచూపుతున్నాడు. రాయలసీమ రైతూ అంటూ కరణం రాజేశ్వరరావు చక్కని పద్యాలు రాశారు. "వరుణా! కరుణను జూపుము, తరుణములో వాననిమ్ము ధైర్యమ్మునిమ్ము" చెరువు కుంటలు నింపుమని వానదేవుణ్ణి వేడుకుంటూ ప్రార్థిస్తూ రాసిన పద్యాలు బహుపసందుగా ఉన్నాయి. అలాగే ఆశావాది ప్రకాశరావు రాసిన 'జూదమై సీమ సేద్యమ్ము...' అంటూ రాసిన పద్యం మనల్ని ద్రవీభవింప చేస్తుంది. "నీరమ్ము నమ్మిన నిర్మలాత్ములకెల్ల కన్నీటి ధారలే కాన్కయయ్యే.... ఏమి చెప్పనేర్తు తలచుకొన్నచో గుండెలు తల్లడిల్లు" అంటాడు పాఠకుని హృదయం ద్రవీభవించేట్లు రాశారు. ఏలూరు యంగన్న రాసిన పద్యాలు కూడా బహుహృద్యంగా ఉన్నాయి. "ఆరుగాలము శ్రమియింప అప్పులయ్యె, పుడమి తల్లిని సేవింప మోసమయ్యె, కష్టజీవుల బతుకు నికృష్టమయ్యె.... చెవిటి మేఘమైన చినుకులు రాల్చదు, గుడ్డి మేఘమైన కురువదాయె" అంటూ ఎంతో సున్నితంగా రాశారు.

పదమూడు మంది రచయిత్రులు ఇందులో కవిత్వం రాశారు. వీరిపై చిన్నపాటి వ్యాసం రాయవచ్చు. నిర్మలారాణి అభ్యుదయ భావాలుగల రచయిత్రి. తనదైన శైలిలో "ఈ నిశ్శబ్దాన్ని అంతం చేద్దాం" అంటూ సంఘటిత పరిచే స్వభావానికి బీజాలు వేస్తుంది. "గుండె బద్దలయ్యేలావున్న కన్నపేగు, మన కళ్ళముందే ఉరికొయ్యకు వేళ్ళాడుతుంటే గుండె సలపరాని అక్కా మౌనంగా ఇంక దిగమింగవద్దు" అని ప్రబోధిస్తుంది. ఆర్. శశికళ ఈ నేపథ్యం ఎంత విచిత్రం అంటూ "పురుగుల మందుల జోర్లు, నకిలీ విత్తనాల హోరు, డూప్లికేట్ ఎరువుల బారు... మాకేం పాపం తెలియదు అంతా మార్కెట్ మాయాజాలం" బజారు చీకటిని రైతుకళ్ళకు కట్టేట్టు రాశారు. చిలుకూరి దీవెన రెండో చినుకోసం నిరీక్షిస్తుంది. స్మృతుల్ని చక్కగా నెమరువేసింది. నేను వడ్డీకి తెచ్చుకున్న దుడ్లు, శెనక్కాయ విత్తనంగా మారి...." సున్నితంగా వ్యక్తీకరించింది తన మదిలోని భావుకతను. మోక్షప్రసూన అలనాటి రత్నాలసీమను ఒక పక్క కలగంటూనే వర్తమానాన్ని జ్ఞప్తికి తెచ్చేట్టు ఓ మంచి కవిత రాశారు. హేమమాలిని పూలమ్మిన చోట రాళ్ళ బతుకు శవమైపోతున్న దృశ్యాల్ని చూసి కవిత్వీకరించారు. గాయత్రీ ఆనంద్ అన్నదాత ఆర్తనాదాన్ని గొప్పగా వ్యక్తీకరించారు. యశోదాదేవి అనంత క్షామంను వర్ణిస్తూ "ఇక్కడి క్షామానికి భయపడి క్షేమం పారిపోయిందంటారు. నర్సమ్మ రైతును కాలినఆశలచెట్టుగా అభివర్ణించారు.

ఈ సంకలనాన్ని చదువుతుంటే ఆత్మహత్యలు చేసుకున్న రైతుల శవాలను సామూహికంగా ఊరేగింపు తీసి, దహన సంస్కారాలు అయిన తరువాత ఏర్పాటు చేసిన సంతాపసభలో చదివిన యాభై నాలుగు కవుల కవయిత్రుల కవితాగానమే ఈ సంకలనం అన్నట్లుగా ఉంది. వస్తువైవిధ్యాన్ని ఇష్టపడే వారు తప్పక చదవదగ్గ పుస్తకమిది.

V



Untitled-2 81 6/11/2002, 3:51 PM

కథ

శిరంశెట్టి కాంతారావు

# బగారా



***అ**డవిలో జంతువును మింగిన ‘ఊబి’లా నగరం...*

*అది రోడ్డు నాలుకను నాలుగు వైపులా సాచి తనలో కొస్తున్న వాహనాలను, మనుషులను మింగుతుంది.*

*కరువు మశూచికి భయపడి, బతకాలనే ఆశతో పల్లెల్లో జనం నగరం ‘ఊబి’లో కూరుకుపోతున్నారు...*

*“ఇస్త్రారీ! ఇస్త్రారీ! దిగండి, దిగండి” అంటూ లారీ కాబిన్‌లో నుండి దిగిన పోశాలు బాడీలో ఉన్న ఇస్త్రారిని గట్టిగా పిలిచాడు.*

బాడీలో కునికిపాట్లు పడుతున్న ఇస్త్రారితోపాటు, అతని భార్య గురవ్వ మిగతా వాళ్ళ ఊరి వాళ్ళూ ఉలిక్కిపడి లేచారు.

లారీ దిగిన వాళ్ళు ఎవరి మూట వాళ్ళు నెత్తిన పెట్టుకొని పోశాలుతో...

మనుషులకు అలవాటుపడని ‘జూ’లో జింక పిల్లల్లా బెదురు చూపులతో చుట్టూ కలెజూస్తూ పోశాలుండే గుడిసెల దగ్గరకు చేరుకున్నారు.

ఇస్త్రారికి అంతా ఏదో గుబులు గుబులుగా ఉంది. ఉరుకుతున్నట్టు నడుస్తున్న జనం. ఈ కార్లు, మేడలు, దుకాణాలు ఇవి ఎప్పుడు అతని కలల్లో కూడా రావు. ఎంత సేపు పెదరెడ్డి కొమ్మలదున్న, నాంచారమ్మ తరిపి బర్రె, నాంజొన్న తిని చచ్చిపోయిన దూదేకుల పేరు మియాజతపెయ్యలు తప్ప.

చైత్ర మాసంలో తల్లిని విడిచిపోయిన లేగదూడలా పల్లెను విడిచిన ఇస్త్రారి ఆలోచనల్లో పడ్డాడు.

D D D

“పోశాలు మావా! పట్నంకెల్లి ఎప్పుడొచ్చినవ్”

“నిన్ననే వస్తిని, ఇస్త్రారీ! ఇంటికాడ ముసలోల్లకు నూకలిచ్చి పోదామని వచ్చిన.” అన్నాడు పోశాలు.

పోశాలు కరువు పులికి భయపడి మూడు నెలల కిందట సిటీకి వెళ్ళాడు. పుట్టినప్పటి నుండి ఊరి పొలిమేరలు కూడా దాటని ఇస్త్రారిని, పోశాలు తనతోపాటు అప్పుడే సిటీకి రమ్మంటే...

“పోశాలు మావా! నాయాదికొచ్చిన కాన్నుండి ఊర్ని, జంగిల్ని నమ్ముకొని బత్కుతున్న. గిప్పుడు ఊరొదిలి రమ్మంటే, కట్టుకొయ్య వదిల్న ఎల్లావు లెక్క ఆగమైంది.”

“ఓరి పోరడా, ఇస్త్రారీ! గిప్పుడా ఊరే సుక్క సిన్కు లేక సచ్చిపోతాంది. జంగిలంతా కట్కోడి లారి కొట్క పోతాంది. ఇంకా నువ్ గిట్లనే జంగిలి, గింగిలి అనుకుంట ఊర్లనే ఉంటే పెళ్ళం, నల్లు ల్లెక్క మలమల మాడిసస్తరు” పోశాలు.

“ఏం సస్తంలేమావా! ఎవరో మా రాజులు ఊల్ల అంబలి పోస్తుంద్రుగా. ఇంత కారమో మెరెమో తిని ఊల్లెనే పడుంటం తియ్యి. ఇంతట్ల సిన్కు పడకపోద్దా?” దాట వేశాడు ఇస్త్రారి.

“సర్లే బిడ్డ నీ ఇష్టం. జర మా ఇంటి కాడ పెద్ద మడుసులుంటుంద్రు పదిలం”.

“గట్లనే మావా! సూస్టుంట తియి”

అదుగో అప్పుడు ఊరొదిలిపోవటానికి ఇష్టపడని ఇస్త్రారి, ఇప్పుడు పోశాలుతోపాటు భార్యా, ముగ్గురు పిల్లల్ని వెంట బెట్టుకొని మరికొందరు ఊరోళ్ళతో కలిసి సిటీకి వచ్చాడు.

“ఓర్నీ యవ్వ, ఇస్త్రారీ! ఏందిరోగట్ల తలకాయ పట్టక కూకుంటివి?” అన్నాడు పోశాలు. దీర్ఘంగా ఆలోచిస్తున్న ఇస్త్రారితో.

ఉలిక్కిపడ్డ ఇస్త్రారి “ఏం లేదు మావా! గీ ఊరు, ఈ



Untitled-2 82 6/11/2002, 3:51 PM

మడుసులు, ఇండ్లు అంత ఏందో గత్తర, గత్తర గుంది"

"మొదట్ల గట్లనే అన్పిస్తది వాయ్. నాల్గుదినాలు పోతే నీకే సమజైద్దిలే."

"ఏం సమజైద్దో ఏమో మావా"

ఇదంతా వింటున్న గురవ్వ....

"గట్ల గుబులు పడకయ్యా! గీల్లందరు ఎట్లుంటుంట్రో మనం గిట్లనే ఉందాం. గీవుల్ల మనం బొంద్రాయి ఏస్తన్నమా? పొల్మెరతొక్కుతున్నమా? ఏదో నాల్గు దినాలు పొద్దుపుచ్చుకొని మన జాగల మనం బోనాం. బిడ్డల్ని బత్కిచ్చుకుంద్కి అరిచంద్ర మారాజు లెక్క ఊరిడిచినం.

ముగశిరకార్తె జొరబడంగనే ఎట్లైన సిన్కుబడుద్ది. గప్పుడు మనూర్ల సార్లు బోస్తరు. దుక్కుల్ గొడ్తర్, పెసర్లు, పల్లికాయబెడ్తర్. జంగిలి కాపుకొస్తది. భూంతల్లి సిగురు బెడ్తది. గప్పుడు మనకు, పోరగాళ్ళకు ఇంత గంజి దొరుకుద్ది. నీకాల్మొక్త అప్పటి దాక కడ్పుల గుబులు పెట్టుకోకుండ పోశాలు కక్కయ్య సెప్పినట్టు ఇను." అంటూ భర్తకు ధైర్యం చెప్పింది.

"గురవ్వ! పోరగాల్లం, మనం సల్లంగ మనూరు జేర్తె, జంగిలి పట్నంక శానమాసంల మన పూలకోడి పుంజును ముత్తాలమ్మకు పెట్టుకుందాం" అన్నాడు భార్య మాటలతో కొంచం ధైర్యం తెచ్చుకున్న ఇస్తారి.

"గట్లనే పెడ్దాం. గా నాంచారమ్మ కోడి పిల్లల్ని ఎట్ల జూస్కుంటుందో ఏమో"

"ఎట్లనో జూస్కుంది తియి" అన్నాడు ఇస్తారి.



"మీ ఇద్దరు గిట్ల గోరింకల్లెక్క ముక్కు, ముక్కు రాస్కుంట ముచ్చెట్లు సెప్పుకుంట కూకుంటె ముద్దెట్ల దొర్కుద్ది" అన్నాడు పోశాలు.

D D D

గురవ్వ, ఇస్తార్లు పొద్దున్నే ఇంత ఉడకేసుకొని చంటిపిల్ల వాణ్ణి బడికట్టుకొని మిగతా ఇద్దరు పిల్లల్ని గుడిసెలో ఉంచి పోశాలు వాళ్ళతో అడ్డ మీదికి వెళ్ళారు.

మేస్త్రీలొచ్చి తలా కొంత మందిని తీసుకుపోతున్నారు.

మోటుగా జబ్బపుష్టితో ఉన్న ఇస్తార్ని రమ్మంటు, పిల్లతల్లి కాబట్టి గురవ్వను వద్దంటున్నారు.

ఒక మేస్త్రీతో గురవ్వ "అందరు గట్లంటె ఎట్లమేస్త్రీ. ఆల్ మొగలం, పైటి బువ్వగూడ కల్పితెచ్చుకుంటిమి. గట్లనకుండ్రి పిల్లలు గలోల్లం. నీ కాల్మొక్త. గా దేవుడి నోట్ల మన్నుగొట్ట వాన సిన్కు పడకపాయ. ఊర్ల సెర్వ్య నిండితె, గిటు దిక్కొచ్చేటోల్లమా?! గీ పన్లు సేసేటోల్లమా? జరుగుబాటు లేక పొట్టకూటి కోసమొస్తిమి. మీకు మాత్రం పోరల్లేరా? సంటిపిల్ల తల్లివని గిట్ల వద్దంట్రుండ్రు" అంటూ అతన్ని ఊపిరి కూడా సలపకుండా మాట్లాడి ఇస్తారితో సహా పని సంపాదించింది.

D D D

ఇస్తారి, గురవ్వలు సిటీకొచ్చి రోజులు వారాలౌతున్నాయి.

ఎక్కడా వాన చినుకు జాడేలేదు.

అందరు కూలీల లాగే ఇస్తారి, గురవ్వలు అడ్డమీది కొస్తూనే ఉన్నారు.

ఊళ్ళ నుండి వచ్చే కూలీ లెక్కువై పనులు కూడా దొరకటం లేదు. ఒక రోజు పని దొరికితే నాలుగు రోజులు ఖాళీ.

సిటీలో రోజు రోజుకు నీళ్ళ కరువు ఎక్కువై ఎక్కడి నిర్మాణాలు అక్కడే ఆగిపోయ్యాయి. సుతారు పన్లు అసలు దొరకటమే లేదు.

గురవ్వ, ఇస్తారీలు తిండికి కటకట పడుతున్నారు. దొరికిన దాంట్లో ఇంత పిల్లలకు పెట్టి వాళ్ళు ఒక్కోపూట పస్తులుంటున్నారు.

D D D

ఆ రోజు అడ్డంతా గోలగోలగా ఉంది.

ఎవరేం మాట్లాడుతున్నారో ఎవరి అర్థం కానంత రద్దీగా ఉంది.

అప్పుడో పెద్ద పూల పడవ లాంటి కారొకటొచ్చి మెల్లగా అడ్డమీద ఆగింది. దాన్లో నుండి పూలకన్నా సున్నితమైన మనుషులు విలాసంగా దిగారు.

వాళ్ళల్లో ఒకర్ని సేట్ చమన్‌లాల్‌గా గుర్తు పట్టి మేస్త్రీలంతా కారు దగ్గరికి గబగబా పరుగెత్తి వినయంగా...

"ఏం సేట్! ఏమో వచ్చింద్రు?

'మనుషులు కావాల్నా"

"ఏం పని సేట్" ఒకర్ని మించి ఒకరు పోటీలు పడి అడిగారు.

"ఏం లేదు. మా ఇంట్లో హమారా బేటా షాదీ ఉంది. రేపు రాత్రి బారాత్. లైట్లు మోసేందుకు కూలీలు కావాలి" అంటు చేతిలో సెల్‌ఫోన్‌తో ఆడుకుంటున్నాడు.

"ఎంత మంది కావాల సేట్"

"యాభై మంది"

"రెండు పూటల భోజనం పెడ్తాం. కూలెంతో చెప్పండి" ఇస్తారి, గురవ్వలు పని చేసే మేస్త్రీనే అడిగాడు సేట్.

"నా కమిషన్ పోను యాభై రూపాయలిప్పించండి సేట్" మేస్త్రి.

"కూలీలు పనుల్లేక ఛస్తుంటే! యాభై రూపాయలా! నీ కమిషన్ పోను నలభై ఇస్తా. నీ కిష్టమైతే రేపు పదింటికి మా ఇంటికి తీసుకురా" అన్నాడు సేట్.

"అట్లనే సేట్! తీసుకొస్తలే" మేస్త్రి

''ఏలేవ్'' అంటూ అడ్వాన్స్‌గా ఓ వెయ్యి రూపాయలు మేస్త్రికిచ్చి వెళ్ళిపోయాడు సేట్. మేస్త్రి కూలీలకు తలా పదిహేను రూపాయలు అడ్వాన్స్ ఇచ్చి "రేప్పొద్దున్నే ఎనిమిదింటికల్లా అడ్డకాడ ఉండాలి" అన్నాడు.

D D D

ఇస్తారి, గురవ్వలు హడావిడిగా తయారైనారు.

అడ్డదగ్గరకు బయలుదేరుతూ గురవ్వ పిల్లలతో "రోడ్డు మీద్కి పోకుండ్రి బిడ్డా! మేం వచ్చే తల్కి శానపొద్దు పోద్ది. పొద్దు గూకంగనే ఇంత తిని పండుకోండ్రి. వచ్చేటప్పుడు బెల్లప్పలు తెస్తం" అంటు ఒకటికి నాలుగు సార్లు జాగర్తలు సెప్పింది.

ఇస్తారి, గురవ్వలు కూలీలందరితోపాటు అడ్డ మీదికి చేరేటప్పటికి అక్కడ మేస్త్రీతో సహా వాళ్ళను తీసుకుపోవటానికి ఓ మినీ వ్యాను రెడీగా ఉంది.

D D D

పెళ్ళి పందిట్లో కూలీలు ఎవరి పనులు వాళ్ళు ఊపిరి సలపకుండా మధ్యాహ్నం మూడు గంటల వరకు చేస్తూనే వున్నారు.

పని వత్తిడితో గురవ్వ ఒడిలో ఉన్న పిల్లవాడు పాలకోసం ఏడుస్తున్నా ఇవ్వలేక పోతుంది. తల్లి మనసు ఆగలేక గబగబా పాలిస్తుంటే పెళ్ళి పనులు చేయించే పెద్ద మనిషి చిర్రుబుర్రులాడుతు" ఇట్లాంటోళ్ళు పనికెందుకొస్తారు" అన్నాడు.

"ఏం జేయాలదొరా! గరీబోళ్ళం. పోరడు కక్కటిల్లుతుంటె, బుక్కెడు పాలిస్తున్న బాంచన్ అంటు గురవ్వ సర్ది చెబుతున్నా వినకుండా, అతను మేస్త్రి మీద ఎగిరి పడ్డాడు.



Untitled-2 83 6/11/2002, 3:51 PM

మేస్త్రి గురవ్వ దగగరకొచ్చి "ఏం గురవ్వా! మాటలతో బుకాయించటానికిది సుతారిపని కాదు. పెళ్ళిపని. పెద్దోళ్ళతో నాకు మాటొస్తది. నువ్ చేసిన కాడికి చాలుగాని ఇంటికి పో" అంటూ కసిరిచ్చుకున్నాడు.

మేస్త్రి కసిరించుడుతో గురవ్వ భయం భయంగానే "ఏంది మేస్త్రి! నువ్వు కూడా గాదొర తీర్గనే మాట్లాడబడ్తివి. నేనేం పని దొంగనా? పోరడు పాలకుతి లేసి బుక్క పడ్తుంటే గిన్ని పాలిచ్చిన గదిగూడ సెప్పిన పని జల్ది, జల్ది చేస్కుంటనే ఇచ్చిన" అంది.

"ధూ, నీయవ్వ! ఇయాత్రపు ఊర్లకెళ్ళి వొచ్చి నోళ్ళకు కూడా సెప్పలేకపోతున్నం" అంటూ మేస్త్రి తదుతుదులాడుతూ వెళ్ళిపోయ్యాడు.

గురవ్వకు పొద్దు నెప్పుడో తిన్న సద్ది మెతుకులు తిరిగి పొయ్యి కళ్ళు తిరుగుతున్నట్టు అన్పిస్తున్నా పళ్ళ బిగువున చెప్పిన పని చేస్తుంది. పాలు రాక చంటి పిల్లగాడు మాటి మాటికీ ఏడుస్తుంటే గురవ్వ కళ్ళల్లో నీళ్ళు తిరుగుతున్నాయి.

ఇస్తారి పని ఇంతకంటే అధ్వానంగా ఉంది. అసలే తిండి పుష్టి ఉన్న మనిషి. గంజో, గటకో వేళకు తినకపోతే ఊరకే గేరొస్తుంది. అలాంటిది మూడు గంటలైనా ముద్దపెట్టక పోగా పని మీద పని చెబుతుంటే ఆకలితో నకనకలాడుతూ ఏమి చేయలేక కాలు కాలిన పిల్లిలాగా తిరగసాగాడు.

ఆఖరికి మూడు గంటల తరువాత కూలీలందరిని భోజనాలకు కూర్చోబెట్టారు. పని చేసీ, చేసీ ఖాళీ కడుపుతో ఉన్న ఇస్తారి, గురవ్వలు నాలుగు స్వీట్లు, ఇంత 'బగారా' అన్నం తినే సరికే కడుపు నిండినట్లనిపించి ఆకులు మడిచారు.



D D D

సాయంకాలం ఆరు గంటలౌతుంది....

ఎర్రగా మంద్రగబ్బిల్లా తళతళ లాడుతూ వ్యాన్‌లో నుండి పెట్రొమాక్స్ లైట్లు దిగాయి.

నెత్తురు రంగులో ఉన్న డ్రైవాష్ చేసిన చెమ్కి పూల డ్రస్సూ దిగింది.

బారాత్ పెళ్ళి కొడుకు బయలుదేరు తున్నాడు.

కార్లు బార్లు తీరుతున్నాయి.

దేవకన్యల్లాంటి ఆడవాళ్ళు వంటినిండా మేకప్పుతో తయారైనారు.

బాణా సంచాకాల్చే వాళ్ళు అన్నీ సిద్ధం చేసుకున్నారు.

అప్పుడు...

వ్యాన్లో నుండి దిగిన డ్రస్సులు, లైట్లు కూలీలందరికీ అందజేయబడ్డాయి.

ఇస్తారి, గురవ్వలకు అనుభవం లేని పని, అంతా కొత్తకొత్తగా, బెరుకు, బెరుగ్గా ఉంది.

ఎర్రచీర చుట్టుకొని తనవైపు తనే చూసుకున్న గురవ్వకు, దసరానాడు పెరట్లో చింతకొమ్మకు తిత్తితీసి వేలాడదీసిన మేకపిల్ల మదిలో కొచ్చింది.

ఇస్తారికి డ్రస్సు తొడుక్కుంటుంటే ఊర్ల ఈర్ల కొలుపుకు తయారు చేస్తున్న గొర్రెపోతు కళ్ళ ముందు కదలాడింది.

బారాత్ మొదలైంది....

ముందు బ్యాండు మేళం. దానికంటే ముందు బాణా సంచా కాల్చే వాళ్ళు. బ్యాండు వెనుక నెత్తి మీద పెట్రో మాక్స్‌లైట్లతో జంటలు, జంటలుగా గిరిరాజ కోళ్ళలాగా డ్రస్సుల్లో కూలీలు వాళ్ళ వెనుక ఓపెన్ టాప్ కార్లో బారాత్ పెళ్ళి కొడుకు.

ఇస్తారి, మగ కూలీల వరుసలో

గురవ్వ, వీపు మీద జోలెలో పిల్లగాడితో ఆడకూలీల వరుసలో డ్యాన్స్‌లు, కేరింతలు, జోకులు ఒకటే కోలాహలం. ఇందరి మధ్య కవాతు చేస్తున్న జవానుల్లా మెల మెల్లగా వరుసల్లో నెత్తి మీది లైట్లతో కదులుతున్న కూలీలు.

ఉన్నట్టుండి "ఢాం, ఢాం, ఢాం, డం, డం, డం, డం... ఫట్, ఫట్, ఫట్ ట్ ట్" పిడుగులు పడ్డట్టు బాణా సంచామోతలు.

గురవ్వ వీపు మీద పిల్లవాడు అదిరిపడి భయంతో కెవ్వున కేక పెట్టాడు. గురవ్వ గుండెల్లో డైనమెట్లు పేలినట్లయింది. అయినా ఆగేటట్టు లేదు. పక్కకు జరిగేటట్టూ లేదు. పిల్లవాడి ఏడుపు వినలేక ఉప్పెనలా ఎగిసి వస్తున్న దుఃఖం ఏమీ చేయలేని నిస్సహాయత.

"ఢాం, ఫట్ ఫట్ చర్రుర్రుర్రు ఛట్ ఛట్" మళ్ళీ మోతలు.

అసలే భయంతో ఏడుస్తున్న పిల్లవాడు ఇంకా భయంతో గుక్క పెట్టి చప్పుడు కూడా బయటికి విన్పించటంలేదు.

గురవ్వ ఒక చేత్తో నెత్తి మీది లైట్ పట్టుకొని, రెండో చేతిని వీపు వెనక్కి పోనిచ్చి జోలెలో పిల్లవాన్ని సముదాయించసాగింది. అయినా, వాడు కాళ్ళూ, చేతులు కొట్టుకుంటూనే ఉన్నాడు.

డ్యాన్స్‌లు ఊపందుకున్నాయి.

బ్యాండు తారా స్థాయిలో మోగుతుంది.

బాణా సంచా మోతలకు చెవులు దిబ్బెళ్ళు వేస్తున్నాయి. వాటి వెలుగులకు కళ్ళు మసకలు వారుతున్నాయి.

ఆ ధ్వనిలో పిల్లవాడి ఏడుపు గురవ్వకు తప్ప ఎవరికీ విన్పించటంలేదు. వరుసలో నుండి తప్పుకుందామా! అనుకుంటే పెండ్లి పెద్ద ముఖం ఒకవైపు, మేస్త్రి ముఖం ఒక వైపు పులుల్లా కన్పిస్తున్నాయి. చేతులు పీకుతున్నాయి. ఏడుపు తన్నుకొస్తుంది.

ఏడ్చీ, ఏడ్చీ నోరెండిపోయిన పిల్లవాడు స్పృహతప్పి జోలెలో తలవాల్చాడు. గురవ్వ దుఃఖం చెఱువు తెగి, కళ్ళ తూములగుండా నీళ్ళు వరదలై పారుతున్నాయి.

గురవ్వ అవస్థ, పిల్లవాడి పరిస్థితి గమనిస్తూ రెండో వరుసలో నడుస్తున్న ఇస్తారి కాళ్ళు నేల మీద ఆనక ఉక్కిరి, బిక్కిరౌతూ ఆగిపొయ్యాడు.

"హే, హే! నడ్వు, నడ్వు మద్దెన ఆగుతవేంది?" అంటూ వెనుక వస్తున్న వాళ్ళు ముందుకు తోస్తుంటే, ఊబిలో కూరుకు ఊపిరాడని జంతువుల్లా మౌనంగా రోదిస్తూ గురవ్వ ఇస్తారీలు రైలు పట్టాల్లా నడుస్తూనే ఉన్నారు.

రాత్రి రెండు గంటలకఉ నెత్తి మీది లైట్లు దించారు.

గురవ్వ గుండెల్లో భయం బుసలు కొడుతుంటే తిమ్మిరెక్కిన చేతులతోనే పిల్లవాన్ని తీసుకుంది. ఎక్కడలేని ఆందోళనతో వాణ్ణి పట్టుకుని చూస్తుంది.

చుట్టూ ఉన్న వాళ్ళు "పెండ్లి పందిట్లో ఏమిటీగోల" అంటూ బయటికి గెంటి వేశారు.

అప్పటి దాకా తినడానికి కూడా కుదరని మిగతా కూలీలు తలా ఇంత 'బగారా' అన్నం కూరలూ తెచ్చుకొని, పిల్లవాణ్ణి పారేసి వచ్చాక ఆ తెల్లవారి తిన్నారు.

ఏమీ తినకుండా ఉంది ఇస్తారి, గురవ్వలే

తిన్న రెండు గంటకు కూలీలు, వాళ్ళ పిల్లలు వాంతులు, విరేచనాలతో చావు బతుకుల మధ్య ధర్మాసుపత్రిలో చేరారు.

డాక్టర్లు ఎంత ప్రయత్నం చేసినా ఆ సాయంత్రానికి చాలా మంది కూలీలతోపాటు గురవ్వ, ఇస్తారీల ఇద్దరు పిల్లలూ పెద్దల్లో కలిసిపొయ్యారు. ఊర్లో పూలకోడి పుంజును పిల్లెత్తుకుపోయింది. V



Untitled-2 84 6/11/2002, 3:51 PM

# సమీక్షా పర్వం


- సినీ సుమాలు
- దుక్కిచూపు
- చెదిరిన సమాజం
- లక్ష్మీరాజం కథలు
- వార్తా వ్యాఖ్య
- ప్రజాసాహితి
- మైదానం లోతుల్లోకి...
- ఇతివృత్తం


**పీపీ**




## మంచి సినిమాలపై మనోజ్ఞ గ్రంథం

తెలుగులో సినిమా రంగం గురించి సీరియస్‌గా రాసే వారిలో వారాల ఆనంద్ ఒకరు. అందులోనూ చాలా మంది సినీ వ్యాఖ్యతలలా ఆయనకు కమర్షియల్ సినిమా హంగులు రంగుల పట్ల పెద్ద ఆకర్షణ వున్నట్టుకనిపించదు. సామాజిక చైతన్య స్పోరకమైన సమాంతర సినిమాల గురించే ఎక్కువగా ఆలోచిస్తూ వుంటారు. మెయిన్ స్ట్రీమ్ సినిమాలో కూడా ప్రతిభావంతులను వారి ప్రయత్నాలను ఆయన బాగా పట్టించుకుంటారు. తాజాగా వెలువడిన " సినీ సుమాలు" పుస్తకం వారాల ఆనంద్ అందించిన మరో మంచి కానుక.

దాదాపు రెండు వందల పేజీలున్న ఈ అందమైన పుస్తకంలో ఆనంద్ 70 కళాఖండాలను పాఠకులకు పరిచయం చేశారు. వాటి కళాత్మక విలువలను సామాజిక సారాంశాన్ని సాక్షాత్కరింపచేశారు. అటు సినిమా, ఇటు సమాజం రెంటినీ చలనంలో చూస్తూ వ్యాఖ్యానించడం, విశ్లేషించడం ఈ పుస్తకం ప్రత్యేకత. అలాగే ఆయా చిత్రాలను గురించి చెప్పే సందర్భంలోనే వాటి దర్శకుల ప్రత్యేకతలను కూడా చెబుతారు. వాటిలో ప్రధాన పాత్రలు ధరించిన నటీమణుల విశిష్టతను వివరిస్తారు. అందుకే ఈ పుస్తకం చదువుతుంటే సినిమాలగురించి మాత్రమే గాక సినిమా మీడియం గురించి కూడా విశాలమైన అవగాహన కలిగినట్లవుతుంది. సందర్భవశాత్తూ సామాజిక విషయాలను కూడా సృశిస్తాడు. అర్థవంతమైన వ్యాఖ్యానాలు చేస్తాడు. ఇవన్నీ పుస్తకం విలువ పెరగడానికి దోహదం చేశాయి. సమాంతర సినిమాలు, అవార్డు సినిమాలలో చాలా భాగం ప్రేక్షకులకు చేరవు. ఫిలిం సొసైటీల పుణ్యాన ఒకప్పుడు కొంతవరకైనా ఆ పని జరిగేది. కాని టీవీ విస్తరణ తర్వాత అవీ తగ్గుముఖం పట్టాయి. దూరదర్శన్ వేళకాని వేళలలో వేయడం తప్పిస్తే ఈ సినిమాలు ఏ ఛానల్స్‌లోనూ రావు. అందుకే ఇలా చదివి ఆనందించడమే చేయగలిగింది. అక్షరాలలోనే ఆనంద్ మసాల సినిమాకు మంచి సినిమాకు వుండే తేడాను తెలియజెప్పడం విశేషం. ఫార్ములా సినిమాల్లో పాత్రలు, సంఘటనలు అన్నీ పూర్వ నిర్ధారితాలు. వాటిలో పాత్రల మానసిక ఘర్షణ వైరుధ్యాలు వుండవు. హీరోలు– విలన్లు మాత్రమే వుంటారు. కాని వాస్తవ జీవితంలో అలాకాక మంచి చెడ్డ భావనల మధ్య ఘర్షణ సాగుతూనే వుంటుంది. ముఖ్యంగా మానవ సంబంధాలు అందులోనూ స్త్రీ పురుష సంబంధాలలో అసమానతలు, అవాంఛనీయతల ప్రభావం చాలా వుంటుంది. ప్రతిభావంతులైన దర్శకులు చాలా మంది ఈ అంశాన్నే ప్రధానంగా తీసుకున్నట్టు పుస్తకంలో గమనిస్తాము. పేరుకు తగినట్టే ఈ పుస్తకంలో ఎక్కువగా స్త్రీ సమస్య ప్రధానమైన సినిమాల పరామర్శ వుంది. అందులోనూ మధ్య తరగతి, ఉన్నత తరగతితో పాటు అట్టడుగు వర్గాల జీవితాలను చిత్రించిన సినిమాల పరిచయమూ వుంది. తెలుగులో అలనాటి మల్లీపెళ్లి, సుమంగళి వంటి సినిమాలనుంచి దాసి వరకూ దీనిలో చూడగలుగుతాము. అయితే ప్రత్యగాత్మ స్త్రీగాని, క్రాంతి కుమార్ తీసిన స్వాతి, 9 నెలలు వంటివికాని ఇందులో చోటు చేసుకోక పోవడం ఒక వెలితి. ఎన్ని పరిమితులున్నా ఆ సినిమాలు స్త్రీల చైతన్యం దృష్టితో తీసినవేనని మరచిపోకూడదు. సినీ పరిశ్రమలో మాడిపోయిన మందారం లాటి మీనాకుమారిని ముళ్ల పొదలో చిక్కిన రోజా పువ్వులా చూపే అర్థవంతమైన ముఖచిత్రం బాగా అమరింది. మొత్తంపైన ఈ పుస్తకం చదువుతుంటే ఉత్తమచిత్రాభిరుచి గల ప్రేక్షకులు దాదాపు మూడు దశాబ్దాల మేలిబంతులను సందర్శించిన అనుభూతిపొందుతారు. ఈ వివరాలన్ని సేకరించడానికి వారాల ఆనంద్ చాల శ్రద్ధ శ్రమ తీసుకుని వుంటారు. అందువల్లనే **రు.120 ధర ఈ తరహా పుస్తకానికి పెద్ద ఎక్కువనిపించదు. పేజీలు : 198. ఫిలిం ఫౌండేషన్ ప్రచురణలు.**



Untitled-2 85 6/11/2002, 3:51 PM

జె.ఎస్.




## రైతు జీవిత చిత్రం దుక్కిచూపు

ఛిద్రమవుతున్న వ్యవసాయరంగంపై, రైతుల కడగండ్లపై కవులు వేదనతో రచనలు చేస్తున్నారు. ప్రపంచీకరణ ప్రారంభమైన తొలినాళ్ళలోనే బలిపీఠంపై విలవిల్లాడింది రైతు. 'పొలికేక', ముంతపొగ వంటి దీర్ఘకావ్యాల అంతర్వాచకంగా 'దుక్కిచూపు' వచ్చింది. కొండ్రెడ్డి వెంకటేశ్వరరెడ్డి రైతుల కడగండ్లను, వాటికి గల కారణాలను రాజకీయార్థిక దృష్టితో బలంగా వ్యక్తీకరించారు.

పొలికేక, ముంతపొగ, దుక్కిచూపు; ఈ మూడూ గాఢ వ్యక్తీకరణను ప్రదర్శించాయి. వస్తువు విషయంలో మూడిటి మధ్య సారూప్యత ఉంది. కవిత్వ గుణంలో సామీప్యత ఉంది. యే రచనైనా పూర్వరచనల కొనసాగింపని అంగీకరించిందే! అయితే పూర్వరచన నుండి ఎంతో కొంత భేదిస్తుంది. ఈ భేదకత (Opposition) వల్లనే ఆ రచనకు విలువ, గుర్తింపు ఏర్పడ్డాయి. దీన్నే జూలిక్రిస్టీవా 'అంతర్వాచకం' (Inter Textuaity) అంది. 'దుక్కిచూపు' పూర్వ దీర్ఘరైతు కావ్యాల నుండి భేదిస్తుంది. అందువల్లే దీనికి ఓ విలువ, గుర్తింపు ఉంది.

ఈ కవిత్వంలోని రూపకాల్ని, సిమిలీలను చర్చించవచ్చు. కవితా మూలకాలవల్లనే వస్తువు కవిత్వంగా రూపాంతరం చెందుతుంది. ఈ క్రమంలోనే సాధారణ భాష అధిభాష (Meta Language) గా మారుతుంది.

ఆ చర్చ చేసేముందు సామాజిక సంబంధంలో రచన స్థానం, రచన వెలువడిన సామాజిక సందర్భాన్ని వీక్షించడం అవసరం.

ఖచ్చితంగా చెప్పాలంటే డెబ్బయ్యోవ దశకం నుండే వ్యవసాయ రంగ క్షీణత ఆరంభమైంది. వ్యవసాయ రంగానికి బడ్జెట్‌లో ప్రాధాన్యత తగ్గడం, నిధులకుదింపు అప్పుడే ప్రారంభం అయింది. ఎనభయ్యో దశకం ఉత్తరార్థం వరకు రైతులు కష్టాలు పడ్తున్నారు. సేద్యానికి ఉపక్రమించడం కష్టంగా మారింది. అయితే హరితవిప్లవ ఫలితాన్ని అందిపుచ్చుకున్న భూస్వాములు, ధనికరైతులు లాభపడ్డారు. ఆ అదనపు లాభంతో వ్యవసాయేతర రంగాలవైపు షిఫ్ట్ అవాల్సిన అనివార్య చలనం జరిగింది.

ఇండియా పాలకవర్గాల్లో పెట్టుబడిదారుల ప్రాధాన్యత ప్రాబల్యం పెరుగుతున్నకొద్దీ పారిశ్రామికరంగానికి రాయితీలు, వ్యవసాయరంగానికి కోత మొదలైంది. నూతనార్థిక విధానాలు ప్రారంభం కావడంతో అదింకా తీవ్రమైంది. వీటిని ఆహ్వానించింది భారత ధనికవర్గం. వారితోపాటు వ్యవసాయ భూస్వాములు, ధనికరైతులు. ఈ వ్యవస్థలో మిగిలిపోయిన అర్ధ భూస్వామ్య వ్యవస్థ నూతన విధానంతో శిథిలావస్థకు చేరడం వ్యవస్థ సహజ పరిణామం. ఇదెప్పుడో జరగాల్సింది. యూరప్ దేశాల్లో ఎప్పుడో జరిగింది.

గ్రామీణ భూస్వామ్య కుల వ్యవస్థకు పెద్ద దెబ్బే తాకింది. ప్రపంచీకరణవల్ల భూస్వాములు పారిశ్రామిక విద్యావైద్య రంగాలకు షిఫ్ట్ అయ్యారు. మధ్యతరగతి రైతులు, ధనిక రైతులు గ్రామీణ కుల స్వభావంతో వ్యవహరించే దానికి, స్పష్టంగా చెబితే జీవించే దానికి భిన్నంగా సంక్షోభిత సేద్యరంగం నుండి నిష్క్రమించక తప్పటం లేదు. వీరిప్పుడు పట్టణాల్లో దళిత శ్రామిక వర్గంలా కూలిపనుల కోసం వెంపర్లాడుతున్నారు.

అయితే మునిగిపోతున్న సేద్యరంగం నుండి ఆధునిక పారిశ్రామిక జీవితానికి మారలేని మధ్యతరగతి, పూర్వ భూస్వామ్య అగ్రకుల రైతు కుటుంబాలు సంక్షోభాన్నెదుర్కొంటున్నాయి. వారిలో అసహనం, అపనమ్మకం రేగి అశాంతిగా మారింది.

అలాంటి అసహనం 'దుక్కిచూపు'లో కన్పిస్తుంది. వ్యవసాయిక వైభవాన్ని అనుభవించిన అగ్రకుల రైతు కుటుంబాలు పూర్వ స్మృతుల్ని తలచుకొని బాధపడుతున్నై. నిజానికీ పరిణామక్రమం సహజమైంది. ఈ నేపథ్యంలోనే రైతులపై వచ్చిన కావ్యాలకి విలువ కట్టాలి. పొలికేక నుండి దుక్కిచూపు వరకు వచ్చిన రైతు కావ్యాలు ప్రపంచీకరణను నిరసించినా, వాటి ఉద్దేశిత వ్యక్తీకరణ మాత్రం పూర్వవైభవ స్మృతుల నెమరు, చేదు అనుభవాల సమకాలీన స్థితిపై ఆగ్రహం ప్రకటించడమే అన్నది అవగతాంశం. ఈ రచనలకు రైతులపై ఉన్న ప్రేమ వ్యవసాయ కూలీలపై లేనందువల్లనే ఎక్కడా వారి ప్రస్తావన కన్పించదు.

'దుక్కిచూపు' కావ్యం వ్యవస్థలోని అన్ని అంశాల్ని విమర్శకు పెట్టింది. అవినీతి, దోపిడి, ప్రభుత్వాల వైఫల్యం అన్నిట్నీ ఆవేశపూరిత వ్యంగ్యంతో విమర్శించారు. అయితే ఆగ్రహంవల్లనే చాలాసార్లు కవిత్వం బదులు సాధారణ వాక్యాలు పద్దాయి. ఆవేశం కవిత్వంగా మారాలంటే అనుభూతి ముద్దగా రచనలో పర్చుకోవాలి. అయితే వంద పేజీల దీర్ఘకవితను నిర్వహించడం కష్టం గాబట్టి చిన్న లోపాల్ని పరిగణనలోకి తీసుకోవద్దు. కాని, కవి కవిత్వ గ్రహణ, వ్యక్తీకరణలో రాబోయే రచనల్లో గాఢతను సాధిస్తాడని ఆశించాలి. కవర్‌పేజీపై వేసిన బొమ్మలు బాగున్నై.

***దుక్కిచూపు (దీర్ఘకవిత), కొండ్రెడ్డి వెంకటేశ్వరరెడ్డి, ప్రతులకు : కొండ్రెడ్డి వెంకటేశ్వరరెడ్డి, కొత్తపేట, కనిగిరి, ప్రకాశం జిల్లా-523230. వెల:రు.30/-***

పినాకి




## చెదిరిన సమాజం

నైజీరియన్ రచయిత చినువా అబెబె 1958లో ప్రచురించిన నవల Things Fall Apart కు కొలసాని సాంబశివరావు తెలుగు అనువాదం యిది. ఆఫ్రికా ఖండంలోకెల్లా పెద్ద దేశం నైజీరియా. వలస దురాక్రమణవల్ల విధ్వంసమైన అక్కడి ప్రజల జీవన సంస్కృతిని చిత్రిస్తుందీ నవల. అనేక యూరోపియన్ భాషల్లోకి అనువదించబడి, ప్రపంచ సాహిత్యంలోనే ఒక మైలురాయిగా నిలిచింది.

ఒకప్పుడు ఐక్యంగా వున్న ఒక తెగకు సంబంధించిన కథే చెదిరిన సమాజం. తెల్లవాడి రాకతో ఈ ఐక్యత భగ్నమైంది. సమాజంలో సంక్షోభం ప్రారంభమైంది. దీనికి వ్యతిరేకంగా కథానాయకుడు ఒకోన్‌క్వో చేసిన పోరాటం కథాంశం.

అబెబె కథన శైలిలోని ప్రత్యేకత అతని క్లుప్తత. జానపద గాథలనూ, నీతికథలనూ కలిపి కథ చెప్పే పద్ధతి తెలుగు పాఠకులూ,



Untitled-2 86 6/11/2002, 3:51 PM

రచయితలూ గమనించ వలసిన విషయం. పుస్తక ప్రారంభంలో ఐగ్బోజి హిగో రాసిన వుపోద్ఘాతమూ, చివరన, అధ్యాయ క్రమంగా చేర్చిన టీకా టిప్పణీ, నైజీరియన్ తెగ(ఇబో) వాళ్ళు మాట్లాడే పదాలు,పదబంధాల అర్థాలూ నవలను మరింత బాగా నడపటానికి సహాయం చేస్తాయి. ఇంత విలక్షణ నవలను తెలుగు పాఠకుల కందించిన జనసాహితికి అభినందనలు.

అనువాదాల గురించి అందరికీ తెలిసిన ఒక సామెత వుంది. If it is faithful it is not beautiful అని గిట్టని వాళ్ళు దీన్ని ముక్కస్య ముక్కాను వాదం అని కూడా అనే ప్రమాదం లేకపోలేదు. ఇంతమంచి ప్రయత్నం మీద నీళ్ళు చల్లటం భావ్యం కాదు. మంచి పుస్తకం. మొత్తం మీద చదివిస్తుంది.

ఇంగ్లీషు వాక్యాల్నీ, పదాల్నీ తెలుగులో పట్టుకోవటానికి మరింత శ్రద్ధ కనపరిస్తే బాగుండేదనిపిస్తుంది.
ఉదాహరణకు కొన్ని పంటికింది రాళ్ళు

You have a manly and proud heart
నీ గుండె గంభీరమైనది. గర్వంతో కూడుకున్నది.
General failure మామూలు ఓటమి
Man's spirit మనిషి అహంకారం.
village rain maker ఊరిలోని వానల సృష్టికర్త

ఇంగ్లీషు ప్రతితో పోల్చి చూడకపోతే ఇలాంటివి దృష్టికి రాకపోవచ్చు. అందువల్ల పఠనా సౌలభ్యం కుంటుపడే అవకాశం లేదు. ఈ నవల ప్రత్యేకత గురించి హిగో రాసింది మరొకసారి తెలుసుకుందాం.

"ఇందులో వుపయోగించిన సామెతలు, జానపద కథలతో ఒక పెద్ద జాబితా తయారు చేయవచ్చు. తెగకు సంబంధించిన సంప్రదాయాలు నిషిద్ధాలు... మల్లయుద్ధం గురించీ, వివాహ పద్ధతుల గురించీ, అంతిమ సంస్కారాల గురించీ... నవలలో వర్ణనలున్నాయి. వీటన్నిటినీ కలుపుతూ అబెబె మనొకక కథ చెప్తాడు... సులభమైన పదాలను వాడడం, చిన్నచిన్న వాక్యాలు రాయటంవల్ల నవలను చదవటం ఎంతో సులభమని ఎందరో రచయితలు పొగిడారు.... ఈ శైలి ద్వారా రచయిత తాను చెప్ప దలచుకున్న విషయాన్ని సూటిగా, స్పష్టంగా చెప్పగలిగారు. ఒక్కోసారి ఈ శైలి పవిత్ర వాతావరణాన్ని స్ఫురింపచేస్తుంది. **జనసాహితి ప్రచురణలు, వెల : రు.30, పేజీలు 170, ప్రతులకు మైత్రి బుక్‌హౌస్.**

---

**ఐనాల సైదులు**

**లక్ష్మీ రాజం కథలు**

## తెలంగాణా దళితుల ప్రతిబింబం లక్ష్మీ రాజం కథలు

**చ**రిత్రలో అట్టడుగునపడివున్న నిజాల్ని చదువుకోవాలనుకునే సాహితీ ప్రియులకు "తిరుగు ప్రయాణం" కథల సంపుటి అచ్చై వచ్చింది. దీనిలో ప్రతీ అక్షరం మూలాల్ని కదిలిస్తున్నట్లు ఉంటుంది. "కులంగాని దానితోని అక్రమ సంబంధం పెట్టుకుంటే పెద్దిర్కమనుకున్నారా! అక్రమ సంబంధానికి అడ్డురాని కులం పెండ్లి చేసుకొనటానికి అడ్డమవుతుందా? చట్ట ప్రకారం నేరమైన అక్రమ సంబంధాన్నేమో ఒప్పుకుంటారు. అదే చట్ట ప్రకారం న్యాయమైన బంధాన్నేమో తప్పు పడుతుండ్రు" అంటే వీళ్ళ దృష్టిలో శీలం కంటే కులం గొప్పదేమో! ఏమో!" (మూన్నాళ్ళ ముచ్చట) ఈ మాటలు రాయాలన్నా చదవాలన్నా ధైర్యం కావాలి. వ్యక్తి ప్రతిభను బట్టి కాకుండా కులాన్ని బట్టి విలువిచ్చే ఈ సమాజంలో దళిత వాయిస్‌ని వినిపించడానికైనా సపోర్ట్ చేయడానికైనా మతతత్వంతో పాటు ధైర్యం రావాలి. ఇక మొత్తానికి కులం మూలాల్ని పెకిలించాలంటే, సలసలకాగే రక్తంలో కలాన్ని ముంచాలి. అప్పుడే సాంఘిక అసమానతల్ని అక్షరీకరించొచ్చు. ఇది కవి, రచయిత "నల్లాల లక్ష్మీ రాజం"లో కావల్సినంత వుంది. తను పుట్టి పెరిగిన తెలంగాణా ప్రాంతంలోని దళితుల జీవితాల్ని అక్షరీకరించడంలో ఎక్కడా తొట్రుపాటు పడలేదీ రచయిత. స్పష్టంగా చెప్పాలనుకున్న విషయాన్ని సూటిగా, కాస్త వేడిగా వాడిగా చెప్పాడు. పల్లెల్లోని ఛిద్రమయిన దళిత జీవితాల్ని చిత్రించినా, దళితుడి అగ్రవర్ణ స్త్రీల అక్రమ సంబంధాల్ని చెప్పినా దళిత యువకుల్లోని ఎదిరించే మనస్తత్వాన్ని చిత్రించినా సూటిదనం, నిజాయితీ కన్పిస్తుంది. ముఖ్యంగా తెలంగాణా దళిత జీవితాల్ని ఓ కొత్తకోణంలో తన కథల్లో చూపిన విధానం చాలా ఆసక్తికరంగానూ, ఆలోచించే విధంగాను ఉంది. "మావూరి ముచ్చట్లు" పేరుతో రాసిన కథలో అచ్చమైన పల్లె భాష తెలంగాణా యాస పాఠకుణ్ణి ఆకట్టుకొనేట్టుగా ఉన్నాయి. ప్రతీ మాటా నగ్నంగా కన్పిస్తుంది. ఎలాంటి అరమరికలు, మసిబూసే ప్రయత్నాలూ కన్పించవు. కథల నిండా అమాయకత్వం, ఎదిరించి గెలిచిన ఆనందం, ఏదో చెప్పాలన్న కుతూహలమే కన్పిస్తుంది. ప్రతీ కథ ఇతివృత్తం సామాన్య జనంలోనిదే. వ్యావహారిక మాటల్లోనే పాత్రల సంభాషణలు నడపడం మరింత ఆసక్తికరంగా వుంది.

రచయిత వృత్తి రీత్యా పోలీస్ కావడం చేతనో ఏమో పోలీసుల అనాలోచిత చర్యలవల్ల, నక్సలైట్ల సిద్ధాంతరాహిత్య పనులవల్ల సామాన్యులకు జరిగే అన్యాయాన్ని అక్షరబద్ధం చేయగలిగాడు. దళితులు పడే వేదనల్ని ఎంతో హృద్యంగా చిత్రించాడు. ఆర్ద్రత నిండిన మనస్సుతో పుస్తకాన్ని మూస్తాడు ప్రతీ పాఠకుడు. ఈ కథల్లోని 'వస్తువు' అందరికి సుపరిచితమే. కానీ వినూత్నంగా చెప్పడంలో లక్ష్మీరాజం ప్రతిభ కనబరిచారు.

"పడగనీడలో పావురాలు" కథలోని ప్రతీ అంశం మొత్తం కథలకే తలమానికం. కథలోని ప్రకాశ్ (కానిస్టేబుల్) పాత్రను మలచడంలో తన వృత్తి అనుభవాన్ని ఉపయోగించుకున్నదీ రచయిత. ఇంత దగ్గరతనంగా దీనిలోని పాత్రలను మలచడం పాఠకునిలో ఆసక్తిని, ఆర్ద్రతను నింపుకుంది. అంతేకాదు గురితప్పిన పోలీస్ తుపాకీ గుండు, దారి తప్పిన నక్సలైట్ బ్లాస్టింగ్ మందూ మనుషుల్ని మోసుకుపోతున్న దృశ్యాలు కళ్లెదురుగా కదలాడతాయి ఈ కథను చదువుతున్నంత సేపూ. పల్లెల్ని ఆదర్శీకరించి అందంగా ఉన్నట్లు, అందరికీ అదే నిజమన్నట్లు చూపించే తత్వం కాదు "నల్లాల లక్ష్మీరాజం"ది. ఉన్నది ఉన్నట్లుగా కష్టమైనా నిష్ఠూరమైనా సజీవంగా చిత్రించడం ప్రతీ కథలోనూ కన్పిస్తుంది. ఈ కథలన్నీ తెలంగాణా బహుజనుల (అణగారిన వర్గాల) ఆత్మకథలనొచ్చు. నిజమైన జీవితాల్ని సాహిత్యంలో చూపడం ఒక రకంగా కష్టమైన పనే, అయినప్పటికీ ఎంతో నిజాయితీగా, ఓ కొత్త కోణంలో చెప్పాడీ రచయిత. తెలంగాణా పల్లెల్లో అగ్రకులాల (కమ్మ, రెడ్డి) ఆధిక్యత, నిమ్నకులాల్లో చదువుకు దగ్గరవుతున్న, విజ్ఞానం నేర్చుకోవడానికి తపించే దళితుల్ని ఏ విధంగా అణిచివేస్తుందో "రాజవ్వకొడుకు" కథలో చెప్పాడు రచయిత. "పని చెయ్యడంలో మెప్పుపొందాలిగానీ చదువుల్లో మనమెందుకు" అనే దళితుల మనస్తత్వం నిజంగా వారి బుద్ధికి పుట్టింది కాదు. పుట్టించిందేనన్న నగ్నసత్యాన్ని ఈ కథలో ఆవిష్కరించాడు లక్ష్మీరాజం.

చదువు–విజ్ఞానాన్ని, ఉద్యోగం, ఆత్మస్థైర్యాన్ని నింపుతుందని చెప్తూనే అంతర్లీనంగా అంబేద్కర్ సిద్ధాంతాన్ని (కులాంతర వివాహం అవసరమనే) ప్రకటించే విధానం పాఠకుణ్ణి మరింత ముందుకు



Untitled-2 87 6/11/2002, 3:51 PM

నడిపిస్తుంది "రాజవ్వకొడుకు" కథ. ఏ దేశంలోనూ లేని 'కుల' కంపు ఈ దేశంలో రాజ్యమేలుతుంది. ప్రతిభని బట్టి కాకుండా కులాన్ని బట్టి వ్యక్తికి గౌరవాన్నిచ్చే నీచ సంస్కృతిని నేటికీ పాటించడం ఎవ్వరికైనా 'ఛీ' అన్పిస్తుంది. కొన్ని రకాల వృత్తుల్ని నీచంగానూ, ఆ వృత్తుల్ని చేపట్టిన వారిని అంటరానివారుగానూ ముద్రవేయడం ఎవ్వరికైనా మనస్సు నొచ్చుకొనేట్లు లేదూ!!? అదే ఈ రచయితనూ కదిలించింది. ఈ వస్తువుతో చాలా తేలికైన పదాలతో తెలంగాణా యాసలో చక్కని పల్లెపాట తీరుగా తెలంగాణేతరులకు అందించాడీ రచయిత. నేటికీ మన సమాజంలో కొనసాగుతున్న అన్యాయం దొంగ. మంచిగా మారితే మళ్ళీ దొంగగా మారేట్లు చేయడం" ఇది ఎంత హేయమైన పనో దీని వెనుక విషాదమెంతో "దొమ్మరి గంగడు" కథలో చెప్పాడు. దొమ్మరి గంగడు దొంగగా చలామణి అవుతాడు. తదనంతర కాలంలో మంచిగా బతకాలనుకున్న పోలీసులు వాణ్ణి మంచివాడిగా బతకనివ్వకపోగా వాడి కొడుకునూ దొంగగా మార్చే స్థితికి దిగజార్చడం, చివరికి దొంగతనం చేసి జనానికి దొరక్కుండా పరుగెత్తలేని స్థితిలో తన ఆనవాలు దొరక్కుండా తలని నరుక్కొని పొమ్మని తన కొడుక్కి చెప్పడం పాఠకుడికి కన్నీళ్ళను తెప్పిస్తుంది. ఈ కథ చదివినంత సేపూ పాఠకుని గుండె బరువెక్కుతుంది. దీనిలోని పాత్రల్ని నడిపించిన తీరు చూస్తే చెయ్యి తిరిగిన రచయితలా కన్పిస్తాడు యువ రచయిత లక్ష్మీరాజం.

మొత్తం ఈ సంపుటిలోని ఎనిమిది కథలూ దేనికవే ఒక్కో ప్రత్యేకతను కలిగి వున్నాయి. దళిత పోరాటాలతోనూ, సాంస్కృతిక ఉద్యమాలతోనూ, వృత్తిలోని నిజాయితీతోనూ, పరిశీలనా గుణంతోను లక్ష్మీరాజం అసత్యాలతో నిండిన సాహిత్య చరిత్రను పునర్మూల్యాంకనం చేసే దిశగా పయనిస్తాడనే నమ్మకాన్ని కలిగిస్తాయి. ఈ సంపుటిలోని తిరుగు ప్రయాణం, మావూరి ముచ్చట్లు తదితర కథలు.

ఇక ఈ సంపుటికి బి.ఎస్. రాములు రాసిన 'ముందుమాట' నేటి సోకాల్డ్ కవులకి, రచయితలకు కనువిప్పు కల్గించేదిగా, ప్రజాస్వామ్య, సామ్యవాద సాహితీపరులు ఒక్కసారి ఆగి ఆలోచించేట్లుగా ఉంది. దీనిలో తన ఆవేదనను, ఇంకాస్త కరువుగా చెప్పాలంటే ఆక్రోశాన్ని (అబద్ధాల పుట్టగా మారిన, మారుతున్న సాహిత్య చరిత్రపై) వెళ్ళగక్కారు.

ఇకపోతే చివరిగా ఓ మాట చెప్పాలి. ఈ పుస్తకాన్ని సరిగ్గా పరిశీలిస్తే దాదాపు నాలుగోవంతు పేజీల్లో కథలు కాకుండా ఇతరత్రాలు అంటే అభిప్రాయాలు నిండి ఉండటం పాఠకుడు నొచ్చుకొనేదిగా ఉంది. పుస్తకాన్ని చూడగానే పది పదిహేను కథలైనా ఉంటాయనుకునే సాహితీ ప్రియులకు నిరాశగానే ఉంటుంది. ఏదిఏమైనా దీన్ని నేటి దళిత రచయితల ఆర్థిక ఒడుదుడుకులుగానే భావిస్తాడు పాఠకుడు. కవి, రచయిత లక్ష్మీరాజం కలం నుండి మరిన్ని జీవితాల్ని ప్రతిబింబించే కథలు రావాలని, అవి కొత్తకోణాల్లో అట్టడుగున పడివున్న నిజమైన చరిత్రను పాఠకులకు అందించాలని ఆశిద్దాం.

---

**నాగసూరి వేణుగోపాల్**

# రేపటి సంపాదకుల కరదీపిక




మార్చి ఎనిమిది, సోమవారం ఉదయం శాసనసభ స్పీకర్ యనమల రామకృష్ణుడు ఉన్నతాసనంపై అసౌకర్యంగా కదులుతూ, ఆంగ్లంలో అదిలిస్తూ, మందలిస్తూ, పురమాయిస్తూ, కోపం చేస్తూ సభ్యులను అదుపులో పెడుతూ కథ నడిపిస్తున్న వేళ. దొంగనోట్ల కుంభకోణంలో నిందితుడు రామకృష్ణగౌడ్ ముఖ్యమంత్రి చంద్రబాబుతో, మరి ఇద్దరు మంత్రులతో కలిసి దిగిన ఫొటోలను చూపుతూ 'ముఖ్యమంత్రీ దిగిపో' అంటూ కాంగ్రెస్ శాసనసభా పక్షం నాయకుడు పి. జనార్దన్‌రెడ్డి బృందం నినదిస్తున్న సమయంలో తమ నాయకుడిపై దూసుకొస్తున్న ఆరోపణలను మార్గమధ్యంలో అత్యంత లాఘవంగా ఖండించేందుకు తెలుగుదేశం పార్టీ సోదరులు శక్తికొద్దీ వాగ్బాణాలు సంధిస్తూ సమరోత్సాహంతో రెచ్చిపోయి చెలరేగుతున్నప్పుడు మేము హైదరాబాద్‌కు 150 కిలోమీటర్ల దూరాన ఉన్నాం. నిజామాబాద్ నుండి కామారెడ్డి వస్తున్నాం. పోలీస్‌స్టేషన్‌ను పేల్చింది ఇక్కడే అని ఒక సహచరుడు అనగానే డిచ్‌పల్లిలో కారాగింది...

ఇది కథ కాదు. వార్తా కథనం. వార్తలకు సంబంధించి 'న్యూస్ స్టోరీ' అని ఎందుకంటారో ఇటువంటి ఉదాహరణలు వివరిస్తాయి. 'ప్రజాశక్తి బుక్‌హౌస్' ఇటీవల వెలువరించిన 'ఆంధ్రజ్యోతి' ఎడిటర్ కె. రామచంద్రమూర్తి వ్యాస సంకలనం 'వార్తావ్యాఖ్య'లోని 'లింబాద్రి తల్లి' అనే వ్యాసానికున్న ప్రారంభ వాక్యాలను యింత వరకు పేర్కొన్నాం. ఆ రోజున 'వార్త' సంపాదకుడిగా నిజామాబాద్ ప్రాంతంలో తిరుగాడుతూ అప్పట్లో వార్తల్లో వున్న శాయవ్వ, లింబాద్రిల గురించి వారి బంధువులతో మాట్లాడాలని ప్రయత్నం, ఆ అనుభవాలన్ని వివరిస్తూ "సభలో దృశ్యాలకీ, సమాజంలో కనిపిస్తున్న వాస్తవ చిత్రాలకీ మధ్య సంబంధం ఉన్నదా?" అనే ప్రశ్నతో ఆలోచన రేపుతూ 'వ్యాసం' ముగిస్తారాయన.

1998-2002 మధ్యకాలంలో వార్త సంపాదకులుగా రామచంద్రమూర్తి వార్తతోపాటు వ్యాఖ్యలు - వాటి కార్యకారణ సంబంధాన్ని వివరిస్తూ రాసినవి చాలా వున్నాయి. అది కూడా ఈ సమయంలోనే. మిలీనియం హడావిడి, ఆర్థిక సంస్కరణలు, విద్యుత్ సంస్కరణలు, డబ్ల్యుటిఒ భవనంపై దాడి, దేశంలో సంకీర్ణ ప్రభుత్వం... యిలా చాలా ప్రభావితం చేసిన సమయం. పాత్రికేయులు తెలకపల్లి రవి 'పరిణత పరిశీలన'లో అన్నట్టు "... ఒక విధంగా వారు చరిత్రకు సాక్షులు -మరో విధంగా దాన్ని కొంత ప్రభావితమూ చేసే వ్యాఖ్యాతలు. ఈ ద్విముఖ బాధ్యత నిర్వహణ క్రమంలో అధినేతల ప్రవచనాలను, పోకడలను సినిమా రీలులా చూడగల అరుదైన అవకాశం పత్రికావృత్తి కల్పిస్తుంది. పరిణితి వున్న వారు సాధికారికంగా వ్యాఖ్యానించే వీలూ కల్పిస్తుంది." అలాగే టీవీ రాకతో "ఏ విషయాన్ని ఎలా చూడాలో పత్రికలు చెప్పాలని పాఠకులు ఆశిస్తున్నారు. ఆ క్రమంలోనే సంపాదకులు మొదటి పేజీలో ప్రత్యేక వ్యాఖ్యానం రాసే సంప్రదాయం పెరిగింది. వార్తావ్యాఖ్య ఆ కోవలో పాఠకులను అలరించింది" అని కూడా రవిగారు అన్నారు.

'వార్తావ్యాఖ్య' అనే పదబంధంలో 'వార్త' అనే పదం - ఒక దిన పత్రికను సూచిస్తోందని, అది ఆ పత్రిక సంబంధించి వ్యాఖ్య అవుతుందని - ఇపుడు మరో పేరు ఎంపిక చేసుకున్నట్టు 'మనవి'లో వివరించారు రచయిత. అలా అనుకోవాల్సిన అవసరం లేదేమో! 1987 చివరనో, లేదా 1988 ప్రారంభంలో రామచంద్రమూర్తిగారు 'ఉదయం' పత్రికలో 'నిలువునా చీలిన నాలుగో స్తంభం' అంటూ మన పత్రికా రంగం గురించి వార్తావ్యాఖ్య పేరుతో వ్రాసిన విశ్లేషణ - ఏ ఆధారం



Untitled-2 88 6/11/2002, 3:51 PM

లేకుండా యిప్పటికీ నాకు గుర్తు వుంది. అందువల్ల ఆ శీర్షికను యిప్పుడు కూడా తొలిపుటలో రాయాల్సిన అవసరం ఎంతో వుంది. అలా కాక పేరు మార్చడం అర్థం లేని అపోహలను అంగీకరించడం అవుతుంది.

నిరాడంబరమైన శైలి, ఆసక్తిగా సాగే క్రమం, నిశితమైన చూపు, హేతుబద్ధమైన ఆలోచన – చాలా అపురూపంగా వ్యంగ్య భాణాలు – రామచంద్రమూర్తిగారి వార్తావ్యాఖ్య రచనా శైలిని పట్టిస్తాయి. పరిణత పాఠకుడికి కూడా ఆసక్తి కల్గించే రీతిలో విశ్లేషణ సాగుతుంది. ఇక రామచంద్రమూర్తి అంశాన్ని ఎలా పట్టుకుంటారు? అనేది వారం వారం చదివినపుడు దొరకలేదు. సంకలనం పరిశీలించినపుడు సాధ్యమైంది. అందుకే 'నిశితమైన చూపు' అనే వర్ణన. రేపు మంచి పత్రికా రచయితలుగా రాణించాలనే వారికి ఇది ఒక మంచి ఎడ్యుకేషన్ టీవీ ఛానళ్ళలో ఒక దృశ్యం చాలా మంది చూసి వుంటారు. కానీ రామచంద్రమూర్తి వంటి వారే "ఇదేమి రాజ్యం?" వంటి వ్యాసం రాయగలరు. గంటన్నర సాగాల్సిన ప్రశ్నోత్తరాల సమయం ఐదున్నరగంటలు సాగటం గురించి అందరూ వార్త వేసి వుంటారు. "ప్రజల దృష్టిలో పలుచన కారా?" అన్నదీ ఈ సంపాదకుడే! మరోసారి ఈనాడులో వచ్చిన వార్త, 'వార్త'లో వచ్చిన వార్త – రెండింటిని విశ్లేషించడానికి హేతుబద్ధమైన ఆలోచనాలోచనలతో తడిమి అవినీతి ఆరోపణలను అర్థం లేదా?' అనే వ్యాసం రాయగలిగారు. పాఠకుడిని అందుకోగలిగితే విశ్లేషణా చతురుడైన సంపాదకుడి బాణీ అందుకోగలడు.

"కేవలం వెనుకబడిన వర్గానికి చెందిన మహిళ కాదు. మామూలు పార్లమెంటు సభ్యురాలు కాదు. సమాజంలో అట్టడుగు వర్గాలకు ప్రాతినిధ్యం వహిస్తున్న రాజకీయ నాయకురాలు మాత్రమేకాదు. మహిళలపైన జరిగే అత్యాచారాలను సాయుధంగా ప్రతిఘటించిన పోరాటశీలే కాదు. జీవిత పర్యంతం సామాజిక పోరాటం చేసిన సాహసి మాత్రమేకాదు. నేర ప్రపంచం నుంచి అత్యున్నత చట్టసభలోకి ప్రవేశించిన అసాధారణ వ్యక్తి అన్నా సరిపోదు" అంటూ 'ఆగిపోయిన అద్భుత ప్రయోగం' అనే విశ్లేషణలో ఫూలన్‌దేవి గురించి రాసిన వాక్యాలు విశ్లేషణలోని నైశిత్యానికే కాదు, రచనాశైలికి పరాకాష్ట కూడా!

'గర్వించదగిన కొన్ని ఘడియలు' అంటూరాసిన చివరి పేరాలో సెప్టెంబరు 11న అమెరికాలో దాడి జరిగితే అధ్యక్షుడు ఒక రోజు, ఉపాధ్యక్షుడు కొన్ని వారాలు పాటు అజ్ఞాతవాసంలోకి వెళ్ళారు. దీనితో పోలిస్తే భారత పార్లమెంటు మీద దాడి జరిగిన తర్వాత జార్జిఫెర్నాండెజ్ కాలినడకన పార్లమెంటు భవనం చుట్టు మీడియా ప్రతినిధులతో తిరగడం ఎంతో మెరుగంటారు.

అక్కడక్కడ మెరుపుల్లాంటి వాక్యాలు కనబడుతాయి.

"ప్రచారానికీ, వాస్తవానికీ మధ్య వ్యత్యాసం వారి వివేకాన్ని వెక్కిరిస్తోంది..."

"గెలిచిన పార్టీలు తమ విజయాన్ని అపార్థం చేసుకుంటే చాలా ప్రమాదం.."

"బహుశా తుపాకీ పట్టుకుని బతికేవాళ్ళు తుపాకీ వల్లనే చనిపోతారేమో!"

ఇప్పుడేమీ జరుగదు. నిజానికి ఎప్పుడూ ఏమీ జరుగదు. ఆరోపణలు వచ్చిన వెంటనే రాజీనామాలు చేసే సత్తెకాలం ఎప్పుడో పోయింది. ఈ ప్రభుత్వానికి ఢోకాలేదు. పైరవీ కారులకూ, దళారులకూ ప్రమాదం లేదు. అవినీతికి భయం లేదు. జాతీయ రాజకీయ సముద్రంలో ఈ పథకాల సంచలన కెరటాలు తీరాన్ని తాకి యథాప్రకారం వెనక్కి వెళ్ళిపోతాయి. నిద్రనటించే కుంభకర్ణులను కుంభకోణాలు ఏమీ చేయలేవు. కథ యథావిధిగా నడుస్తూ వుంటుంది.

"ఆలోచించే మాట్లాడుతున్నారా? మేధావులకో లేఖ" అంటు రాసిన విశ్లేషణ చాలా ఆలోచింపచేస్తుంది. అలాగే శీర్షికలు కూడా ఎంతో ఆసక్తి కల్గిస్తాయి. చర్చ కోసమా, రచ్చకోసమా ఈ నిబంధనలు? అని ఒక శీర్షిక పెట్టారు. మరో వ్యాసానికి 'దిక్కుతోచని దిగ్గజం' అని శీర్షిక వుంది. ఒక్క మాటలో చెప్పాలంటే 'వార్తావ్యాఖ్య' వ్యాస సంకలనం 1998–2002 పోకడలకు వ్యాఖ్యాన సహిత వివరణ రేపటి సంపాదకులకు కరదీపిక. పుస్తకం వెలువరించిన ప్రజాశక్తి బుక్‌హౌస్‌ను తప్పక అభినందించాలి. మీడియాకు సంబంధించిన మరిన్ని పుస్తకాలు ప్రచురించాలని కోరుకుందాం. **ప్రజాశక్తి బుక్‌హౌస్ ప్రచురించిన ఈ పుస్తకం వెల : రు.50, పేజీలు : 125. ప్రతులకు ప్రజాశక్తి బుక్‌హౌస్ అన్ని బ్రాంచీలలో లభించును.**

---

# మఖ్దూం ప్రత్యేక సంచిక




సుదీర్ఘ కాలంగా నడుస్తున్న సాహిత్య పత్రిక "ప్రజాసాహితి" అప్పుడప్పుడూ ప్రత్యేక సంచికలు తెస్తుంటుంది. ఖచ్చితంగా ఏదైనా సందర్భం అని గాక ప్రజాకళా సాహిత్యాల పురోగమనానికి తోడ్పడిన ప్రముఖులపై సంచికలు తేవడం దాని ప్రత్యేకత. ప్రజాకళల పైన, సుంకర– రాజారావుల పైన ఇంకా ఇలాటి ప్రత్యేక సంచికలు సాహిత్య మిత్రుల అభినందనలు పొందాయి.

ఆ కోవలోనే అక్టోబరు ప్రజాసాహితి ని మఖ్దూం ప్రత్యేక సంచికగా వెలువరించారు. మ్యాగజైన్ సైజులో ముందు మఖ్దూం, వెనక హోవర్డ్ ఫాస్ట్ చిత్రాలతో వెలువడిన ఈ సంచికలో అనేక విశేషాలున్నాయి. కమ్యూనిస్టు నాయకుడుగా కవిగా అనేక విధాల పరిచితుడైన మఖ్దూం జీవిత సాహిత్యాలను కళ్లకు కట్టడంలో సంపాదకవర్గం సఫలమైంది. అంతేగాకుండా అంతగా గుర్తింపు నోచని ఉర్దూ సాహిత్యం గురించి మాట్లాడుకోవడానికి కూడా ఇదో అవకాశం సమకూర్చింది. మఖ్దూం పట్ల దేశ వ్యాపితంగా కవులు, రచయితలకు ఎంతటి ఉన్నతాభిప్రాయం వుందో ఇందులో పొందుపరచిన పునర్ముద్రించిన రచనలు చెబుతాయి. కె.ఎ. అబ్బాస్, సజ్జాద్ జహీర్, ఫైజ్ అహ్మద్ ఫైజ్, కిషన్ చందర్ వంటి వారితో పాటు రాజ్‌బహదూర్ గౌర్, సినారె, నోముల సత్యనారాయణ, యాది సదాశివ, బినరసింగరావు తదితరుల వ్యాసాలు గాని , కవితలు గాని వున్నాయి. అభ్యుదయ కవి, మఖ్దూం కుమారుడు నస్రత్ మొహియుద్దీన్ జ్ఞాపకాలు ప్రత్యేకాకర్షణ. ఇవే గాక మఖ్దూం కవితలు, రచనలు, ఆనాటి అరుదైన ఛాయా చిత్రాలు కూడా చేర్చారు.

మఖ్దూం ప్రత్యేక సంచిక అన్నప్పటికీ ఇందులో హోవర్డ్ ఫాస్ట్ గురించి కూడా చాలా విషయాలున్నాయి. ఫాస్ట్ రాసినవి కొన్ని, ఆయన గురించి రాసినవి కొన్ని. వెనక చిత్రానికి సంబంధించి "ప్రస్థానం" సౌజన్యంతో అని రాయడం ప్రజాసాహితి నిర్వాహకుల సౌజన్యాన్ని తెల్పుతుంది. పురోగామి సాహిత్య పత్రికలు, సంస్థల మధ్య ఇలాటి సద్భావం స్వాగతించదగింది. **కొత్తపల్లి రవిబాబు ప్రచురించిన ఈ 88 పేజీల పుస్తకం ధర రూ 25–.**



Untitled-2 89 6/11/2002, 3:51 PM

**తెలకపల్లి రవి**




# మైదానంలో లేని లోతులు చూడనేల?

తెలుగు సాహిత్యంలోనే గాక సమాజంలో కూడా అత్యధిక సంచలనం కలిగించిన రచనలలో చలం మైదానం ఒకటి. ఏడు దశాబ్దాల తర్వాత కూడా ఈ నవల సాహిత్యకారులలో అదే విధమైన అసక్తిని రేకెత్తిస్తుందంటే అతిశయోక్తి కాదు. ఈ పుస్తకానికి ముందు మాట రాసిన వాడ్రేవు చినవీరభద్రుడు తనలాటిపాత చలం పాఠకులలో ఇది ఉద్రేకం కలిగించిందని రాయడం అందుకు సాక్ష్యం. అడ్లూరు రఘురామరాజు మైదానం నవలను తనదైన కొత్త కోణం నుంచి చూపడానికి ప్రయత్నించారు. ఇందుకు పోస్ట్ మాడ్రన్ పరిశీలన అని పేరుపెట్టుకున్నారు. అదే సమయంలో ఆయన తన విమర్శనాశైలిని పుట్టపర్తి నారాయణాచార్యుల వంటి సంప్రదాయ వాదులూ ప్రభావితం చేశారని రాసుకున్నారు. ఈ పుస్తకంలో మొత్తం 8 అద్యాయాలున్నాయి. ఇవి లోగడ పత్రికల్లో వచ్చాయి.

చలం నవలలన్నిటిలోకి సరళమైంది, సూటైంది మైదానం. మనం పరిశోధించి తీయాల్సిన లోతుల కన్నా ఆ ప్రగాఢతను కఠోరతను కనుగొనడమే ముఖ్యం. దైవమిచ్చిన భార్య పాత్రలలో అంతకు మించి జీవితాదర్శం లో లాలస దేశికాచారి పాత్రలలో వుండే సంక్లిష్టత ఇందులో ఎక్కడా వుండదు.

కాని ఆ నవలతో వచ్చిన సంచలనం వల్ల దానికి లేనిపోని విశేషణాలను జోడించి రచయిత చెప్పదలచిన విషయాలను విడనాడటం వల్లనే క్లిష్టత ఏర్పడింది. మైదానం ను ఇంగ్లీషులోకి అనువదిస్తే ప్లెయిన్. నవల కథ కూడా అంతే. పెద్దలు కుదుర్చిన పెళ్లి చేసుకుని జరుగుబాటున్న భర్తతో సాధారణంగా కాపురం చేసే రాజేశ్వరి చొరవగా తన జీవితంలోకి చొరబడిన అమీర్‌తో వెళ్లి పోవడం, అక్కడ ఆమెను తప్పుగా రుజువు చేయడానికి మేనమామ రూపంలో వచ్చిన సమాజం చేసే ప్రయత్నాలు, ఆ పైన అమీర్ మరో అమ్మాయిని ఇష్టపడటం, తర్వాత వాళ్ల జీవితంలో చిన్నకుర్రవాడైన మీర్ ప్రవేశించి రాజేశ్వరితో అనుబంధం పెంచుకోవడం, అది భరించలేని అమీర్ ఆత్మహత్య, రాజేశ్వరి చేసిందనుకుని మీర్ తనపైన వేసుకోవడం ఇదీ నవల ఇతివృత్తం టూకీగా.

ఈ కథలో అర్థం కాని అంశాలు , లోతైన తాత్వికతలు వాస్తవానికి పెద్దగా లేవు. రఘురామరాజు చెప్పినట్టు చలం అప్పటికి నూతన భావావిష్కర్తగానే వున్నారు. దానిపట్ల ఇతరుల సంగతి అలావుంచి ఆయనకే ఎలాటి కాల్పనిక ఆరాధానా భావాలు లేవు. అలాటి కృత్రిమమైన ప్రయత్నాలూ చేయలేదు. కానిసమాజం దాన్ని అందుకోకపోవడం వల్ల తిరుగుబాటు తత్వం అలవరచ్చుటం వల్ల తర్వాత తర్వాత ఆయన శైలి మారింది. అదో మార్గంగా స్థిరపడుతున్న కొద్ది పాత్రల చిత్రణా మారింది. వాటితో ప్రభావితులైన అభిమానులు మైదానంలోనూ ఆ విలువలు వెతకడం, అందుకోసం లేని పోని విశేషణాలు జోడించడం పరిపాటి అయింది. ఈ ధోరణి రఘు/రామరాజులోనూ చాలా వుంది. "చూపుల వలయాల్లో చిక్కుకున్న చలం" అనే తొలి అధ్యాయం అందుకు సాక్ష్యం. ప్రేమోపహతులైన నాయికా నాయకుల చూపులను గురించి చలం ఏఏ రచనలలో ఎలా రాసింది ఇందులో ఆయన సవివరంగా ఉటంకిస్తారు. మైదానంలో రాజేశ్వరి అమీర్ చూపుల తాకిడికి తల్లడిల్లిన వైనానికి ఎనలేని ప్రాముఖ్యత నిస్తారు. నిజంగా ఇది నూతనాంశమా? దీనిపై ఇంత పరిశోధన అవసరమా అనిపిస్తుంది. ప్రబంధాల కాలం నుంచే వాలు చూపులు విరితూపుల ప్రస్తావన లున్నాయనే ప్రాథమిక సత్యాన్నిగమనంలో వుంచుకుంటే ఇంత విస్తరణ వుండేదికాదు. ఇక ఆ తర్వాత " లోచూపు" అంటూ రాజేశ్వరి అమీర్‌ను చూడటాన్ని చలం రమణ మహర్షిపట్ల పూజ్యభావం పెంచుకోవడాన్ని పోల్చారు. వాక్యాలతో సహా ఆ రెండింటికి సామ్యం తీసుకొచ్చారు. ఇది మరీ అసంబద్ధమైన విషయం. రెండు రకాలుగా. మొదటిది వాటికి అంత ప్రాధాన్యత లేదు, రెండవది స్త్రీ పురుషుల ప్రేమను ఆధ్యాత్మికానందాన్ని యాంత్రికంగా పోల్చడం సరైంది కాదు. ఇందులోనూ ఆత్మికానందం వుండదని కాదు. దాని ప్రాతిపదిక సుస్పష్టం. రెండవది అలా కాదు. అంతకన్నా ప్రాథమికమైన అభ్యంతరం ఏమిటంటే చలం చాలా కాలం తర్వాత రమణ మహర్షిని చేరారు కనక ఆయన మొదట నుంచీ రాసిన చేసిన దానిలో అందుకు పునాదులుంటాయనే తర్కం పూర్తిగానిలవదు. ఒక వేళ మనస్తత్వ శాస్త్రం ప్రకారం బాల్యంలోనే ఆ లక్షణాలుండి వుండాలని అనుకున్నా ఆ రచయిత ప్రతిరచనలో అందుకు ఆనవాళ్లు వెతకడం అంత సమంజసం కాదు. ప్రవరాఖ్యుడు పెద్దనేనని, మేఘసందేశం లో యక్షుడు కాళిదాసేనని వచ్చిన వాదనలు ఈ నాటివి కావు. రాజేశ్వరి, రమణ మహర్షిల మధ్య పోలిక పెట్టడం అలాటిదే. "అమీర్‌లో ధీరత్వానికి రాజేశ్వరి దైవత్వాన్ని చేర్చిందని" అంటారు రఘురామరాజు. చలం అభిమానులు చాలా మంది అమీర్‌ను అలానే చెబుతుంటారు. ఇంతకూ ఈ అభిప్రాయం చలం ది కాదు. ఆయన అమీర్‌ను చాలా సాదాసీదా మగవాడిగా మాత్రమే చిత్రించారు. తనకు నచ్చిన స్త్రీ దగ్గర చొరవతీసుకుని వెళ్లి పోవడం (రెండవ ఆమె అంగీకరించకపోతే ఏడ్చి రాజేశ్వరినే రాయబారిగా వాడుకోవడం) తప్ప అతనిలో ధీరత్వాలేమీ లేవు. ఆ మాటకొస్తే చలం ఆ పాత్రను తన ఆదర్శపాత్రగా చూపించనేలేదు. ఆయన అమీర్‌ను రాజేశ్వరి కళ్లతో తప్ప తన కలంతో ఎక్కడా వర్ణించలేదు. కనుక ఆ వర్ణన అంతా రచయితకు ఆపాదించే అవకాశం లేదు. దూదేకుల మహిళతో వెళ్లి వచ్చిన తర్వాత ఆమె మొరటు దనాన్ని గురించి రాజేశ్వరికి ఫిర్యాదు చేసే అమీర్ రసికత కూడా ప్రశ్నార్థకమే. ఇక మీర్ రాకతోఅతనిలో కలిగిన మార్పులు చివరకు ప్రాణాలు తీసుకోవడం కూడా ధీరత్వానికి చిహ్నాలు కాదు. రాజేశ్వరి రక్తసంబంధీకుల పిరికితనాన్ని మురికి తనాన్ని చూసిన జుగుప్సతో అమీర్‌ను పెద్ద ప్రేమమూర్తిగా ప్రతిష్టించడం ధీరోదాత్తుడుగా చిత్రించుకోవడం చలం ఉద్దేశించని భావాన్ని ఆపాదించడమే అవుతుంది. నవల చివరలో త్యాగాల పరంపర తెలుగు సినిమా త్రికోణ ప్రేమ త్యాగాల కన్నా మెరుగైనవేమీ కాదు. ఈ వాస్తవికతను గుర్తించకపోగా ఆ పాత్రలకు లేనిపోని ఘనతలు కల్పించి చూస్తే దారితప్పడమే జరుగుతుంది. అమీర్ పాత్ర లేచి వస్తే ఏం మాట్లాడుతుందో రఘురామరాజు వూహాజనితంగారాశారు. విమర్శలో సృజన మంచిదే కాని అసలు రచయిత స్పష్టంగా చెప్పిన మాటలు వదిలేసి మనం పూరించడమెందుకు? అమీర్ పాత్రపై ఓల్గా వంటి వారి అవాస్తవ ప్రశంసలను సరిగ్గానే విమర్శించిన రచయిత తనకు తెలియకుండానే తనూ అలాటి తప్పిదాలు చేశారు.

చలం విస్మరించిన రాజేశ్వరి బాల్యం అనేది విచిత్రమైన అధ్యాయం. రచనలో అదీ సృజనాత్మక ప్రక్రియలో విస్మరించడమనే మాట ఎలా పొసుగుతుంది? ఆ సంగతి అలా వుంచినా, రాజేశ్వరి ప్రవర్తనకు మూలాలు ఆమె వైవాహిక జీవితంలో కాక బాల్యంలో వెతకాలని చెప్పడం చలం మూలోద్దేశ్యాలను భంగపరచడమే కదా? వైవాహిక జీవితంలో స్త్రీ అసమాన రసహీనస్థితి వల్లనే ఇలాటి పరిణామాలు జరిగాయని ఆయన ఘోషిస్తుంటే బాల్యంలోకి వెళ్లి వెతకవలసిందని సలహా ఇవ్వడం న్యాయమా? ఆ అంశంపై రాజు చేసిన నిర్ధారణలు కూడా మరీ లాగినట్టుగావున్నాయి. ఉదాహరణకు రాజేశ్వరి మేనమామ తనను లొంగదీసుకోవడానికి ప్రయత్నించిన సంగతి తనలో తను గుర్తు చేసుకుంటుంది. దీన్ని ఆధారం చేసుకుని ఆమెకు అతనలా ప్రయత్నించి



Untitled-2 90 6/11/2002, 3:51 PM

నందుకు కోపం లేదని అంటాడు. ఇది అనుచితం కాదా? నరసు బావను, మేనమామను పోల్చి ఏవేవో పాఠాలు తీయడం కూడా అసందర్భంగా తోస్తుంది. తమ బంధువులైన భార్యాభర్తలు నగ్నంగా కలసి స్నానాలు చేసేవారని రాజేశ్వరి అనుకుంటుంది. మరి ఆ సంగతి మాత్రం రఘురామరాజు పట్టించుకోరు. అంటే ఆయన దృష్టిలోనే ఒక పరిమితి వుంది. చలం లేదా ఆయన సృష్టించిన రాజేశ్వరి వైవాహిక జీవితంలో ఫీలైన వెలితి ఈయన దృష్టిలో ప్రధానం కాదు. దానితో ఏకీభవించినా లేకున్నా విస్మరిస్తే మాత్రం చలం భావన నడుం అక్కడే విరిగిపోతుంది. పిల్లలను కనడం విషయంలోచలం భావనల అస్పష్టతను రాజేశ్వరి పాత్రలో వ్యక్తమైన దాన్ని బట్టి రాజు బాగానే విశ్లేషించారు. అలాగే రాణి శివశంకర శర్మ చలం రచనలపై చేసిన అసంబద్ధ వ్యాఖ్యలను కూడా సరిగానే ఖండించారు (కాకుంటే ఒకటి. సనాతన సంప్రదాయం అస్పృశ్యులను వెలివేసినంతగా ముస్లిములను వెలివేయలేదు. ఆ అధికారం దానికి లేదు కనక. గ్రామాలలో వారు గుళ్లుగోపురాలలోకి వస్తూనే వుండేవారన్నది నిజమే) కాని విశ్వనాథ తరహా ఫ్యూడల్ దుర్గంధం నుంచి తప్పించినందుకు రారా చలాన్ని మెచ్చుకోవడంపై కూడా రఘురామరాజు ఆగ్రహించడం సముచితంగా లేదు. ఆ ఇద్దరికి పోలిక కుదరదని చెబుతున్న రాజు సాహిత్య సామాజిక రంగాలలో ఆ ఇద్దరు దాదాపు ప్రత్యర్థులుగా సాగారనే చారిత్రిక వాస్తవాన్ని తుడిచెయ్యలేరు. రారా రాసిన దానిలో ఇతర లోపాలు వుండవచ్చునేమో కాని ఈ మాటలు తప్పుకాదు. అలాగే మధురవాణిని రాజేశ్వరిని పోల్చడం కూడా కుదిరేపని కాదు. వాటి నేపథ్యాలు వేరు, పరిధులూ పరమార్థాలు వేరు. మధురవాణి కన్నా రాజేశ్వరి విప్లవాత్మక పాత్ర అనడానికి పెద్ద ఆధారాలేమీ లేవు. ఆమె సమాజాన్ని వదలిపెట్టి మైదానంలోకి వురికిందనడం కాల్పనికంగా వుండొచ్చు కాని వాస్తవం మాత్రం కాదు. ఆమె సమాజం చాలా చిన్నదైనా సరే సమాజమే నిజానికి రాజేశ్వరి అలా పారిపోలేదని, సూటిపోటిమాటలు భరిస్తూ సమాజంతో జీవించిందని ఆమె స్వగతమే చెబుతుంది.

రఘురామరాజు శైలి బాగానే చదివిస్తుంది. చలం పట్ల ఆసక్తి పెరగడానికి దోహదపడుతుంది. అయితే ముందుమాట రాసిన వీరభద్రుడు కూడా స్థూలమైన అబినందనలు తప్ప తనకు ఇదమిద్ధంగా ఫలానా అంశం నచ్చిందని పేర్కొనకపోవడం గమనార్హం. అది ఈ పుస్తకం తీరుపై వ్యాఖ్యానమంటే అతిశయోక్తి కాదు. సంప్రదాయానికి చలానికి సమన్వయం సాదించి వ్యాఖ్యానించాలనే తాపత్రయం ఈ ట్రాజెడీకి దారితీయడం అనివార్యమే. కొకు, బుచ్చిబాబు, చండీదాసు పాత్రల పునాదులు చలంలో కనిపిస్తాయనే సూత్రీకరణ కూడా పాక్షికమైందనేనని చెప్పవలసి వుంది.

పోస్ట్ మాడ్రన్ పరిశీలన అనే విమర్శకుడిలో ఇలాటి లక్షణాలుండటాన్ని ఎలా అర్థం చేసుకోవాలనేది చివరి ప్రశ్న. వాస్తవంలో పోస్ట్ మాడ్రన్ అనేది ప్రీ మాడ్రన్ అనే మేధావుల విశ్లేషణను ఉటంకించడం తప్ప ఇందుకు వేరే సమాధానం అవసరం లేదు.

అనేక భిన్నాభిప్రాయాలున్నా రాజు విశ్లేషణ విషయ సంపన్నం, ఆలోచనాత్మకం అనడంలో సందేహం లేదు. మన క్లాసిక్స్ గురించి ఇలాటి చర్చలు జరిగితేనే లోతులు తెలుస్తాయి. ఘనమైన గత వారసత్వం మరుగున పడకుండా అర్థవంతమైన కొనసాగింపు పొందుతుంది. ఈ లోచూపు కావ్యపఠనానికి పథ నిర్దేశం చేస్తుంది. అందుకే ఇలాటి రచనలు మరిన్ని రావాలని కోరుకోవాలి.

***మైదానం లోతుల్లోకి... (పోస్ట్ మోడర్న్ పరిశీలన), అడ్లూరు రఘురామరాజు, ఎమెస్కో ప్రచురణ. వెల:రు. 60/-, పేజీలు 92.***

---

**కొండబాబు**




## కథా 'ఇతివృత్తం'పై గుడిపాటి విమర్శ

పాత్రికేయుడిగా, సాహిత్య విమర్శకుడిగా గుడిపాటి ఈ కాలపు పాఠకులకు చిరపరిచితుడే. దశాబ్దకాలంగా సాహిత్యంలో వస్తున్న వాదాలను పుచ్చుకుని వచ్చిన కథలు, వివిధ ధోరణులను దగ్గరగా చూస్తున్నవాడు.., రాస్తున్నవాడు గుడిపాటి. ఆయా వాదాలతోనూ, ఏవాదాలతో సంబంధంలేకుండానూ వచ్చిన వివిధ కథా సంకలనాలపై ఆయన రాసిన సాహిత్య వ్యాసాల సంపుటి ఈ 'ఇతివృత్తం'. ఈ వ్యాసాలన్నీ 'వార్త' పత్రికలో వివిధ సందర్భాలలో ప్రచురితమైనవే. ఆ రీత్యా పాఠకులకు పరిచితమైనవేనూ. అయితే పుస్తకంగా రావడం మరింత వెసులుబాటును కల్పించిన మంచి అంశం.

ఇందులోని వ్యాసాలన్నీ కేవలం కథల గురించి చర్చించేవే కావడం విశేషం. మొత్తం 21 వ్యాసాల్లో అరడజను వరకు సాహిత్యంలోని వివిధ సాహిత్యధోరణులకు సంబంధించిన సంశ్లేషణలు. మిగతావి సంకలనాలు, సంపుటాల గురించిన సమీక్షలు. వీటిలో ప్రధానంగా కన్పించేది భావధార.

'విమర్శ' అంటే వ్యవహార భాషలో తిట్టుగా పరిగణించడం పరిపాటి. అది పొరపాటు. సాహిత్యంలోనూ కువిమర్శ, సద్విమర్శగా విడగొట్టి చూసే పరిస్థితీ ఉంది. వాస్తవంలో విమర్శ అంటే మంచి చెడులను వివరించి చూపగలిగేది. అంటే పాలునీళ్ళను విడగొట్టగలిగే రాజహంస మాదిరి డ్యూటీ విమర్శకుడిది. ఆ విధంగా చూసినపుడు గుడిపాటి ఈ వ్యాసాల్లో ఆ సమతుల్యతను సాధించాడు. కథా సమీక్షణంలో మూడు అంశాలకు ప్రాధాన్యం ఇచ్చారు. అవి వస్తువు, శిల్పం అనుభూతి.

స్త్రీ వాదాన్ని స్థూలంగా బలపరిచిన విశాల దృష్టి విమర్శకులది. స్త్రీవాదం రావడానికి ముందు నుంచే ఉన్న స్త్రీవాద కథలను, అందునా కొందరు పురుష రచయితలు రాసిన విషయాన్ని ఆయన 'కథా సాహిత్యంలో స్త్రీవాద భావధార'లో సోదాహరణంగా చెప్పారు. 'చలం కేవలం స్త్రీల లైంగిక స్వేచ్ఛ గురించే రాశారన్న వారూ ఉన్నారు.. ఏం? లైంగిక స్వేచ్ఛ గురించి 'మాత్రమే' రాసినా తప్పేమిటని' అని ఆయన చలాన్ని పరిమితంగా అర్థం చేసుకున్నవారిని సూటిగా ప్రశ్నిస్తారీ వ్యాసంలో. మొత్తంపైన ఈ అంశంపై ఆయన చాలా సానుకూల దృక్పథం వుంది. 'స్వాతంత్ర్యానికి పూర్వం శ్రీపాద, కొడవటిగంటి రాసిన కథలు స్త్రీలను విపరీతంగా ప్రభావితం చేశాయి. స్త్రీవాదం పాదుకోక ముందు శ్రీదేవి, అబ్బూరి ఛాయాదేవి, వాసిరెడ్డి సీతాదేవి, రంగనాయకమ్మ వంటి వారి రచనలూ స్త్రీ చైతన్యానికి దోహదపడ్డాయని విస్పష్టంగా పేర్కొన్నారు. కొందరు ఇదే దృక్పథంతో రచనలు చేసినా గాఢమైన ముద్రతో... ఒక విధంగా స్త్రీవాద కథకు ఆద్యురాలు రంగనాయకమ్మ. ఆమె 'అమ్మ' రాసిన పదేళ్లకుగానీ స్త్రీవాద కథలు రాలేదు. స్త్రీల విముక్తిని సహజ విముక్తిలో భాగంగా చూసే దృక్పథానికి ఒకప్పుడు పైచేయి. తమకు మాత్రమే ప్రత్యేకమైన సమస్యలను గుర్తించడం స్త్రీవాదం చేసిన పని. ఓల్గా 'రాజకీయ కథలు, శరీర రాజకీయాలకు సంబంధించిన స్పృహను అందించాయి. ఇక్కడే రంగనాయకమ్మకు ఓల్గా కొనసాగింపుగా కనిపిస్తుంది' అని రచయిత రాసిన అభిప్రాయం పరిణామాలను చాలా వరకు సరిగ్గానే అందించింది. స్త్రీ సాహిత్య చరిత్రకు సంబంధించి ఈ కొనసాగింపు భావన సరైందే కావచ్చుగాని వారిద్దరి దృక్కోణాలకు దాన్ని అన్వయించడం కుదరదు.

అయితే ఆయా కథలు రావడంలోని సామాజిక, ఆర్థిక, రాజకీయ, సాంస్కృతిక నేపథ్యాన్ని రచయిత చర్చించకపోవడం లోపం.


Untitled-2 91 6/11/2002, 3:51 PM

స్వాతంత్ర్యానికి పూర్వం ఆంగ్లేయుల ప్రభావం, తర్వాత్తర్వాత స్వాతంత్ర్య పోరాటం, వామపక్ష ఉద్యమాలు.. ఇవన్నీ స్త్రీలలో తెచ్చిన చైతన్య ప్రభావం స్పష్టం. తొలి కథ రాశారని భావిస్తున్న బండారు అచ్చమాంబ నుంచి కుప్పిలి పద్మ వరకు ఉన్న ఈ నేపథ్య ప్రభావాన్ని రచయిత చెప్పి ఉండాల్సింది. అయితే, 'మన దగ్గర స్త్రీవాదం పాదుకోడానికి అంతకుముందు వామపక్షాల్లో పనిచేసిన వారి దోహదం అధికం' అని కొంతమేరకయినా, అస్పష్టంగానయినా చెప్పారు. స్త్రీవాదంలో గల భావ వైరుధ్యాలనూ రచయిత స్పృశించారు. వివాహ వ్యవస్థ, కుటుంబ వ్యవస్థ, అంతిమంగా స్త్రీలను అణచివేస్తున్నాయని, వామపక్ష ఉద్యమాల్లో పనిచేస్తున్న స్త్రీవాదులు మాత్రం ఈ రెండు వ్యవస్థలను బలపరుస్తున్నారని రచయిత అభిప్రాయపడ్డారు.

సమాజంలోని ప్రతి వ్యవస్థా గతం కంటే ప్రయోజనకరమైన మార్పు దిశగా పరిణమిస్తుందన్నది గతి తర్కం. అది అదే రూపంలోనో, పూర్తిగా మారిపోయో, దాని స్థానంలో ప్రయోజనకరమైన వేరేదో వస్తుందన్న అవగాహన, వివాహ, కుటుంబాల్లోనూ జరుగుతుందన్న అవగాహన వారిలో ఉందనేది సత్యం. స్త్రీవాద ధోరణుల్లోనే విభిన్నతలు బహుశా ఈ విషయాన్ని స్పష్టంగా వెల్లడి చేసి ఉండకపోవచ్చు. రచయిత దానిని స్పష్టం చేయలేదు.

రచయిత అనేక విషయాలపై తనకున్న అభిప్రాయాలను స్వేచ్ఛగానే వెల్లడించారు. 'మార్గం చూపడం రచయిత పని కాదు. సమాజాన్ని, అందులోని వైవిధ్యాలను చిత్రించి, ఆలోచింపజేస్తే చాలు' అని ఆయన ఒక చోట వ్యాఖ్యానిస్తారు. వైవిధ్యాలను చిత్రించడం వరకూ చేసినా అంతవరకూ అది మంచిదే. అయితే అది పరిమితితో కూడినదే అవుతుంది. అయినా కానీ మార్గం చూపించగలిగిన కోణాలపై అవగాహన ఉన్నపుడు శిల్పం చెదరకుండా రచయిత చెప్పగలగడం ఎప్పుడూ ఉపయోగమే.

దళిత కథ బహుముఖాన్ని కూడా ఈ పుస్తకంలో రచయిత సమర్థవంతంగానే చిత్రించారు. 'మాలమాదిగలను ఇప్పుడు హిందువుల్లో భాగంగా చెపుతున్నారు. కానీ, ఎప్పుడూ ఆ సమాజం వారిని తనలో ఇముడ్చుకోలేదు. సంస్కృతీకరణ ప్రభావం వల్లే వారు ఈ జీవన విధానాన్ని అలవర్చుకున్నారు' అని సమాజంలోని మత రాజకీయాలను ఆయన స్పష్టంగానే చెప్పారు. దళితుల స్పృహకూ, పోరాటానికీగల నేపథ్యాన్ని చెపుతూ.. స్వాతంత్ర్యానికి పూర్వం, తర్వాత చుండూరు ఘటనల వరకూ, దళితవాదం పాదుకోవడం.. అంటూ రచయిత మూడు దశలుగా విభజించారు. కానీ, ఈ మూడు దశల్లోనూ గల రాజకీయ, ఆర్థిక, సామాజిక పరిణామాల ప్రస్తావన లేకపోవడం లోపం. చుండూరు, కారంచేడు ఘటనల ప్రస్తావన ఉంది కాబట్టి సాహిత్యానికే పరిమితమయ్యారనుకోవడం సరికాదు. స్వాతంత్ర్య పోరాటంలోని ప్రతిఘటన స్ఫూర్తి, వామపక్ష-కూలీ ఉద్యమాల చైతన్య ప్రవాహ ప్రభావం.. దళిత స్పృహకు ఒక నేపథ్యాన్ని అందించాయన్న వాస్తవం విస్మరించరానిది. 'దళితుల గురించి రాసినవన్నీ దళిత కథలేనా? దళితుల గురించి దళితులు మాత్రమే రాయాలా?' అనే వివాదాస్పద అంశాలపై రచయిత విస్పష్టంగానే చెప్పారు. ఏది దళిత కథ అని చర్చించకుండా దళితుల జీవితాన్ని చిత్రించిన, చర్చించిన కథలన్నింటినీ పరిగణించాలన్నది రచయిత అభిప్రాయం. అదే సమయంలో తన జీవితంలోని మనో క్లేశాలను, అవమానాలను, అనుమానాలను, అనుభూతులను దళితుడిగా పుట్టిన వాడే సరిగ్గా వ్యక్తీకరించగలడు.. అని గుడిపాటి పేర్కొన్న అభిప్రాయం సరైనదే. ఆ రీత్యానే శ్రీపాద రాసిన 'పుల్లంరాజు' కథ నుంచి నేటి దళిత ఎమోషన్స్‌తో దళితులే రాస్తున్న కథల వరకూ క్లుప్తంగానే అయినా సోదాహరణంగానే చర్చించారాయన. చరిత్రలో ఏ మార్పూ సంపూర్ణ కాదన్న చరిత్రకారుడు డి.డి.కోశాంబి మాటలతో ఏకీభవిస్తూ 'పెట్టుబడిదారీ వ్యవస్థ ప్రపంచీకరణతో కూడా నేటికీ కుల ఉచ్చుల్నుంచి తప్పించుకోలేకున్నాం' అని పేర్కొన్నాడు.

ఆర్థిక సమానత్వం సాధిస్తే అంటరానితనం సమసిపోతుందన్న అవగాహన సరైంది కాదంటాడు రచయిత. అదే సమయంలో అంటరానితనం వేళ్లూనుకుని ఉండటానికీ, పోకపోవడానికీ ఆర్థిక లేమే అడ్డుగా ఉందని రచయిత గుర్తించినట్లు కనబడదు. కులాధిపత్య భావనలు, కుల పీడనలు పోవాలంటే ఆత్మగౌరవపోరాటమొక్కటే చాలదు. ఆర్థిక పోరాటమే దానిని నిలబెడుతుంన్నది నిజం. కథ కాదు గానీ పాటిబండ్ల ఆనందరావు 'నిషిద్ధాక్షరి'(నాటకం)లో ఆ విషయాన్ని స్పష్టంగానే రాశారు. అయితే దళితవాదం స్పృశించిన అనేక కోణాలను రచయిత నిబద్ధతతో చర్చించారీ వ్యాసంలో.

'తెలంగాణా కథ - భాష' అనే వ్యాసాన్ని తెలంగాణా ప్రాంత భాషపై జరిగిన దాడి గురించి ప్రధానంగా రాశారు. 'ఆంధ్రప్రదేశ్ ఏర్పడడం తెలంగాణా భాష, సాహిత్యాలకు గొడ్డలిపెట్టని' చేసిన వ్యాఖ్యానంలో మౌలికాంశాల విస్మరణ కనిపిస్తుంది. 'ఆర్థికంగా బలంగా ఉన్నవాడు ఇతరులపై ఆధిపత్యం చలాయిస్తాడు. అనేక రూపాల్లో తన ఆధిపత్యాన్ని ప్రదర్శిస్తాడు' అని రచయిత మరోచోట తానే చేసిన వ్యాఖ్యానంలో ఉపరితల భావం కాక మూలాంశం ఇమిడి ఉంది. దళిత స్త్రీవాద రచనలపై ఆయన పరిశీలనల్లో వున్న సంయమనం తెలంగాణా సమస్యలా కనపడదు.

ఇవేకాక తెలంగాణా సామాజిక, ఆర్థిక, రాజకీయ సంబంధాల్లో మార్పులను చిత్రిస్తూ వచ్చిన 'రుతు పవనాలు' కథా సంకలనాన్ని, నూరేళ్ల స్త్రీ భావ, స్త్రీవాద సాహిత్యాన్ని సంకలించిన 'నూరేళ్ల పంట'నూ గుడిపాటి తనదైన ప్రగతిశీల భావ దృష్టితో సమీక్షించారు. తెలుగు కథలో శిల్ప లోపాన్ని ఎత్తిచూపుతూ, వస్తు వైవిధ్యాన్ని ఆహ్వానిస్తూ '1997లో తెలుగు కథ'పై ఒక మంచి వ్యాసం ఉందీ పుస్తకంలో. 'భమిడిపాటి కథా పరాగం' అంటూ జగన్నాథరావు గారి కథల్లోని అనుభూతులను మరో వ్యాసంలో పరిచారు. అలాగే పెద్దిభొట్ల సుబ్బరామయ్య గారి కథలను, విలోమ కథలను, కవనశర్మ కథా ప్రపంచాన్ని సమీక్షించారు. 'స్త్రీవాద ప్రకంపనలను రికార్డు చేసిన కుప్పిలి పద్మ కథలు' అంటూ కితాబునివ్వడం బాగుంది. అలాగే నాగావళి తీర 'ఏటిపాట' వంటి సంపుటాలను ఆయన చిత్రిక పట్టారు. కథా శిల్పానికి వన్నె తెచ్చే 'వాదాహయత్ కథలు' అంటూ చేసిన వ్యాఖ్యానం సరైందిగానే తోస్తుంది ఎవరికైనా ఈ కథలుగానీ, సమీక్షగానీ చదివితే.

మొత్తం కథల్లోనూ స్త్రీవాద, దళిత, ప్రాంతీయవాద కథల్లోనూ ఇతివృత్తాన్నే కాక శిల్పం, అనుభూతుల స్థాయినీ రచయిత వడగట్టారు. 'శిల్పదృష్ట్యా పరమహీనమైన రచనలో భావాలు అభ్యుదయకరంగా ఉన్నా, జరిగేనష్టం ఒక వ్యక్తికో, ఒక రచనకో కాదు, మొత్తం అభ్యుదయసాహిత్య ఉద్యమానికీ. కాబట్టి సాహిత్య ఉద్యమకారులు సాహిత్యంలో శిల్పానికి గల విలువనూ స్థానాన్నీ గుర్తిస్తారని ఆశిస్తున్నాను' అని రాచమల్లు రామచంద్రారెడ్డి అన్నారు. గుడిపాటి ఈ మాటకు ద్వితీయ ప్రాధాన్యాన్ని ఇచ్చి, ఇతివృత్తాన్ని ప్రధానంగా చర్చించారు. అలాగని శిల్పానికి ప్రాధాన్యం లేదనే భావన రానీయలేదు. అనుభూతి అన్నది ఏ రచనలో అయినా సహజ సిద్ధమైనదిగా ఉండాలి. ఎమోషన్ పేరిట అనవసరపు ఆవేశాలను, పెడబొబ్బలను జొప్పించరాదు. ట్విస్ట్ ఉండే సగటు కథలోనూ, సినిమాలోనూ కనిపించే క్షుద్రనాటకీయ సన్నివేశాల స్థాయి ఈ సందర్భంగా గమనార్హం. అనుభూతి అన్నది పైకి వ్యక్తంకాని గుండెలు పెకలించే వేదన, అయితే క్షుద్రనాటకీయత(మెలోడ్రామా) అన్నది కూలికి వినిపించే రోదన. శిల్పం, అనుభూతుల్లో స్థాయి లేనంత మాత్రాన చర్చకు పెట్టిన 'వస్తువు' తోసిరాజనకూడదన్న అభిప్రాయం ఈ వ్యాసాల్లో కనిపిస్తుంది. అంతేకాదు సాహిత్యానికే పరిమతమయిన పడికట్టు భాష కాకుండా వ్యవహారికంలో, అర్థమయ్యే పత్రికా భాషలో నడుస్తాయీ వ్యాసాలన్నీ. మొత్తం మీద చదివించే లక్షణంగల చదవాల్సిన పుస్తకం గుడిపాటి 'ఇతివృత్తం'.

**విజయవాడ "ఋషి" ప్రచురణలు వారు ప్రచురించిన ఈ 157 పేజీల పుస్తకం ధర రూ 45-.**

V



Untitled-2 92 6/11/2002, 3:51 PM

స్వేచ్ఛానువాదం : కె.బి.ఆర్.

# చిత్ర చలనం

**జా** లూక్ గొడార్డ్. తలచినంతనే, తలపుకొచ్చినంతనే, కలల చిత్రాలను బద్దలు చేస్తూ విస్ఫోటనం చెందే కలకలం.

స్తబ్ధ సుందర మానస కాసార జలాలను అల్లకల్లోలం చేసే చిత్రవిచిత్ర మాయాచిత్ర డిస్టర్బెన్స్ గొడార్డ్. జీవితమనే ఓ అంతులేని చిత్రకథాశాలలోని లెక్కకు మిక్కిలి రసాయనాల సమ్మేళనంతో గొడార్డ్ నిరంతరాయంగా సాగించిన ప్రయోగాల ఫలితంగా చిత్రం 'నవతరంగం' (న్యూ వేవ్)గా ఉవ్వెత్తున ఎగిసి వెండితెరతో నూతన ప్రస్థానాన్ని చేయించింది. ఆ కొంగొత్త యాత్రకు తెరతీసిన ఆద్యుల్లో ఒకడిగానే కాదు, దిశాదశలను దినకరుని తీరున దిద్దితీర్చిన సినీ జీనియస్ గొడార్డ్.

సాఫీగా సాగేది జీవితం కాదు. హాయిగా చూసేది సినిమా కాదు. జీవితం ఓ డిస్టర్బెన్స్. దాన్ని అద్దం పట్టే అనంత డిస్టర్బెన్స్ గొడార్డ్ చిత్రం. గొడార్డ్ పుట్టింది 1930 డిసెంబర్ 3న. స్విట్జర్లాండ్‌లో.

ఓ రోజు రాత్రి ఇంటర్నెట్ మహా సాగరంలో ఈ దులాడు గొడార్డ్ సుడిలో చిక్కుకున్నాను. ఆ సుడిలో కొట్టుకుపోగా పోగా దొరికిన అమృతమే ఈ కవిత్వం.

నిజానికి గొడార్డ్ కవిత్వం రాయలేదు. ఆయన రాతలు, మాటలే ఈ కవిత్వం. వీటిని ఎంతో శ్రమకోర్చి ఏరికూర్చిన గ్లెన్ డబ్ల్యు. నార్టర్ వాటిని కవితాపాదాల రూపులో మనముందుంచాడు. వాటికి స్వేచ్ఛానువాదమే ఈ వరుస.



చిత్రం
సెకనుకు
ఇరవై నాలుగు ఫ్రేముల
సత్యం

• • •

సినిమా
వాస్తవ ప్రతిబింబం
కాదు,
ప్రతిబింబ వాస్తవం

• • •

చిత్ర సృష్టికర్తగా
నేనున్నాను
కపోలా, మొజాంబిక్ సమాచార మంత్రి
నడుమన

• • •

వ్యక్తులు తమను తాము
స్టేషన్లుగా, టెర్మినళ్ళుగా ఊహించుకోవడానికి
ఇష్టపడతారు
రైళ్లుగానో, విమానాశ్రయాల మధ్య
తిరుగాడే విమానాలుగానో కాదు
నన్ను నేను
విమానంగా ఊహించుకోవడానికే
ఇష్టపడతాను
విమానాశ్రయంగా కాదు

• • •

ఈ ఆటలోఉన్నాయి–
అతి ఎక్కువ విషయాలు
అతి ఎక్కువ స్త్రీలు
అతి ఎక్కువ డబ్బులు
అతి ఎక్కువ కథలు
అతి ఎక్కువ న్యాయాలు
అతి ఎక్కువ స్వప్నాలు
అతి ఎక్కువ లెక్కలు
అతి ఎక్కువ నిర్లక్ష్యాలు
అందుకే
దీన్ని
జనం
ఇష్టపడతారు

• • •

చిత్రం
ఒక
విప్లవాత్మక కళ
ఎందుకంటే ఇది
చలనం అనుభూతి
ఆ అనుభూతి 'యవన కలశా'నికి
ఉండదు

• • •

శబ్దం
అంటే
నాకెంతో
ఆసక్తి
ఒక చిరు గడ్డివరకనే
తీసుకుంటే– మొలుస్తున్నపుడు
దానికి, పుడమికి మధ్య
శబ్దం నడిచేస్తుంటుంది

• • •

కెమేరాను
ఆయుధంగా ఉపయోగించినపుడు
మీరు
ఇన్ఫార్మర్ అవుతారు

• • •

నేనంటాను కదా–
జీవితం నుంచి దాని 'చిత్రా'న్ని
దొంగిలించిన క్షణం నుంచి,
అందిస్తున్నది చౌర్యమైనపుడు
"దుఃఖించ"డం అవశ్యం
అందుకే, తెలుగు నలుపులో
చిత్రాన్ని కనుగొన్నారు
జీవితం కోసం దుఃఖించడానికి

• • •

ఒకానొక
ఇటాలియన్ నిర్మాతతో
చిత్రం తీయాలని
ప్రయత్నించడం
ఒకానొక
పందితో
సంభాషించాలని
ప్రయాసపడటం

• • •

నిరాడంబరతే సంపూర్ణత్వం
నిజాయితే సౌందర్యత్వం
చిత్రంలో
మీరు చెప్పవచ్చు–
మూవీని ఇష్టమొచ్చినట్టు
తీయాలనుకునే
వ్యక్తుల తెగ
సామ్రాజ్యవాదమని

• • •

మన సమాజం
సొంత గమ్యాన్ని సృష్టించుకుని,
సొంత స్వేచ్ఛను 'గమ్యం'గా
వర్ణించిన క్షణాన
గమ్యం
మన భావనను తిప్పికొడుతుంది
ఈ స్వేచ్ఛ
'పరిమిత'మని పట్టిచెబుతుంది

• • •

వ్యక్తులు దేహాలను
ప్రదేశాలుగా తలపోస్తారు
వారు చర్మాన్ని
సీమరేఖగా భావిస్తారు
హద్దు దాటి
ఒక్కసారి
బయటికొస్తే
తామింక
ఎంత మాత్రం
తాము
కాదని
అనుకుంటారు
అయితే
భాషంటూ ఒకటి
ఏర్పడింది స్పష్టంగా
సరిహద్దులను
దాటడానికి
భాష నిజమైన దేశం
ప్రదేశం చిత్రాలు
అయినటువంటి
ఒకానొక వ్యక్తిని నేను



Untitled-2 93 6/11/2002, 3:51 PM

# స్వీకారం




**బచ్చేదానీ**
**గీతాంజలి**
వెల : రు. 50
ప్రచురణ : గోదావరి ప్రచురణలు



**విశిష్ట**
**డా॥ డి.ఎం. రవిప్రసాద్**
వెల : రు. 50
ప్రచురణ : మైత్రేయ పబ్లికేషన్




**వెండి మేఘం**
**సలీం**
వెల : రు. 80
ప్రచురణ : శ్రీ విజయలక్ష్మి పబ్లికేషన్స్



**వయ్యా సామేలు పాటలు**
**వయ్యా సామేలు**
వెల : రు. 20
ప్రచురణ : ఆంధ్రప్రదేశ్ అభ్యుదయ రచయితల సంఘం




**మతం-రాజకీయాలు-టీవీ**
**అరవింద్ రాజగోపాల్**
వెల : రు. 8
ప్రచురణ : ప్రజాశక్తి బుక్‌హౌస్



**సాగర కోయిల**
**ఎం.ఆర్. అరుణకుమారి**
వెల : రు. 75
ప్రచురణ : పృథ్వీ పబ్లికేషన్స్




**సునాముది జీవధార**
**డా॥ కె. ముత్యం**
వెల : రు. 75
ప్రచురణ : ప్రజాశక్తి బుక్‌హౌస్



**నడక**
**అన్నవరం దేవేందర్**
వెల : రు. 60
ప్రచురణ : నూతన సాహితీ




**భారతదేశ చరిత్ర**
**ఇ.ఎం.ఎస్. నంబూద్రిపాద్**
వెల : రు. 25
ప్రచురణ : ప్రజాశక్తి బుక్‌హౌస్




**గోగుపూలు**
**పోలాడి లింగారావు**
కూనలమ్మ పదాలు
వెల : రు. 20
ప్రచురణ : పోలాడి లింగారావు



Untitled-2 94 6/11/2002, 3:51 PM

# ఈ చెట్టు నీడన మనసెంతో చల్లన

డా॥ కడియాల రామమోహనరాయ్



"I have had my invitation to this world's festival and thus my life has been blessed. My eyes have seen and my ears have heard."

**- Tagore**

**"జీవితమహోత్సవంలోని అమృతాన్ని ఆవిష్కరించటమే కవిత్వం చేసేపని. ఈ విధంగా మన చేతనని సుసంపన్నం చేస్తుంది కవిత్వం"**

**(ఇస్మాయిల్)**

నిత్య జీవితానుభవాలకి సున్నితంగా స్పందించే కవి ఇస్మాయిల్. ఆయనకు జీవితమూ కవిత్వమూ వేరు కావు.

ఇస్మాయిల్ తన యవ్వనంలో మార్క్సిజాన్ని అభిమానించారు. కమ్యూనిస్టు పార్టీలో చేరారు. "ఏదో తెలుసుకోవాలనే ఆరాటం, దేన్నో సాధించాలనే తపన – సాంఘికమైనవీ మానసికమైనవీ సంకెళ్లను తెంచుకోవాలనే ఆవేశం, లోనా పైనా చెలరేగిన అశాంతికి మార్క్సిజం ఒక కాయకల్ప చికిత్సగా" తోచిందాయనకు.

ఇస్మాయిల్ స్వభావతఃకాల్పనిక వాది. మార్క్సిజం చట్రంలో ఇమడలేక పోయారు. కాకినాడలో తమ ఇంటికి పక్కనే ఉన్న కృష్ణశాస్త్రి ఇస్మాయిల్ మనస్సులోగొన్నారు.

"విరులు విరిసిన విరుల సరము తురిమిన వేణికి భరము భరమై యొరిగి వలపు వెలుగులు మలయశర్వరీ చలిత చేలాంచలము మెరసినది – లాంటి తొలి కవితలు కృష్ణశాస్త్రి ప్రభావంతో రాసినవి.

కొంత కాలం తర్వాత కృష్ణశాస్త్రి భావనా ప్రపంచంతోనూ ఇస్మాయిల్ అసంతృప్తి చెందారు. "కవిత్వ పక్షాలతోకాని అందుకోలేని ఊహాలోకమది" అని తలచారు. "మనం ప్రపంచాన్ని అనుభవించి తెలిసికొనేది పంచేంద్రియాల ద్వారా కనుక దీని కిటుకు ఇంద్రియానుభవంలోనే వుండి తీరుతుందనుకున్నాను. వెంటనే మార్క్సిజం నుంచి, భావుకత్వాన్నుంచి తిరోగమించి, నాలో సగమైన ప్రపంచమూ, ప్రపంచంలో సగమైనా నేనూ కలుసుకుని పరిపూర్ణత్వాన్ని సాధించే చోటికి ప్రస్థానం ప్రారంభించాను. ఇది 1945లో ఆ ఏడాదే నా ఆఖరి భావకవిత రాశాను" అన్నారాయన.

15 సంవత్సరాల మౌనం తర్వాత 1960లో ఇస్మాయిల్ తన అనుభూతులను వెల్లడించే కవితను ప్రారంభించారు. 1972లో 'చెట్టు నా ఆదర్శం' కావ్య సంపుటి వచ్చేదాక, కొద్దిమంది సన్నిహితమిత్రులకి తప్ప, కవిగా ఆయన పేరు ఎవరికీ తెలియదు. అప్పట్లో శ్రీకాకుళంలో ప్రారంభమైన రైతాంగ పోరాటం విప్లవ కవిత్వోద్యమానికి స్ఫూర్తినిచ్చింది. ఆ ఉద్యమవేగానికి కొట్టుకొని పోకుండా, అంతర్ముఖుడై, తనకీ ప్రపంచానికీ సామరస్యం కోసం చేసిన ప్రయత్నమే ఆయన కవిత్వం.

'చెట్టు నా ఆదర్శం' రసజ్ఞులను ఆకట్టుకొన్నది. ఊహలలో కొత్తదనమూ, రుజుత్వమూ, అద్భుతమైన పదచిత్రాలూ, అమేయమైన భావనాబలమూ, ఏ కవికీ ప్రతిధ్వని అనుకరణకాని అనుసరణకాని భావ ప్రకటనారీతి సహృదయుల మనస్సులను కైవసం చేసుకున్నాయి.

**"దివిలో ఊగే విహంగాన్ని**
**భువిలో పాకే పురుగు బంధిస్తుంది**
**రాత్రి వచ్చిన రహస్యపు వానని**
**ధాత్రిని దాగిన వేళ్లు బంధిస్తాయి**
**ఈ మనిషి ఆ మనిషిని బంధిస్తాడు**
**ఇద్దర్నీ కలిపి బంధిస్తుంది మనీష!"**

(స్వేచ్ఛాగానం)

**"మనిషీ! మనిషీ!**
**పిట్టలకు ఎగరటం నేర్పిన**
**చెట్టుని చూడు**
**ఏ భాషలో పుష్పిస్తుందది**
**ఊహల నీడల్లో మాపటి వేళల్లో**
**ఊడల్లా కావిలించుకునే**
**ప్రియులహస్తాలు**
**ఏ భాషలో తడుముకుంటాయి!!**

(మనిషీ!మనిషీ!)

ఇంకా వరిమళ్లల్లో యీదే చిరు ఆకాశాలూ, చిట్టిపరిగలూ, విరుల రాల్చు తరువులూ, అకస్మాత్తుగ దిగిన వానపొర క్రమంగా వ్యాపించి ఆకులపై రంగులు అంతరించటంలాంటి ఊహలు చిత్రమైన ఆహ్లాదాన్ని కలిగిస్తాయి.

అపురూపమైన పదచిత్రాలను చిత్రించటంలో ఇస్మాయిల్ ప్రజ్ఞావంతుడు.

"సవ్వడి చెయ్యక భూమి బుగ్గపై
చల్లటి నవ్వుసొట్టలా
ముడుచుకుంటుంది బావి"

"ఎవరూ ఎరగని ఏదో కాయలా బరువుగా



Untitled-2 95 6/11/2002, 3:51 PM

నా మెదడు చెట్టుని పెరుగుతోంది
యీ ముసురు"–

వేయేళ్ళ తెలుగు కవిత్వంలో 'బావి' 'ముసురు' కొత్త కావ్య వస్తువులు కావు. కాని ఇస్మాయిల్ వాటిని వర్ణించినపుడు ఉపయోగించిన ఉపమానాలు సరికొత్తవి.

ఆధునిక కవిత్వంలో ఆధునికత్వం ఏమిటి? అని అడిగే వారికి యీ పోలికలను ఆధునికత్వానికి సరైన ఉదాహరణలుగా చూపించవచ్చు. పై పోలికలలో అస్పష్టత లేదు. కాని ఆధునిక కవిత్వంలో అస్పష్టతకు ఇస్మాయిల్ వ్యతిరేకి కారు. "అనుభవాన్ని అనుభవంగా యథాతథంగా దాని సంక్లిష్టాలతో జాటిల్యాలతో చిత్రించటాన్ని ఆయన ఇష్టపడతారు. "యథార్థ జీవితపు కోలాహలంలోకి, శ్రుతి ఎవరు ప్రవేశపెట్టగలరు? అయినా కవులు ప్రయత్నిస్తానే ఉంటారు. భాషోభావమో ఏదో తెగేవరకు వాగుతూనే ఉంటారు. అందుకే ఆధునిక కవిత్వంలో అక్కడక్కడా అస్పష్టతా, అయోమయమూ. ఈ పాపం కవిది కాదు. జీవితానిది" అంటారు ఇస్మాయిల్ (కవిత్వంలో ఆధునికత)

'సాయంత్రపు సువాసలు' అనే గీతంలో "సూర్యసింహం రాత్రులు పడుకునే గుహల వాసన ఈమె దేహంనిండా" "ఒకటొక్కటిగా చుక్కలు పొడిచే ఆకాశపు నీలి వాసనలు ఈమె కళ్ళల్లో" లాంటి ఆలోచనలు ఒకపట్టాన సహృదయుల మనస్సులకెక్కవు.

కవిత్వానికి శబ్దమెంత ముఖ్యమో నిశ్శబ్దం కూడా అంతేనని ఇస్మాయిల్ తలుస్తారు. శబ్దాలు వెల్లడించలేని అనుభూతులను పద చిత్రాలు వ్యక్తీకరిస్తాయని యీయన భావిస్తారు. "మాటల కందని సంక్లిష్టమైన అనుభవాలతో జటిలమైన ఆధునిక ప్రపంచం ఈ పద చిత్రాల ద్వారా మన అనుభూతి ఆవరణలోకి ప్రవేశించగలుగుతోంది." (కవిత్వంలో నిశ్శబ్దం). గదికిటికీలు ఆకాశాన్ని ఆహ్వానించినట్లు విశాలమైన జీవితాన్ని పదచిత్రాలు కవిత్వంలోకి ఆహ్వానిస్తాయి.

సౌందర్యోపాసకులకూ ప్రకృతిని ఆరాధించేవారికి ఇస్మాయిల్ కవిత్వం మరపురాని మధురానుభూతులను మిగులుస్తుంది. కాని, సమాజంలో మార్పుకోరేవారికి ముఖ్యంగా పేద ధనిక వర్గాల మధ్య వ్యత్యాసం తగ్గి సమసమాజం ఏర్పడాలని కోరుకునేవారికి ఇస్మాయిల్ కవితలు సోమరిపోతుల మధురోహల్లా అనిపిస్తాయి.

కొన్నిచోట్ల రసజ్ఞులు వెలపరంగా భావించే ఊహలు ఇస్మాయిల్ కవిత్వంలో ఉన్నాయి. **"ఇప్పుడీ టీ మీద కనురెప్పలా, పల్చటి పొర కప్పింది/ కలలు కనే కన్నులా/ ప్రియురాలి రహస్య చర్మంలా/ ఒడిసిపట్టుకున్న గువ్వలా/ కొద్దిగా చలిస్తోంది/ ఇదే అదను/ టీ తాగటానికి.** (టీ కప్పు).

ఈయన కవిత్వంలో సెక్స్ అబ్సెషన్ ఎక్కువే. సంక్లిష్టమైన ఆధునిక సమాజంలో మార్పును కోరకపోవటంగాక సెక్స్‌కి అనవసరమైన ప్రాముఖ్యం ఇవ్వటం మెచ్చదగిన అంశం కాదు.

రవీంద్రుడూ కృష్ణశాస్త్రీ ఇస్మాయిల్‌కి ఇష్టమైన కవులు. ఎంత ఇష్టమైనా రచనల్లో వారినే కాదు ఎవరినీ అనుకరించకపోవటం ఈయన ప్రత్యేకత.

"ఆకాశము నొసటపొడుచు అరుణారుణతార"గా కృష్ణశాస్త్రి అరుణపతాకాన్ని వర్ణించారు. కాని ఇస్మాయిల్‌కు ఎరుపంటె తగని వెగటు. అనంతపురంలో గాడిదలు, పార్టీ(గా) మహాసభ, మార్క్సిస్టు మిత్రునికి, వడ్రంగి పిట్ట మొదలైన గీతాలలో యీయన కమ్యూనిస్టుల్ని కసితీరా తిట్టారు. కవి అంతర్ముఖుడైనంతమాత్రాన తనకు సరిపడని రాజకీయ విశ్వాసాలను తిట్టడం బావుండలేదు.

'బోటులో టాగోర్' కవితలో ఇస్మాయిల్ నదిబాజానివెూగించి సదా బాలకునిగా రవీంద్రుని దర్శించారు. రవీంద్రుని సుభా, ఫటిక్, నీలకాంత్, కాబూలీవాలా మనస్సులలోని వెతలను, పద్మా నదిని చీలుస్తూ విన్పిస్తున్న హాహాకారాలను తెలిపారు. మానవ ప్రేమ మతద్వేషంగా మారినందుకు చింతించారు.

విప్లవాన్ని అంగీకరించలేకపోయినా, వీరుల సాహసాన్ని ఇస్మాయిల్ మెచ్చుకుంటారు. నగ్నమునిని ఉద్దేశించి ఆయన రాసిన కవితలో **"దూకుళ్ళకీ పరవళ్ళకీ అడుగున ఎంత గట్టి గండెలుండాలో"** జలపాతం ఎండిపోయాక బయటపడ్డ బండల్ని చూపించి చెప్పారు (వైరు)

ప్రేమికుల హృదయంలోని ఆతృతను ఇస్మాయిల్ 'జంక్షన్' కవితలో హృద్యంగా తెలిపారు.

చిలకలు వాలిన చెట్టు లోతైన కావ్యం లాంటిది అని తెల్పిన కవి ఊహవిశిష్టమైనది, కవులూ రసజ్ఞులూ కలకాలం తలచుకోదగినది.

చెట్టు ఎండిపోయి ఫర్నిచరుగా మారిపోయి సాంసారిక జలదాల్నించి ఆనందపు జల్లులు కురిపిస్తుందన్న భావన రమ్యమైనది.

**"ఊరుమారితేగాని బుర్రమారనట్టుంది"** అనే ఊహ చాలాసార్లు మనస్సులో మెదులుతుంది. కవి వాక్కులోని స్వచ్ఛమైన స్పష్టత అచ్చెరువు గొలుపుతుంది.

ఇస్మాయిల్ కవితల్లో వాన్‌గో, పికాసో లాంటి చిత్రకారులు కళాభిమానులకు ఆత్మబంధువుల్లాగ తోస్తారు. "పికాసో గీసిందికన్నా చెరిపింది ఎక్కువ/ మన కళ్లమీది కటకటాల్ని/ కుంచెతో చెరిపేశాడు" అనగానే రసజ్ఞుల కళ్లు కళాజగత్తులోకి దృష్టిని సారిస్తాయి.

**"జీవితానికి గట్టు మృత్యువు, ఇక్కడితో అన్నీ ఆగిపోతాయి/ చలించే నీళ్ళు/ చంద్రకాంతిలో మెరుస్తున్నాయి. ఇంతకు మించి ఏమీ చెయ్యలేవు నువ్వు/ కాంతివంతం చేసుకో జీవితాన్ని/గట్టును తాకి ఆగిపోయేదాకా"**/ జనన మరణాల గురించి కవి చేసిన యీ వ్యాఖ్యానం ఆలోచనామృతమైనది.

హైకూ కవి ఇస్మాయిల్ : హైకూ ఒక జీవిత విధానం. ఇది జీవితానికి అర్థాన్ని సార్థకతనూ సమకూరుస్తుంది. ఒక చక్కని రంగుల పక్షిలాగ, అప్పుడే వికసించిన పుష్పంలాగ జపాన్‌లో హైకూ కవిత్వం అత్యంత సహజంగా ప్రకృతిలో భాగంగా పుట్టుకువచ్చింది. జపనీయుల సౌందర్యోపాసన హైకూ కవితల్లో అద్భుతంగా రూపుదిద్దుకొన్నది.

ఆధునిక తెలుగు కవిత్వంలకి హైకూను ప్రవేశపెట్టిన ఖ్యాతి గాలి నాసరరెడ్డిది. ఆయన కొన్ని మంచి హైకూలు రాసి చక్కని వరవడి పెట్టారు.

తెలుగులో మొదటి హైకూ రాసిన కవి ఇస్మాయిల్ కాకపోయినా హైకూ పేరు వినగానే ఆయన పేరే ముందుగా మనసులో మెదులుతుంది. ఇస్మాయిల్ రాసిన హైకూలు చదివి చాలా మంది తెలుగు కవులు హైకూ రచనకు ఉబలాట పడ్డారు – హైకూ కవితల సంపుటాలు కొన్నింటికి ముందు మాటలు రాసి యీ కవితావికాసానికి ఆయన ఎంతో తోడ్పడ్డారు.

జీవితోత్సవంలో ఎగరేసిన జెండా హైకూ అంటారు


............. O .............

*సౌందర్యోపాసకులకూ ప్రకృతిని ఆరాధించేవారికి ఇస్మాయిల్ కవిత్వం మరపురాని మధురానుభూతులను మిగులుస్తుంది. కాని, సమాజంలో మార్పుకోరేవారికి ముఖ్యంగా పేద ధనిక వర్గాల మధ్య వ్యత్యాసం తగ్గి సమసమాజం ఏర్పడాలని కోరుకునేవారికి ఇస్మాయిల్ కవితలు సోమరిపోతుల మధురోహల్లా అనిపిస్తాయి.*

............. O .............





Untitled-2 96 6/11/2002, 3:51 PM



# అమృతం పంచిన కవి ఇస్మాయిల్

**యాకూబ్**

తెలుగు కవిత్వపు ఆకుపచ్చని 'చెట్టు' కల కరిగిపోయింది. ప్రకృతి లిపి చెరిగిపోయింది. కవిత్వంలో కరుణ ముఖ్యం అని తన కవిత్వాన్ని ప్రయోగశరణంగా చూపిన కవి ఇస్మాయిల్ మనకికలేరు. తెల్లారితే రంజాన్. ఆ ముందు రోజే ఆకాశం చెట్టు మీద విశ్రమించడానికి ఆయన పయనమై వెళ్ళిపోయారు.

ఇస్మాయిల్ కవిగా అవతారమెత్తాక తనకంటూ ఒక ప్రత్యేక మార్గమని తన కవిత్వం ద్వారా నిరూపించారు. "మా గురుదేవులు కృష్ణశాస్త్రి లాగే నేనూ మానవతా వాదినని' ఖచ్చితంగా చాటుకున్నారు. హైకూ ప్రక్రియని ఆంధ్రదేశంలో నాటుకునేట్లు చేసి వాటిలోని నిగూఢ మర్మాల్ని వెలికి తీసి అందించారు. 'చెట్టు నా ఆదర్శం' (1972), 'మృత్యువృక్షం' (1976), 'చిలకలు వాలిన చెట్టు' (1980), 'రాత్రి వచ్చిన రహస్యపు వాన' (1987), 'బాల్చీలో చంద్రోదయం' (1996), 'ఇస్మాయిల్ అనుసృష్టి' రెండో ప్రతిపాదన (1997), కప్పల నిశ్శబ్దం (హైకూలు) ఇలా ఆయన సృజన ప్రేమ, కరుణా వంటి అనుభూతుల కవిత్వం తెలుగు సాహిత్యంలో ఒక బలమైన పాయగా సాగింది.

ఇస్మాయిల్ విమర్శకుడిగా చేసిన ప్రతిపాదనలు 'కవిత్వంలో నిశ్శబ్దం', 'కరుణ ముఖ్యం' వ్యాస సంకలనాల్లో దర్శనమిస్తాయి. కవిత్వం గురించి తన అభిప్రాయాలను విస్తారంగా వీటిలో చర్చించారు. ఇవి కాక ఇంకా సంకలనం రూపంలో రాని వ్యాసాలు ఎన్నో. ఇవన్నీ ఆయనలోని తాత్విక విమర్శకుడిని మనకు పరిచయం చేస్తాయి. కమ్యూనిస్టుల చిత్తశుద్ధిని ఆయన శంకించి, అవకాశమున్నప్పుడల్లా ఎత్తి పొడిచాడు. ఇస్మాయిల్ కవిత్వ భాష ప్రత్యేకం. ఆయన మాటల్లో పొదుపరి. దీర్ఘ వాక్యాలు, క్లిష్టపదాలు ఉండవు. నుడికారం ఆయన కవిత్వంలో వెలుగుతూ ఉంటుంది. 'భాషను శుభ్రపరచడం' అనే ఆయన మాట, ఆయన భాషా వాడుకను చూస్తే ఇట్టే అర్థమవుతుంది. కవిత్వాన్ని గురించిన ఆయన అభిప్రాయాలు భిన్నమైనవి. "మానవ అనుభవంలోని ఏకసూత్రతని ఆవిష్కరించడం ద్వారా ప్రపంచాన్ని అర్థం చేసుకోవడానికి ప్రయత్నించే మానవ వ్యవసాయాల్లో కవిత్వం ఒకటి" అంటారు. ఈ దృక్పథంతోనే ఆయన కవిత్వ రచన చేశారు. మానవ అనుభవాన్ని చిన్నచిన్న కవితలుగా తనవైన ప్రత్యేక పదచిత్రాలతో నిర్మించారు. అందువల్ల ఇస్మాయిల్ విస్పష్టంగానే ఒక స్పష్టమైన మార్గంలో సాగిపోయారు. ఆ సాగిన బాటలో ఆయన శిష్యులుగా ఎంతో మంది ప్రయాణమయ్యారు. ఖండాంతరాల్లోనూ ఆయనకంటూ అభిమానులున్నారంటే, ఆయన మార్గానుయాయులు ఉన్నారంటే, ఆయన ఎన్నుకున్న కవిత్వ పద్ధతి విజయంవల్లనే అది సాధ్యమైందని చెప్పుకోవాల్సి ఉంటుంది.

కవిత్వానికి శబ్దమెంత ముఖ్యమో, నిశ్శబ్దం కూడా అంతే ముఖ్యమని, శబ్దాలు వెల్లడించలేని అనుభూతులను పదచిత్రాలు వెల్లడిస్తాయని ఇస్మాయిల్ భావిస్తారు. "మాటల కందని సంక్లిష్టమైన అనుభవాలతో జటిలమైన ఆధునిక ప్రపంచం ఈ పదచిత్రాల ద్వారా మన అనుభూతి ఆవరణలోనికి ప్రవేశించగలుగుతుంది" – అని 'కవిత్వంలో నిశ్శబ్దం' వ్యాస సంకలనంలో ఇస్మాయిల్ ప్రతిపాదించారు. పద చిత్రం విశాలమైన జీవితాన్ని కవిత్వంలోకి ఆహ్వానిస్తాయని తద్వారా అనుభూతిగా అందుతుందని ఆయన స్పష్టంగానే తన కవిత్వం ద్వారా నిరూపించగలిగారు.

తన కవితా సంపుటాలకు ఆయన ఇస్మాయిల్. జపాన్ హైకూకు గల 17 మాత్రల నియమం, తెలుగు హైకూకు అక్కరలేదంటారీయన. ఏమంటే జపాన్ భాషలో ఏకాక్షర పదాలెక్కువ. ఆ నియమాల్ని అలాగే పాటించాలనుకోవటం తెలివి తక్కువ అని యీయన తలుస్తారు.

ఇస్మాయిల్ హైకూలు రాజస్థానీ మీనియేచర్ పెయింటింగ్స్ లాగ హృద్యంగా ఉంటాయి. ప్రపంచపు అందాలను సూక్ష్మరూపంలో చూపుతాయి. పిల్లలు, కాకులు, పిచ్చుకలు, పిల్లులు, గాడిదలు – అవును గాడిదలు కూడా – ఇంకా నక్షత్రాలు, వర్షాలు మరి యింకా ప్రయాణాలు ఆయనకు చాలా ఇష్టమైనది.

**పసుపురంగు దుస్తుల్లో**
**సైకిళ్లు తొక్కుతూ ముగ్గురమ్మాయిలు।**
**బజారంతా చేమంతి తోట.**

**ఇద్దరు చంద్రులతో**
**ఇంటికి తిరిగొచ్చానివాళ సాయంత్రం।**
**ఆకాశంలో ఒకడు కాలవలో ఒకడు.**

**చీకటి స్టేషన్లో రైలాగింది**
**రైలు వెళ్ళాక మళ్ళీ చీకటి**
**స్టేషను పేరు తెలీదు**

**పిల్లి నా పక్క మీద**
**గాఢనిద్రపోతోంది**
**దీన్నెలా లేపను।**

**లక్షనక్షత్రాలతో**
**గ్రీష్మనిశీథాలు**
**నాపై ప్రవహించిపోనీ**

**ఆరుసార్లు గెంతి**
**అరుగెక్కింది కప్ప**
**అక్కడేమీ లేదు**

వివిధ సాహితీ ప్రక్రియలలో మేలి రచనలు చేసిన విశ్వనాథ వారు "చూడబోతే నేను నాటక కవినల్లే వుంది" అన్నారొక సందర్భంలో. వచన కవిత్వపద్ధతిలో పెక్కు ఉత్తమ కవితలు రచించిన ఇస్మాయిల్ స్వభావతః హైకూ కవి అనే అన్పిస్తారు. ప్రకృత్యుపాసనా, జీవన వేదాంతమూ ఇస్మాయిల్‌ను హైకూ కవిగా తోపింపజేస్తాయి.

ఇస్మాయిల్ స్వభావంలోని ఓరిమి, గాంభీర్యం, ఊహలలో ఋజుత్వం, మనిషిని ప్రేమించే మంచితనం ఆయనను సహృదయులకు సన్నిహితం చేశాయి.

ఇస్మాయిల్‌కూ ఆయన కవితకూ త్రీ ఛీర్స్!

**(25.5.2002 ఇస్మాయిల్ అభినందన సంచిక నుంచి పునర్ముద్రణ)**



Untitled-2 97 6/11/2002, 3:51 PM

# డైరీ

## స్పందన అష్టమ వార్షికోత్సవం

F ఒరిస్సాలోని రాయగడ్ పట్టణంలో స్పందన సాహితీ సాంస్కృతిక సమాఖ్య ఇటీవల అష్టమ వార్షికోత్సవం జరుపుకుంది. తెలుగు సంస్కృతి, సాంప్రదాయాలను పరిరక్షించడంతోపాటు వివిధ కళల్లో కళాకారులను, విద్యార్థులను, చిత్రకారులను, రచయితలను, మహిళలను ప్రోత్సహిస్తూ స్పందన గత ఎనిమిదేళ్ళుగా ఎన్నో కార్యక్రమాలను నిర్వహించింది. స్పందన ఆధ్వర్యంలో నాట్య పాఠశాల, సంగీత పాఠశాల, వేద పాఠశాల, బాలవినోదం వంటివి నిర్వహిస్తూ రానున్న జనవరి నెల నుంచి చిత్రలేఖనం పాఠశాల, గ్రంథాలయం ప్రారంభిస్తున్నట్లు కార్యదర్శి తెలిపారు. స్పందన సాంస్కృతిక విభాగం ఆధ్వర్యంలో పలు నాటక, నాటకాలు ప్రదర్శించినట్లు నివేదిక తెలియజేసింది.

ఎనిమిదవ వార్షికోత్సవ సభకి ముఖ్యఅతిథిగా రాయగడ్ పురపాలక సంఘం చైర్ పర్సన్ శ్రీమతి ఎన్. రమాదేవి, ముఖ్యవక్తగా ప్రముఖ నవలా రచయిత శ్రీ ముద్దం శెట్టి హనుమంతరావు (విశాఖపట్నం) మరో వక్తగా ప్రముఖ రచయిత శ్రీ అడపా రామకృష్ణులు విచ్చేయగా ఉదయం జరిగిన సాహితీ సదస్సులో రచయితలు తమ స్వీయ కథాపఠనం చేశారు. గుండాన జోగారావు, ఆనందరావు పట్నాయక్, మాధవీ సనారా (ఖరగ్‌పూర్), బళ్ళమూడి నాగరాజు, కాకర్ల హనుమంతరావు, కాకర్ల లక్ష్మి, బళ్ళమూడి శేషసాయి వంటి వర్ధమాన రచయిత(త్రు)లు స్వీయ కథాపఠనం చేయగా కథాపఠనం చేసిన వారందరికీ ముద్దంశెట్టి హనుమంతరావు 'వైకుంఠపాళి' నవలను సుమారు పాతికమందికి అందజేశారు. 'స్పందన' సభలో కథ పుట్టుపూర్వోత్తరాలను గురించి హనుమంతరావు ఉపన్యసించగా నేటి కథ తీరుతెన్నులను అడపా రామకృష్ణ వివరించారు.



8వ వార్షికోత్సవ సభలో ప్రసంగిస్తున్న ప్రముఖ నవలా రచయిత ముద్దంశెట్టి హనుమంతరావు, ఆనందరావు కుముందాన్, ఎన్. రమాగౌరి, భళ్ళమూడి నాగరాజు

సాయంకాలం సభకి సంస్థ అధ్యక్షులు ఆనందరావు కుముందాన్ అధ్యక్షత వహించగా ముఖ్యఅతిథిగా విచ్చేసిన శ్రీమతి ఎన్. రమాగౌరి స్పందన కార్యక్రమాలను కొనియాడారు. సాంస్కృతిక కార్యక్రమాలు జరిగాయి.

*–బళ్ళమూడి నాగరాజు*

→

ఎంచుకున్న పేర్లు, ఆయన భిన్నత్వాన్ని సూచిస్తాయి. జీవితంలోని తాత్వికతనీ ఆయన నేర్పుగా కవిత్వంలో చూపినంతగా మరేకవి చూపలేదు. 'చెట్టు' ప్రతీకను, చెట్టు సంబంధమైన అనేక అంశాలను ప్రతీకలుగా విశేషంగా తన కవిత్వంలో వాడిన కవి కూడా మరొకరు లేరు. 1960ల తర్వాత ఇస్మాయిల్ ముద్ర తెలుగు కవిత్వంపై ఇలా అనేక రూపాల్లో కనబడుతుంది. తొలి సంజ నారింజ, మబ్బు నీడల్తో పిటపిటలాడే కోనసీమ, ఆనందపు తెరచాప లెత్తే కాంతి పడవలు, భూమి బుగ్గపై నల్లటి నవ్వు సొట్ట, చెట్టు గుబురులో చిలకముక్కు, వాన గుర్రం వంటి ప్రతీకలు ఆయన కవిత్వాన్ని తేజోవంతం చేస్తుంటాయి. అసలు ఇస్మాయిల్ కవిత్వ నిర్మాణ వ్యూహమే ఆశ్చర్యం కలిగిస్తూ ఉంటుంది. ఆయన ఎత్తుగడ కవిత నడిపే తీరు, అలవోకగా కవిత అల్లే పద్ధతి ఎప్పటికీ కవిత్వ విద్యార్థులకు పాఠాలుగా ఉపయోగపడ్తాయి.

ఇస్మాయిల్ హైకూ కవిత్వతత్వాన్ని తెలుగులో అనుకూలంగా మార్చుకోవడంలో సఫలమయ్యారు. ఆయన కవిత్వానికి అతి దగ్గరి పోలికలు ఉన్నట్లుగా ఉండే హైకూ ప్రక్రియని ఆయన ప్రేమించారు. హైకూ ఆత్మని ఇస్మాయిల్ పట్టుకున్నారు. 'కప్పల నిశ్శబ్దం' ఇది మనకు అర్థమవుతుంది. జపాన్ భాష స్వభావం, ధ్వని ప్రసరణశక్తి వంటి అంశాలు తెలుగులో ఎంత వరకు అనుకరించవచ్చో తెలియదుగాని ఇస్మాయిల్ మాత్రం తెలుగులో హైకూ ప్రక్రియకు ఒక గౌరవం తెచ్చారు. ఇలా ప్రధాన స్రవంతి కవిత్వానికి భిన్నంగా ఇస్మాయిల్ కవిత్వ ప్రయోజనంపట్ల ఏర్పరచుకున్న అభిప్రాయాలు భిన్నమైనవి ఆయన మొత్తం సాహిత్య సృజనలో దర్శనమిస్తాయి. ఆయనదొక ప్రత్యేకమైన మార్గం. దానికి ఒక సంపూర్ణమూ, విశిష్టమూ, భిన్నమూ ఐన ప్రాపంచిక దృక్పథం వుంది. రచనా విధానము వుంది "జీవిత మహోత్సవంలోని అమృతాన్ని ఆవిష్కరించడమే కవిత్వం చేసే పని. ఈ విధంగా మన చేతనని సుసంపన్నం చేస్తుంది కవిత్వం" ఇది ఇస్మాయిల్ కవిత్వంపట్ల ఉండే అవగాహన అసలు జీవితాన్ని మహోత్సవంగా భావించడం అనే భావన ఎంతో అద్భుతమైంది. ఠాగూర్‌లాగా తెలుగులో ఇస్మాయిల్ కవిత్వాన్ని జీవిత మహోత్సవం దర్శించడానికి ఒక వాహికగా ఎంచుకొని కవిత్వ అమృతఫలాల్ని అందించారు.

ఆయన రాసే ఉత్తరాల గురించి ప్రస్తావించాలి. ఎర్రని, ఆకుపచ్చని సిరాతో ఆయన రాసే కార్డు ముక్కలు ఆయన అభిమానుల్ని, ఆత్మీయుల్ని పరవశింప చేస్తుంటాయి. ఎంతో క్లుప్తంగా, గాఢంగా, నుడికారంతో రంగరించి ఆయన రాసే ఆ నాలుగు మాటలు ఎన్నో విషయాల్ని బట్వాడా చేస్తుంటాయి. అలా ఆయన నాకు రాసిన కార్డు (26.10.03) ఆయన ఆరోగ్యం గురించి ఆందోళన పడ్తున్నట్టు అనిపించింది. 'నా ఆరోగ్యం కూడా నన్ను మర్చిపోయింది. చాలా జబ్బుపడ్డాను'. ఉత్తరంలోని ఈ రెండు వాక్యాలూ ఆయన ఆరోగ్యం గురించి దిగులు పడ్తున్నట్లు తెలిపినా, తీరిక చేసుకొని వెళ్ళి చూసొద్దామని అనుకుంటూ ఉండగానే ఆయన చివరి రంజాన్‌ను కూడా జరుపుకోకుండా వెళ్ళిపోయారు.

ఆయనను ఎలా కలుసుకోవడం! ఇలా కవిత్వాన్ని ముందేసుకుని మళ్ళీమళ్ళీ ఆయనను చదువుకోవడం తప్ప. ఇస్మాయిల్ పరిపూర్ణ మానవుడు. విశిష్టమైన కవి. ఆయన కవిత్వంలో ఆ పరిపూర్ణత్వం దర్శనమిస్తుంది. ఆ దర్శనమే ఆయన తెలుగు వాళ్ళకు పంచిపెట్టిన అమృతం.

V



Untitled-2 98 6/11/2002, 3:51 PM

# డైరీ



## అడుగుజాడ గురజాడది...

F విశాఖ పట్టణం ద్వారకా నగర్ జంక్షన్‌లోని గురజాడ అప్పారావు విగ్రహం ప్రగతిశీల సాహిత్య శక్తులకు ఒక స్ఫూర్తి. సాహిత్య చరిత్రకు సంబంధించి అరుదైన కలయికలతో అనేక ప్రసిద్ధచిత్రాలు అక్కడే తీశారు. ఈ ఏడాది గురజాడ జయంతి సందర్భంగా ఆ సంప్రదాయం పునరావృతమైంది. సాహితీ స్రవంతి, ప్రజానాట్యమండలి ఆధ్వర్యంలో సాహిత్య మిత్రులు కళాకారులు సెప్టెంబరు21 ఉదయం దేశమును ప్రేమించుమన్నా అని ఆలపిస్తూ వెళ్ళి మహాకవికి నివాళులర్పించారు. ఎస్.వి.ఎన్.స్వామి, అరుణ్‌జీ తదితరులు మాట్లాడుతూ గురజాడ సందేశం ఎప్పటికి ఆదర్శమని అన్నారు. రమణమూర్తి అధ్యక్షత వహించారు. ఇంకా ఈ కార్యక్రమంలో జి.వరప్రసాద మూర్తి, కె.మోహనరావు, బి.బి.గణేష్,ఎవిరమణారావు తదితరులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమాన్ని మీడియా, సాహితీ మిత్రులు ఎంతగానో అభినందించారు.

F విశాఖపట్టణంలో తొమ్మిదవ బుక్‌ఫెయిర్‌ను ప్రసిద్ధ కథకుడు కాళీపట్నం రామారావు నవంబరు 6న ప్రారంభించారు. నాటి సభకు ఆంధ్ర ప్రదేశ్ బుక్ పబ్లిషర్స్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు సాదినేని శ్రీనివాసరావు అధ్యక్షత వహించగా నగర పోలీసు కమిషనర్ ప్రసాదరావు, ఐఎస్ అధికారి ఎ.విద్యాసాగర్ పాల్గొన్నారు. ఈ పుస్తక ప్రదర్శన పదిరోజుల పాటు జరిగింది.

రెండవ రోజున బుక్‌ఫెయిర్‌లో ప్రజాశక్తి బుక్‌హౌస్ ప్రచురించిన “సునాముది జీవధార” పుస్తకాన్ని ఆచార్య అత్తలూరి నరసింహరావు ఆవిష్కరించారు. మందస జమీందారీ వ్యతిరేక పోరాటాన్ని జన జీవనగాథల నుంచి పరిశోధించి రచించిన ఈ పుస్తకాన్ని ఆయన అభినందించారు. మతం రాజకీయాలు–టీవీ అనే పుస్తకాన్ని బుక్‌హౌస్ సంపాదకులు తెలకపల్లి రవి, ఆదర్శబాల్యం పేరిట మహనీయులు చిన్ననాటి విశేషాలతో కూర్చిన బాల సాహిత్య పుస్తకాన్ని పల్లవీవెంకట నారాయణ ఆవిష్కరించారు. జర్నలిస్టు సత్యాజీ సభాధ్యక్షత వహించారు.

మూడవ రోజున శ్రీశ్రీ సాహిత్యం– సమకాలీనత అనే అంశంపై ఎ.విద్యాసాగర్ అధ్యక్షతన సెమినార్ జరిగింది. చలసాని ప్రసాద్, తెలకపల్లి రవి ప్రసంగించారు. శ్రీశ్రీ సాహిత్యం దోపిడీకి పీడనకు వ్యతిరేకంగా పోరాడే వారికి నిత్యస్ఫూర్తిగానిలిచే వుంటుందని వక్తలు అభిప్రాయపడ్డారు. అదే సమయంలో నేపథ్యాన్ని బట్టి శ్రీశ్రీ లో వ్యక్తమయ్యే కొన్ని పరిమితులను ఎలా చూడాలో కూడా వారు చెప్పారు.

F అనంతపురం జిల్లా రచయితల సంఘం ప్రత్యేకంగా కరువుపై ప్రచురించిన కవితా సంకలనం “వొరుపు” ను నవంబరు 23 వ తేదీన హైదరాబాదు సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ప్రస్థానం సంపాదకులు తెలకపల్లి రవి ఆవిష్కరించారు. కరువు సమస్యను ప్రత్యేకంగా తీసుకుని అర్థవంతమైన సంకలనాన్ని తీసుకొచ్చినందుకు అభినందించారు. నాళేశ్వరం శంకరం సంకలనాన్ని సమీక్షిస్తూ కరువు దృశ్యాన్ని కళ్లకు కట్టేలా కవితలు రాశారని సోదాహరణంగా వివరించారు. కవి కె.శివారెడ్డి కూడా ప్రసంగించారు. సభకు సింగమనేని నారాయణ అధ్యక్షత వహిస్తూ అనంతపురంలో కరువు దుర్భర దృశ్యాన్ని, దాని భౌగోళిక, రాజకీయ నేపథ్యాన్ని విశ్లేషించారు. రచయిత శాంతినారాయణ స్వాగతం పలకగా, జి.ఈశ్వరరెడ్డి వందన సమర్పణ చేశారు.

F అలిపిరి ఘటన అనంతరం రాష్ట్రంలో పెరిగిన నిర్బంధ విధానాన్ని తక్షణం నిలిపివేయాలని కోరుతూ విప్లవ రచయితల సంఘం ఆధ్వర్యాన నవంబరు ఆరవ తేదీన హైదరాబాదు ప్రెస్‌క్లబ్‌లో సభ జరిగింది. సంఘ అధ్యక్షుడు సివిఎస్‌ఆర్ ప్రసాద్ అధ్యక్షత వహించారు. కె.బాలగోపాల్, కాత్యాయని, నందిని సిద్ధారెడ్డి,కె.శివారెడ్డి తదితరులు ప్రసంగించారు. చంద్రబాబుపై దాడిలో ఎపిసిఎల్‌సి విరసం కలసి కుట్ర పన్నాయనే ఆరోపణను ఖండించారు. ఈ సభకు వెళ్లి వస్తుండగానే ఎపిసిఎల్‌సి అధ్యక్షుడు డాక్టర్ జి. లక్ష్మణ్‌ను కిడ్నాప్ చేయడం తీవ్ర సంచలనం కలిగించింది. ఆయన ఆ మరుసటి రోజున తిరిగి వచ్చారు.

F తెలంగాణా రచయితల వేదిక ఆధ్వర్యంలో స్థానిక మునిపంతులు ప్రాంగణంలో నవంబరులో ఆదిలాబాద్ జిల్లా మహాసభలు జరిగాయి. ఇందులో భాగంగా జయధీర్ తిరుమలరావు“పొది”, గీతాంజలి “బచ్చేదాని”, అన్నవరం దేవేందర్ ‘నడక’ ఇంకా దాదాపు పన్నెండు పుస్తకావిష్కరణలు జరిగాయి. దేవేందర్ ‘నడక’ను నలిమెల భాస్కర్ ఆవిష్కరించారు. జూకంటి జగన్నాథం సమీక్షిస్తూ కవిగా దేవేందర్ పరిణతి చెందారని తెలిపారు. మహిళా సభలో తుర్లపాటి లక్ష్మి, గీతాంజలి, ముదిగంటి సుజాతరెడ్డి ప్రసంగాలు ఆకట్టుకున్నాయి. అసోసియేట్ ప్రొఫెసర్ వనజా జనార్దన్ ప్రసంగం ఆలోచనాత్మకంగా ఉంది. యాది సదాశివ పేర వారాల ఆనంద్ దర్శకత్వంలో వెలువడ్డ డాక్యుమెంటరీ ఫిలిం అలరించింది. గూడ అంజయ్య, అందెశ్రీ, దేశపతి శ్రీనివాస్ మొదలగు వారి పాటలు శ్రోతలను ముగ్ధుల్ని చేశాయి. వేదిక అధ్యక్ష, కార్యదర్శులు, సిద్ధారెడ్డి, సుంకోజు మరియు వరంగల్, కరీంనగర్, నిజామాబాద్, మెదక్, హైదరాబాద్, నల్గొండలకు చెందిన ప్రముఖ కవి, రచయితలతో సభలు దిగ్విజయంగా ముగిశాయి.

### పురస్కారాలు

F యాకూబ్ సరిహద్దురేఖ కవితా సంపుటికి నూతలపాటి గంగాధరం స్మారక అవార్డును ఇటీవల తిరుపతిలో అందజేశారు. అదే విధంగా కె.శివారెడ్డికి తెనాలిలో బొల్లిముంత శివరామకృష్ణ స్మారక పురస్కారం ఇచ్చారు. ఎస్.వి.సత్యనారాయణకు అభ్యుదయ రచయితలసంఘం, విశాలాంధ్ర ప్రచురణాలయం సంయుక్త ఆధ్వర్యంలో తుమ్మల స్మారక అవార్డు బహూకరణ ఈ నెల 7న నల్గొండ జిల్లా సూర్యాపేటలో జరిగింది.

V



Untitled-2 99 6/11/2002, 3:51 PM

# చెక్‌పోస్ట్

## ఈ రచనలు ఎవరివి? ఎందులోవి?

ఇదో తమాషా అయిన అదే సమయంలో ఆసక్తికరమైన పరీక్ష లాటిది. ఇది మన అవగాహనను మనం తెలుసు కోవడానికి మాత్రమే కాక మనకు తెలియని కోణాలు తెలుసుకోవడానికి కూడా ఉపయోగ పడుతుంది.

ప్రస్థానం అన్ని తరగతులు సాహిత్య మిత్రుల కోసం ఉద్దేశించింది కనకఈ విషయాలు ఎవరికి తెలియవు అని పెదాలు చప్పరించకండి. ముందుగా మీరే చెప్పేసి ఔత్సాహికులకు పని లేకుండా చేయకండి. వాళ్లను తెలుసుకోనివ్వండి.చదువుకోనివ్వండి.

ఈ ప్రశ్నలకు జవాబులు తెలిసినా తెలియక పోయినా ఆ సంగతి ప్రస్థానంకు రాయండి. వాటిని ప్రచురిస్తాము. అదే సమయంలో ఇందులో ఇచ్చే అంశాలపై మీ అభిప్రాయాలు తెలియజేయండి. అలాగే దీనికి అంశాలను కూడా పంపవచ్చు. ఆ విధంగా సాహితీ మిత్రుల భాగస్వామ్యంతో ఈ శీర్షిక కొనసాగుతుంది. చర్చగానూ వుంటుంది. స్పందించాల్సిన వారు మీరే!

**'స్త్రీల సౌందర్యమును**
**చిత్రగతి భావించి**
**కావ్యమాలిక లల్లి**
**కరిగి పోయెదవులే**
**...**
**కోయిలల కూకూల**
**కులుకుచూ మురియుచూ**
**ఆకులో ఆకువై ఆనంద పడనేల...**
**...**
**భావ కవితలు మాని**
**భారతీయ ప్రజకు**
**స్వాతంత్ర్య రణభూమి**
**సారధి కావోయ్**

## ఎంత ద్వ్యర్థం, సృష్టి...

“సృష్టి ఒక గొప్ప శ్లేషకావ్యం” అన్నాడు.

సముద్రతీరాన కెరటాలతో కాళ్ళు తడియనిస్తూ నడుస్తున్నారు వాళ్ళిద్దరూ. ఒక బ్రాహ్మణాధముడు, ఇంకొకడు శూద్రోత్తముడూ. ఇద్దరిలో ఎవడో ఒకడు ప్రసంగవశాత్తూ అన్న పై వాక్యం నాకు జ్ఞాపకం వచ్చి ఇక్కడ రికార్డు చేశాను.

ఇద్దరిలో ఎవరిదో ఈ అమూల్య ప్రకటన! అసలా ఇద్దరిలో ఎవడు బ్రాహ్మణుడో, ఎవడు శూద్రుడో? గుణిత్వమే అనుమానాస్పద మైపోయిన ఈ సందర్భంలో గుణాలా నిలుస్తాయి? వారిలో ఎవడు ఉత్తముడో, ఎవడు అధముడో? ఇంతకీ ఆ యిద్దరిలో ఒకడామాట అన్నాడో లేక నేనే అని వాళ్ళన్నా రనుకున్నానో? కాకపోతే నేనే సముద్ర తీరాన కెరాటాలతో తడుపుకుంటూ నడుస్తున్నపుడు నాకు కనబడ్డ నీడ నా కన్నా ముందుగా నడుస్తూ ఈ కాస్తమాట కాలు జారిందో?

నేను చేసేననుకుంటూన్న ఈ ప్రకటనను ఉపసంహరించుకోవడానికి కూడా నాకు హక్కు లేకుండా చేస్తూన్న దుర్బలమైన భాషని పట్టుకొని సృష్టి రహస్యాపరాధ పరిశోధక నవలారచనకి ఉపక్రమించడంవల్ల ఎంత అనర్థం!

వాస్తవత్వంలో ఉన్న అనంతత్వాన్ని అన్వేషించడానికి ముందు ఒక క్షణం కళ్ళు మూసుకోవడం మంచిది. ఎదురుగా మనకి కనిపించే వస్తువు ఒకటి ఉండగా, కళ్ళు మూసుకున్నప్పుడు మన మనస్సులో నిద్రించే అదే వస్తువు శబ్దరూపంలో సాక్షాత్కరిస్తుంది. శబ్దరూపమయిన కాలాన్ని అక్షరాలలోకి అనువదించి స్థలంలో బంధిస్తున్నాము. అయితే కాలానికి వెలుపల స్థలంగాని స్థలానికి వెలుపల కాలం కాని లేవు.

వాస్తవికత ఒక ప్రతీక, చిహ్నం. వస్తువుల వాస్తవికత ఒక చిహ్నమయితే ఆ చిహ్నానికి చిహ్నం భాష. అందుచేత భాష విధిగా రెండర్థాలను మోసుకు తిరుగుతూ ఉంటుంది. రెండు కళ్ళలోంచి మనస్సులోకి వెళ్ళేది ఒకే వస్తువయినప్పటికీ అది అనుక్షణం రెండర్థాలతో బైటికి వచ్చేస్తూ ఉంటుంది. ఇప్పుడు తెలిసిందా ఎందుకంటున్నానో ప్రతిదానికీ రెండర్థాలుంటాయని?

(రెండే అని తాత్కాలికంగా అంటున్న మాట. అనేకం అని త్వరలోనే రుజువు చేస్తాను)

మొదటి అర్థం స్వయంగా దానికున్నది. రెండవది సరిగ్గా దానికి వ్యతిరేకమయిన అర్థం. ఔను అనే మాటకి ఔను అనే మొదటి అర్థంతో బాటు కాదు అనే రెండో అర్థం కూడా ఉంది. ఈ యోగపద్యం, ద్వైధీభావం సృష్టి లక్షణం. అది యెట్లన్నన్.

ఆస్తి ఎప్పుడూ నాస్తికి నేస్తం. వీటిది అవినాభావ సంబంధం. ద్వంద్వాలు అంటారే అని ఒక మాటకే మనం చెప్పుకునే రెండర్థాలు.

ఎప్పుడయితే మనం ఎంతో చిత్తశుద్ధితో నిజమే చెప్పాలని నిష్ఠురమైన సంకల్పంతో ప్రసంగిస్తామో అప్పుడే మన ప్రాణస్నేహితుడు మనం చెబుతున్నదంతా అబద్ధమే అని ఆగ్రహిస్తాడు. నవీన ప్రపంచాన్ని విస్పష్ట రూపంలో చూస్తున్నానని కవి అంటే ఇది పురా ప్రపంచమే అని నిర్ధారణగా చెబుతున్న వాళ్ళు కూడా ఉన్నారు.

ఇంతెందుకూ? “వస్తాను” అని అంటూ వెళ్ళిపోతాము! కళ్ళు లేని వాడితో కూడా “చూశారూ” అని అంటాము.

నిజం చెప్పడంవల్ల లాభం లేదంటే అబద్ధం చెప్పడం వల్ల నష్టం వుందని అర్థం కాదు. నిజానికి అబద్ధం, లాభానికి నష్టం, చీకటికి వెలుతురూ, చావుకి బ్రతుకూ కేవలం వ్యతిరేకార్థకాలు కావు. ఈ ద్వంద్వాలకి మధ్య అనేకమయిన అర్థభేదాలతో అనేక భావాలుంటాయి. ఉదాహరణ : చీకటి, చీకటి కాని దానికి వ్యతిరేకం. చీకటి కానిది వెలుతురు కాదు. మరేదయినా కావచ్చును. అలా కాదగ్గవి అనేకం. అలాగే వెలుతురు, వెలుతురు కాని దానికి విరుద్ధం. కాని అది చీకటి కాదు. ఆ కానివి ఇంకో అనంత సంఖ్య. ఎటొచ్చీ మొదటి అనంతంలోనే రెండో అనంతం గర్భితమయి ఉంటుంది. అందుకే అన్నాను ఎంత ద్వ్యర్థం సృష్టి! అని.

V



Untitled-2 100 6/11/2002, 3:51 PM

# పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం

## లలిత కళాక్షేత్రం, పబ్లిక్ గార్డెన్స్, హైదరాబాద్ - 500 004

**తెలుగు భాషా సాహిత్యాలు, సంస్కృతి, లలిత కళా రంగాల్లో సమగ్ర వికాసం లక్ష్యంగా 1985 డిసెంబర్ 2న తెలుగు విశ్వవిద్యాలయం ఆవిర్భవించింది. బోధన, పరిశోధన, గ్రంథ ప్రచురణ, విస్తరణ సేవలను ప్రధాన కార్యక్షేత్రాలుగా నిర్వచించుకొని గత 17 సంవత్సరాలుగా బహుముఖీనంగా కార్యక్రమాలను నిర్వహిస్తున్నది.**

### వివిధ పథకాలు, కార్యక్రమాలు

H తెలుగు భాష, సాహిత్యం, సంస్కృతి రంగాల్లో రచయితలు, విమర్శకులు, తమ గ్రంథాలను ప్రచురించుకునేందుకు ఆర్థిక సహాయం.

H సాహిత్యంలోని వివిధ ప్రక్రియల్లో ఏటా ఉత్తమ గ్రంథాలకు పురస్కారాలు

H వివిధ రంగాల్లో విశిష్ట సేవలందించిన ప్రముఖులకు ప్రతిభా పురస్కారాలు

H తెలుగు భాషా సాహిత్యాలు, సంస్కృతి, లలిత కళారంగాల్లో విశేష సేవలందించిన ప్రముఖులకు రు. 50,000/-లతో విశిష్ట పురస్కారం

H సాహిత్య, సాంస్కృతిక కార్యక్రమాల నిర్వహణకు ఆర్థిక సహాయం

H వివిధ విషయాలపై తెలుగులో విజ్ఞాన సర్వస్వాల సంకలనం.

H రాష్ట్రేతర, విదేశాంధ్రుల మాతృభాషా సంస్కృతుల పరిరక్షణకు అనేక పథకాలు.

H ప్రపంచ తెలుగు మహాసభలు, అఖిల భారత తెలుగు మహాసభల నిర్వహణ.

H డా. బి.ఆర్. అంబేద్కర్ ఆంగ్ల సాహిత్యాన్ని తెలుగులో అనువదించి ప్రచురించే పథకం మొదలైనవి.

### గ్రంథ ప్రచురణ

తెలుగు భాషా సాహిత్యం, సంస్కృతి, చరిత్ర, జానపద విజ్ఞానం మొదలైన అంశాల్లో సుమారు 260 ఆవశ్య పఠనీయ గ్రంథాలను విశ్వవిద్యాలయం ప్రచురించింది. వెయ్యేళ్ళ తెలుగు సాహిత్యంలో ప్రముఖంగా పేర్కొనదగిన ఆంధ్ర మహాభారత, భాగవత, రామాయణాలతోపాటు కావ్యాలు, ప్రబంధాలు. జీవిత చరిత్రలు, నిఘంటువులు. విమర్శ గ్రంథాలు, పదకోశాల, సంగీత, నృత్య నాటక, జానపద కళా సాహిత్య గ్రంథాలు, ప్రత్యేక సంచికలను విశ్వవిద్యాలయం ప్రచురించింది. వ్యాపార దృష్టితో కాకుండా తక్కువ ఖర్చుతో సాధారణ పాఠకులు, పరిశోధకులు. భాషా సాహిత్య అధ్యయనపరులు, విద్యార్థులు, జిజ్ఞాసువులకు గ్రంథ సంచయాన్ని తెలుగు విశ్వవిద్యాలయం సమకూరుస్తున్నది.

**ఆచార్య టి. గౌరీశంకర్**
రిజిస్ట్రార్ I/C